స్వేచ్ఛా కవిత్వం

ఐదో సంపుటం (2017 - 2019)

మాదిరాజు రంగారావు

2026

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

స్వేచ్ఛా కవిత్వం

ఐదో సంపుటం

రచనా కాలం 2017 - 2019

మాదిరాజు రంగారావు

నాన్నగారి జ్ఞాపకార్థం

మా నాన్నగారు, ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు నివాళిగా, మాదిరాజు రంగారావు గారి స్వేచ్ఛా కవిత్వం ఐదో సంపుటం **(Volume V)** పునఃముద్రణ చేసి సాహితీ సహృదయులకు, శ్రేయోభిలాషులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.

మాదిరాజు సంతోష్ కుమార్

దేవులపల్లి హరిత

మాదిరాజు చరిత

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SWECCHAA KAVITHVAMU
Volume V (2017 - 2019)

IDI JEEVITHAM

I to XXII Parts

by
Prof. Madiraju Ranga Rao

© **Dr. M. Santhosh Kumar**

Edited by Madiraju Santhosh Kumar
Devulapally Haritha
Madiraju Charitha

Frist Edition 2019
Second Edition 2026

ISBN : 978-93-5655-296-8

Price : 1000/-

For Copies :
Dr. Madiraju Santhosh Kumar
98499 79899

Printed at :
Anupama Printers
Shantinagar, Hyderabad - 28
Phone : 040-23391364
E-mail : anupamaprinters1978@gmail.com

స్వేచ్ఛా కవిత్వం

ఐదో సంపుటం

రచనా కాలం 2017 - 2019

విషయ సూచిక

ఇది జీవితం

1.	ప్రశ్నలతో ఇప్పటికీ (76)	1
2.	బ్రతుకులో కవితయై (77)	49
3.	గమ్యంపై గురితో (78)	81
4.	అస్మితలు – అస్తితలు (79)	127
5.	వాస్తవ చక్రంపై (80)	155
6.	ఎవరి దారి వారిది (81)	199
7.	అశాంతి పరిచయం (82)	243
8.	కవిత నా ఆత్మ (83)	285
9.	కాలం కప్పులో (84)	329
10.	నిప్పు రెక్కలపై (85)	361
11.	సమాప్తి కాదు (86)	393
12.	కాలానికి కృతజ్ఞతలు (87)	433
13.	సమయ పథం (88)	465
14.	ఇది అందరిదీ (89)	515
15.	సమాంతరం (90)	555
16.	ప్రాణం కన్న మిన్న (91)	589
17.	వర్తమానం ఆనవాలు (92)	633
18.	నీడ నుండి వెలుగులోకి (93)	665
19.	అక్షర ముకురం (94)	697
20.	జీవితం స్వతంత్రం (95)	729
21.	కాలంతో నేను (96)	757
22.	కర్తవ్యంలో కవిత (97)	789

ఆముఖం

ఇది స్వేచ్ఛా కవిత్వంలో ఐదవ సంపుటం. ఈనాడు వస్తున్న కవిత్వంలో వైవిధ్యాన్ని సూచిస్తూంది. ఇది దార్శనికంగా ప్రజాస్వామ్య సామ్యవాద భావనతో కూడింది. ఆవిర్భావంలో మానవ సమాజం వ్యక్తి చేతనల వాస్తవానుభవంతో సంపన్నమయింది. వర్తమాన తలంపై అనేక స్థితిగతుల్ని చిత్రిస్తూంది. సామాజిక రాజకీయ మనస్తత్వ తాత్త్విక స్తంభాలపై నిలిచిన నిర్మాణ రూపాలు గోచరిస్తాయి. గతంలోని విలువల నేపథ్యంలో వర్తమానంలోని అవసరాల చిత్రణంతో భవితమై ఆశారూపంలో వెలుగుతో ప్రత్యేకతను కలిగింది. ఒక ప్రత్యేకత విశ్లేషణకు అందుతుంది.

అభివ్యక్తిలో భావ రూపాలతో ప్రతీకలతో రూపొందింది. భావనలో ప్రవాహకతను గమనించవచ్చు. వాక్య నిర్మాణంలో ప్రత్యేకత దృష్టికి వస్తుంది. మొత్తం మీద మానవీయమైన ఆలోచన కేంద్రంగా ఉంది.

ఇది హేతు దృష్టితో తీర్చబడింది. అనుభవ సూక్ష్మతల్ని అనుభూతి సాంద్రతల్ని పొందింది. ఈ విధంగా సాహిత్య విమర్శలో దీని విశిష్టత వివేచనకు అందుతుంది.

ఈ ఐదవ సంపుటం "ఇది జీవితం" బృహత్కృతి 22 భాగాలుగా వెలువడింది. ఇది సహృదయుల ఆమోదాన్ని పొందుతుందనే ఆశారూపంతో....

– మాదిరాజు రంగారావు

స్వేచ్ఛా కవిత్వం-76

ఇది జీవితం

ప్రశ్నలతో ఇప్పటికీ

మాదిరాజు రంగారావు

2017
రసధుని
సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 76

IDI JEEVITHAM

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2017

Presented

to

my wife

Smt. M. Indira

ఇది జీవితం – పీఠిక

స్వేచ్ఛా కవిత్వ పరంపరలో భాగమైన "ఇది జీవితం" ఇప్పుడున్న సామాజిక సంక్షుబ్ధ స్థితుల పరివర్తన గతుల చిత్రణం. ఒక దుస్థితికి కారణం, పలుకోణాల్లో ఆలోచన చేయవలసి ఉంటుంది. ఇవి ఒక్కొక్క కవిలో ఒకొక్క అంశంపైనో కొన్ని అంశాలపైనో ఫోకస్ చేయడం జరుగుతుంది. ఒకొక్క విధమైన అభివ్యక్తి విధానం ఏర్పడుతుంది. ఇక కవి వ్యక్తిత్వంలోని అభిప్రాయాలు ఆదర్శాలు దృష్టి కోణాలు జీవన సాంస్కృతిక నేపథ్యంతో కూడిన ఆలోచనలు పని చేస్తాయి. ఇవన్నీ ఇన్నిటిలో కొన్ని అయినా కలిసిన సంపుటి ప్రతి కవిని గురించి విశ్లేషణలో విమర్శకుల దృష్టికి వస్తుంది. దీనికొక నియతమైన ఫ్రేమ్ లేదు. అటు సృజన స్వేచ్ఛ ఇటు వ్యక్తి స్వాతంత్ర్యంతోపాటు మనస్తత్వ రూపం Important role play చేస్తుంది.

ఈ భూమికలో ఈ రచన కేవలం వర్తమాన స్థితి రూపం వస్తువుగా కలిసింది. అయితే దీని ఆవిష్కారంలో అనుభూతి కేంద్రంగా భావ రూపాలు (images) ప్రతీకలు (symbols) ప్రమేయమూ లేకపోలేదు. ఇక సామాజిక విషయంలో సామ్యవాద ప్రజాస్వామ్య దార్శనికతను కలిగింది. ఇపుడున్న వాటిలో ఇదే మేలేందిగా ఎక్కువ ప్రయోజనకారిగా. కవి భావన. లౌకికమైన అనుభవంలో దోషాలు దొరలే మాట నిజమే. దీన్ని సరి చేయడం ఒక భౌతిక తలంపైనే కాక మనోరూప తలంపైన కూడా మార్పుకు ప్రయత్నం చేయవలసి ఉంటుంది. ఎన్ని శాసనాలు నియమాలు నిబంధనలు ప్రవేశపెట్టినా చివరి విన్నింగ్ స్ట్రోక్ మనస్తత్వ పరమైందే. స్థితిని చక్క బరచే శక్తి దీనికి ఉంది. ఇది నైతిక రేఖలతో కూడింది. వ్యవహార జగత్తులో దీని ప్రమేయం అనివార్యమైంది.

ఆధునిక మంటే వర్తమానంపై అభిలాష సమాజ పురోగమనం పైఆకాంక్ష మానవతా స్పందనం మానవీయ చింతనతో కూడిందీ, హేతు దృష్టినీ వివేకంతో కూడిన ఆచరణ రూపాన్ని కలిగిందీ, ముందు చూపుతో దార్శనికతను పొందిందీ. అభిప్రాయ భేదాలుండవచ్చు. అన్నిటినీ కలుపుకపోయే ప్రజాస్వామ్య భావన కీలకమైన పాత్రను వహించవలసి ఉంది.

ఇక కవిత్వ విషయానివస్తే సృజన రూపాన్ని నియతం చేసే ఆదేశించే నిర్దేశించే ఆఖరికి సూచించే అధికారం ఎవరికైనా అంతంత మాత్రమే! ఎవరి అభిలాషను బట్టి విమర్శను బట్టి ఇష్టాన్ని బట్టి సిద్ధించదనే మాట వాస్తవం. కవి అభిలాషను బట్టి మాత్రమే రూపొందుతుంది.

– మాదిరాజు రంగారావు

1. ప్రశ్నలతో ఇప్పటికీ

ఇది మానవ జీవితం! అభినవ గతితో
మూలం ఎప్పటిదో! పలు మార్పులతో
శ్రమతో మనీష కలిసిన పద పంక్తులతో
దశ దశలో విజయ భూమికతో గతిలో!

భవిత అయిన కవిత అయిన వీటితోనే
ఈ విశాల సమాజాన పథపథాన గుర్తులతో
దిశ దిశలో అవకాశంకై వేచి వేచి
కణ కణాన తనువులో నవ చేతన కళతో

జరిగే దేదో ముందుగ తెలియ దెవరికీ
వెళ్ళే కొద్దీ మజిలీ లెన్నో గడచి గడచి
పద పదాన "నేను" స్వరం అనురణనంతో
ఇల్లు చెట్టు చెరువు పొలం యంత్ర నవంతో

ట్రాఫిక్ సిగ్నల్ రెడ్‌లైట్ గుర్తు వెలిగి
ఆగిన వాహన పంక్తుల సందులలో
లిప్తల ఒత్తిడులకు నలుగుతూ
చాచిన అర చేతిలో పడే
అదృష్ట శకలాలకై కదలే
భాగ్య హీనలొకరి వెనక ఒకరు

గడ్డ కట్టిన మంచు కొండలా
నిశ్శబ్ద సమాజం! కరగి తరగలతో
కదలేందుకు కోష్ణ శక్తి అవసరం
సమస్య లెప్పటివో? ప్రశ్నలతో ఇప్పటికీ

ప్రశ్నల కవకాశం ప్రజాస్వామ్య వరం
మానవ సంస్కృతి విజయానికి కొత్త బలం

❁

2. అంతరంగ స్పందనతో

మనిషికో ప్రతిమకో గుర్తుకో చెట్టుకో
అలంకార శోభలోన భాగమైన పూవు
మరునాటికి వాడి వత్తలయి పోయేను
కొత్తది! కొమ్మలకు తగిన సృజన సమయంలో

ఉన్న దానితో సంతోషం పొందే వారు
కొత్త దానికై ఉత్సాహం చూపే వారు
పాత కొత్త పరంపరలతో సమాజం
ప్రతి సమయం రెండు కొసలతో గడచేను

ఆగమనం అందరికీ తెలిసిన వాస్తవం
నిష్క్రమణం ఎవరికినీ తెలియని రహస్యం

దేహంలో కణ కణం
పురా స్మృతులు కదలుతూ
మనుషులతో కలసి మెలసి
బ్రతికే సుందరతలలో
కల్పనలో మెరపులతో
అనుభవ గతిలో రుచితో
తరం నుండి తరం కొత్త అన్వేషణలో
దశల నుండి దశలకు నవ దార్శనికంతో

ఎపుడు ఎవరు వినినా వినక పోయినా
మేఘుని గమనంలో గర్జన ఆగదు
పరిమళ చలనంలో పవన స్పర్శ ఆగదు
దుఃఖ గళంలో రుద్ర శబ్ద మాగదు

హృదయ మెక్కడుందో? కవిత అక్కడుంది
అంతరంగ స్పందనతో స్వర ధునితో!

❁

3. బహు గుప్తంగా

ఏ చోటనొ ఏ వేళనొ మనుషులతో కలిసి
అనుభవ వనిలో చూడని పూల మొక్క మొలుస్తుంది
ఊహలలో దృశ్యం! సరికొత్తది ఏర్పడుతుంది
పరిచయ వాక్యంతో మొదలైంది
పెరిగే స్నేహ్ంతో పుస్తక మవుతుంది
ఒంటరి భావన తలపుకు రానే రాదు

తప్పుడు దారులపై కోరిక
పరిస్థితుల ఒత్తిడితో పెరుగుతుంది

మొదట ఎంత ప్రన్ననో
అంత లోన జటిలమై
అదను కాని మంచి చెడుల ఆలోచనలకు
విషయం ముగిసాకే జరుగుతుంది ప్రవేశం!

ఎవరి దృష్టితో వారికి "శుద్ధ" నిజం
"శాంతి" ముఖం, కనబడేది
మేధా నిలయంలోనా?
హృదయ మంటప మందా?
గ్రీష్మంలో చల్లని గాలిలోనా?
శిశిరంలో వెచ్చని రశ్మిలోనా?

కోరినంత లోన 'శాంతి'
చేతికి దొరికే వస్తువు కాదు
నీడ చాటున ఎవరో? అనుమానం!
నీడ వెనక నున్న రహస్యమేదొ?

ఎవరి పనిలో వారు, ఎవరి దారిన వారు
తమలో మినీ ప్రపంచం, బహు గుప్తంగా

❁

4. రోజు పుటలతో

గగన సరసిలో నిశ్శబ్దంగా సాగే
వెలుగు రెక్కలతో సూర్యుడు హంసలా
వ్యక్తి అంతరంగంలో విశేష బింబం
మనసును వెలిగించేను బ్రతుకును పెంచేను

అల్లుకొన్న వెన్నెల తీగతో గగన నికేతనం
మల్లెపూల గుత్తిలా చుక్కలతో చంద్రుడు
వ్యక్తి అనుభవంలో కళా రుచిర బింబం
హృదయ మలంకరించేను ఆర్ద్రత నింపేను

మంచి అయినా చెడు అయినా
ముందుకు వేసిన అడుగును కాలం
వెనక్కి తీసుకోదు! మరలి చూడదు
అణగితే, దోహద క్రియ అనుకోవచ్చు

రవి బింబం చూస్తే గుర్తుకు వస్తుంది
రణ చరిత్రతో వీరుని తేజో వదనం
శశి బింబం చూస్తే తలపుకు వస్తుంది
తల్లి ఎదపై ఒదిగి చూచే శిశువు ముఖం

మెత్తన కఠినత సంకుచితం ఔదార్యం
ఏదీ వీడదు! అన్నీ భాగాలే బ్రతుకులో

కవిలో అన్వేషణ రూపం కవిత్వం
ఇది ఎంత వరకు అంటే! అనంతం
కవిత సాగుతుంది సమాజ హృదయంతో
రోజు పుటలతో జీవిత మొక పుస్తకం

స్నేహం దయ ప్రేమ ఉదారతలు
రాత్రి వేళ దీప స్తంభాల్లా వరసగా

❁

5. రోజు పుటలతో

ఊరు గుర్తు పడుతుంది! ఏ సమయం అయినా
ఎన్ని ఏండ్లు ఉన్నా నగరం దృష్టికి, కొత్తే
ఉన్న ఊరు వదలుతూ ఏదో జారిన శూన్యం
కొత్త ఊరు చేరుతూ ఏదో పొందే పూర్ణత

ఊరయినా పట్టణ మయినా పుట్టుకతో
స్విచ్ ఆన్ అయిన బల్బులా జీవన రూపం
సమాజ బంధంతో స్మృతి గంధం వీచేను
మానవ శక్తుల ప్రకటన సాధన మయ్యేను

యాంత్రిక జీవన గతిలో హృదయం మాత్రం
రైలు కారు బస్ విమాన యాన ధ్వని ముద్రలతో

చేతిలో ధనం రెప రెప లాడితేనే
కాలానికి కాళ్ళ కదలి వేగం హెచ్చేదీ

అధికారం అంచులలో ఆధిపత్య ప్రకటనతో
ఎప్పటివో! ఎగసే అనల కోప శిఖలతో
ఇప్పటికీ నెత్తురు రేఖలతో
చిత్ర మనో రూపాలొక టొకటి!

దీన స్వరం
మనో జలధి అలజడి స్వనమే!
ఇది లోపలి
బాధకు ఉపశమనం అనిపించినా
మౌన శిలా రూపాలకు సూచన అవుతుంది
ప్రగతి కోరు యోచనలకు ప్రేరణ అవుతుంది

రణంలో జయం, తామేదో సాధించిన తృప్తి
మనసులో శాంతి, తామేదో పొందే నిజ రూపం

మానవ శిఖర తలం నుండి జలపాతంలా
లోని ప్రతిభ! బయట పడేది! దార్శనికంలోనే!

❋

6. ఎడారి నుండి

నిశ్శబ్ద వనం లోనే కాదు
పరచిన ఎడారి లోనూ శాంతి
మౌనంలో అలంకార రహిత సుందరంగా
ఎవరికీ పట్టనిదీ, అంతా కోరేదీ

దారిలో ధూళిలో స్ఫటికం
ఎవరి కంటనో పడుతుంది
నడకను నిలిపేస్తుంది
తళ తళ లాడుతుంది
మనసును కదలిస్తుంది

చక్కగా జేబులోకి దూరుతుంది
మెల్లగా బ్యాగులోకి చేరుతుంది
అప్పటి కది ఒక కళా చిహ్నం
ప్రక్క నున్న భిక్షువును మరపిస్తుంది

ఇది మనసును నిలిపేసే దృశ్యం
పలు కోణాలను చూపే వాస్తవం

ఎచటి నుండో ఆర్త రవం
వనం దాటి ఎడారి దాటి
గాలిని చీలుస్తూ వస్తుంది
ముందుగ కవి హృదయం తాకుతుంది
కవితకు జీవ శక్తి నింపుతుంది
తీగెను మీటిన స్వరం ఒలుకుతుంది

వనం నుండి, జనపదానికి చేరినట్లు ఉంటుంది
ఎడారి విడిచి, మైదానానికి తరలినట్లు ఉంటుంది

7. విరామ మెరగని క్రియలో

విప్పారిన మొగ్గల వలె పెదవులపై మాటలు
పరిమళ భావనతో అర్థం బయట పడేను
జీవన వాస్తవ స్థితి కొక కళ వచ్చేను
ఈ మానస గుణ దృశ్యం ప్రతి కవితలో

దీవెన అయినా శాపం అయినా
హృదయ తంత్రులు మీటుతాయి
స్వరం తీరు ఏ దయినా వినవలసిందే
అనుభవ రుచి ఏదయినా తప్పనిదీ

మృత్యువు తన ఉనికిని చకిత విధంగా
జ్ఞాపక ఫలకంపై ప్రతిఫలింప జేస్తుంది
మనిషికి తన పరిమితులను చూపిస్తుంది
దీనికి తగు జాగ్రత చర్యలు! మనిషిలో

ఉదయ కిరణ రూప మొకే విధం అందరికీ
ప్రతి ముఖాన మాత్రం వేరు వేరు బొమ్మలతో

అవసరం మనిషిని యంత్రంలా నడుపుతుంది
నవ్వుతూనో ఏడ్పుతోనో రణంలోనొ విపణిలోనో

గ్రీష్మ సమం స్థితిలో
మనో జలద హృదితో
జారే చినుకులతో
పద పదాన ఆశ్వాసం!

అడవిలో పులి అడుగులు వేటరికి తెలిసినట్లు
కవితలో కవి ముద్రలు! సుహృదులకు తెలుస్తాయి
ఆయువు పుస్తకంలో అక్షర లిప్తలు
పంక్తులుగా! విరామ మెరగని క్రియలో

❁

8. సంఘంలో భాగం

వీడిన ఎదలను కలిపే
తెలియని దారులు చూపే
చలన సమాజంలో భాగం
ఎంతటి జీవిత మయినా

అద్దంలో ప్రతి ఫలన గుణం ఒకటే
ఏ భేదం లేదు, ముఖాలు మాత్రం వేరు

తనపై ప్రత్యయం లేని మనిషి
ఉరి వేసుకొనో చితి పేర్చుకొనో
ఏ వాహన చక్రం కింద పడి నలిగో
గోయి తవ్వుకొనో స్వీయ హత్య జరిగేను

వేణువు చేతి కంది ఊదితేనే
పిలిచినా అరచినా కదలని వ్యక్తి
నాదంలో చేతన కాకర్షితుడయ్యేను
క్షణాలలో కదలి కాలాన్ని జయించేను

చేతిలో పూవుతో వైరం మరపించేరు!
చేతిలో కత్తిలో దీవించే దెవ్వరు?

పూలను కోసేందుకు కత్తిని వాడేరా?
చాకు విసరి చెట్టుపై పండును రాల్చేరా?

పూల తోటలోకి వెళ్ళి బుట్టతో
నిప్పు కణాలకయి తిరిగేరా? దొరికేనా?

అద్దంలో వెలుగులు! పదాలలో దాగి
కవితలో రహస్య జగం భావనలో
జరిగేవి జరుగుతూనే! సంఘంలో
పలికేవి పలుకుతూనే! చిలకల్లా

9. చేసేది ముఖ్యం

కాల చక్ర భ్రమణంలో వివిధ దశలలో
సమయ సమయం! అనుకూలం ప్రతికూలంతో
ఎవరి ప్రపంచం వారిది ఆలోచనలో
ఓపెన్ ఎయిర్ థియేటర్‌లా స్వేచ్ఛా రూపం

మాటలో పక్షి ఎగురుతూ
చేతిలో లైటు వెలుగుతూ
నుదురుపై వంగిన గగనంతో
మనసులో ఉదయ ప్రవాహంతో
ఒకరి బాధ వేదన, వేరొకరికి
ప్రచార పాత్రగా! మారడం విచిత్రం

అలజడి ఆవేదన ఆందోళన హాహాకారం!
స్వార్థంలో పని కొచ్చేవిగ అవుతున్నాయి
ఘటనలో ముక్కలయిన ఆదర్శ రూపం
ప్రతి ముక్కలో తన ముఖం కనిపించాలనీ

చేతి నుండి జారి పడిన హారతి పళ్ళెంలా
ఉత్తమ సంకల్పం! చెదరి ప్రతి ధ్వనించేను
చుట్టూ ఎగసే మంటల మధ్యలో
శాంతి గళంపై బాకును నిలిపేరు

దృశ్యం పత్రికలో ప్రత్యక్షం, మరునాడే
తమ వాదన కనుకూలమైన కోణాలలో

శుష్కమైన తరువుకు తిరిగి పచ్చదనంలా
అనుకోని వికార మనో రూపానికి
అందే మానుష చేతన! ఇపుడవసరం
చెప్పే దానికన్న చేసేది మాత్రమే!

❁

10. క్రిందికి దిగవలసిందే

గాయం తలపించే శిథిలాల దారిలో
మంట లారిన బూదిలో నిప్పులు వెదకేరు
వైరంలో మిగిలిన మూలం ఎప్పటికయినా
తమకే మయినా పని కొచ్చేనని తలచీ

జీవన రణంలో గాయపడని మనసు లేదు
నలిగిన మనసుతో క్రుంగి పోని మనిషి లేదు

పగటి వేళ ఇంకా నిద్రలో తూగే మనసుతో
ఉత్సాహం లేని మనిషి! గమ్యం చేరే దెప్పుడు?

తెరచిన కిటికి తలుపులతో నిలయం
ఉదయంతో అతిథికి స్వాగత మిస్తుంది

మెలకువలో కనులు మూతబడి ఉన్నా
నల్లని తెరపై బొమ్మలు! వెలుగులవే!

పరిచయ మాత్రంతో స్వప్నం మిత్రమై
మనసులో ఆనవాళ్ళు వదలిపోతుంది
తన ముసుగును తానే వేసేదీ తీసేదీ
ఆ ముసుగును గురించి మరొకరికి తెలియదు

ఇంటి ముందు ఎదురుగ విరిసిన పూలు!
రాత్రి కన్న కలలను తలపించేను
మరచిన వేవేవో గుర్తుకు తెస్తాయి
భవితకు స్వాగత ముఖాన్ని నిలుపుతాయి

ఇది జీవన సుందరతలకు ప్రియ వాసం
పరిమళ పవమానంతో అభినవ స్థితి రూపం
అతికిన రెక్కలతో ఎంత దూర మెగరగలరు?
పతంగిలా వాలిపోయి క్రిందికి దిగవలసిందే!

11. క్రియా శక్తి పాత్రలో

జలధి నుండి తుపాన్ ఎపుడు బడితే అపుడు రాదు
ఇది గతి పరిణామంలో ఒక దశలోనే
సంఘంలో ఉద్యమ మెపుడు బడితే అపుడు రాదు
ఇది అవసర రూపమై కోరే గమ్యం తోనే

అలజడి బీభత్సంలో చెదరిన సమాజ స్థితులు
రావలసిన మార్పులతో కొత్తది రూపొందేను

మౌనానికి లిపి ఉంది, అది సార్వకాలికం
సంఘానికి నోరుంది, అది సార్వజనీనం

ప్రవాహ గతిలో విద్యుత్ తేజంలా చేతన
నీలాకాశంలో రవి బింబంలా ప్రగతి ముఖం

ఇంటి నుండి నాలుగు దారులు కలిసే చోటికి
చేరుకొనీ! ఏ దారిన వెళ్ళాలో మనసుకు తెలియాలి

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ దూసే బాణాల్లా
ధ్వనితో పరుగిత్తే వాహనాలు రోడ్‌పై

సందేహ స్థితిలో గమ్యం చేరే దెట్లా?
టాస్ వేసా? పెద్దల సూచనతోనా? తన అభిమతమా?

కలిసే వీలు లేని రెండు సమాంతర రేఖలు
రైలు పట్టాల వలె పోయి పోయి ఎక్కడనో
కలవక తప్పని స్థితి ప్రతి జీవన యాత్రలో
లౌకికమూ మానసికమూ ఏ జంక్షన్‌లోనో

స్వేచ్ఛకు స్వాతంత్ర్యానికి మనుగడకూ హక్కులకూ
వ్యక్తికి తప్పని అస్త్రం నిరసన! పోరాటం!
వీటి చేత సాధించిన ఆశయ రూపాలెన్నో!
ప్రగతి మతుల ప్రస్థానంలో క్రియా శక్తి పాత్రలో!

❁

12. గుర్తులతో మనుగడ

ఊరు లేని పేరు లేని మనిషి లేడు
ఈ గుర్తుల తోనే మనుగడ సాగేది

వర్తమాన రేఖ వలయాకారంలో సుడిగా
భవిష్యత్తు రేఖ బాణంలా సూటిగ

వర్తమానం ఉన్నది చేతికి అందిస్తుంది
భవిష్యత్తు లేనిది వాగ్దానం చేస్తుంది

పొలిమేరలు లేని ఊరు లేదు
గమ్యం లేనిది, పయనం లేదు

ఊరుతో పేరుతో ఒక వ్యక్తిత్వం
సమాజ రూపానికి కనిపించని బలం!

చెప్పేవి కొన్ని చెప్పనివి కొన్ని
అనుకునేవి కొన్ని అనుకోనివి కొన్ని

కావాలని కొన్ని ఆనతిలో కొన్ని
శ్రమ జీవన మెప్పటికీ ఏదో పనిలో

దారిన ముళ్ళను తొలగించక తప్పదు
రాళ్ళను సహించి పోవచ్చు ఏలాగో!

వెలుతురు తన దారిన పోవడమొకటే కాదు
వెలుగులు తనలో ఆవాహన చేయడ మవసరం

ప్రకృతిలో రుతువుల ప్రభావం మాదిరిగా
బ్రతుకులో సమాజ ప్రభావం తప్పనిదీ

చేసే పని వెనక నుండి ఒక ఆలాప స్వరం
గుండెను ఉత్సాహ లహరులపై తేలుస్తూ

దేహంపై గాయాన్ని పుష్ప మయం చేస్తూ
ప్రతి ఎదలో శూన్యాన్ని రాగమయం చేస్తూ

❁

13. సంక్షోభంలో

సంక్షోభం అంచులలో సమాజ దృశ్యం
ఈ సమయం రాజ హంస మరుగున బడేను
బదులుగ వాహన యోగం హింసకు లభించేను
కవితకు వచనం వాహనమై మేఘంలా ఎగసేను

సర్పంలా మెలికలు పోయే అనుమానంతో
వైరం క్రోధం అలజడి అశాంతి దృశ్యాలు
మనిషిలో మనిషిపై భేద భావ రూపాలు
దాట రాని గోడలు కంచెలతో ఆవరణలు

ఒక స్థితిలో దిశగా పెరిగిన మనుషులు
మరు స్థితిలో దిశ మారిన సందర్భం!
ఎప్పటికీ శిశు దశలో ఆగి పోరెవరూ
ఎదిగిన కొద్దీ పరిణతి అవసరమవుతుంది

మ్రోడుల వలె పంక్తులుగా నిలిచీ వేచీ
సులభంగా దొరకని చినుకులకై చూచేరు

కఠిన నియమ నిబంధన లొక పంజరమై
బోను అయిపోవడమొక కారాగార సమం

అలసట ఎరగని కాలం చెమటలు పట్టిస్తుంది
శ్రమలో చేతన సుమ ఫల రూపం కోరుతుంది!

పొగల తీగె లల్లుకొనీ అనల గుణంతో
ఈ సమయంలో బ్రతుకులు వాడి వరుగులయ్యేను

మట్టి నుండి మొక్కలా ఒక విధం
యంత్రంలో భాగమయి ఒక విధం
బ్రతుకుల కాధార వికాస క్షేత్రమై
ఈ సమాజ మొక ప్రయోగ శాలా రూపం!

14. అతీతం కాదు

మాట వెడలుతుంది
గాలిలో దూరం పయనిస్తుంది
నీలి మబ్బు మెదలుతుంది, మనసులో

పాట తరలుతుంది
దిశలను నింగిని స్పశిస్తుంది
వెలుగు ఊహ కదలుతుంది, మనసులో

మాట పాట రెండూ
కవిలో హృదయానికి తలుపులు
స్పందనలో నవ సృజనకు
రెండు అరల అక్షర రూపం!

జడంగా పడి ఉన్న శిలలు
మూర్తులుగా చెక్క బడీ
మనిషికి ప్రేరణలయ్యేను
దారులు తలపుకు తెచ్చేను

ఇది లోపల దీపమై వెలగవచ్చు
ఇది బయట తోడుగ వర్తించవచ్చు
ఏ మయ్యేదీ ఉద్దేశం అనుసరించి
గమ్యం మాత్రం పనిలో ఉపయోగంతోనే

మనిషి కనుల నుండి, వెలుగు సాగి
ఎదురగ శిల్పం కనులు స్పృశించేను

జడంలోని సుందరత చూడాలనీ
లోతు లోని రహస్యం తెలియాలనీ

ఇది ఏ అతీత సందర్భం కాదు
వాస్తవ జీవన రూపానికి చిత్రం!

❁

15. చినుకుల సిగ్నేచర్

మబ్బు వచ్చి చేసిన పరామర్శకు గుర్తుగా
భూమి పైన చినుకుల అక్షరాల సిగ్నేచర్
వెళ్ళిన మేఘం వెనక్కి రాదు
జరిగిన కాలం తిరిగి చూడదు

మబ్బు రాకతో జన ప్రేయో రూపం
అవని తలంపై పరచిన పచ్చని కార్పెట్
మతి కొక వికాస భావ జగంతో
కవిత! నవ సమాజ శ్రేయో రూపం

నవం లేని సృజన లేదు
అహం లేని కవిత లేదు
బ్రతుకు పైన ఆశ పెరిగి
క్షణం క్షణం కొత్త ఊహ!

చీలిన ముక్కల్ని కలిపేస్తుంది
అఖండ రూపంతో అలరిస్తుంది

అద్దంలా భాష మనో జగం చూపిస్తుంది
అర్థంలో నిజం అస్తితలను బింబిస్తుంది

ఉత్సవంలో కలిసినా ప్రయాణంలో చేరినా
స్నేహ చరితతో దృశ్యం ముందుకు నడిపిస్తుంది

క్షితిజంలో వెలుగులు స్వాగత తోరణమాలలా
కత్తుల తళతళలను మరపున బడ చేస్తాయి

ఏ క్షణాని కాక్షణం! ఎదురై శూన్య ముఖంలో
మాటతోనో చర్య తోనో! నింపి తరలుతుంది
రోజూ దప్పిక ఆకలి రొటీనులోను
నిష్క్రమణంపై కన్నా పునరాగమనంపై కోరిక

❁

16. బదులు లేని భరోసా

నేల పైనొ నీటి పైనొ గాలిలోనొ పయనించే
వాహనమొ! నావయొ! విమానమొ! అనిపించే
వివిధ స్థాయిలలో విధాలతో మనుషులు
జీవన రూపం గురించి అనుభవ మొక ఖజాన!

మట్టిలోని విత్తు నీరు తగిలి చేతనతో
చివురు ముఖం చూపుతుంది, పొరల నుండి

మండే ఎండలకు పగిలిన బండ సందు నుండి
చినుకు తాకి సృజన శక్తిని చూపిస్తుంది

రాళ్ళపై దొరలి చింది పారేదయినా
నేలపై తరలి జారి సాగే దయినా
ఇసుకపై మెరసి కదలిపోయేదయినా
ప్రాణాలను నిలిపే ఆర్ద్ర గుణం ఒకటే

నీడ పడిందంటే! వస్తు వేదొ ఉన్నదనీ
ఇది ఒక వస్తువు ఉనికికి సంకేతం
చీకటి బంధువు అయినా ఎండలో ఆశ్రయం
చోటు లేని బీదకు బిక్కుకు ఉదార నిలయం
ఎవరికి పట్టని సమాజ రూపంలో
ఇది మానవ సుందరతకు సూచన

ఒక ఘటన దారిలో మలుపును తెచ్చేను
ఒక ఘటన బ్రతుకులో బాటను కూర్చేను

జీర్ణమైన బ్రతుకులు! మరొకరి నీడలో
ఎండకు వానకు చలికీ గురి అవుతూ
ఎంత కాలం గడిపేరు బాధలలో
ప్రతి ఉదయం, రేపు పైనె! బదులు లేని భరోసా!

❁

17. కల్పన కవకాశంతో

కాల చక్ర గమనంలో రుతువు లెన్ని విధాలొ!
బ్రతుకు లోన తప్పని మార్పుల రూపాలన్ని!

సమాజ చిహ్నం ఈ తరువు క్రింద పడి ఉండీ
సంపదలో తమ వంతును కోల్పోయిన వారెందరొ!
చెట్టు నీడ! మాయని గాయాలకు శమనం
ఇది చెదరిన ఉనికికొక ఆశ్రయ రూపం

వెలుగుల పక్కనే నీడలు నిశ్శబ్దంగా
రహస్యాల్ని దాచుకొనీ చాటుగ భద్రంగా

ప్రతి వస్తువులో ఒక ప్రయోజన గుణం
ప్రతి కోరికలో ఒక తప్పని అవసరం
తిన్నగా సరించ వలసిన సమయం
గడ్డకట్టి పర్వత పంక్తిని తలపిస్తూంది

ప్రతి కిరణం సమతకు నవతకు ప్రేరణగా
మానుష స్పందనతో ఉదయ రూప మవసరం

ఆయుధ చికిత్సతో సంఘానికి పనిలేదు
అది! సుస్థితి కన్నా దుస్థితికే! అవకాశం
తన బాధ్యత తెలిసేందుకు మనిషికి
కటు శాసన పర్వంతో పని లేదు

తనలో చేతనకై పని చేసేందుకు
బూడిదలో నిప్పును వెదకే పని లేదు

తగిలిన గాయం! భౌతిక చిహ్నంగా
మచ్చ వెనక ఎంతో! కథా కమామిషు!
చిలవలు పలవలుగా, కాలంపై
కల్పన కవకాశంతో, ఎప్పటికీ

18. ఒక మారే

జననం ఒకసారే మరణం ఒక మారే
ఈ మొదటి నుండి ఆ చివరి దాక
బ్రతుకొక సుందర దర్శన శాలా రూపం
ఇది వికార భావ జగం కావడం విచిత్రం!

ఉదయం కిరణం చూపే దారు లనేకం
గమ్యం ఎన్నుకొనే స్వేచ్ఛ మనుషులదే
ఇష్టమైన దారిలోన అవసరాల వీలులోన
ఎగుడు దిగుడు దారిలోన సాగడమొక పరీక్ష!

ఉన్న బ్రతుకులో అనుభవ సీమలు సరిపోక
మరో జన్మపై నమ్మక మొక రుచిర మానసం!

ఉత్సాహం పొంగుతుంది ఉద్వేగం రగులుతుంది
నడతలోన సమతకు ఆలోచన వెలుగుతుంది

వర్తమాన కాలంలో వ్యక్తి అతిథి పాత్రలో
తృప్తి రేఖ విస్తరణం! పునర్జన్మ కల్పనలో

రాబోయే బ్రతుకుపైన అనుబంధంతో
ఇప్పటి బాధ్యత మరుపున బడి పోవచ్చు
అడుగులో బలం లేంది, ఆగిపోవచ్చు
గాలి కెగిరి పోవచ్చు, జారిపోవచ్చు

అవరోధం లేకుండా ప్రవాహ జీవితం
ఆయువు సాగడ మొక విధంగా నియతం!
మానవ జీవకణాల ప్రభావ యుతం, సహజం!
పసితనాన లేత చివురు కదలినట్లు
పరిణతిలో ఫల రూపం చేరుతుంది
పరిణామానికి వ్యాఖ్యానం జీవితం!

19. అవకాశం వీడలేదు

మౌనంలో నీడ! ఎప్పటికీ
మిత్రం కాదు శత్రువు కాదు
ఉన్నంత సేపు నిశ్శబ్ద సాక్షి
ఎంత కాలమైనా అంతంత మాత్రమే!

అందని గిరి శిఖరం ఆదర్శం
అది నివాస తలం కాదెవరికినీ

జీవిత మెన్నిటితోనో సంశ్లిష్టం
ఒక స్థితిలో దారులు మూత బడేను

వేదనలో చీకటి స్పర్శ ఉన్నా
ఆశలపై వెలుగులు! ఊరటనిస్తాయి

గాలి వస్తే దీపానికి సంతోషం
గాలి వీస్తే ప్రాణానికి ఉత్సాహం

కాలాన్ని దాటి ముందుకు పోవాలని గాలి!
ఆ గాలిపై విశ్వమంత తిరగాలని మనిషి!

తనపై అవలీలగ పడవలు వహిస్తూ
తీరాలకు చేర్చే ప్రవాహ సుందరంగా
కోపంలో తాపంలో కష్టంలో నష్టంలో
బ్రతుకు! సాగుతుంది సమాజ చేతనతో

కర్షకులు కార్మికులు చెరొక వైపు నుండి
సమాజ నిర్మాణానికి ఆధార నిలయాలు

ఏదో శ్రమతో నడవని బ్రతుకు లేదు
చలన గుణం తోనే ఎవరికైన సంపద విభవం
ఎంతటి బరువు నయిన మనసు వహిస్తుంది
వదలదు మరవదు అవకాశం వీడ లేదు

❁

20. మార్గం ఒకటే

నిశ్శబ్దం మనిషిలో మేఘంలా ఆవరించి
ఆశా రూపం మౌనకళను పొందుతుంది
అపుడపుడూ పిడుగులతో మెరపులతోను
చినుకు చినుకు! బ్రతుకులకు ధైర్యం ఇస్తాయి

అడుగు వెంట అడుగు పడుతూ పోతేనే
దారికి ఒక చరిత్ర! పయనానికి సార్థం

క్రింద పడినా గాయ పడినా
కాలానికి పోటీగా గాలి!
మనిషిని వడిగా నడిపిస్తుంది
సంక్షోభంలోనూ పరితోషంలోనూ

మట్టి బొమ్మ విధం కాదు మనిషి
జీవ రేఖతో అవయవాల అమరికతో
కళతో ప్రాణిత పరిణామ రూపం!
పాగానో! కిరీటమో! పైపై కోరికతో

ఆలోచనా దిశ నుండి వివేక కిరణం
చీకటి లోనూ నడిపించే చేతన రూపం
ఇది ఏ వస్తువుతో పోల్చేది కాదు
హృదయంతో మానుష చరిత్రలో భాగం

పిడికిలిలో నాగలితో కదలే కర్షకుడు
టంకారం మ్రోగే చాపంతో వీరుడు!

కదలికలో కరుణ ప్రేమ వితరణతో
మానవీయ పరిణతితో అందంగా
ఏ దార్శనికంలోనూ మార్గం ఒకటే!
దేశానికి కాలానికి వర్గానికతీతం!

❁

21. ఆల్ ఇన్ వన్

మనుషుల నడవడి చూస్తే "ఆల్ ఇన్ వన్"లా
ఒక సందర్భంలో సర్పం కదలుతు పోతుంది
ఒక సందర్భంలో విహగం ఎగురుతు పోతుంది
ప్రాణులెన్నో! అన్ని! గుణాలు వివిధ స్థితులలో

నచ్చిన విధాన పాత్ర వహించేను మనిషి
తన జీవన వేదికపై చేరే పాత్రలతో కలిసి

సారె పైన కుండల వలె బ్రతుకులు తయారు కావు
మాటలతో చేతలతో దేని కది! వేరు వేరు

చిన్న పెట్టెలా వ్యక్తి జీవితం
పెద్ద పెట్టెలా సంఘ స్వరూపం

అవసరానికి తలుపు తెరవబడీ
ఎవరి మనో నిలయం వారికి పరిమితం

నీటిలోని చరణాలను లోనికి లాగాలని అలలు!
గట్టుపైని చేయి పట్టుతో, బయటి రావాలని భూమి

ఎన్ని చెప్పినా ఒక మనిషికి బదులుగా
మరో మనిషి సమం కాదు ఏ విధంగా!

అడుగుకు ఆధారం భూమి సస్యమయం
తలపై ఛత్రంలా నింగి మేఘ యుతం
సృజన ప్రపంచానికి కేంద్రం అయినా
ఎవరి ప్రపంచం వారిది ప్రత్యేకం! వ్యక్తిలో

విపంచి రూపంలో మనసులో 'మంచి'
మనుషుల ఇష్టాన్ని బట్టి సంస్పందం!
తీగె మీట బడాలి! స్వరం బయట పడాలి
అభిరుచి శిక్షణ సాధన అవసరమెంతో!

❁

22. మనిషి అవసరం

గ్రీష్మం చెలరేగుతుంది రుద్రంగా
సమాజ జీవ నదిని పీడిస్తుంది
గమనంలో నిమగ్నమైన ప్రవాహం
గతాన్ని తలచేనా? వెనక్కి మరలేనా?

కష్టాలు వస్తాయి వెళిపోతాయి
సమాజ ప్రవాహ రూపం ఆగదు
ఎంత మాత్ర మయితే అంతగనే
దాహం తీర్చే ఉదార హృదయంతో
వర్తమాన స్థితిలో కడు సహనంతో
భవితపైన చెదరని విశ్వాసంతో

మేఘం వస్తుంది గర్జా సుందరంగా
జన హృదయం స్పందనకు ప్రతిగా
మెరపులతో భవితకు సూచన చేస్తుంది
పిడుగులతో జనతను జాగ్రత పరుస్తుంది

నిరంకుశం అడుగులు వెనక్కి పడతాయి
అదను చూచి మళ్ళీ వచ్చే వీలుంది

బ్రతుకున తప్పనిదీ శాంతి! సమాజంలో
ప్రజాస్వామ్య భావన కొక సార్థక చిహ్నం!

గతం వెళ్ళిపోయిన బంధు సమం
భవిత వేచి ఉన్న అతిథి సమం

తీరం తాకే అలల శబ్ద లయ వలె
నాలో హృదయం! వర్తమాన గతిలో!

మనిషి నిలవడానికి భూమి తలం అవసరం
ప్రాణి నిలవడానికి గాలి నీరు ముఖ్యం

23. వదలని బంధంతో

ఎన్ని యుగాల నాటిదో శ్రామిక దృశ్యం
కర్షక కార్మిక క్రియా శీల సమాజం

మనిషికి కావలసిన ఆహారం
ఇతర వస్తు చయంకై యత్నంలో
కష్ట నష్టం భరించే సాహస మూర్తులు
వినియోగం అందరిదీ, ప్రయోజనం దేశానిది

తరాలుగా ఎదుగు లేని జీవితాలు
చరిత్రలో ఫుల్ స్టాప్ వాక్యాల్లా

ఎక్కడ ఉన్న వారు అక్కడే స్థిరంగా
పూర్వపు జీవన రూపం భద్రంగా
ఏ ఆర్భాటం లేని వృత్తిలో
అధికారానికి దూరంగా, మంచి పేరు మాత్రం మిగిలీ

భూమిమై అడుగులు వేస్తూ
నీలి మబ్బులకై ఎదురు చూస్తూ
చినుకు చినుకు దీవెనకై వేచీ
శ్రమ జీవన బహుమానం! పంటలతో

ఎక్కడో దూరాన గొట్టం నుండి పొగ
మబ్బును తలపిస్తుంది సంభ్రాంతంగా

తలుపు లేని ఇల్లులా
జరీ పోగులేని వసనంలా
దీపం నోచని ముంగిలిలా
శూన్యంలో చీకటిని పంచుకునే బ్రతుకులు
నేలను వీడని బాధ్యతతో
సమాజాన్ని వదలని బంధంతో

❁

24. కవితలో ఆర్ద్రంగా

ఉదయం అద్దంలో ముఖ బింబం
తన మనసుకు ప్రతినిధిగా
ఆ రోజు జరగవలసిన పథకం తెలుపుతూ
తన కతీతమైన భవితకు గాలం వేస్తూ

క్రితం రోజు జరిగినవి సమీక్ష జరుపుతుంది
అవసరమైతే పశ్చాత్తాపం ప్రకటిస్తుంది

నాలుగు దిక్కుల చివరల నొకే చోట ముడివేసి
తన కొక సుందర నిలయం స్వప్నిస్తుంది
జీవిత మొక సార్థంతో కుసుమించాలనీ
అది ఎప్పటికి తన వశమయి ఉండాలనీ

ఊపిరి తెగితే ప్రాణానికి ముప్పు
ఆలోచన ఆగితే పథకానికి చేటు

బయట నినాదాల హోరులో
ఆదర్శం! రెపరెప లాడుతుంది పతాకలో
చూచే సామాన్యుని ముఖంలో
నవ్వే ఆశామయ రూపం!

బాధలో కన్నీటి బిందువు రాలుతుంది
మొగ్గయై జ్వాలయై కాగడాయై నిలుస్తుంది

మనసులో మేఘం గుర్తుకు వస్తుంది
అది ఎప్పుడు బడితే అప్పుడు వచ్చేది కాదు

రాలిన బాష్ప కణం కరుణను మొలకెత్తిస్తుంది
ఉద్యమ రూపంతో విషయం ఒకటయి పోతుంది
అక్షరాల ముత్యాల ఘన రూపం వదలి
లహరులై కదలేను కవితలో ఆర్ద్రంగా

❁

25. ధ్వనియై సాగాలని

తళుకులతో ఊగే లోలకులు యతులు
మురిపించే మెరపులతో పాంజేబులు ప్రాసలు
వదలిన ఈనాటి కవిత! సహజ శోభితం
స్పందనలో హృదయ లయకు ప్రాధాన్యం

స్వేచ్ఛా చరణాలపై విశాల క్షేత్రంలో
బ్రతుకులిపుడు! సమాజ పథాన గమ్యం దిశలో

ఫాల తలంపై వెలుగును ఏ చీకటి చెరపలేదు
మనసులోని చీకట్లను ఏ వెలుగులు మాపలేవు

టేబిల్‌పై ఎదురుగ అందమైన గ్లోబ్‌లా
కవితలో కవి మనోజ్ఞ వ్యక్తిత్వం

నిజ రూపం తెలిసేందు కిపుడు
ఆకాశ భాషణం చేసే పాత్రలతో పని లేదు
మంది బలం దూకుడు అక్కర లేదు
అగ్నితో పని లేదు, మానవం తోనే పని!

సముద్ర మెంత మహనీయమైనదైనా
దప్పిక తీర్చే దోసెడు నీళ్ళ నీయలేదు!
ఎందరివో జీవితాలు! ఎన్నో పరిమితులతో
ఈ మాత్రానికి జీవన వ్యవహారం ఆగిపోదు

స్వార్థంలో మనుషులు దేనికయిన తెగించేరు
నీతి నిలయం సూత్రా లేవీ పట్టింపుకు రావు

భూమిని కొలవచ్చు దిశలను చుట్టి రావచ్చు
మనిషి మనస్సు మాత్రం! దేనికీ అందనిదీ!
బయటికి పచ్చని తరువుగ బ్రతకాలని
లోపల యోచన ధ్వనియై సాగాలని

26. కాలం బలం చూపుతుంది

భూమిపైన నడచి నడచి తిరిగి తిరిగి
ఒక చిన్న ముక్క అయినా
తన వశమయి పోవాలని
ప్రభుతను నెరపాలని, పాలన సాగాలని

మట్టిని బంగారం చేయాలని
తన మకుటం చుక్కలు తాకాలని

ప్రతి అలజడి విప్లవ చిహ్నం కాదు
ఇది సమాజ దార్శనికంతోనే సాధ్యం

ప్రాణం లేని కళేబరాన్ని అవని ఆదరిస్తుంది
ప్రాణమున్న మనిషిని దూరం చేసేను మనిషి!

హృదయం తలుపులు మూతబడీ
అవి తెరచుకొనే సమయంకై వేచీ,
అనుమానం పెనుభూతం లోన కాపలాతో
మనిషి నుండి మనిషి బాధలెన్ని పొందేనో

ఎక్కడయినా ఎవ్వరయినా
ఆశలు మాటలు చేతలు రహస్యాలొకటే

శబ్దం ఒక లాంచింగ్ ప్యాడ్
అది లేవదు మిసైల్‌తో సాగదు
కవిత లోను అవసర భావ జగం ఎగిరీ
శబ్దానికి దూరంగా, మనసుకు బహు దగ్గరగా

కాలం ఒక సమయంలో పరిచయం లేనట్లుగా
అగ్నిలో దింపవచ్చు, నీటిలో ముంచవచ్చు
నింగిలో తిప్పుతుంది, నేలపై దించుతుంది
ఏ మొగ మోటం లేకుండా! తన బలం చూపుతుంది

27. జ్ఞాపక శాల - టూ ఇన్ వన్

అద్దంలో తన ముఖం వాస్తవ బింబం
లోని జ్ఞాపకాల రూపాలకు గేట్ వే

పైకి కనబడేది ఒకటి
లోన కదలేది మరొకటి
రెండిటితో బ్రతుకులు "టూ ఇన్ వన్"

శ్రమ విక్రమ విద్యా విజ్ఞాన కళలతో
వ్యక్తిలోని అస్తితలకు సమాజ మాధారం
రణ విభేద సహన శాంతి చర్యల కలనం

లోకం లోకి ప్రవేశంతో శిశు దశ తీర్చబడీ
బాల్యంలో దారుల నిర్దేశం జరిగీ
యౌవన దశ నుండి అవకాశం తెరవబడీ
మానవీయ శిఖర సమూహాలతో చరిత్ర!

ఒక చిన్న జ్ఞాపకం తనలో
మనో నిలయం తలుపు తెరుస్తుంది
లోపల ఉన్న వస్తువు లెన్నో చూపిస్తుంది
కావలసిన దాని పయి చూపు పడుతుంది

ఎప్పటివో వాడి వత్తలైన పూలు
సరికొత్తగ మనసుకు తోచేను
కనిపించని పూర్వపు మనుషులు
అవసర పాత్రలలో రూపొందేరు

మబ్బుల మెట్లపై నడిపించవచ్చు
చుక్కలతో మాటాడించవచ్చు

ఇచట కశ్మలానికి చోటు లేదు
ఇచట కపట రీతికి తావు లేదు

మధు బిందు పరీమళాల పద్మంలా
జ్ఞాపక మొకరొకరి లోన సుందరమై
ఎదలో సన్నని మానవ స్వరం వినిపించేను
తుమ్మెద ఝంకృతిలో ధారా నాదంలా

అద్దానికి అనుభవానికి లేదిపుడు తేడా
కాలాని కలంకారం! జ్ఞాపక శాలా రూపం

మనిషితో మనిషి పరిచయం మనసులో
అపూర్వ విషయంతో శూన్యాన్ని నింపుతుంది

ఆపై అందంగా తేలవచ్చు
వికృత రూపంగా మారవచ్చు

ఏ విత్తో! ఏ మొక్కో! నాట బడీ
అదనంగా కొత్త శోభ చేకూరేను

ఎంతో కొంత తగిన పొడవులోనే!
ఎదిగే చెట్టు పైకి పెరుగుతుంది

కొమ్మలతో విస్తరించి తల వంచుతుంది
స్మృతిలో పడవలా తేలుతుంది అపుడపుడూ

ఎవరి కల వారి వారి స్వ విషయం
కవిత కూడ అంతే! అస్మితలో
ఎవరూ దీని నందుకొని సాగించలేరు

కలను యదార్థ సుందర మనిపించడమే
కవి పని! ఇది అంత సులభం కాదు

తెలిసిన చోటు నుండి తెలియని చోటుకు
అవకాశాలను విప్పుతుంది కాలం
పయనం సాగుతుంది యథేచ్ఛగా

కాలానికి కొత్త అతిథిగా
మెడలో పూల దండతోనో
సంఘానికి తన బాధ్యతలో
ఎదపై సూది మొనల తోనో
జ్ఞాపకశాలలో భద్రంగా
సమాజ సంస్కృతి లోభాగమై

తెల్లవారుతుంది
వెలుతురు పటంపై
జ్వాలా బింబంగానో గులాబి పుష్పంగానో
నిలిచిన ఎరుపు రేఖ ప్రత్యక్షం

భాగ్యానికి చిహ్నమా?
విప్లవానికి సూచనా?

వాహనం! టైర్ కింద పడిన దేహాన్ని
ఈడుస్తూ పరుగెత్తే బీభత్స దృశ్యం
ప్రమాదమా? అఘాయిత్యమా? బలవంతమా?
సభ్య సమాజం తలను దింపజేసేను

గ్రంథాలయం నుండి వెడలిన యువకుని
చేతి నుండి జారిన పుస్తకం
పుటల నుండి రివాల్వర్! నేలపై! పడింది
ఇంతలో ఎవరో వచ్చి పట్టుక పోయేరు!

అనుమానం నుండి సందేహానికి ఊగుతూ
యథార్థమేదో! ఎవరి ఊహ వారిది
ఎవరి నమ్మకం వారిది
ఎవరి నిర్ణయం వారిది!

❁

28. యథార్థం అంచున

జ్ఞాపకాల పేటి తెరవబడీ
మనసును అందల మెక్కిస్తుంది

అందమైన శిల్పం కనిపించవచ్చు
ఇది ఆకలి తీర్చేనా? అని ప్రశ్న
దాచిన ఆయుధం బయట పడవచ్చు
ఇది రక్షణ కవసరమై తోచేను

మనసు తృప్తి కయి పనులెన్నో
భయానికి మనిషిలో జాగ్రతలెన్నో!

దొరకని అమృతం ఏకంగా కురవాలనే
మనిషిలో ఆశ! ఆలోచన మెరపిస్తుంది

రాత్రి దాటాలిసి ఉంది, తప్పక దాటిస్తుంది
ఉదయం! వెలుతురు స్వచ్ఛంగా వస్తుంది

అభ్ర వీథి ఎగసి వచ్చే
గరుడుని కాళ్ళ సందున
అమృత కలశం! అద్భుతం!
యథార్థం! అనిపించే చక్కని అనుభవం!

విజయంపై విశ్వాసానికి చిహ్నంగా
కాల ముఖంపై దిద్దిన తిలకంలా
అల్పులకూ పెద్దలకూ సమంగా
మానవాళికి ఉపదగా! ఆశాతేజం!

అమృత లవంకై విప్పిన దోసిలి కళ్ళతో
పొందే తహతహలో ప్రతి ఒకరి నిరీక్షణం

అమృత ఘడియ దాటిపోయి
పేటి మూతబడి పోతుంది

రావలసిన అమృత వర్ష ప్రోగ్రాం
పోస్ట్‌పోన్ అవుతుంది, ఇది జీవితం

ఇది వికారస్థితిగా మారే ప్రమాదం లేకపోలేదు
అమృత బిందువు కయి పరితాపం! మానవ సహజం

❁

29. కాలం మనిషి అధీనంలో

శిశిరంలో మందతను మరపిస్తుంది వసంతం
గ్రీష్మంలో తాప శిఖను తొలగిస్తుంది వర్ష
ప్రకృతి ప్రభావాలతో సమాజ రూపం
వ్యక్తి రేఖ నుండి సమూహ దృశ్యం వరకు

సమాజ చలనంలో ఈనాటి దుర్దశలకు
విపరీత మనో రూపం తన పాత్రను వహిస్తుంది

అలజడి సుడిగాలులో చెదరిన బ్రతుకులు
ఒకటా? రెండా! విషాద పంక్తులతో ఎన్నో!

ఎగిరి పడే బంతుల వలె నిరాశ్రయులు
తెగిన పతంగుల వలె వాలేరు ఎచటనో

బూడిద బొగ్గుల రాసులయిన నివాసాలతో
విలయ పథం చూపుతుంది దహన చర్య!

గమ్యం చివరన ఖాళీ బోగీల రైలులా
శూన్యమైన నివాసాలతో బజారు
సగం కాలి శీర్ణమయిన వస్తుచయంతో
ఇరువైపుల భగ్నమైన విపణి హృదయ లోకం

ఆ సమయంలో బయటికి వెళ్ళేందుకు
దారి ఏది? ఏది దొరికితే అటే!
వదలి పోయి కొందరు! నడవలేని కొందరు
వదలలేని కొందరు! మండి మండి సర్వం
జల సేచనతో అదుపులోకి వస్తుంది
స్మృతిలో వ్యథగా వార్తగా మిగులుతుంది

సర్వం కోల్పోయిన ఆర్తిలో హృదయం
పాలకుల్ని నిలుపుతూంది ప్రశ్నల బోనులో

వ్యక్తి నీతి సంఘ నీతి రాజనీతి
మరొకటి మరొకటి తమ పాత్రలలో
అయినా ప్రతి పనిలో వికృత రూప విన్యాసాలు
నైతిక పతనం ఇప్పుడు జీవన సామాన్యమైంది

పోవు దారి తప్పినా
ఉన్న రేఖ దాటినా
మనిషి గుర్తు చెదరినా
విషమ దృశ్య మెదురవుతుంది

మోద క్షణం ఖేద క్షణంగా మారుతూంది
చాచిన అరచేయి బిక్షు పాత్ర అవుతూంది
ఎవరి దయకో ఎదురు చూడవలసి వస్తూంది
ఏ నీడ పంచనొ చేరవలసి వస్తూంది

శాసన సభలో సమస్య విషయం మరచి
విప్పిన మాటల మూటల బ్యాగుల నుండి
చాకులు కంకర రాళ్ళు బయటికి వచ్చేను
మినీ రణ చిత్రం! టి.వి. స్క్రీన్‌పై ప్రత్యక్షం

ఒకరిపై ఒకరు ఉరుములు ప్రేలుతూ
అపుడపుడూ పిడుగులు పడవచ్చు
సభా సదుల విజ్ఞత గోతిలో విసరబడీ
ప్రజాస్వామ్య హృదయం చెల్లాచెదరవుతూంది

ఇదొక సంక్షుబ్ధ సమయం
విలువలకు విషమమైన ఘట్టం

❁

(ఇటీవల హింసతో భగ్నమైన సమాజ దృశ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసింది.)

30. బ్రతుకు యంత్ర సమం కాదు

మనిషి బ్రతుకు యంత్ర సమం కాదు, అవదు
వెనక నుండి మనసు పాత్ర ఎప్పటికీ సశేషంగా
సంక్షోభంలోనూ సమయం గడవక తప్పదు
భయానకంలో బీభత్స కథల పాత్రలతో

నాలుగు దారులు కలిసిన సెంటర్‌లో క్లాక్ టవర్
తను చూచిన కథలను నింగికి తెలియజేసేను
నేల పైన ఇపుడెవరూ వినే స్థితిలో లేరనీ
గాలి! దిశల చెవులకు వార్తలు ఒలికించేను

శాసన బద్ధంగా అంతా చక్కగ ఉన్నా
వాస్తవానుభవంలో ఎవరి దారి వారిదే!

మరో ఉదయ కిరణ మంటే
ఇష్టపడని వారు ఎవరు?
మను ముందుగ చీకట్లను దాటాలిసి ఉంది
చెలరేగే అగ్నికి మూలం తెలియాలిసి ఉంది

రాత్రి వీధి స్తంభం వెలుతురులో
వాహనాల ముందు లైట్ల ఫోకస్‌లో
విలేకరుల ఫోటోగ్రాఫర్‌ల సందడి
తమ వృత్తికి ఆకర్షణ పెరగాలని
ప్రచార సాధనాల్లో ప్రముఖత చూపాలనీ
న్యాయ వ్యవస్థల పనులు తాము చేపట్టేరు!

ఈ గాయం మానే, ఆ దశ ఎప్పుడు వస్తుంది
ఈ గుర్తులు, మాసే ఆ స్థితి ఎపుడు వస్తుంది?

మానవ హారం ముక్కలయి చెదరిన స్థితిలో
మనసులో ఎత్తిన కత్తికి పూజలు జరిగేనా?

గగనంలో మిల మిల లాడే చుక్కలు
వెలిగించిన కొవ్వొత్తుల వలె నిలిచేను

శత్రుతతో సంహారం, వేదనలో ఆత్మహత్య
అదుపు లేని మనో వ్యథలు సాధారణమై
ఏ విషాద చర్యలకో దారులు తీసేను
ఏ వికార మతులకో పని చేకూరేను

నేల పైన చెదరిన ఈ విషాద జీవుల స్థితి
మౌనానికి పేరు పడిన శిలలను తలపించేను

ఇరువైపుల అంటిన నిప్పులతో సమిధల వలె
పట్టుకొనే వీలు లేని క్షణాలు! విషమంగా

మారణ చర్యలు సభ్య సమాజానికి తగనివీ
మనిషిలో బలహీనత సందు నుండి
అగ్ని బీజం! తల ఎత్తు తూంది
అది మొక్కై మ్రానై క్షోభకు గురి చేసేను

అనలానికి పైకి ఎగసి ఆకాశం తాకాలని
మబ్బుకు దిశ లావరించి చివరలు చేరాలని

ప్రతి కెరటం ఒక స్వేచ్ఛా రూపం
జలధి అయిన నది అయినా చెరువయినా
గాలి చేతులపైనే ఇది ముందుకు కదలేదీ
దేని విశిష్టత దానిదే! ప్రకృతి సంపదలో
సమాజంలోనూ విభేదించే స్థితి తప్పదు
అది అగ్నిమయంతో, మబ్బు అవసరం కలుగుతూంది

శుష్కమైన దగ్ధమైన స్థితులలో
ఆర్ద్రమైన పవన వీచి అవసరం!

31. వ్యక్తి అధీనంలోనే

హింసకు ప్రతి హింస సమాధానంలోకి రాదు
సమస్యలో సమ స్థితికి పెద్దవి మార్పులు తప్పవు

మనిషిని బంధిస్తే వైరం సమసేనా?
దోషిని ఉరి తీస్తే సమస్య తీరేనా?

చెడు నుండి వేరు చేయడమే లక్ష్యంగా
ఉద్రేకాలను నియతం చేసే దిశగా
సమాజ శక్తిని వీడని
మానుష కృషి ముఖ్యం

జరుగుతూన్న దుస్థితిపై ఏడుపు కన్నా
మానవీయ కిరణంతో ఊహ అవసరం

ఇల్లును చెట్టును దగ్ధం చేసే
అగ్నికి స్వేచ్ఛను కల్పించేరా?

దాహంతో విల విల లాడే
మనుషుల నందరినీ కలిపి
స్వేచ్ఛకు అవకాశం పేరుతో
బ్రతుకులు! ఎడారిలో దించేరా?
శూన్యమైన స్థితికి అప్ప జెప్పేరా?
సాటి మనిషి సంగతినీ మరచేరా?

రాబోయే మబ్బుల వాగ్దానంతో
ఆశల్ని అలంకరించి చూపేరా?

ఆ వచ్చే ఉదయం జన చేతనతో
సమ సమాజ నిర్మాణం లక్ష్యంతో
మనిషి మనిషిలో మానస పరివర్తనతో
ఆశయ సాధనలో అంకిత భావం రానీ!

అశ్వమయిన యంత్రమయిన పయనంలో
కాలం మాత్రం శక్తి ఉన్న వ్యక్తి అధీనంలోనే!

32. ఉస్మానియా శతాబ్ది సంరంభం

సమాజ వికాస ప్రకాశ చిహ్నం
ఉస్మానియా విశ్వ విద్యాలయం
విద్యాతృష్ణకు అమృత బిందు కలశం
విశ్వ మానవీయ జీవన చిహ్నం

కుత్‌బ్‌షాహి మొగల్ కళల కలనం
హిందు ఇస్లామ్ సంస్కృతుల మేళనం
గ్రీకు యూరోపియన్ కళా సంగమం
ఉస్మాన్ షాహి శైలిగా ఖ్యాతి గన్న నిర్మాణం

బౌద్ధ గుహా నిలయాల తీరు
కాకతీయ స్తంభాల అమరిక
సంప్రదాయ మూలాలతో ఆధునిక విస్తరణం
తీర్చబడిన విద్యా హృదయ స్పందనం

సమున్నత ప్రవేశ ద్వారం ఎదురుగ ఎంట్రెన్స్ హాల్
తళ తళలాడే ఫ్లోరింగ్‌తో ఆకర్షణ రూపం
నాలుగు వైపుల దారులు
రెడ్ కార్పెట్ పరచబడిన మర్యాదా గుణంతో
తరం నుండి తరానికి మారని స్వాగత ముఖంతో
మనిషిలో కళాభిలాషకు సమాచారణ రూపం

బహు భాషా భాషీయుల సుందర సంగమ నిలయం
సంస్కార గంధంతో గుణ సుందర వాతావరణం

లౌకిక సమాజంలో విభేదాలకు భిన్నంగా
విద్యా విభవంతో సరస్వతీ ప్రసంగ నికేతనం
వివిధ శాఖలతో హత్తిన ఆకులతో
మానవీయ తరు సుమ ఫల రుచులను అందించేను

బ్రతుకులు సార్థకమయ్యే సోపాన క్రమంలో
విద్యార్థుల క్రియా శక్తి ఆరోహణ దశలలో

పరచిన ఇంద్ర ధనుసుకు ప్రతి రూపం
వైవిధ్యంలో సమరస భావనతో స్నేహమయం

యువతకు దిశ చూపేను
నవతకు దశ తీర్చేను
విశాలావకాశాల ఆవరణంలో
యువ చేతన సంరంభంతో ఉత్సాహ వనం

క్యాంపస్ వెలుపల వైర భావ తంత్రంలో
నిప్పు రవ్వ లెగసి పోటీ పడుతున్నా
ఇది స్నేహ వల్లికతో పూల పందిరియే

కింది నుండి పైకి శ్రేణులుగా ఎందరికో
ఆరోహణ మార్గం ఒకటే
చేరే మజిలీలు వేరు

నలుమూలల నుండీ చేరిన బొగ్గు కణికలు
వజ్రపు తునకలుగా బంగరు ముక్కలుగా వెడలేను
పీలికలుగా వ్రేలాడే బదులుగా ఊహలు
పట్టు కండువాలతో అలంకృత మయ్యేను

ఉదయం వెలుతురులో కదలే గులాబీల వలె
రాత్రి వెన్నెలలో ఊగే మల్లెలవలె
క్యాంపస్‌లో నడచే విద్యార్థినీ విద్యార్థులు
గడచే కాలానికి సార్థక చిహ్నాలుగా

కంటికి ఇంపుగా మనసుకు ఇష్టంగా
ఉన్న ఊరు ఇల్లు వదలి ఇచట ముచ్చటగా
మస్తిష్కానికొక ఉపాయన రూపం ఈ నిలయం!

వ్యక్తిని గుర్తింపుతో సంఘంలో నిలిపేను
జీవన నిర్దేశంతో పరివర్తన సూచనతో విద్యాలయం

విద్యా కాంక్షా పరితాపంలో జ్ఞాన జలదం
శామన స్పర్శతో మతులను తీర్చేను

అధ్యయనం పరిశోధన వ్యాసంగానికి నిలయం
గ్రంథాలయం! నిశ్శబ్ద చేతనతో అమృత భాండం
పిన్నల నుండి పెద్దల దాకా భవనం
అనుభవాల చిత్రాలను మదిలో వదలేను

గుండె లయకు జతగా వాల్ క్లాక్
తిరిగే ప్యాన్ స్వరం జోరు వినిపించేను
ఉచ్వాస నిశ్వాసాల ఊయెలపై ప్రాణాలు
క్షణాలను చదువుల ట్రాక్‌పై నడిపించేను

ఈ విద్యా సముపార్జన సమయంలో క్షణాలు
నెమలి ఈకతో దువ్విన పరవశత నిచ్చేను
డైరి పుటలో ఏ రోజూ విద్యా కళామయం
వెలుగుల జలపాతంలో మనసుకు ఈదిన అనుభవం

తెలియని తనం నుండి తెలిసిన తనానికి యానం
స్వేచ్ఛా వాతావరణంలో విశ్వ భావనామయమై

జన పద మూలాల నుండి వెడలిన అంకురాలు
పూలతో పండ్లతో నగర భాగ్య సంపదలయి
ఇచట కనిపించే వారందరు విద్యార్థులతో
గురువులు విజ్ఞానులు సుశిక్షితులు సహకారులు

ఈ పూల తోట నుండి బయట పడిన వారు
కాలం మెడలో వాడని పూల దండలయ్యేరు

తమ తమ బ్రతుకులలో సంధి దశను
తలపై మర్యాదా చిహ్నంతో దాటేరు
తమ జీవన నిలయాలను వెలిగించే ఆశలతో
దూర దూరం ప్రభావాన్ని చిమ్ముతూ వెళ్ళేరు
శ్రమ క్రమంలో ఎదిగిన వ్యక్తిత్వాలు
వెన్నెల నుండి ఉదయానికి భవితతో
ఆటలో బంతుల్లా సక్రియలో యువత ఎప్పటికీ
అపుడపుడు అలజడులు ఆర్భాటాలు లేకపోలేదు
టీ కప్పులో తుపానుల వలె వెలిపోతాయి

II

గడ్డ కట్టిన కాలాన్ని కరగించే తేజంతో
విజయం లక్ష్యంగా కదులుతుంది యువతరం

ఇచట ఎదిగిన వ్యక్తి స్థాయి నుండి జీవితాలు
సమాజ స్థాయిలో విశాలమైదానంలోకి చేరేను

భూమి పైకి జలాల్ని తెచ్చిన
భగీరథ యత్నంలో అంకిత భావంతో
ఎదురు పడిన నదిలో నావయై కదలాలనీ
గగన పథమయితే విమానమై ఎగరాలనీ
ఇలపై పలు తావుల్ని చుట్టి రావాలనీ
కోరికలెన్నో! యువతలో ఒకటొకటీ వరసగా

తీగెలా అల్లుకొనీ పూల ముఖాలతో
కాలానికి సరికొత్త శోభను చేకూర్చేరు
అనుకున్నది జరగకపోవచ్చు
అనుకోనిది జరగనూవచ్చు

ఆ సమయంలో కనిపించని భవితకు
మ్యూజికల్ చైర్ ఆటతో సమం, అవకాశం

కాల చక్ర భ్రమణంలో వివిధ దశలు
బ్రతుకులో తప్పని ప్రకృతి సమాంతరంగా

ఒక సమయం మబ్బు క్రమ్మి
ఉరుములు మెరపులతో జల బంధనం
భూమి తలంపై అననుకూల వాతావరణంలో
ప్రతికూల కాల భయంతో
బ్రతుకు తెరువులో పయనం పోస్ట్ పోన్ కావచ్చు

ఒక సమయం శీతల పవన వీచి
కత్తి అంచులా శరీరాన్ని స్పృశిస్తూ పోయేను

చూపు మేర మంచుచే దారులు కప్పబడీ
ఆటంక నిరోధాల కాల భయంతో
బ్రతుకు దారిలో పయనం పోస్ట్‌పోన్ కావచ్చు

ఒక సమయం మండే ఎండలతో
వడగాడ్పుకు నీడ పట్టు చేరే ఆరాటం
బాగా తగ్గిన తడితో ఎండిన గొంతులతో
ఎక్కడ లేని ప్రాణ భయంతో
బ్రతుకు బాటలో పయనం పోస్ట్ పోన్ కావచ్చు

అవకాశాలు తారు మారయినా
కోరిక నిలబడి నిటారుగా
అంతలో పూలతో నవ్వుతూన్నట్లు చుట్టూ
చాచిన కొమ్మల చేతులతో వసంతం
అందమైన దృశ్యాలతో పయనం సాగేనా?

గతంలో స్మృతులొకటొకటి జ్ఞాపకానికి వస్తూ
కాలం గడుస్తుంది! అందంగా! తమకు తెలియకుండా

హెచ్చిన వికాసంతో మెరుగులు దిద్దిన బ్రతుకులకు
ఈ విశ్వవిద్యాలయమొక శిక్షణ ప్రేరణ రూపం!
విద్యావేత్తలు పాలనా దక్షులు సాహిత్యకళామూర్తులు
కాలానికి రత్న ఖచిత స్వర్ణాభరణాలు
వాస్తవ రేఖలతో తీర్చబడిన ఆదర్శ రూపాలు
ఎవరికి వారొక స్వీయమైన వ్యక్తిత్వ శోభతో

లిప్త గడచి కొత్త లిప్త, నవ్యతపై అభిలాషతో
ఆధునికావసరాలకు పనికొచ్చే ఆలోచనతో
మనిషితో మనిషికి మనిషిపై మనిషికి ప్రేమను
జ్ఞాపకం చేసేను, ఈ మనోజ్ఞ విశ్వవిద్యాలయం

ఉత్సుక శిఖరంపై ప్రతిరోజు కొత్త అనుభవంతో
విశేష దృశ్యాలతో మానసిక శూన్యం నిండుతుంది
దూరం నుండి అమృత సూక్తం వినిపిస్తుంది

దగ్గరలో విద్యా రూపం తలపిస్తుంది
ఇది ఉస్మానియా శతాబ్దిలో
మనిషి కలకు సుందర వాస్తవం

ఇది పలు దిశల నుండి
భావ జాల ప్రసారాల సంగమ స్థానం
సంప్రదాయ కిరణ తేజంతో
ప్రగతి శీల శిఖల వెలుగులతో
స్వాతంత్ర్య కాంక్ష నుండి ప్రాంతీయ ప్రేమ వరకు
శక్తి ప్రదర్శనంలో విజయం చూచిన యువత!

చెలియలి కట్టను దాటని జలధి అలల వలె
విద్యా మర్యాదల సీమలలో వర్తన శీలురు

చదువులు పరీక్షలు తప్పని సరి వయినా
మధ్య మధ్య సమాజ బాధ్యతలు వహిస్తూ
ఉద్యమ సమయంలో అనల మనస్కులు
అధ్యయన వేళలో మౌన కుసుమ గుచ్ఛాలు

కన్నీరు జారినంత సులభంగా
చదువులు సాగని మాట నిజం
ప్రాణాలు పోయినంత వేగంగా
బ్రతుకులు పండని మాట నిజం

అపుడపుడు పిల్లల చేష్టలతో
కోలాహల ప్రపంచంలో యువత
ఎప్పటికీ విజయంపై అభిలాషతో
పొంగులెత్తి పొరలే ఉత్సాహ శక్తులు!

స్వేచ్ఛకు తలుపులు తెరవబడీ
అసమ విషమ దశలలో గుండెకు హత్తుకొనే
విద్యా వికాస మానవీయ తేజం! ఉస్మానియా

❋

III

మానవ మహదాశయాల ఆచరణంలో
కాలానికి తీర్చిన అందమైన ముఖం
ఈ ఉస్మానియా విశ్వవిద్యాలయం
సమాజ శ్రేయంతో కూడిన కళా విభవం

భవనం మెట్లు ఎక్కుతూ ఉంటే
మెట్టు మెట్టు కొక పావురమై
లిప్త లిప్త ఎగురుతుంది మనసులో
ఆలోచన ఒకటొకటీ వరసగా
నెమలి పింఛంలా విప్పారుతుంది
ఇపుడీ సందర్భం వంద కళల బింబం

పరిసరాల ప్రకృతితో స్నేహ సుందరంగా
కొత్త జీవ శక్తితో విద్యా బల సమూహాలు
కదలించే ఘటనలెన్నో క్యాంపస్ చరిత్రలో

స్వతంత్ర భావనతో "వందేమాతరం" నుండి
స్వేచ్ఛా పథంలో తెలంగాణ సాధన వరకూ
ఉద్యమ ఘట్టాల నినాదాలు! విజయ ధ్వానాలు!

అనుకూల స్పందనతో ఉత్సవ వేదిక అయింది
వ్యతిరేక చర్యలతో ప్రేరణ నిలయం అయింది
ఉత్తేజం ఉత్సాహం ఉద్రేకం ఉల్లాసంలో
సమయ సమయ తాండవ లాస్యాలతో గడచింది

లాఠీ దెబ్బలు తగిలిన శరీరాలు
పోటీ పరీక్షలు నెగ్గిన మానసాలు
పుట్టుకతో ఏర్పడిన విధి రాతల
విషమతలను సరిచేసే విద్యా నికేతం

భావ స్వేచ్ఛలో వాదాలను శబ్దించింది
రేకులు విప్పిన విశ్వ పద్మ హృదయమైంది

ప్రగతి పథంలో సాగే ప్రజాస్వామ్య లక్ష్యంతో
నిరాటంక పవనంలో పరిమళాలు తరలేను

నిట్ట నిలువునా దర్జాతనంతో ఉన్నత ద్వారం
తరతరానికీ ప్రవేశం వాగ్దానం చేస్తూంది
ఉదయం వెలుగులో హంసలా మురిపిస్తుంది
పగలు వెలుగులో తెరచిన పుస్తకంలా ఉంటుంది

హృదయ భాష మాట్లాడుతుంది అందరితో
రాత్రి తల్లి ఒడిలో భద్రతను వహిస్తుంది

ఒక సుందర కల్పనకు వాస్తవ రూపం ఇది
భవిష్యత్తు గమనానికి వెలుగు దారి చూపుతుంది
వికాస భూమికలో ఉన్మేషంతో నిరంతరం
ఇది జీవన మర్యాదల మనోజ్ఞ సంగమం

నూరు సంవత్సరాల ఆయువులో కాలం
విశ్వ విద్యా యజ్ఞంలో నూరు సమిధలు
మానవ జీవన స్థితులకు రక్షక రేఖలు
ఒకటొకటి అస్తితను పెంచే అమూల్యాలు

క్యాంపస్‌లో దారిన వరసగా గుల్ మొహర్
నడచే మనుషులపై పూలను రాల్చేను
హృదిలో ఆశయ రూపాలను తలపించేను
భౌతిక మానస సమతులనం కాపాడేను

తెలంగాణ నాలుగు మూలల నుండే కాక
పలు స్థల దేశాల నుండి ఎందరితోనో
నవ జీవన సంస్కృతి నిర్మాణం జరిగే
విద్యా విభాగాల విశాల శాలా రమణీయం

ఈ సమయంలో ఊహలు! విజయంలో
ఆశయ వేదికపై శిల్పాలుగ నిలిచేను
స్పందించే ఆర్ద్ర రసాంచిత హృదయంలో
విద్యా సమాజానికి శుభోదర్క సంకేతం

❁

చివరి మాట

ప్రతి కవికీ స్థూలంగా నయినా కవిత్వం గురించి స్వంత అభిప్రాయం దృష్టి కోణం ప్రయోజన రూపం ఉంటాయి. ఈనాడు స్వేచ్ఛా సమాజంలో తనవైన ఆలోచనలకూ రచనా పద్ధతులకూ ప్రత్యేకతలకూ అవకాశాలెక్కువ. వాటిని సంపూర్ణంగా వినియోగించుకోవడం జరుగుతూంది. ఈ కారణంగా వైవిధ్యం పెరుగుతూంది. కవిత్వానికి క్షేత్రం బహు విశాలతను పొందుతూంది.

కవి తనదయిన రచనపై ప్రత్యయం (Confidence) కలిగి ఉండడం సృజన విషయంలో తప్పనిదీ. ఇది ప్రేరణ శక్తిగా పని చేస్తుంది. ఇది కొన్ని సందర్భాల్లో అధికమై! అతిశయించి అహంకారం గానూ తలపించవచ్చు. ఏమయినా ఇది కొంత కవి మనస్తత్వంతోనూ ముడివడింది. తన రచన గురించి కవి అభిప్రాయానికి authenticity కారణంగా ఆదరణీయమవుతూంది. ఇది కృతి గురించి ఆలోచన చేయాలిసిన అవసరాన్ని సూచిస్తుంది. వర్తమాన విమర్శనా క్షేత్ర పరిధిని పెంచుతుంది. కవిత్వ విషయంలో అవగాహనకు బాగా తోడ్పడుతూంది.

కవిత్వంలో ముందుగా అనుభూతి ప్రసారంలో (1) శబ్దం ప్రభావం నెరపుతుంది. వెను వెంటనే (2) అర్థాన్ని అనుసరించి భావ జగత్తు ప్రత్యక్ష పాత్రను వహిస్తుంది. ఇది (3) అభివ్యక్తి విధంలో ప్రత్యేకత చేత ఆకర్షిస్తుంది. ఆపైన (4) ప్రయోజన శీలం తలపుకు వస్తుంది. మొత్తం మీద (5) దీని ప్రభావం దార్శనికత చేత మనసును elevate చేస్తుంది. అప్పటి వరకు తెలియని కొత్త విలువలతో ముద్ర పడుతుంది. స్థాయిని స్ఫురింపజేస్తుంది. ప్రమాణ రేఖల్ని పొందుతుంది.

ఈ ఐదు దశలూ ఏ కవిత విషయం లోనయినా పరిహరింపరానివి. స్పందనలో అనుభూతి బిందువు నుండి (1) వాస్తవికత (2) మానవీయం (3) ప్రయోజనం (4) లక్ష్యం (5) దార్శనికంతో అనుభవ దృశ్యం ఆవహిస్తుంది. నిలిచిపోతుంది.

అనేకమైన వాద వివాదాలతో సమస్యలతో చిక్కులతో ఉన్న సంక్షుబ్ద స్థితులు ఈనాటి కవిత్వంలో ప్రతిఫలించడం సహజం. ఈ నేపథ్యంలో కవి బాధ్యత పెరుగుతూంది. అభివ్యక్తి విషయంలో జాగరూకత అవసరమవుతుంది. సాధ్యమైనంత వరకు సృజనలో సంక్లిష్టత నుండి బయటపడే ప్రయత్నమూ జరుగుతుంది.

సామాజికం వైయక్తికం రాజకీయం ప్రపంచీయం దేని పాత్ర అది నిర్వహించడంతోపాటు నైతికమైన విలువలకు ప్రాధాన్యంతోనే ఇపుడు అనుభవంలోని ప్రజాస్వామ్య దార్శనికతకు ప్రయోజనం చేకూరుతుంది. దీనికి ఉపకరించే ఉత్తమ సాధనాల్లో పేర్కొదగింది స్వేచ్ఛా కవిత్వం. ఇది మనసును ప్రభావితం చేసే శక్తి కలిగింది. జీవితాన్ని మార్చే ఆలోచన కలిగింది. మనసుపై దీని ప్రతిఫలన గుణం వీటిని సాధిస్తుంది.

– మాదిరాజు రంగారావు

స్వేచ్ఛా కవిత్వం-77

ఇది జీవితం

రెండో భాగం

బ్రతుకులో కవితయై

మాదిరాజు రంగారావు

2017

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 77

IDI JEEVITHAM

(Second Part)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2017

పీఠిక
స్వేచ్ఛా రూపం

ప్రతి కవి తన కవితలో ప్రత్యేకత చూపాలనే యత్నిస్తాడు. తన దయిన మనో భూమికలో సృజన మూలం స్వతంత్రమైంది, ఉంటుంది. దీనిపై కొందరికి గిరి శిఖరం అందుతుంది. కొందరిలో నది ప్రవహిస్తుంది. కొందరికి పచ్చని చెట్టు లభిస్తుంది. ఒక్కొక్కరి ప్రయత్నం ఒక్కొక రూపంలో అవతరిస్తుంది. ఎవరయినా తాము కోరే విధంగా మరొకరి కవిత్వం ఉండాలనుకోవడం భావ్యం కాదు. అట్లా జరగదు. సృజన స్వేచ్ఛలోని చేతనచేత ఇది స్వచ్ఛందమైంది, స్వతంత్రమైంది.

ఈ చిన్న కృతిలో వస్తువు – విషయం అనుభవంలో కనిపించే సమాజం – జీవితంతో తీర్చబడినాయి. అనేక స్థితులతో కూడిన దృశ్య రూపాలు దృష్టికి వస్తాయి. కవిలో సృజనేచ్ఛతో కళాభిలాషతో తనదయిన స్వతంత్రమైన వ్యక్తిత్వ రేఖలతో ఏర్పడే దృశ్యాలు వివేచన కందుతాయి. ఈ ప్రాధాన్యం కారణంగా ఇది మనిషిలోని సహజమైన కొంత కాల్పనిక గుణంతో జీవిత వాస్తవాన్ని దర్శింపజేస్తూంది.

ప్రజాస్వామ్య విధానంలోని అవకాశాల్ని సద్వినియోగం చేసుకొనే ఉత్సుకత చేత విశాలత వైవిధ్యం విభిన్నతలతో ఈనాటి తెలుగు కవిత్వం పరుగులు తీస్తూంది.

వీటికి (1) సామాజిక (2) మానవీయ (3) జీవన విధాలు (4) ఉద్యమాలు వాదాలు (5) విభ్రాంత – విస్ఫోట – విపరీత విచిత్రాలు ఉత్ప్రేరకాలుగా కనిపిస్తాయి. ఇవి కవి అస్తిత్వంతో శబ్దానికి కొత్త అర్థ తాత్పర్యాల్నీ, కవిత్వ రూపానికి కొత్త దిశలనూ సంతరింప జేసేవి. స్వేచ్ఛా రూపాన్ని అన్వర్థం చేస్తున్నాయి.

ఎంత ఇష్టం లేకపోయినా కాదన్నా వాదించినా కవిత్వంలో కవి వ్యక్తిత్వం ప్రతిఫలిస్తుంది. ఇది సహజంగా జరిగే సృజన రచనలో పరిణామ క్రమంలో భాగం కవిత్వ గుణానికి సంబంధించి అవడంతోపాటు వస్తువుకు కూడ చెందింది కావచ్చు. లేకపోతే కవిత్వం యొక్క ప్రయోజనం సంకుచితమవుతుంది. వస్తువులో విషయ ప్రాధాన్యం చేత ప్రయోజనం విశాలతరమవుతుంది. పైశ్రేణికి చెందిన గొప్ప కవిత్వంలో దీన్ని స్పష్టంగా గమనించవచ్చు. ఈ సమన్వయం చేత కవితకు ఔన్నత్యం సిద్ధిస్తుంది. హృదయ స్పందనల్ని బట్టి ఆలోచనా చలనంతో రూపొందే శబ్దమయం కవిత్వం. సారభూతమైన అనుభూతి విశేషంతో కూడింది.

స్వప్నం, స్వప్నతుల్యం, అతీతం అనేవి కవిత్వంలో చాల పరిమితమైన పాత్రను నిర్వహిస్తాయి. కలల తోటలో పూల విత్తనాల్ని గుర్తింపజేస్తాయి. అనుభవాల మూలాన్ని చూపిస్తాయి. కన్నీటి చుక్క వెనకనూ అగ్ని కణం వెనకనూ ఉన్న మనస్తత్వ రూపాలను బయటపెడతాయి. హేతువును సూచిస్తాయి. వాస్తవ జీవిత సమాజ అస్తితలకు సహకారులు, పోషకాలు, ఉపస్కారాలుగా మాత్రమే పని చేస్తాయి. శబ్దం – భావం – అభివ్యక్తి ఈ మూడింటి సమన్వయ సుందరత చేతనే మంచి కవిత్వం వెలువడుతుంది. వస్తువు – విషయం – నిర్మాణంలో ఎన్నిక – ఎవరి ఇష్టం వారిదిగానే సృజనలో స్వేచ్ఛను కలిగి ఉంటుంది. ఈ మౌలికమైన అంశాలపై కవిత్వం అనుభవానికి వస్తుంది.

ఒక ముఖ్య విషయం నిర్దిష్టత లేని లక్ష్యంలో గమనం మాత్రం, పరిభ్రమణం మాదిరి అక్కడే చుట్టూ తిరగడం కిందికి వస్తుంది. దూది పింజల్లా ముక్కలు ముక్కలుగా చెదరే కలల సంకలనంతో కవిత్వంలో రూప సిద్ధిలో సమగ్రత, పూర్ణత లభించదు. యోజనలో సుందరత అసంభవం. స్థిరతకు అవకాశం లేదు. సావయవ శోభకు ఆస్కారం లేదు. అయితే ఇది మొత్తం మీద అక్కడక్కడ తత్కాలంలో వైచిత్రికి, విశేషతకు తోడ్పడుతుంది.

కవిత్వంలో అతీతం తాత్త్వికం అనేవి ఆ విషయ స్పృహ, స్పర్శ వరకు ఫరవాలేదు. ఎక్కువయితే కళను క్రింగేస్తుంది. కవిత్వం అవదు. తత్త్వ ప్రపంచనం అవుతుంది. అందువల్ల జ్ఞాతంలో ప్రకాశం వాస్తవంలో అనుభవం గురించి కవిత్వంలో ప్రాధాన్యాన్ని గమనించవచ్చు. ఈ స్థితి సంక్లిష్టత నుండి ముక్తం చేస్తుంది.

కవిత్వానుభవంలో ప్రవాహానికి అడ్డుపడే ఏ విధానమూ ఉత్తమమైన విలువలకు తోడ్పడదు. కత్తి మొనలపై అగ్ని శిఖలపై నడక తాత్కాలికమైందే, మానవ జీవితంలో వైచిత్రీ ప్రదర్శనం వరకే పరిమితమైంది. ఈ కృతి అనుభవంలో కనిపించే పరిస్థితుల్ని ప్రతిఫలించే దృశ్యాలతో కూడిన సృజన రూపం. ఇందులో సమాజంతోపాటు ప్రకృతి కూడా చోటు చేసుకుంది. మనిషి – జీవితం సమాజం ఈ మూడూ భూమి గాలి నీరుగా మనసుతేదో రూపంగా అవకాశం ఆకాశంగాను అన్వయ శోభను పొందాయి. ఈ స్వేచ్ఛా కవిత్వం తనదైన ఆవిష్కారంతో ప్రత్యేకతను కలిగింది.

సృజన స్వేచ్ఛలో కవిత్వం కవి స్వతంత్రమైన వ్యక్తిత్వ ప్రభావంతో నిర్మాణ రూపాన్ని పొందుతుంది. అందువల్ల ఈ ప్రక్రియకు కాలం చెల్లిపోవడం అంటూ ఉండదు. ఈ మౌలికాంశం దీని చిరంజీవిత్వాన్ని రుజువు చేస్తూంది.

– మాదిరాజు రంగారావు

1. <û“ $\Te <‘“ ÈjáT+

కవిత ఫోటో గ్రాఫ్ కాదు
వర్ణ చిత్ర పటం కాదు
శిల్ప భంగి అసలు అవదు
ఒక స్థితిలో అవుననిపిస్తాయి

సూర్యుడు చంద్రుడు చుక్కలు మబ్బులు
స్పశిస్తుంది! అర్థంలో కల్పన కవకాశంతో

విషయంలో వికసించిన మానవం
అక్షరాల అద్దంలో బింబించేను

సృజన మయం శబ్ద భవం కవిత
భిన్న భిన్న మైన రుచులతో
కవి కవిలో వేరు వేరుగా
అపూర్వమైన కొత్త అనుభవాలతో

చూపుల కందని శిఖరం చేర్చేను
చూడని జలాల లోతులు చూపేను

కవి ఫోటో గ్రాఫర్ కాదు
లోన వెలుగు చూపుతో మనీషి

పుట్టిన స్థలం నుండి పరిసరాలతో
గడచే తన జీవన రేఖలతో అస్తిత
చిత్రానికి శిల్పానికి శబ్దానికి అందనిదీ
పరిమితిలో రేఖల కొదిగిపోనిదీ

స్నేహం బంధుత పరిచయ స్థాయిలలో
రంగు రుచి పరిమళ కలన సమాజం!

ఎవరి భావ పథం వారిది
ఆ బ్రతుకున కది అవసరమై
ఎవరి సృజన జగం వారిది
దేని విలువ దానిది, దానితో జయం

2. కవిత మాట్లాడుతుంది

"నేను" అనే విత్తు నుండి సమాజ భూమిపై
ఆయువు అవకాశంతో! తరు రూపం తలపించినా
కవిత స్వప్న చిత్రం కాదు
ఇంద్ర జాల దృశ్యం కాదు

విషయానికి శీర్షిక మారిస్తే
లేని గుణం అబ్బదు! కొత్తగా
తలపై అమరిన టోపీతో
మతిలో ఊహలు మారిపోవు

ప్రతి సందర్భం వెనక హేతు క్రమంతో
ఏ అతీత శక్తికి అవకాశం లేదు

వచ్చిన కల తిరిగి రాదు
ఉన్నదాన్ని మరొకటి అందుకో లేదు,
చెదరి దూది పింజల వలె
గాలి లోన తేలిపోతుంది

వదలిన స్థితితో బంధం తెగి
సమయం గతమై పోతుంది
తివాచిలా పరచిన వర్తమానం
వెనక నుండి చుట్ట బడి గతమవుతుంది

బ్రతకడమొక అవసర వాస్తవం
స్వేచ్ఛకు నలు దిశల అవకాశంతో
ముఖంలో మౌన కళకు అర్థం విప్పారుతుంది
ఒకే కవిత! ప్రతి హృదయంతో మాట్లాడుతుంది

ఏకాంతంలో ఆరు బయలులో క్షితిజం
కవితను హృదయానికి హత్తు కునేను

ఎవరి హృదయం ఏ మాత్రం ఎడారి కానే కాదు
వివిధ కుసుమ ముఖాలతో జన సమూహ బింబం

3. ఆర్కెస్ట్రా రూపం

కవుల మనసు క్షేత్ర సమం
లోన పొరలతో ఒకటొకటి
నీరు ఖనిజ సంపద వలె దాగి
తవ్వి తీయ వలసిన వెన్నో! విలువైనవి

బ్రతుకున కాహారం మొదటి అవశ్యం
శ్రమ జనితం గానో ప్రకృతి సిద్ధంగానో
భుక్తి కై మొదలై శ్రమ రూపం
భాగ్యాలకు భోగాలకు కారణమవుతూంది

మట్టిలో విత్తు నుండి
మొక్క పైకి ఎదుగుతుంది!
మట్టి కణం లేని
సుమ ఫలాలు నింపుతుంది!

భూమి దారి ఇస్తుంది నడకకు
భూమి పంట ఇస్తుంది బ్రతుకును

స్వేద బిందు సిక్తమైన సేద్యంతో
శ్రమ భాగ్యం! అందరిదీ సమన్యాయంలో

సర్వం సహ భూమివలె కవి మనస్సు
ఎన్ని బరువులయినా హరువులుగా భరిస్తుంది
శిల కదలలేదు చెట్టు నడవ లేదు
ఋణిని తప్పుకోదు, మనిషి యాత్ర ఆగదు

భౌతికం మానసం రెండిటితో మనిషి
అవనిపై ప్రకృతినీ మనసులో ఆశనూ
గెలవాలని పొందాలని యత్నాలెన్నో
ఇది బ్రతున కొక ఆర్కెస్ట్రా రూపం! అవుతూంది

❁

4. కఠిన వాస్తవం

ఆ వచ్చే నీలి మబ్బుకు కథలెన్నో చెప్పాలని
ఉరుముతుంది మెరుస్తుంది! కురుస్తుంది ఉత్సాహంగా
దాని అర్థమేదో భూమికి బాగా తెలుసు
ఆ వెనుక నున్న హృదయ భాష మనిషికి తెలుసు

నేతకు తానొక గిరిలా ఉన్నతోన్నతంగా
నిశ్చలనంగా ఉండాలని కోరిక! బలంగా
మేఘం తనదయి బందీయై పోవాలని
రాళ్ళ మధ్య పచ్చదనం స్వంతమయి అలరాలని

ఎటు చూచినా చెట్లు! రాళ్ళు! కొండలు
జల వనరులు మాత్రం! ఎక్కడెక్కడో
శ్రమ జలం స్రవిస్తూ ఎంత దూర మయినా
ప్రాణం చివురించేందుకు పోవలసిందే

కవికి తానొక నదియై ప్రవహించాలని
ఎడారి ఎదురయినా శిల లెదురయినా దాటుతూ,
గ్రీష్మం తన చండతను ప్రదర్శించినా
జన దాహం ఆకలి తీరుస్తూ సాగాలని

కవి హృదయం ఎప్పటికీ స్పందన శీలంతో
నది కిరు వైపుల పరచబడిన చూపులతో

ఒక బాష్ప బిందువులో జలధి అంత వేదన
దీనిని వహించే విశాల శక్తి ఎవరి కుంది?
జీవన లహరుల తీగెలపై మోదమో! ఖేదమో?
నాద ఝరిని వినగల సూక్ష్మరుచి ఎవరికుంది?

నిప్పు సెగల తలలపై అడుగులు వేస్తూ పోయే
సాహస మెవరికుంది? ఒక జలదానికి తప్ప

స్నేహం! కలహం, మేలు! కీడు, స్వేచ్ఛ! బంధనం!
జంటలుగా మనసులో మౌలిక రూపాలెన్నో!
అవసరానికి తగినవి ఎన్నుకొనే స్వతంత్రం
ప్రయోజనంలో వివేచనం! ఆ మనిషి మనసుదే!

5. నిబంధనం - నియంత్రణం

గాలిని కోరని మనిషి లేడు
స్వేచ్ఛను కోరని మనసు లేదు
భౌతిక నిలయానికి గాలి అవసరం
మానస రూపానికి స్వేచ్ఛ ప్రధానం

నాలో మాటలు! పెదవి వెనక నుండి
బయట కొచ్చి కదలాలని గాలిలో
నాలుగు దిశలలో శబ్ద గుణం సీమలలో
సుందరతకు పరిమళాన్ని అందించాలని

చెలగే సుడుల నుండి బయట పడి
జలధి హోరులో ఊగుతూ తరలాలని
మనిషి ఆర్త స్వరానికి దూరం నుండైనా
బదులు మాట! వదలాలని నలు దిశలలో

పైన మబ్బులు కదలుతూ ఉంటే
కొండలు నడుస్తూ ఉన్నట్లు ఉంటుంది
కింద కొండలు నిలిచి ఉంటే
మబ్బులు నేలకు దిగినట్లు ఉంటుంది

వాస్తవ మొక తీరు కల్పన ఒక తీరు
దృశ్యాలొకదాని కొకటి ఎదురెదురుగా

ఒకరి దృష్టి మరొకరి దృష్టికి ప్రశ్నయై
రెండిటి మధ్య నలుగుతుంది "నిజం"

అన్నీ సహేతుకంగా జరుగుతూ ఉంటే
అతీతమో! దైవమో! భావన దేనికి?
ఊరటకా? ముచ్చటకా? కోరిక రూపమా?
హేతువు మారేనా? తమ ఇష్టం చెల్లేనా?

భద్రతకై గోడ, రక్షణకై తలుపు
ఉండాలని ఒకరు! వద్దని మరొకరు!
స్వేచ్ఛకు నిబంధనమొక అవసరంలో
గాలికి నియంత్రణ మొక అవశ్యమై

6.

కష్టంలో సమయ మొక కఠిన శిలయై
మనిషిలో ఉలి చేతికి అందాలనిపిస్తుంది
శిల్పం ఆ కళ కొక ప్రతినిధి కావచ్చు
ఏ అతీత భావానికొ చిహ్నం కావచ్చు

దీన గళం నుండి వెడలిన స్వరంలో
చీకటి అడుగుల ధ్వని స్పష్టంగా

బాధలో లిప్తలు జ్వాలలై ఎగసి
జలద హృదిని కోరుతుంది! భౌతికం

ఈ జీవిత వాస్తవం! కవితలో
ఎదురుపడే దృశ్యం! మానసికం

కిటికి నుండి నక్షత్రం ఊరట నిస్తుంది
రాత్రి చంద్ర బింబం అమృత మయం చేస్తుంది

అడవి నుండి సర్పాలను తప్పించుకొనీ
ఊరు చేరితే! చుట్టు కదలే మనుషులు
ఆ పాములే! నయం అనిపిస్తాయి
వాటి దారిన అవి వెళ్ళిపోతాయి

చెట్టు నుండి ఆకు వేరై మన గలదా?
మిగిలేదీ! చేసేదీ! మట్టిలో కలవడమే!

ఆకులోని వ్యక్తిత్వం అంతరించేను
ఆకులతోనే చెట్టుకు అస్తిత్వం!

కలహం ఎవరికీ ప్రియం కాదు
అది రణమై! అనలంతో రక్తంతో
కాలానికి మృత్యు కళను చూపేను
మానవతను మటు మాయం చేసేను

❁

7. భవిష్యత్తు మెరపులాగా

మనిషికి మిత్ర గణం మనుషులే కాదు
చెట్టు గుట్ట ప్రాణి ప్రతిమ గగనం
ఇంటి ముందు వెలుగు చూపే దీప స్తంభం
ఒకపుడు చుక్కలు, మరొకపుడు చంద్రుడు
కొమ్మపై పక్షి! ముంగిలిలో పెట్ డాగ్
మనిషి లేని శూన్యాన్ని మానసికంగా నింపుతాయి

ఉదయం వికసించిన వెలుగుల కమలంలా
దూర దూరం నుండి రవి బింబం ప్రేరణ రూపం!
కదలే వెలుతురులో మనిషి నీడ తోడుగా
కదలని చెట్టు నీడ అయితే ఆశ్రయం!

వెలుతురులో బయట పడే రహస్యాన్ని
సాగరంలో విసరి వేస్తే
అది అంతలో అలలపై తేలుతుంది,
అందిన పడవలో తిన్నగ జారుకుంటుంది,

క్షితిజంలో విసరి వేస్తే ఎవరికీ అందకుండా
అది పగలు దినమణియై దీపిస్తుంది
అది రాత్రి శశికళయై వెలుగుతుంది

బయట పడితే ప్రమాదకర రహస్యాన్ని
భూమి పొరలో పాతి పెడితే
చినుకు పడగానే అంతలో
మొక్కయై లేస్తుంది! నవ్వుతూ

కాలం ఎవరినీ ఏదీ కాదన్నట్లు ఉంటుంది
ఎక్కడి కక్కడ బంధం విడిపోతూ ఉంటుంది

అసలు కీలకం మెక్కడుంది
విత్తులోనా? మొక్కలోనా? నీడలోనా?
వర్తమాన ముఖంలో భవిష్యత్తు మెరపుతోనా?

❁

8. వాస్తవం వేరు

ప్రతిరోజు తూర్పున ఉదయ ప్రకాశం
తెరచిన వార్తా పత్రికలా పరచబడీ
జీవన గమనంలో దృశ్యాలను బింబిస్తుంది
అక్షర చిత్రాలతో ఇది సంక్షుబ్ధ సమాజం!

గిరి శిఖరం చేరిన మనిషికి
త్వరగా కిందికి దిగాలనిపించదు
అమరిన నిచ్చెనపై ఊహ కదలుతుంది
విమాన యానంపై ఆశ ప్రబలుతుంది

బ్రతుకుల కాధార మయిన క్షేత్రమిపుడు
మహా సౌధ పంక్తుల నిర్మాణంలో!
ఇది అడుగు జారి పొందిన పొరపాటు కాదు
ఈహ లెన్ని విధాలో! భాగ్యమన్ని రకాలు

అవసరాలకు మీరిన బహు వస్తు చయంతో
విపణి విభవ జలధిలో మునిగి తేలుతూ
చేపల వలె ఈదేరు! ఒడ్డు నుండి ఒడ్డుకు
జలతలాన నావల వలె బ్రతుకులు సాగేను

పగలంతా ఏ పనిపై ఎక్కడ తిరిగినా
రాత్రికి తమ నిలయం రావలసిందే
భద్రత రక్షణతో పాటుగ
అనుబంధంలో హ్లాదం! పరితృప్తిగా

గ్రీష్మ తాపంలో హిమ శిఖరంపై
సూర్యరశ్మి! కప్పిన ఎరుపు శాలువాలా

శీత వేళలో అగ్ని పర్వతంపై
వెన్నెల! తీర్చి తెల్లని డ్రెస్ లాగా

బయటికి కనిపించే దృశ్యం వేరు
కనిపించని వాస్తవ రూపం వేరు

❁

9. పాఠం కూడా

ఊరు ఎక్కడికీ పోదు, మాయం కాదు
ఊరుతో ఊరు చేయి చేయి కలుస్తాయి
ప్రతి ఊరుకు చెప్పదగిన దేదో! ప్రత్యేకత
మనుషుల ఇష్టాలపై సమాజ బంధాలతో

కోర్కెల విస్తరణంలో ఊరుతో నగరం
జీవన గమనంలో తప్పని మార్పులతో
ఊరులో నివాసాలు నిశ్శబ్ద పరిసరాలతో
వేగంలో నగరం! కోలాహల రకాలతో

ఊరు వెలుపల ఇపుడు పనికి రాని కోట
మనిషి బ్రతుకులో ధైర్యానికి ఊతం!

మనిషికి మనిషిపై విశ్వాసంతో
ఊరయినా పట్టణమయినా విలువను పొందేను
ఇది సమాజ శక్తికి పునాది
దీని బలం పైనే ఆపై అంతస్తులు

అలలతో జీవ నదిలా స్థితులతో సమాజం
మనిషికై ముందుకు కదలే దృశ్యం!

ప్రవాహాన్ని చేరి దోసిలిలో నీరు గ్రహిస్తే
వజ్రాల హారంలా! ఆశను పెంచుతుంది
దారంలా సాగుతుంది! ధారలుగా జారుతుంది
తనదనిపించింది తనది కానిది అవుతూంది

ఇంద్ర ధనుసు నేపథ్యంలో కురిసే వానకు
నీలి తెర నేపథ్యంలో జారే కన్నీరుకు
తేడా తెలియని సందర్భం! కూడా ఉంటుంది

వాన చినుకులతో క్షణాలు ప్రవాహమయితే
కన్నీరు చుక్కలతో క్షణాలు ఏమైనా కావచ్చు
అనల కణాలో! పూల మొగ్గలో! మంచు బొమ్మలో!
ఇంటి ముందు చినుకులతో మొక్క
మొలవడం ఎదగడం అందమే కాదు! ఒక పాఠం!

❁

10. సగం సగం ఛాన్స్

నిశీధి అందం చంద్రునికి తెలుస్తుంది
ఏకాంతంలో బాగా అర్థమవుతుంది

ప్రేమికులకు హృదయ వశం అవుతుంది
నిష్క్రియులకు నిద్రాగతం అవుతుంది

నిండుగ పారే నీరుతో లోయలా రాత్రి
మనిషి మనసు నావలా పయనిస్తుంది

గాలి పాట! దిశలలో తిప్పుతుంది
ఇష్టంగా చూచే దెవరు? వినేదెవరు?

కొందరు భయం ఊయెలపై ఊగేరు
కొందరు మంచు గడ్డలా మౌనం వహించేరు

కళ్ళు మూస్తే రాత్రి ఎదురుగ నీల సముద్రం
కళ్ళు తెరిస్తే ఉదయం! ముంగిలిలో స్వర్ణ నిగమం
పూల బాణమై రావడమెంత సహజమో!
ఒక ఆయుధమై కనిపించడమంత వాస్తవం

కన్నీరు వెనుక నున్న సూర్యుడు కనిపించేందుకు
అడ్డంగా ఉన్న తెర తొలగడమవసరం

రాత్రి అయితే హ్లాదమయం చంద్రుణ్ణీ
ఉదయ మయితే రాగ యుతం సూర్యుణ్ణీ

లోనికి ఆవాహన చేసుకొనే
కోరిక ఎందరిలో? తీరిక ఎందరిలో?

పగలు వ్యాపకంలో మునిగిపోవడంతో సరి
రాత్రి నిద్రలో వాలిపోవడంతో సరి

తలుపు తెరవగనే మొదటి సూర్య కిరణంతో
సూటిగ బుల్లెట్ దూసికొని రావచ్చు

స్వాగతం బదులు నిష్క్రమణం జరగవచ్చు
ఆశకూ నిరాశకూ ఇపుడు! సగం సగం ఛాన్స్

11. తరం నుండి ఖజానా

ఇపుడు కవితలో ఆలోచన ఏకాంత యుతం కాదు
సమూహాల నుండి ప్రపంచ సమాజాల వరకు

మనిషిలో ఏదో ఏకాంత నిలయం తప్పదు
నిశ్శబ్దంతో వెలిగే దీపంతో రాత్రి గదిలా
వెనక నుండి తలుపులు తెరచిన ఇల్లులా
జలధిలో గుప్తంగా నిలిచిన సబ్ మెరిన్‌లా

పొద్దెక్కే కొద్దీ మారే స్థితి గతులతో సమయం
కొత్త కొత్త చర్యల తొడుగులతో కదలుతుంది

ఉదయం నుండి మరో ఉదయానికి మధ్య
సమాజ కథలో భాగమయిన జీవితం
అనుక్షణం శూన్యానికి దృశ్య రూపమిస్తుంది
వ్యక్తి శక్తి క్రియలో సంఘ శక్తి అవుతుంది

మనిషితో పరిచయం ప్రతిసారి ఏదో కొత్తగా
చీకటి సిరాతో రాసిన అక్షరాలతోనో
నెత్తురు సిరాతో రాసిన అక్షరాల తోనో
మరో రంగులోనో అర్థం! మనిషి మనిషికీ భేదం

కలహం మానవ శక్తిని వ్యర్థం చేస్తుంది
స్నేహం సమాజ శక్తిని సార్థం చేస్తుంది
భయం ముంచుతుంది, ప్రేమ తేల్చుతుంది
మనసు మాత్రం నిటారుగా ఆశతో వెలుగుతూ

ప్రవాహంలో గగన దృశ్యంలా సంఘంలో బ్రతుకులు
జన సమ్మర్దంలో కలిసి పోయి అస్తితను మరచేను

గాలిలో ఎగిరే పక్షి జాడలు కనిపించవు
నీటిలో ఈదే చేప గుర్తులు కనిపించవు

భూమిపై వదలిని మనిషి ముద్రలు విలువైనవి
తరం నుండి తరానికి చేరే ఒక ఖజాన!

❁

12. సృజన ప్రపంచం

ఎక్కడ ఆయుధ శబ్దం వినిపించినా
అది నా మాటలో సుడులు తిరుగుతుంది,
మృత్యువు తన హేలను చూపగ చూస్తుంది
ఎప్పటివో! ఇప్పటికీ! నీలి బొమ్మలై

ఉదయ మదే! రాత్రి అదే! రోజులవే!
వినిపించే మాటలు! ఎప్పటి కపుడు కొత్తగా
కనిపించే జన కలనం సరికొత్తగా
పాత నుండి కొత్తకు జీవన రుచితో!
మానవతకు లేదు, దేశ కాల స్థల భేదం

బ్రతకడమంటే ఊపిరి డోలికపై
ప్రాణం హాయిగ! ఊగడమేనా? కాదు
సమస్య లెన్నో! పన్న బడీ ఒకటొకటీ

అద్దంలో ముఖమూ బింబం వేరు కావు
బ్రతుకు నుండి మానుషం! వేరు కాదు

జననంతో సిద్ధంగా ఉన్న ఖాళీ పటం
బొమ్మలతో నింపడమే జన వ్యవహారం

మనిషికి రోజులు మెట్లయి ఆరోహణలో
బ్రతుకు తెరువు పోటీలో ఎప్పటికీ! నిలిపేను

మెరపు మెరసి జ్ఞాపకాన్ని ఒలుకుతుంది
ఉరుము ఉరిమి భయంలోకి దింపుతుంది

ఉదయం చూచేందుకు
రేపుపై! అనుమానంతో పని లేదు
కాలం గడచేందుకు
నేడుపై, అధికారంతో పని లేదు

గాలిని ఊదే పెదవులపై జడ రూపం వేణువు
చేతులలో వేళ్ళకు పనిలో జడ వస్తువు వయొలిన్

వినిపించే స్వరంలో సంవేదనతో హృదయం
కవితలో పదం వెనక! సృజన ప్రపంచం!

13. స్వేచ్ఛా పదం

ఇది ఆగని స్వేచ్ఛా పదం
ఇది అందరి స్వేచ్ఛా జగం
ఇచట చెప్పదాని కెంతో ఉంది
ఇచట చేయదాని కెంతో ఉంది

శక్తులతో యుక్తులతో ఘన కార్యాలెన్ని జరిపినా
ఒక సందర్భంలో నిస్సహాయ భూమికలో
ప్రేక్షక పాత్రను వహించేను మనిషి
తెలియరాని వెన్నో! చేయలేని వెన్నో!

అనుకోనిది సుడిగాలి తుఫాను ఉద్వేగం
ఉన్న స్థితిని సంక్షోభంలో దించేను

ఆలోచన కొక ఆకృతి నిస్తుంది పదం
పద పదంతో కవిత! అంత వరకు లేనిది
ఒంటరి తనం నుండి విడి వడి కవి
సంఘంతో మాటలాడుతూన్నట్లు ఉంటుంది
పసిడికి తానొక ఆభరణం అయ్యేందుకు
ఒత్తిడికీ వేడికీ గురి కావలసిందే!

ఉద్యమ మయినా ఉదాత్త కార్యమయినా
కొండ బరువు బాధ్యతనూ
దాటరాని జలనిధినీ
ఎదురుగ నిలుపుతుంది సందర్భం!

విషాద ఘటనలో నెత్తురు దృశ్యం
సాయం సంధ్యా దృశ్యంతో ఒకటై
నిజం మాయ మవుతుంది! బీభత్సంలో
గడ్డ కట్టిన భయంతో మనసులు స్తంభిస్తాయి

చిన్న నుండి పెద్దదాక ఏ భేదం లేకుండా
పైకి రాని వాస్తవాలు తెలియని వెన్నెన్నో!

❁

14. పరీక్ష నుండి పరీక్షకు

భాష ఒకటి కాక పోయినా
మతం ఒకటి కాక పోయినా
దేశ మొకటి కాక పోయినా
వర్ణ మొకటి కాక పోయినా
అందరి మనసులు ఒక స్వేచ్ఛా వనం
వేరు వేరు సుమ ఫలాల జీవన నవం

ప్రేమకు చిహ్నం పుష్పం,
కరుణకు చిహ్నం జలదం
మనిషి మనిషికొక తనదైన ఎజెండా
పలు చర్యలు పాట్లతో అనుభవ రూపం!

హింసతో నెత్తురు చిత్ర మిపుడు
సంధ్యా క్షితిజం తలపిస్తుంది

గాయంపై గులాబి సుమదళంలా
వేదనలో పూర్ణ చంద్ర బింబంలా
విషమ శిలలపై సాగే నీటి అలల్లా
మనుషులలో మానవతా రుచిర మవసరం

కాలానికి తొడిగే ఆభరణం కాదు మనిషి
కాలం దశ మార్చేసే క్రియా శక్తి రూపం

ఉదయం దాక నిలిచే ఓపిక లేక
దూరంలో మంటను సూర్యునిగా తలచేరు

వ్యవహార పథంలో ఎవరి తంత్రంలో వారు
ఏదీ కాదనజాలని జీవిత దృశ్యాలే అన్నీ!
నిన్న రేపు కొనలతో వర్తమానం
ఇది జీవిత మనిపించే చేతన రూపం

రణం శాంతి మధ్య జీవన యానం
పరీక్ష నుండి పరీక్షకు నడిపిస్తూ నిరంతరం

15. అంతరంగ సాక్ష్యంలో

భూమిలో పునాది రాయి కనిపించదు తలపించదు
పైన ఆర్చి తీర్చ బడీ అందంగా నిలబడుతుంది
నిలయానికి స్థాయిని ఠీవిని అందిస్తుంది
కనిపించని మనిషి శ్రమను తలపిస్తుంది

చోటు నుండి చోటుకు మారే మనుషుల
కోరిక! ఎప్పటికీ భవిష్యత్తు భాగ్యం పైనే
దూరానికి భయపడితే లోతుకు జంకితే
ఎత్తుకు సంకోచిస్తే అది జీవిత మవదు

దాగిన రహస్యాలతో బయటపడే నిజాలతో
మానవ జీవిత మొక చిక్కు ముడుల మూట!
ఇది విప్పేందుకు జరిగే ప్రయత్నాలెన్నో!
దైవం దగ్గరి నుండి యంత్రంతో పని దాకా!

సుఖం బాధ, స్నేహం వైరం సమాంతర రేఖలు
రైలు పట్టాల వలె, దారికి వైపుల వలె తప్పనివీ

అంతరంగ రూపాన్ని అమ్మేదెవరు? కోనే దెవరు?
దాని అస్తిత తెలిసీ తెలియని స్థితిలో మనస్సు
దాని ప్రభావం అనుభవంలోనే తెలుస్తుంది
అసలు వస్తువు మాత్రం అందనిది, ఎప్పటికి!

సరసిలో అలలు చేతి కందినట్లు
తోటలో గాలి మేను తాకినట్లు
మంచు శిలలో నీరులా రహస్యం!
ఇది ఒక వివేక కిరణం తోనే సాధ్యం!

వివేక మున్న వ్యక్తి దీన్ని అమ్ముడు కొనడు
కోరిక కలిగే దెవరికి? ముందుకు వచ్చే దెవరు?

అంతరంగ సాక్ష్యంగా ఆవిష్కారాలెన్నో!
అర్థంలో కవిత ఒకటి! ముందుకు దూకేను

❁

16. శ్రమ చేతనతో

పోయిన వారి ఆశను వచ్చిన వారు తీర్చేరా?
ఒక సమస్య తీర్చబడితే మరో సమస్య పడుతుంది
మనిషి మనిషితో తరం నుండి తరం కొత్త ముడులతో
తప్పని ఈ వ్యవహారంతో ప్రతి ఒక్కరి జీవితం!

తనలో కోరిక కోపం చతురత హద్దులు దాటే
భేదాలను కలహాలను శత్రుతలను ఆపే దెవ్వరు?
దారిన నడిపిస్తుంది స్వేచ్ఛ! స్వతంత్ర పథంలో
సందర్భంతో పాటు సంకల్పం! శ్రమ చేతనతో

ఇది మేకుకు వేలాడే దుస్తుల వైనం అవరాదు
అది ఒకరిని విసరేసే ఎగరేసే తుపాను కారాదు
చక్రంలో తిప్పి వదలి వేసే సుడిగాలి! వీచరాదు
ఎదురు పడిన ముఖంలో చిరునవ్వును మాపరాదు

ప్రశ్నించే వ్యక్తితో అంటించిన మంటలతో
ప్రశ్న అంటే తెలియని వారు బూది అయ్యేరు
దేవతలెక్కడనో! విన్నపాలు వినేరనే నమ్మకం
ఫలితం మాత్రం! పోస్ట్‌పోన్ అవుతూ పోతుంది

చెట్లు నడవాలని కోరిక! ఇది నెరవేరేది కాదు
కవితలోను కల్పనలో మాత్రమే సాధ్యం!
మనిషి జన్మ అర్థవంత మయ్యేందుకు
శ్రమ చేతనతో పాటుగ వివేచన మవసరం

అలలు వచ్చి చెరపేస్తూ పోతూ ఉన్నా
జలధి ఇసుక తిన్నెలపై! జాడలు మళ్ళీ మళ్ళీ!
తల క్రింద దిండు కాదు కవిత! హాయికి
తలలోని చేతనతో అనుభవ బింబం!

కల్పనలో అసంభవాలు భవిష్యత్తు దార్శనికం చేరేను
బ్రతుకులోని వాస్తవాలు వర్తమాన స్థితిగతులను పొందేను

17. బ్రతుకు విలువ

మంచి ఊహతో మంచి మాటతో మంచి పనితో
నిజ రూపం బింబించే చిరు నవ్వుతో
కాలాన్ని దాటేను మనిషి బహు సులభంగా
సముద్రమంత కష్టాలను నావలా
గగన మంత సమస్యను విమానంలా
ఏ యాగీ లేకుండా, ఏ ఏడుపు లేకుండా

చెల్లని నోట్ల వలె కలలు
మెలకువతో ఎగిరి పోతాయి

దాహం ఆకలి గురించి తెలియని వారెవరు?
ఎన్ని మార్పులు వచ్చినా బ్రతుకులోన మారనివీ!
ఇది ఎరగని దేశం లేదు, తెలియని ప్రజలు లేరు
బాధలతో వేదనతో వంచన పీడనతో బ్రతుకులు!

మనిషిలో ఈహలన్ని ఎప్పటికీ తీరనివి
రెక్కలపై ఆకాశం చుట్టి రావాలని
నీటి లోన మునిగి తేలి గట్టుకు చేరాలని
కాలి బాటలో భూమిని చుట్టి రావాలని

చేతిలో బరువు మూటను మరొకరు అందుకున్నట్లు
మనసులోని బాధను వేరొకరు అందుకోలేరు

సూర్యుని అస్తమయంతో
పడమర తలుపులు మూతపడినా
సూర్యుని ఆగమనానికి
తూరుపు తలుపులు తెరవబడీ!

ఆశకు చిహ్నం సంఖ్య ఒకటి నుండి
నిరాశకు గుర్తు "జీరో" అయినా
రెండూ కలిసిన రూపం తోనే
బ్రతుకు విలువ సమాజంలో!

18. కవితా నది

స్మృతిలో మేల్కొని కదలే ఆశా రూపం
నది! కనిపించని విశ్వాసాలకు సంకేతం
నదికి స్వాగతం పలకని హృదయం లేదు
రెండు చేతులు జోడించి దిగని వారు వేరు

మాలిన్యం తుడిచి వేసి శుభ్రత చేకూర్చేను
కుటిలత వదలించి రుజుత ప్రసాదించేను

కల్పనలో నది ఒక స్త్రీ రూపంగా నిలిచింది
ఆర్ద్రతచే చలనంలో చేతనచే హృదయంలో

ఆకాశం ప్రతిఫలించే రూపంతో
అమ్మను తలపిస్తుంది! పచ్చని కొంగుతో
మట్టిపైకి కనిపించని లోతులతో
క్షణ మాగని నడకలతో చిరాయువుతో

ఇది ప్రవహించే విధం! కంటికి
గగన విహంగాన్ని చూచి
పరుగెత్తే సర్పంలా ఉంటుంది
పరుగెత్తే రైలులాగ ఉంటుంది

ప్రతి నది కొక చరిత్ర
మనిషి బ్రతుకున కాకరమై
నదీ తీరాలలో తొలి మానవ చరిత్రకు
పరంపరా సంస్కృతులకు సాక్షీ భూతం!

తుపాను వస్తుంది! కలత చెందుతుంది నది
వేదనలో గళ రవం! వినిపిస్తుంది
జనావళిని సంపదలను కాపాడే యోచనలో
కల్లోల స్థితులను నిలుపుకో జూచేను
అడవులు లోయలు మైదానం నగరాలను స్పృశిస్తూ
సంస్కృతి గంధంతో, నాలో నది! కవితా రూపం!

19. దిశ తలుపులు తెరుస్తుంది

తెలుపు పసుపు ఎరుపు కలిసిన ప్రకాశంతో
నీలి రంగు అణగి దాగి సంశ్లిష్ట సమాజం
ఫేన సముద్రం! చిరునవ్వుతో కనిపిస్తుంది
అలల వలె తరలే ముఖ సమూహ దృశ్యం!

అడవి నుండి మైదానంలోకి పాడి పంట విభవంలో
చదరంగంలో పావులవలె రాజ్యంలో నేతలు

చీకటి డ్రెస్‌లో రాత్రిని గుర్తు పట్ట లేరనీ
కవితలో బ్యాటరీ పోకస్‌తో బయట పడేరు
మంటల చాటున ఉంటే తెలియక పోవచ్చుననీ
కవితలో పయోద సేచనతో బయట పడేరు

ముఖాన దాగిన సర్పం వడగ విప్పుతుంది
విష బిందు భయంతో విపద మెరుస్తుంది
ఉగ్రవాద తీవ్రవాద క్రూర నేర చరితలతో
అనిశ్చయం! అనుమానం! జరుగుతూన్న కథలో

రోజూ ఆహారం అందించే చేయిని
బోను లోని పులి నోట కరచు కొనీ
జంతువు క్రూరత ముందు మనిషి కరుణ వ్యర్థమై,
నిశ్శబ్దంగా తన లక్ష్యం సాధిస్తుంది

ప్రజాస్వామ్య నిలయానికి తాళం పడుతుందా?
కలలో కల్పనలో మాత్రం! విజయం కనిపించేనా?
జన వేదన తీరేది, ప్రజాస్వామ్య హృదయంతో
వేదిక అవుతూంది, ప్రేరణ అవుతూంది కవిత!

అభిరుచి తత్పర మతిచే ఈ కవిత
ప్రయోజన దిశ తలుపులు తెరుస్తుంది
వేలు పట్టుకొని గమ్యం చేర్చే దెవరు?
కర్తవ్యం బాధ్యత పదాలతోనే సాధ్యం!

20. ఇదే ఛాన్స్!

కీర్తి శిఖరాల కయి విలువలు తారు మారయ్యేను
బల చక్రం గతి, పైకొ క్రిందికొ తెలియదు!

కాస్త పై స్థాయి ఇంట్లో మినీ వస్తు శాల!
అక్కరతో పని లేదు, డంప్ చేయవలసిందే!
కాలం చెల్లిన వయినా! ప్రదర్శనలో మూల్గ వలసిందే!
క్రెడిట్ కార్డ్ పయి పరపతి కవకాశం వరకూ!

సంజయుని పాత్రలో ప్రసార మాధ్యమాలు
చేతిలో వార్తా పత్రిక కళ్ళ ముందు టెలివిజన్
ఉదయంతో భ్రమలో ముంచెత్తే ప్రచార సాధనాలు
దిశ నుండి దిశకు మనసును పరుగెత్తించేను
ఏది నిజం? ఏది కాదు? మంచు పొరలతో వాస్తవాలు
సంక్షుబ్ధ స్థితిలో సందేహ సమాజంతో! సంకీర్ణ ప్రపంచం!

మూసపోత వ్యవహారంలో పార్టీల పాత్రలు
సూపర్ రాజకీయాలలో నేతలు! అమ్మకానికి సిద్ధంగా
అధికారం ధన సంపద! త్రాసులో ఊగుతూ తూగుతూ
మనుషుల చర్యలతో బీభత్సం! తుపాను నయమనిపిస్తుంది

గ్రీష్మంతో పగలు వెలుగుతూ పోటీ పడుతూ
తగలబడే పంటల కుప్పల మంటల దృశ్యం!
ప్రజాస్వామ్య సమాజ నిలయానికి జ్వాలా తోరణం!
ప్రశ్నించే ముఖాలకు జవాబు బూడిదలో!

నవ నిర్మాణం పేరుతో ఏ రోజూ విధ్వంసం
మహనీయుల వేషంలో అదే! వికారమనో రూపం!

ఈ జన్మకిదే మంచి ఛాన్స్! బావుకునేందుకు
మళ్ళీ అవకాశం లభించేనో? లేదో? అన్నట్లుగా
మాటకు చేతకు మధ్య ఖాళీలో స్వార్థం!
ఈ యుగాన్ని స్వర్ణమయం చేసేమని ప్రచారం!

❁

21. శూన్యాన్ని నింపుతూంది

జన్మతో అందంగా చేరిన శిశువును సమాజం
చివరి దాక ఎదకు హత్తుకొనే ఉంటుంది
ప్రతి దశలో సహాయ పాత్రలలో మనుషులు
ఎప్పటికీ తమలో కలుపుకొని సాగేరు

చిరు నవ్వు ముఖాలతో ఒకరి కొకరు ఎదురుపడే
మనుషులలో హ్లాదం! ఉన్ని స్థితి మార్చేను
ఇది బ్రతుకున కనుకోని, అమూల్యమైన అలంకారం
విభాత కర స్పర్శతో మనసును అలరించేను

చుట్టు గోడ ఇల్లు ఆవరణం చెట్లు మనుషులు
అనుభవ రూపం! భద్రతకు అభయ వరం
ఇంతకన్న విశాలమైన క్షేత్రం బయట
పలు దారులలో మదిలో ప్రపంచాన్ని దింపుతుంది

గాలి ప్రాణ మిత్రమై, సంఘం చిరబంధువై
ఇరు వైపులతో కవితా రూపం నాలో
అతిథిగా వచ్చిన కవిత! ఆత్మీయ మయింది
పెరిగిన పరిచయం వీడ రాని దయింది!

ఎదురుగా ఉన్న రోజు! కవిత అవుతూంది
గడచిన రోజు స్మృతిలో వచనం అవుతూంది

కవితకు గుడ్‌బై పలకాలని గేటు దాక వెళితే
నవ తోరణమై కవిత శూన్యాన్ని నింపుతూంది

ఒక జీవన రేఖ సాగి అల్లుకొని చిత్రమై
ఆ రేఖల మధ్య వెలుగు ముఖంతో కవిత
రిహార్సల్స్ చేసి చేసి నాటక వశమై
నా మనసాక నటన వేది అవుతూంది

వస్తూ పోయే మనుషుల సందడితో
వాస్తవ లోకం దృశ్యం నా కవితా రూపం

ఆకలితో ఉన్న మనిషి కలలో, పరచిన ఎడారి కనిపిస్తుంది
న్యాయంకై వెలుగుతూన్న మతిలో, నవ బింబం కదలుతుంది

22. అల్పత అరచేతిలో

ఆ విషమ క్షణం
పాల బిందెలో విషపు చుక్క ఒలికినట్లుంది
దాటరాని సుడి గుండంలో పడి
శ్వాస కౌగిలిలో చివరి దవుతూంది

నిరాశలో క్రుంగిన మనసు లేవ లేకపోతూంది
మెరపు తీగె తొందరలో జరగరానిది జరిగింది
దీని ప్రభావంతో దేహం పనికి రాని దవుతూంది
పుష్ప గుచ్ఛమయినా కళల బింబమయినా
ప్రాణంతోనే బ్రతుక్కి ప్రయోజనం భాగ్యం

ఇక చీకటి రాత్రే రాత్రి!
ఒక్క నక్షత్రం కూడా కనిపించని సమయం

ఉరి వేసుకొనోపై నుండి దూకో మరో రూపంగానో
ఆక్షణంలో ఏది తోస్తే! ఆ విధంగా జరుగుతుంది
పరుగెత్తే వాహనం బ్రేక్ ఫేలయి! బీభత్సంలో
శక్తి నిలయం నుండి! జీరో స్థాయిలో వ్యర్థంగా

చూచే ముఖాలు దైన్యంలో బూది కప్పిన నిప్పులా
జాలిలో కదలి తేలి చల్లగ ఒడ్డుకు చేరేను!

జీవవంతమయిన అద్భుత శరీరం
పనికి రానిదై వదలేసే స్థితికి రావడం
మానవ వికాస చరిత్రలో రెడ్ లైన్!

రగిలే వేదన నుండి కంటి నీరుతో తడిసి
అర చేతిలో జారుతూంది విషాద సమయం!

కారణ మేదయితేనేం! ఇపుడు,
మహనీయుడనుకొనే మనిషిలోని అల్పతను
అరచేతిలో పెడుతూంది, కాలం
ధైర్య కవచమందించే బోధలేని, తోడు లేని స్థితిలో

❋

23. అక్షర కలహం

ఈ ప్రపంచాన్ని తమ తలపై వహిస్తున్నట్లు
ఈ సమాజాన్ని తమ బుజాలపై భరిస్తున్నట్లు
భ్రాంతిలో విభ్రాంతికి గురి చేసేరు
వాస్తవాన్ని ఇంద్రజాల దృశ్యంగా మార్చేరు

సన్మానం ఆత్మహత్య విజయం ఓటమి
బ్లాక్ ఎండ్ వైట్ అన్నిటిని ఒక గాటన
కట్టి తిప్పుతూ తిరిగే గానుగ రూపాలు
చోద్యంగా మార్చేరు, విచిత్రం చూపేరు

ముళ్ళు మేకులు గాజు ముక్కలు బ్లేడు తునకల్లా
అక్షరాల్ని నడిపించేరు ఆయుధ ప్రసక్తి లేకుండా
శబ్ద ప్రహారాలకు విగ్రహాలు ముక్కలయ్యేను
పసిడి వెండి లోహ ప్రతిమలు కరగి సరించేను

అక్షరాల బేహారులు, వ్యవహారోపదేశికులు
ఇతరుల వ్యక్తిత్వాలు! ఆహరింపబడేను క్షణంలో

రాజకీయ మొకటే కాదు సాహిత్యం కళలు సంస్కృతిపై
ప్రజాస్వామ్య హక్కులపై అనధికార శాసకులు!
తమవే తమకే అన్నట్లుగ మాటలతో ఆటలతో
రవి బింబం హారతి కోరే ఆకాశమంత ఆశతో

కలం చివర మొన నుండి మంటలు వదలేరు
పిడుగులు జార్చేరు, బాకులు వదలేరు
అవసరమైనపుడు మరొకరికి, పూలదండలు అల్లేరు

ముఖ మొకటే దిశ దిశ అద్దంలో ప్రతిఫలిస్తూ
అందరికీ అన్నిటికీ సిగ్నల్ సూచనగా మారేరు
లౌకిక శిక్షణలో ఆరి తేరి, నైతిక విలువల్లో డ్రాప్ అవుట్స్
వాస్తవాల ఎలుకల్ని పట్టే బోను లాంటి మస్తిష్కంతో
అనుమానం లేదు! నిస్సందేహంగా! అక్షర రణ మిసైల్స్!

24. తాళం వేసిన పెట్టెలో

ఆనాడు గాంధి జయంతి,
కారాగార పరామర్శకు మంత్రి ఆగమనం
అభివృద్ధికై తీసుకొనే చర్యలపై సమీక్షకై
పత్రికలలో టెలివిజన్‌లో అపూర్వ వార్తగా
అధికార గణంతో మంత్రి సమయానికి రానే వచ్చాడు
నలుపు ఎరుపు మధ్య తెలుపు గీతలా

ఒక గదిలో ఇనుప సువ్వల తలుపు దగ్గర
సమయంకై ఎదురు చూస్తున్న ఖైదీ
ఆ గది ముందుకు మంత్రి రానే వచ్చాడు
పరిశీలనలో భాగంగా అమాయకంగా

ఖైది ముఖం కాస్త ఎరుపు రంగుకు దిగింది
పాత బడిన నెత్తురు మరకలా
మంత్రి ముఖం అంతలో వెల వెలబోతూంది
అస్తమయం వేళలో చిట్ట చివరి క్షణంలా
అధికారు లేదో శ్రద్ధగా చెబుతున్నారు
మాటల అలలపై కాలం పడవలా కదలుతూంది

ఖైది మంత్రి ఇరువురి ఆలోచనలో గతం
ధూళి సోకిన అద్దంలో బింబంలా
కళ్ళ ముందు దూరాన వెలుగు తెరపై
నీలి రంగు బొమ్మలు! క్రాస్ అయ్యేను

ఇరువురి మధ్య ఎప్పటిదో ఘటన ఏదో
లోయలా నిలిచింది! పూడ్చే ప్రయత్నం తప్పనిదీ

రాజకీయ చతురతలో అమాయక మొక లక్షణం
జీవిత గమనంలో ఊహించని వాస్తవాలు! చిత్రంగా
వ్యూహంలో రహస్యం! అందరికీ తెలిసిందే!
అయినా తాళం వేసిన పెట్టెలో, భద్రంగా! దాచబడీ!

❁

25. చేతి కందే టవల్‌లా

నీలి మబ్బులు అతిథుల వలె కదలేను
జలధి తలం నుండి విచ్చేసి సరభసంగా
భూమి పయి దృశ్యాలను చూడాలని ఆరాటం

చిన్ని చిన్ని గుడిసెలపై మెరపు చూపులు ప్రసరిస్తూ
పెద్ద పెద్ద సౌధాలపై ధారా చేష్టలు ప్రచరిస్తూ
అడవిలో నయితే! తనివి తీర ఉల్లాసం ప్రకటిస్తూ

మనుషుల దాహం తీరేంత! వర్షం మాత్రం కోరేరా?
పొలం తడిసి విత్తేందుకు వానలు చాలు! అనేరా?
ఎన్ని పనులలోను పట్టరాని సంతోషానికి సందర్భం
జన జీవన రూపకంలో నాంది అవతరణం

కుండిలో మొక్కకు వానలతో పని లేదు
బ్రతుకులో ఆశకు వానల తోనే పని!

జీవిత మంటే ఇదే! హేతువు తలపయి పుష్పవనం
కోరిక ఏదయినా! పూలను ఎన్నుకో వలసింది తానే!

విలువ తెలిసి సంపద నిలువ చేసుకోవలసిందే
ఇది అవసర విషయం! జీవన భాగ్యంలో భాగం

శూన్యంలో నిండుగ ఆవహించి గభీర మేఘం
మోదమో! ఖేదమో ఏదయినా చివరకు తెలుస్తుంది

కిటికి ముందు కూర్చుని హ్లాదంలో మగ్నమై
కదలే మబ్బును చూస్తూ, నవ జీవన సంకేతం
అణువణువు కవితామయమై సమయం
మేఘు వాహనంపై కవి మనస్సు చరించేను

పక్క నున్న తోడు! సహేతు సుందరంగా
బుజం తట్టి చల్లారనున్న టీని గుర్తు చేసేను
వానలో తడిసిన మనిషి చేతికి టవల్‌లా
చిన్న హెచ్చరికను అందించేను ఆత్రంగా

❁

26. స్వేచ్ఛలో

ఎవరికి వారు తమకు స్వేచ్ఛ దక్కితే ఎన్నికల పేరుతో
గోడల్ని కూలగొట్టి! ఓపెన్ ఏయిర్ థియేటర్ చూపేరా?
అద్దంలో తమ ముఖాలు ఎంతో అందంగా
తమను చూచే మనిషికి అదే! లోపాల లోయలతో

తనకు స్వేచ్ఛ వస్తే విధ్వంస కాండ నుండి
సమాజాన్ని సంధ్యా చిత్ర శాల చేసేరా?
స్వేచ్ఛలో ఒకరి నొకరు హనన కార్యక్రమంలో
దహనం ఖననం చేసే వారికయి ఎదురు చూచేరు

స్వచ్ఛత కలుషితమై నీతి తప్పి, ఆశలు హద్దు మీరి
విలువలు పడిపోయిన సందర్భంలో, సంఘం సంక్షోభంలో
మాటకు చేతకు మధ్య నీలి రేఖ ప్రవేశిస్తుంది
పని నెర వేరే సాధనాల పయి ప్రభావం నెరపుతుంది

భూమి నుండి అంత రిక్షం దాకా మనిషి శక్తి
నాగలి నుండి మిసైల్ వరకు సాధించిన స్వప్న ఫలం!
సమాజ భావనలో హెచ్చు తగ్గు భేదం లేదు
ప్రపంచ హృదయానికి రెండూ సమానమే!

జీవన సంబంధాలు పెరిగి సీమలు మారేను
తప్పని కఠినమయిన వాస్తవ రుచి మనిషిని తీర్చేను

ఈ జన్మకు! మంచి ఛాన్స్!
మళ్ళీ వచ్చేనో? లేదో? అన్నట్లు
ఆబలో పోటీ! స్పర్ధలో నిమగ్నం!
దీనికి శిక్షణ కూడా! జరుగుతూంది

కంటికి కనిపించని దేని కోసమో వెదకేరు
అది తమ అంతరంగంలో గుప్తంగా భద్రంగా

కవితలో స్వేచ్ఛ! ముస్తాబై బొమ్మలా నడవదు
అడుగు ముందుకే! సజీవమై! ప్రజాస్వామ్య లక్ష్యంతో

❁

27. గాలి కవితయై

గాలి నాలో ప్రాణదమై కదలుతుంది
బ్రతుకులో వాస్తవ కవితయై వెడలుతుంది,
గమనంలో గాలి వెనక్కి మరలదు
గతం అమాంతం తనలోకి లాగేనని!

మరణ భయం లేనిదీ దీన్ని
సమీపించ నీయనిది! పవనమే

ఆర్త స్వరాన్ని వేగంగా దిశలు చేరుస్తుంది
శోకంలో కరుణకు ఆకర్షణ ఎక్కువ!
తప్పుకు శిక్షను అనుకోని విచిత్రాలను
ఆగని బాణాల్లా దిశలలో వదలుతుంది

కలహ స్వరంలో రణ స్థాయిని అందుకొనీ
మెరపు వెలుగు పలు వైపుల జనతకు చేరుస్తుంది
శాంతి కథను పూల రెక్కలపై తీసుకపోతుంది
నవ్వుల స్వరాల్ని ఆగి ఆగి నలువైపుల తరలిస్తుంది

గాలికి పగలు రాత్రి భేదం లేదు
రుతువు రుతువు కొక అనుభవ విధంతో
సున్నితమయిన ఉచ్ఛ్వాస నిశ్వాస స్థాయి నుండి
కఠోరమైన తుపాను స్థితి వరకూ! ఉండేదీ

బయటికి వెళితే! ఎంత దూరమయినా ఇల్లు
అనుబంధంతో ఎంతో దగ్గర అనిపిస్తుంది

రాత్రి వేళ బయటికి రమ్మని పిలుస్తుంది
నిదుర వశం అయ్యే! ఆ సుఖ సమయంలో
రోజూ స్పృశిస్తుంది! కదలిస్తుంది! బులిపిస్తుంది
నిశీథి అందం చూడాలని, తెలియాలని

చీకటిలో వెచ్చని ఆలోచన వెలుగై
మనసు కదలుతుంది గాలి మిత్రంతో

గాలి నాలో ప్రాణదమై కదలుతుంది
బ్రతుకులో మానవ కవితయై పలుకుతుంది

స్వేచ్ఛా కవిత్వం-78 & 79

ఇది జీవితం

(మూడో భాగం)

గమ్యంపై గురితో

మాదిరాజు రంగారావు

2017

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 78 & 79

IDI JEEVITHAM

(Third Part)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2017

Price : Rs. 30/-

Published by
RASADHUNI
Sahiti Parishath,
Shantinagar, Hyderabad -28.

For Copies :
Vishalandhra Book House
Bank Street, Hyderabad -68

Navodaya Book House
'X' Roads, Kachiguda,
Hyderabad - 27.
Ph : 040-24652387

Printed at
Sri Uday Printers
Narayanguda, Hyderabad.

పీఠిక

ప్రపంచంలో భౌతికమైన రూప పరిణామం ఒక విధం. సామాజికమైన వికాసం మరో విధం. వీటితో పాటు మానసికమైన చేతన ప్రభావం మూడో విధం. ఈ మూడిటి కలయికతో వ్యక్తి జీవితం – సమాజ స్థితి చక్కగా శోభావంతంగా ఉత్తమమైన విలువలతో రాణించాలని కోరడం సహజం. ఇవి ఎంత వరకు సాధ్యమవుతాయి అన్నది వేరే విషయం. దీనికి భిన్నంగా జీవితంలో అనుభవాలు ఎదుర్కోవలసి వస్తుంది. ఆదర్శంలోని ఆకర్షణ వాస్తవంలో అందకుండా పోతుంది.

జీవవంతమయిన ప్రతిదీ ఒక దశ నుండి శక్తిని కోల్పోతుంది. మరొకటి ప్రవేశిస్తుంది. దశదశలో తరం నుండి తరం యుగం నుండి యుగం నిరంతరం సాగే ప్రక్రియలో ఎగుడు దిగుడులు అనివార్యాలవుతాయి. కవిత్వంలోను మార్పులలో ఈ విషయాన్ని గమనించవచ్చు. ఈ దృష్టి సాహిత్య విమర్శకు నేపథ్యంగా ఉపకరిస్తుంది. వివిధ కారణాల వల్ల ఏర్పడే దోషాలు లోపాలు సవరింపబడుతూ మార్పులతో స్వేచ్ఛా వాతావరణం కొత్త దానికి మరింత వేగాన్ని అందిస్తుంది. వ్యక్తి స్థాయి నుండి సమాజ స్థాయి వరకు మార్పులు అనివార్యాలవుతాయి.

ఈనాడు వస్తూన్న కవిత్వం ఎంతో వైవిధ్యాన్ని కలిగింది. అనేకమైన సామాజిక రాజకీయ విధానాలు ప్రేరణలు పని చేయడం జరుగుతూంది. చాలా భాగం నిరాశ నిస్పృహ సందేహం సంక్షోభం విధ్వంసం హింస అశాంతికి సంబంధించిన భావ జాలంతో సింహ భాగం ఆక్రమించి ఉంది. ప్రతిదీ నెగటివ్ కోణంలో చూచే దృష్టి ప్రబలుతూంది. ఆత్మహత్యల దాకా పోతూంది. కవిత్వం అభిప్రాయ ప్రకటనల కూప్రచారానికీ మాత్రమే పరిమితమవుతూంది. దీని చేత కవిత్వం విశాలతనూ ఉన్నతిని లోతునూ ప్రయోజన వైవిధ్యాన్నీ కోల్పోతూంది.

స్వేచ్ఛగా వీచే గాలి సుగంధాన్ని తీసుకొని వచ్చినట్లే దుర్గంధాన్ని మోసుకొని వస్తుంది. ఎంత బరువయిన దయినా సరే! సమాజంలో హేతు దృష్టితో నెగటివ్ కోణం ప్రవేశిస్తుంది. దీన్ని గురించి విస్మరించే వీలు లేదు. అయితే దీని ప్రమేయం

హద్దులు దాటితేనే ప్రమాదం. స్వేచ్ఛ అనేది అన్నిటినీ సహించే శక్తి కలిగింది. కోరే మార్పుల కవకాశం ఇస్తుంది.

ఈ రచనలో నేటి సమాజంలోని వాస్తవ జీవన స్థితి గతుల చిత్రణం ఉంది. ప్రకృతి – సమాజం, మనిషి – జీవితం, ఆలోచన – చర్య, ఆదర్శం – వాస్తవికత, భౌతికం – మానసికం అంచులతో పూర్ణ రూపం ఆవిష్కృతమయింది. ఇక గమ్యంలో ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికతను కలిగింది. ప్రస్తుతం నెలకొన్న సంక్షుబ్ధ స్థితుల్లో సంశ్లిష్ట సందర్భాలలో ఇది ఉత్తమమైందిగా కవి అభిప్రాయం. స్వేచ్ఛా కవిత్వంలో ప్రత్యేకతను భావింపజేస్తుంది.

ఈ కృతి జీవితంలోని వివిధ పార్శ్వాల్ని స్పృశిస్తుంది. ఇవి మానవీయ భావనా మయమై కనిపిస్తాయి. అనేక స్థితులు భావ రూపాలతో ప్రతీకలతో కళాత్మకతను పొందాయి. అక్కడక్కడ తాత్విక స్పర్శతో వస్తువుకు పూర్ణత చేకూరింది. రచనలో విశాలతకు కారణమైంది. వర్తమాన తలంపై రచన ఆవిష్కారాన్ని పొందింది. వస్తువులో విషయ సూక్ష్మతలతో సామాజిక వాస్తవికత తాత్విక స్పర్శతో కవితా రూపాన్ని పొందింది.

ఇది తెలంగాణ ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంలో ప్రకాశితం కావడం సంతోషాన్ని కలిగించే విషయం.

– మాదిరాజు రంగారావు

ఇది జీవితం (మూడో భాగం)

1. కిరణం తాళపు చెవి

వెలుతురు పటం! పలువర్ణ చిత్రమయం
ఒకరొకరి జీవితం పోల్చరాని ప్రత్యేకం!

ఒంటరి స్థితి నుండి మనుషుల కలయికతో
కొత్త కొత్త తీరులలో మార్పులతో
భాగ్య రేఖకై సాగే కోరిక ఒత్తిడిలో
ఎంత దూరమయిన సహించేను మనిషి!

ఆరోహణ అవరోహణ సుఖమూ దు:ఖం
లాభంలో నష్టంలో మానవ సంబంధాలతో
వ్యక్తి బిందువు నుండి సంఘం అంచుల దాకా
ఆలోచన మనిషిలో మనుషుల గురించే!

అమృతం గురించి వినడమే కాని
దాని రుచిని చూచిన వారెవరూలేరు!
ఇది కల్పనలో ఆశామయ వస్తువైంది
మృత్యు భయం దూరం చేసే ఉపాయమైంది

మాటలో అమృతం పోలిన
రుచిని చూచిన వారు ఉన్నారు
మనసులో అమృతం వంటిది
పసి కట్టిన వారూ ఉన్నారు

మరొకటి అయినా! అన్నీ పోలికలోనే రాణించేవీ!
అసలు ఎవరికీ తెలియని అమూల్యం!

సరి పడిన మనిషి కనిపిస్తే, ఆ క్షణం
రెక్క చివర తలను స్పృశిస్తూ
కపోతి దూసినట్లు! అనిపిస్తుంది
సరి పడని మనిషి కనిపిస్తే, ఆ క్షణం
మేల్కొన్న సెగలు కదలుతూ
అడుగు నుండి పైకి సాగినట్లు! అనిపిస్తుంది

నిలయం చీకటి తలుపులు తెరచుకోనేది
ఒక సూర్యుని కిరణం తాళపు చెవితోనే!

❁

2. అస్తిత ప్రేరణయై

సమాజ సోపాన శ్రేణుల పయి ఆరోహణం
మనిషి ప్రతిభ ననుసరించి శక్తి ప్రకటనతో
భౌతిక మానస స్థాయిలో జీవితం
ఇవి కలిసిన రూపంతో ఆకర్షణ పెరుగుతుంది

పరుగెత్తే వీలు లేదు
మంద గిస్తే వెనకనే
విరోధం లేకుండా నిరోధం లేకుండా
అన్ని! కలిసి వస్తేనే పయనం సాగుతుంది

ప్రతి ఒకరు తమకు సాధ్యమయిన
మజిలీలు చేరుతూ పోయేరు
ఇవి జన హిత సుందర మయితే
సార్థకమవుతుంది జీవితం!

ప్రతి ఒకరూ మానసిక విధంలో
ఏదో ఒక వాహనాన్ని ఇష్ట పడేరూ
ఇది వారి స్వభావ రీతులకు తగినదయి
నిలుస్తుంది జీవితమంతా! సహాయకరమై

హంస గజం నెమలి అశ్వం యంత్రం
వాహన రూపాలెన్నో! మనోమయాలై

మనసు కోరుతుంది సుఖంకర యానం
భాగ్యంతో యశస్సుతో! జీవన పథంలో

సత్యం సౌందర్యం ఒకటి కావు
సత్యాన్ని కమ్మి ఉన్న పొర! సౌందర్యం
అంత శ్చైతన్యం స్పృహ ఉన్నంత వరకు
అస్తితయే ప్రేరణయై ముందుకు నడిపిస్తుంది

3. గమ్యం ముఖ్యం

పీఠం ఎక్కిన వ్యక్తి జీవితంలో తరచుగా
తన అంతశ్చేతన ప్రేరణ మరచేను
లౌకిక మర్యాదల విభవం తళుకులలో
బహిరావరణ జగం ఆకర్షిస్తుంది

బయటికి వేసిన రంగులతో
మనుషుల రీతులు మారేనా?
గజ్జె కట్టినంత లోన
నర్తన కళ అబ్బేనా?

దిశ దిశ కోణాలెన్నో? దారులన్ని!
గమ్యాలెన్నో! మనుషుల పయనంలో

జగత్తు ఎండ మావి కాదు, కల కాదు
పయనం ఆగదు, వాస్తవ తలమూ మారదు

మనసుకు వ్యాపకం జీవన వ్యవహారం
మనిషికి అవసరం సమాజ నిజ బంధం

మంచు గడ్డ నీరై సరించాలనుకుంటుంది
ఊపిరి అలలతో పాటగ తరలాలనీ
ఎగుడు ముందు నీరు నిలుస్తుంది
చీకటి తల వెలుగు నడ్డుకుంటుంది

ఎడారి అడుగున భూమి గర్భంలో
జల సంపద ఉందని తెలిసినా
విజ్ఞానంతో అప్పటి దాహం తీరేనా?
ఏ నూయినొ తవ్వే దాకా, ప్రాణం నిలిచేనా?

భ్రమణం కన్నా పయనం
మనిషిని గమ్యం చేరుస్తుంది

❁

4. అనుభవ దృశ్యం

జరుగుతూన్న సమాజ కథలో పాత్రల నిజాలు
మతిలో వెలిగే వివేకం తోనే కనబడతాయి
దీని వెలుగు లేకపోతే హృదయం
శుభ్రంగా తుడిచిన బ్లాక్ బోర్డ్!
కళ్ళ ముందు చీకటి! తడుముతూ పోయే స్థితిలో
ఆటంకం సందేహం ప్రశ్నలతో కాలం గడుస్తుంది

నల్లని బోర్డుపై చాక్‌తో అక్షరాల్ని
అదృష్టానికి ముడి పెట్టి మురిసే వారూ ఉన్నారు

మాట గాలిలో అదృశ్య మవుతుంది
అర్థం ఆలోచనలో విప్పారుతుంది
లో నుండి మాటలు! ఒకటొకటీ
రాలే పూలవలె అలరించ వచ్చు
ఎగసే రవ్వల వలె బాధించ వచ్చు
కొత్తదేదొ! పరిచయమైనట్లుగా ఉంటుంది

రాతలో పదాలు చుక్కల వలె
తళ తళ లాడుతూ మాట్లాడతాయి
మాటకు చిహ్నం వికాస దశలో లిపి
మానస సంస్కృతి రూపం, కవిత మనోజ్ఞం

ఈ చీకటి బోర్డు ఎప్పటికీ ఉండేదీ
ఎదురుగనొ వెనకనొ ఆ ఈ పక్కలనో!
కొండలు అడవులు జలధులు నదులు దాటుతూ
పలు సమాజాల అనుభవ సుందరతలతో
తప్పని సమూహాలతో వీడని దృశ్యాలతో
జీవన వాస్తవ రుచిలో తన రూపం వేరుగా
స్పందన హృదయంతో బయటికి వస్తుంది
తన అస్మిత ఎదురుగ నిలచినట్లుగా మనిషికి

తలుపులు ఎరగని ఈ విశాల సమాజావరణంలో
సంగ్రహ చిత్రం తన అనుభవ దృశ్యంతో సెల్ఫీ

5. నిజ నిలయానికి

ఈ రోజు అన్ని రోజుల వలెనే ప్రత్యక్షమవుతుంది
అయితే తెలుపు రేఖల మధ్య నీలి స్పర్శ మారుతుంది
పూర్వపు జీవితమయినా ఇప్పటి జీవితమయినా
నీతులవే! పలు భంగులలో హంగులతో అర్థంలో భేదం!

తీవ్ర వాది అయినా ఉగ్రవాది అయినా బాధామతి అయినా
మనసులో ఆరని అగ్ని శిఖల తోనే సమస్య
ఉదార మేఘుంకై ఎదురు చూచి విసుగెత్తేరు
ఆయుధ శబ్దం జలద గర్జకు బదులు కాదు

ఎదురు పడిన ముఖం మౌన ముద్రతో
మూసిన పుస్తకంలా ముచ్చటగా ఉంటుంది
ఎదురు పడిన ముఖం మాట విప్పితే
తెరచిన పుస్తకంలా హ్లాదంగా ఉంటుంది

పూవుకూ పండుకూ విత్తుకూ
సమాజ చలనంతో పని లేదు
పగలు చెట్లను చూస్తూ రాత్రి చుక్కలు చూస్తూ
మనుషులు జ్ఞప్తికి రావడం! మానస సహజం!

బయట మేఘం! దయాజలాలతో
లోన మనసు! కరుణ బిందువుతో
రెండిటి అవసరం! సమాజంలో మనిషికి!
భౌతిక మానస తీరుల సమన్వయంతో

బయట రాత్రి చుక్కలు! దీపాల్లా ఉన్నా
నేలపైన దారిని సరిగా చూపలేకపోవచ్చు!
ఇంట్లో దీపం రాత్రులు ధైర్యం నిలుపుతుంది
కంటికి కావలసిన వస్తువును చూపుతుంది

లౌకిక తంత్రంలో ఆరి తేరి బయట
రంగులు తొలగిన ముఖంతో ఇంటికి
ముడుల నుండి దూరమై సుడుల నుండి పైకి తేలి
సహజమైన మనసుతో, నిజ నిలయంలోకి

❁

6. విషాద శకలం

రాత్రిని ఒకరు వరించేరు
పగలును మరొకరు పొందేరు
రాత్రికి చెందిన వారు వినోదాలలో కలలో
పగలుకు చెందిన వారు బ్రతుకు బాట పయనంలో

సాయం సమయం అవుతూనే వాడిన కొమ్మలా
దిగువ రేఖపై పేదరికంలో శ్రమ ఫలమేదో
అదే! రోజు! చేతిలో పడవలసిందే
పక్షుల రెక్కల్లా రెప రెపలాడే నోట్లు! పైవారికి

కళ అయినా విపణి అయినా వ్యవహారమయినా
విలాసమయినా వినోదమయినా రాజకీయ మయినా
బ్రతుకును నిలిపేదీ మనిషిని నడిపేదీ ఏదయినా
రాత్రి దాటి తెలియని మరునాటికి పోస్ట్‌పోన్! అవుతుంది

తీరం తాకే అలల చప్పట్లతో జలధిలా
ఊగే మ్యూజిక్ కన్సర్ట్ హాలులో బాంబుల ధ్వని
పేలిన మారణ శబ్ద తరంగాలతో హాహాకారాలు
విషాద సంక్షోభంలో శ్రోతల పరుగులు హఠాత్తుగా
సమావేశ సుందరతను బీభత్స ముద్రలతో నింపేను
ఈ విషమ ఘడియ రహస్యం అందరికీ తెలిసిందే

మానవతకు షరతులు హద్దులు పనికి రావు
ఇది అమ్మ బడేది కాదు, కొన బడేది కాదు
అందరికీ చెందింది అందరితో ఆత్మీయమయింది
భూమిలా గాలిలా నీరులా రవిలా సమాజంలో

నెత్తురు మరకలతో శాంతి ముఖం మారుతూంది
కరుణ స్పర్శతో హృదయం విశ్వ బంధువవుతూంది
విషాదమయమై ఉగ్రవాద చర్యలతో! జన దృశ్యం
స్పందనలో మానవీయ కవితను పలికిస్తూంది

7. కరచాలనం

తేజంతో సూర్యుడు మనిషి ముఖం ఎత్తనీయడు
హ్లాదంతో చంద్రుడు మనిషి ముఖం దించనీయడు
నీడల ప్రసక్తి లేని వెలుగు గాథ లేదు
చీకటి లోయ ఎరగని వెలుగు కొండ లేదు

భయానికీ బాధలకూ గుర్తు అరణ్యం
అరణ్య కవచంతో బ్రతుకులు గడిపేవారూ
పయనంలో దారి ప్రక్కన జడమయమైన శిల
మనిషికి స్వాగత మిస్తుంది! కాస్త విరామానికి

రణం మాట పలకకుండ! రణ వాతావరణం
మనిషిని ఒక ఆయుధ మతితో తీర్చేను
చేతిలో లాఠీకి పని చెప్పే స్థితులు వేరు
బుజంపై రైఫిల్‌కు పని చెప్పే స్థితులు వేరు
బలం! సమాజ నియతికి అవసరమయినా
అమానుషం హద్దుమీరి నిందను పంచుతుంది

మేధ లోని ప్రశ్నలు! ఒకటొకటి జవాబుకై
గుహల నుండి ఆహారం కయి, పులులవలె బయటికి వస్తాయి
వీటిని కట్టడి చేసే తలపులు ప్రతి మదిలో
ఎప్పటికపుడు మనుషుల ఉపాయాలు మారతాయి!

కిరణంలా కవిత చీకటిపై గురి పెడుతుంది
చీకటి హద్దులు దాటి వెలుగుల సీమలు చుడుతుంది
నడచే కొద్దీ అనుభవ సోపానాలపై
తనలో కోరే జీవిత మిదేన! అనిపిస్తుంది

వీడే క్షణాన్ని పొందే క్షణాన్ని కలుపుతూ
ఉచ్ఛ్వాసానికీ నిశ్వాసానికీ మధ్య
కదలుతుంది కాలం! కరచాలనంతో అలవోకగా
తమ కేమీ పట్టనట్లు మనుషులు! తమ పనులలో

❁

8. పూర్తి పరిష్కారం

భూకంపం పెను తుపాను ఉదయంతో రావాలని
ఏ తీవ్ర వాద చర్యను ఎవరూ కోరరు!
ఘర్షణలో శత్రుత వైరుధ్యం రణ భావనతో
మనిషిని మనిషే పూర్తిగ మరవడమొక విషాదం

సూర్యుని ఆగమనం ఒక సమయానికి నియతం
తలచి నపుడు! ఏ రాత్రియె! కనిపించడ మసంభవం

ఎవరి కోసమో! ఏ తరువూ పూలు పూయదు
ఎవరి కోర్కె పైనో! పురోగమన పదం ఆగదు
ఎవరి విపద కోసమో! పుట్ట నుండి అహి వెడలదు
మానవ జీవిత లక్ష్యం! హింస కాదు హత్య కాదు

అడవి అయిన ఊరు అయిన నగర మయిన
విస్పారిన పద్మంలా మానుష కర్తవ్యంతో
సామాజిక భాగ్యం! జీవన పరిమళ రుచితో
వర్తనలు! అవే మూలమనో భూమికలు అవే!

ఎత్తిన పిడికిలి నిశ్చయ శిఖరం చూపేను
ముడిచిన పిడికిలి నీతికి రక్షణ అయ్యేను
బిగిసిన పిడికిలి బల సంసిద్ధత చూపేను
తెరచిన పిడికిలి శాంతికి తలుపులు తెరచేను

విసరిన ప్రశ్నకు పొందే జవాబు ఫలితంగానే
బ్రతుకు విలువ తెలిసేను తృప్తి రేఖ తోచేను

ఒకరిని ప్రశ్నకు గురి చేసే హక్కుతో
ఒకరికి జవాబు చెప్పే బాధ్యత కూడా

ఏ పద్ధతిలో పాలన ప్రశ్నల కతీతం కాదు
ఏ దార్శనికంలో దొరకదు! పూర్తి పరిష్కారం

ప్రకృతి వనంలో వివిధ తరు సుమ ఫలాల వలె
సంఘంలో బహు వాద ప్రసారాల ప్రభావ రూపాలు!

9. భ్రాంతిలో

చేతి నుండి మట్టి బొమ్మ జారి ముక్కలై
మళ్ళీ వాటిని కలిపే యత్నంలో పసి పిల్లలు
పగిలి ముక్కలు ముక్కలయి చెదరి పడిన
మనసును కలిపే కోరిక చూపేరా? పెద్దలు!

పాత పుస్తకాన్ని తీసి దుమ్ము దులిపి
పుటలు తెరిస్తే పోస్టు చేయని ఉత్తరం
జారి పడేను! స్మృతులను మేల్కొల్పేను
పోస్టు కాని ఉత్తరాల్లా! మరచిన పనులెన్నో!

ఆదర్శ సమాజానికి దారులెన్నో! వాదాలతో
మనో నిలయానికి దారులన్ని! దిశల నుండి

ఎప్పటికీ తెరచిన తలుపులతో లోనికి చేరే
ఉద్యమ కారులు! మేధావులు! అభిలాషులు! సామాన్యులు

గుంపుల కదలికతో విప్లవ లక్ష్యం నెరవేరదు
ప్రజలందరిలో చేతన తోనే! సమాజ విజయం
ఏ పక్షం చేతిలో సమాజం! మైనపు బొమ్మ కాదు
ఏ వాదం చేతిలో బ్రతుకులు! కీలు బొమ్మలు కావు

కర్షకులు! శ్రామికులు! వర్తకులు! ఉద్యోగులు
పలు వృత్తుల కవకాశ విశాలతతో ప్రజాస్వామ్యం!

ఉదయ వేళ తెలుపు స్వచ్ఛతతో మురిపిస్తుంది
పొద్దెక్కే కొద్దీ స్వర్ణ జగం! విలువలు పెరిగేను
పగలు ఎరుపు దీప్తి! ఉద్రేకం పెంచుతుంది
సాయం సంధ్య! బూది రంగు నిరాశ చూపుతుంది
రాత్రి నీలి సంద్రంలా! భయపెడుతుంది
ఉదయం రాకతో బ్రతుకుపై విశ్వాసం! పెరిగేను

ఆగని ఘర్షణలో హింసతో క్షణాలు
నలిగిన బ్రతుకుల్ని శిథిలాలపై నడిపించేను
పయనంలో దారిన తరలే అనల కణాలు
గులాబి పూల భ్రాంతిలో మనసును తిప్పేను

❁

10. కదలిక ఒక దిశలోనే

దేశభక్తి గుర్తుగ తను చేతులలో
జాతీయ పతాకతో నడచేరు, కొందరు
రుజువుకు తమ పాలంపై అద్దిన
నాలుగు సింహాల గుర్తును వహించేరు

విశాల రూపంతో గభీర హృదయంతో
ఉదార చరితతో ఉన్న మహాజలధి
దాహం తీరే నీటి చుక్క నీయగలదా?
నిరాశలో ఆత్మ హత్య మతి రూపం మార్చేనా?

ప్రకృతిలో పరిమితులు! మనిషిలో లోపాలు
వెనక్కి అడుగు వేయిస్తాయి! క్షీణత వైపు నడిపిస్తాయి

శత్రువుగానో మిత్రంగానో కాలం
మనిషికి ఎదురవుతుంది జీవితంలో
చేతిలో పదును కత్తితో ఒకసారి
చేతిలో పూల మాలతో ఒకసారి

మంటల దుస్తులతో రావచ్చు
పల్చని మంచు డ్రెస్‌లో రావచ్చు

ఎండకు వానకు రక్షణలో గొడుగులా
కష్టంలో నష్టంలో! మనసుకు మానవం

స్వేచ్ఛా మరణంలో ఆయువుకు గడువు లేదు
బాధలలో ఆ మృత్యువె! నయమనిపించవచ్చు
శ్వాస ఆడుతుంది కాని బలం తరుగుతుంది
ఆ దొరకే స్వేచ్ఛ ఒక అలంకారం కాకూడదు

సమాజ చింతనలో నేతల వ్యూహాల్లా
నీలి మబ్బులు కదలేను! నింగిలో
స్వేచ్ఛకు గగనంలో ఎంత వీలు ఉన్నా
మేఘం కదలిక అయితే! ఒక దిశలోనే!

❁

11. ప్రశ్న మరచి

నా రాక కయి ఎందరో ఎదురు చూచేరు
వేచి ఉండవలసిందే! విశేష సందర్భంలో
జేబులోనొ పర్సులోనొ చేర బోయే
బంగరు నాణెంలా అనర్ఘ రత్నంలా! సమయం

చిన్న పిల్లల వలె పెద్దలు ఇంట్లో తిరిగేరు
ఇది ఎప్పటికీ! జ్ఞాపకంలో కమనీయమైంది
మనసు కొక అమూల్య జీవన ధనమై
ఉన్న వాటికి తోడుగా అందమైన మరో బంధం!

శత్రువయినా! కొంతకాలం కనబడకపోతే
మనసు శూన్య స్థితిలో ఆరాట పడుతుంది
రోజూ కనిపిస్తే ఉద్రేకం మంట లెగయవచ్చు
ఎప్పటికపుడు మారే దృశ్యమయం జీవితం!

అంతా వేచి ఉన్న ఘడియ రానే వచ్చింది
ఆయువుతో జీవ శక్తి రూపంతో అద్భుతం!
తొలి చూపు కయి అందరూ ఆతురత పడేరు
నిశీథి చివరన ఉదయ కిరణం కయి తొందరలా
తొలి పలుకు కయి అందరూ ఎదురు చూచేరు
పక్షులు సయితం చెట్ల కొమ్మలపై నిశ్శబ్దంగా

ఇంట్లో మనుషుల సందడి! వచ్చే మాటకు స్వాగతంగా
మాటకు ఇంతగ విలువ ఉందని ముందుగ తెలియదు

తాపంలోను దప్పిక అవసరం లేకుండా
మబ్బు నీడతో చినుకు పడనున్న వాతావరణం

ఇపుడు గతం ఒదిగిపోయి
జ్ఞాపకాల అలలు అణగి
ఉన్నది ఒకటే అది నడకకు అవకాశం
ఎవరి ముఖం చూచినా ఈ సుందర సమయంలో
ప్రశ్న మరచి జవాబు చిత్రంగా వెడలుతూంది

12. వ్యక్తి స్వేచ్ఛ కోరుతుంది

ఎందరి ఇష్టంతోనో వచ్చిన వాణ్ణి
ఎందరి ప్రేరణ తోనో, నడచే వాణ్ణి
అందరి స్పందనతో కవితా పీఠంపై
అందరి హృదయంతో బంధుత ఒకటై

బాష్ప కణంలో ప్రతిఫలిస్తుంది ప్రపంచం
మోదం ఖేదం ప్రేమ కరుణ బింబాలతో
దోసిలిలో పడి సుమ దళమవుతుంది
నేలపైన జారి ప్రవాహ మూలమవుతుంది

ప్రతి ఒకరిని కలుపుక పోయే వెలుగులా
స్వచ్ఛమైన జీవన మర్యాదను పొందుతుంది

తరం నుండి తరం చేరే సంస్కృతి సంపదతో
వివిధ వర్ణ చిత్రశాల! ఈ జీవన రూపం
రుతువులన్ని కలిసిన అనన్య స్థితులతో
జీవన సందర్భాలెన్నో! మెచ్చేవీ! మెచ్చనివీ!

సమాజ సముద్ర తటం నుండి చూస్తే
ధూళి ధూమం సోకిన ఆకాశం, లఘువై
నీళ్ళలోకి శుభ్రతకై దిగినట్లనిపిస్తుంది
మండి మండి సూర్యుడు! దూకినట్లనిపిస్తుంది

ఆరడుగుల నేల చాలని చెప్పే వ్యక్తికి
అరవై గజాలయినా! చాలని స్థితి వస్తుంది
ఇది రాశి చక్ర భ్రమణంలో కాలం
సగమే! అని లోలోన గొణుగుడు!

ఊరు నుండి ఊరు దేశం నుండి దేశం
దాటరాని వన్ని దాటి తిరిగి ఊరులోకి

పుట్టుకతో పరిమితులు! వలయాలలో తిప్పుతాయి
ఎవరో గీసిన గీతలు! సూచికలయి నిలుస్తాయి
వ్యక్తి స్వేచ్ఛ కోరుతుంది! స్వతంత్ర మనో రూపం!

❁

13. శిల్పంతో సమానం

చూపుడు వేలు ఒకే దిశను చూపిస్తుంది
తన గుర్తుకు బొటన వేలు చెల్లుతుంది
మొదటి వేలు పని ఆరంభానికి చిహ్నం
రెండోది అనామిక విశేష ప్రతిపత్తికి మితం
మూడోది అన్నిటికి సాక్షిగా! దేకికదేగా
ఐదు వేళ్ళు కలిసిన రూపం సంకల్పానికి పీఠం
పిడికిలి విప్పారిన చేయి! ఆశీస్సుకు నవ పద్మం

నేల నుండి నింగి కెగరాలని కోరిక
విమాన యానంతో మనిషి తృప్తి పడేను
నింగి నుండి నేలకు దిగాలని మబ్బులు
కరుణ జలం జారుతూ సంతోషం మెరసేను

చినుకు పడుతుంది దున్నిన పొలానికే కాదు
తరువు చెరువు అడవి గిరి ఝరి అంతటా
తనపై చినుకులు పడకుండా మనిషి జాగ్రత్తలో
గూడతో గొడుగుతో టవల్‌తో ఆఖరికి చేతులతో

ఒక అనుభవం తరువాత మరొకటి
అందరికీ వివరణకు పని కొస్తాయి
ఎవరిలోను మార్పులేదు, తమ విభవం ముఖ్యమై

వ్యాదిని గుర్తించేందుకు ఒక్క నెత్తు చుక్క చాలు
మనిషిని తెలుసుకునేందుకు ఒక్క మాట చేత చాలు

మట్టి పొరల కింద నీరు పైకి కనిపించని నిజం
మనసు తెరల చాటున తెలియని రహస్యమెంతో

నీరు ఉన్న చోటికి వెళ్ళవలసిందే, తప్పదు
గాలిని పిలవ నక్కర లేదు, రానే వస్తుంది

ప్రతి నేరం వెనక హృదిని! గుప్తంగా బాడబాగ్ని
మనుషులు తమ దోషం! దైవం మెడలో వేసేరు

స్పందన లేని మనిషి! ఒక శిల్పంతో సమానం
అది విలువైనది కావచ్చు, మనిషిని తలపించవచ్చు

❁

14.

ప్రేమ లేని మనిషి మనసు
ఆకులేని పూవులేని నీడలేని
శూన్యమైన తరువు సమం!
జీవం ఉన్నందుకు బ్రతుకు గడుస్తుంది

తల ఎత్తి తిరిగినా
తల దించి నిలిచినా
మందంగానో వేగంగానో సమాజ చలనంలోనే
నిలవని సమయ ప్రవాహం తన చుట్టూ తిరగాలని

జలధి దాటి నేలపై అనుబంధంతో తిరుగుతూ
వదలిన పడవ గురించి, ఆలోచన అవసరమా?

దిశల నుండి విషాద స్వరం వినబడుతుంది
ఎవరి పనులలో వారు నిమగ్నులయి
ఇష్టంతో పని లేదు, మనసును తడుపుతూ
ఆర్తిపై సానుభూతి మనిషి నుండి జారుతుంది

పరిమితులు నియమాలు చుట్టూ చువ్వల వలె నిలిచి
ఇష్టంతో పని లేకుండా బంధన కవకాశం ఇస్తాయి

ఆరు బయలులో పైనుండి
మబ్బులు! కిందికి దిగాలనీ
మనుషులు పైకి ఎగరాలనీ
ఇది సాధ్యం! ఒక కవితలోనే

అమృత బిందువు ఒలుకుతూ
కవిత వెడలే వేళలో
ఒకటి రెండు తేనెటీగలు! అపుడపుడూ
మధురవంతో వస్తాయి తిరిగి వెళ్ళిపోతాయి

అమృతం గురించి విమర్శ మొదలవుతుంది
రుచిపై చర్చలతో విషయం మరుగున బడుతుంది

15. బయటికి కవితయై

ఉదయం తలుపు తెరచిన క్షణం నుండి
నిశీథి తలుపు వేసే క్షణం దాక
మనసు ఎదురు చూస్తుంది
కావలసిన రావలసిన మనిషి కయి

అవసరమై అందనిదై ఎత్తులోని ఆదర్శంపై
ఆలోచన! చర్చలు! వాద వివాదా లెన్నో!
ప్రతి దిశలో నిరీక్షణతో సడలని విశ్వాసంతో
అంతరంగం! బ్రతుకును ముందుకు నడిపిస్తుంది

పక్క నున్న నీడ ఎప్పటి కపుడు
గడచే సమయాన్ని దృష్టికి తెస్తుంది
కిందికి దిగిన నీలి మబ్బు మిత్రంలా
ప్రతి పనిలో చల్లని అండగా సాక్షిగా

చేతిలో వేణువుతో వీధిలో ఇంటి ముందు
మనిషి నాణెంపై కోరికతో నాదం వినిపించేను
పైనుండి ప్రకృతి దూత! నీలి జలదం
భూమిని సంతోష జలంతో తడిపేను

రావలసిన మనిషి కయి రోజూ
బస్ స్టాండ్‌లో రైల్వే స్టేషన్‌లో
ఓడ రేవులలో విమానాశ్రయాలలో
కాచి కాచి ఎదురు చూస్తూ మనిషి!

గ్రీష్మ తాపం ఎంతగ ఉన్నా
వచ్చే నీలి మబ్బుపై నమ్మకంతో
చెదరని ఆశ! భవితను కాపాడుతుంది

కావలసిన మనిషి కయి! ఎప్పటికీ
భయం పరుపుపై పడుకొని రాత్రులు
సుఖంకర మయిన కలలకు అలవాటయింది
కావలసిన రావలసిన మనిషి నిజానికి
అంతరంగంలో బందియై! బయటికి కవితయై

❋

16. గాలిలో దీపం

దగ్గరలో ఎగసే మంటలు! అరపులు!
మారణ ధ్వని కేకలతో మనుషులు! పరుగెత్తేరు
ఇది ఉదగ్ర చర్యలో ఉన్మాద విచిత్రం! కావచ్చు
కారణ మేదో తెలియని అయోమయం! వికలతలో

ఏదీ కాదనే వీలులేని! స్థితి అన్నిటికీవకాశంగా
ఏదైనా ప్రతి ఎదలో! మంటల ప్రతి ఫలనం
మానుష సహజ గుణం కారుణ్యం ఒలికిస్తూ
సుందర వాతావరణంలో మనిషి వికృతిని చూపుతూ

ఖేదం తనకు తాను మోసే పెను భారం
మోదం ఇతరులతో పంచుకొనే ఉల్లాసం

ఇసుకపై రాసిన రాత ఉండదు తెలిసిందే
నీళ్ళపై గీసిన చిత్రం నిలవదు, తెలిసిందే
గాలిలో మాట పాట! తరలిపోతుంది క్షణంలో
అయినా ఎవరికో చేరేనని అమాయకంలో నమ్మకం

ఒకరి మాట ఒకరికి బాధాకరం కానంత వరకు
ఒకరి చర్య ఒకరికి హానికరం కానంత వరకు
అమాయకంలో నమ్మకాన్ని ఉపేక్షిస్తుంది సమాజం
ఇది వ్యక్తి గతం ఖాతాలో జమ అవుతుంది

చెవులకు ఇంపా? బాధా? విసుగా? వ్యర్థమా?
అర్థమయినా కాకపోయినా ఇష్టమయినా లేకపోయినా
శిశువు! మాట్లాడుతూనే ఉంటుంది, ఒంటరిగానూ
కవిత! కూడ అంతే! వినబడుతూ ఉంటుంది

తెలిసి చేసే ఉగ్రవాది చర్యలు! క్షమార్హం కావు
నేరానికి శిక్ష! ఏర్పడి ఉన్నా! తలుపులు మూతబడీ
కంటికి ఎదురుగ ఏదీ కనిపించదు
వెనక్కి తిరిగితేనే! కనిపిస్తుంది!
న్యాయ స్థానాలలో సమస్య చిరకాలం సందేహంలో
నేరం రుజువు కాకపోవచ్చు, నిర్ణయం గాలిలో దీపం కావచ్చు

❁

17. అద్దంలో తన ముఖం

అవని సృజన ఫలం అందరికీ అందిస్తుంది
రుతువు రుతువు కొక విధం! ప్రకృతిలో వికృతి!
మనిషికి ప్రకృతితో చిరబంధం! కాపాడుతుంది
జీవన చలనంలో సుందరత కవకాశం! కలుగుతుంది

వెలుతురులో చెట్టు నిలిచి ఉండగా
చల్లని నీడ నెవరు అపహరించగలరు?

గగనంతో చెట్టు మాట్లాడుతుంది
మనిషికి సందేశం అందిస్తుంది

కింద పడి పగిలిన వస్తువు ముక్కలు
ఒకటొకటి కలిసేది కలలోనే కోరికపై
సగం పైన బ్రతుకు ఈ పనిలోనే గడుస్తుంది
మనిషికి మానసికంగా! తృప్తి మిగులుతుంది

కిటికి నుండి! పగలు జనం కదలిక! మాటలు
అదే! కిటికి నుండి రాత్రి! ఏకాంత స్వరం!
వినే వారికి వినిపిస్తూ గాలి లోనికి తెస్తుంది
ఇది మానస స్థాయిలో మనిషిని ఆకర్షిస్తుంది

పయనంలో ఎండమావులు చూపుకు తప్పనివీ
ఇవి లేనిది! నీరు విలువ తెలిసేనా?

గ్రీష్మంలో పరితాపం సహనానికి పరీక్షగా
వర్షంలో ఉత్సేకం పరితృప్తికి చిహ్నంగా
రెండూ చెరొక వైపు నుండి బంధు గణంలా
జీవన గమనానికి పూర్ణత నిస్తాయి

కవి మనసు నుండి కవిత! సమూహాలలోకి
చినగ కుండ చెదరకుండ మాయకుండ
నవంగా, సమాజ సార సంగ్రహ బింబమై
అద్దంలో తన ముఖం చూచి నంత మోదంగా

18. స్వేచ్ఛలో ముందుకు

మనిషికి భయపడి మనిషి తప్పుకొనీ
అడవి లోనొ గుహలోనొ దాగే రోజులు కావు
స్వేచ్ఛా పవమాన గుణంతో ఆరోహణలో
ఎదుర్కొనే స్వతంత్ర భావనా రూపం!

అనల కణా లెదురు పడితే
కారణ సహితంగా ఉపజ్ఞతో
నీల జలద కవచం ధరించేను,
సమయం మారుతుంది ప్రియ మిత్రంగా

ప్రేమ కరుణ రెక్కలపై ఎగసి మనసు
శాంతి సందేశంతో అందరినీ చేరుతుంది
బ్రతుకులో ఏదో విధంగా గెలుపుపై కోరిక
ఏదో మిషతో, రణ భావం వహిస్తుంది
ఎదుర్కొనే మనో బలాన్ని ఆలోచన వరిస్తుంది
వ్యక్తుల అస్తితలకు ప్రకాశ రూపం సిద్ధిస్తుంది

భయ కారణ మయిన పాము పడగపై
పురి విప్పి ఆడే నెమలిలా
పీడాకరమయిన పాముపై పట్టుతో
పైకి తన్నుక పోయే విహగంలా
చర్యకు ప్రతి చర్యలు మనిషిలో
దూసే కత్తికి ఎదురుగ డాలు నిలుస్తుంది

చరిత్ర పుటలో రహస్యం దాగక పోవచ్చు
స్వంతం చేసుకొనే ఆలోచనలో పాలకులు!
ఏ దారిన ఏ శత్రువు వచ్చేదీ తెలియదు
ప్రతి దారిని నియతం చేసే క్రియలో నాయకులు

ఇపుడు వ్యక్తి మనో జగం స్వతంత్రమై
స్వేచ్ఛలో ముందుకు సాగుతుంది నవంగా

19. ప్రేరణ రూపం

ఈ యుగం ఏ కొందరి హద్దుల నిలయం కాదు
అందరికీ తెరచిన ద్వారాలతో విశ్వమయం!
ఎన్నో ఊహలు చర్యలు రుచులు దారులతో
ఏర్పడిన సంశ్లిష్ట సమాజ సమాజం మార్పులతో

మనిషి ఎంత గొప్ప అయినా! అవసరంలో
పూలకై పండ్లకై కట్టెకై చెట్టు చేరవలసిందే!

విలపిస్తూ ప్రలపిస్తూ కోపిస్తూ శపిస్తూ
ఉన్న చోటునే కూర్చుని తీరికగా బండపై
విషమ స్థితిని నిందిస్తే! దరిద్రం తీరేనా?
ఎవరి పైనొ రాళ్ళు విసిరితే కోపం ఫలించేనా?

పుట్టింది మొదలు! తెరచిన కళ్ళ ముందు
కాల పటంపై కలిసిన రంగుల దృశ్యం
వస్తువులో రంగును విడదీసే దెవరు?
రంగుల కలయికతోనే! ఈ జీవిత రూపం!

రోజు ముగుస్తుంది! ఎప్పటికీ తేలని నిర్ణయాలతో
డబ్బుదా? పదవిదా? విలువలదా? సమస్య
ఇది ఎన్నటికీ తేలనిదీ మనిషిని పనిలో ఉంచేదీ!
ఇది తేలితే! మనిషికి రెక్కలపై ఎగరడమే తరువాయి!

ఆకలిలో రాత్రి గుడిసె ముందు పైకి చూస్తే
ఆకాశం పరచిన రొట్టెలా కనబడవచ్చు
ప్లేట్‌లో అన్నం లానో చంద్రుడు! తోచవచ్చు
జీవన వాస్తవ ముఖాన, మానస సహజం

జ్వాలా బింబాల్లా మండే హృదయాలను
ఏ చల్లని చేతులు! కప్పి దాచగలవు?
ఈటెల వలె దూకే చూపులను
ఏ తెరలు జారి! చాటు చేయగలవు?

అణగిన మనుషుల గుండెకు అమృత బలంతో
నిలబడ జేసే ప్రేరణ రూపం! స్వేచ్ఛా కవిత్వం

20. అప్పటి అవసరాతో

రంగ స్థలంపై పాత్రల మాటలు
ఆదర్శ భావనలో పూలయి మనసునలంకరిస్తాయి
యథార్థ జీవితంలో! దారిన కంటకాలు కావచ్చు
నీతిని మరపించి వెళ్ళే దారి వేరు చేయొచ్చు

చెట్టు నుండి కోరే మనిషికి
పూవు ఫలం నీడ దొరకుతుంది
మనిషి నుండి కోరే మనిషికి
ప్రేమ శాంతి సులభంగా దొరకవు

భూమిపై చెట్టు నడవ లేదు
గాలికి కొమ్మల సంపద ఆకులు కదలుతాయి
మనిషి ఎగర లేడు గగనానికి
పయనించే విధాలెన్నో! మారే పథాలలో

ప్రకృతిలో జీవ సూత్ర మొకటే అయినా
జీవన స్థితిలో దేని ప్రకారం దానిదే
మేధతో మనిషి అస్తిత్వం విశిష్టమై
ప్రకృతిపై తన ప్రభుతను నిలపాలని చూచేను

నేలలో విత్తు గతమై భవిత సుప్తమై
మొక్కలో వర్తమానం ప్రకటిత మయ్యేను
చెట్టు ఎదుగుతుంది శాఖలతో దిశలలో
ఆకు రాలుతుంది, స్మృతిలో గతమవుతుంది

క్షణం చిన్నదే అయినా మూడు దశలలో
కాలాన్ని వహిస్తుంది జీవన గమనంలో

కణ కణ లాడే అగ్ని కణం
ఆపై బూది అవుతుందని! తెలిసిందే!
రత్నమయిన రాయి అయిన
అప్పటి అవసరాలతోనే! ప్రాధాన్యం!

❁

21. స్వేచ్ఛకు అవకాశవాది

అరణి నుండి అగ్ని మొదలుగా జీవితాన
న్యూక్లియర్ శక్తి వరకు మార్పులెన్ని జరిగినా
ప్రతి దశలో మానవ చరిత్రలో
అవే! మనుషుల మనో గుణ భూమికలు

ప్రేమ కరుణ సహనం వైరం స్తంభాలపై
జీవన నిలయం! అడుగు నుండి పై వరకు
స్థాయికి తగిన విధంగా తీర్చబడి
వివిధ వస్తు ప్రదర్శనగా మారుతుంది సమాజం

కనిపించిన ముఖంలో చిరునవ్వుతో
దోషం కనిపించకుండా తెర వెనుకకు వెళుతుంది
బయట పడే గుణం సుమం విప్పారుతుంది
మాటలో అర్థం వికాస శోభ పొందుతూంది

పెంచిన జంతువు విశ్వాసంతో ఒదిగిపోతుంది
సాధిన మనుషులు! చతురతతో వదలి పోచూచేరు

మానవత ఒకటే విశాల ప్రపంచాన్ని వహిస్తుంది
మరొకటి ఏదయినా అన్నీ అసమగ్రాలే!

ఓటమికీ గెలుపుకూ మధ్య సన్నని రేఖ
సమాజాన్ని ఇరు పక్షాలుగ మారుస్తుంది
దార్శనికతకు అనుభవానికి మధ్య ఎడం
కల్పనకూ వాస్తవానికీ గల తేడా చూపిస్తుంది

దు:ఖం ఆగదు ఉబికి బయట పడుతుంది
వేదన నిలవదు ఎగసి పైకి చిమ్ముతుంది
కష్టం కదలని శిలవలె పడి ఉంటుంది
మోదం ఆగని ప్రవాహమై తరలుతుంది

తమ్ములనూ పత్నిని జూదంలో ఒడ్డిన నీతి
ఈనాటి సమాజంలో పరిహాసకమవుతుంది
వ్యక్తి స్వతంత్రంగా పూర్ణమైన అస్తితతో
బ్రతికే స్వేచ్ఛకు అవకాశ వేది నవ యుగం!

22. పనులెన్నో ఇంకా మిగిలే

ఎర్రని ఎండలు విసరే కాలం వెనక నుండి
మందార వనమె! గులాబితోటా! తలపుకు వస్తుంది
సాయం వేళల మల్లెపూల పరిమళం పరవశ మొనరిస్తుంది
మనిషి హృదికి సంస్కార ప్రియతను కలిగిస్తుంది

పేదలు ధనికులు చీకటి వెలుగుల తేడా లేదు
కవితా పఠనానికి సమయం! త్వరపెడుతుంది

చల్లని ఎద నుండి దయా జలా సారంలా
జలదం వేదన తీరుస్తుండి ఉల్లాసం కలిగిస్తుంది

వరదలతో కష్టాలను పంచనూ వచ్చు
అనుకోనిది జరగడం వశం కాని విశేషం!

మండే ఎండలు దహన మతితో
ముంచే వరదలు విలయ గతితో
దేని కదే! వివిధ స్థాయిలలో పాత్రలతో
ఈ రెండిటి బుజాలపై నుండి వసంతం!
సుందర సందేశంతో బ్రతుకులు మార్చేను
అభినవ గుణ చేతనతో విలువలు పెంచేను

ఇప్పటికీ! ఎక్కడెక్కడి నుండో మంటలు! పిడుగులు
విపద భయం విసరే! మాటయితే వాస్తవం

పూర్వపు బాధా శకలాలు వరసగా
గోడకు పొదిగిన అందమయిన స్మృతి గుర్తులతో

నిరాశకు తాళం వేస్తుంది వసంతం
పురోగమనానికి విజయ పథం తెరుస్తుంది

భూమి మాట్లాడుతుంది యోగ క్షేమాలు గురించి
నింగి మాట్లాడుతుంది కష్ట నష్టాలు గురించి

జీవన వాస్తవికతలకు భువి వేదికయై
అతీత కాల్పనికతలకు దివి ప్రేరణయై
మనిషికి శక్తితో ప్రజ్ఞతో మరో శతం బ్రతకాలని
చేయాలిసి ఉన్న పనులెన్నో! ఇంకా మిగిలే

23. మానవీయ సంకల్పంతో

ప్రజాస్వామ్య తంత్రంలో ఇప్పటికీ సింహాసన భావన
ఇంకా మిగిలిన రాజరికం ఆనవాళ్ళు అంతటా
సమర్పణలు ప్రశంసలు! అధికారానికి దీవెనలు
ప్రశ్నకు వీలు లేని అలంకార శోభితంగా

ముంగిలిలో తన మాట నృత్యంగా మారాలని
ఎప్పటిదో రివాజు ఇప్పటికీ చెల్లాలని
ఆయుధ బలంతో హంగామా! అణచివేత
జన రక్షణ పేరిట ఆధిపత్య భావన రూపం!
ఇది ఎన్నటికీ శాంతి మెడలో పుష్ప మాల కాదు

సమాజంలో భాగ్యంగా జీవితమంటే ఇష్టంగా
విడదీయరాని బంధంతో సాగే మానవ చరిత్ర
తరానికందిస్తుంది! యశోమయం! మణి మకుటం

భూమి ఎదురు చూస్తుంది కొత్త దారికై
దారి నిలిచి ఉంటుంది కొత్త మనిషికై
మనిషి ఎదురు చూచేను! మరో రోజుకై
ఆకురాలి చివురువేసి సాగే సమయంకై

ఇరువురు కలిస్తే ముఖాలలో చిరునవ్వు
వారి లోని ఇరు కొసలను కలుపుతుంది
ఎండ వాన చలి తుపాను వరద పిడుగు
అన్నిటిని సహించి నిలిచేను మనిషి!
కలహ రావ రణ సంకుల దృశ్యాల నుండి
మనిషికి భయపడి దూర దూరం జరిగేను

కన్నీటి బిందువుకు నిప్పు రవ్వ వెనక్కి తగ్గుతుంది
గాలి తెచ్చే వార్తలు వింటూ నది మౌనంగా వెళుతుంది

ముఖం చాటు చేసుకొనీ! చీకటి! సడి లేకుండా
మనిషి హృదయ రాగంతో వెలుగులు కనిపించేనా?

కాలం అర్పించిన స్వర్ణ హంస పతకంలా
నాలో సూర్యుడు మానవీయ సంకల్పంతో

❋

24. విశ్వసనీయ మిత్రం

అమాయకంగా కనిపించే నిశ్శబ్దంలో
చుట్టలుగా చుట్టుకొని రహస్య ప్రపంచాలు
ఇది పసి కట్టేందుకు, అంతర్నయన మవసరం
అంతరంగ ప్రకాశంతో స్పష్టంగా కనిపిస్తాయి

జీవిత మొక రిమోట్‌తో పని చేసే యంత్రం కాదు
పొలం పంట వంటి ఆశామయ కృషి రూపం!

ఏ బ్రతుకూ శూన్యంగా గడవదు, ఉండదు
శూన్యంతో మొదలు కాదు, శూన్యంతో ముగియదు
ఈ మధ్యన విలువలతో మారే అంకెలు ఎన్నో!
అస్తితలో భౌతిక మానస రూప ప్రపంచం,

సమాజమూ ప్రకృతి కలిసిన మిశ్రమంతో
బ్రతుకులు సార్థక సుందరతను పొందేను

విత్తు నుండి తరువులా అపూర్వమై
జీవాకృతి నుండి మానస శిఖరానికి
సంకుచితాల నుండి విశాలతలకు
బంధన నుండి స్వేచ్ఛా సమాజానికి
దారిలో కాలే కట్టెల పొగలూ
గాలితో తరు సుమ పరిమళలహరులు!

అద్దంలో తన ముఖ బింబం అందంగా
లోన బయటకు రాని ఆలోచనా రూపం
కిందికి దించేదో! ఎత్తుకు చేర్చేదో
అద్దంలో ప్రతి బింబం! ఒక సందర్భ విశేషంలో

పక్కనే నీడ! జల యానంలో నావలా
గాలికి ఎగిరిపోయేది కాదు, వదలేది కాదు
ఎండకు ఎండి మండేది కాదు, చల్లగా నిలిచేది
అస్తిత నంటుకొనీ, విశ్వసనీయమైన మిత్రంలా

❋

25. క్వశ్చన్ బాక్స్

దాహంతో అవని అలమటించే సమయం
ఘన కార్యంగా భావించే తీవ్రవాద చర్యలలో
దోసిలిలో పూవుల వలె కనిపించే అనల కణాలతో
సమాజాన్ని అలంకరించాలని! ఎవరు కోరతారు!

అవనిపై పచ్చగడ్డికి దూరమై పశువులూ
జలకణ నిరీక్షణలో ప్రాణులూ ఉన్న సమయం
మంటల్ని ఆహార ప్రియంగా,
అర్పణ చేయాలని ఎవరు కోరతారు?

తప్పని కారు మబ్బులతో వచ్చే
మార్పు నెవరు? నిలుపగలరు?
మెరపు తీగె! ఏ సూచన చేసేను?
స్వర్ణ హంస వాహనంపై కనిపించే
సూర్యునెవరు? ఆపగలరు?
కమలం పరిమళం వార్తను అందించేనా?

నిలయం బయటికి వస్తేనే తెలుస్తుంది!
రాక తప్పని మార్పు ముఖం కనిపిస్తుంది
ఎంతటి దుస్థితిలోనూ జీవన క్షణం
కళ్ళ ముందు వ్రేలాడే ఉరిని చూపకూడదు

మౌన శిలా పంక్తుల వలె ఉన్న సమాజం
చేతనతా గుణ మార్గం పొందేనా?

హఠాత్తుగ గాలి వీచి ఆకురాలి
కళ్ళ ముందు మట్టి పాలయి పోతుంది
ఈ దోషం ఎవరిది? చెట్టుదా? గాలిదా?
పట్టులేని ఆకుదా? వచ్చే మార్పులో భాగమా?

తెలిసీ తెలియని కారణాల చలనంతో
కవితలో వాస్తవ జీవిత మొక క్వశ్చన్ మార్క్

26. పెట్టెలో రత్నాల వలె

జలాలతో జీవ నదికి అస్తిత లాగా
జన సమూహ బలాలతో సమాజ రూపం
ఎక్కడెక్కడికో ఈనాడు ప్రపంచ యానంలో
సుఖం కోరి మనసు విరిసిన ఇంద్ర ధనుసులా

ఉద్యోగం వ్యాపారం వ్యవహారం ఆధిపత్యం
మంచీ చెడు దృష్టి కోణంలో విలువలు మారే
కొత్త చోట వ్యక్తి! మొదటి రోజు అతిథి!
రెండో రోజు! దొరికిన సన్మిత్ర రత్నం!
మూడో రోజు! వదలని అభినవ బంధువు
పలు రంగుల కలయికతో! జీవిత రూపం

అడుగు తీసి అడుగు పడితేనే నడక సాగుతుంది
నడతను బట్టి! నాణ్యత! కొత్త సమాజంలో
ప్రభావాల మోజులో, సీమలు దాటిన స్వేచ్ఛ
అదుపులేని వేగంతో! ప్రమాదకరమవుతూంది

ఏది మంచి? ఏది చెడు ప్రశ్నలకు జవాబులు
స్వేచ్ఛా సంస్కృతిని బట్టి! మారడమొక విచిత్రం!

బయటికి కనిపించే పూవులోని ఆకర్షణ
లోన నిలిచి ఉన్న మూలాలకు ఉండదు
ఎక్కడయిన మనిషి మనిషే! లోపాలతో దోషాలతో
మానవతా సుందరతతోనే ఉత్తమ సమాజం

అణచి వేతతో స్వేచ్ఛగ బ్రతికే
హక్కును లాగేయడమొక నిరంకుశం
వ్యక్తిలో స్వతంత్ర చేతనతో
నిర్మూలనమే! ప్రజా స్వామ్య లక్ష్యం

ఆలోచన శిలయై, శిల్పి కయి ఎదురు చూచే
మనిషి బ్రతుకులో, సుగతి లేదు ప్రగతి లేదు

సమత మమత క్షమత పెట్టెలో రత్నాలవలె భద్రంగా
యుగాల సంపద! అపుడపుడూ బయటకు తీసి మళ్ళీలోనికి!

27. భద్రంగా గుప్తంగా

జీవన విధ మేదయినా భాషా దేశా లేవయినా
ఎక్కడయిన మనసు సరిపడితేనే! అందం
పరిచయ స్నేహాలతో అనుభవ ప్రపంచం
ప్రభావాల పరిమళం స్మృతిలో భద్రంగా
దీని నెవరు పొందలేరు, చూడలేరు
ఆ వ్యక్తిదే! ఎవరికి చెందని స్వంతమై

కొమ్మ నుండి ఆకు రాలి పడుతుంది!
మరొక ఆకు వేచి ఉంటుంది! ఆ స్థానంకై
పయనంలో ఒకరు జారిపోయేరు
సంఘంలో ఆ స్థానం శూన్యం తలపిస్తుంది
స్మృతి ఆల్బంలో! గుర్తుగ చిత్రం మిగులుతుంది
చెదరనిదీ మాయనిదీ మనసులో అభినవంగా

మనిషి ఉనికి తెలియ జేసే మాటలు వినబడతాయి
ఏమీ పట్టని వాణ్ణి కూడ! వినజేస్తాయి! కదలిస్తాయి
ఇష్టంతో పని లేదు, అవసరంతో పని లేదు
ఒక మనిషి మాటే కాదు! ఇతర ప్రాణి గతం కూడా

చేసే పనులకు నేపథ్యంగా ఏదో శబ్దం
మానసికంగా పొందే ప్రభావం! గుప్తంగా

విజ్ఞానం అనుభవం రెండు రెక్కలపై
మనిషి! ఎంత దూరం ఎగిరినా
సృజన క్రియలో భాగమై దృశ్యం !
కవితలో దిగుతుంది పారాష్యూట్‌లా

బాధకు గురి చేసే శబ్దంలో చీకటినీ
ఆర్తిని బింబించే శబ్దంలో అనలాన్నీ
ఉల్లాసం తరలే శబ్దంలో రాగాన్నీ
ఉద్రేకం ఎగసే శబ్దంలో వీరాన్నీ
అన్నిటినీ వహిస్తుంది మనస్సు
రత్న పేటిలా భద్రంగా! గుప్తంగా!

❁

28. ప్రజ్ఞా ప్రకటనం

సరసి జలంలో కనిపించే ముఖం
బాల్య దశ లోది, ఎప్పటిదో
అద్దంలో స్ఫుటంగా బింబించే ముఖం
యౌవన దశ లోది, మధ్యలోది
జలధి తటంలో కనిపించే ముఖం
పరిణత దశలోది, చివరిలోది

హద్దులు గీయడమంటె తుది రూపం ఇవ్వడమే
పుష్పానికి చివరి దశ వాడి పోవడం, రాలడం
ప్రవాహానికి చివరి మజిలి జలధిలో కలవడం
జీవిత మొక నిరంతర పరిణామ వికాస రూపం

మంచికి సీమలు లేవు, విశాలతయే
చెడుకు గదులు దులుగా గీతలు!
ఏడుపు ఎరదు సౌందర్యం
సంతోషం ఎరగదు బీభత్సం

బంగరు సంకెళ్ళను
అలంకారంగా తలచే వారూ ఉన్నారు
బంధన విషయంలో భౌతికంతో పాటుగ
మానసమూ గొప్ప పాత్ర వహిస్తుంది

పేదరికాన్ని ఎరువుగ వాడుకునే వారూ ఉన్నారు
భాగ్యంలో బ్రతుకు శూన్యమయ్యే వారూ ఉన్నారు

జీవిత మొక సువిశాల శిల్పశాల కాదు
వాస్తవాల నెదుర్కొనే సజీవ చేతన రూపం

నదులూ కొండలు దాటి దేశాలు తిరిగి
పక్షుల వలె ఎగురుతూ పైన ఎత్తుగా
మనిషి! భూమిపైకి రావడం సహజం!
పైన దివిని వెదకుతూ బ్రతకడమొక 'జోక్'
ఏ దేశమయినా ఏ సమాజ మయినా
మనిషిలోని ప్రజ్ఞా ప్రకటనతోనే జీవితం!

❁

29. బ్రతుకు వైపు

కాలానికి ఉదయం చేయి అందుకొనీ
సాగాలని ఎక్కడ లేని ఉబలాటం!
రాత్రి అవుతుంది, మరునాటికి సిద్ధంగా
ఏ రోజున కది మనిషికి! విశేష సంచిక!

కొత్త రుచి చూడాలని మనిషిలో అభిలాష
ఊహా దృశ్యాలు కొత్తవి, అనుభవ లహరులు కొత్తవి

పయనంలో దారిలో కలిసే వ్యక్తులెందరో
చిరునవ్వులతో నమస్కార గుచ్ఛాలతో
కరచాలనాలతో పలకరింతలతో
ఒక సందర్భంలో! కాలం వెనకబడుతుంది

ఉదయ పరిచయంతో పగలు స్నేహమయమై
జీవిత దృశ్యానికి కాలం ఆధారమై
ఒక పటమో! కాగితమో! అవుతుంది

రోజులెన్ని అయినా! విసుగు లేక గడుస్తాయి
చేసే పనిపై ఇష్టంతో శ్రద్ధతో
జీవిత మొక సుందర నవ రూపం తలపిస్తుంది

ఆతపంలో శీతలంలో వానలలో
గుండె తీరు ఒకటే స్పందనలో
మృత్యువు మాట లేదు జాడ లేదు
కాలంతో పోటీ పడి జీవితం! గడుస్తుంది

మిత్రం ఉన్న దిశకు ఎదురుగా శత్రువు
ఇరువురి చూపులు కలుస్తాయి, వెలుగులో

పగలు అందరాని ఆశారూపాలు
రాత్రి చుక్కల వలె తళ తళ లాడతాయి
రాత్రి చూడలేని మనుషుల ముఖాలు
పొద్దు పొడుపుతో పూలలో తోచేను

దూరం నుండి మురళి స్వరం వినబడుతుంది
ప్రక్క ఇంట్లో శిశువు ఏడుపు శబ్దం బ్రతుకు వైపు మరలిస్తుంది

30. అర్థంలో చేతన

నిశీథి అడుగులు మెల్లగా పడతాయి
ఒకపుడు, కాస్త! విశ్రమించిందా? అనిపిస్తుంది
పగలు అడుగులు వేగంగా పడతాయి
ఒకపుడు, పరుగిడుతూందా? అనిపిస్తుంది

ఆగని దొకటే వయస్సు! ఆయువు క్రియలో!
కదలే మేఘంలా! సాగే స్రవంతిలా! బ్రతుకులు!
గాలి మాత్రం! ఏ స్థితిలోనూ
తలను స్పృశిస్తూ పోతుంది
వెలుగు అయితే ప్రతి స్థితిలోనూ
ఊహకు చేయినందిస్తూ ఉంటుంది!

శబ్దంలో అర్థం కిరణంలా ప్రసరిస్తుంది
తెలియని రహస్యం బయట పడుతుంది
సందేహం లేకుండా భయ రహితంగా
వాహనమై కవితకు గమ్యానికి చేరుస్తుంది

తెరచాటు ముఖాలు బయటికి వస్తాయి
విశాలతతో మనసు విశ్వమయమవుతుంది
ఎడారిలో ప్రవాహ రూపాన్ని సరింప చేస్తుంది
దార్శనికంతో కవిత! భవితను బింబిస్తుంది

మౌనంలో గళానికి స్వరాన్ని అందిస్తుంది
నీడ లేని మనిషికి ఆశ్రయ మిస్తుంది
తాపంలో మంచు ముక్కలా చల్లబరుస్తుంది
శీతంలో కోష్ణ స్పర్శతో చేతన నిస్తుంది

సమాజ నిర్మాణానికి వాస్తవ తల మందిస్తుంది
నిశ్శబ్ద నిలయాన్ని భావ మయం చేస్తుంది

సంక్షుబ్ద సమాజంలో శాంతి నికేతనమై
అర్థంలో చేతనతో! మనసును మేల్కొల్పుతుంది

31. బంధువు వచ్చినంత

పగలు ఎట్లాగో తీరిక ఉండదు
రాత్రి నిద్రకూ నిద్రకూ మధ్యన
మెలకువలో విరామ సమయంలో
లెక్కలు వేస్తే! ఆ రోజు లాభంలోనే!

పోయిన దాని కన్న పొందిందే ఎక్కువగా
అడుగు వెనక్కి వేసే మాట లేదు, ముందుకే!
మానసిక స్థాయిలో అనుభవం పెరగడంతో
ఆ రోజు గడవడమొక తృప్తి రేఖను చేరడమే

అడవిని జయించే పనిలో మనిషి
చేతిలో గొడ్డలితో ఆ పనిలో ఇప్పటికీ!
ఇది కుదరనిదంటూ లేదు, అవసరానికి
కావలసిన వంట చెరకు కోసమో! కలప కోసమో
చెట్టునో కొమ్మలనో ముక్కలు చేసి
అడవిని జయించిన అనుభవ మొక తృప్తి!

గొడ్డలి వేటు శబ్దానికి లేచిన పక్షుల కలరవాలు
ఆకులు రాలే శబ్దం! ఆర్తిని నింపుకొనీ
చెట్టు హృదయం గాలితో మాట్లాడుతున్నట్లు ఉంటుంది
జరిగే పని ఆగదు! జరుగుతూనే ఉంటుంది

ఎండకు కొన్ని లిప్తలకై చెట్టు నీడ చేరితే
కరుణ జలంతో మేఘ ఛత్రంలా కనిపిస్తుంది
చెట్టు వదల బుద్ధికాదు! కాలు సాగదు
నిలిస్తే! మనిషి చేసే ఘనకార్యం కలత పెట్టవచ్చు

బ్రతుకు తెరువు సుఖంకై పని ముగించుకొని
కట్టెల మోపుతోనో కలపతోనో! ఇంటి ముఖం పట్టేను

ఎక్కడి నుండో దూసి పక్షి బుజాలపై నుండి
పలుకు ఒలికి రివ్వున ఎగిరిపోతుంది
ఇంటికి చేరే సరికి! తలుపులు! తెరచుకొనీ
తమ బంధువు వచ్చినంత సంతోష స్వాంతంతో

32. నిరంకుశం మండుతూ

ధూళి కమ్మిన వాలకంతో
సంఘంలో అడుగున బ్రతుకులు
భూమిపై విలువైనది ఏదీ
తమ కందనివై చెందనివై

విషాద తట భూమిపై చరిస్తూ
స్వచ్ఛ నదీ జల మెరగని జీవులు
చల్లిన చీకటి విత్తుల వలె
కాలం గడచే కొద్దీ ఎదిగేరు

ఆహారం వసనం ఆవాసం పొందలేని
ఆరాటం అన్వేషణ ఆరాటంతో! వీటికై
రెండు చేతులూ బరువులు మోసేందుకు అన్నట్లు
రెండు కాళ్ళు దూరం నడిచేందుకు అన్నట్లు!

పాలనలో దోషం! బాధ్యతలో లోపం
ఎవరి దయిన కానీ! అది సంఘానికి కళంకం

ఈ సమయం చరిత్రకు అవసరం
విశాల హృదయంతో ఉదార చర్యలు! వరసగా

స్వర్గం! ఎక్కడో? కాని ఆశ చూపుతుంది
ఇపుడయితే శిశిర తరువులా బ్రతుకులు!

ఒక వైపు వాస్తవ భూమి తలం
ఒక వైపు దార్శనికంలో దివం

నీరు లేక ఎండిన పొచల వలె
పొద్దు తోడ జరిగే నీడల వలె
ఎవరు? వీరు, వదలబడీ మాసిన స్థితిలో
గొప్పగ చెప్పుకొనే మానవ సంతతి వారే!

చిరునవ్వుతో చంద్రబింబం కనిపిస్తుంది
ఆ వెనకనే నిరంకుశ రూపం మండుతూ

పత్రికలో ప్రచారం ప్రదర్శనలో ఆర్భాటం కన్న
స్వచ్ఛమయిన అంకిత హృదయం ముఖ్యం

❁

33. మౌన భాషలో నిజం

మాట బయట పడుతుంది
అరణి నుండి అగ్నిలా
గూడు నుండి పక్షిలా
జలధి నుండి మబ్బులా

మాటకు పాత లేదు కొత్త లేదు
ఇది మదిలో ఊహకు ప్రకటన రూపం

లలాట రేఖలపై అక్షరాల్ని చెప్పేవారూ ఉన్నారు
అర చేయి రేఖలలో అక్షరాల్ని విప్పేవారూ ఉన్నారు
మనసులో కదలే ఊహలను గుర్తించే వారు ఉన్నారు
నీడను బట్టి మనుషుల రూపం చెప్పలేరెవరూ

నీలి మబ్బు దయ చేస్తుంది
అవనిపై కష్టాలు చల్లబడడానికి
గాలి! ఎక్కువ సేపు నిలవ నీయదు
బుజంపై చేయి వేసి తీసుక పోతుంది

మాటలో బయట పడని కోరిక లనంతం
జలధిలో దాగిన బడ చానల తేజంలా
నీరులో అణగిన విద్యుత్ ప్రసారాల్లా
భూమిలో గనుల్లా మనసులో దాగీ

తెలిసో తెలియకనో అవసరమో ప్రయోజనమో
కటు రుచి చూడవలసి వస్తుంది! జీవితంలో
కోరిన పరిమళ పుష్పం! చేతిలో రాలదు
కోరిన దయా క్షీరం! నాల్కపై జారదు

ఒలికే కన్నీరు బిందువులో
సన్నని సెగ! అనుభూత మవుతుంది
గ్రీష్మ రశ్మిలో నడిచినంత మేర
తలపై ఆతపత్రమై మేఘం కదలదు
బయట పడని మాట వెనకనే
తలుపులు మూసిన చరిత్రలో మౌన భాషలో "నిజం"

❁

34. భువికి భద్రంగా

లేచిన కెరటం స్థానంలో మరొకటి వెనకనే సిద్ధంగా
రాలిన పుష్పం స్థానంలో మరొకటి ఆ వెనక నిరీక్షిస్తూ
వెడలే మాట వెనక మరో మాట మధ్య! అవకాశంలో
ఆలోచనలో మేఘం కదలవచ్చు, విహగం ఎగరవచ్చు, విమానం రావచ్చు

చినుకు రాలుతుంది ముత్యంలా
ధార జారుతుంది నాదంలా
అరచేతిలో నిలిచి నట్లై కదలుతాయి
ఏది దేని కెంత తగునో! అదే ఔచిత్యం

ప్రకృతిలో ప్రతి రూపం రంగులతోనే కనిపిస్తుంది
కంటి చూపు తెలుపు, రంగు లేక పోయినా
రంగుల్ని విడదీస్తుంది, పరిశీలన మొక శోధన!
మనస్సు సుందరతను పొందడ మొక అనుభవ కళ!

నిరీక్షణలో చూపు చివురు చూపుతుంది
స్వాగతంలో చూపు! పూలు వదలుతుంది
వీడ్కోలులో చూపు నుండి ఆకు జారుతుంది
జీవన గమనంలో ప్రకృతి నేపథ్యం! గొప్పగా

చుట్టు ఉన్న వస్తువులవే! రోజూ చూచేవి
చూపు స్పృశించగనే తలపులు కొత్తగా మనిషిలో
రాయి రంభ కావచ్చు చెట్టు దేవత కావచ్చు
మనిషి మాత్రం మనిషిగనే! చెదరని వాస్తవ తలంపై

కెరటంలో నాద కళ మనసును ముంచి తేలుస్తుంది
పుష్పంలో పరిమళం పారవశ్యంలో ఊపుతుంది
మాటలో అర్థం ప్రయాణ సూచిక అవుతుంది
భువి నుండి దివికి, దివి నుండి భువికి భద్రంగా

35. కెమెరాకు తెలియదు

కెమెరాకు తెలియదు!
ఏది భాగ్యమో? ఏది హీనమో? ఏది అవసరమో?
శబ్దానికి తెలియదు
అనుకూలమొ! ప్రతికూలమొ! ఏ పక్షమో?

చెట్టు సార్థకం పూవు ఫలం తోనే
దాని నిండుదనం పచ్చని ఆకుల తోనే

మానవ రూపం! భౌతిక మానస స్థాయిలలో
రెండూ కలిసిన సుందర సహయోగమయం!

మనిషి కెదురుగా మనిషి! దూరం నుండి
బాట్స్‌మెన్ ఎదుర్కోబోయే! బవులర్‌లా కనిపించవచ్చు

మౌనంగా ఉన్న మనస్వి
ఒక సమయంలో జ్వాలగ మండవచ్చు

గుహలో మృగంలా మదిలో రహస్యం
బయటికి రాగానే తత్వం మారవచ్చు
గదిలో దీపమై వెలగ వచ్చు
గుడిలో దైవమై వెలయ వచ్చు

శ్రమ చక్రం తిరుగుతుంది
ప్రాణం ఉన్నంత వరకు
సంఘానికి కావలసిన వస్తు చయం
సమకూర్చే యత్నంలో కర్తవ్యంతో

ప్రజాస్వామ్య మొక సాధనమై వాహనమై
నడిపే మతిని బట్టి పయనం! సాగుతుంది

గ్రీష్మంలో చండతకు మేఘం భయపడదం
సందు చేసుకొని దూర దూరం పయనిస్తుంది
భూమిని పలకరించి పులకరింప జేస్తుంది
కష్టంలో మనిషికి శ్రేయో సంకేతం అవుతూంది

36. తెలిసినా!

జననం మరణం రెండు కొసలతో జీవితం
నది ఒకటే తీరాలు! రెండు చెరో వైపు క్షేత్రాలతో,
రెండు వేరు దిశలు, మధ్య ప్రకృతి ప్రజా విజయంతో
ఒకటి ఉదయంగానూ మరొకటి అస్తమయంగానూ

ఆగమనం అప్పటికే ఉన్న లోకంలోకి
నిష్క్రమణం ఎప్పటికీ తెలియని లోకంలోకి
ఒకటి మూర్తమైంది, మరొకటి అమూర్తమైంది
మూర్తం నుండి అమూర్తానికి ఆలోచనలో పయనం

జననంతో జీవన రూపం అద్భుతం, అపూర్వం
ఆయువు వాహనంలో మనిషి! కొన్ని పరిమితులలో

జీవిత మొక సాధనమై పయనం సాగుతుంది
మధ్య మధ్య ఆగి ఆగి ఎక్కడనో మారవచ్చు
వాహనాన్ని అదుపులో ఉంచడమొక నైపుణి!
జీవితాన్ని భాగ్యంగా తీర్చడమొక! చతురత!

మెరపులా స్వప్నం తాత్కాలికం
మొలకవ ఎప్పటికినీ వెలుగులా

సంస్పృహలో వాస్తవం విడువదు నడిపిస్తుంది
ఎక్కడికి? ఎవరి గమ్యం వారిది! పూర్తిగ తెలియనిదీ!

స్పందన యోచన మోదం ఖేదం ఓటమి విజయంతో
ఉదార హృదయం విశాల దృష్టి సునిశిత బుద్ధితో
మనిషి నిలబడేను! భూమి నుండి గగనానికి ఎదిగి
సమాజ సర్వస్వానికి! చెందిన జీవన రూపంతో!

వైయక్తిక సామాజిక పార్శ్వాలతో వ్యక్తిత్వం
తన పనిలో కవిత మరో హృదిలో బింబించేనా?
నది అడుగున భూగర్భంలో గని ఉందని తెలిసినా
నీరు తీసి త్రవ్వే పని మొదలెట్టేదెవరు?

❁

37. చేవ గల ఆకృతి

రాయడానికేమి ఉంది? అంటే చాలా ఉంది
ఎగుడు దిగుడు దారిలో తడబడే కాళ్ళతో
ఆకలి ఆహారంగా బ్రతికే పేద గురించి
తెలిసో తెలియకో చేసిన నేరంతో దోషి గురించి

చీకటి గదిలో మనిషి నిలిచినపుడు
గీసిన అగ్గి పుల్ల వెలుగులా కవిత
కదలని కాలాన్ని లేపి దారి చూపుతుంది
ఓటమి మూలకు వెళ్ళి, గెలుపు ముందుకొస్తుంది

తుపానుకు భయపడి నావ ఆత్మహత్య చేసుకోదు
గ్రీష్మం అభిషేకంలో ఆకు రాలి చెట్టు క్రుంగి పోదు
ఎపుడో రాబోయే జన్మలో ఒరిగేది వదలేసి
ఉన్న స్థితి నెదుర్కొనే, మానవ చైతన్యం అవసరం

కాలం రాక తప్పదు! పొరపాటు అసలు జరగదు
మాట తప్పేదీ, పొరపాటు పడేదీ మనిషే
వేసుకున్న అంచనాలకు అనుభవాలు వేరయి!
రాకను మారుస్తాయి దారిని తప్పిస్తాయి!

చలివేసో! మర్యాదకో! అలం కృతికో పెద్దరి కానికో!
తెలుపు పసుపు ఎరుపు మిశ్రమ వర్ణం శాలువాను
శ్రమ లోకం బుజాలపై విసరుతూ! కాలం
నిన్నటి నేరం మరచి నేడును దీవిస్తుంది!

కష్టాలు బాధలు సందేహం సంవేదన
ఉన్నంత వరకు! కవితకు వస్తువు అక్షయం!
ఇది కన్నీరు జలాలపై నావయై
ఇది ఆలోచనాకాశంలో విమానమై
అక్షరాలలో భూమిపై నడచే వాస్తవ బింబం
మంచుకు అగ్నికి వానకు ఎండకు తట్టుకొనే రూపం!

❁

38. నవతలో భవిత

తెలియని విజయ క్షణం భవితలో
వెలుగు చేయి చాచి అందుకునేనని భరోసా
వర్తమాన క్షణం చిటికెన వేలు అందిస్తూ
సముచితమైన పథం వేళకు విప్పారుతుంది

బాధలో వేదనలో అలలా హ్లాదంగా
"ఎవరు తారస పడేరు" అనేది ఒక ప్రశ్న!
ఎవరు చేయి చాచి స్పృశించేది, తెలియదు
వినిపించే మాటలలో ఒకటయినా సుధాకణమయ్యేనా?

ఎవరి కళ్ళు ఎండిన చెలిమలు కాకూడదు
ఎవరి మాట వాడిన పుష్పం కాకూడదు
నిరాశ నుండి ఆశ వేరయి తనదయ్యేనా?
నవ్వే శిశువు ముఖంతోనో, అమ్మ మనసుతోనో

ఒకరి వెనకనే మరొకరి ఆగమనం
ఊగే ఊయెలను చూచిన మనసులో ఆనందం
ఒకరి తరువాత మరొకరి నిష్క్రమణం
టేక్ ఆఫ్‌లో విమాన దృశ్యం! ఎదురుగా

ఏ యుగ మయినా ఏ సమాజ మయినా
ప్రేమ కరుణ అరుదై మితమై అపురూపాలై
చల్లని చూపుతో శాంతి దూరం నుండి ఓరగ చూస్తుంది
"ఇది జీవిత" మనుకుంటూ కర్తవ్యంతో సాగడమే

నది పయి వంతెనలా పొందే అవకాశంతో
వనిలో కాలి బాటలా ఎగుడు దిగుడు నేలపై
దూరానికి భయపడని సంకల్ప బలంతో
ఒడుదుడుకులు సహించి నడిపిస్తుంది! అంతరంగం

దివి పయి కల్పనలను పోస్ట్ పోన్ చేసి
ఇల పయి వాస్తవాన్ని మీటుతూ పోవడమే
చెవికి ఇంపుగా హృదికి తృప్తిగా
మాటలో కవితయై నవతతో భవితయై

❁

39. యశో హృదయం

కవిత తాను వెలిగే దీపం అయితేనే
మరొకరి వెలుగు చూప గలుగుతుంది
మట్టి బొమ్మ అయితే! రాతి శిల్పయితే!
శిల్పంలో భంగిమలకు మురవడమొకటే!

చీకటి మెట్లపై కన్నా పయనంలో
వెలుగు మెట్ల పైనే మనిషి దృష్టి ఉంటుంది
బాధను దు:ఖాన్ని ఆర్తిని అశాంతిని
కోరక పోయినా! వచ్చినట్లు! చీకటి మెట్లు!
ఇవి చాలు! మనిషిని పరీక్షకు గురి చేసేందుకు
దేని ప్రభావానికీ గురి కాదు, మనోరూపం

ఏది ఎదురయితే, అది అధిరోహిస్తూపోవడమే!
వెలుగు చీకటి ఒక దానితో ఒకటి అనుబంధంతో!

చీకటి కప్పేస్తుంది, వెలుగు బయటపెడుతుంది
చీకటి వస్తుందని తెలుసు! తెలిసీ
ఎవరూ ఎక్కడికీ వెళ్ళిపోరు
అప్పటికి దీప సహాయం పొందవచ్చు

ఆయువులో కాలం! కవితలో చిత్రమయమై
స్వర్ణాక్షర ముఖంతో ఉషస్సులా బయటికి వస్తుంది
చెరగని నిజ సౌందర్యంతో, చెదరని పద పంక్తులతో

వెలుగులో కోరిక మేలు కొంటుంది
చీకటిలో కోరిక కలలు కంటుంది

మొక్కలా కవిత క్రమంగా పెరిగేది కాదు
సూర్యునిలా మేఘంలా పూర్ణంగా వెడలుతుంది

తమ పని ముగిసాక! కలలను వరించేరు
ఈ బ్రతుకు బహుమతి సమాజాని కర్పితం
కవికిది ఆట వస్తువయితే, ఇతరులకు అనుభవ రత్నం
తరం నుండి తరం ప్రతిభ నుండి కవిత!
మనసుకు అక్షర సుమ గుచ్ఛం అవుతుంది

40. అభినవ రూపం

నవ నవ లాడే జీవన విభవం
నిగ నిగ లాడే మానస తేజం
కలిసిన రూపం – ఇది..

కవికి మనిషి ప్రాణమై
ఎదకు మమత ఆయువై
బ్రతికే రూపం – ఇది..

పద్యానికి ఆప్తమై
గేయానికి మిత్రమై
స్పందన రూపం – ఇది..

సహృదయులకు బంధునై
హృదయానికి సుకృతియై
స్వేచ్ఛా రూపం – ఇది..

కవి యశసుకు విమానమై
విశ్వమయం శబ్ద భవం
నిలిచిన రూపం – ఇది..

మనిషిలోని మర్మానికి
సుందర గుణ వ్యాఖ్యానం
మెరసే రూపం – ఇది..

సృజన చేతనా లోకం
చింతన శిఖరాంచలాలు
ఒరసిన రూపం – ఇది..

వ్యక్తి బలం లోక హితం
కళా మయం మతి కిరణం
వెలిగే రూపం – ఇది..

ఉదార గుణ చరితతో
విస్పారిన సమాజ నవం
పరిమళ రూపం – ఇది..
స్వేచ్ఛా కవితా రూపం!

41. గమ్యంపై మనసుతో

ఇంత కాలం పక్కనే ఒదిగి ఉన్న చీకటి
ఇపుడొక కరవాలమయి ఎదురు పడుతూంది
సమాజ పరిణామంలో పరివర్తన తేజంతో
నూతన వ్యాఖ్యానంతో మనిషి శక్తి చాటుతూంది

మనిషి మనిషిగా బ్రతకడం ముఖ్యమన్న
ఆలోచన అయితే ఎంత గొప్పదో!
ఇది మనిషికి స్థిరమయిన అలంకారమయింది
అనుభవ గతిలో పోయే కొద్దీ ఎండ మావి!

మెడలో కండువ ఉరికి పనికి రావడం
మదిలో విసరిన దౌర్భాగ్య దశకు చిహ్నం
శూన్యం నుండి జన దృశ్యంలోకి జీవితం
నిశి నిశ్శబ్దం నుండి శ్రమ చలనానికి ఉదయం

ఆహార్యం తొలగి నంత మాత్రాన
సంఘంతో సంబంధం తెగిపోయేనా?
మౌనంలోకి దిగినంత మాత్రాన
స్పందనలో గుండె ఆగి పోయేనా?

ఊరు బయట చెరువు చివర
నీలి కలువలను తలపించింది
నీలి వజ్రపు పిడితో ఖడ్గం
మేల్కొన్న కళతో మెరుస్తూంది

కష్టంలో నష్టంలో ఖేదంలో ఆపదలో
మనిషికి విశ్వసనీయమైంది అంతరంగం
పయనంలో కోరిక ఒక సూచన మాత్రమే
దారి తెలపవచ్చు! కాని గమ్యం చేర్చలేదు
వేసే అడగుల లెక్కలు కాదు ముఖ్యం
గమ్యంపై మనసుతో పయనంలో ఉత్సాహం

42. వినిర్మాణ విజయం

మహాత్ముని సమాజ గమన సంస్మరణం
చీకటి కత్తికి వెలుగును చేకూర్చింది
అంబేద్కరు చూపిన మార్పుకు నిర్దేశం
నిరాశలో హృదికి వెలుగును చూపింది

ప్రగతి కిరణ పంక్తులలో అక్షరాలతో
చరిత్రలో ఈ యుగ మొక అపూర్వం

ఎప్పటి నుండో అసమానతలకు గురి అయి
చీకటి విత్తు నుండి వెలుతురు తరువయి,
కళ్ళకు మిరుమిట్లు గొలుపుతూ
ఎద పైని బరువును దింపుతూ
అనల శిఖల బదులు వెలుగు కళికలు
ప్రజాస్వామ్య చేతనను సాకారం చేసేను

తమలో ఉద్యమ ప్రభలు తప్ప
పై పూతల రంగులు తెలియని వారు
బయట ఎగుడు దిగుడు బాట తప్ప
అవసరాల తృప్తి అంచు తెలియని వారు

భయ భావంలో ఎరుపు అనలంలా కనిపిస్తుంది
అపాయ మతిలో ఎరుపు నెత్తురును తలపిస్తుంది
అనురాగంలో గులాబి ఎద గుర్తుకు తెస్తుంది
మనిషి ఊహ చర్యలతో ప్రతి రంగు ప్రభావం

నీలి రత్నమె! నీలి కలువమె! నీలి మబ్బొ
ఇపుడొక కాల్పనికం! వాస్తవ మవుతూంది

అనల కీలలుగా తరలనున్న సమూహాలు
నీటి తరగలుగా సుందర ప్రవాహమవడం
సమ భావన వాదంలో ప్రజాస్వామ్య సంకేతం
శిథిలాల నుండి ఎగసే వినిర్మాణ విజయం

❁

అస్మితలు - అస్తితలు

(నాలుగో భాగం)

మాదిరాజు రంగారావు

2017

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 79

ASMITHALU - ASTHITHALU

(Free-Verse)

(Fourth Part)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Published by
RASADHUNI
Sahiti Parishath,
Shantinagar, Hyderabad -28.

Y.P. : 2017

పీఠిక

'అస్మిత' తనకు వ్యక్తికి సంబంధించింది. ఇది ఆ వ్యక్తి స్థాయిలో ఉనికి స్థితుల ప్రత్యేకతను సూచిస్తుంది. 'అస్తిత' ఇతరులకు సమాజానికి సంబంధించింది. ఉనికి (existence) స్థితుల విశేషాల్ని చూపిస్తుంది. మొదటిది వ్యక్తి బిందువు నుండి రెండోది సమాజ వలయాలతో రూపొందిన స్వేచ్ఛా కవిత్వం, విశ్లేషణ కందుతుంది.

ఇది వర్తమాన సమాజ స్థితుల్నీ, భవితకు పురోగమన లక్ష్యాన్ని ఆవిష్కరిస్తూంది. వ్యక్తి వికాసానికి సమాజ పరివర్తనకూ తోడ్పడేది. కాలాన్ని మేల్కొనజేయడమే కాక, చేతనతో ప్రవహింపజేసేది. ఆశావహమైన దృష్టితో హృదయాన్ని ఆకర్షించేది. విశ్వాసాన్ని ఆశ్వాసాన్ని కలిగించేది. సమాజ పరివర్తనలో కవిత్వం పాత్రను జ్ఞాపకం చేసేది. స్వేచ్ఛా కవిత్వానికి చక్కగా అన్వయించే లక్షణాల్ని గమనించవచ్చు. విశాల ప్రాతిపదికపై ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికతను కలిగింది.

అస్మిత – అస్తిత విభాగం ఈ కవిత్వ విషయంలో సాహిత్య విమర్శకు బాగా ఉపకరిస్తుంది. మానవ జీవితంలో 1) వ్యక్తి పాత్ర 2) సమాజ స్థానం వివిధ స్థాయిలలో పరస్పర సంబంధంతో వర్తించడం జరుగుతుంది. అనుభూతి – వాస్తవికత రెండూ, వ్యక్తి – సమాజ పరంగా అన్వయ శోభను పొందుతూంది. ఇది ఇట్లా ఉంచి చరిత్రకూ చింతనకూ విషయానికీ హేతువుకూ అందని మనోమయమైన అపూర్వ విశేషం కవిత్వంలో సూక్ష్మ స్థాయిలో దర్శనమిస్తుంది.

ఈ కృతి వర్తమాన సమాజం కేంద్రంగా ఆధునిక భావ జగత్తుతో నిర్మితమైంది. సాధారణ జీవితంలోని అనుభవ రూపాలతో భావమయమైన దృశ్య పరంపర కలిగింది. నడుస్తూన్న కాలంలో సమాజ నేపథ్యంలో వ్యక్తులతీరులు పోకడలు ఒక్కొక విధంగా అక్షరాకృతిని పొందింది. "తగిలిన గాయం అద్దిన గులాబి" స్పర్శతో ఉపశమనం పొందేనా? ఇది భౌతికంతోపాటు మానసికంతోనే సాధ్యం. ఈ స్ఫూర్తితో రచన సాగింది. ప్రాతిపదికగానూ ఉంది. ఏ భాగానికది స్వతంత్రమైందిగా తీర్చబడింది. ఇపుడు వస్తున్న కవిత్వంలో స్థితుల కనుగుణమయిన భావ రూపాలతో ప్రతీకలతో తన ప్రత్యేకతను నిలుపుకొనే శక్తితో స్వేచ్ఛా కవిత్వాన్ని పరిపుష్టం చేస్తూంది. ఎప్పటివలెనే ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికతను కలిగింది. **– మాదిరాజు రంగారావు**

Presented to
my wife
Indira

1. ఎవరి విధం వారు

ఎవరు ఎవరికయి వేచి ఉండే స్థితి లేదు
ఎవరి దారిలో వారు! పయనం సాగించేరు
నడచే అడుగుకు చీకటి దారిని ఇస్తుంది
అవసరమొ! అలవాటొ! మనసు దిశను చూపుతుంది

చకితంగా పూరి పాక తలల పైన
గాలిని తరిమే మంటల భయ దృశ్యం
ఉదయానికి మిగిలే దొక బూది కుప్పలే
మాయ మయిన మానవతను వెదకే పని మొదలు!

తమపై రాలిన నిప్పుల గుర్తులతో పూల చెట్లు
కొమ్మకు వేలాడే మనుషుల బొమ్మల వలె ధూమం!
ఈ వేదన ఏదో ఒక ఘటనకు మితం కాదు
పెద్ద లనబడే వారు ప్రతిమల వలె ప్రేక్షకులు

రాయి కదలదు చెరువు నడవదు నది ఆగదు
ఊరు వదలి ప్రజల నుండి నడచి నడచి
అలల హొరులో జలధి తటం చేరిన మోదం
మొదలై, దప్పికలో ఊరుకు తరలడమొకటే శరణ్యం

❁

2. షార్ట్ కట్

పూర్తిగ, వెలుగు కాదు, పూర్తిగ తమసు కాదు
వెలుగు నుండి తమసుకు, తమసు నుండి వెలుగుకు
మధ్య రేఖపై సమయం బింబించే మనసుతో
సందర్భం ఎదురు పడని మనిషి లేడు

ఇదో సమస్యయై బ్రతుకులో ప్రశ్నగా మిగులుతుంది
పురోగమనంలో లిప్తలు సందేహంచే చుట్టబడీ

మనిషి నుండి మనిషి పొందవలసిన మాన్యత
ఎక్కడుంది? ప్రతి కథలో మర్యాదా భంగమే!

కంటి నీరు తుడిచేందుకు సిద్ధమైన మనిషి
ఒక చేతిలో గులాబి పూవును వహించేను

కోరికలో ఆకర్షణలకు ఒదిగిన వంగిన స్థితిలో
సంపద అధికారంతో విలువల తూకం వేరు

చివురు దశను చేరకనే ఫల దశ వచ్చేనా?
హైబ్రిడ్‌లోనో! గారడిలోనో! జరగవచ్చు
అడ్డుకట్ట లెన్ని ఉన్న! నియమ రేఖలెన్ని ఉన్న
అస్మిత తంత్రంలో! షార్ట్ కట్‌లు ఎన్నో! అనంతం

❁

3. మాట – పాట

కవి చుట్టూ మౌన భావ ప్రపంచం
కవితకు శ్రోతలు పాఠకులు చెరొక వైపున
భావ జగంతో కవిత! విశ్వమయం అవుతుంది
ఆర్ద్ర నవంతో భూమి! భాగ్యవశం అవుతుంది

పుట్టుకతో ఎవరిదైన తప్పనిదీ బ్రతుకు బరువు
తప్పని దాని కయి చేసే పనులెన్నో! ఏవేవో
మంచి చెడుల మిశ్రమ రూపంలో లగేజి
అస్తితలో భాగమై మనిషి విలువ చెబుతుంది!

నిరాశకు లోను కాకుండా కాస్త ఓపిక పడితే
అస్తమయం తరువాత చంద్రుడు కనిపించవచ్చు
కొంత నిశ్శబ్ద విరామంతో తలుపులు తెరవబడీ
సూర్యుడు కనిపించేను! ఆశా సుమ గుచ్ఛమై

అవసరానికి మాట బయటికి వచ్చినట్లుగా
విశేషంతో పాట వెలుపలి కొచ్చినట్లుగా

రణానికీ మర్యాదకూ గజరాజుతో మరొకటీ
అడవి నుండి అవసరాలకు సంఘానికి చేరేను

❁

4. సంఘానికి అంకితమై

కష్టాలలోను బ్రతకడం తప్పని సరి అవుతుంది
అవి వదలవు! వీరు వదలరు! కొందరికి ఇష్టం కూడా
కదలే నిశా చక్రం అంచునే కాలంతోపాటు
ఒడుపుగ అనువుగ జారకుండ లిప్తలు గడిపేరు

మేధకు ప్రశ్నలు వేలాడుతూ ఉంటాయి!
ఆలోచనకిది ఒక ఎక్సర్‌సైజ్‌లా! ఉంటుంది
కాలంతో పోటీ డ్రా అవుతూపోతుంది!
లేకపోతే మనిషి ఆత్మహత్యకు గురి కావచ్చు

కరుణ మూట కట్టిన హృదయంతో
జలదం ఒకరికి ఆర్తిలో ఆప్త రూపం
లోన హర్ష సేచనతో హృదయంలా
జలదం ఒకరికి దప్పిలో అమృత కణం

ఖేదం మోదం రెండూ మనిషికి తప్పనివీ
ఆకు రాలడం, మళ్ళీ రావడం! ప్రకృతి సహజం!
ఉదయ రశ్మి వస్తుంది బయట ఉన్న చోటికే ఆప్తంగా
శ్రమ శక్తులు మేల్కొని! సంఘానికి అంకితమై కదలేను

❁

5. అవసరాన్ని బట్టి

కలిసి వస్తే అణువణువున వెటుతురు
కలసి రాకపోతే ప్రతి చోట చీకటి!
నీడకు వస్తు గుణంతో పని లేదు
మల్లె దండ అయినా వాడి కత్తి అయినా

చెట్టు అయినా ఇల్లు అయినా ఒకటే
ఏ పక్షమయినా ఏ వాద మయినా ఛాయలవే
చేతిలో పతాక దార్శనికానికి చిహ్నం
గుండెలో తేజం తన గమ్యానికి ప్రేరణం!

విషయ గౌరవాన్ని బట్టి అవసరాన్ని బట్టి
ఒక ఆదర్శం! నచ్చుతుంది! ఆకర్షిస్తుంది
అందల మెక్కాలనిపిస్తుంది, ఎక్కిస్తుంది కూడా

రాజకీయ తంత్రంతో సమాజ యంత్రం నడుస్తుంది
ఏ దశలో నయినా ఏ వాదం అయినా
పొందే కష్టాలు పోయి సుఖాలు కోరేరు ప్రజలు

అపాయంలో అవసరాన్ని బట్టి ఆయుధం
చేతిలో నిలుస్తుంది! జనతకు రక్షణ నిస్తుంది

❁

6. అన్వేషణ

సృజన చేతన కవితకు ఒక వెంటిలేషన్
స్వచ్ఛమైన గాలితో శుభ్రమయిన వెలుగుతో
స్పందనలో అంతరంగ స్పర్శతో
హృదయం మాట్లాడుతుంది! అందరితో
మనిషితో ప్రకృతితో ప్రతి వస్తువుతో
అక్షర పంక్తులలో పరిమళ చలనంతో

దుమ్ము సోకి కళ తరిగిన చెట్టు
వాన జల్లుకు శుభ్రమై తళతళలాడినట్లు
మాలిన్యం నుండి స్వచ్ఛతకు జీవితం
ఏదో పేరుతో పునరావృత మవుతుంది

బయట భూమిపై శరీర గతమై
లోన ఊహలో మానస మయమై
ఉచ్వాసంలో కావలసింది గ్రహిస్తుంది
నిశ్వాసంలో అక్కర లేంది వదలుతుంది

ఆయువులో సార్థకతకు యత్నంతో
భాగ్యానికి అన్వేషణ సాగుతుంది

❁

7. నిశ్శబ్దంలో శబ్దం

ప్రకృతిలో కనిపించే వస్తువులన్ని
మనిషి భావ జగత్తులో ప్రతీకలుగా
చూచిన ప్రకృతి దృశ్యం మరపున బడిపోదు
చూచిన మనిషి రూపం మరపున బడవచ్చు

బాధలో హృదయం ముళ్ళ మధ్య గులాబిలా
వేదనలో కవిత ఎడారిలో ఒయాసిస్‌లా
మబ్బు వంగి మనిషి తలను స్పృశించాలని
మార్పులోని గాలి! ప్రతి ఎద తాకాలని

వర్తమాన చలనంలో ఆగామికి ప్రేరణయై
అర్థవంతమయిన కవిత! కిరణంలా సాగాలని
మౌనంలో నిస్తంద్ర సముద్రమై! పర్వతమై!
చంద్రునితో గగనమై! శూన్యం మాత్రం కాదు

పలు అర్థాలకు వీలుగ నిశ్శబ్దం
ఏదో శబ్దం అపుడపుడు వినబడుతూ,
ఏ వాద్య విశేష ధ్వనినో తలపిస్తుంది
మనుషుల మానసిక స్థితిని ప్రతిఫలిస్తుంది

❋

8. శిల్పం సాధ్యం

పేరు ఊరు తెలియక పోయినా
ఒక ముఖ పరిచయ మాత్రంగా
ఒంటరి తనం వెనక్కి వెళుతుంది
సమాజ బంధం! ఏర్పడుతుంది

చెట్టు ముందు చేయి చాచి నిలబడితే
పూవు బదులు ఎండు టాకు రాలవచ్చు
ప్రతి చోట స్వాదు ఫలం లభించదు
ఒక చోట చేదు ఫలం లభించవచ్చు

బంగరు కొడవలి అయితేనేం?
ఇది మొడలో హారం కానేరదు
పదునులో స్నేహం చూపించలేదు
కోతలో బాధను మరపించలేదు

రాయి అయినా దారు వయినా
సహనంతో కఠినమైన క్రియతో
పనికి రానిది తొలగిపోతేనే
రమ్యమైన శిల్పం సాధ్యం

❁

9. దూరం సాధ్యం

అణచ బడిన కోపం ద్వేషం అసూయ పగ
ఏ రూపంలో ఎపుడు బయట పడేదీ తెలియదు
హింసకు దారి తీయవచ్చు
ఆత్మ హత్యలు జరగవచ్చు

పయనంలో కనిపించే పలు రంగుల సూచనలు
మార్పుల దారులలో మనసు కన్ను తెరపించేను
సాగేదీ లేనిదీ తెలియని యానంలో
కాలాన్ని ఈడుస్తూ పోవలసి వస్తుంది

స్వేచ్ఛకు బంగరు సంకెల తొడిగే
క్షోభకు గురి చేసే యంత్రాంగం
పాలనలో శాసన తంత్రంతో ఒకటి
యుద్ధాలను తెచ్చిందీ, సీమలు మార్చిందీ

రంగుల అద్దాల కళ్ళకు
నిజ రూపం కనిపించేనా?
సహనం ఆర్ద్రత స్నేహం సహభావంతోనే
విభేదాలకూ విరోధాలకూ దూరం సాధ్యం!

❁

10. కన్నీరు బిందువులో

దేహంపై మలినంతో పాటుగ
మనసుకు పట్టిన మసి పోయేందుకు
ఉత్తమ సంస్కార పథంలో ప్రబోధమవసరం
అంతశ్చేతన ప్రేరణతో జీవన రాగం ముఖ్యం

తన పుట్టుకతో సృష్టి మొదలు
భావన ఒక అమాయకం!
తన చర్యలతో విశ్వ చలన
కల్పన ఒక అజ్ఞానం

మనిషిలోని అహంకార బీజం నుండి
వికృతి రూపం కనబడుతుంది బ్రతుకులో
ఇది తరు శాఖలవలె విస్తరించి
చీకటి ఎదుగుతుంది! దట్టంగా చల్లగా

కన్నీరు బిందువులో
నిశా కణం! బాధా చిహ్నం
కన్నీరు బిందువులో
శశి కిరణం! ఆశా రూపం

❋

11. కర్తవ్యం

మనసుకు తగిలిన గాయం! అపుడపుడు
పూర్వపు బాధల ముళ్ళను తలపిస్తుంది
జ్వాలా శిఖలను మొలిపిస్తుంది
చీకటి ఆకులు రాలుస్తుంది!

ఆకాశం నుండి పడేవి లేకపోలేదు
మబ్బు వస్తుంది నీరు వదలి పోతుంది
మెరపులతో వెరపులతో పిడుగులు పడవచ్చు
అన్నిటికీ సిద్ధంగా ఉంటుంది! సమాజం

చంద్ర బింబం కనిపిస్తే ఎంత హ్లాదమో!
దగ్గరి కెళితే శిలలు దిబ్బలు గోతులతో భయం!
దూరం నుండి ప్రియమైనవి ఎన్నో!
దూరం తోనే! ఆకర్షణ సిద్ధిస్తుంది

వాస్తవాన్ని గుర్తిస్తూ మనిషికి
ఉన్న స్థితిని బట్టి పోవడ మొకటే!
శంకలతో, కాలక్షేపం కన్నా!
తత్కాలంలో కర్తవ్యం అవసరం

❁

12. మాటలో రాతలో

ఎప్పటి కప్పుడు కొత్త గాలి అలలపై
జీవన పతాక! ప్రాణంతో కళకళ లాడే
మనసు కదలుతుంది పయనిస్తుంది సుదూరం
అప్పటికప్పుడు చేరే కొత్త ఊహలతో

పలు రంగుల సమాజ దృశ్యంలో కలిసి
తన పేరు ఊరు మరచేను మనిషి!
మధ్య మధ్య మబ్బులవలె జ్ఞప్తికి వస్తాయి!
మానస శూన్యాన్ని నింపుతాయి విరామంలో

మాటలో అక్షరాలు! తరగల వలె ఊగుతూ
రాతలో అక్షరాలు! చుక్కల వలె వెలుగుతూ!

ఆరోహణలో ఒకరికి విజయ ఫలం
ఫాల తలంపై నవ సుమమై విరిసేను
అర చేతిలో మర బొమ్మలా ఆడేను

అవరోహణలో ఒకరికి నిశా ముఖం ఎదురుగా!
ఉపకారం అపకారం ఉదయం అస్తమయం వలె
ఒక వైపున లాభం మరో వైపు నష్టం తలపించేను

❁

13. వివిధ స్థాయిల్లో

చరిత్రలో పేరు చేరడమంత సులభం కాదు
తన పేరుతో చరిత్ర పుట వెలగడం విశేషం!
ఒక సందర్భంలో సంఘం అడవిని తలపిస్తుంది
ఏదో సమయంలో చెట్టు నీడ అవసరమవుతుంది

అలసిన దేహానికి ఇల్లు తలపుకు వస్తుంది
మనసుకు తప్పని శాంతి దొరకినట్లుంటుంది
అరణ్యం సమాజం ఒక దాని వెనుక మరొకటి
సమాజ కథలో మనిషిని తిప్పుతాయి! పాత్రలలో

తన యశో మస్తకం నింగిని తాకాలనీ
అక్కడ! ఉన్నదెవరు? ఎవరి కోసం? అంటే
అవని నుండి అందరికీ కనబడాలనీ కోరిక
మెడలు పట్టుకొనే పనికి ఎందరు సిద్ధం?

ఏ ఒకరి కోరిక పైనో బ్రతుకు సాగదు
ఇది అందరి కోర్కెలు! కలిసిన ప్రత్యేకం
తన యోజనతోనే అడుగులు వేసినా
అస్మిత ఒక స్థాయిలో అస్తిత ఒక స్థాయిలో కలసేను!

❁

14. రహస్య పేటితో

పూవు ఎక్కువ కాలం కొమ్మకు నిలవదు!
వీడింది కొన్ని రోజులు మాత్రమే నవంగా!
మనిషి చూపు! పూవు వైపు సరిస్తుంది
చెట్టు వేరు కన్న! పూవు చాల ప్రియంగా!

ఎక్కడికక్కడ నిశ్శబ్దం సహజ సుందరంగా
చిన్ని చిన్ని ధ్వనుల్ని! చేతిలో పాపలా వహిస్తుంది
కలిసే మనుషుల సంబంధాలతో! దృశ్యంలో మార్పు
జీవన రూపానికి అందంతో సార్థం చేకూరుస్తుంది

ఉదయంతో ఆరోహణ దృశ్యం మొదలవుతుంది
కిరణంతో మనిషి తెలివి! ముందుకు కదలుతుంది
వికసించే అస్మితతో రూపొందే అస్తితతో
బ్రతుకు తీరు తెన్నులతో అనివార్య సమాజంలో!

హద్దు లెరగని కాలం! పరుగెత్తుతూనే
మనిషిని వహిస్తుంది బండిలా నావలా విమానంలా!
మనుషుల చేతులపై శ్రమ చేతన తరలుతుంది
తరం నుండి తరానికి జీవన రహస్య పేటితో

❁

15. తిరిగి రాని అమూల్యం

ఎవరి దారి వారిదే! దేని తీరు దానిదే
ప్రకృతి వేరు ఊరు వేరు పరిసరాలు వేరు
జీవన గమనంలో మజిలి రూపాలు వేరు
ఒక దానితో మరొకటి అస్తితలో పోలిక ఉండదు

నరికిన చెట్టు కొమ్మ గాటు నుండి
చినుకుతో చివురు ముఖం ఎత్తుతుంది!
ఎండిన చెరువయితే సంతోషం నిండుతుంది
ప్రాణికి ఆయువు కుసుమ సదృశ మవుతుంది

చండమైన గ్రీష్మ సమాన స్థితి! ఎదురయి
నిరాశలో ఆత్మహత్య జరిగేనా?
వర్షాసేచనతో నిరంకుశం అణగుతుంది కానీ!
హననంతో పోయిన ప్రాణం! తిరిగి వచ్చేనా?

బాధను తుడిచి వేయడానికి
జడ వస్తువు కాదు హృదయం!

మనిషిలో మనో భూమికలో సంస్కృతితో,
దూకే విషాద చర్యకు కళ్ళెం పడుతుంది!

❁

16. తిరిగి తిరిగి

కనుల నుండి జారే బిందువులో సాగే అనల కీలను
భూమి వహిస్తుంది! ఎప్పటికీ సిద్ధంగా ఉంటుంది
రాత్రి చీకటి రైలులో పయనంలో ఏకాంతం
ఉదయం వెలుగుతో ప్లాట్ ఫార్మ్‌పై జన సమూహంలో

మౌన జగం నుండి మాటల ప్రపంచంలోకి
కల్పన నుండి వాస్తవానికి సమాజ సంరంభంలోకి
'నేను' అన్న భావం పగలు విశాల తరమవుతుంది
మనుషుల కలయికతో మిశ్రమానుభవం! నిండుతుంది

'నేను' అన్న భావం రాత్రి కుంచితమవుతుంది
ప్రియావశమో అంతర్ముఖమో అవుతుంది! మనసు
సంఘంలో కష్టాలను భరించలేక అడవికి వెళితే
అడవిలో మృగ జంతు భయం వెంటాడుతుంది

సముద్ర తటానికి వెళితే! వచ్చే అలల మధ్య
మృత్యువు సంకెళ్ళు విసురుతూ అందంగా కనిపిస్తుంది!
పైకి ఎగిరేందుకు రెక్కలు లేవు, కాళ్ళు ఎగర లేవు
తిరిగి తిరిగి భూమిపై సమాజంలోకి రావలసిందే!

❁

17. ప్రకృతికి మనిషికి

వార్తా పత్రిక పుటల్ని పరచుకొని పేవ్‌మెంట్‌పై పేదలు
వాటిలో సమాచార పంక్తులు అనుకోని రక్షణ శ్రేణులుగా
పెద్ద శబ్దానికి పక్షి భయంతో ఎగిరిపోతుంది
మనిషి మాత్రం కాసేపు ఆశ్చర్యంతో శిలయై నిలిచేను

మల్లెపూవు నవ్వు తప్ప ఏడుపు ఎరగదు
మనిషిలో నవ్వు వెనక ఏడుపు సన్నగా
అది కొందరికి సంగీతంలా వినిపిస్తుంది
తమలోని విషాద శిఖరాలను మరచేరు

ఎవరి స్వరం వారిది ఖేద మయిన మోదమయిన
అన్ని కలిసి నపుడె! సమాజ స్వర సమ్మేళనం
తోటి మనిషిపై చూపే సానుభూతి కిరణాలకు
మంచు రాళ్ళవలె బాధలు కరిగే సూచన అంత మాత్రమే!

చెట్టు కయిన చెరువు కయిన కష్ట కాలం వస్తుంది
ఎండిన ఆశలతో ముఖాలు గగనం వైపు చూస్తాయి!
ప్రకృతిలో సరికొత్త జీవం పోస్తుంది వర్షం!
మనిషిలో ఆలోచన ఆర్ద్రంగా నిలుపుతుంది

❁

18. మళ్ళీ మళ్ళీ

ఊరు నుండి ఊరు కొత్త అనుభవంతో
నవ్వులు ఏడ్పులు పచ్చదనాలు శ్మశానాలు
వేరు వేరు భూమికలలో తమ కథలతో
మనుషులు ఎప్పటికప్పుడు సరికొత్త ఆశలతో

కంటి చివర వేలాడే కన్నీటి చుక్క
బరువెంతో తెలుసా? గిరి అయినా తూగలేదు
దీని నెట్లా వహిస్తాయి కనుకొనలంటే?
గర్భంలో శిశువును తల్లి భరించినట్లు!

ప్రాణదాన జలం వదలే మేఘం నుండి
మెరపులతో బోధలు, పిడుగులతో హెచ్చరికలు
వచ్చే నీరు పోయే నీరు తోనే నదీ రూపం
పోయే క్షణం వచ్చే క్షణం తోనే వర్తమానం

శూన్య మయిన నిలయంలా ఉండలేదు మనసు
బొమ్మలతో రాతలతో దుస్తులతో రేఖలతోనే!
పశ్చాత్తాపంలో శుభ్రమయిందనుకునే మనస్సు
మొదటికి వస్తుంది మళ్ళీ మళ్ళీ చీకటి ముద్రలతో

❁

19. దేనికదే

ఒకరి ముఖంలో చంద్ర కళ! స్నేహ సుందరంగా
ఎదుట నున్న ముఖంలోను కనిపిస్తే సార్థకం!
ఒకరి ముఖంలో లేలేత వెలుగు విరిసి అందంగా
ఎదుట నున్న ముఖంలో మంచు తొలగితే సార్థకం

ఏది గమ్యం? దేశమా? ఊరా? ఇల్లా? తన పనియా?
పయనంలో ఎన్నో మజిలీలతో! సమాజ బంధం
గమ్యం చేరే లోపల మజిలీ లెన్నో? శతం
అనుకుంటే! చివరి దానికై నిరీక్షణం బాధామయం

దుస్తులు మారినంత సులభం కాదు మనసు మారడం
మలినం లేకుండా శుభ్రంగా బ్రతకడమొక తపస్సు
ఎత్తులో దూరంలో అన్నీ సమానమే మనసుకు
ప్రతి మతిలో ఒక కారణం మొక్కలా పైకి లేస్తుంది

వేరు మారి ఊరు మారి వేరయిపోతే
ఆ మనిషి గుణం మారేనా? జాతకం మారేనా?
దారులన్ని ఒకటి కావు ఊరులన్ని ఒకటి కావు
దేనికదే ప్రత్యేకం భిన్న భిన్న జీవన దృశ్యాలతో

❁

20. దైవంపై కాలంపై

మనిషి హృదయం చంద్రబింబమయితే
చీకటి మాట! మనసులో ఏ లోయలోనో!
నింగి నుండి మేఘంలో దాగిన నీరులా
మనసులోన మానవత సమయంకై వేచి!

దు:ఖం చీకటి శకలం! సులభంగా తొలగదు
వెలుతురులో కన్నీరులో తేలుతూ కనిపిస్తుంది
నలువైపుల నుండి వార్తలలో ఏది నిజం?
ఏది? నిజం కాదని ఎవరు చెప్పగలరు?

ప్రతి మతిలో ఒక కారణం బాణంలా దూసుకొనీ
లక్ష్యంలో సరి అయినది తన గురియే అన్నట్లుగా
ఎవరి సాక్ష్యం వారిది ఎవరి నమ్మకం వారిది
అంతరంగానికి పని లేనపుడు చూస్తూ ఉండడమే

కత్తి అయినా రైఫిల్ అయినా చంపేది మనిషే
మనిషిలో పరివర్తనపై ఆలోచన మూలాలెన్నో?
సమాజమో! కాలమో! మనోరూపమో! సాధనమో!
దైవంపై కాలంపై బరువు మోపడం సులభం!

❁

21. స్వచ్ఛంగా సంతోషంగా

ఓడిన రాజ్యం శిథిలాలపై నడుస్తూ
గెలిచిన పక్షం మోదం! తమ వరకే పరిమితం!
నలిగిన దీనుల విలాపాల్ని వినే దెవరు?
చెదరిన బాధా దృశ్యాలను చూచే దెవరు?

శూన్య మనుకునే ఆకాశంలో ఉన్నవి ఎన్నో?
సూర్యుడు చంద్రుడు చుక్కలు గ్రహాలు మబ్బులు!
వీటి పైపైన దివి గురించి కల్పనలు!
ఉన్నంత వరకు బ్రతుకులో భువియే నిజం!

హర్షంతో మేఘం అదృశ్య మవుతుంది
విజయాలెన్ని పొందినా! ఇంకా కోర్కెల పట్టిక!
భూమిపై మనిషి దేవతకన్నా! నీలి మబ్బుకై
ఎదురు చూచేను! శుష్కమైన ముఖంతో

దాహం తీరుతూ బ్రతుకు శుభ్రమవుతూ
మనిషి కోర్కె తీరడమొక సుందర పరివర్తనం!
ఆపదలో దూకి హత్యకు దిగేది కాదు ప్రవాహం!
స్వచ్ఛంగా సంతోషంగా బయట పడే! రస రూపం!

❁

22. కవి మనో బంధువు

చుట్టు సందడిగా ఉన్న సమాజ చలనంలో
ఒంటరితన మొక మానస స్థితిలో మౌనం
స్పందన తక్కువగా ఉన్న మనో రూపం
మనిషిని ఒంటరి చేసి వదలుతుంది

వ్యక్తిలో ఎదిగే శక్తి లతలు అల్లుకొని
పూలతో సమాజ యశసు పరిమళిస్తుంది
శ్రమను సహిస్తూ వెళ్లే బహు దూరం నడకలో
ఝుంఝూ పవనం ఎదురయి నిలిపేసేను!

భూమిపై కల్పనల కవకాశం లేదు
అంతటా విస్తరించి ఉన్నది యథార్థమే
దేహం లేకుండా మనో రూపం లేదు
దీని చేతనే మనిషి ఆకృతికి అవకాశం!

నిప్పు సెగల నుండి నీళ్ళలోకి చేరినట్లు
జ్ఞాపకాల నీడలోకి మనసు చేర చూస్తుంది
విరోధాన్ని నిరోధాన్ని చెర పేస్తూ కవిత!
సంక్లిష్ట సమాజం! కవి మనో బంధువవుతుంది

❁

23. సఫలం విఫలం

బాధకు దు:ఖానికి పగలు రాత్రి తేడా లేదు
అనుభవ చక్రానికి ఎగువ దిగువ భేదం లేదు
శిశువు ఏడుపు స్వరం వృద్ధులోను స్వనిస్తుంది
బ్రతుకుంతా స్వర లహరుల అనురణన మయం

నిలవని కాలానికి మనోజ్ఞ వ్యాఖ్యానంలా
కొత్త పాత భేదం లేని అనుభవ ప్రపంచం!

పెట్టె నుండి పెట్టెలోకి మారే వస్తువు కాదు ప్రాణం
ఏ దేహాని కది నియతంగా నిలిచే స్వతంత్ర రూపం!

వలదంటే ఆగిపోదు గ్రీష్మం
పిలవగనే వచ్చేయదు మేఘం

రెండూ జీవన గమనంలో అనుభవ కేంద్రాలు!
సమాజాన్ని ప్రకృతిని శాసించే శక్తి ప్రతీకలు

మస్తిష్కంలో మేధ ప్రతి పనిని నియంత్రిస్తుంది
మతి ప్రభలు అవసరానికి సిగ్నెల్స్‌గ మారతాయి
సఫలం విఫలం అనేవి జీవన రణంలో
కనిపించీ కనిపించని కారణ పర్యవసానాలు

❁

24. నలువైపుల చూపులతో

కురుస్తూ కురుస్తూ మేఘం అదృశ్యమవుతుంది
పలుకుతూ పలుకుతూ మనిషి ఊపిరి వదలేను

భూమి ఎంత అవసరమో జీవన గతికి
బ్రతుకు అంత ముఖ్యమైంది శరీరానికి!

శత్రుతలో మనసు చుట్టు నిలుస్తాయి కంచెలు గోడలు
మిత్రతలో మనసు చుట్టు చూపు మేరలో విశాలావరణం

రెండూ తప్పని అనుభవ స్థితులతో మనుషులు
రోజుల పుటలలో అక్షర పంక్తుల్ని నడిపిస్తూ!

నిట్టూర్పులో దూరం సాగిన నిశ్వాసం
ఆగినట్లయి అంతలో ఉచ్ఛ్వాసం అందుకునేను

ఓటమి ఒక పాఠం కలహం ఒక పరీక్ష
రెండింటిలో ఎప్పటికీ జీవిత మొక ప్రయోగ నిలయం

వ్యక్తి నుండి సమాజానికి ప్రకృతి నుండి ప్రపంచానికి
అస్తితలో దేని కోసమో! వెదకుతూ మనిషి!

అది తనలోనే ఉన్నది తెలియదు! ఒక వైపు చూపుతో
నలువైపుల చూపలతో కోరే వస్తువు కవకాశం!

❁

25. కవితల వలె అమూల్యాలు

లిప్తల ముఖ పంక్తిని వెలిగించే కోరిక లెన్నో
అవి మాత్రం ఇంకా! దిశలకు వ్రేలాడుతూ
తీరాన నడుస్తూ పోతే ఉన్న లోభి అయినా కనబడవచ్చు
లోతు తెలియని జలధిలోకి దిగితే లేని దాత కనబడేను

ప్రతి మదిలో రహస్యాల గదులు తాళాలు వేసీ
ఎపుడో తగిలే గాయాలకు సమకూర్చిన మందులతో
బ్రతుకులో స్థితు లొకటొకటి బలమైన ఒత్తిడిలో
ఏది చేయకూడదో అది ముందు వరసలో చేరుతుంది

చేయాలిసి ఉన్న వెన్నో! మరపున బడి పోతాయి
వస్తూ పోయే మొగిలు పీలికలతో అంతరంగ బింబం
ఉదయ కిరణం వేలు పట్టుకొని నడచే నాలో
బహుమతిగా పొందిన జీవన కళాకృతు లొకటొకటీ!

అద్దాల అల్మెరాలో అమర్చిన బొమ్మలు! వరసగా
మదిలో అనుభవాల ముక్కలతో స్మృతి చిత్రం! దింపేను
రైలులో ప్రయాణికుల వలె! నాలో! నాతో పాటు
కవుల సమావేశంలో కవితల వలె! అమూల్యాలు!

❁

26. ప్రశ్నిస్తూ వెలిగిస్తూ

అడవిలో చిన్న ముక్క పల్లెగా ఊరుగా
ఊరు నుండి నగరం బ్రతుకు తెరువు వైపు
కోర్కెల విస్తరణంలో భాగ్యం భద్రత రక్షణ కయి
లోన ఇంకా ఆటవిక చిహ్నాలతో! మనుషులు

ఒక దశలో చొర రాని అరణ్యం, రహస్య స్థలం
మృగాలతో జంతువులతో కలిసి మనిషి జీవితం
సంఘంలో పరివర్తన కోరే సాయుధ మూర్తులకిపుడు
ఆశ్రయమై, గుప్త నిలయమై, కాపాడుతూంది

అడవి అంటే పచ్చదనానికి సృజనకు సంకేతం
అపుడపుడు ఆయుధ శబ్దాలు చెట్లను మేల్కొల్పేను
ఎగిరే పక్షుల కలరవాలతో నేలపై విషాద దృశ్యం!
తునకలు తునకలుగా బీభత్స ముద్రలతో! చెదరీ!

అపుడపుడు ఎర్రదనం వహిస్తుంది, నెత్తురు చారలతో
అడవి నుండి మనిషి తిరిగి అడవిలోకి నిలిచిన గుర్తులతో
హింసలో హంసను మరచి, సంధ్యా రేఖపై అటో ఇటో
వ్యక్తి అస్మితను వెలిగించేను మనిషి అస్తితను ప్రశ్నించేను

❁

27. ఇల్లు అంటే

సూర్యుడు భూమికి దిగి రాడని అందరికీ తెలుసు
చంద్రుడు అవనికి దిగి నడవడని అందరికీ తెలుసు
మేఘం గగనం లోనే కదలేనని బాగా తెలుసు
ఇవి తెలిసిన మనిషిలో! చతురత కిందికి జారుస్తుంది

చీకటి నా కోసం రాత్రి అంతా వెదకుతుంది
తన కొంగు చాటున శిశువు వలె ఉన్నది తెలియదు
గర్భంలో చీకటితో మొదలయిన జీవితం
చివరి వరకు బింబమయినా చీకటి గుర్తులతో

విత్తు చివురు మధ్య, ఊహ క్రియకు మధ్య
లౌకిక తటం నుండి, అతీత ప్రవాహం వరకు
ప్రకృతి లోని! మనిషిలోని చేతన రేఖయే!
మనసు లోను! సృజన లోను! వికాస హేతువు!

కలిసినపుడు మనుషుల ముఖాలలో చిరునవ్వు
మానవ సంబంధాలకు పునర్నవత నిస్తుంది
ఇల్లు అంటే! గోడలు కిటికి తలుపుల నిర్మాణంతో
ఆత్మీయం ఆనందం రెక్కలపై తిప్పే అస్మిత రూపం!

❁

28. చిరు దీపం

ఒక చిరు దీపం నిశి నిశి అంతా
గదిలో చీకటి తల పయి మోసేను
వెలుగు దారి చూపడమే కాదు
మనిషిలో భయ జలధిని పడవయై

తలుపులు కిటికీలు మూత పడిన గృహంలో
పరితాపం చెందుతుంది గాలి స్వేచ్ఛకై
స్వచ్ఛ మయిన ఊపిరి కయి గుండె తపిస్తుంది
మనిషి నుండి బయటికి చర్యలు మొదలవుతాయి

అణువు నుండి విస్ఫోట ప్రయోగమెంత అవసరమో
సమాజ భాగ్యానికి వికాస ప్రకాశమంత ముఖ్యం
గతానికెవరూ నిప్పంటించే పని లేదు
దానంతటది కనుమరుగై వెళిపోతుంది

చీకటి వస్తుంది! మనిషి మనిషిని వేరు చేస్తూ
వెలుతురు వస్తుంది! బ్రతుకు బ్రతుకును కలిపి వేస్తూ
శ్మశానంలో సమత వినాశన పదంతో
సమాజంలో సమత నిర్మాణ నవంతో

❁

29. నిజ రూపం ఒకటే

తెరచిన పుటతో దిన పత్రిక చేతిలో
సన సన్నని తీగెలాగ ఎగసే పొగతో
తన కెదురుగ టీ కప్!
చిన్ని ఆశకు నిలయం!

టెలివిజన్ స్క్రీన్‌పై దృశ్య శ్రవణ రూపం
గదిలో వస్తూ పోయే మనుషులు!
విరిసిన పలు విధాల సుమ ముఖాలతో
రోజు మొదలు మారే అనుభవ రుచితో

శ్రమ శక్తులతో ఉదయ కిరణ ప్రేరణతో
ఆ రోజున కిది ఒక సుందర అవతారిక!
ఎవరు? ఎక్కడికి? ఎందాక పయన మంటే
ఎవరి అనుభవం వారికి జవాబు నిస్తుంది

కవితకు వస్తువు కయి వెదకే పని లేదు
ఈ సంక్షుబ్ధ సమాజంలో ప్రతి చోట!
వాస్తవాను భవంతో మనో విధం వేరయినా
అంతరంగ బలంతో నిజ రూపం ఒకటే!

❁

30. నిఖిల మానవ సిగ్నేచర్

క్షణం మారుతుంది మరొక తీరుగా
అగ్ని కణం కావచ్చు నిరసన రవంతో
మబ్బు ముక్క కావచ్చు సమరస స్వరంతో
ఎప్పుడేది జరిగేదీ తెలియని జీవితంలో

ఒకదాని కొకటి పారదర్శకమై బ్రతుకులు
సమాజ చలనంలో భాగమై గడపడమే!
కాలానికి బంధించిన ఆయువుతో
వాహన వేగంతో ముందుకు పోవడమే

రణంలో నగరాన్ని చుట్టు ముట్టి
అగ్ని కాహుతి చేసి గెలవడమొక దౌర్భాగ్యం!
జన జీవన దృశ్యం! బీభత్స కథలతో
మంటలలో మానవం ఒక! చీకటి పర్వం

స్వేచ్ఛలో కవికి అందరూ మిత్రులే
ప్రతి క్షణం అర్థవంతమవుతుంది కవితలో
ముఖాన చిరు నవ్వు అయినా కన్నీరు అయినా
ఏదైనా! అది నిఖిల మానవ సిగ్నేచర్

❁

31. ఆశామయమై

డైరి పేజిలో అక్షరాలవలె మనుషులు సమాజంలో
ఎవరు ఎవరితో కలిసి అర్థవంతమయ్యేది తెలియదు
ముందుగ తెలియక పోవడమే
ఆ మాట కున్న రహస్య బలం!

పద పద సంబంధంతో అర్థం వికసితమవుతుంది
మనిషి మనిషి కలయికతో పనులు సులభమవుతాయి
ఆలోచన గట్టుపైన నడచే మనిషికి
ఒక వైపు జలధి! పురా స్మృతి విలోల రూపం

నేల పయి పచ్చదనానికి మేఘాలను వదలుతుంది
బ్రతుకు తెరువు నుండి ఇది సంస్కృతి విభవానికి చిహ్నం
ఒక వైపున భూమి! వర్తమాన విభిన్న దృశ్యాలతో
నీటికీ నేలకూ సంబంధం! సుఖ వికాస జీవన మూలం

మండే ఎండల సెగలతో అలంకృతమైన చెట్టు
పచ్చని హృదయంతో ప్రాణికి స్వాగత మిస్తుంది
తీవ్ర తీవ్ర ప్రభావాలతో రుతు చక్రం సహిస్తుంది
వహిస్తుంది! మనసు! ఆశామయమై అస్తితలో

❁

32. శ్రమ చేతనతో

కర్షకులూ కార్మికులూ శ్రమ చేతనతో
భువిని వదలి నింగి వైపు చూపులు ప్రసరించరు
చేతిలో పిడికెడు మట్టి తీసుకొని వేదనతో
వదలితే! నిప్పు రవ్వలు! జారేనా?

వెలుతురులో ఉన్న వ్యక్తి మనసు
చీకటి మూర్తులకు వేది అవుతూంది
చీకటిలో ఉన్న వ్యక్తి మనసు
వెలుగు! ఊహలకు నిలయమవుతూంది

ఇపుడు జరుగుతూన్న సమాజ వ్యధలో
మంచి ఘడియ! పాత్ర ఎంత? బహు స్వల్పం
అడుగడుగున ఊహకూ క్రియకూ అన్వయ లోపం!
ఎగుడు దిగుడు బ్రతుకులో ఒడుదొడుకులు స్పృజిస్తూంది

దేశ వాసికిది తన గృహమనిపించడం లేదు
చిన్న చిన్న గదుల కిటికీల నుండి ఆయుధాలు
ప్రేలే శబ్దం! కన్నీటి చుక్కలతో తడిసీ
దూసుక పోతూంది ప్రియ పరివారంపైకి

❁

33. ఎప్పటికీ ఇక్కడే

పగలు కళ్ళు మూసినంత వరకే చీకటి
కళ్ళు తెరిస్తే ఊహకు చీకటి శృంఖల అవుతుంది

గగనం పిలుస్తుంది! ఆదరంగా తన వద్దకు రమ్మని
శబ్ద లహరుల పయి కదలే కవితను విని
అసలు మాట మరచి వెళ్ళిపోతుంది
ప్రక్క నున్న శ్రీమతిచే విశేష సన్మానంతో

గాలి స్పృశిస్తుంది! తనతో రమ్మని ఆప్యాయంగా
భావ రేఖల పయి కదలే కవితను విని
అసలు మాట మరచి వెళిపోతుంది
ప్రక్క నున్న శ్రీమతిచే సనంద సన్మానంతో

వెలుతురు నిలుస్తుంది! తనతో రమ్మని ఆనందంగా
దార్శనిక ప్రకాశంలో నడచే కవితను విని
అసలు మాట వదలి వెళ్ళిపోతుంది
ప్రక్క నున్న శ్రీమతిచే విభాత సన్మానంతో

నేను మాత్రం ఎటూ పోయేది లేదు
సమాజ బంధువై! ఇక్కడే ఎప్పటికీ!

❁

34. కోరికపై అంతరంగం

వీచే గాలి సవ్వడి ఎప్పటికీ ఒకలా ఉండదు
కురిసే వాన శబ్దం! ప్రతి సారీ ఒకలా ఉండదు
లోతులు తెలియాలిసి విస్తృతి చూడాలిసి
జలధి లాగ ఎప్పటికీ అన్వేషణలో జీవితం

ఎన్ని నాళ్ళకో కనిపించిన వ్యక్తి
దొరికిన తన పాత పుస్తకంలా,
అపుడే పరిచయ మయిన మనిషి
అందిన సరికొత్త పుస్తకంలా

రాసింది తుడిచేస్తూ మళ్ళి మళ్ళి
పలకపై అక్షరాల వలె ఆలోచనలు
పదపదంలో గంధం మనసుకు అందేనా?
వాక్యంలో సారం హృదయం పొందేనా?

కవుల యశసు చిహ్నం కవిత్వం
వ్యక్తి కీర్తి శిఖరం మానవం
బయట నుండి ప్రశ్నకు దొరకని సమాధానం
లోనుండి కోరికపై అంతరంగ మిస్తుంది

❁

35. వాస్తవమూ ఆదర్శం

బుజాలపై మర్యాదా చిహ్నం శాలువాతో
మనిషి వెనక నుండి పురాణ పాత్రలు
గతంలోని స్పందనల్ని వినిపిస్తాయి
నీడల వలె వదలవు వర్తమాన మన్నట్లుగా

ప్లాట్ ఫార్మ్‌పై నిలిచి ఉన్న రైలు చూచి
అది వెళ్ళే దిశ తెలియకుండ పయనం సాగేనా?
ఫలితం దక్కేనా? గమ్యం చేరేరా?
గతం దారి వేరు, వర్తమాన పథం వేరు

జీవన లక్ష్యంపై ఎక్కు పెట్టిన చూపుతో
సమయంతో సాగుతూ జీవన సోపానాలపై
ఎప్పటి కప్పుడు మజిలీ అందే విధంగా
భూమి నింగి కలిసినట్లు వాస్తవమూ ఆదర్శం

మబ్బులతో ఆడుకునే కోరిక పిల్లలలో
స్వర్లోకం చేరాలని కోరిక పెద్దలలో
మబ్బులు కిందికి దిగలేవు దిగవు
స్వర్లోకం కనిపించదు! ఇపుడందేది కాదు

❁

36. అక్షర వర్తనలో

ఘర్షణ కోరే మతిలో అలల వలె ఊహలు
కనుల ముందు ఎత్తిన కత్తులతో దృశ్యం!
శాంతి కోరే ఎదలో విరిసిన పూల వనం
కనుల ముందు కదలే విశాల జన సమూహం

ఎదలో నది కిరు వైపుల తీరాలు సమానం
ఆర్ద్రమైన అనుభవం ప్రాణి ప్రకృతి సొత్తుగా
మంచి తనం ఎప్పటికీ హ్లాదమయం
అనల కీల నార్పే జలద మనోజ్ఞం

ఎప్పటివో పురా కల్పనలు సమాజంలో
మధ్య మధ్య వాస్తవ జీవన శిఖరాలపై
ఎలోరా అజంతా తాజ్ మహల్ కళా రమణీయాలు
తమ నివాస నిలయాలుగా మార్చేరా?

నిశ్శబ్దంలో శబ్దం విరిసిన కమలం రేకుల వలె
మాటగానొ! స్వరంగానొ! స్వనంగానొ! కవితయై
మనసు నుండి అక్షర కిరణాల వర్తనంలో
అస్మిత అస్తితల కలయిక రూపం వ్యక్తి జీవితం!

❁

స్వేచ్ఛా కవిత్వం-80

ఇది జీవితం

(v భాగం)

వాస్తవ చక్రంపై

మాదిరాజు రంగారావు

2017

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 80

IDI JEEVITHAM

(V Part)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2017

Presented to
my wife
Smt. Indira

పీఠిక

ఇది "ఇది జీవితం" – బృహద్రచనలో అయిదో భాగం. వర్తమాన సామాజిక రాజకీయ నైతిక స్థితిగతుల స్పందన రూపం. వర్తమాన కాలంలో తెలుగులో కవిత్వం అనేకమైన అనివార్యమైన కారణాల వల్ల విభిన్నతలతో వైవిధ్యాలతో వైరుధ్యాలలో పాయలు పాయలుగా ప్రత్యేకతల్ని పొందుతూంది. విశాలమైన సమాజ క్షేత్రంలో తమ పాత్రల్ని నిర్వహిస్తుంది. ఇవి ఒకదానికొకటి వ్యతిరేకాలు కావు. మొత్తం మీద సమాజ శ్రేయస్సు దృష్టితో ఒక దానికొకటి పోషకాలుగా సహాయకాలుగా పరిణమించడమూ జరుగుతూంది. స్వేచ్ఛా కవిత్వంలో ఈ రచన (80) ఎనభైయవది. ఈ పరంపర ఒక యోజనతో సాగుతూంది. సామ్యవాదాన్ని లక్షించే ప్రజాస్వామ్య దార్శనికతను అవలంబించింది. మానవీయమైన విలువలతో హక్కుల్ని కాపాడే దిశలో కవిత్వ ప్రయోజనాన్ని విస్తృత పరుస్తూంది. సామాజిక వాస్తవికతకు ప్రాధాన్యం కలిగిందీ. వర్తమాన తలంపై వ్యవహరించేది.

ఇక రూపంలో వచన కవిత్వానికీ ఈ స్వేచ్ఛా కవిత్వానికీ కొంత భేదం ఉంది. స్థూలంగా ఒకటే అనిపించినా సూక్ష్మంగా వేరుగా వివేచనకందుతుంది, స్వేచ్ఛా కవిత్వం ఇంత వరకూ గొప్ప పాత్రను నిర్వహించిన (1) పద్యాన్ని గౌరవిస్తుంది (2) గేయాన్ని మన్నిస్తుంది (3) వచనాన్ని ఆదరిస్తుంది. ఎంత కాదన్నా వీటి ప్రభావం స్మృతిలో మిగిలే ఉంటుంది. వీటిలో విస్మరించలేని అంశాల్ని తలపించే, అమూల్యమైన గుణాల్ని అవసరమైనపుడు రచనలో అంగీకరిస్తుంది. వీటిని పూర్తిగా వదలించుకోవాలన్న భావన – కవిత్వంలో అభివ్యక్తి కళను పరిమితం చేస్తుంది. కవిలో సృజనకు సంబంధించిన స్వేచ్ఛకు క్షతి కలిగే అవకాశం ఉంది. విశాలత లోపిస్తుంది, ఏలాగో తెలిసో తెలియకనో కవిత్వ పరిణామ దశల్లోని వివిధ ప్రభావ రూపాలు అంతో ఇంతో చోటు చేసుకోవడమూ జరుగుతుంది. ఇది ప్రస్తుతం జరుగుతూన్న విషయం. విస్మరించడానికి వీలుకానిదీ.

ఈ స్వేచ్ఛా కవిత్వం 1) ప్రకృతి నేపథ్యం 2) సమాజ స్థితిగతులు 3) పరివర్తన గుణం 4) ప్రగతి శీలం 5) ప్రజాస్వామ్య దార్శనికతతో 6) అభివ్యక్తిలో భావ రూపాలు, (images) ప్రతీకలు, (symbols) అక్కడక్కడ చైతన్య స్రవంతి స్పర్శ (touch) తో ఆవిష్కారాన్ని పొందింది. ప్రత్యేకతను భావింపజేస్తూంది. ఇది తెలంగాణా ప్రపంచ తెలుగు సభల సమయంలో (15–19 డిసెంబర్ 2017) వెలువడడం ఆనందకరమైన విషయం.

– మాదిరాజు రంగారావు

ఇది జీవితం (అయిదో భాగం)

1. ఇది నాన్ స్టాప్

అయింది చాలు! జీవితంలో నిండుగా
ఇక ఫుల్ స్టాప్ తప్పదు అనుకున్నా
తృప్తి రేఖ అడ్డంగా గీసినా
కదలిక మానని ఆగని గాలితో
సాగే శ్వాస వెనకనే కవిత! పంక్తులుగా

ఇక ఇంతే సంగతులనుకున్నా
విరమణ కాలాన్ని కూడా గుణించి నిర్ణయించా
శిలలను సయితం అవలీలగ దాటేస్తూ
నడకలు ఆగని ప్రవాహంలో ముందుకు
సాగే అలల వలె కవిత! అనాయాసంగా,

ఇక ఇంతటితో సమాప్త మనుకున్నా
నిశి నిద్రా సమయం ఒక మిషగా చేసా
మేల్కొనగానే ఉదయం దూకే రవి కిరణంలా
స్పృశిస్తూ లోన సృజన ఉత్తేజ పరుస్తుంది
కవితా ప్రకాశంతో మనసు నావహిస్తుంది

ముందుగ కొలతలతో యోజనతో పరిణమించదు
అనుకోని మార్పులతో సరికొత్త కోణాలతో
గగనమంత ఎత్తుగా జలధి అంత లోతుగా భూమి అంత విశాలంగా
విశ్వమయమై జీవితం! ఎదురుగా సంగ్రహంగా
కవిత వెడలుతుంది చకితంగా నాన్‌స్టాప్‌గా

శూన్యమైన క్షణం లేదు బ్రతుకులో
దీన గుణం లేదులోన మనసులో
నిన్న కన్నా నేడు అందంగా ఉంటుంది
నిరాశనూ విషాదాన్ని పక్కకు నెడుతూ

కాలం మెడలో నవ కుసుమ మాల అనుకున్నా
కాలం తలపై జ్వాలా మకుటం అనుకున్నా
ఇది రోజు వారి వ్యవహారం కాదు, అతీతం
వాస్తవ చక్రంపై కవితను నడిపిస్తుంది

2. ఉనికి ఇచటనే

మొదటి శ్వాస నుండి
చివరి శ్వాస దాక
గాలి కదలికలో బ్రతుకులు గడచేను
ప్రతి క్షణ మొక పూవై వాస్తవమై తరలేను

శ్వాస ఆగి శూన్య మైన స్థితిలోను
మిగిలే అస్తిత ఇచటనే
ఈ మట్టిని అంటుకొనీ
రుచిర యశో బింబమై

ముక్కలలో కనిపించదు అస్తిత ప్రయోజనం
ఒకటిగ అందినపుడే పూర్ణమైన అనుభవం

ఇల్లు ఎదురు చూస్తూంది వేయి కళ్ళతో
బంధుతలో స్పందనలో ఆకర్షణ రూపం
ఆలస్యంలో ఆవేదనతో హృదయం
ఉష్మ రశ్మి చుట్టిన హిమ శిఖరంలా

ముంగిలిలో కార్పెట్‌లా చూపులు పరచబడీ
వయసును మరపిస్తాయి, శిశు దశలో దింపుతాయి

లోనుండి బయటికి రాగానే
అనుబంధంతో ఇంటి ముందు చెట్లు
పలకరింతలో తలలాడిస్తాయి
ఆకృతిలో జన తతిని తలపిస్తాయి

చివరి మెట్టుపై కూర్చొని ఉన్న దాలి!
లేచి ఒడలు సాచి రెడీగా
బయటి గేటు దాక ముందు నడుస్తుంది
ఇంటి మేరలో ఎస్కార్ట్‌లా బాధ్యతగా

తెరవబడే గేటు రెక్క సవ్వడిలో
పాత పరిచయ స్వరం వినిపిస్తుంది

3. జలద హృదయం

గేటు దాటుతూనే మనుషులు! ఒకరొకరు
మౌనంలో కొత్త వెలుగు చిత్రం వదలుతూ
చూపు మెరసి తీవెలా చుట్ట వచ్చు
మాట ఎరిసి పూవులా తాక వచ్చు
కత్తి అంచు తళుకు చకితంగా మెరవచ్చు
స్నేహ వీచి ఎగసి తాకి పలకరించవచ్చు

పొదలు దాటి తోట కంచె పక్క నుండి
చెరువు గట్టుపై నుండి చిన్ని చిన్న గిరులు దాటి
నదులు గడచి క్షణ మొక అనుభవ రుచితో
ఇల్లు ఎడం అవుతుంది, ఊరు వదల బడుతుంది
పాత అనుభవాల ప్రపంచం మతిలో ఊగాడుతూ
కొత్త అనుభవ లోకం గతిలో తారాడుతూ

ప్రకృతిలో వలె వైరుధ్య విభేదాలతో సమాజం
ఒక స్థితిలో స్తబ్దత, ఒక స్థితిలో సక్రియ
గ్రీష్మ తాపంలా ఉద్రేకం కొరకంచును తలపిస్తుంది
వర్ష సేచనలా అనురాగం ఆర్ద్రత విలసిస్తుంది
జీవన వ్యవహారంలో అంతశ్చేతన పాత్రతో
దైవం తలపుకు రాని సందర్భాలెన్నో!

భూమి చుట్టు జల వలయం హత్తుకొనీ
మనిషిలో కరుణను జ్ఞప్తికి తెస్తుంది
తన చుట్టూ జన సమూహ బలం
ఒంటరితనాన్ని దూరం చేస్తుంది

చీకటి కరగదు పక్కకు జరుగుతుంది
కిరణం బయట పడేది నియమిత సమయంలోనే
బాధల అనల శిఖలపై అడుగులు వేస్తూ
పోవడ మొక జలద హృదయ ధైర్యంతోనే!

❁

4. చిన్ని నాణెమంత

చిన్ని నాణెమంత చలామణి ప్రతిభతో
విశ్వమంత కీర్తి పేటిపై లిప్స
తాడు చుట్టి విసరిన బొంగరం
చిన్ని ములికపై గుండ్రంగా తిరిగినట్లు!

నిప్పు రవ్వ కెగసిన పూరి గుడిసెమంటలా
ఆవేశం ఉద్రేకంలో మానసిక వికారాలు
అకాల మరణానికి దారి తీయవచ్చు
అడవిలో పొదల నుండి పులి వలె
హింసా చరణంలో తీవ్రత పెరుగుతూంది
చివరన శత్రుత! శిథిలాలపై నడిపిస్తుంది

నాగరక సమాజంలో అశాంతి సందర్భాలలో
అరణ్యాన భయ భయంగా నడచినట్లు ఉంటుంది
మనిషిలో శక్తి యుక్తి అపమార్గం పడతాయి
ఇది సమాజ సంస్కృతి శిఖరం కూలే దృశ్యం!
గగనంలా మనిషి మనసు! తెలియరాని దెంతో
తెలిసేది! ముక్కలు ముక్కలుగా ఏ కొంతో!

పాతకు పూర్తిగ వీడ్కోలు మాట
పలకడ మంత సులభం కాదు
తోసుక వచ్చే మార్పుకు తలుపులు
మూసి వేయడం! కుదరని ఆలోచన!
అవసరాల ఒత్తిడిలో ఆధునికంతో
సమాజ పరిణామంలో ఆగదు ప్రస్థానం!

వాస్తవానుభవాలతో వర్తమాన కాలం
బ్రతుకునకపూర్వమై అంతరంగ స్పర్శతో
సహనం నిర్మాణానికి ఆధార తలంగా
సమాజ దశ మారడం! తప్పని చారిత్రకం!

5. రోజు మార్పులతో

ఉదయంతో వెలుతురు కాన్వాస్ పయి
ఆ రోజు దృశ్యం మార్పులతో, ఒకటొకటీ
రాత్రి చీకటి కాగితం పయి
తెలుపు రేఖల చిత్రం! మనసులో

చీకటిలో నేల సమతల మనిపిస్తుంది
వెలుతురుతో ఎగుడు దిగుడులతో బయటపడుతుంది
కదలే సమాజ చక్రంలో వ్యక్తుల గుర్తింపు
తమ రంగుల చర్యల ఆకర్షణ తోనే

రసన ఒకటే! రుచి తీరులు వేరు!
మనిషి మనిషికీ రుచి భేదం అనుభవ రూపం

చరణాలకు సంకెల లెవరు కోరతారు?
ఒళ్ళు వంగని వారు! కళ్ళు తెరవని వారు!
నిశి చీకటి ఖైదులో శశి బింబంలా
కల్పనలో కాలం గడచే స్థితులూ వస్తాయి

త్యాగానికి సిద్ధమైన వర్తనలో
తగిలిన గాయాలను ఆభరణాలుగా
వేసిన వేషాలను నటనా నిపుణతగా
చెదరిన వాస్తవ శకలాలను తలపించేను

మహానది కట్ట పయిన నడుస్తూ నడుస్తూ
దప్పిక అయి నీరు లోతు చేరలేక
దిక్కులు చూచే సమయంలో పైన తలపై
కదలే మబ్బులు దాహం తీర్చేనా?
తనతో పాటుగ దూరం తీసుక వెళ్ళేనా?
ఎంత దూరమంటే! అవసరం తీరే దాకనా?

దాహం ఆకలి ప్రాణికి సహజం తప్పనివీ
ఆలోచన అన్వేషణ ప్రగతికి తప్పనివీ

6. స్పందన ముఖ్యం

వ్యక్తుల మధ్య గుంపుల మధ్య దేశాల మధ్య
రణ మారణ చక్ర భ్రమణాలను నిలపవచ్చు
కాస్త సహనం చిగురిస్తే
కొంత ఉదారత సుమిస్తే
సుడులు తిరుగుతూ వచ్చి పడే
మనసులో క్షోభ నెవరు ఆపగలరు?

డ్రెస్ మార్చినంత సులభం కాదు మార్పు!
ఉదయంలో రవి తేజం తనలో దిగేనా?
ప్రతి మనిషి పట్ల సమత మమత చూపేనా?
దూసే ఆశకు మిసైల్‌లా లక్ష్యం అందేనా?

తనువు ఊహ నడత బ్రతుకున పూర్ణత కయి
తనవి కాని వెన్నో! అందక చూపుకు వేలాడేను

కోపంలో కేక! ఎరుపును తలపిస్తుంది
హ్లాదంలో మాట! తెలుపును చూపిస్తుంది
హననంలో చూపు! నలుపును విసరుతుంది
ఉప కృతిలో చర్య! పసిమిని నింపుతుంది

ప్రతి ఒకరికి రోజు! మరిమళ కమలం కావాలని
అంతలో! పై నుండి దుర్గంధం తరలి వస్తుంది
దీని నెవరు ఆపగలరు? ఎవరు? ఇంక! గాలియే
ఆపై నుండి వస్తుంది! శుభ్ర పరుస్తూ వెళుతుంది

ఒకరు వదలిన పనిని మొరకరు పూనుకునేరా?
ఇరువురి మధ్యన పూర్తి కావలసిన ఖాళీలెన్నో!
విభిన్నమైన అస్తితలతో రూపం మారుతుంది వేరవుతుంది
ఆరి పోయి, మళ్ళి వెలిగే దీపం కాదు! ప్రాణం
మంచు తెరలు పోయేందుకు
మంట కాదు, రవిరశ్మి అవసరం
శూన్యం తొలగేందుకు తనలో
సమాజ బంధంతో స్పందన ముఖ్యం

7. అమృత స్పర్శతో

మౌనంగా ఉన్న చంద్ర బింబాన్ని చూస్తూ ఉంటే
ఆ రాత్రి అంతా నా కథ చెప్పాలనిపిస్తుంది
జల పాత మయితే శిలలతో ఆటలాడుతుంది
మహానది అయితే అవనితో మాటలాడుతుంది

భావ కుసుమ పంక్తికి మానుష సూత్రం
పరిమళ సుందరతలను నిలుపుతుంది సమాజంలో

ఎటు బడితే అటు మానవం పేరుతో వాలిపోయే
దూది బొమ్మ కాదు! కవి మనో రూపం!
సమయ సమయానికి మారే కప్పల తక్కెడ కాదు

వెలుగు చూపుతో "నిజం" తూచే అనన్యం
శిలలను దువ్వుతూ పొదలను నిమురుతూ
గాలి బుజాలపై చేతులతో రస ధునిలా
కవిత! అక్షర పంక్తిలో అవిరామంగా!

మహానదికి మరణం లేదు, దప్పిక ఎరగదు
ప్రాణుల దాహం తీర్చేందుకు సంసిద్ధంగా
పచ్చదనంతో ఆకలి తీరే ఆశను పెంచుతుంది
సృజన పథంలో బ్రతుకును నడుపుతుంది
తుపానులో కల్లోలాన్ని సహిస్తుంది

తాపంలో చండతను వహిస్తుంది
కళ్ళు తెరచినా మూసినా "నిజం"!
ఒకటే! వెలుగుతుంది చేతనతో
సమాజ చలనంలో దార్శనిక ప్రకాశంతో

హింస నుండి ముక్తమైన సమాజాన్ని
కోరుతుంది! మానవ హృదయం! ఎప్పటికీ!
మనిషితో మనిషి మాటలో మానవీయమై
పదంతో పదం కవితలో అమృత స్పర్శతో

8. కొత్తదనంకై

సమాజ పరివర్తన పరిణామ దశదశలో
తన పాత్రను తెలుసుకొన్న కవిలో
దార్శనికం! ఒక సుందర ప్రయోజన పథం
ఏ వ్యక్తి ఎంతటి వెలుగయినా
ఆరినంత మాత్రాన! ఏదీ ఆగదు
మరో తరం అందుకొనీ ముందుకు వెళుతుంది

ఏ సమయం శూన్యం కాదు ఏదో చేరుతుంది
తీగెలా అల్లుకొనేను, చెట్టులా సాగేను
ఆకులు వేసేను, పూలను పూచేను
ఫలాలు వదలేను, ఏదో ఒక చరిత్రతో

రాత్రి వెలుగు కోసం! నిరీక్షణలో
భయమనిపించవచ్చు, బాధకలగవచ్చు,
ఉదయం కోసం యాతన అక్కర లేదు
వేళకు రవి కిరణం ముంగిలిలో వాలుతుంది

పడమర దిశలో మాయమయిన సూర్యుడు
ఆ దిశలోనే ఉదయించే అవకాశం లేదు
మరునాటికి వేళకు తూరపు దిశలోనే!
ఉదయం అస్తమయం దిశలు లేవు జీవితాన!

జలధిలో రవి బింబం కాలానికి పడవలా
పరసిలో శశి బింబం పిల్లలు ఆడుకునే బంతిలా
కొత్త దనంకై కవిత ఎదురు చూస్తుంది
ఏ రోజు కారోజు మార్పులో నవ చేతనతో

గాలి లేని బయలు లేదు
శ్రమ ఎరగని నడక లేదు
సృజన రాని భూమి లేదు
కవిత లేని జాతి లేదు

9. ప్రశ్నలో రహస్యం

పయనం సాగే కొద్దీ అనుభవంలో
దృశ్యం తరువాత దృశ్యం శూన్యాన్ని నింపుతుంది
ఇవి పండగ దుస్తుల వలె మనసున అమరుతాయి
అనుబంధం పెరిగి స్మృతిలో సుందర శాలగ మారేను

పోయే దారిలో తెలిసిన వారితో తెలియని వారూ
మధ్య మధ్య తనిఖీలు సోదాలు! ఇవి జరగనిదే
క్రాస్ నుండి బయట పడే వీలు లేదు

జేబులో లేంది బ్యాగ్‌లో ఆపై డిక్కిలో
తెలియని రహస్యం! ఎంతకూ దొరకనిదీ!
హఠాత్తుగా బయట పడవచ్చు!
విప్పిన పుటలో నిజం!
దీపం వెలుగులో వస్తువులా! మాటలో కవితలా

చర్యకు ప్రతిచర్య! మాటకు మరో మాటతో
స్నేహంతో వైరంలో మనుషులతో సమాజంలో

అడ్డంకులు పక్కకు జరిగి తొలగి పోతూ
మలుపులు తిరుగుతూ వాహనం విమానమయితే
ఆధారతలంలేని పవన మార్గంలో సశక్తిలో
గమ్యం చేరే బాధ్యత! పైలెట్ పైనే!

గాలికి కొట్టుక పోయే భయం లేదు
వానకు తడిసే అనుమానం లేదు
ఎండకు కమిలి పోయే అవకాశం లేదు
అయినా! వాతావరణం అనుకూలం కాకనో
యంత్రంలో లోపంతోనో ఏమైనా జరగవచ్చు
పైలెట్ మరుపో! కునుకో! ప్రమాదం! ఘోరం

తెలియని ఏ మూలనుండో! ప్రశ్నలో రహస్యం
మానవ శక్తిని పదే పదే పరీక్షకు గురి చేస్తుంది

10. ఆయుధంపై ఆలోచన

మౌనం ఖైదు కాదు, శబ్దం స్వేచ్ఛ నీయదు
దొరికిన అవకాశం అర్థవంతమయితేనే ప్రయోజనం
ఏ మార్పు చిరకాలం నిల్వదు కొంత వరకే
జీవన గతిలో మార్పులతోనే గమ్యానికి చేరువగా

ఎంతటి సమస్య అయినా ఆయుధం శరణ్యం కాదు
పరిష్కారంలో సోపానాలెన్ని దాటిపోతేనో
ఆయుధ బలాన్ని కోరేదీ, దాన్ని అందుకునేదీ
పనికి తగిన విధంగా ఉపయోగపడేనా?
ఎంత వరకు లక్ష్యం నెరవేరేను?
చివరకు ఫలితం ఎవరు అనుభవించేదీ
అన్నీ ఒకటొకటి రహస్య పేటికలో నుండి
చరిత్రలో పాఠాలుగ వినిపించే వాస్తవాలు

మాటకు మాట బంతుల వలె వదలేందుకు
ఏ మతి విభవంతో నిపుణతో పని లేదు
రవి తన హృదిలో దిగాలని ఉండవచ్చు!
ఆ వేడిక బూడిద అయ్యేదీ! తెలియాలి!

బండ బరువు బ్రతుకు నుండి
అలల చలన స్థితుల లోకి
ప్రతి దశలో మార్పుకు యోజనలెన్నో
విపణి విధం అనుకున్నా అది బ్రతుకులో భాగమే!

తన చుట్టూ జరిగే అసమతలు అలజడులు సంక్షోభం
చూడడం వేరు తెలియడం వేరు అవగాహన వేరు
సానుభూతి దృష్టి వేరు కార్యాచరణ విధం వేరు
కూల్చే నిర్మాణంతో సృజన చింతన అవసరం

దేని కది సమాజ జీవన రూపంలో భాగమై
ఆయుధంపై ఆలోచన! సాగుతుంది భయభావంతో

11. ప్రేమలోనూ కాలుతుంది

బయటి నుండి మనిషిని మాటలలో చూడవచ్చు
లోన మనసు నిశ్శబ్దం శబ్దమయమవుతుంది

దూసే బాణ మయితే పాత కథగా
దూకే మిసైల్ అయితే కొత్త కథగా
బాధలో వ్యధలో ఏదయినా బ్రతుకులో
పైకి ఎగర జేయవచ్చు, నేలపైకి దింపవచ్చు

ఓటు హక్కు పౌరులకు భవిష్యత్తు నిచ్చే కార్డు
ఎన్నికలయిన తరువాతనే రహస్యం బయటికి వస్తుంది
స్వేచ్ఛ సమత నవత స్వతంత్ర శక్తికి ప్రతిమలు
ప్రదర్శన పథం నుండి విశాల శాలకు చేరతాయి

చెట్టు కొమ్మలలో గూడులో పొదిగే
పక్షికి! సర్ప భయం అట్లాగే ఉంది
నిన్న గుంపులుగా నాటిన ఆశలు
రేపు మొలకెత్తే అవకాశంతో
నిన్న నాటిన ఖడ్గ సమూహాలు
రేపు ఫలితం వచ్చే సూచనతో
బుజాలపై నిలిచిన బరువులతో
నేల పయి నిలకడలేని అడుగులతో

మనిషి మనిషికీ దారి మారుతూ ఉండదు
అవసరం మారవచ్చు! మనిషి మారవచ్చు! గమ్యం మారవచ్చు
ఉన్న స్థితిపై పట్టరాని కోపం చెలగి క్రుంగి
ఎదురయిన వస్తువుల్ని దగ్ధం చేసేవారు
పక్క నున్న మనుషులపై హింసకు పూనే వారు

అక్షరాల్ని ఆయుధంగా మలచడం కష్టం కాదు
ముద్దు ముచ్చటకై యశస్సుకై భయంలో అవసరమవుతూంది
వెలుతురు నిచ్చే దీపమయినా
ప్రేమతోనూ తాకితే! కాలుతుంది!

❁

12. హృది వశమై

లోన ఉన్న మనిషికి తెలియని వెన్నో
బయటివి బయటనే తరలిపోతూ
దృష్టిలో పడక పోవచ్చు ముఖ్యం కాక పోవచ్చు
స్తంభాల్లా నిలిచిన సూక్తుల్ని స్పృశిస్తూ
చల్లగా కదలే నీతుల నీడలలో
తొలి దశ నుండీ లోలోన వెలుగు మనిషి!

లౌకిక తంత్రం పైన వ్యాపార జగం దాటి!
సమస్యలో! ఆకును తలపించవచ్చు పూవును చూపించవచ్చు
ఎక్కడి కక్కడ మెలికలోనో ఉచ్చులోనో!
బయటి మనిషి! బయటపడే ఆలోచనలో గడిపేను

జన కోలాహలంలో ఒకరుగా బయట మనిషి
నిశ్శబ్ద వేదిపై మౌనంగా లోలోని మనిషి!
ఏదీ పట్టని స్థితిలో బ్రతకలేదు బయటి మనిషి
విశేష సందర్భంలో లోని మనిషి స్వరం వినిపిస్తుంది

జన్మ నుండి ఆంతర కవచంతో చేతన
శుభ్రమయిన వెలుగు ప్రసారంతో మనసుపై
లోలోన మరో మనిషి ఉన్నది! ఎందరికి తెలుసు!
ఒక వేళ తెలిసినా! తన కవసర మనిపించాలిగా!
భూమితో పని లేదు, నింగితో పని లేదు
అంతస్సాక్షిగా లోలోన మనిషి! అధిపతియై
బయట జరిగేవి కొన్నిటిపై స్పందనతో లోలోన
మన: పటంపై ప్రతి ఫలించనూ వచ్చు

తప్పని దయితేనే అంతరంగానికి మనసు ఊసు
ఇది పూర్తిగ తెలిసే దొక దర్శన గుణ మతికే
వెలుగు రేఖలతో ప్రతి రూపం బయట పడుతుంది
హృది వశమై కవితలో ఆత్మ బంధు వవుతుంది

13. జవాబుల బ్యాగ్‌తో

ఒక తరం మరో తరాన్ని ప్రశ్నిస్తుంది
ప్రశ్నలకు జవాబులు పరిణామంలో భాగమవుతాయి
మార్పుకు సంకేతాలయినవి నిలుస్తాయి
జవాబు రాని తరుణంలో వేరయి
ఎవరి దారి వారిది కావడమూ సహజం

లోపాలను సరిదిద్దే దోషాలను తొలగించే
వర్తమాన తలం నుండి ప్రశ్నలు! వదల బడేను
విభేదాల నుండి వైరుధ్యంలో ఘర్షణ తల ఎత్తవచ్చు
మందమొ వేగమొ తీవ్రమొ పలు స్థాయిలలో
అందుకు సమాజ చరిత్ర పుటలు తెరవబడీ సిద్ధంగా

కదలి పోయే ఊహల కెరటాలను
ఊపిరి సూత్రంతో గమ్యాన్ని కొలుస్తూ
అడుగులలో వేగాన్ని నింపుతూ
నేను నీవు మనంతో సమాజ వాస్తవం

ఎండ్ల బండికి సమాంతరంగా యంత్ర వాహనం
విహగ గమనానికి సమంగా విమాన యానం
ఒకనాడు హలదానం ఈనాడు రుణ దానం
వ్యక్తి నుండి సమాజ యోజనలో ఆర్థికం

చెరువు నిండి నపుడు గుండె తృప్తిగా
భూమితో బంధం భాగ్యమయంగా
పంటల క్షేత్రాలతో వర్తక నిలయాలతో
సమాజ దృశ్యం మారుతుంది రమణీయంగా

ఆహారంతో అవసర వస్తు చయంతో
శ్రమ చేతనతో కళ కొక స్థానంతో
అనుభవమూ ఆలోచన రెక్కలపై మానవం
తరం నుండి తరానికి జవాబుల బ్యాగ్‌తో

14. ఆశయ దిశలో

ఈ వ్యవస్థ అల్లికకు కారణమెవరని ప్రశ్న
ఆ వెనుకనే ఈ సృష్టికి హేతువు గురించి ప్రశ్న
ఈ రెండు శిఖరాల మధ్య వంతెనలా జీవితం
వంతెనపై నడకలో సుందర పరిణామాలెన్నో!

తమ మనో వికాస రూపాన్ని బట్టి సమాజంలో
ఎవరి పాత్ర వారిది! స్నేహం వైరం వేదన సహనంతో
బ్రతుకును నడిపించే నాలుగు చక్రాలు
తప్పనివై! మనిషి కథను దూరం నడిపేను

నేలపై మనిషి చర్య నిరంకుశ మవడం ప్రమాదకరం
బ్రతుకులో హింసించే చర్యలు! చెప్పరాని దారుణం
గగనానికి స్పష్టమైన ఆకృతి లేదు, అయినా
మనిషి పలికే మాటలు వింటుంది ఓపికగా

అవనికి మనోజ్ఞమైన ఆకృతి ఉంది, స్ఫుటంగా
శిశువు లేత అడుగులు తాకి నప్పటి నుండి
పులకితయై చివరి దాక హత్తుకొనే ఉంటుంది
మనిషి నిష్క్రమించినా ఆనవాళ్ళు మిగులుతాయి!

సందర్భ వివేచనలో మనిషిలో ప్రశ్నలు సహజం!
ఒంటరిగా అనుభవాన వ్యక్తి స్వేచ్ఛ
సమాజ వలయంతో నియతం అవుతుంది, తప్పదు
ఇది ఆవేశంలో వేగం దూకుడును నియంత్రిస్తుంది

వెలుగు దారి చూపే హక్కుల కవకాశ దిశలు
ఒకటొకటీ బ్రతుకులో పూర్తిగ తెరవబడీ
మార్పుకు ఆలోచనలో సమీక్ష జరుగుతుంది
ప్రజాస్వామ్య చేతన కొక ఆశయ దిశ చూపుతుంది

❁

15. శిఖరానికి సోపానం

ఉన్న బయటి రెండు కళ్ళు చాలక మనిషికి
లోన మరో కన్ను దాగి పరిగుప్తంగా
ఇది ఎపుడు బడితే అపుడు విప్పారేది కాదు
విశేష స్థితిలో పనికి వచ్చే ప్రత్యేకం
తెలియని తనం నుండి తెలిసే స్థాయిలోకి తెస్తుంది
హక్కుల పరిచయంతో లోన రేకులు విరిసేను

ఉదయం తొలి కిరణంలా హక్కు ప్రవేశిస్తుంది
చివరి దాక మెలకువలో ఉంచే సన్మితం
నిరంకుశంలో బాధ నుండి బయట పడేస్తుంది
చీకటి జలధిని దాటే వెలుగు పడవ అవుతుంది

ఇది స్వతంత్ర మతి వేదిక, స్వేచ్ఛా పథ సూచిక
తాపంలో నీలి మబ్బులా మంచు నుండి జలధారలా
స్వర్ణానికి రత్నంలా, అందానికి పరిమళంలా
జీవన భాగ్యానికి నవ సమాజ ప్రేరణం

హక్కుల రక్షణ ప్రతి సమాజ విజయానికి
కొత్త అన్వయంతో మనిషికి జీవిత మిస్తుంది

చాకుతో రోజూ పని ఉంటుంది
కొడవలితో అపుడపుడు పని ఉంటుంది
ఖడ్గం అవసరమెపుడో కలిగితే కలగవచ్చు
ఎక్కువగా మనిషికి దగ్గరగానే ఉంటుంది
ఉద్యమానికి ఊపిరిగా ప్రగతికి ప్రేరణగా

హక్కుల ప్రమేయం జీవన మర్యాదా కవచం
సంఘంలో పలు తరగతి ప్రజలకు సులభంగా
తమ తమ దిశలలో పయనానికి అవసర వాహనం
నారీ మైనారిటీ దళిత గిరిజన అస్తితలకు
ప్రవాహ రూపాలను ఇచ్చింది, పచ్చదనం పంచింది

16. అశక్యం కాదు అద్భుతం కాదు

మట్టి బొమ్మ నుండి ప్లాస్టిక్ శకటం వరకు
సుదీర్ఘ యాన చరిత్రలో వేరు వేరు రూపాలు
మనుషుల మూర్తులొకటే! జీవన రీతులు వేరు
తిరిగే చక్రాలపై దారులు వేరై గమ్యం దిశ మారీ

మానవ హక్కుల పోరాటం! ప్రజాస్వామ్య బలంతో
సమస్యతో ఎప్పటికీ సజీవంగా! నిలుస్తుంది
ప్రభావ పర్యవసానం! తృప్తి నిచ్చే జవాబుతో
ఇంకా సాధించేవి ఉన్నా! సార్థకతను నిలుపుతుంది

ఎంత కాలం గడచినా! ఇంకా ఏవేవో!
అందని కల వలె! మిగిలి పోయి ఉంటాయి
మానవ శక్తి సమీకరణంతో ఎంతో
సాధించేది! మిగిలే ఉంటుంది! సమాజంలో

ఏ దారి ఎందాక ఎక్కడికి వెళ్ళేది తెలియాలి
దారులన్నిటిపై ఒకేసారి చూపు జటిలం చేస్తుంది
తత్కాలంలో స్వార్థం ఎగిరే రెక్కలు విప్పుతుంది
మట్టిని మరపించే పయనం సాగుతుంది మింటిలో

జీవితాన వ్యవహారం వ్యాపారం రెండూ
కావడి కుండల్లా చెరొక వైపు బుజంపై
ఊగే బరువులతో తలపై మరొక మూటతో
మనసులో తల ఎత్తే కోరికల జాబితా!

చీకటిలోను కాలం మనిషికి వశమై
వెలుగు దారి! గీత గీచి చూపిస్తుంది
ఇప్పటి దాక కనిపించని వస్తువులు
మానవ హక్కుల కిరణ ప్రసారంతో అందేను

ఏదీ అశక్యం కాదు అద్భుతం కాదు
మంచు తెర వీడితేనే రవి బింబ కనిపించేది

17. వినాశనం వెనక నుండి

ఎండ అయినా వాన అయినా మంచు అయినా
మితం మీరితే అవరోధాలే! బాధకర పీడనలే
నిజంలో గుణం న్యాయంలో సవ్యం అందరికీ తెలుసు
ప్రయోజనంలో స్వార్థం వివేకాన్ని కప్పేస్తుంది

బాణంలా తూటాలా దూరం నుండి
రణ కామన చర్యకు దిగే రొకరొకరు!
సమాజ భవితను సరి దిద్దే పనిలో
విరుద్ధ పథంలో ఒక వాదం! ఉదగ్రమై

బిగిసిన పిడికిలితో మొదలయిన ఘర్షణ
దిశదిశలో పిడుగులు వదలుతుంది క్రమంగా
పాపం! పుణ్యం ప్రసక్తి లేదు
నైతిక నిబంధనల కవకాశం లేదు

క్రియాశక్తి ప్రదర్శనలో "శాంతి" మాట లేదు
వైరంలో ప్రాణం గడ్డి పోచలా ఎగరవచ్చు
చివరి దాక ఒకటే! విశ్వాసం అంచులలో
వ్యూహంతో చర్యలతో బాధలలో బ్రతుకులతో

ఏడుపుకు పగలు రాత్రి భేదం లేదు
ఏ సమయంలోనూ ఒకే విధం స్వరం
తుపాను ప్రభావం! గదిలో ప్రతి అలపై
ఒకే తీరు! ఇరు వైపులలో ఒకే విధంగా

అంతశ్చేతన రూపానికి ఈ సమయం
ప్రశ్నకు జవాబు అలంకారం కాకూడదు

న్యాయానికి పోరాటంలో ప్రమాణాలు విలువలు
జారిపోయి! దృశ్యం బీభత్స ముద్రలతో
విపరీతంలో విధ్వంసం! కటు రుచి చూపేను
వినాశనం వెనక నుండి సృజన అవసరం! జరిగేనా?

18. కవిత! ఇష్టంగా

ఏది రాసినా కవితయే! కాదనే దెవరు?
ఇది కవిత కాదని రాసినా సరె! అనిపిస్తుంది

ఇది స్వర్ణ విద్య కాదు, అక్షర విద్య
ఇది కొండ బరువు కాదు, మనసు బరువు
ఇది సొంత గోస కాదు, సమాజ గతం
అమృత మయినా కాకపోయినా ఇంద్ర జాలం కాదు

ఒక సమయం పదును కత్తిలా పని చేస్తుంది
అనుకోకుండా ఎదురుగ దూసుక వస్తుంది
తాను మరచిన బాధ్యతను గుర్తు చేస్తుంది
సూచనయై పోవాలిసిన దారిని చూపిస్తుంది

స్టాండ్‌లో ఎదురుగ పెన్ను లెన్నో! రాసేది ఒకటే
చేతికి ఉన్నవి అయిదు వేళ్ళు! దిశ చూపేది ఒకటే

క్షణాల్ని బహు ఇష్టంగా అనుభవిస్తూ
చల్లని ఐస్‌క్రీంలా ఆగి ఆగి చప్పరిస్తూ
హిమ శిఖరం తల ఎత్తడంలో ఆశ్చర్యం లేదు
వేడి వేడి కాఫీలా సిప్ సిప్ సేవిస్తూ
రవి కిరణం చిన్న ముక్క జారడంలో వింత లేదు

నీడను వాహన రూపంగా పగలు వీధిలో నడచే
నా వెనకనో ముందో ప్రక్కలనో సూర్యుడు! కదలేను

పారిజాతమె! మల్లె పూవా! పరిమళంతో
గాలి! స్పృహకు అందే వేళలో
దగ్గరలో నరకబడే వేప చెట్టు వాసనో!
పేలిన గన్ ధ్వనితో పొగ వాసనో!
ఏదో అనుకునే లోపల! అంతలో మారుతుంది

ఏది ఎట్లా ఉన్న బ్రతుకు బ్రతుకే! కాదనే దెవరు?
కవితలో నయితే మాటి మాటికీ ఇష్టంగా! తలచేరు!

19. లక్ష్య సిద్ధికై

స్పర్శలో శ్వాసలో కదలే ఆకులో అలలో తప్ప
కనిపించని పరివర్తన పవనం! మనసులో ఆగనిదీ
ముఖంలో కళ్ళలో క్రియలో తెలిసే మనో రూపం
జ్ఞాపకాల లగేజితో పయనం సాగిస్తుంది

విత్తుకు తాను భూమిలోకి దిగేది తెలియదు
పూవుకు తాను మట్టిలో కలిసేది తెలియదు
మబ్బుకు తన సర్వస్వం భూమికి అర్పింది
ముక్కలయి గాలిలో అదృశ్య మయ్యేది తెలియదు
తన సంపద సార్థక మయి నందు కెంత మోదమో?
చివరి మెరపులో చూపుతుంది
చివరి గర్జలో పలుకుతుంది

మనిషికీ తెలియని విషయాలెన్నో
ఘటనలో భాగమై అనుకోకుండా
సమాజ పరిణామ దశలలో ఒకటయ్యేను
వెనక్కి తిరిగి చూచే ఆలోచన ఎక్కడుంది?
ఏవేవి నిలచేదీ పోయేదీ మనసుకు తెలియదు
కలలోనో స్మరణలోనూ సందర్భంలోనో
జరిగి పోయిన అనుభవాలు తిరిగి మొలకెత్తేనని తెలియదు

జలధిలో విలీనమయిన బాడబాగ్ని విద్యుత్తేజం
జలరాశిని వెలిగించేనా? దగ్ధం చేసేనా?

మందు వైపు చూపులో ప్రగతి పథం
వెనక వైపు నుండి అసూయలో అలజడి
ఒక పక్క ఈర్ష్యా క్రోధం సందడి
ఒక పక్క కోపంలో తాండవ శబ్దం
వెళ్ళే దారి తప్ప! ఎటూ చూడకపోవడమే
ప్రస్తుతానికి ఉత్తమ మనిపిస్తుంది! జరిగేది అదే!
పవన పథంలో కదలే మేఘాన్ని తలపిస్తూ..

❁

20. ఖాళీలను నింపే

ఎవరి పతాక వారికి ప్రియాలి ప్రియం
దేశానికో వాదానికో పక్షానికో గణానికో ప్రతినిధి
వారి వారి జెండాలను హృదయాలకు హత్తుకొనీ
వాదాలకు దూరమైన ప్రత్యేకతతో మనోజ్ఞం

ఉదయంతో ఆరోహణ మొదలవుతుంది
శ్రమ చేతన ప్రకటనతో ఉన్న దేశ భూమిపై
నిర్మాణంలో గడపే జన తతి రూపం!
ఆపై వెన్నెల చీకటి గాథలు తప్పనివీ

భూమి తడుస్తుంది ఇపుడు
వాన చినుకు కన్న ముందుగ
రాలిన కన్నీటి చుక్కకు చిత్రంగా
నిప్పు పూలు పూయడం! విశేషం

అందని లోతులతో గతమొక సముద్రం
లోనికి దిగే సాహస మెవరు చేస్తారు?
చేయి చేయి నందుకొనీ అలలు కదలి పోతాయి
లోన అడుగు తాకి నిలిచే ఏ వీలు లేదు

భూమి తలం వర్తమానం ఒకటే! నిలిపేదీ
భవిష్యత్తు క్షితిజ సమం! ఎప్పటికీ వేచీ

పూవు వాడకుండ ఏ ముసుగును వేసేరు
క్షణం గడవకుండ ఏ అడ్డును నిలిపేరు

నోరు ఉన్నది కదా! అని ప్రతి మాట కవిత కాదు
కళ్ళు ఉన్నవి కదా! అని బాష్ప కణం జారి పడదు

మనిషి మనిషికీ ఖాళి ఎంతైనా ఉండొచ్చు
దూరాలను తగ్గించే ఆలోచన జరుగుతుంది
హేతు స్ఫూర్తి నుండి తప్పుకో జూచేను మనిషి
జీవితమూ దార్శనికం వేరు వేరు కావు, ఒకటే

చెలగే మంటల నార్పే యత్నం సాగుతుంది
ఖాళీలను నింపే రాగానికి చిహ్నం! పతాక

21. అదో! తృప్తి

ఈ నేలకు కాస్త దగ్గరగా
గాలికి బూది పొరలు ఎగురుతూ
అగ్ని కణాల్ని తలపించడం తప్పకపోయినా
గగన మంత ఎత్తులో కాకపోయినా
కాస్త పైపై నుండి చల్లని నీడతో
మబ్బు ముక్కల్ని తలపిస్తూ పోవడం! మానుషం

విభేదాలు ఘర్షణలు నిరసన వ్యతిరేకతలు
స్వేచ్ఛలో ప్రజాస్వామ్య చక్రంలో అవకాశాలు
దశల దశలలో ఒకరొకరి గెలుపు ఓటములతో
సమాజ రూపం ఎప్పటికీ! సంశ్లిష్ట గుణ మయం!

బ్రతుకులో మొదటి అడుగు గెలుపు ముద్రతో
మధ్యలో! స్తబ్ధమై మందమై సంశయ ఖండమై
చివరి అడుగు వదలుతుంది ప్రగతి వారసత్వం

ఉదయం సూర్యుడు కనబడితే
ఎంత ప్రియమయినా అవసరమయినా
మండే బింబాన్ని చూస్తూ ఉండలేరు
వెలుతురుపై చూపుతో ఎవరి పనిలో వారు

విలువయిన బంగరు శలాకల బోనులో నిలిపితే
అడవి నుండి చేరిన పులి! సాధువు అయ్యేనా?
సర్వానికి స్వేచ్ఛ నిస్తే! పాలు పోస్తే!
కోర నుండి సుధా కణం ఒలికేనా?

కనుల వెనుక మరో కన్ను
చెవుల వెనుక మరో చెవి
బుద్ధి వెనక అంతరంగం
మనిషిని నడిపించేను కర్తవ్యం తెలిపేను

మెలకువలో దొరకని వస్తువు
కలలో కనబడితే అదో తృప్తి
కవితలో నయితే! ఆనందం అదర్శం!

22. భేదం

క్రితం క్షణం కనిపించనిదై గతమై
వెంటనే మరో క్షణం వర్తమానమై
వెనకనే వేచి క్షణం నిజ భవిష్యమై
గతం వర్తమాన కళలు రెండూ తప్పనివీ

మైనస్ ప్లస్ పాత్రలతో ఎప్పటికీ
విద్యున్మయ చేతనతో బ్రతుకులు నింపేను

కథ ఒకటే రోజూ ఉండేదీ
పరిణామ దశల తీరు వేరు
ఒక దానికి పొడిగింపే మరొకటి
దారి వేరు మనిషి వేరు జాడలు వేరు!

కళ్ళు ధరించే అద్దాల రంగులు బట్టి
చూచే రూపం వేరుగ కనిపిస్తుంది!
మస్తిష్కంలో ఎదిగే చెట్టును బట్టి
అందం గంధంతో పూవుల్లా ఊహలు!

తన కోసం అయిన బ్రతుకు
అద్దంలో ప్రతి ఫలన దృశ్యం
తన చేతికి అందని రూపంలో
ఇతరుల కోసంగా ఉంటుంది

చూపి వదలి పోతుంది చూపు
భద్ర పరచే బాధ్యత! మనసుదే

శిల్పంలో సింహం భయం కన్న అందంగా
లౌక్యంలో మనుషులు, ప్రేమ కన్న లాభంతో

కళకూ వాస్తవ జగానికీ మధ్య దర్జాగా
ఆదర్శం చోటు చేసుకునేను కవితలో

సంఘంతో బంధం ఉన్నంత వరకు
ఆలోచన విశాలమై శాలగా ఎదుగుతుంది
హృదయంలో స్పందన గుణం ఉన్నంత వరకు
శిల్పానికి రూపానికి భేదం స్ఫుటమవుతుంది

23. వచ్చిన పని మరచి

ప్రతి కవి హృదయం నుండి కొత్త స్వరం
తన దయిన ప్రతిభచే విజయం పొందాలని!
తన అస్మితతో పయనం సాగేను
నిజ రుచితో స్వతంత్ర రూపంతో!

పూర్వం ఎరగని ఊహలు కొత్తవి దుస్తులుగా
ప్రస్తుత మనసరమైనవి మాటలు వెలుగులగా
కవితలో అగ్నితో ఎవరి అవసరం వారిది
నవతలో రుచులతో ఎవరి అభిమతం వారిది

ఊపిరిలా సుగమంగా సాగే పంక్తులతో
పరచిన ఆయువు జీవ నదిని తలపిస్తుంది

సమాజ వ్యూహంలోకి ప్రవేశంతో
వ్యక్తి ఏకాంతం జనమయ మవుతూంది
కవిత ఇపుడు రెపరెపలాడే సమాజ కేతనమై
వస్తూ పోయే కాళ్లకు నీరాజన మవుతూంది
స్థిరమై కవి ఆధారంగా గడయై నిలిచేను
మారే యుగ చరిత్రలో శీర్షిక అవుతూంది

స్తంభించిన గాలితో ముడుచుకొనీ చుట్టుకొనీ
స్వేచ్ఛగ కదలే పతాక! అందం కోల్పోతూంది
ఆకాశం విస్తుపోయి చూస్తూ చూస్తూనే
నిశ్శబ్దంగా మనుసుకు హెచ్చరికలు పంపుతుంది

చేతి నుండి పైకెగసిన బంతిలా
అణచివేత నుండి జృంభించిన హక్కుల న్యాయం
గగనంలో రవి బింబం తాకి
భూమి హృదయంపై శిశువులా! వాలుతూంది

కాలం గడచే కొద్దీ చేతి ఊత కర్ర అయి
వచ్చిన తన పని ఏదో మరచి పోతూంది, మృత్యువు!

24. మౌన ముఖంలో

విప్పారిన అర చేయిని చూస్తే
గగనం దిగి నట్లే ఉంటుంది
సాగే పలు రేఖల చిత్రంతో
బ్రతుకులోని దారులు తలపిస్తుంది

తెలియని దేదో తెలుసుకోవాలనీ
ఉత్సుకత యథార్థ మనిపింప జేస్తుంది
సమాచార సంకలన సూచిక అయి
రాబోయే స్థితులను పరిచయ మొనరిస్తుంది

క్రమంగా మనసును ఆకట్టుకొనీ
నమ్మించే ఒప్పించే యత్నం జరుగుతుంది
నిరాశను దాటే ఆశ పెరుగుతుంది
మళ్లె తీగెలా ప్రాకి అల్లుకొనీ
పూలకై చూచే స్థితి కల్పితమవుతుంది

కాలాన్ని వశం చేసినట్లయి పైకెత్తుతుంది
వెలుగులు నింపే చిరు గుర్తులతో
జీవన చలనంలో రహస్యాలను విప్పుతూ
మనుషులతో సంబంధాలను నిలుపుతుంది

ఎగసే అలలతో సమాజ మహా జలధికి
కదలే నావలు తనలో లీనం కావాలనీ
మానస నావకు తీరం చేరాలనీ
ధైర్యం నైపుణి తోనే ఆటంకం దాటేదీ
వీచే గాలి అలను ముందుకు నడిపిస్తుంది
మధ్య మధ్య శిలలు గమనాన్ని నిలప జూస్తాయి

ఉదయం ఎప్పటిదే! అనుభవాలు నవనవంగా
భిన్న భిన్నమై రోజు కొత్తగ తోస్తుంది

నేలపై గొప్ప వ్యక్తి విగ్రహం! ఉత్సాహం నింపుతుంది
మౌన ముఖంలో చూడలేని సూర్యుని తేజం బింబిస్తుంది

25. కనిపించని మనసు నుండి

జడ ప్రకృతికి ప్రతినిధి అయిన
శిలల సందుల నుండి మౌనంగా
మొక్కలు తల ఎత్తవచ్చు, తెలిసిందే
నవ్వు ముఖం బయట పడుతుంది

కఠినతకు సంకేతమయిన
శిలల పగులు నుండి జలజల
నీటి ఊట ఉబకవచ్చు తెలియకపోవచ్చు
కప్పలు చేరే అవకాశమూ ఉంది!

ఇంటికి పునాది అయిన
శిలల బీటలలోకి
పాము దూరవచ్చు నిశ్శబ్దంగా
నివాసమో! విరామమో! ఏదైనా ఒకటే,

అవే! బండలపై సాయం వేళల
మనుషులు! కూర్చొని మాట ముచ్చటలో
కాలక్షేపం జరగవచ్చు హ్లాదంగా
పరిసర రూపం గురించి, ఆలోచన జరిగేను
ఎరుక నుండి మేలు లాగే
ఎరుక నుండి భయం కూడా
ఇది జీవితం! మిశ్రమ విషయమయం!

ఎక్కడి కక్కడ! తెలియడమొక హద్దులలో
వైరుధ్యంలో సహజీవన సందర్భంలో
ఆరోహణ కయినా అవరోహణ కయినా
నిచ్చెన అదే! భూమి తలం అదే!

చేతనతా గుణ శిఖరం మనిషి
కనిపించని మనసు నుండి ఆలోచన
చినుకు చిందవచ్చు పిడుగు వడలవచ్చు
పద ఘట్టనలో నేల గుండె పగలవచ్చు
ఉదారాచరణంతో నింగి తలవాలవచ్చు

26. విరామ సమయంలో

మతిలో స్మృతి ముద్రల చిత్రశాల
జన్మభూమి ఊరు కేంద్ర బిందువుగా
దగ్గరనో దూరానో ఉన్న కొండ! ధైర్యమిస్తుంది
చిన్ని చిన్న నింగి ముక్కల వలె చెరువులు! బావులు
వెలుతురు పాయలుగా! ఏరో నదియో! వాగో

కొమ్మలపై పక్షుల సందడితో చెట్లు
భూమిపైన చెదరిన శశి శకలాల్లా
నేలపైన మనుషులు కోలాహల సమూహాలు
చెట్టు కొమ్మకు వేసిన ఊయెలపై
మనసును విమానంలో పయనింప జేసేను

ఏ పండుగ అయినా ఏ సమాజ కార్యమయినా
ఉరుకులలో ఉత్సాహం పరుగులలో ఉద్రేకం

కాలం సమాధి కాదు శ్మశానం కాదు
ఓటమిలో నిరాశలో క్రుంగిపోయి పలకవచ్చు

నిస్పృహలోనూ సృజన చేతనతో బీజం
కొత్తది మొలకెత్తుతుంది హ్లాద సుందరంగా

మనసుకు జీవన విజయం పెంచుతుంది
పెరగడమూ ప్రయోజనమూ! మనుషుల వంతు

ఎక్కడెక్కడి నుండో గాలిలో వూల పరిమళం
కూలిన నిలయాన్ని కాలిన స్థలాన్ని స్పృశిస్తూపోతుంది

ఉదయ సమయ రశ్మిలో చాచిన రాగ హస్తం
నిలిచిన గుర్తుల్ని ప్రేమతో అద్దుతుంది

ఎప్పటిదో జనని కర స్పర్శ ఇప్పటికీ
పులకరింతలతో మనసు పరవశిస్తుంది
ఎప్పటిదో తండ్రి ఆజ్ఞ ఇప్పటికీ
వెనక నుండి మునుముందుకు నడిపిస్తుంది

అటు! వస్తుపోయే మనుషులు నిశ్శబ్దంగా
ఒకపుడు విరామ సమయాలలో వాద్యాల్లా

27. కొత్త ముఖాలతో

అలవోకగ వస్తుంది కవిత
సూది పైనొ సబ్బుపైనొ అప్పుపైనొ
దిండు పైనొ పండు పైనొ బెండుపైనొ!
ఎప్పటి నుండో పరచిన ఆశలతో వేచి
వస్తువు లొకటొకటీ వరసగ నిలిచేను

కవి శబ్దంలో స్పందిచాలని ఎదురు చూచేను
కాస్త వెచ్చదనం కోరే హృదయానికీ
సూర్య రశ్మి వంటి స్పర్శ అవసరం
కాస్త చల్లదనం కోరే హృదయానికి
చంద్రకాంతి వంటి స్పర్శ అవసరం

విపణి వీధిలో దొరికే దినుసు కాదు కవిత
తమకు తాము సంతరించుకొనే సృజన విధం
భౌతిక తలం నుండి మానస దశ వరకూ
ఆరోహణ శ్రేణిలో జీవన రుచి కోరుతుంది
బీదులోను గడ్డి పోచ తల ఆడిస్తుంది
అనుకూలం లేకపోయినా అందల మెక్కినంత సంతోషం
పొలంలోని పంట ఆకలి రుచి తీర్చేదవుతుంది
జీవన భాగ్యంలో రుచిర ముఖం నిలువుతుంది

పెరటాలను వదలి లేదు జల నిధి రూపం
కోరికలను వదలి లేదు జీవన భాగ్యం

చెరువు లేని ఊరు, నూయి లేని వీధి
దివ్వె లేని రాత్రి! తరణి లేని పగలు
ప్రేమ లేని బ్రతుకు! పూవు లేని వనం
కవిత లేని దేశం! శూన్యంతో గగనం

శూన్యమైనా పూర్ణమైనా ఎదుట ప్రపంచం!
అలవోకగ వస్తుంది కవిత, కొత్త సృజనతో

28. సమాజ లక్ష్యంలో

ఏ తప్పు ఎరగని వ్యక్తి బ్రతుకుపై
అనుకోని విషాద ఛాయా ప్రభావ రూపాలు
అభాగ్యుల విషమతల కెవరు బాధ్యులు?
సీత అవనీ! ఉమ్రాన్ జాన్ "అదా" కానీ

తన శత్రువు కిష్టమైన మానవ రూపాన్ని
దూరం చేస్తే! శత్రువుపై పగ తీరేనా?
ప్రతి ఒకరి బ్రతుకు వినని కొత్త గాథయే
చెప్పే వారే దొరకాలి కాని వినదగినది ఎంతో!

జలదాన్ని చూడగనే సృజన! మనసులో
కవిత కదలుతుంది ఆర్ద్రంగా, ఆప్తంగా
భూమికి, వాస్తవ సుందరతను తెచ్చే
వానల కాల్వలలో పిల్లలు వదలే
కాగితపు పడవలు! పైన తేలుతూ పోతూ
జలనిధిని జయించే శక్తిని మెరపిస్తుంది

ఆకలి మంటలపై జల సేచన ఒలుకుతుంది
మాటకు వస్తువులో నవ రూపం చూపుతుంది

అనల వాహనాన్ని వదలి పెట్టి కాలం
పూల రథం పట్ల మొగ్గును చూపిస్తుంది
లోన బాధ ఎడారిగా పరచుకొనీ
మనిషి బ్రతుకులో వాహన భాగ్యం? ప్రశ్నయే!
బయటికి నమ్మలేని విప్పలేని ముడులతో
తెలియని మలువులతో సుడులతో సమస్యలు!

వ్యక్తిని వదలి కవితను తలచేరు కొందరు
కవితను వదలి వ్యక్తిని చూచేరు కొందరు
దేని కవి స్వతంత్రమై భౌతిక మానసికంలో
కవి పాత్రకు పూర్ణత లభించేనా? లక్ష్యంలో

29. హక్కును పొందే క్షణంలోకి

అందే ఊరు హృదయం సంస్పృశిస్తూ
అందని నగరం మేధను విలోకిస్తూ

వర్తమాన తలంపై కదలడమే జీవితం
అడవి బాట పట్ట వలసి ధైర్యంగా
నదిని దాట వలసి వచ్చి నిర్భయంగా
మానవ గుణ శక్తులతోనే విజయం!

గుండె దీప్తి ననుసరించి మనిషిలో ఉత్సేకం
ఇది బయటికి తెలిసేదే, దాచేది కాదు
సాగినంత మేర చూపులో పోయే దారి
కనిపిస్తేనే! గమ్యం చేరేది, నమ్మకంగా

ఎగిరే పక్షి నందుకొనే ఆశా యత్నంలో
బాణమె! తూటానొ! గురి బారిన బడి
విఘాతమో! వినాశమో! ప్రమాదమో! హింసో
విలవిలలాడే ప్రాణం! మనిషి విలువ నిలిపేనా?

చీకటి శవ దృశ్యం! నెత్తురు చిత్రం బదులుగ
లేవగనే పచ్చని దృశ్యం! పైనే మనిషి మనసు

జ్వాల నుండి ఎరుపు వేరు చేయబడదు
మల్లె నుండి తెలుపు వేరు చేయబడదు

కరుణతో సమస్య మరవ బడదు
ఉదయంతో గాధ తుడవ బడదు

చూపుకు రంగు లేదు తెలుపే దాని గుణం
వస్తువు లోనే పలు రంగులతో ప్రత్యేకం

కదలే కాలు చేయి కట్టి వేసి
వ్యక్తిని సజీవ సమాధిలోకి! ఘటన లెన్నొ

ఇల్లు కాపాడేననీ బంధువు రక్షించేననీ
సంఘం ఆశ్రయ మయ్యేననీ, అభయం దొరకేననీ

ఊరు అడవి నది నగరం మాయని గుర్తులతో
స్వేచ్ఛను మరవని హక్కును పొందే క్షణంలోకి గమనం

30. ఎవరి ప్రీతి కోసమో

రణానికి ఆయుధమై శాంతికి పావురమై
వీర శాంతి తీరాలతో జీవన ఝరి! కవిత
కాల మెంత గడచినా పాత బడని రాగంతో
అక్షయమైన అక్షర పేటియై తరాల కందేను

మౌనంలో చిచ్చుబుడ్డిలా సంసిద్ధంగా నిశ్శబ్దంగా
గాలిలో వేలాడే పూల గుత్తిలా ఆకర్షణతో

ఒక సమయం చిచ్చు బుడ్డి అగ్ని స్పర్శతో
దూరం నుండి ఎగసే పూలతో దగ్గర నుండి కాలే రూపంలో

నిరంకుశం నిర్మూలనకు సమూహ శక్తి అవసరం
ఇది సమాజ పరమై ఉద్యమ చలనంతోనే సాధ్యం
స్వేచ్ఛ కోరినా హక్కుల ఒత్తిడులను పెంచినా
రణంలోను శాంతిలోను విషమతలోనూ
జీవన సారంతో మనిషి సమాజ శక్తియై
గెలుపు ఓటమితో నిమిత్తం లేని కాలం ఆగదు

ఊరు బయట తోట! ఆ ప్రక్కనే శ్మశానం
మోదం ఖేదం అనుభవాల అంచులతో జీవితం
వినాశన చరణంలో స్వేచ్ఛకు నియతి అవసరం
బీభత్స చర్యలలో బ్రతుకులకు భద్రత ముఖ్యం

తాను బయటికి వేళ్ళే పనిలో రాత్రి వేళ
తప్పనిదీ బలమైనది కారణమేదయినా
స్థితిపై తన ప్రభుతకు చిహ్నంగా
సూర్యజపం చేస్తే ఉదయం పొడ సూపేనా?

ఉదయం వస్తుంది తప్పకుండా వేళ తప్పదు
ప్రభుత మేల్కొన లేదనీ, అడుగు! వెనక్కి వేసేనా?

కవిత వెడలుతుంది సహజ మనో భవమై
ఎవరి ప్రీతి కోసమో! విలాస భూమిక పోషించదు

❁

31. ఈ భూమి పైనే

మనం ఉన్న చోటుకే దయ చేస్తుంది గాలి
ఎవరి కోరిక ననుసరించో కిరణం ప్రసరించదు
గాలి వెలుగు చరణ పంక్తులతో కవిత
ప్రతి ఎదలో తన ప్రభావాన్ని వదలుతుంది

పంతంలో పోటీలో బంధనలో వెడలదు సృజన!
వెడలవచ్చు! బహు కష్టంగా లాగబడిన బండలా
పరచిన వలలోనో పన్నిన వ్యూహం లోనో పడి!
చేతికి అందే ప్రాణి కాదు కవిత!

ఎత్తుల కతీత మయిన స్వేచ్ఛా చేతన కళ
లౌకిక ప్రజ్ఞలచే ఉత్తేజితం కావచ్చు
శ్రమ బిందువులో నిశి మెరసే చుక్కలు
మానవ జీవన గతిలో వెలుగులు చూపేను

జంతు ప్రదర్శన శాలలో లేడికీ పులికీ చోటు
దర్శనీయమై! ఒక్కొక్క విధం బంధనలో! అలరిస్తాయి

గాలికి కొమ్మలు ఊగుతూ పూలతో
చల్లని పాదులో సర్పం చుట్టుకొనీ
కొమ్మల మధ్య గూడులో పక్షి పిల్లలతో
ప్రాణుల కెన్నిటికో ఆశ్రయ నిలయమై
అనుమానం లేకుండా! భద్రత నిస్తుంది చెట్టు!
పలు జీవన మనో రీతులతో సమాజం!

చెట్టు చివరి కొమ్మపై చంద్ర కళలా కల్పన!
అర చేతిలో కరగిపోయే మంచు ముక్క!

మానవ జీవన లక్ష్యం! సమాజ చరిత్రలో భాగం
స్వర్గం కాదు! నరకం కాదు! భోగం కాదు! మోక్షం కాదు

బ్రతికినంత కాలం దుమ్ము లేచినా పొగలు కమ్మినా
చెట్టు కూలినా! సర్దుకొనీ బ్రతికేది! ఈ భూమిపైనే

32. వెలుగుగ మార్చేది

పట్ట పగలు చీకటి శకలాలవలె కొన్ని అవస్థలు
కర్షకులో కార్మికులో! మరొకరో! సామాన్యులో
వీటి నుండి దాటించే కిరణాలకై పరితాపం!
గ్రీష్మం తాండవ మొనరిస్తుంది మనసులో!
నిద్రపోయే వీలు లేదు
దానికిపుడు సమయమూ కాదు!

వెళ్ళి చెరువులోనొ నదిలొనొ మునిగి తేలుతూ
చల్లని జలాలలో కాసేపు గడిపితే!
దుస్థితి పోయేనా? సుస్థితి చేరేనా?
ఇది ఎంత కాలమంటే? బ్రతికినంత కాలమా?

అద్దంలో తన ముఖంలో మరొక ముఖం ఒదిగి
భూమిపై తన పద పంక్తులతో మరొకరివి కలిసి
భేదం తెస్తుంది! ఇరువురి మధ్యలోని చీకటి గీత!
తెరలానో గోడలానొ! అటు ఉన్నది కనబడనీయదు

కొర కంచు అవసరమా? నిప్పు కణం దొరకేనా?
అగ్గి పుల్ల గీస్తే! ప్రమాదమా? చీకటియే బలమా?

ఇక దేవత ముఖానికీ మాస్క్ తొడ గాలిసినదేనా?
ఉన్న చోటనే పరాయి మనిషి అయి పోయేనా?

ఎటు పరుగెత్తినా! దేని నాశ్రయించినా
చివరకు చేరవలసిందీ, పొంద వలసిందీ
రోజూ చూచే మనిషిలోని స్నిగ్ధతలోనే
మనుషుల చర్యలలో సమత మమతతోనే
చిరునామా తెలియదన్న మాట లేదు
ఎవరి పరిచయంతో నిమిత్తం లేనే లేదు!

చీకటి ముక్కలను వెలుగుగ మార్చే మనోబింబం
సహనం స్నేహం సమ రస కిరణాలతో చేతన రూపం!

33. ప్రశ్న ఏదయినా

బావిని చెరువును నమ్ముకొని ఊరు బ్రతుకుతుంది
దాహం తీరేందుకు పనులు జరిగి పోయేందుకు
నీరు ఒకటే అవని తాపం తీర్చేందుకు
నేల చల్లబడేందుకు! జల నిధి మేఘాలను వదలుతుంది
భూమిపై ఎండల రాతలు మాయం చేస్తూ
నీటితో పచ్చని రాతలు నింపుతుంది మేఘం!

నల్లని ఆలోచనతో వికారమైన క్రియలతో
నెత్తురు చారల సమాజ ముఖంలో
కోపం క్రోధం హింసను మరపించే రాగంతో
ఆశయాల ఉదయం చూడాలని కొందరు! చిత్రంగా

గజాన్ని వశం చేసుకొనీ అంకుశంతో
నిరంకుశంగా ఏలాలని ఊరేగాలని ఒకరు
అశ్వాన్ని వశం చేసుకొనీ కళ్ళెంతో
బలం చూపుతూ ప్రభుతను చూపాలని ఒకరు

దూసే బాణం స్థానంలో తుపాకి తూటా
చేసే పని ఫలితంపై నమ్మకాని పెంచుతుంది

జలనిధి వదలే మేఘానికి లోకం స్వాగతం పలుకుతుంది
తనకు మట్టి అంటకుండ! అమృత హృదయం వర్షిస్తుంది

మనిషి చుట్టు మనుషులే! మనిషిని మరచి మనిషి
జంతువులా మృగంలా చరిస్తేనే అసలు సమస్య
మనిషిని పిలిస్తే మనిషి, పరుగెత్తుక రావచ్చు
తనలో పూవు విప్పితేనే పరిమళం వస్తుంది
విప్పారితే! అందరికీ ఆ అనుభవం లభించేనని!
మనసుకు మూత బిగించే వారెవరు సాహసిస్తారు
అసలు మనసు పూవు అయితేనే! పరిమళ గుణముంటేనే!
కంటక చరిత్రలో సందేహంలోనే ప్రశ్న ఏదయినా!

34. ప్రకాశ బింబం

గాలిలో పయనించే మాటల్ని
చేయి చాచి ఎవరు ఆపగలరు

మౌనంలో మాటల సందడి గుప్తంగా
రాత్రి చుక్కలవలె పిల్లల్లా ఆట పట్టిస్తాయి

మౌనం తలుపు తెరిస్తే మాటలే మాటలు!
వాస్తవాన్ని అందిస్తాయి, విషయమేదో తెలుపుతాయి
ఊపిరి ప్రభావం తెలిసేందుకు
బ్రతికి ఉండడ మొకటే నిదర్శనం

కవిత వాన వంటిది అందరిదీ అందరికీ
దీని కయి ఎక్కడికీ నడవ నవసరం లేదు
అది వస్తే! ఉన్న చోటునే జల మందిస్తుంది
ఎంత శిల్ప శోభలోను! రస స్పర్శతోనే సమాజం

మబ్బు వెనక ఆతపం! వివేచన కందుతుంది
కవిత వెనక వేదన! అనుభూతికి అందుతుంది
ఇది కంటికి కనిపించని పరిణామం
బాధలో ఆర్తిగా రస స్థితికి ప్రేరణయై

ఒక సమయంలో మనిషి ఏకాంతం కోరేను
జరుగుతున్న స్థితి నుండి దూరమవడం కాదు
కదలుతూన్న స్థితులపై ఆలోచన యోజనతో
నిర్ణయం ప్రయోజనంలో తన కార్యం కోసం!

అనుబంధం నిలవడానికీ ఆత్మీయం పంచుకోడానికీ
పరివారం! అవసరం! మానసిక మనోజ్ఞత నిస్తుంది
ప్రత్యక్షంగానో పరోక్షంగానో మనిషి ఉనికి
ఎక్కువ సమయం! సమాజ ప్రభావ క్షేత్రంలోనే

అంత:కరణమనేది కేవలం! సాక్షీభూతం మాత్రమే
ఆరోహణలో దారి చూపే ప్రకాశ బింబం!

35. నెత్తురులో తేలుతూంది స్వేచ్ఛ
(I)

ఆశయ మొక సుందర తేజో రూపం
తరాల పయి వెలుతురు ప్రసరించే బింబం
అక్షరంలో ఆశయానికి ఒక సాధనం జర్నలిజం

ఇది మెచ్చని వారు! దహనం చేసే యోచనలో
ఇది నచ్చని వారు! నెత్తురులో ముంచే యత్నంలో
ప్రజాస్వామ్య ముఖానికి నీలి రంగు తొడుగులు

ఆదర్శ వర్తనలో వ్యక్తుల బలవంతపు నిష్క్రమణంతో
ఆశయ లక్ష్యం మారదు! చరిత్రలో విలువలు తరగవు
ఇది సమాజ మెప్పటికీ కోరే ఆరోహణం

పత్రికలో అక్షరం! సమాజ హిత బంధువు
మంచు ముక్కలా చల్లదనం ఒలకవచ్చు
అనల కణంలా వెచ్చదనం ఈయవచ్చు
విద్యుత్ లహరిలా ఉత్తేజం నింపవచ్చు

సృజనలో వలెనే విలయ గతిలోనూ ప్రశ్న!
హేతువుతో అన్వేషణ మానవ మతి సహజం

శ్మశాన మయినా సమాధి అయినా రణ తల మయినా
ఇవి ఏవీ పచ్చని మొక్కకు విరోధవి పక్షం కావు
సుమ పరిమళ మందరికీ, అది సర్వ వ్యాప్తం
జన హిత వచనానికి లేదు స్థాయిల భేదం

సూర్యుని వలె దార్శనికం, చంద్రుని వలె ఆదర్శం
ఉజ్వల బింబాలు రెండు! మనిషి మనసులో
చీకటి తెర జార వచ్చు నీలి మబ్బు అడ్డ వచ్చు
మతిలో ప్రకాశ రూపం మాయం కావచ్చు

కనిపించని దానిని కనిపింపజేసే
తెలియని విషయాన్ని తెలిసేట్లుగ చేసే
మాయను మర్మాన్ని బట్ట బయలు చేసే
ఉన్నది ఉన్నట్లుగా స్వచ్ఛంగా
ఎదలో నిజాన్ని వజ్రంలా మెరపించే
విశాల సమాజ వేదిక పత్రికా రంగం
అక్షర చేతనలో ప్రజాస్వామ్య సాధనం

(11)

ఇది ప్రజాస్వామ్యం
స్వేచ్ఛ స్వాతంత్ర్యం సమభావం సమన్యాయాలకు
సుందర సమాజ లక్ష్యంగా ప్రయోజన రూపం
ఇపుడు నెత్తురులో తేలుతూంది, స్వేచ్ఛ!

ఉద్రేకంలో స్వేచ్ఛ అనల ముఖంతో మండుతూంది
తవ్విన గోతులతో విసరిన రాళ్ళతో
విషమ తలంతో ప్రగతి పథంలో
సామాజిక రాజకీయ చతుర క్రీడతో
అర చేతులలో ఆడే బంతిలా వార్తా రచన
వైరుధ్య సమూహాల్లో పరీక్షకు గురి అవుతూంది

ప్రాణ హాని సభ్య సమాజానికి ఒప్పనిదీ నప్పనిదీ
అక్షర శక్తి వలన భయానికి ఎంతకైన తెగించేరా

ఈ సాహస గుణంలో విలయ కణం ఎగసి
రహస్య దుస్తంత్రంలో! క్రియాశీలి హతమయ్యేను

శంఖారావంలా నిదుర నుండి మేల్కొల్పే
అక్షర పంక్తిని నడిపే చేయిని నరికేరా?

భూమితో ఝున ఝున చినుకుల మాటలతో మేఘం వలె
పత్రిక! ప్రీతిగ ఉండాలని కొందరి కోరిక!
అది నెరవేరక పోగా! తమతో పాటుగ
రాజ్యం మెడలో సర్పంలా! చుట్టు కొనే భయం

పత్రికలో మాటలు ఎదలో తూటాలుగ ప్రేలేను
బిగ్గరగా పలికే గొంతును నొక్కేరా? కోసేరా?
విధి నిర్వహణంలో అపాయకర గతిలో
స్వేచ్ఛలో దారి కడ్డంగా పన్నిన దుస్తత్రంతో!

అక్షర మంటే శాశ్వత మయిన విలువల సంకేతం
కష్టంలో మనసుకు శరణం ఊరట నిస్తుంది

కర్తవ్యంలో వాక్యం శూలమై గుచ్చు కోవచ్చు
సానుభూతితో మబ్బులా చల్ల పరచనూ వచ్చు

ఒక సమయంలో అలజడిలో ఆదర్శం
ఓడినట్లు అనిపిస్తుంది! అది తాత్కాలికం మాత్రమే

(III)

నడుస్తూ నడుస్తూ ఉంటే కాలి దారి సిద్ధమవుతుంది
తెలియని పార్లమెంటు భవనానికి చేరుస్తుంది

ఇంద్ర ధనుసు రూపానికి రంగులెన్నో
జర్నలిజం కరవాలానికి అంచులన్ని

ఏది నీతి? ఏది న్యాయం? ప్రశ్నలు రెండూ
మనిషి ఇరు బుజాలపై! పోయినంత మేర
కంటికి కనిపించేవి కావు! ఇవి అనుభవ రమణీయాలు
అపుడపుడు బరువయి సెగలయి దించేయాలనిపిస్తాయి

విపణిలో ఈనాడు అమ్మబడని వస్తువు లేదు
అదే విధం! జర్నలిజం! అనుకునే సందర్భాలెన్నో

తన కిష్టం కానిది! నష్టం చేసే దనుకొని
విధ్వంసం! ప్రాణ హరం! పర్యవసానమవుతూంది

పత్రికా రూపమంటే దారిలో హరిణంతోపాటు పులిలా
కాళ్ళ సందు నుండి పాకే సర్పంలా ఒకరొకరిలో
అపోహలు! భయకారణ దౌర్భాగ్యం! జీడి మరకల్లా
జన వ్యవహారంలో మనసుకు ధైర్యంతో వివేక పద మవసరం

నియతికి స్వేచ్ఛకు మధ్య అంతరం! రేఖా మాత్రం
సంధ్యా వేళల వలె సందిగ్ధ స్థితులెన్నో! బ్రతుకులో
అందరికీ ఇష్టమై బులిపించే కథలంటూ ఉండవు
నీతి న్యాయం! తమ ఉనికి కయి! ఎవరి మెప్పు కోరవు!

ప్రజాస్వామ్యంలో ప్రశ్న! ఒక పరిష్కార వాహిక
సమస్యలో సుగమతకు దారి చూపే సూచిక

ఒక నిప్పు కణం స్పృశించి ప్రశ్నను నిలుపుతుంది
అది బొగ్గయి! మసి అంటి! మరో ప్రశ్న వదలుతుంది

(IV)

ప్రశ్నించే తలను తీసి చుక్కల్లో నిలిపేరా?
చెలరేగిన ప్రశ్నల్ని అణచి పెట్టెలో మూసేరా?
ఇది ప్రజాస్వామ్య ధర్మానికి తగిందా?
ఏ సమస్య తీరేందుకు వీలును కల్పిస్తోంది!

సహనంలో లోతు ఎత్తు కనిపిస్తాయి
మానసికమైన పరిధి విశాలతర మవుతుంది

శిలలు ఎదురు చూస్తాయి
రెక్కలు మొలిచి ఎగరాలని
చెట్లు ఎదురు చూస్తాయి
కొమ్మలు రెక్కలయి ఎగరాలని,
మనిషిలో ఆశ తప్పుకాదు, అవసరం
విత్తు పెరిగి ప్రజలకు సుమ ఫలాల నీయవచ్చు

కాలం మార్చబడే డ్రెస్ కాదు
మనిషి చేతిలో కీలు బొమ్మ కాదు
కాలం వాహనమై పయనించాలని కోరిక!
హేతువు పునాదిపైనే జీవన వ్యవహారం

మానవ సూత్రానికి పడిన చిక్కు ముడులు
జవాబుతో విప్పారి పూల దండ అవుతుంది

ఎదుగుదలను కోరని బ్రతుకులు సంకుచితం
వివేచనకు చోటు లేని వైరం అమానుషం

భిన్నత్వం వైవిధ్యం, స్వతంత్ర చలనంతో
చేతనలో వికాస రూపానికి సూచనలు!

మండే ఎండను ప్రశ్నిస్తూ మేఘం కదలుతుంది
భూమితో చినుకుల మాటలు కొన సాగుతాయి

శిశిరంలో చెట్టుకు వసంతం పయి ఆశ! సహజం
స్వేచ్ఛా సహజీవన సహన సమాజం కయి
మానుష యత్నంలో భాగం! పత్రికా రంగం
ప్రజాస్వామ్య నిలయానికి మనో మూల స్తంభం!

(V)

తమలో మరో మనిషి సాక్షిగా ఉన్నది గుర్తించక
తామే సర్వజ్ఞులమని తలచే వారెందరో

ఉన్మాదం ఒకరి ఊపిరి తీసేదయితే
నిర్బంధంతో నియతం కావలసిందే
ఉద్రేకం ఒకరి తలను తీసే విధమయితే
అణచేసే మానుష చర్యలు అవసరమవుతాయి

ఏ వాదమయినా ఏ పథ మయినా
మృగతత్వంతో నిశామయం చేసేది కాకూడదు

హక్కుల ప్రకటనలో విభేదం నుండి విరోధం
మానవతను మంట కలిసి మసి చేస్తుంది

పత్రికా స్వేచ్ఛలో అక్షరం ఆదుకుంటుంది
దీనమైన స్వరాన్నీ బాధలోని బ్రతుకుల్నీ
చేతన గుణ ప్రక్రియలో జర్నలిజం ఒకటి

ఒక విషమ క్షణంలో జారిన
నెత్తురు చుక్కలో స్వేచ్ఛ ప్రతిఫలిస్తుంది
ఇది అగ్ని చిత్రమై హక్కుల్ని తలపిస్తుంది
మాటలు రాతలు స్వేచ్ఛలో దారులు చూపేను

తమలో మాత్రమే స్వేచ్ఛ నిలవాలని
ఒక వర్గం పీడకులై హంతకులై నిరంకుశులై
సమాజ శక్తిని చీల్చేరు, మానవ స్థాయిని దించేరు

మనిషి ఎపుడైనా పోవచ్చు, స్వేచ్ఛ మాత్రం చిరంజీవి
గాలిలా వెలుగులా శుభ్రంగా స్ఫుటంగా
దీని కయి ఎవరూ వెదక నవసరం లేదు
ఊపిరియై వాస్తవమై సమాజ భవితయై కవితయై

మృత్యువును సయితం లెక్క చేయని స్వేచ్ఛ
ప్రజాస్వామ్య దీక్షతో ఎదురు నిలిచి పోరాడుతూ
నెత్తురు మడుగులో తేలడం!
సమాజ ప్రగతిలో ఒక చారిత్రక విషాదం

❁

(ఇది పత్రికా సంపాదకురాలు శ్రీమతి గౌరీ లంకేశ్ (బెంగుళూరు) హత్యకు చెందిన విషాద వార్తకు స్పందన రూపం)

స్వేచ్ఛా కవిత్వం-81

ఇది జీవితం

(VI భాగం)

ఎవరి దారి వారిది

మాదిరాజు రంగారావు

2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 81

IDI JEEVITHAM

(VI Part)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2018

Presented to
my wife
Smt. Indira

పీఠిక

"ఇది జీవితం" – బృహత్కృతిలో ఆరో భాగం "ఎవరి దారి వారిది" . మానవ జీవితం – సమాజ స్థితి గతులు – ఆదర్శం అనుభవ రూపాలు వర్తమాన విలోకనం – భవిష్యత్తు దర్శనంతో సంపన్నమయింది. సామాజిక రాజకీయ నైతిక తాత్త్విక భావ జాలం కళాత్మకతను పొంది కవితా రూపాన్ని వహించాయి. ఇదీ దీని నిజ స్వరూపం. భౌతిక మానసిక సమ్మేళనం. విశాలమైన వివిధమైన మానవ జీవన దర్శనం. ఈ ఆలోచనల పరంపరతో ప్రస్తుతం వస్తూన్న కవిత్వానికి భిన్నంగా ఉండడం సహజం. దీని చేత కవి నుండి కవికి తన వ్యక్తిత్వంలో ప్రత్యేకతను చూపాలనే ఉంటుంది. లేకపోతే ఎవరికో 'డిటో' పాత్ర వహిస్తుంది.

ఇది స్వేచ్ఛాకవిత్వం. ప్రగతి శీల దృష్టిని కలిగింది. ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికతను పొందింది. కవిత్వ పరిణామ దశలలో భాగంగానే పద్యం గేయం వచన కవిత్వాలను భావిస్తుంది. దీని వికాస చరిత్రలో ఎవరి స్థానం ఎక్కడ? ఏ రచన దేన్ని ప్రతిఫలిస్తుంది? ప్రాతినిధ్యం వహిస్తుంది? అన్న ప్రశ్నలకు సమాధాన రూపమే నేటి సాహిత్య విమర్శనా ప్రయోజనంలో భాగం. ఇది కళతో పాటు విధిగా జరగవలసిన పని! దీని చేత clarity వస్తుంది. ఈ ప్రక్రియకు గౌరవం లభిస్తుంది. తన పాత్రను సరిగా నిర్వహించిన తృప్తినిస్తుంది.

ఇది స్వేచ్ఛా కవిత్వం పేరుతో వెలువడే క్రమంలో 81వది. గుణంతోపాటు రాశి కూడా కవిత్వ స్థితికి బలాన్ని ఇస్తుంది. ప్రశస్తిని పెంచుతుంది. ఇది వర్తమానంలో నేటి జీవన దృశ్య సంచయం, లక్ష్యానికి తలంపై విషయ పరిధిని పెంచుతూంది. కవిత్వ కళకు రూప విశేషంతో ఎత్తునూ లోతునూ ప్రసాదిస్తూంది. సాహిత్యంలో ప్రయోజన దిశలో సామాజిక బాధ్యతను భావింప చేస్తూంది.

– మాదిరాజు రంగారావు

ఇది జీవితం (ఆరో భాగం)

ఎవరి దారి వారిది

1.

ఎవరి దారి వారిది స్వేచ్ఛలో
వ్యక్తికి దేశానికి కాలానికి మితం కాదు
ఏ దారిన ఏ వైపున ఎక్కడికి అంటే
మును ముందుగ తోచేది తన ఊరు
ఆపై నేరుగ చేరేది తన ఇల్లు
ఆ తరువాతే ఏ దారి అయినా ఎక్కడికయినా

ఊరులో అడుగుపడగానే
జలద స్పృహ పొందుతుంది మస్తిష్కం
ఇంటిలో అడుగు నిలవగానే
కుసుమ స్పర్శ పొందుతుంది హృదయం

వానలో తడిసి ముద్ద అయి
బిగిసిన దేహం! వణకుతూ
అమ్మ కొంగుచే తుడవబడీ నిమురబడీ
వెచ్చదనంతో ఉత్సాహం ఉరకలు వేస్తుంది

అప్పటి వరకు స్వాధిష్ఠానంలో
అణగి మణగి ఉన్న అగ్ని!
ఆకలి నాలుక చాస్తుంది
ఆహుతి కయి ఎదురు చూస్తుంది

ఇంటికి చేరగనే మనస్సు
ఎక్కడా దొరకని విరామ తృప్తితో
వెన్నెల గగనం దిగి తన శరీరాన్ని
ఆవరించి నట్లు ఉంటుంది

ఇంటి పెద్ద ముఖాన శాసన పంక్తితో
కోపానికి తాపానికి దారులు మూతబడీ
భేదాలకు వైరాలకు తలుపులు వేయబడీ
అదుపులో ఉన్న స్థితులు శాంతిని వరిస్తాయి

❁

2.

ఎటుపోయినా తిరిగి చేరే నిలయ మిదే!
ప్రేమ కరుణ సానుభూతి మానస కేంద్రం
జీవన కళలను విస్ఫారగ జేసే మనోజ్ఞ రూపం
దీని ముందు తాజ్‌మహల్ పక్కకు జరుగుతుంది

నేనుతో మొదలయిన ఈ జీవన యానం
సమూహాల అనుబంధంతో సంఘంలో భాగమై
ఇల్లు దాటగనే ఊరు నుండి బయటికి
నగరం దేశం జన వైవిధ్యంతో విపుల ప్రపంచం

చూచే కళ్ళు! కొంత సేపు మూత బడవచ్చు
వినే చెవులు! ఎప్పటికీ తెరచుకొనీ సిద్ధంగా
నినాదమో ప్రబోధమో హిత వచనమో! ఏదయినా
వర్తమానం మెట్ల పైనే జీవితాల ఆరోహణం

చర్యకు మనో గుణం ప్రేరణం
మనసుకు బ్రతుకు విధం ఆకరం

ఆరోహణలో ఒక శిఖరం చేరిన జీవితం
అచటి నుండి ప్రవాహమై! అవనికి చేరాలనీ
అవనితో బంధం జీవన వాస్తవం
మనిషిలో విజయం! నిరంతరక్రియగా,

పైకి శూన్యంగా కనిపించే ముఖం వెనక
లోన పొగలతో శిఖలతో పరివేదన!
హృదయ మెంత రసార్ద్రమయి ధుని అయినా
దారిలో శిలలను అలల వేళ్ళతో దువ్వి పోవలసిందే!

గల గల జారే జల పాతంలా మాటలు
మాటలేంది మనుషుల అలికిడి సందడి ఎక్కడిది?
ఉదయ సంధ్యపై ఒకరి దృష్టి ప్రయోజనపరమై
సాయం సంధ్యపై ఒకరి దృష్టి విరామ పదంతో
ఎవరి వాదం వారికి ప్రియం
ఎవరి గమ్యం వారికి ముఖ్యం

3.

పగలంతా పద యుగం అలలయి సాగి సాగి
పయనంతోనే పనులలో కాలం గడుస్తుంది
చేతిలో మొగలి పట్టల సర్టిఫికేట్‌ల ఫైలుతో
అలసి సొలసి సాయం వేళ పార్క్‌లో యువకుడు!
చల్లని ఉపశమన వనంలో! కాస్త ఊరటగా

వెలుగుల అడుగుల నిష్క్రమణంతో
చీకటి అడుగుల ఆగమనంలో
కాలం! యువ మనో రూపాన్ని బింబించేను

చెట్టు కింద బెంచిపై కూర్చోగానే
ఊపిరి చక్కబడి, ఆలోచన ఒకటే మిగిలింది
బెంచి పక్కనున్న రాయి తీసుకొనీ
విసరితే, పైనుండి దూరంలో అది
తాకిన చెట్టు కొమ్మపై పక్షులు
గుంపుగ రెక్కలు టపటపలాడిస్తూ ఎగిరిపోయేను

క్షణం ఆగి మరో రాయి చూచి తీసి
బలంగా విసరితే! పై నుండి దూసి పడిన ధ్వని!

అపుడే! ముఖాన చిన్న మచ్చతో చంద్రుని ప్రత్యక్షం
ఆ మచ్చ విసరిన రాయి గాయమే! అనిపించవచ్చు
విసరిన వాస్తవంతో! కనిపించే నీలి మచ్చ భ్రమ,
ప్రస్తుత జీవన చలనంలో ఒక భాగమవుతూంది

గురి చక్కగ కుదిరిందనే సంతోషంలో
ఎదురుగ ప్లేట్‌లో అన్నంలా చంద్ర బింబం!

కాసేపటికి పార్క్ నుండి బయటికి వచ్చేసి
మనసు కాస్త స్తిమిత పడి, ఇంటి ముఖం పట్టేను
ఇంటికి చేరే లోపల తన చుట్టూ వెన్నెల!
అన్నపు రాశిలా ఆవరించి! ఇంకా ఏం కావాలి?
రేపు సూర్యుడు వస్తాడు! క్రమం తప్పడనీ తెలుసు!
రోజు వారి ప్రబోధంతో సైన్ బోర్డ్‌లా! ఆశా రూపం

4.

ఎన్నిక లవగానే జన గణ స్వరం అణగుతుంది
నేతల బుజాలపై దిగుతుంది సమాజ ఖజానా
సభ్యుల గళ రవం పార్లమెంట్‌లో మ్రోగుతుంది
పలు రకాల బాణీల్లో రాజకీయ ఆర్కెస్ట్రా సంగీతం

జనావాసాలలో నాయకుల బొమ్మలతో హోర్డింగ్‌లు
వ్యక్తిపరంగా అధికారంగా మధ్య రేఖ చెరగిపోయి
ఎప్పటికపుడు సందేహ డోలపై ఊగుతూ
నిరాశలో మునుగుతూ ఆవేశంలో తేలుతూ
సంక్షుబ్ధ జలధిలో నావలా, సంఘంలో నైతికం

చీకటి తీగెలల్లుకొన్న ముఖాలతో యువత
అలజడి గుర్తులతో వర్తమాన యాన పథం
ప్రగతిలో దాటాలిసి ఉన్న గోతులు! వైతరణులు

పుస్తకం బదులుగ చేతుల్ని అలంకరించేను పత్రికలు
టెలివిజన్ దృశ్యాల్లో చర్చల్లో సమస్యల వివాదాలు
జన గళ స్వరం ఎగసి గాలిలో సుళ్ళు తిరుగుతూంది
ఎవరి పనులలో వారు! వినే వారికి కాలక్షేపం!

అధికార కథా పీఠం కయి పోటీలో మలుపులు
పరుగులో జారిన వారు! నీతి తరపు వాదులు

ఒకరినొకరు వెంటాడే వేటాడే శత్రుతలతో
ఎప్పటికీ ముగియని రాజకీయ క్రీడా ప్రదర్శనం
పలకపై రాత చెరపినంత సులభంగా
రాకపోకల సందడితో స్టేషన్ ప్లాట్ పార్మ్‌లా పార్టీలు!

ట్రాఫిక్ జామ్‌లో చిక్కిన వాహనాలు వేచి వేచి
బయపడ నున్న సమయంలో కుండపోత వర్షం!
దారి దొరికితే అదృష్టం, వరదలో తరలిపోతే
ప్రకృతి వైపరీత్యం! బాధ్యతల నుండి మోచనం!

5.

ఆహారం కయి కప్పల కోసం నీటి మడుగు వైపు
సరసర కదలే సర్పం! చూచే మనిషికి భయం!
పడే అడుగు ఆగి పోతుంది! హఠాత్తుగా
క్షణం పాటు నిలిచి, ముందుకు పయనం! తప్పదు

భూమి అదే! నింగి అదే! రవి చంద్రులు చుక్కలవే!
మనిషి ముఖం అదే! మదిలో కదలే రూపాలు వేరు
ఎప్పటికీ వీడని చిక్కు ముడులతో
కనిపించని పొరలతో తెరలతో బ్రతుకులు!

దారికి ఇరువైపుల చెట్లు! స్వాగతిస్తాయి
చెరువు ఎదురు చూస్తుంది! నది తనతో రమ్మంటుంది
పైనుండి మబ్బు బంధువులా కనిపెడుతూ సాగేను
ఎన్ని ఉన్నా! మనిషి కనిపిస్తే! చూపుల కొక పూర్ణత
ఆ ముఖం కుసుమంలా వికసిస్తే! సుముఖంగా
ఆ ముఖం రాజేసిన నిప్పయితే! విముఖంగా

గాలి వేగ తీవ్రతల్ని ఆకులతో దువ్వి
ఆప చూచి చెట్టు! మెల్లగా వదలుతుంది
వినయంగా తన తల వంచిన దయి
గాలికి వెళ్ళే దారి చూపుతుంది

స్వేచ్ఛలోని విలువల్ని గాలి బయట పెడుతూ
పోయి పోయి కొండ వద్ద నియతమవుతుంది

ఒక పని ఒకరికి ఇష్టమయి మరొకరి అనిష్టమయి
రెండిటి మధ్య సందు చేసుకొని! పయనం సాగుతుంది

మనిషి గళం నుండి స్వరంలో
కరుణయొ! వీరమొ! క్రోధమొ! శాంతమొ!
మన: పటలంపై కారణ గీతల చిత్రం!
ఆ వెనక నుండి అంతరంగ బింబ ప్రకాశం!

6.

ప్రతి వ్యక్తికి తనలో కోరిక! అపూర్వంగా
స్వతంత్ర మయిన మహా భవన నిర్మాణంపై
సుందర సుగంధ పద్మంలా అంతర నిలయం
రేకుల కవచంతో అజేయమై నిలవాలని

చివర కేమి జరిగేనో తెలియదు కాని
అది పొందే విధంలో! విలువలు వేరవుతాయి
కాలం గీటు రాయి అవుతుంది ఆ తరువాతనే
బయట పడుతుంది! గుడిసా! సత్రమొ! సౌధమొ!

నిశి మలి జాము నుండి నీడ కయి చూచేను మనిషి
దీని ఉనికి వెలుతురు లోనే అని తెలుసు!
వ్యవహార జగత్తులో చీకటికి చోటు దొరుకుతుంది
సుదీర్ఘ జీవన గతిలో! ఇది సహజమయి పోతుంది

అద్దంలో కనిపించే ముఖం బాహ్యం లోదే
కనిపించని మనో రూపం క్రియలో తెలుస్తుంది
ఇది బ్రతుకులో సాగేది, అనుభవంలో నిలిచేది
స్పందనతో మొదలై జీవన రుచి కనుగుణమైందీ

బ్రతుకంతా ఓటమియే అనుకుంటే
మనిషి పయన మింత దాక వచ్చేనా?
నిరాశలో సత్వం మరుపున బడుతుంది
ఓటమిలో భ్రమలు ముందుకు వస్తాయి

గెలుపులో కాలం పరుగులు తీయిస్తుంది
మనో ధైర్యంతో ముందుకు సాగిస్తుంది

పచ్చగా చల్లగా వివిధ ప్రాణుల నిలయం
అరణ్యం! పూర్తిగా బ్రతుకు నుండి తొలగదు
ప్రకృతిలో శుష్కమైన ఎడారి మాయ మవదు
బ్రతుకులో పేదిరకం పూర్తిగ తొలగిపోదు
పగలు కెంత ప్రాధాన్యమో! రాత్రికి అంతే! ఉన్నా
జీవితాన మాత్రం వెలుతురు లోనే పయనం

7.

పైకి ఎగిరి దిశలు స్పందిస్తూ పోవాలని
ఏ కరెంటు స్తంభం తీగెకో హఠాత్తుగా
చిక్కుకొన్న విహగంలా మనిషి బ్రతుకు
అనుచర సానుభూతి కొక్కానికి వేలాడేను
ప్రకృతికి సమాంతరమైన జీవిత రూపంలో
సమాజ సానుభూతి ఎద అంచున వేలాడేను

ప్రకృతికి ప్రభావంతో జీవన రూపం
సుఖ సంపదలలో పూర్ణత కోరేను
ఊహ నుండి క్రియకు ఆచరణంలో
అనుభవ క్రమంలో విజయానికి దగ్గరగా

మనిషి చేసే పనితో వ్యక్తిత్వం పెరుగుతుంది
సామాజిక మూలంతో అస్తిత్వం నిలుస్తుంది
నడకల నడతల మధ్య అంతరం
మధ్య మధ్య లౌకిక తంత్రంచే
ఇది తొలగేందుకు నైతిక కిరణ మవసరం
సమయ సమయం మారే స్థితులతో స్వార్థంలో
బ్రతుకు చిత్ర రూపం మారుతుంది రంగులతో

తీగెలా సాగుతూ పోయే వర్తమానం
కాలికి చుట్టుకొనే బంధన మనుకున్నా
పూలతో అలరితే మనసుకు సంతోషం

కల్పనలో ఆశ్రయం కొత్త జగం చూపుతుంది
కష్టంలో అతీతం తన వైపుకు లాగుతుంది
ఇవి బ్రతుకును బంతిలా ఎగర జేయవచ్చు
ఎచట పడేదీ ఎటు పోయేదీ తెలియదు

ఎక్కడి కక్కడ గుంపులుగా తీర్చబడి సమాజం
మనిషి నడకలో పరిమితులేర్పడ జేసేను
ఎప్పటి కప్పుడు ముక్కలుగా వీడిపోయి కాలం
మనిషి నడతలో సంకుచిత మేర్పడ జేసేను

❁

8.

నిప్పు నెవరు నేరుగా చేతితో స్పృశిస్తారు
నిప్పు లాంటి నిజానికీ అంతే ఎడంలో
దూరంగా ఉన్నప్పుడు చింతన సాగించేరు
దగ్గరగా ఉన్నప్పుడు జాగ్రత వహించేరు

బతుకు స్క్రీన్ పయి దృశ్యం మారుతుంది
ఏ రంగులో ముఖ మెదురయ్యేనో తెలియదు
ఇవి తెలుసుకునేందుకు పరిశీలన లెన్నో?
అన్వేషణలో మనుషుల అడుగు జాడలు దారిలో
కాలంపై మానవ జీవన సూచన లయ్యేను!
ఈ అనల తేజం వెలుగులు! ఆరవు! మారవు

చివరి దాక మనిషికి తోడుగ వచ్చేది మనుషులే
చెట్లు కాదు రవి చంద్రుడు చుక్కలు కావు!
ఇంజన్‌కు కోచ్‌ల వలె జీవితాల అనుబంధం!
సాగుతుంది! ప్రశ్నకు జవాబుల వరసతో

ఉదయం! బంగరు నగిషీ శాలువా అయి
మానవ శ్రమ శక్తిని అలంకరిస్తుంది
నిశి వెన్నెల రెక్కలతో హంసయై
మానస రూపానికి వాహన మవుతుంది

స్మృతిలో తేలుతుంది జీవన గాథలతో
జలధిలో అలలపై కదలిన నావలా గతం!
దీపావళి వెలుగుల ధ్వని సంరంభం ఉల్లాసం
అప్పటి వరకు పొందిన విజయానికి సంకేతం

బ్రతుకు స్క్రీన్ అనుభవ దృశ్య పరంపరతో
కట్టిన అనుమానం సందేహం డోలికపై వర్తమానం
అనుకోని సమస్యల పొగలతో ధ్వనులతో
జీవన సంకట సంక్షోభంతోనే కలుషతలకు సూచన

9.

పయనంలో కవిత ఎచట దొరకుతుంది
కంటికి కనిపించేనా? వెదకితే లభించేనా?
గ్రీష్మంలో తప్త సరసి హృదయం లోనా?
నీలి మబ్బు విడిచే బాష్ప కణం లోనా?

రాత్రివేళ గగన నయన తారల లోనా?
జీవన గతిలో విషమ లిప్త కంపనలోనా?
గురి తప్పి ఎగిరి పోయే పక్షి గమనంలోనా?
గురి తాకి నేల వాలే పక్షి వేదనలోనా?

తిండికై వేటకు బయలు దేర తీసే ఆకలి లోనా?
తుపానుకు విరిగిపడే చెట్టు వాలకం లోనా?

బ్రతికినంత వరకు మనసు విరామం ఎరగదు
ఊహ సాగు వరకు కవిత విరమణం పొందదు
కోరికకూ పరితృప్తికీ మధ్య
ఆశా రూపానికి గుర్తు కవిత

ఎంతటి వేదన లోనూ శుష్కత ఎరగదు
దేని నయినా తనలో చేర్చుకొనే నిలయం
అస్తితలో చేతన జడతను ఛేదిస్తుంది
అది కవితామయమై మౌనాన్ని విప్పుతుంది
సమాజ గమన వేగంలో ఒకటవుతుంది
లోలోన ఉన్న మనస్విని గుర్తుకు తెస్తుంది

బాధా జలధిలో హృదికి అందిన నావయై
నిస్పృహలో ఉత్సాహ హయం పరుగిడుతుంది
ఒంటరి తన మదృశ్యమై సమాజ రూపం
ప్రయోజన కళతో విప్పారుతుంది

ఎచటి నుండో వచ్చి పూవుమై వాలే భ్రమరంలా
ఎచటి నుండో వచ్చి చల్లబరచే మేఘంలా
చీకట్లను జరిపే చంద్రుని వెన్నెలలా
సృజన రశ్మి రాగంతో హృదిలో నిజ కవిత

10.

ఎద తలుపులు తడుతుంది సృజన కరం
అనుభవ వాస్తవానికి కళా దృష్టి తోడయి
అక్షర యానంలో కవిత బయట పడుతుంది
విప్పారిన కుసుమం లానో! విడిచిన బాణం లానో

ఎన్ని శాఖలు ఉపశాఖలుగా చెట్టు చీలినా
అది పిలవబడేది ఆ జాతి పేరుతోనే
ఎన్ని దారులుగా ప్రకటితమయినా
కవిత నిలబడేది! సృజన బలంతోనే

అవసరానికి పూవా! పండా! ఇచ్చే
చెట్టు లాంటి కవిత! అమ్మతో సమానం
దేని గుణ రూపం దానిదే
దేని భావ జగం దానిదే

నిశ్శబ్దం నుండి శబ్దానికి యానంలో దృశ్యం
భవితపై చూపుతో వర్తమాన రూపం!

అడవులలో ఎడారిలో మైదానంలో ఆవాసాలు
వివిధ స్థాయిల్లో శ్రేణులుగా ప్రజల జీవితాలు
ఎంత కష్టమయినా రెక్కల్ని నమ్ముకొని
చోటు నుండి చోటుకు సంచారం!
చేతిలో పనితో భాగ్యం చిగురించేను
శూన్యమైన చేతిలో దరిద్రం! వసించేను

నీరు కోసం తవ్వితే బయట పడేవి!
భూమి పొరల నుండి శిథిలాల్లో కంకాళాలు!
జారిన కన్నీరు ఘనీభవించిన శిలలు!
గాయపడిన మానవీయ సందర్భాల గుర్తులు
చరిత్ర ద్వారానికి వ్రేలాడుతూ
వర్తమానం చూపును గతం వైపు తిప్పేను

11.

ఆశ అనలం కాదు, అది కిరణం
సమస్య బంధం కాదు, పై మెట్టుకు సూచన
ఎదురయ్యే ప్రశ్న! ఆటంకానికి అలారమ్
అన్నీ సావధాన పరచే అనివార్యాలు
పాలలో దాగిన వెన్నలా నిజం
అంత సులభంగా అర చేతిలో పడేది కాదు

ఆశలో వెలుగు స్పర్శ బ్రతుకును నడిపిస్తుంది
దుమ్ములో పొరలడం, బురదలో నడవడం
భూమి పైని ప్రేమ అవదు, మట్టి విలువ తెలిసి కాదు.
మనసు చెదరి నిరాశలో నిశకు దగ్గరయ్యేరు

కాలం ఆగదు, ఆగిన మనిషిని ఒంటరి చేసిపోతుంది
నడచే మనిషిని పరుగెత్తిస్తుంది, వేగం పెంచుతుంది
హిమ శిల కరగితేనే నీరై దాహం తీరుతుంది
కిరణ స్పర్శతోనే ప్రకృతి ముఖం వికసిస్తుంది

వ్యవస్థ రూపంలో పరివర్తన మొదలయి
మానస భూమికలో ఆరోహణ తోనే ప్రస్థానం

అందరు ఒక దిశలో ఒక పథాన గమ్యం
కల్పనలో సులభంగా అందంగానే ఉంటుంది
వాస్తవానుభవంలో ఫలించని ఆదర్శం
అవసరాల ఒత్తిడిలో వేరు కాక తప్పనివీ
దిశ ఏదయినా పథ మేదయినా తమ గమ్యంలో
సమస్యల నెదుర్కొంటూ సాగడమే కర్తవ్యం

పండిన పంట కోత పడక తప్పదనీ
మరో పంటకు వీలు చిక్కుతుందనీ
వ్యక్తి స్థాయిలో మనో వైక్లబ్యంతో
బ్రతుకులో హింస! ఆచరణీయం కాదు!

12.

మనసు నుండి తొలగి పోదు ఏదీ
శిఖరాలయి ఆభరణాలుగ నిలుస్తాయి
గోడ ఇటుక నుండి మట్టి పాత్ర వరకూ
తవ్విన శిథిలాల నుండి అన్నీ భద్రంగా

మనసులో వాలి ఉన్న మూడో కన్ను
ఎపుడు బడితే అపుడు విప్పారదు

దీని కొక నియతమైన సమయం సందర్భం లేదు
ఇది ఒకరికి ముందుగ తెలిసేదీ కాదు
ఒక విశేష స్థితిలోనే అవశ్యమై తెరుస్తుంది
ఆపదలో అలజడిలో కర్తవ్య ప్రబోధంతో
నిప్పుల మెట్లపై నడవాలిసి రావచ్చు
మంచు శిలలపై అడుగులు తప్పక పోవచ్చు

మట్టి నుండి బయట పడిన ఇనుప ముక్క
పంటకు కొడవలి అయి రక్షణలో అసి అయి
కవితకు చెరొక వైపు వీటి అవసరం
ఆకర్షణ కన్న ప్రయోజనం ప్రధానమయి
శిలను చూచి మనిషిలో శిల్ప దర్శనం
ఒక సౌందర్య కళా హృదయం తోనే!
అణువు నుండి వినాశన పర్వం కన్నా
వికాస రూపమొక వికాస మతి వలనే

ఏది అడ్డు పడినా కాలం వెనక్కి మరలదు
వాద మేది అయినా ప్రగతినే వరిస్తుంది
విజయంలో ముందు వైపు తలుపులు తెరవబడీ
ఓటమిలో వెనుక వైపు తలుపులు మూయబడీ

బాణ మయినా బాంబు అయినా మిస్సైల్ అయినా
ఏదీ సమస్యకు పూర్తి పరిష్కార సూచి కాదు
ఎదలో స్పందన ఆర్తి వైపు పరుగెత్తిస్తుంది
మతిలో ఆలోచన సమస్య వైపు తిప్పుతుంది

13.

మానవీయ మొక అలంకార ప్రాయమయితే
మనిషిలో రసధుని ఘనీభూత మయినట్లే
కాలంపై శిల్పంగా మారే ఆలోచనతో
ఆర్ద్రత కోల్పోయే వీర మొక కాష్ఠ సమం

ఒక్కొక సమయంలో మానవ హృదయం
పుష్పమొ! రత్నమొ! మబ్బు తునకొ! కట్టె ముక్కొ
ఎవరి దారి వారిది అయినా గమ్యానికి మధ్యలో
దాటాలిసిన! సవాళ్ళు ఎన్నో! గిరులెన్నొ, నదులెన్నొ

ఓడలు వస్తూ పోతూంటే చూస్తూ చూస్తూ
నిల్చొని నిల్చొని గట్టున కాలి నడక సాగేనా?
ఈ చేతిలో డబ్బులేంది!
ఆ ఓడను ఎక్కేదేలా?

పయనంలో కోల్పోయే దేమీ లేదు
అనుభవాలు చేరతాయి, వికాస సంపదతో
మజిలీ మజిలీకి కొంత దూరం తగ్గినా
ఉన్న దానితో పాటుగ కొత్త బరువు చేరుతుంది

భూమి ఎంత విశాలమయిన దయినా
పయనంలో మనిషికి కావలసింది కొంతే
మిగిలింది ఎందరికో అవకాశంగా
అది తన దయి పోవాలని బలవంతుని కోరిక

ఊరే నీరుతో బావిలా మనో రూపం
కొందరిలో తమ అవసరానికి ఉపయోగం

మనసు సంకుచితం కావడం బహు సులభం
వికసించిన పద్మమై బ్రతకడమొక విశేషం
శూన్య మనో నిలయం పరిమళ యుతమై
దిశల నుండి ఆలోచన విశ్వమయం చేస్తుంది

స్వేచ్ఛా పవనంలో సమాజ బంధువయి
ప్రపంచ దృశ్యంలో భాగమై పోయేను

14.

బావి లోకి బొక్కెన దింపితే
నీరు వస్తుంది, అవసరం తీరుతుంది
ఆభరణాలు రావు, రత్న రాసులు రావు
ఉంగరాలు రావు, సమస్యల్ని తీర్చవు
ఆకలిలో మబ్బులతో పనిలేదు
దప్పికలో వెన్నెలతో పనిలేదు
ఆ అవసర సందర్భాలు వేరు
జీవన మానస స్థితులను మార్చేవి

నాటకంలో భాగమయిన పాత్రలో మనిషి
బయటి నుండి విమర్శ పాత్రను వహించలేడు
మళ్లె తీగె పాదులో రాత్రి వేళ
చుట్టుకొన్న సర్ప మొక తెలియని వాస్తవం

ప్రేమ కరుణ అందరిలో అంతో ఇంతో
అవసరానికి పైకి వచ్చే దారులు తక్కువ!
స్వార్థంలో లౌకిక తంత్రంలో ఉపేక్షలో
తెరవ బడని దారులే ఎక్కువ!

ఒక సందర్భంలో ఎదురుపడిన ముఖం
ప్లాస్టిక్ పూల గుత్తిని తలపించవచ్చు
అవకాశం దొరకని బ్రతుకులు
యంత్ర శాలను తలపించవచ్చు

రాక రాక వచ్చిన మేఘు మయినా
వర్షిస్తూనే నింగిలో నిలిచిపోదు
ఆ వచ్చిన మేఘం! భూమికి భాగ్యం
వర్షం పడితే! మనిషికి సంతోషం!

పక్షుల వలె ఎగిరి పోయే క్షణాలు కవితలో
అక్షర పంక్తులుగా నిలిచేను నిర్భయంగా

15.

పయనంలో తప్పనిదై మజిలీలో నివాసం
కిటికీ అయినా తెరవ బడీ గాలి కదలితేనే సుఖం
ఊపిరి ఆడుతుంది, గాలితో స్నేహం పెరుగుతుంది
బయటి నుండి వెలుతురు లోనికి ప్రేమతో వస్తుంది

దారి దొరికి బయటికి దూకే నల్ల పిల్లి
కళ్ళలో మెరపుతో చీకటికి దారి చూపుతుంది
ఆలోచనలో మార్పు, ధైర్య కవచం తొడుగుతుంది

బయట నుండి చెట్టు, మరచింది జ్ఞాపకం చేస్తుంది
బ్రతుకును సరి చూచుకొనే వీలును కలిగిస్తుంది
ఎపుడో రాబోయే ధూళి ధూమ భయంతో
లోనికి వచ్చే గాలిని వెలుతురును ఆపేమా?
తత్కాల చర్యతో స్వేచ్ఛకు ఆటంకం తొలగేను,

బయటి నుండి తుమ్మెద హఠాత్తుగా
లోనికి దూసుక వస్తుంది ఆత్రంగా
చుట్టూ పరిభ్రమించి ఝంకారంతో
మధు బిందువు బదులు, ముల్లు గుచ్చి పోతుంది

కాసేపటి కొక సీతాకోక చిలుక వచ్చి
చకితంగా బుజాన వాలి ఎగిరి పోతుంది
అన్నిటినీ ఎదుర్కొనే గుండె బలంతో
ప్రకృతి మధ్య జీవితం! సమాజ బంధంతో

భూమిని నమ్ముకొని మనుషుల సంరంభం
నింగిని గురించి ఆగని ఆలోచనతో
శ్రమ ఫలాలు వేలాడుతూ సమాజ వనం
గుణ రుచి సుందరతలతో విశ్వమయం

ఇది స్వప్నం కాదు, జీవన వాస్తవ రూపం
ఇది స్వేచ్ఛా కవితకు నిజ ప్రేరణ మూలం

16.

ఇంచు మించు ప్రతి రోజు ఉదయ వేళ
చేతిలో గన్‌తో వీధిలో వెళుతూ, కనిపించేను
ఎవరిపైనా దీన్ని ప్రయోగించి నట్లు లేదు
మానవ శక్తికి తోడుగ అండగ ఉంటుంది

ఏ అవసరం కలగలేదు కాని అందుకు సిద్ధంగా ఉంటుంది
భద్రతలో రక్షణలో, ఆయుధ మొక సన్మిత్రం!

అతడు నడుస్తూ ఉంటే అలలు కదలినట్లు ఉంటుంది
చీకటి భయంతో ఒదిగినట్లు ఉంటుంది నీడ!
గాలికి కదలే ఎదిగిన పైరులా వాలకం
చూచే వారికి ఇక భయ మెక్కడిది? అభయమే

ఆ ఆయుధ మెందుకు అంటే? జవాబు సులభం
శక్తికి చిహ్నం! అది లేంది అతని వ్యక్తిత్వం లేదు
దీని తోనే సాహసంతో సమాజంలో వీరగాథలు
ఆయుధ మెరగని జాతి లేదు దేశం లేదు

రాజ్యాలు మారాయి, మతాలు తల క్రిందులయినారు
ప్రభువులు మారారు, ధర్మ పథాలు మారాయి
ఏ రోజు అతని గురించి తెలుసుకోవాలనుకుంటూనే
రోజులు గడచేను! మనసులో తెలిసినట్లు ఉంటుంది

వాడి కత్తి అంచుతో, కోష్ణ కిరణ స్పర్శతో
కవితలో ఆయుధ రూపం! జన శాంతికి అర్పితం
వీరులు కనే కలలు ఆయుధానికి బాగా తెలుసు
కవులు కనే కలలు! చేతిలో కలానికి బాగా తెలుసు!

ఎదుట తెరచిన మహా గ్రంథంలా సమాజం
మొత్తం తెలుసుకునే కోరిక తీరిక ఎవరికుంది?
తిరిగే పేజీల్లా రోజు లెన్ని గడచినా
అందని ఆకాశంలో బింబంలా ఆదర్శం
లక్ష్యాన్ని అందుకునే పరుగులలో
ఎవరికి వారు! గడపని రోజు లేదు

17.

పయనంలో మనిషి స్వరం! అపుడపుడూ
జంతువుదో మృగానిదో! అనిపిస్తుంది
వెళ్ళే మనిషి నడక! తుపానును గుర్తుకు తెస్తుంది
ఒకరి ఉనికి చీకటిలో వెలుగు దీపమై
కళ్ళ ముందు వెలుగులో ఎవరెవరో
తేలుతూ పోవడమొక రుచిరానందం!

మనసులో గోడలు! సంకుచిత రూపాలై
స్వేచ్ఛా సంచరణాని కంతరాయ మయ్యేను
బిందువు నదియై సాగే ప్రతుకులో
మధ్య మధ్య ఇసుక మేటలు! ప్రత్యక్షం!

వైరుధ్యాలను జయించే శక్తి మనిషిలో
అణువు నుండి తనువంతా వ్యాప్తమై
చంద్రుణ్ణి తలపిస్తుంది బాధలలో
సూర్యుణ్ణి తలపిస్తుంది గాథలలో

ఒక్కరితో ఒంటరిగా ఏ పని అవదు!
అనుబంధంతో సమూహ చేతన అవసరం

వసంత వస్తుంది! మహదానందకరంగా
గేటు ముందు నిల్చొని పిలిచే భిక్షువు
పక్కనున్న చెట్టు నుండి పాత్రలో! ఆకులు రాలేనా?
వీధిలో వాహన వేగానికి లేచిన దుమ్ము పడేనా?

రాత్రి వేళ ఒంటరి చుక్కల విలాపాలు
ఎవరికి? ఎక్కడ? వినిపిస్తాయి?
పగటి వేళ ఒంటరి యువకుల విన్నపాలు
ఎవరకి? ఎప్పుడు? వినిపించేను?

ఇది వాస్తవ దృశ్యం! చూడక తప్పనిదీ
జీవన యాతనలో పయనం సాగేంత వరకూ

18.

పగలు వెలుగు లోను చీకటి బొమ్మల వలె
వీధులలో తిరిగేరు నిరాశా మతులు
వచ్చిన సూర్యునితో బ్రతుకు తెల్లవారేనా?
సమాజ సూర్యుని అవసరం తెలుపుతూంది

ఇది మానవ నవ తేజంతో
జన గణ శ్రేయో బింబం
అస్తమయం ఎరగనిదీ
ఎదురు చూచే కాలంతో పని లేనిది

ఇతిహాస రథంలో క్షత గాత్రులు రణంలో
సమాజ చింతన కన్నా వ్యక్తి ఉనికి లక్ష్యంగా
సాగిన చరిత్రలో! సాధారణ ప్రజలకు
పొందిన దాని కన్నా! పోయిందే ఎక్కువ!

సమాజ హిత పరివర్తన రూపం అంటే
అద్దంలో బులిపించే చంద మామ కాదు
మెడలో ఆభరణాలతో ప్రతిమల గృహం కాదు
బ్రతుకును మండించే అనలం ఆర్చే మేఘం
బ్రతుకును పండించే రసధుని జారే రూపం

వెనక్కి వెళ్ళ లేదు, వెళ్ళదు సమాజం
ఆగదు, ఆగేది ప్రవాహ మనిపించుకోదు
మైదానంలో దాహం తీర్చే నదులతో పాటు
అపుడపుడు ప్రాణాలను ముంచేసే వరదలు
సముచిత చర్యలతోనే బతికి బట్ట కట్టేది
ఉదార చరిత ఉన్న మనిషి ఉపద అవసరం

కరుణ ప్రేమ ఉత్సాహం వెలుగులు చూడని
సమాజం! చీకటి గుహలు సమాహారం
సంఘంలో వ్యక్తి బ్రతుకు దేని కది స్వతంత్రం
నీతితో నియతి ఎపుడూ స్వేచ్ఛకు బంధం కాదు

19.

కదలి కదలి నదికి అలల ఆరాటంతో
కాస్త స్తిమితంగా నిలిస్తే బాగనిపించవచ్చు

పూవు కోసం ఫలం కోసం ఎందరో
తన వద్దకు విచ్చేసే వారే అయినా
అందరికీ తన అవసరం విభవం చూపేందుకు
చెట్టుకు కాస్త నడవాలనిపించవచ్చు

తాను దూత కన్న నేతగా కనిపించాలని
గగనంలో కదలే మేఘానికి కోరిక
నదిలో చెట్టులో మేఘంలో కోర్కెలు
మనిషిలోను తల లెత్తేను! త్రీ ఇన్ వన్

జలాలతో పొలాలలో పంటలు చూపే ప్రవాహం
పచ్చదం నీడతో ఆశ్రయ మిచ్చే చెట్టు
వానలతో దాహార్తిని తీర్చే మేఘం
ప్రాణం ఉన్నంత వరకు అవసరాల ప్రాధాన్యంతో
నవ్యంగా బ్రతుకులు తీర్చే జీవ నిధులు
స్పందమాన హృదయానికి కవితా వస్తువులు

పక్కనే తల ఎత్తి నిల్చిన పర్వతం
నీటిలో తన రూపం చూచి మురుస్తుంది
గట్టు పైని చెట్టు! చేతులు చాచి
నీడతో ఆశ్రయమై ఎదను అలరిస్తుంది

పిడికిలి మట్టిలో జల బిందు స్పర్శతో
ముఖం ఎత్తుతుంది! విత్తు! సృజన గుణంతో

కోపం దు:ఖం శత్రుత ద్వేషం అధికారం
ఈ మాటల ప్రసక్తి లేని మానవ కథ లేదు
ఈ కథలతో మనిషికి చక్కని కాల క్షేపం!
వినడం చెప్పడం ఆచరణంలో శూన్యం!

❁

20.

దాహంలో తాగేందుకు పనికి రాని సముద్రం
తాపంతో దప్పిక తీర్చే జలదాన్ని సృజిస్తుంది
మంచి పనికి శ్రీకారంతో మర్యాదను పొందుతుంది
ప్రకృతి శక్తి నిలయమై సమాజాన్ని తలపిస్తుంది

తుపాను రూపంలో శత్రువులా గాలి వాన
నాశనకర చర్యలతో భూమిపై కదలుతుంది
చేతిలో మృత్యు ధారా పాశంతో
ముఖంలో బాధాకర వికారాలతో

నిరంకుశం చూపుతుంది విషాద చిత్రం వదలుతుంది
మనిషి లోను విపరీతం! ప్రకృతి సమాంతరంగా

ఆందోళన స్థితిలో మనిషిని నిలుపుతుంది
రాజకీయ దుస్తంత్రంతో అస్థిరతను నింపుతుంది
రాతి పలకలా పరచుకొన్న విషాదంపై
నీటి జాలులా సానుభూతి! ఒక ఊరట!

తెలిసిన విధంలో పోయే పథంలో జీవితాన
ఆలోచనలో అనలం చల్లారడమొక అవసరం
మందంగానో వేగంగానో కదలే రణ చక్రంతో
పరిభ్రమించడమొకటే! చేసే దెవరైనా బ్రతుకులో

చదరంగం ఆటలా సాగే వ్యూహాలతో
ఏ పాత్ర ఏ ఎత్తు ఎపుడు వేసేదీ తెలియదు

మనిషికి మనిషి తోడుగా సమూహాలు సంఘాలు
మనిషి నుండి వేరు వేరు దారులలో విభేదాలు
మనిషి వదలి పోగానే ఆ పని! నిలిచిపోదు
సమాజ పరీక్షకు గురి అవుతూ సాగుతుంది!

వివిధ వాద శబ్ద తరంగాలు సమాజంలో
మనుషుల చర్యల తోనే జీవన రూపం
సమస్య ముడి విప్పే బాధ్యత అందరిదీ
పరంపరతో పాటు ప్రయోగమూ జరుగుతుంది

21.

ఏ ఒకరి చేతిలో లేదు కాలం అందరిదీ
వారి వారి పాత్రల సమాకలనమే సంక్లిష్ట సమాజం
పందెంలో అశ్వంలా కాలం పరుగెత్తిస్తుంది
కోరిక లల్లుకొనీ తీగెల్లా మనసును! కప్పేస్తాయి!

మతికి పదును పెట్టే అనుభవాలతో పయనం
అడవులు కొండలు నదులు ఊళ్ళు దాటి
ప్రభుతపై కాంక్షతో! ఆయుధంపై దృష్టి!
అది చేతికి అందడమొక! అవసరమవుతుంది

ధూళి కమ్మిన అద్దంలో ప్రతిబింబంలా
పయనంలో అసలు ముఖం చాటవుతుంది

ఏవో దుశ్చర్యలు విలయానికి దారి తీసినా
ఎక్కడ బడితే అక్కడ రణ దుందుభి మ్రోగదు
ఏవో సత్కర్మలు సృజన కవకాశం ఇచ్చినా
ఎప్పుడు బడితే అప్పుడు జయ పతాక ఎగరదు

కనులలో నీటి పొంగు హద్దు దాటితే
గుండెలో అగ్ని కీల ఎగసి పడుతుంది
వేదనలో వేడి వేడి ఊపిరి అలలు
పూవు లాంటి ప్రాణాన్ని విల విల లాడిస్తాయి

చదువుతూ చదువుతూ నిద్ర పోయిన పిల్లలు
తెరచిన పుస్తకం పేజీలు, రెపరెపలాడేను
గాలిలో! రాత్రి వేళ గస్తీలో ఎగసే స్వరం
నిద్రా సమయంలో హెచ్చరిక కావచ్చు! సూచన కావచ్చు!
నిరాశలో చీకటిని, చీకటిలో భయాన్ని
తొలగించడ మొక బాధ్యత సువ్యవస్థలో

కాల పటం పయి సువర్ణ రేఖలతో
రంగులతో రూపం చూపడమే కాదు,
ఆంతర స్పర్శతో, పూర్వం చూడనిదీ
కొత్త జగం కయి మనసులో తహతహ!

22.

నిశ్శబ్దం చుట్టలు చుట్టుకొని విశ్రమం పొందే వేళ
మనిషి స్వరం ఎక్కడి నుండో అటు లాగుతుంది
బాధలో కరుణను స్రవింప జేస్తుంది
ఆప్తమైతే అనురాగం నదింప జేస్తుంది

రాత్రులు మెరసే ఒక్కొక్క నక్షత్రం
వినీల గగనంలో నివాస తలం నుండి
దూరంలో పృథ్వి పయి చూపులతో
మనిషి సమస్యను చెవి ఒగ్గి వింటాయి
నిరాశను మరపించే సన్నని వెలుగులతో
మనసులో ఆశా రేఖల చిత్రం దింపుతాయి

అలంకార విభవంతో ప్రాణం కన్న మిన్నగ
మూర్తులు! బ్రతుకులో ఖాళీలను నింపుతాయి
నమ్మకంపై రోజులు సుందరంగా గడుస్తాయి
పయనానికి టికెట్‌లా పరితృప్తిని కలిగిస్తాయి

కల్పనలో అనుకూలాలను అందుకొనీ
వాస్తవానికి దిగుతుంది మనసు ఉత్సాహంతో
అగ్ని చిత్రమయ్యేది జలపాతం అయ్యేదీ,
తెలిసేదయితే! పొందే అనుభవ గతిలోనే

చాప లాగ చుట్టుకొని సమస్తం
ఎక్కడి కయినా వెళ్ళేందుకు సిద్ధంగా!
కొన్ని కొన్ని అక్కడక్కడ వదలిపోతూ
కొన్ని కొన్ని ఎక్కడెక్కడో జారిపోతూ

ఏ క్షణం ఏమి జరిగేదీ తెలియదు
కదలుతూన్న క్షణాలపై అనుమానం!
అయినా పయనం ఆగదు! ఆగలేదు
ఆయువు ఉన్నంత వరకు సాగాలిసిందే!

23.

రాత్రి ముంగిలిలో బల్బులా కవిత వెలుగుతూ
మనుషులు దగ్గర అవుతూన్నట్లు ఉంటుంది
నిజం దాచిన మనసు నుండి మాట
ఒక్కొక డ్రెస్‌లో! ముందుకు వస్తుంది
ఇది ఎక్స్‌రే ఫోటో కాదు
క్రాంత దర్శి! మనోజగం

కల్పనలో పికాసో చిత్రం వాస్తవ మనిపించినా
గాథలతో బాపు బొమ్మ జీవితాన్ని తలపించినా
కార్టూర్ గీతలయినా ప్రకటన చిత్రాలయినా
ఇవి సృజనచే కవితతో అనుబంధం కలవి

ఎదురుగా పగిలిన అద్దంలో చెదరిన దృశ్యం
రవ్వలు చిమ్మే చిచ్చుబుడ్డిలా అగ్నిమయమై
సమాజ స్థితులు! బద్దలయిన అగ్ని పర్వతంలా
కవిలో సంస్పందన, ఊపిరిలా నడకలా సహజమై

దారుణ ఘటనలో బీభత్స సన్నివేశంలో
కవికి ఖ్యాతి కన్న బాధ్యత ముఖ్యం
నిజ కవితకు ప్రేరణం సామాజిక సందర్భం
ఇది ఎప్పటికీ నిర్వచనాలకందని ఎత్తులో!

మలినం సోకని మనసులో
ప్రతిభ సూర్య బింబమయి
వెలుగులు అక్షర పంక్తులుగా
సాగుతుంది! సృజన వికాసం

యుద్ధంలో చేతికి ఆయుధమై చేరుతుంది
జలనిధిలో యానానికి నావలా కనిపిస్తుంది
అన్వేషణలో సాంకేతిక యంత్ర సమం అవుతుంది
కిరణ స్పర్శతో నీలి తెరను జరుపుతుంది
తెలిసిన గుర్తులతో బయటి ప్రపంచం
తెలియని భవిత లోకి నడిపిస్తుంది

24.

బయటి నుండి ఇంటికెళ్ళి అద్దం ముందు నిలిస్తే
గుహ నుండి బయటికి వచ్చిన సింహం ముఖమో
బోను నుండి బయటికి చూచే పులి ముఖమో
ఏదయితేనేం? మనిషి ముఖాన్ని పూర్తిగా కప్పేసేను

ఆకాశమెంత విశాలమయిన దయినా
స్వేచ్ఛగా ఎగిరే విహగం భయపడదు
సందర్భమెంత బీభత్సమయమయినా
స్వచ్ఛంగా వెడలే కవిత నిలిచి పోదు

స్విచ్ ఆన్‌తో వెలిగే బల్బులా జ్ఞాపకం
గతంలో అనుభవాన్ని వెలుగులో నడిపిస్తుంది

పూల మాల చేతిలో
చాట అంత ముఖంతో
ఇంటి ముందు ముగ్గు చూపుతో
పాట కోసం పదవి కోసం అలరించే సర్కస్
మేకప్‌తో పిక్ అప్ అయిన గ్లామర్
కదలే పూల పొదను తలపించేను

తను వెళ్ళే దారే సరి అయింది అనుకునే
దృష్టిలో విజయం ఒకటే, ప్రధాన గమ్యం!

రాతి పొరల క్రింద అణగిన మనసుకు
అంతరంగ రవి తేజం కనిపించేనా?
పచ్చని మొక్క అనుభవం దొరకేనా?
ఎక్కడో గుప్తంగా ఉన్న మానస మోదం తప్ప!

లౌకిక తంత్రంలో పెరిగిన ఆలోచనలకు
ప్రచార కళతోనే జీవన సార్థక చిత్రం!
ఎవరి దారి వారిది అయినా కర్తవ్యంలో ప్రయోజనం
వివరణ కోరుతుంది! కనిపెట్టే దృష్టితో సమాజం!

25.

మబ్బు నుండి చినుకుతో పచ్చని భూమి ముఖం
మనసులోని మాటతో మనోజ్ఞమయిన కవిత
పండిన అనుభూతితో నిండిన క్యాప్సుల్
హృదయ తంత్రి స్పందనతో లయలో అక్షర రూపం

ఇంటి ముందు వాన కాలువలో వదలే
కాగితపు పడవ కాదు కవిత,
జలధిలో నావలా గట్టుకు చేర్చేను
నావ లోకి నీరు చేరితే ప్రమాదం

తన కవితకు తొలి పాఠకుడు కవి
తొలి విమర్శకుడు కూడా కవియే
పదంతో పదం కలిసి స్నేహ సుందరంగా
నిర్మాణంలో అమరిక కళామయంగా
అందానికి అందలం దొరకుతుంది
సంఘానికి పరివర్తన దిశను చూపుతుంది

అంతరంగ ప్రేరణతో సమయ సమయం
నవ యానంలో విడుదలయిన కవిత
నేలపై నడచే అడుగుల లయతో కలిసి
అందరినీ చేరుతుంది విశ్వ బంధువవుతుంది

జీవన రుచి నైజంతో విప్పారిన భావనలో
పరిమళ సుందరతలు అందరికీ చెందినవి
కథలో ఎత్తును వ్యథలో లోతును చూపేను
దిశదిశలో దాగిన మర్మాలను బయటికి తెచ్చేను

కవి ప్రతిభ నుండి కిరణ ప్రసారంతో కవిత
బ్రతుకులో పోవలసిన దారి చూపుతుంది
ఏ రోజు కిర్మీర కిరీటంతో ఉదయంలా
కవిత విడుదలవుతుంది! మనసుకు చిత్రమై

26.

పయనంలో జరిగేవీ కనిపించేవీ అన్నీ
అనుభవ రమణీయాలు మనఃపేటిలో భద్రంగా
కవితలో సందర్భాలను బట్టి సృజన గతిలో
బయటికి వస్తాయి! మనసుకు హ్లాదకరంగా

నాటకం సినిమా ఎన్నిటిలోనో పలు వేషాలతో
పాత్ర లెన్ని ధరించినా మెప్పులెన్ని పొందినా
మంచివో చెడ్డవో, సరళతనో కుటిలతనో
దేనికి ప్రతినిధి అయినా దేనికి ప్రతీక అయినా
నిజ వ్యక్తిత్వం తొలగదు, మూలాలు మారవు
ఇవి జీవన భవనానికి పునాదులవుతాయి

సృజనలో కిరణానికి గురి! చీకటి పయినే
దీనిని వెలుగుగ మార్చే యత్నంతో సార్థకం
ఇది అచేతనలోని చేతనను పైకి తెస్తుంది
పయనాన్ని ఉత్సాహంతో ముందుకు నడిపిస్తుంది

విధ్వంసం వెనుకనే జరుగుతూ వస్తుంది సృజన
ఏ విధమయితేనేం? ఇది పరిణామంలో భాగం
భయ సందేహాలను తొలగించే ధీర గుణం
నిజం నిగ్గు తేల్చి ప్రకటించే సాధనం

కాలానికి రంగుల భేదం లేదు
అన్నీ కలిసిన అతీతమైన పాత్రను వహించేను
అందుకో బోతే అంగుళం ఎడంలో, జరిగిపోతుంది
పట్టుకో బోతే అడుగు దూరంలో, సాగి పోతుంది

వ్యక్తి అస్తితలో కాలాన్ని జయించిన భావన!
తన నడతలో అయితే మంచి విలువలతోనే సాధ్యం
ఆశయానికీ ఆలోచనకూ మధ్య సయోధ్య అవసరం
మార్గానికీ గమ్యానికీ మధ్య ఐక్య భావం ముఖ్యం

ఉద్యమానికీ విలువలకూ మధ్య అనుబంధం తప్పదు
ఆదర్శానికీ ఉపయోగానికీ మధ్య వంతెన తోనే సుగమం

27.

కలలు కల్పనలు నిజం కావని తెలుసు
అయినా ఉంటాయి మనసు అనేది ఉన్నందుకు
మనిషిలో మానవం! నేతి బీర కాయలో 'నేయి' యేనా?
బయటివీ లోనివీ ఏనుగు దంతాల్లానా?

నీలి మబ్బు నుండి పిడుగు దూకి పడుతుంది
వ్యక్తి నోటి నుండి మాట జారి పడుతుంది
రాత్రి చూపు ప్రసరిస్తే గగనం వైపు
ఒక్కొక్క నక్షత్రంలో ఒక్కొక జ్ఞాపకం మెరుస్తుంది
అది మోద మయితే మనో బలం పెరుగుతుంది
అది ఖేద మయితే మనో జవం తరుగుతుంది

గాయం ఎన్నటికీ మృత్యు ముఖం కాదు
ఆపద నరకానికి ద్వార ముఖం కాదు

ఒక చిన్న ముల్లు ప్రాణాన్ని హరించ లేదు
మనిషి నుండి మనిషిలో భయం! ప్రాణ హరంగా
అందని దానిపై ఆశ మరీ మరీ పెరుగుతుంది
అడ్డదారి తొక్కవచ్చు, చేయరానిది చేయవచ్చు

పూవులా కనిపించి, పక్షియై ఎగిరిపోవచ్చు
మంచు శిల్పమయింది కరగి నీరై పారవచ్చు
కొమ్మల్ని నరికి చెట్టును హరింప చూచినట్లు
మనిషిని తొలగించే పనిలో మనిషి నిమగ్నం!

మళ్లె మొగ్గల్లా తొలకరి చినుకుల మాటలు
లోన దహ్యమాన ఆలోచనల్ని శమింప జేసేను
పసి పాపల కేరింతలతో ఊహలు! సంబరంగా
మాటకూ, చేతకూ అగ్నికీ నీటికీ సంబంధం ఆంతరం

కలహ ప్రియులు హంతకులు మతి భ్రష్టులు ఎక్కువయి
ఆత్మహత్యలు బహు సాధారణమై క్షోభలో సమాజం

28.

కిటికి తెరవడం ప్రాణానికి వాయువు సోకాలని
ఆవాసంలో వెలుగుల ప్రసన్నత చేరాలని
ప్రతిఫలనంతో మనస్సు సుందరతను పొందేను
స్నేహానికి ప్రేమకు గుర్తులుగా నిలిచేను
ప్రకృతితో అనుబంధం కాపాడేను
మనిషి నివాసం! జలద భవన మయ్యేను

ఎక్కడి నుండో దుమ్ము పొగ దూరవచ్చు
ఉక్కిరి బిక్కిరితో కిటికీ మూసే స్థితి రావచ్చు
తలుపు తెరచేది! మనిషి రావాలని ఆప్తంగా
గాలికి పరిమళాన్ని అద్దుతూ వెలుగుకు ఆర్ద్రత నిస్తూ

బ్రతుకులో భయం ఏ మూల నుండో దూకుతుంది
మనిషిని నిర్వీర్యం చేసే స్థితి కూడా రావచ్చు
దారులు వేరయినా గమ్యం లోక హితంకరమై
మనిషికీ మనిషికీ మధ్య బంధం విశ్వమయం కావచ్చు

మెలకువతో చేసే పనిలో విలువలు విస్మృతం కావు
ఇవి వెలుగుల వలె అందరినీ ఆత్మీయం చేస్తాయి
చంద్రునిలో నీలి గుర్తు! జలధిలో పడవ వలె
పైన వెన్నెల పటంపై చంద్రుడు! చల్లని ఆశా రూపం
క్రింద మనిషి! రేపటి సూర్యునిపై నమ్మకంతో
నిరంతర చలన మనోమయం మనిషి! యంత్రం కాదు

పద పదానికి అర్థాలెన్నో! జీవన గ్రంథంలో
కవితలోనయితే ఎన్ని భావ ప్రకాశ పంక్తులో
ఏదో ఒక లేమితో చుట్టబడని స్థలం లేదు
ఇది నిండే ఉపాయాలతో చేసే యత్నాలెన్నో

తరం నుండి తరం గమ్యం అందుకునే చేతనతో
ఇది సమాప్తిలేని పయనం! ఎవరి దారి వారిది
మనసులో మాట ఎద ఎదను స్పృశిస్తూ
కవితలో పునర్భవం పొందుతుంది! జీవితం

29.

నెత్తురు ఎరుపు, రవి కిరణం ఎరుపు
ద్రవమూ తేజంతో జీవిత రూపం
రాగం ఉత్సాహంతో విజయం గమ్యం
మనిషిలో రెండూ విడదీయ రాని అవసరాలు
ఓటమిలో చీకటి వెనక్కి వెళుతుంది
ఆశాబలం అడుగులు ముందుకు వేయిస్తుంది

ఎక్కడో ఏదో దొరికినట్లు ఉంటుంది
అంతలో మరొకటి పొందాలని అనిపిస్తుంది

హిమ పర్వత రూపంలో నిలిచిన కాలం
అంతలో ప్రవాహ రూపంతో కదలుతుంది

ప్రశ్నలు సూచిస్తాయి, మిగిలిన కర్తవ్యాన్ని
ఎటువంటి జవాబయినా తృప్తి కొంత వరకే
కవితకు శ్రోతలు ఎవరయినా కావచ్చు
సంస్కార తేజాన్ని బట్టి కాలం సరిస్తుంది
ఉన్నవారు లేని వారు అధికారులు వ్యాపారులు
విద్యార్థులు శ్రమ జీవులు నేతలు వివిధ స్థాయిలలో

ఆశకు అవకాశం విస్తృతమవుతుంది
ఊహకు రెక్కలు రెపరెపలాడతాయి
జడిమకు చేతన స్పృహ వస్తుంది
హరువుకు పరిమళం అబ్బుతుంది

చీకటి బంధం నుండి బయట పడిన చంద్రుని వలె
మబ్బుల కోట నుండి బయటికి వచ్చిన రవి వలె
శాంతానికి తేజానికి కరుణకు వీరానికి
సుందర సంగమ నిలయం కవిత! జీవితంలో

ఫుట్ బాల్ ఆటలో బంతిలా కవిత! చంద్ర బింబం
క్రీడపై అభిలాషతో చేరిన సహృదయులు చుక్కలు

❁

30.

కవిత భావనా మయం, మేఘ సమం
హృదిలో ఎగసే మంటల్ని ఆర్పుతుంది
అక్షర సుమ గుచ్ఛంతో స్వాగతమిస్తుంది
స్పందన శీలంతో గుండెకు హత్తుతుంది
ఇది బయటికి రాగానే సమాజ పరమవుతుంది
ఇక వ్రాసిన కవి జోక్యం అంతంత మాత్రమే
సహృదయుల ముందు ఉండేది కవితయే
అందరి ఆలోచనలో అపూర్వ కళా మనోజ్ఞమయి

కవితలో భావ కమలం వికసిస్తుంది
కవిలో అనుభవ పరిమళం గుప్పుమంటుంది
ఇది ఇంద్ర జాలం కాదు, స్వప్న దృశ్యం కాదు
పెదవులపై చిరునవ్వు మొలక లెత్తిస్తుంది

లక్ష్యంలో నవ సమాజ శ్రేయో రూపం
ఆశ పడే భావ జగం శబ్దమయమవుతుంది
పూర్వపు చీకటి పయి నింద వేయకుండా
వర్తమాన తేజో దర్శన మొనరిస్తుంది

ఎడారి ఎదురు చూచే జలదం
తన తలపై నిలిచినట్లు ఉంటుంది
రంగు రుచి పరిమళ సుందరతలతో
సృజన జగం అభినవమై దిగుతుంది
అనుభవ జలాలలో హంస లాగ
సహృదయ సరోవరంలో ఈదుతుంది

వ్యక్తి జీవితం సమాజ చేతనతో కలిసి
కవిత ఎత్తు పెరుగుతుంది, ఉనికి విపుల మవుతుంది

ప్రకృతిలో ఉదయం అస్తమయం వేళలు నియతం
బ్రతుకులో ఏ వేళ! ఏ ఘటన జరిగేది తెలియదు
విప్పారే అక్షర పరిమళం హృదిని తాకుతుంది
ఆర్ద్రమైన పంక్తుల గుర్తులతో కవిత కదలుతుంది

31.

బ్రతుకులో కవిత వ్యాపార వ్యవహారం కాదు
లోని మనసుకు పోషక విలువలు చేకూర్చేను
బాణం గుచ్చుకున్నా
ఖడ్గం వేటు పడినా
జారే నెత్తురు బిందువు లొకటే
పొందే శరీర వేదన ఒకటే

తుమ్మెద కయి కుసుమం విప్పారదు
ఎండిన చెట్టు కయి మేఘుం విచ్చేయదు
ఎవరి వెసులు బాటుకో పరివర్తన జరగదు
ప్రతిదీ సమాజ చలన విధం తోనే
నేలపై తిరగాలిసి ఉన్న స్థలాలు ఎన్నో!
బ్రతుకులో తెలవాలిసి ఉన్న కథలు ఎన్నో!

మౌన ముఖంతో శిల్పంలా ఉండలేదు మనిషి
చేతన గుణ శీలంతో స్పందన కనబరచేను

పాత వెండి నాణాల్లా కన్నీటి చుక్కలు
ఎవరికీ అక్కర లేని వయినట్లుగా! రాలేను

నీడలు బుజాన వేసుకొని పోనవసరం లేదు
అడుగుల నంటుకొనీ! అవి రానే వస్తాయి
పగలు వెలుగులో కాస్త వేడిగా
వెన్నెల రాత్రిలో కాస్త చల్లగా

వేరు వేరు స్థాయిల్లో ఉన్న వారయినా
బాటలో మజిలి అందరికీ ఒకటే!
పయనంలో బాట ఒకటే
అరణ్య వాసికీ పట్టణ వాసికీ

వెలుతురు ముక్కలతో ఏర్పడిన మనో నిలయం
పలు విధాల మనుషులకు ఆశ్రమమవుతూంది

32.

శాంతి స్వరం వినిపిస్తూ జీవితమంతా
తప్పని యుద్ధంలో హింసకు వేది అయిన
కురుక్షేత్రంలో చివరకు నెత్తురు వాకలతో
శరీర శకలాల మధ్య! ధర్మాజుని విజయ శంఖ ధ్వని

రణ స్థలి బయట అశ్వత్థామలో "చంపు" మన్న మాట
మార్మోగుతూ రుద్రావేశంలో సంకల్పం! నెరవేరేనా?
ఏది ధర్మం? ఏది న్యాయం? ఏ దారి సరి అయింది?
ఎవరికి? ఎప్పుడు? ఎంత వరకు? సందేహాలెన్నో?
జీవిత నిలయానికి వ్రేలాడే ప్రశ్నల తోరణాలు
సంక్లిష్టం సంశ్లిష్టం అయిన సమస్యలతో జీవితం!

పుట్టగనే నడక వచ్చేనా? మాటలు పలికేనా?
వీటికై ఎదురు చూచే వారెందరో! చుట్టూ
శిశువు పెరిగే వివిధ దశలలో అన్నీ
నెరవేరే సంతోష స్థితులు వస్తాయి
రాలే, సంతోష బాష్ప కళికలు
పూవులై ముఖాల నలంకరిస్తాయి

దశలు దశలు ఒకటొకటీ దాటే కొద్దీ
చిన్న తనంలోని అవకాశాలకు దూరం అయ్యేను
తనదైన అస్తితలో వ్యక్తిత్వం స్వతంత్రమై
తన లోకం ఏర్పడుతుంది, తన రాజ్యం బలపడుతుంది

పరిణత దశ దగ్గర అయ్యే కొద్దీ
పయనంలో కంటక క్షణాలు! అనల సమయాలు!

ఏది ఎంత గొప్పదయినా అడుగుల లయలో
ఏ కవిలో కవిత! నృత్యం చేయదు
ఎదురుగ విడిపోయిన ముక్కల్ని
కలుపుతుంది కవిత! మానసికంగా

33.

ఎగసి పైకి కదలే మేఘం స్వస్థానం చేరుకోదు
పోయిన క్షణం తిరిగి వచ్చి మనిషిని చేరదు
చేరిన చీకటి చీపురుతో ఊడిస్తే పోయేనా?
రవి కిరణ శరంతోనే రక్తసిక్తమై తరలేను

సమయ సమయం పరిమితులతో జీవిత రూపం
సంతోషం ఉత్సాహం నిరాశ ఖేదం విరామ దశలతో
అనుభవ ప్రపంచాన్ని వదలి మనసు లేదు
చూపు కందని దృశ్యం! పయనంలో తెలుస్తుంది

హృదిలో రస రాగానికి ఉదయంతో పని లేదు
మతిలో ఆలోచనల కెవరి ఆనతితో పని లేదు
చెట్టుకు పూచిన పూవు! రాలిపోయి
మరొకటి దాని స్థానంలో, అదే విధం!

బ్రతుకులోని అనుభవం! రోజు రోజుకీ భిన్నం
నవ రసాలలో ఏది ప్రభుత నెరపేదీ తెలియదు
మృత్యువు గురించి అనుభవ కథనానికి
ఆ పోయిన ప్రాణంతో, స్మృతి తిరిగి వస్తేనే!

క్షణం కరగి ప్రవాహమై గతమవుతుంది
ప్రవాహ తీరాన నడచే కోరిక సహజం!
ఆకాశం ఆలోచనకు సరిహద్దు అవుతుంది
సముద్రం అనుభవానికి నిండు కుండ అవుతుంది

హింసకు విజయాలు లేవు ప్రేమకు నియమాలు లేవు
ఇవి పొంగిన ఆవేశంలో అనుకోనివి,
చోటు చేసుకునే విశేషాలెన్నో విపరీతాలెన్నో

కొండలలో తిరిగి తిరిగి నదిలా భావన
బయటికి దూకే జలపాతంలా
సృజనలో కవితయై సార్థకమవుతుంది
ఆర్ద్ర సహజ యానంతో విశ్వమయమవుతుంది

❁

34.

కవులకు బహు ఇష్టమైన వాటిలో కాలం ఒకటి
జలధిగా నదిగా చెట్టుగా దైవంగా మరొకటిగా
రూపాంతరాలలో! మనిషి ముద్ర వహిస్తుంది
ఎవరి భావనా జగం వారిది, సర్వ స్వతంత్రం

ఫాల తలంపై అడ్డంగా గీతలు
అర చేతులలో అల్లికలో గీతలు
బ్రతుకులో రహస్యాన్ని విడమరచేవిగా
మనసును భ్రమలో భ్రమింప జేసేను

భూమి నుండి దివికీ దివి నుండి భూమికీ
భావ ప్రపంచం! జీవన గమనంలో
శబ్దంలో అర్థాన్ని వడ పోసిన రూపమైన
కవితలో కవి పయనం! మానసికం

ఏకాంతం కరగి నీరై నదియై
సమాజ సముద్రంలో చేరుతుంది
భువన భవన స్తంభాలు నాలుగు దిశలు!
చూచే దిశ మాత్రం ఒకటే! మిగతావి తోడుగా

బురదలో దిగి తానొక పద్మం అనుకోవచ్చు
అగ్ని చుట్టు ముట్టి తానొక హోమ ద్రవ్య మనుకోవచ్చు
ఇది స్వర్గానికి వెళ్ళే సులభమైన మార్గం అనుకోవచ్చు
ఎడారి ఇసుకలో కూరుకపోయి, అదో యోగ విధం అనుకోవచ్చు
అనుకోడానికేం, ఏదైనా అనుకోవచ్చు
ప్రచారమూ జరగవచ్చు, ఎన్నికలో నిలబడవచ్చు

భ్రమ లోనిది సాధ్యం చేసే పనిలో కొందరు
శ్రమ లేకుండా తన పని జరగాలని కొందరు
నిశ్శబ్దాన్ని శబ్దమయం చేసే కవిత,
పలు అర్థాల్లో అందరికీ మనః పథం చూపిస్తుంది

35.

మనసులో ప్రభావ ముద్రలతో జ్ఞప్తికి ఉండేవి
సంఘంలో జరిగిన యుద్ధాలే! చరిత్రలో
విధ్వంసం మారణ చర్యలతో బహు ప్రశస్తి
కవులకు వస్తువు కయి, వెదకే అవసరం లేదు

వెనక్కి వెళ్ళాలని ఎవరునుకుంటారు?
విజయంలో సందేహం ఉన్న వారు మాత్రమే
ఓటమి కవకాశం పసి గట్టిన వారయినా సరే
కోరిక పోయినా అభిరుచి తగ్గినా అడుగు వెనక్కి పడుతుంది

ప్రేమతో మనిషి కయి తలుపు తెరచి ఉంచితే
దొంగ దూరి అతలాకుతలం చేసే ప్రమాదం!
అలజడి ఘర్షణతో హింసను కోరరెవరూ
అయినా వచ్చి పైబడుతుంది, తుపానులా

నిశ్శబ్ద ప్రపంచాన్ని ఎవరు కోరతారు?
పనిలోనూ ఏదో శబ్దం వినిపిస్తూనే ఉంటుంది
చివరకు తన గుండె చప్పుడు లయగా మారవచ్చు
శబ్దం కాలానికి చేతన గుణాన్ని ఇస్తుంది

వరాల చినుకులు రాల్చే మరకత మేఘంకై
భూమి ఎదురు చూస్తుంది ప్రకృతితో సమాజంతో
చంక దిగని శిశువుల వలె ఈ రెండూ
ఎంత పెద్ద అయినా "ఇంకా" మిగిలీ కోరిక!

కల్లోల జలధిగానో భయదారణ్యంగానో తలపిస్తూ సమాజం!
మనిషి సహజ శక్తినీ ఉనికిని ప్రశ్నల బోనులో బంధిస్తుంది

అమృత బిందు స్పర్శతో సృజనలో కవిత
ఏదో ప్రశ్నకు జవాబుగా మనసునా వహిస్తుంది
ప్రశ్న మాత్రం తప్పదు! మనిషి మనిషికీ భిన్నం!
జవాబులయినా మనిషి మనిషికీ వేరు వేరు

36.

నా కెదురుగా మహానదిలా పరుగెత్తుక వచ్చే ఉదయం
నా నుండి నిష్క్రమించే ప్రవాహంలా సాయం సమయం
రాత్రి పరచిన విశాలమైన రాతి పలకలా ఉంటుంది
ఇవి ఆ రోజు జీవితానికి కవితా సంకేతాలు

సముద్రాన్ని చూడని వారూ ఉన్నారు
మహానదిని చూడని వారూ ఉన్నారు
తమ అలలపై సాగే మనిషికై ఎదురు చూస్తాయి
మనిషి కోసం గట్టు దాటే తహ తహ కనిపిస్తుంది

నిశ్శబ్ద శిఖర తలం నుండి శబ్దిస్తూ
రాళ్ళపై దూకే జలపాతంలా! బ్రతుకు మొదలు
ఏ దారి నవలంబించేదీ ముందుగ తెలియదు
ప్రజల అవసరాలతో అందరికీ దగ్గరవుతూ పోతుంది

ప్రవాహం తరలుతుంది హద్దుల మధ్య ఒంటరిగా
అందరూ సమీపిస్తారు తర తమ భేదం లేదకుండా
పీడకులు పీడితులు దొంగలు నేతలు! ప్రాణి కోటి!
పామరులు! మనీషి! మనస్వి! అది అందరిదీ ఎప్పటికీ

జలాను బంధం మనిషిలో ఆర్ద్రత నిలుపుతుంది
సంస్కృతిలో ఉదార చరితను ప్రేరేపిస్తుంది
తొలిని సంధ్యలో "హెలో" పలికే పుష్పం
మలి సంధ్యలో "గుడ్‌బై" చెప్పేస్తుంది

అందంగా రావడమూ పోవడమూ తోనే సరి
తత్త్వ బోధ కయితే బాగా ఉండేట్లుంది !

అభిరుచి అభిలాషల రెక్కల పయి ఎగురుతూ
అమృత కలశంతో వాలుతుంది కవిత
మనసుకు హ్లాదంగా బ్రతుక్కి ఉపయోగంగా

నినాదాల హొరులో మార్పుల కయి అందోళన!
హింస బదులు హంస! ప్రవేశంతోనే శాంతి!
నదిని తిరగేస్తే జీవితం, కవితలో నయితే ప్రవాహం

37.

పుట్టుకతో బయటి ప్రకృతితో పోరాటం
ఆపై సమాజ చలనంతో మరో పోరాటం
ఈ రెండిటి భూమికలో కాల పటం పయి
అస్మితలో అస్తిత రూపం ఈ జీవితం

నీరులో తేలే శరీరం
నేలపైకి చేరడ మొక పెద్ద మార్పు
అంతా అంతలో సర్దుకుంటుంది
సర్దుకోక తప్పనిదీ అవసరంలో

ఎండ వాన చలి ఒకదాని వెనుక ఒకటి
నిరంతరం చక్ర భ్రమణంలో దృశ్యాలతో
మనుషులు ప్రకృతికి వశమా?
ప్రకృతి మనుషులకు వశమా?
ఆలోచనలో ప్రశ్నలు ప్రతి దశలో
వీటికి జవాబులు తమ అనుభవమే!

సహన జీవన గమనంలో పోటీలో
గెలుపూ ఓటమి చిత్తూ బొత్తూ
ఒకరి నుండి మరొకరికి మారుతూ
జీవితాని కెంతో వ్యాపకం లభిస్తుంది

మారే సమాజ పథకాలతో
మనిషిలో తెలివి మెరుస్తుంది
మారే ప్రకృతి ప్రభావంతో
మనిషిలో శక్తి! బయట పడుతుంది

కళ్ళు తెరవగనే చుట్టు మనుషులు
వెన్నెలలో నక్షత్రాల వలె మెరుస్తూ
కదలే మనుషులు! ఎదురుగ కొత్తగా
సరసిలో అలల వలె! ఒకటొకటీ!

38.

గళం నుండి అవసరానికి మాట!
దీనికై ఎందరి నిరీక్షణలో
దూది పింజెలా ఎగిరి పోవచ్చు
మంచు ముక్కలా కరగి పోవచ్చు
వాడి ముల్లులా గుచ్చు కోవచ్చు
నిప్పు రవ్వలా ఎగసి పడవచ్చు

పాషాణంలా మనిషిని తలచే వారూ
దానిని ఒక శిల్పంగా మలచే వారు

అడుగులు వేస్తూ గడప దాటి నడక
ధరణీ భ్రమణంతో పోటీ పడుతుంది

బయట చెట్టు ఆకుల వలె కోర్కెలు
రాలేవి రాలుతూ వచ్చేవి కనబడక, వెనకనే

శిశు దశ నుండి నఖ శిఖ పర్యంతం
ప్రతి దశలో సహజమైన పరిణామంలో
ప్రకృతి నుండి స్వాగతం లభిస్తుంది
సంఘం తనలో ఇముడ్చుకుంటుంది

కష్టాలను దు:ఖాలను దాటుతూ
ఇంటి నుండి మార్కెట్ బడి గుడి
పని చేసే స్థలంతో అనుబంధంతో
కాలం ఒక వాహన మయి సిద్ధంగా!

పగలు రాత్రి ఉదయం అస్తమయం
ఇవి ఏవీ నియతం కావు బ్రతుకులో
వీలు వెంట స్థితులు ఎదురుగ వస్తాయి
మనిషి ముందు కాలం! అద్దం ముక్కల్లా!

బ్రతుకులో ప్రశ్నలకు సమాధాన వేది కవిత!
గుండెలో అగ్నులకు నీల జలద నవ ఛత్రం!
అప్పటికపుడు బయట పడేను ప్రశ్న!
జవాబుకు ఏ మాదిరి రూపం లేదు!

39.

బ్రతుకు నుండి కవిత నిరంతరంలో భాగం
లిప్త గడుస్తుంది వేచి ఉన్న లిప్తకు చోటు ఇస్తూ
ఒకరితో పూర్తి కాని ఆశయం! మరొకరి కవకాశంతో
వ్యక్తి నుండి సమష్టికి అంత స్నాత్ర పథంలో

శతాబ్దాలు గడచినా బీటలు వారని రాతి కోట
చరిత్రకు పట్టును నిలిపేను
అభిమాన ఘనత పెంచేను
సమాజ శక్తిలోకి దింపేను

తరం నుండి తరాని బాధ్యత చూపేను
పుటలు కొన్ని శిథిలమైన కొన్ని తొలగిన పుస్తకం
పైకి కనిపించని స్థితులెన్నో స్మృతిలో అణగి
లోన సంవేదన సుడులు సుడులు తిరుగుతూ
ఊహలో ఇప్పటికీ చీకటి కొమ్మలలో
అప్పటి వెలుగు పూలు తలపుకు వచ్చేను

ఈ దారి ఎప్పటికీ ఉండేది, నడచేది
ఆ నడచే మనుషుల్లో ఆలోచనలు వేరు

ఉదయం లేచి బయటికి వచ్చేసరికి
నెత్తురు ఒలికే కత్తిలా కిరణం
వ్యథలో సమాజ కథ మానవ బాంబులతో
ఉదగ్ర దశకు ఫాల భాగమవుతూంది

కళ్ళ ముందు నడచే మనిషి హఠాత్తుగా
నెత్తురు లోనో పొగల మధ్యనో కనిపించేను
ధమనుల్లో నెత్తురు సరిస్తేనే ఆరోగ్యానికి గుర్తు
దాహంలో నీరు తగిలితేనే గొంతుకు శమనం

సృజనలో ఎడారి పచ్చగ తీర్చబడేను
గుండె లోతు నుండి గంగను రప్పించేను
ఇసుక అంతరంగంలో ఆర్ద్రత చూపేను
ఉపజ్ఞతో శక్తి కలిసి ఫలవంతం అయ్యేను

40.

కదలే గాలి ఆగదు, వచ్చే ఉదయం నిలవదు
మనిషిలో శూన్యతకు పూర్ణత చేకూర్చేను
విధ్వంసం నుండి నిర్మాణం కల్పనలో
సమాజాన్ని తరలించే లక్ష్యంలో ఉగ్ర వాదం

సితారొ వీణొ మరో సాధనమో! తలమోదేందుకు
తీగెల్ని తెంపి మెడకు ఉచ్చుగ ఉపయోగించేందుకు
చేతి కేది దొరికితే అది ఆయుధ మయ్యేను
విపరీత మనో విధంతో వికృత రూపం తల ఎత్తేను

చేతులు రెండూ ఖడ్గాలయి
పిడికిళ్ళు రెండూ బాంబులయి
గుప్తమైన ఆచరణంలో సాహసవంతులు
ముక్కలయిన సమయాల్ని కలప జూచేరు

కథలో హృదయం మేధ సమన్వయంతో
వెనుక నుండి కవిత! ప్రేరణ స్వరం సన్నగా
దీనికి సమయమంటూ లేదు ప్రత్యేకంగా
ఆయువులో ప్రతి ఘడియ, ఒక అమృత కలశం

ఎంతటి కటు విషమ పరిస్థితులలోనూ
కర్తవ్య పథంలో నడుస్తుంది, నడిపిస్తుంది

పొలంలో వాన చినుకులతో విత్తుల నుండి
పచ్చని పైరుతో నెత్తురు చుక్కను మరపిస్తుంది

శూన్యమైన ముఖంలో అభినవ కళ చూపేను
తీరిక లేకుండా మనిషి! నిర్మాణంలో కదలేను

సౌందర్యం ఆయువు హృదయం మూడూ
దేహం ప్రాణం సంస్కృతి సంబంధంతో
శ్రుతి కటుతలు తోచే ఒక పార్శ్వం
శ్రుతి సుభగత నింపే మరో పార్శ్వం

స్వేచ్ఛా కవిత్వం-82

ఇది జీవితం

(VII భాగం)

అశాంతి పరిచయం

మాదిరాజు రంగారావు

2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 82

IDI JEEVITHAM

(VII Part)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2018

Presented to
my wife
Smt. Indira

పీఠిక

ఈ రచన "ఇది జీవితం" – బృహత్కృతిలో ఏడో భాగం "అశాంతి పరిచయం". ఇందులో వస్తువు వర్తమాన సమాజంలో వ్యక్తి జీవితంలో బాహ్య దృశ్యంతోపాటు ఆంతరమైన అనుభవ రూపం కలిసిన సమాజ గతి రూపం. ఇది భౌతిక మానసిక స్థాయిల్లో తీర్చబడింది. ఏకాంతం నుండి సమాజంలోకి ప్రవేశంతో సామాజిక రాజకీయ నైతిక స్థితుల్ని ఎదుర్కొనే విధంతో పాటు తాత్వికమైన స్పర్శనూ కలిగింది. అదనంగా అక్కడక్కడా ప్రకృతి పాత్ర చిత్రితమయింది. ఈ ప్రాతిపదికపై కవిత్వం రూపొందింది. భావనలో గాఢతతోపాటు సూక్ష్మత అనుభవానికి వస్తుంది.

ఇక విషయానికి వస్తే గతానికి చెందిన స్మృతి లహరులు వర్తమానానికి చెందిన దృశ్యపరంపర భవిష్యత్తుకు చెందిన దార్శనికత ఈ మూడింటి సహయోగంతో రచన విశాలతను పొందింది. ఏ మూల నుండో ఒక పిలుపు ఒక కేక ఒక అరపు ఒక హెచ్చరిక ఒక శబ్దంలో విడుదలయ్యే మానవ స్వరం వినిపిస్తుంది.

తనకు నచ్చింది ప్రియమైంది చేసేవారికి కష్టమనిపించదు. ఆ పనిలో నిమగ్నులవుతారు. దాని పట్ల అభిలాష అభిమానం నిబద్ధత అంకిత భావం లక్ష్య శుద్ధితో పాటు తాదాత్మ్యం – ఐక్యభావనచేత బరువనిపించదు. మనసు తేలికపడుతుంది. దీప్తిమంతమవుతుంది. సుందరతను పొందుతుంది. ఒక విధంగా ఆత్మీయతను స్థాపిస్తుంది. ఇది అశాంతి నుండి శాంతికి పయనింప చేస్తుంది.

ఇక అభివ్యక్తి విషయంలో ఎవరి అస్తిత్వంపై నిర్మితమైన వ్యక్తిత్వం వారిది. కవిత్వం స్వతంత్రమయిన సృజన రూపం. ఈ కృతిలో కవిత్వం మౌలికమైన 1) వేదన 2) భావన రెక్కలపై విహరింపజేస్తుంది. సమాలోచనంలో సాహిత్య సహృదయుల దృష్టికి రావడంతో రచన సాహిత్య విమర్శకు దారి తీస్తుంది. ఈ కారణాల చేత ఈ బృహద్రచన స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికంతో విశిష్టమైందిగా తలపుకు వస్తుంది. ఒక స్పందన అనుభూతి భావన ఆదర్శం ఈ నాలుగు కలిసి మనసు ఆకర్షించే రూపమే ఈ స్వేచ్ఛా కవిత్వం.

05-02-2018 **– మాదిరాజు రంగారావు**

ఇది జీవితం (ఆరో భాగం)

1.

మస్తిష్క గగనంలో ఆలోచనా మేఘం
కదలికతో మానవ జీవన భాగ్యం
కరుణ జలంతో ఊరట కలిగేను
ప్రగతి ప్రవాహంతో ఉత్సాహం పొందేను

వాస్తవ జగత్తులోనే మనిషి పనులు సాగేను
సమాజ ఘన సంబంధంతో బ్రతుకులు గడచేను
ఎప్పటికీ మిగులుతూ ఏదో ఒక అవసరం
అది తీరే మార్గంలో ఫలితం కయి నిరీక్షణం
ఏ పక్షీంద్రుని వలెనో ఎగిరి వచ్చి
అమృత కలశాన్ని అందించే వారు లేరు
బ్రతుకు తరువు కొమ్మల నుండి
భావ సుమంపై క్రియాఫలంపై కోరిక తెలిసిందే
అవి విప్పారే దాకా పరిణతి పొందే దాకా
సమయం కయి వేచి ఉండవలసిందే

2.

అడుగులలో అలల కదలికతో
ముందుకు సాగే పయనంపై కోరిక! ఎప్పటిదే
జీవన రాగంతో చేతిలో వేణువుతో
జీవన ఘర్షణలో చేతిలో శస్త్రంతో
మనిషి అడుగు పడుతుంది బహు జాగ్రత్తగా
మధ్య మధ్య రాజకీయ తంత్రంలో భాగమై

పలుగు పార నాగలి యంత్రం వ్యాపారం
జీవితానికి ముఖ్యమైనవి యథావిధిగ సాగేను
ఎవరికి వారు తమ పాత్రల రీతిని మరచి
మరొకరి పాత్రలపై ఆలోచన సాగించేరు

మట్టి నుండి మొక్కలా మబ్బు నుండి మెరపులా
వెడలే అంతరంగ స్ఫూర్తి కెవరితో పని లేదు

3.

ఉదయ మయి చుట్టూ ప్రకాశ రూప మయినా
ఎందరో ఇంకా! కుటిలో చీకటి చే చుట్టబడీ
తలపాగా గానొ! ఉత్తరీయం గానో! శాలువ గానో
డ్రెస్ వలెనో ఉపయోగ శోభ పొందుతూంది! చీకటి

తను అనుకోకుండా విప్పారిన రెక్కల పయి
అంత వరకు దాగిన రహస్య మెగిరి పోతూంది

పగలయితే కాల్చిన ఇనుప కడ్డిలా ఉత్సాహం
నిశ అయితే చీకటి చెరువులా పరచుకొనే దృశ్యం

అస్తమయం తరువాత వెలుగుల బాధ్యత
చంద్రునికో చుక్కలకో దీపాలకో వశమయ్యేను
మనిషి తాను చేసిన ఘన కార్యం గురించి
పునరాలోకనానికో! పశ్చాత్తాపానికొ! పనికి వస్తుంది

4.

అలుపు లేదు! భౌతిక మానస శ్రమలో
ఒక సమయం భూమిపై తిప్పుతుంది, కవిత
మనసుకు తోడుగ బంధుత నెరపుతుంది
ఒక సమయం నింగిలో నిలుపుతుంది, అదే!

తెరచిన రోజు పగలు పేజీలో
తెలుపు తప్ప పలు రంగుల అక్షరాలు
తెరచిన రోజు రాత్రి పేజీలో
తెలుపు ఎరుపు రంగులలో అక్షరాలు

తెలుపు దుస్తులయినా నలుపు దుస్తులయినా
పగలు రాత్రులు! మనిషి మనో జగం ఒకటే!

క్రమ శిక్షణలో ఎదిగిన రూపాలు కావు లిప్తలు
పక్కపై మార్చే దుప్పటి కాదు ఆదర్శం!
ఇవి జీవన గతిలో పూవు వలెనొ నిప్పు వలెనో
చినుకు వలెనొ స్పృశిస్తాయి! వివరణ కవకాశంతో
ఎపుడయిన కనిపించవచ్చు, బిక్షువు జోలెలోనొ
కోటీశ్వరుని పెట్టెలొనొ! పిల్లల ఆట వస్తువు గానొ!

5.

ఎండలో వడివడిగ ఆకుల వలె తరలే వారు
వానలో తడుస్తూ చేపల వలె వెళ్ళే వారు
మంచులో కిరణంలా సందు చేసుకొని పోయేవారు
వీటికి భయపడి ఎచటనో నిలిచే వారు

కాల చక్ర భ్రమణంలో నిశిత తీవ్ర ప్రభావాల్ని
మనిషిలో సహన శక్తి ముందుకు నడిపిస్తుంది

ఉద్యమ మయినా ఉద్యోగ మయినా
యుక్తిలో నయినా భుక్తి కోసమయినా
ఏ కొందరి కోసమో! మితం కాదు జీవితం
లోన మనసు కళా విశాలతను పొందుతుంది

జలధి ప్రవహించదు, అలలతో ఊగుతుంది
నది ఆగదు భూమిపై సరిస్తూ పోతుంది
ఈ రెండు స్థితులతో జీవిత కాలం
గతంతో ఒకటి, ప్రస్తుతంతో ఒకటి మనిషిలో

6.

దూరం నడకతో నడత తీరులో స్వేచ్ఛ
ఎక్కడి కక్కడ పరిమిత గతుల సమాజంలో
పయనంలో అడ్డంకులు తొలగే పనిలో
ఉరి శిక్షకు గుడ్‌బై చెప్పే యోచనలో సంస్కృతి

క్రోధంలో ఎరుపు రంగు అపాయ సూచనయై
శమనంలో తెలుపుకు లభిస్తుంది అవకాశం!
అందం, హ్లాదం ప్రేరణ అట్లా ఉంచి కవిత
స్వేచ్ఛలో ఉదారమైన మానవ దిశ చూపిస్తుంది

ఎరుపు అవసరం నెత్తురులో తేజంతో ప్రగతికి
ఉదయం! అరుణం ఉత్తేజకరం అందరిదీ
ఎరుపు తెలుపు పసుపు మిశ్రమ గుణ రూపంతో
ప్రతి ఎద పయి చేయి వేసి, మొదలు పెట్ట జేస్తుంది

7.

ఆ వినిపించే వేదనా స్వరాన్ని వదలి
అడుగు ముందుకు ఏలా పడుతుంది
బాధా రూపం తెలుసుకునే దాక నిరీక్షణలో
ఎంత దూరమయినా కవి దృష్టి పడుతుంది
తనలో ఆనంద లహరి కదలితే చాలదు
సమాజ చింతనతో గడవడమొక అవసరం

కవి ముఖం చూడాలని ఎందరికో ఉంటుంది
కవితల రుచి పొందాలని అందరికీ ఉంటుంది

దార్శనిక భేదాలతో మార్గాలు వేరయినా
కనీస స్థాయిలో కలిసే సందర్భాలెన్నో!
కవిలో సహృదయులలో ప్రమాణాలు దగ్గరయి
దొరకే అవకాశం! పరిమళ సుందరతను పొందుతుంది

8.

సూది మొనల చూపులు ప్రసరిస్తూ కొందరు
శిలా ప్రతిమ రీతులు ప్రకటిస్తూ కొందరు
పయి పయి మెర మెచ్చుల మెరపులతో కొందరు
మొహ మోటమిలో కొందరు కదలికలను చూపితే
పచ్చ గడ్డ కప్పిన గోయిలా తోచేరు మరొకరు

భాష ఒకటే! భావనలో వైరుధ్యాలతో
కవులూ పాఠకులూ మధ్యన ఖాళీలు!
ముళ్ళు తప్ప పూలు ఎరగని పొదలు ఉండొచ్చు
మండే మంటలతో! అలంకృతం కావచ్చు

ఇరువురి మధ్య దాట రాని ప్రవాహమయితే
ఈతనో పడవనో వంతెనో విమానమో!
మరొకటో! దాటే సాధన మవసరమవుతుంది
ఇది మానసికంగా ఆరోహణలో భాగం

భావ జగత్తుతో సుందర కృతి అనుభవం
విశేష తలం పయి జీవన సంస్కృతి చిహ్నం

9.

ప్రవహించే నదికి తాను ఆగని గమనంతో
అడవులు కొండలు లోయలు గడచి నడచి
జలధిని చేరే సంగతి ముందుగ తెలియదు
కాలువలకు వంతెనలకు సిద్ధంగా అన్నిటికీ
ప్రజల అవసరాలను తీరుస్తూ పోయేను
ప్రవాహకత లోనే ఉంది జీవన భాగ్యం!

తాపంలో నది జలదం కయి ఎదురు చూస్తుంది
అవని నుండి క్షుధా గీతం మోసుకొని తరలుతుంది
నది అయినా జీవిత మయినా
సరళ రేఖలో సాగదు పయనం
మనిషి వెంట నీడలో మరో మనిషి
అదను చూచి మనిషిని దాటే యత్నంలో

10.

ఒక స్థితిలో మనిషి చెట్టును తలపించేను
పుట్ట నుండి పైకి లేచే పామును తలపించవచ్చు
చెట్టు నడిస్తే అపాయ భయం కలుగుతుంది
పామును చూస్తే మృత్యు భయం దూకుతుంది
వర్తనలో చర్యలతో ఈ ఊహలు సహజం
ప్రకృతితో ప్రాణితో చిర బంధం కారణమయి

తరు మూలం చుట్టుకొని సర్పం
కళ్ళు మూత బడినట్లు ఉన్న రాత్రి!
పూవొ పండొ! తీసుకొని వెళ్ళేను! మనిషి నిశ్చింతగా
ఆ సమయంలో! తెలియని తన మొక వరమవుతూంది

మనిషి గుండె లయతో ఊపిరి సాగుతుంది
కవిత శబ్ద గతిలో హృదయం స్వనిస్తుంది
అపుడపుడు పదం నిలిచి నట్లయినా
మనసు మాత్రం! చేతనతో గమ్యం పైనే

11.

లోయలోకి చూస్తే అంతా చీకటి
కొండ పైకి చేరితే అంతా నిర్మానుష్యం
అడవి లోకి నడిస్తే దారి తప్పే భయం
ధైర్యం వీడని మనిషి మనీషతో గెలిచేను

ఇంకి పోని ఎండి పోని
ఆర్ద్రమైన హృదయం, శుష్కత నెరగదు
శబ్దించే అనురాగ స్వరంతో
మనిషిని గెలుపు వైపు నడిపిస్తుంది

అడవిలోకి చేరిన మనిషి ఇపుడు
అనల కీలయై, ఆయుధమై చోటు నుండి చోటుకు
భవిష్యత్తులో పచ్చని కల వాస్తవ మయ్యేందుకు
నేల పయి నెత్తురు చిత్రాలకు పూను కునేను

12.

చీకటిలో మనిషి ఉనికి కర స్పర్శతో తెలిసేను
ఆప్త మైన గుప్తమైన మానుష భావం సరిస్తుంది!

ఉదయం రవితో పాటుగ ఉత్సాహంగా
భూమి పయి అడుగులతో నడచి నడచి మనిషి
అస్తమయంతో తనలో చీకటి భయంతో
అగాధమయిన చీకటి జలాలలో దూకేనా?

వెలుతురు చీకటి సమయాల కతీతంగా
స్వతంత్ర ప్రపంచంతో మానవ మానస రూపం!

ఎపుడో జరిగిపోయిన కథలో
జారిన నెత్తురు చుక్క జ్ఞాపకం
ఇపుడు అగ్ని రేఖ అయ్యేనా?
రాలిన బాష్ప బిందువు జ్ఞాపకం
ఇపుడు హింసకు పురి కొల్పేనా?
ఆరని అగ్ని వేదిలా శత్రుత నిలిచేనా?
విస్ఫోటం మూట విప్పుతూంది గాలి
జలదంలా హృదయం! కదల వలసి ఉంది

13.

తాను కోరే జీవన నిర్మాణం లోను
రాగంతో మిత్రత, కలహంతో శత్రుత తప్పనివీ
అనుభవమూ ఆదర్శం రెండిటి కలయికలో
వ్యక్తికి అస్తిత, సంఘానికి ఉపద లభించేను

పిడికిలిలో దినమణి నిలవాలని ఒకరిలో
సూర్యుడో చంద్రుడో కంకణ రత్నం కావాలని ఒకరిలో
మలుపులో ప్రవాహం! వెళ్ళే దిశ మారుతుంది
కల్పనలోనూ వాస్తవం ఆధార తలంగా నిలుస్తుంది

తెలుపు ఎరుపు రంగుల కలయికతో
సమ సమాజ నవ దృశ్యం! కొత్తగా
నలుపు ఎరుపు రంగుల కలయికతో
రాజకీయ స్థితి చిత్రం మారుతుంది

రెండిటిలో ఎరుపు రంగు రాగ బంధం నిలుపుతుంది
హృదయంలో మనిషికి ఉత్సాహ శక్తి నింపుతుంది

14.

హేతువుతో దార్శనికం జీవన గతికి రూపమిస్తుంది
ఆలోచనలో కల్పన వాస్తవాన్ని మరపిస్తుంది
అనుభవ సోపాన క్రమం! వ్యక్తి స్థాయి పెంచుతుంది
బహు విధ సంపదపై కోరిక! జీవన సహజం
ఉద్యమ మయినా ఉద్యోగమయినా వృత్తి అయినా
బావి లోతులో ఉన్న నీటి కంత? చేదతాడు అవసరం

ప్రగతి దిశకు అవసరం దార్శనికం
దారు లనేక మయినా పోయే దారి ఒకటే
సమాజ వాహనంలో అందరికీ చోటు!
సమ న్యాయం ఒక అవసర వాస్తవం

అలజడిలో సముద్రం! తుఫానును వదలుతుంది
తాపంలో సముద్రం! జలదాన్ని వదలుతుంది

15.

చీకటి బరువు అనిపిస్తుంది, తాను మోయక పోయినా
వెలుగు తేలిక అనిపిస్తుంది, తాను మోయక పోయినా
నిద్ర నుండి మేలుకొన్న మనిషి తలపై
మబ్బులెన్నో కదలుతూ! తన బ్రతుకును తీరుస్తూ

అవి ప్రాణం పోసే శక్తి మూటను విప్పుతూ
బ్రతుకులో వేదన చల్లారుస్తూ పోయేను
బాధలో ఎరుపును తగ్గిస్తూ
శమనంలో పచ్చనకు అవకాశంతో

ఉదయం ఏ ఒకరిదీ కాదు అందరిదీ
జలదం ఏ ఒకరిదీ కాదు అందరిదీ
గట్టు జలధి అలలను నిలిపినట్లు
స్వేచ్ఛ విసురు నిలుపుతుంది, నియతి

16.

జలద మయిన తుపాను అయిన జలధి సృజనలే
పచ్చదనంతో నిర్మాణానికి ఒకటయితే
నష్ట గుణంతో సంక్షోభానికి ఒకటవుతూంది
సృజన విలయ పార్శ్వాలతో జీవన దృశ్యం!

ఒక మూల నుండి సమస్య పరిష్కార యత్నం
ఒక మూల నుండి జటిలం చేసే వైఖరులు!
ఒక మూల నుండి సందేహం చీకటి ముఖంతో
ఒక మూల నుండి నిర్ణయ రూపం ఒకరొకరిలో

మనిషిలో అంతరంగం! పైకి కనిపించని విశేషం
మనిషికి తన స్థానం స్థాయిని గుర్తుకు తెస్తుంది

ఈ నాలుగు వైపులతో జీవితం
చతురంగా తేజంతో వెలగాలనీ
శూన్యమయిన లిప్తలతో బ్రతుకులు
పూర్ణత పొందేందుకు పాట్లెన్నో!
అన్వేషణలో కాలం! గడుస్తుంది తృప్తి రేఖలతో
మౌనంగా ఉన్న అంతరంగం గుర్తుకు వస్తుంది

17.

ఇంటి ముందు టపటప! చినుకుల్ని
విసరి విసరి గాలి నర్తింప చేస్తూంది
బయటికి వెళ్ళాలనీ, చినుకులతో అడుగులు కలపాలనీ
పిల్లల ఆరాటం! తల్లుల భయం! వెనక్కి లాగుతూంది
చినుకులు పిల్లలు తల్లులతో సమూహ నృత్యం!

పిల్లల మాటల్లో ఆ సుందర సంగీత రుచి
తల్లికి బాగా తెలుస్తుంది! స్వరం కలుపుతుంది

దప్పిక తీరడం ఆకలి ఆరడం మాత్రమే అయితే
ఇంతటి వికాస చరిత్ర కవకాశం ఉండేది కాదు
ఈ రెండూ దొరికే దాకా ఆలోచనలు వేరు!
ఇవి దొరికాక పొందే మనో జగం వేరు

18.

అందం ఆనందంతో అనుభవ రూపం! ఎక్కడ?
ఈ స్పృహతో జీవన పద్ధతిలో కోరే లక్ష్యంతో
భౌతిక దృశ్యంతో మొదలవుతుంది చూపులో
జీవన శ్రమ తేజంతో ఫలం! ఎక్కడికక్కడ స్వతంత్రం

లేచే అలల తలల్ని తాకుతూ పక్షి ఎగురుతుంది
మనిషి తలను అణచే యత్నంలో మనిషి
నీళ్ళ ఉల్లాసంతో ఒక ప్రాణి
కోరిక తీరని ఉద్వేగంతో ఒక జీవి

రవి రాకుండా పగలు గడవదు
శశి లేకుండా రాత్రి గడవచ్చు

పగిలిన అద్దంలా సాయం సంధ్యా సమయం
ప్రతి ముక్కలో ఒక్కొక మనిషి ముఖం
పగలంతా తనతో పని చేసిన వారివి
ఇపుడు ఎవరి దారిన వారు పోతూ, "బై" చెప్పేవి

19.

కళ్ళు తెరచి కాస్త మతి వికసిస్తుందో లేదో
శిశువు సమాజ నాటకంలో పాత్ర వహించేను
దీనికి శిక్షణతో పని లేదు రిహార్సల్స్‌తో పని లేదు
నటీనటుల ఎన్ని సంరంభంతో పని లేదు

మనుషులందరూ ఏదో ఒక పాత్రలో జీవించేరు
ప్రేక్షకుల్ని కూడ గట్టే అవసరమసలే లేదు
ఎవరి కెవరు తెలిసినా తెలియక పోయినా
అనుభవాల సమీకరణాలతో వివిధ సన్నివేశాలు
అలుపు లేదు విరామం లేదు, పాత్రలు వస్తూ పోతాయి
పాత్రల మలుపులు ఊహించని విధంలో జరగవచ్చు

తన వెనక నున్న చరిత్రను మరవని
తానున్న సమాజాన్ని వదలని
లేని దాని కయి చింతలో
రాని దాని కయి బాధలో
జీవిత మెప్పటికీ! ఆరాటంలో
క్రియా రూపమెపుడూ! ఆరోహణలో

20.

నిన్న మిత్రం నేడు శత్రువు కావచ్చు
నేటి శత్రువు రేపు మిత్రం కావచ్చు
వెడలిన శాపం వెనక్కి తీసుకోబడదు
ఏదో కాస్త సవరణ మాత్రం జరగవచ్చు

స్వేచ్ఛా బంధనలో సమస్య జటిలమవుతుంది
పరిష్కార సాధనలో దిశ దశ మారేను

అతీతంపై భారం వేయడమొక మానసికం
సహన శీలంతో మనసుకు ఉపశమనం! కలుగుతుంది
పని లేని స్థితి నుండి మనసును మరలిస్తుంది
క్రియా మయంతో బ్రతుకును సార్థక మొనరిస్తుంది
మనసు నుండి వెడలిన మాటకు
అర్థం మారే ప్రసక్తి లేదు

21.

ఆయుధాన్ని ఎదుర్కొనే మనసులో
మరొక ఆయుధం! సిద్ధంగా ఉంటుంది
కలం బలం ఎదుర్కొనేందుకు
మరో కలం ఎదురుగ నిలుస్తుంది!

స్క్రీన్ టచ్‌తో పనులు జరిగి పోతూంటే
గుండె టచ్‌తో మాట మురిసిపోతుంది

ఇంటి తలుపు తెరచే ఉంటుంది
బయట గేటు మూసే ఉంటుంది
లోన మనుషులు నిర్భయంగా
గేటు దూకి మనిషి వచ్చే అనుమానం రాదు

యంత్రం ఒకరిది నడిపే వారొకరు
వస్తువు ఉత్పాదన మొకరిది ఉపయోగించే దొకరు
నాలుగు చరణాలపై భౌతిక రూపం కదలుతూ
వివిధ శ్రేణులతో సమాజ చలనానికి కారణం

22.

రోజులు నెలలు ఉగాదులతో కాలం
మనిషి జీవితంలో అనుభవ దృశ్యాలతో
విశాలమైన వాస్తవ రూపం తెలిసీ తెలియక
తమ పిడికిలి లోకి తేవాలని చూచేరు
సమాజాన్ని సంకుచితం చేసే ఆలోచనతో
తన వశం చేసుకునే ప్రక్రియ మొదలవుతుంది

కలహం స్నేహం రాగం త్యాగంతో జీవితం
సజీవ నాటక చలనంలో వాస్తవ రూపం
మనిషికి జీవన రూపాన్ని ఇస్తుంది
సంఘానికి చిత్ర దృశ్య రూప మిస్తుంది
వినోదాన్ని వహిస్తుంది, విరాగాన్ని సహిస్తుంది
విషాదాన్ని సరిస్తుంది, ప్రమోదాన్ని నదిస్తుంది

23.

విత్తు ముఖం ఎత్తక ముందే నష్టం జరగవచ్చు
మొగ్గ విప్పారక ముందే నేల రాలి పోవచ్చు
ఊహ క్రియను పొందక ముందే తేలి పోవచ్చు
జరగని దేముంది? అన్నీ జరిగేవే కళ్ళ ముందు

ముఖం చాటయ్యే సమయం వచ్చే దాకా
వెలుగయినా చీకటి అయినా ప్రభుతలతో
చీకటిలో మనిషి! నిందిస్తూ కూర్చోక
దీప సహాయంతో గడపడమొక అవసరం

మల్లె పూవు గ్రీష్మం లోనూ స్వచ్ఛంగా శుభ్రంగా
మరింత శోభతో పరిమళ వంతమవుతుంది
ఆకు! పూవు! రంగు! అమరిక! ప్రత్యేకతతో
మనిషి జీవితమూ! రూపం గుణ క్రియలతో

24.

విరియ బోవు మొగ్గలా ముఖాన దరహాసంతో
నడచే మనిషిలో ఆలోచన! సృజన గుణంతో
వెనక్కి చూచే కొద్దీ కల్పనలో గడుస్తుంది
ముందుకు వెళ్ళే కొద్దీ వాస్తవమా వహిస్తుంది

పచ్చని ఆకులు భాగ్యానికి చిహ్నమై
పూవు ఫలం కొమ్మలతో మూలం!
వివిధ వర్గ గుణ సమీకరణ శక్తితో
సృజనకు సమాజ బంధుత చూపుతుంది

నది అంచున చల్లగా చెట్టులా బ్రతకాలని ఒకరికి
ఎప్పటికీ ఆర్ద్రమైన వాతావరణ సుఖంలో
నది అలల బుజాలపై పడవలా సాగాలని ఒకరికి
ఆ సమయం! జీవన యానంలో సుగమతతో

చలన గుణం లేని పడవలో కూర్చొని
చలన శక్తి ఉన్న మనిషి ఆలోచన లనంతం!
మనో రీతులెన్ని విధాలో! క్రియలన్ని తీరులు! గాథలో
ఆశించే ప్రయోజనంతో కవితలన్ని విధాలు! స్వేచ్ఛలో

25.

వెన్నెల కల్పనకు దారి తీస్తుంది
చీకటి నిదురకు దారి నిస్తుంది
కళ్ళకు కాటుక వెలుగును చీకటిగా మార్చలేదు
సూటిగ వెలుతురు పైనే చూపులు నిలుస్తాయి

ఈ రోజు పడమర దిశలో వాలే సూర్యుడు
రేపు ఉదయం! తూరుపు దిశలో ఎగసి వచ్చేను
ఆగమనం నిష్క్రమణం జనన మరణ రహస్యంతో
సందేహం! తీర్చేందుకు రాసులుగా ఆలోచనలు

శిలకూ భాగ్య దశ ఉంది, శిల్పంలో దేవతగా
మనిషికీ భాగ్య దశ ఉంది, నవ మానవ తేజంతో

నూయి చెరువు నది జలధి తమ తమ నిధులతో
ఏదీ దేనికీ పోటీ కాదు! వేరు వేరు ప్రయోజన స్థితులతో
అక్షరాల దుస్తులలో భావనా మూర్తులు కవితలు!
ఏదీ దేనికీ పోటీ కాదు! వేరు వేరు సృజన చేతనలతో

26.

ఒక సమయం వస్తుంది! ఎంతటి రహస్య మయినా
మబ్బు నుండి చంద్రునిలా బయట పడుతుంది
ఆగని జలపాతంలా స్వేచ్ఛా కవితయై దూకుతుంది
ప్రసార చలనంతో శిలలపై నుండి జారుతుంది
ఆకుల కొమ్మలలో నుండి ఎగిరి వచ్చి
పాల పిట్ట లాగ నిజం! వాలుతుంది ఎదురుగా

ఎవరు విన్నా వినక పోయినా! కవిత
రాత్రి వెలిగే బల్బును మరపించే
ప్రియా రస హృదయం వినిపిస్తుంది
రహస్య మూలమై నిలయమై నిలుస్తుంది!

కవికి ప్రియం ప్రజకు హితం కవిత మనోజ్ఞమై
రుచిలో అభినవమై అమృతమై అమరమైంది
మట్టి మనిషిలో శ్రమ చేతన సుమిస్తుంది
కావ్య జగంలో సమాజ శక్తిని వెలిగిస్తుంది

27.

అనుభవాల సంకలనం జీవితమొక ఆల్బం
భౌతిక మానసికానుభవాల వికాస మేళనం
బయట వీధిలో ధూళి మయం జన చలనం
ఒంటరి తనం నుండి మనిషిని సమాజగతం చేసేను

మాటలు మంటల్ని చిమ్మవచ్చు
చూపులు సూదుల్ని వదల వచ్చు
మనిషి నడచే బొమ్మ కాదు! సజీవ రూపం
మనసుపై ప్రభావ ముద్ర లొకటొకటీ!

పగలు గడచి రాత్రి నిద్రకు ముందు
ఆ రోజున జీవన గతి సమీక్షలో
మళ్ళీ కనిపించని ఘటనలు అవహిస్తాయి
వచ్చే రోజు స్వచ్ఛ మయిన భావనతో
శుభ్రమైన చేతలతో ముందుకు సాగాలని
మనసులో కోరిక ఉబుకుతుంది ఊటలా

ప్రతి రోజు ఇదే వరస! రైలు బోగీల్లా
డైరీలో పేజి తిరిగినంత సులభం కాదు, మార్పు!

28.

తరం నుండి తరం కొత్త కొత్త ఆలోచనలలో
అనుభవం వేరవుతుంది, నిర్వచనం మారుతుంది
ఎవరికి వారు తమ తమ ముద్రలతో
కాలాన్ని నింపాలని, చిత్ర మయం చేయాలని

ఎక్కడి నుండో మోసుకొనీ వచ్చిన
ఆ బ్యాగ్ విప్పి చూస్తే! ఏముంది?
లోపలి వస్తువుల కన్నా బ్యాగ్ బరువు ఎక్కువై
జ్ఞాపకాలతో మిగిలిన చిల్లర డబ్బులు!
వెనుక నుండి సిద్ధంగా ఉంటుంది
బుజంపై చేరేందుకు మరో బ్యాగ్!

29.

చుట్టు కంటకాల కోట వెలసి ఉన్నా
గులాబి పూవు వికసించడం మానదు
ఉన్న ముళ్ళు చూచి మనిషి భయంతో
వెనక్కి వెళ్ళి పోడు! దృశ్యం మరచి పోడు

మనిషి చర్యల నుండి అనుకోకుండా
పుష్ప గుచ్ఛం బయట పడవచ్చు
అనల జ్వాల ఎగసి రావచ్చు
హ్లాదానికీ వేదనకూ సిద్ధం కావలసిందే

పూల గుత్తి లాంటి కవిత చూపాలని ఒకరు
ఎవరి ముఖంలోనో సంతోషం చూడాలని
మెరసే కత్తిలాంటి కవిత చూపాలని ఒకరు
ఎవరి ముఖం లోనో చీకటి పోవాలని!
వాడి కత్తిలాంటి కవిత మెరవాలని ఒకరు
ఎవరి గొంతు తెగడానికో! రక్షించడానికో!

30.

పరచిన బొగ్గు కణికల దారితోనో
వెచ్చని బూది పొరల అమరికతోనో
దేశంలో రాజకీయ వాతావరణం!
వర్తమాన స్థితికి విషమత నిస్తూంది

అవకాశం దొరికి, అరాజకత పెరిగి
అడ్డుకునే బలం తగ్గి, అగ్ని అంటుకొనీ
స్వేచ్ఛలో అశాంతికి పట్టు దొరుకుతూంది
వ్యక్తికి మితమైంది కాదు, శాంతి! సమాజానిదీ

అభిమానం ఒకటి చాలదు, అభిలాష పదంతో
శాంతి పట్ల క్రాంతి పట్ల, దృఢ చిత్తం అవసరం

స్వేచ్ఛలో కవిత! ఆట స్థలంలో బంతిలా
నియతమైన హద్దులలో కదలుతుంది ఆడ బడీ!
ఆల్బంలో ఇష్టంగా దాచుకొనే ఫోటోలా
తమ రూపం దృశ్యంలో! కనిపించాలని! ఉంటుంది!

31.

ఆకాశంలా పరచిన అవకాశం గల స్వేచ్ఛలో
విహగంలా జలదంలా మనిషిలో అతీత యానం

మంచి క్షణాలను ఎన్నుకొనే అవకాశం లేదు
వచ్చిన వాటిని ఆమోదించాలిసిందే!
స్తబ్ధతలో చేతనలో సుందరమో వికాసమో
జరిగే ఘటనల సారం నిగ్గు తేరి మిగులుతుంది

శాంతి సహన సమత ప్రేమ ఉదారతలను
కోరని మనిషి ఉండడు, తలచని సమాజం లేదు
అయినా ఆ మాటలు! మధ్యలో జారిపోతూనే
జీవన సందర్భంలో విషమ స్థితి ఏర్పడుతూంది
వీటి కొరతతో బ్రతుకులు కొరివిగా మారేను
శాంతికై మనసు అతీతాన్ని ఆశ్రయించేను

32.

బయట వెలుగుతో పాటు లోని వెలుగుతో అస్తిత
దీనికై అన్వేషణ పరిశోధన జరుగుతుంది నిరంతరం
మనిషిని మనీషిగా మనస్విగా తీర్చి దిద్దేను
మధ్య మధ్య చీకటి రేకులు! చూడవలసి రావచ్చు
అవసరాల ఒత్తిడిలో అణగి మణగి వెలుగు
ప్రగతి పథంలో కనిపించని దవుతూంది
సంకల్పం సన్నగిల్లి ఆశలు అలజడిని పొంది
మందగించి సమాజం ప్రవాహకతను కోల్పోయేను

కవి హృదయ స్పందనతో కాలం కదలుతుంది
కర్షక పద పంక్తిలో బీజం తల ఎత్తుతుంది
మంచి కోసం ఎక్కడా వెదకే పని లేదు
తనలో వెలుగును గుర్తించడమే! తరువాయి

సమీక్షకు వీలు ఉంది! పరిశీలన కవకాశముంది
వివేచనకు చోటు ఉంది! కాలం మాత్రం వెనక్కి మరలదు

33.

వేళ్ళు భూమిలో దిగి ఉన్నప్పటికీ
విస్తరణంలో ఆకులు దిశల వైపు చూస్తాయి
కదలికలో పూలు నింగి వైపు చూస్తాయి
నింగిని తాకాలని శిఖరానికి కోరిక!
జీవన రూపంలో మనిషి ఇదే మోస్తరు
దూరం లోనిది పొందేందుకు చేతులు చాస్తూ!

కాలం రెక్కలపై సుఖంగా ఎగరాలని ఒకరు
తమ వీలు ననుసరించి ఆగితే బాగని ఒకరు
కాలం ప్రవాహమై తమ పంట పండాలని ఒకరు
కాలం కల్ప వృక్షమై కోరిక తీరాలని ఒకరు

మనిషి చుట్టు దారులెన్నో దిశ దిశలో
అన్నీ అందరికీ స్వాగతాన్ని పలుకుతాయి
ఎవరి దృష్టి కోణంలో వారు దారి ననుసరించేరు
కాలం గడిచాకనే! బాగోగుల ఆలోచన వివేచనం

34.

తాడుతో పశువులు కట్టి వేయబడతాయి
బోనులో మృగాలు బంధనలో బ్రతుకుతాయి
ఉగ్ర పథంలో చర్య లెంత సబబు కాకపోయినా
ఉద్రేకంలో ఉన్మద చేష్టలు దూకుతాయి!

మౌనంలో మరణ రహస్య వేది ఆయుధం
నిశ్శబ్దంగా బ్రతుకుతూనే ప్రాణిని హత మారుస్తుంది
చాచిన చేతికి విజయం అందేనో లేదో కాని
సమాజ స్మృతిలో విషాద చిహ్నం మిగులుతుంది

చర్యకు ప్రతి చర్యగా తీవ్ర స్థాయిలో
ఆయుధం! విశేష చర్యకు దిగుతుంది
అణువణువును పొద పొదను వణికిస్తూ
అడవి నుండి నగరం చేరేను ఏడుపు!
ఆయుధ బలంతో తిరిగే జీవన చక్రం
ఆగదు! ఘర్షణలో వేగం! పెరుగుతుంది

35.

మబ్బు నుండి మెరపు! భూమికి వర్షా సంకేతం
వాన వార్త అందించి అదృశ్యమవుతుంది
మనిషి మరచిందేదో జ్ఞాపకం చేస్తుంది
కల్పనలో కాసేపు తిప్పి, వాస్తవానికి చేరుస్తుంది

కొమ్మకు పూచే పూవు తనతోనే
ఎప్పటికీ ఉండే ననుకుంటుంది చెట్టు
అందంతో గంధంతో అలరించే పుష్పం
ఎవరైనా తెంపవచ్చు, నేల రాలి పోవచ్చు

పైన మబ్బు కింద చెట్టు
గాలిలో పూవు, నేలపై మనిషి
ప్రకృతిపై మనిషిపై వాత్సల్యంతో అవని
ఇరువురు తనతోనే ఉండేరనుకోవచ్చు!
తన గుర్తులు వదలి మనిషి వెళిపోయేను
తన విత్తును వదలి చెట్టు వెళ్ళి పోయేను

36.

మబ్బు వాన, అవని చెట్టు, పూవు మనిషి
అనుబంధం విశ్వమయం! జీవన ప్రేరణం
క్షణం సేపు మెరసి పోయే దయినా మెరపు
రాత్రి వేళ దారి చూపి వెళిపోతుంది

మెరపులో వెలుగు! ప్రకృతి నలంకరిస్తుంది
పూవులో అందం! మనసును మురిపిస్తుంది
మనిషిపై ప్రేమ! మనిషిని నిలబెడుతుంది
ప్రకృతి మనిషి సంబంధం! ఒక జీవన సూత్రమయం

అగ్ని శిఖలు చుట్టు ముట్టి భయపెట్టినా
పెను తుపానులో గాలి ఎత్తుక పోచూచినా
మానవ జీవనం ఆగదు, సమాజ చలనంలో
సమస్య నెదుర్కొనే సాహస పాత్ర వహిస్తుంది

37.

మెరపు పిడుగు మబ్బులో, పక్క పక్కనే
పూవు ముల్లు పరిమళం దగ్గర దగ్గరగా
మనిషి మనిషితో, బ్రతుకులో తోడుగా
మెరపు పిడుగు! పూవు ముల్లు! గంధం మనిషిలో

ప్రతి క్షణాన్ని గతం తన లోకి లాక్కొంటుంది
ఇవి అన్ని కలిసి పోతూ శిఖరాలను చూపుతాయి
స్మృతిలో మానవ కథలో గుర్తులుగా నిలుస్తాయి
ఉన్న క్షణం దీపంలా ఆశను నిలుపుతుంది

కొన్ని క్షణాలు చరిత్రకు ఆకృతి రేఖలుగా
కొన్ని క్షణాలు మనుషుల చర్యను ప్రశ్నిస్తాయి
సృజన విలయ చర్యలు నిరంతరంగా
ప్రకృతితోపాటుగా సమాజ గమనంలోనూ

38.

అనుకోకుండా కాటేసే పాము అయినా
ప్రాణిని ఆహారంగా పొందే పులి అయినా
ఆత్మహత్య అయినా పరహత్య అయినా
అదొక విషాద ఘటన! మానవ సంస్కృతి భిన్నం

జీవితాన దృశ్యం మారుతూ క్షణ క్షణం కొత్తగా
తను చేసే పనియే ఘన మనుకోవడం సహజం
నిరాశ నుండి ఆశ మొక్కయై పైకి వచ్చి
తనను పలకరించేననే విశ్వాసం సహజం

ఒకరు మరొకరిని మిన్నగ దాటి పోవాలని
పైకి ఎగిరి పట్టు దొరకక జారేరు!
గాలిలో దూది బొమ్మలై పోయేరు !
నేలపై అడుగులతోనే జీవితాన సార్థకం

39.

నిలయం బంగరు పంజర మయినా
వ్యక్తి స్వేచ్ఛ పరిమితమై ఆలోచన సంకుచిత మవుతుంది
రూపం బంగరు విగ్రహ మయినా
మనిషి గుండె స్పందన వినిపించదు. జడీ భూత మవుతుంది

స్వేచ్ఛా వాతావరణంలో బయటికి వస్తే
అనల చర్యతో ఒకరు చాలు! వినాశనానికి
పొగల మాటున నేర చరితుల చలనం!
బాధామయ దృశ్యం! బ్రతుకులో భాగమవుతూంది

సమాజంలో అగ్ని శిఖల స్వేచ్ఛా విహారం
పొగల ముసుగులో, ప్రజాస్వామ్య శక్తికి ఛాలెంజ్‌గా

కలహాల నుండి శాంతికి! ప్రస్థానంలో
శ్రమ జీవన శ్రేణుల్ని మానవీయ కళతో
తీర్చడమే! వర్తమాన పాలకుల కర్తవ్యం
ప్రజాస్వామ్య దార్శనికం విలువలు కాపాడుతూ

40.

వ్యక్తి సమాజం గురించి చెప్పే దార్శనికాలెన్నో!
నిర్వచన ప్రబోధాలతో! ఇప్పటి వరకూ
ఇదొక ప్రకాశ పథం, ఊరటగా ఎదురుగా
విషమ పరిస్థితుల నుండి గట్టెక్కించేనా?

మంచు శిలల వలె గడ్డ కట్టిన స్థితుల్ని
కరగించి ప్రవహింపజేయడమే వీటి పని!
వాదాలెన్ని వచ్చినా, ప్రబోధాలెన్ని చేసినా
దీనికి వ్యక్తిలో వివేక కిరణ గుణ మవసరం

ఆగ్రహావేశాలతో చేతి కందేది కాదు
ఉదగ్ర చర్యలతో సాధించేది కాదు
సమాజ శ్రేయానికి ముఖ్యమైన దార్శనికం
ప్రేక్షక పాత్రలో మౌన శిలగ ఉండ లేదు
భేదంలో స్వార్థంలో వ్యక్తి శక్తి కీలకం

41.

సమాజ జీవన భూమికతో కవిత
ఎపుడే మలుపు తిరగేదీ తెలియని ప్రవాహం
సుధనో వ్యథనో బొట్టు బొట్టుగ జారుస్తుంది
మనసు నుండి శబ్దం భావాకృతి పొందుతుంది
కళ్ళలో మెరపుతో ముఖంలో తళుకుతో
ఎగిరి వచ్చి వాలుతుంది పాల పిట్టలా

ఊహా మాత్రంగా ఉన్నది మాటలలో
బయటికి వస్తుంది ఆకర్షణీయంగా

ఉత్తరం పోస్టు చేయడం మరచి పోవచ్చు
వేళకు చేయాలిసిన పని మరచి పోవచ్చు
కవిత వెడలడం మాత్రం ఆగదు
ఉదయ రశ్మిలా ప్రతి ఎదను స్పృశిస్తుంది
చిన్న పెద్ద కులం మతం లేమి కలిమి
భేదం లేకుండా, సర్వజన సమాన భావనతో

42.

రాత్రి అయినా చీకటిలో మానవం
ఎత్తిన మనిషి చేతిలో కత్తిని గుర్తిస్తుంది
నేలపై నెత్తురు చారల చిత్రంలో దాగిన
హంతకుని ముఖాన్ని మదిలో దింపుతుంది

రాత్రి చంద్రుని వెన్నెల వలె
పగలు సూర్యుని వెలుతురు వలె
అందరికీ స్వాగతం పలుకుతుంది
అర్థచ్ఛాయలతో అక్షయ నిలయం కవిత!

రుచు లెన్ని విధాలో! కవిత లన్ని తీరులు
ఎవరికి ఇష్టమైన రుచి వారికి ప్రియం
మరొకరి రుచి భేదాన్ని ప్రశ్నించే వీలు లేదు
ప్రియమైన వన్నీ పాల్గొనే విశేష సందర్భంలో
అది ఉగాది ఉదయం! ఉత్సవ కళతో
నాలుకపై వివిధ రుచుల సమూహ నృత్యం!

43.

చేతిలో గులాబి పూవుతో మొదలయిన రోజు
బ్యాగ్‌లో బాంబుకై చెకింగ్‌తో ముగుస్తూంది

వీధిన ఒంటరిగా నిలిచిన రాత్రి దీపం
తాను మేల్కొనీ మరొకరి విశ్రాంతిలో కాపలా!
భయం లేని స్థితికి అవకాశం కల్పిస్తుంది
దారిన వెళ్ళే మనిషికి ధైర్య హస్త మందిస్తుంది

కాలానికి అవసరస్థితిలో వెలుగును చూపిస్తుంది
వచ్చే ఉదయం దాక! ఆశను ఆరనీయదు

నేర భావ రూపాలకు భయద స్పర్శతో
శాంతమనో మూర్తులకు అభయ ముద్రతో
పొంచిన ఆపద అడుగుల్ని వెనక్కి వేయిస్తుంది
దీప స్తంభం వెలుతురు! మతి ప్రభకు సంకేతం

44.

ప్రతి వ్యక్తి తన స్వేచ్ఛకు ఆకాశావకాశంతో
మరొకరి స్వేచ్ఛకు మితినీ నియతిని కోరేను
వైరుధ్యంలో విభేదాలతో లౌకిక తంత్రం
క్లిష్ట దశను చేరడ మొక! సమస్య సహజం

ఏది అవసరం? అవసరమేది? ఏది పాపం?
జీవన వాస్తవంలో! జననమా? మరణమా?
ఈ బ్రతుకంతానా? ఎవరికెంత వరకు?
ప్రశ్నలకు సమాధానం! ఎవరి అనుభవంలో వారిది!
అయినా సమాజ స్పృహతో సమా చరణ మవసరం
వికాస ప్రక్రియ మాత్రం నిఖిల మానవ భావనతోనే!

పాపాన్ని వదలించుకునే వీలుతో
పుణ్యాన్ని కొనగలిగిన వారూ ఉన్నారు
హక్కుల రక్షణ పాలనలో ప్రజాస్వామ్య విజయం
జనుల భావ తరంగాలపై కవిత! కదలుతుంది

45.

పుట్టిన స్థలం నుండి దూరమయిన మేఘం
పయనం సాగించి పూర్వ నిలయం చేరేనా?
బయటికి వచ్చిన కవిత కూడ అంతే!
కవికి దూర మయి సమాజ పరమవుతుంది

దాహం ఆకలి ఇప్పటివా? పుట్టుక నాటివి
జంట కవిత్వం వలె, కలిసే ఉంటాయి
వీటిని తృప్తి పరచడమొక ఒక తప్పని పని
వీటి అవసరం తీర్చడమొక సమాజ బాధ్యత

చీకటిలో భయపడవలిసి వచ్చినప్పుడు
ఉపాయంతో దీపం వెలుగు ఆదుకుంటుంది
భయం తొలగుతుంది, దారి కనిపిస్తుంది
మనుషుల కలయికతో, బంధం దృఢ మవుతుంది

బ్రతుకులో విజయం! కొత్త జగం చూపుతుంది
మనిషిలో చేతన! సార్థకతను పొందుతుంది

46.

మార్గంలో నెత్తురు చిందే దుర్ఘటనలు
ప్రాణులపై మనుషులపై వాహన రూపంలో
కారణ మేదయితేనేం? ఆపద వశం చేసి
చకితంగా! సమయం! వెళ్ళిపోతుంది
వెనక్కి తిరిగి చూడకుండా!
బాధితుల్ని హాస్పిటల్ వరించవచ్చు
నిహతులు మృత్యు వశమై పోవచ్చు
ప్రవహించే కాలం క్షణం కఠిన శిల అవుతుంది

ఎవరు దోషి? నేరం ఎవరిది? ఎంతటిది?
ప్రశ్నల్ని అధిగమించి భ్రమల్ని తొలగించి
కఠోర వాస్తవంపై మనిషిని నిలుపుతుంది సందర్భం
మనుషుల వికార చిత్రం బయటికి వస్తుంది

47.

ప్రతి వ్యక్తి తన చుట్టు నచ్చిన మనుషుల్ని కోరేను
నచ్చిన వారితో నచ్చని వారినీ ఎవరు ఆపగలరు?
తాను బ్రతుకు తూన్న సమాజ చలనంతో సంబంధం
తనలో ఎన్నిక పైనే జరగదు! తన తోనే ఆగదు

పాట అంటే ఎంతో ఇష్టం కావచ్చు
పాడేందుకు గళంలో అనుకూల్య మవసరం
కవిత అంటే ఎంతో ప్రియం కావచ్చు
పలికేందుకు మనసుకు సృజన గుణం అవసరం

తనకు లభించిన నీడను భవనంగా మార్చలేరు
ప్రతి రోజు సానుభూతి ప్రకటన పొందే
ఆ బ్రతుకుల కస్తిత్వం ఎక్కడుంది
దైనందిన వ్యవహారంలో భాగమయిపోతూంది

చేతిలో బ్యాగ్‌లో అక్కర లేనివి తొలగించినట్లు
మనసులో అక్కర లేనివి తొలగించే వీలు లేదు

48.

అవసరాన్ని బట్టి లౌకిక మెన్ని దుస్తులు మార్చేనో
గుర్తు పట్టరాని విధంగా తయారవుతుంది
కల్లోలంలోనూ సముద్రం నీరు దుస్తులు వదలదు
తుపానులోను జలదం! నీలి దుస్తులు వదలదు
మండే ఎండలు జలధిని మంటలతో నింపాలని
కానీ! అది జలదానికి జన్మ హేతు వవుతూంది

జీవితానికి రెండు కొసలు ఏకాంతం సామాజికం
ఒక కొన నుండి మరో కొనకు పయనమే జీవితం

పని సాధించేంత వరకు ఆచరణ క్రియలో
మేను పైన గాయాలెన్నో ఎన్నిసార్లో!
ధూళి! మరక! తప్పు! పశ్చాత్తాపంతో
ఒకసారి శుభ్రమై! అది చివరది కానే కాదు
ఇది నిరంతర ప్రక్రియ! జరుగుతూనే బ్రతుకంతా
స్వచ్ఛమైన యశోరూపానికి! స్వాగతమే, వీడ్కోలు లేదు

49.

ఆశలో సూక్ష్మతల్ని మర్మాల్ని చూపుతుంది
కవిత! ముందుగ అనుకోని శబ్ద దృశ్యంతో
క్షితిజం బుజాన వేలాడే మేఘంలా
పిల్లల వీపున పుస్తకాల బ్యాగ్‌లా

తళతళ మెరసే కాటుక కన్నులలో
ఉబికే సంతోష బాష్ప బిందువు వెనక
దాగిన అనుభూతిని! ప్రతి ఫలిస్తూంది
జీవన నిజ రూపాన్ని బయట పెడుతుంది

స్వరంలో కదలే ధుని అలలతో
పదానికి అద్దిన భావ పరిమళంతో
మనసు మహా ద్వారం తలుపులు తెరవబడీ
వచ్చే జనతకు బంధువుగా వర్తిస్తుంది
మదిలో మానవ విజయ శిఖరం నిలుపుతుంది
ఇది ఏ ఒకరిది కాదు, అందరిదీ, ఎప్పటికీ

50.

చీకటి బుజాలపై చేయి వేసి కవిత
స్నేహ సుందర దీపమై రాత్రిని దాటిస్తుంది
చీకటిలో వెళ్ళే మనుషులు! ఆ వెనకనే
నడక మొదలు కాగానే చేరే వారెందరో

బయటి ప్రపంచానికీ లోని ప్రపంచానికీ
తెర తొలగిన విశేష సందర్భంలో
జన పరిచయంలో ఆదర హృదయంతో
ఏకాంతం నుండి సమాజ తలం చేరుస్తుంది

పొదల చాటు నుండి బయటికొచ్చే హరిణంలా
తల్లి వేలు వదలి నడచే శిశువులా కదలుతుంది

పంజరం నుండి బయట పడిన పక్షిలా
గోడల్ని దాటి ముక్తమైన స్వేచ్ఛలా
పడిన శ్రమను మరపించే ప్రతిఫలంతో
ప్రజాస్వామ్య స్పృహకు! ప్రతినిధి అవుతూంది

51.

పూల చెట్ల మధ్య నుండి
ముళ్ళ పొదల వెనక నుండి
బాల సూర్యునిలా మెల్లగా
అవని పయి అడుగులు వేస్తూ నడుస్తుంది
అడవిలో సింహంలా కవిత! ఒక్కొక మారు
అంచనాల నధిగమించి దార్శనిక ప్రభతో

సమాజ వనంలోకి దారి తప్పి వెళితే
పట్టుబడి ప్రదర్శన శాలలోకి! నేరుగా
సింహానికీ జన తకూ మధ్య అద్దాల కర్టెన్
ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు కనబడుతుంది

అటు ఉన్న సింహం ఇటు ఉన్న సమాజం!
ప్రేక్షకుల నలరించే వినోద దృశ్యం కావచ్చు

ఒకరికి రాజస తైజస ప్రభుత తోచవచ్చు
ఒకరికి స్తూపంపై చెక్కిన సింహం గుర్తుకు రావచ్చు

52.

గతం ఎవరికీ బరువు కాదు
పర్వతం లాగ ఒక చోట ఉంటుంది
ఒక విధంగా పురాబంధుత కలిగింది
పుష్పరాశి కాకపోవచ్చు
కంటక తతి మాత్రం కాదు
శిలల మధ్య నుండి అక్కడక్కడ చెట్లతో
పచ్చదనం! ఆశా రూపంలో చేతనతో
మరచిన విలువల్ని, జ్ఞప్తికి తెస్తుంది

వర్తమాన మెప్పటికీ పరిచయ స్థాయిలో
ప్రశ్నల్ని సంధిస్తుంది, జవాబులు కోరుతుంది

ఆలోచనా తూణీరం నుండి కవిత వెడలుతుంది
అయిపోయిందనకున్నది తిరిగి వెలుగు చూపుతుంది
అడవి నుండి సింహంలా సమాజంలో దార్శనికం
ప్రజలో ఒకటయి స్నేహంతో ప్రగతి చిహ్నమవుతుంది

53.

నేలపై నడకకు భూమి బరువుతో సంబంధం లేదు
బ్రతుకులో దార్శనికతకు అద్దంతో పని లేదు
దొరకిన పురా వస్తువులతో చరిత్ర నిలయం
శిథిలాల నుండి ఎవరికి ఇష్టమయింది వారు ఎన్నుకొనేరు

ఇది జీవన నిర్మితికి మూలాలను కూర్చేది
ఆదర్శ రూపానికి ఆధార తలమవుతూంది
జలధి దయతో జలదం తరలుతుంది
జలదం దయతో పైరు పంటలు ఆహారం
ఇలా వెళ్ళే కొద్దీ గొలుసులా ఏర్పడ జేసే
జీవన హేతువులొకటొకటీ! అర్థవంతమై

ప్రతి ఒకరికి ఆ రోజు హ్లాదంగా సాగాలనే
అనుకున్నట్లుగ అన్నీ జరిగితే! మనిషి ఈ నేలపై నిలిచేనా?

54.

ఓటమి నెవరు కోరు కుంటారు?
గెలుపుకు ఎత్తులపై ఎత్తులు
జ్వలన్నవ మతితో, చలన శీల కళతో ఒకటొకటీ
మోతాదు మించితే, నడచే అగ్ని శిఖలు ఎదురుగా

అంటిన మంటల నార్పే ఉపజ్ఞ! మనిషిలో
ఉదార జలద హృదయంతో, నైతిక క్రియతో
అగ్ని నుండి భయాన్ని ముక్తం చేస్తుంది
స్వేచ్ఛా యుగానికి ఉదయ రాగ మిస్తుంది

స్నేహ వల్లియైన అగ్ని ఉపకృతి అవుతుంది
అవసరాలకు తగిన శ్రేయో రూపం వహిస్తుంది
సాహసమూ ధైర్యం వీరానికి ఇరు చేతులు
ఆపదలో మనిషిని ఆదుకునే అభయ శక్తులు

చేతిలో కప్ టీ రుచి కవితను ప్రేరేపించేనా?
అందరిదీ! అవుతుంది పుష్పక విమాన యానంలా

55.

బయట ప్రపంచంలో జన జీవన దృశ్యం
మనసు నుండి కవితగా అక్షర గతమై నవమై
మొదటి శ్రోత కవియే, తరువాత ప్రియ సఖి!
గాలి చేర వేస్తుంది! సహృదయ లోకానికి!

పొద్దు పొడిచే సమయంలో! రోజూ
రైలు విజిల్ బస్ హార్న్ శబ్దం వినిపిస్తుంది
కవిత్వ రచనకు అలార్మ్! ఒక ప్రేరణం
ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగుతుంది! ఇంపుగా

కాఫీ సేవనంలో ఉత్తేజం, పదునుకు సిద్ధం చేస్తుంది
ఎన్ని ధ్వనులొ స్థితులొ మధ్య! కవిత అలవోకగా
పారాడే శిశువులా మనో రూపం! కదలుతుంది
ఎవరి పనులలో వారు! అలికిడి వినబడుతుంది
స్వేచ్ఛా మార్గంలో పత్రికలో వార్తల పంక్తులు
జీవితం రైలును నడిపించే ఇనుప పట్టాల్లా

56.

బాధల తలుపులు తెరవబడీ కవికి అయితే
ఆ బ్రతుకులో ప్రవేశం సులభంగా లభిస్తుంది
అననుకూల స్థితులలో క్రుంగిన మనసుతో
ఆత్మ హత్యల దృశ్యం సాధారణమవుతూంది

సమస్యలు చుట్టు ముట్టిన విషాద వాతావరణంలో
ఎవరికి అనాథ శరణాలయ కాకూడదు! సమాజం

శ్మశానంలో మంటను తలపించే జీవన క్షణం
మనిషిని అగ్ని పరీక్షకు గురి చేస్తూంది
స్వర్ణ ప్రతిమయై బయట పడేనా?
భస్మ రాశియై ఎదుట నిలిచేనా?

ఒడుదుడుకులు అడ్డంకులు విరమణలో
స్థితి చిత్రణకు ఆకాశం కాన్వాస్ అవుతూంది
కనిపించే పుష్పం చెట్టుకు చివరది కాదు
డైరిలో పేజి!తో అనుభవం అంతం కాదు

57.

విస్మరించ రాని స్మృతుల సంకలనం చరిత్ర
మనిషిలోని గుణాలతో దోషాలూ కార్య కారణాలలో
నిరాశ నుండి అనల కణం జారితే ప్రమాదం
దహన చర్య కన్నా సహన శక్తి అవసరం

తెలుపు కాదు అంటే నలుపే కానక్కర లేదు
"నిజం" మాత్రం బయట ప్రదర్శనలో వస్తువు కాదు
పలు కోణాలలో మెరపులతో కనిపించే వజ్రం
భావనలో మనోజ్ఞమయి కవితలో ప్రతిఫలిస్తుంది

మనిషికి యశస్సులో తన రూపం నిలబడాలనీ
మనసు లోని ఆశా తరువు సుమించాలనీ
గోడకు చిత్రంగానో ఎదుట పచ్చని చెట్టుగానో
కూడలిలో నిలిపిన విగ్రహం! గానో వెలయాలనీ

ప్రతి వ్యక్తి బ్రతుకులో శక్తికి తగిన శ్రమతో
సమాజానికి కానుకగా ఒక పూవుగానో ఫలంగానో!

58.

శిథిలాలను తవ్వితే అమూల్యాలు దొరకేననే!
చినుకుతో మట్టి నుండి మొక్క నవ్వు ముఖంతో
అవసరాలకు నీడతో సుమ ఫలాలను ఇస్తూ
అది చెట్టయి ఎదిగి చరిత్ర పుటనలంకరించవచ్చు

ఏదో కారణంగా ఎపుడో జరిగిన ఘర్షణ మరచి
ఇపుడు స్నేహ కమలం విప్పారాలనీ మానవ సహజం

కవితలో మాటలు! దివిలో చుక్కలయ్యే కన్నా
భువిలో చెట్టుకు పూలు పండ్లతోనే సార్థకం

మారణ కృత్యాలతో దారుణ దృశ్యాలతో
నైతిక పతనంలో దిగిన గ్రాఫ్‌ను చూచి
"ప్రమాదంలో ప్రజాస్వామ్యం" ఉన్నట్లనిపిస్తుంది
విషాద సమాధిపై జారిన కన్నీటి చుక్కలకు
కోరిక మొలకెత్తాలనీ! సమాజ కథలో భాగమై
అంతరంగ చేతనతో తేరుకొని నడిపిస్తుంది

59.

ఎగర నున్న పక్షి! రెక్కలు ముడుచుకొని ఉండదు
ఆర్చుతుంది, ఉత్సాహం విప్పారుతుంది ఆ క్షణం!
కాళ్ళు నిలిస్తేనే నడక ముందుకు సాగుతుంది
అడుగు తీసి అడుగు ముందుకు చేతనతో జీవితం

పక్షికి ఆకాశం తన రెక్కల కిందికి రావాలని
మనిషికి భూమి తలం తన అడుగుల వశం కావాలని
నాగలి చాలులో మనిషి అడుగు జాడ
రేపటి మొక్కలకు అవకాశం ఇస్తుంది

ఈ దారు లెవరివి? ఈ సంపదలెవరివి?
ఈ భూమి పయి శ్రమ జీవుల రూపాలవి!
రోజు లెన్ని మారినా నమ్మకం కలిగేనా?
నమ్మిన దార్శనికం అనుభవానికి వచ్చేనా?

60.

చెట్టు నీడ స్థావరంగా ఒకరు నిరాశ్రయులు
చెట్టు కొమ్మపై గదిలో ఒక కవి నివాసం
పచ్చ దనంతో చల్లగా పక్షి గూడు తోడుగా

జీవికలో కట్టెలపై చూపుతో గొడ్డలితో ఒకరు!
ఆపద అనివార్యమై ఆలోచన జ్వలిస్తుంది
బదులు చూపలేని పక్షి! గూడు వదలిపోతుంది

ప్రాణి గురించి వేదన, మనిషి గురించి చింతన
మానవ వికాస దశలలో మనిషి పాత్ర కీలకం
ఆర్ష భావ గమ్యం నుండి ప్రజాస్వామ్య లక్ష్యం వరకు
సమాజ హితం కన్నా స్వయం గతి ముఖ్యం కాదు

పామును పక్షిని చెట్టును ప్రతిమను పూజించే
మనిషిలో మనిషిని మన్నించే మనో రూపం అవసరం
ఈ విశాల సృష్టిలో దేని స్థానం దానిదే అమూల్యం
అన్నిటినీ స్పృశిస్తుంది కవిత! మానవ హృదయంతో

61.

భూమి కనే కలలు! ప్రకృతి మనిషి సౌభాగ్యం
నదులు కనే కలలు! పచ్చని సమాజ రూపం
మనిషి కనే కలలు! తన సుందర జీవన రూపం
బయటి నుండి లోనికి, లో నుండి బయటికి! ఆలోచన

చేతి వేళ్ళ గోళ్ళు చాకులు కాలేవు
ప్రాణ భయం అంచున వ్యక్తి చర్యలో
ఆపదలో కత్తికి బదులు కావచ్చు!
ఎవరి గాయాల్ని వారు వహించక తప్పదు

జలధి తాప పరివర్తనలో తుఫాను
రోజూ వచ్చేది కాదు! అదే చివరదీ అవదు
అనుకూలం కాని దానికయినా కవిత
హేతువుతో వదలని ఆకర్షణ నిస్తుంది

62.

జీవన స్రవంతిని ముక్కలు చేసే ఆలోచన
స్వార్థంలో సంకుచితం, మానవ సంస్కృతికి వ్యతిరేకం
ఇది మనిషి కాలక్షేపానికి పనికి రావచ్చు
వ్యవహారంలో ఏదో మిషకు తోడ్పడవచ్చు

అనుభవ గతిలో కవితకు పదం వెదక నక్కర లేదు
ఉన్న దానికి ప్రాణం పోస్తే చాలు!
ఉన్న దానికి తేజం వస్తే చాలు
ఉన్న స్థితిలో మార్పుతోనే అభినవం

ప్రతి పదం ఒక విధం పూవై
కవిత! పూల వనం కావచ్చు
పద పదం ఒక ఆయుధమై
కవిత! రణ దృశ్యం! చూపొచ్చు
జీవన చలనంలో ఆయువుతో కవితకు
స్పందనలో సమార్ద్ర హృదయంతోనే అస్తిత్వం

63.

నది అలలను చూస్తే ఊహలో ఆర్ద్రత ఉబుకుతుంది
నిలిచిన కొండను చూస్తే స్థిరతకు ఆసనం లభిస్తుంది
దారి ప్రక్క అనల శిఖల నుండి ఎగసే పొగ
నీలి మబ్బుగా చూడాలని కోరిక! యువతలో

ఇసుక కణాన్ని చూస్తే కట్టబోయే నిలయం
ఇనుప ముక్కను చూస్తే యంత్ర యాన రూపం
యువ మనో గగనంలో కాంక్షా చిత్రాలు
అనుభవం పెరిగే కొద్దీ వాస్తవం నిగ్గు తేలుతుంది

అడవిలో దారి తప్పడం జరగవచ్చు
ఊరులో దారి తప్పడం మానసికం
తల క్రిందులుగా నడచే సర్కస్, వినోదకరం
సాధారణ జీవన గమనంలో ఇది అసంగతం

64.

చరిత్ర! ఇంటి ముందు ఉత్సవ తోరణం కాదు
నెత్తురు కన్నీళ్ళతో రూపొందిన జీవిత చిత్రం

మేడి పట్టుకొని దున్నే అర చేయి కాయలు కాచిన కర్షకులు
పల్లకి మోసి మోసి బుజాలు కాయలు కాచిన వాహకులు
అవసరమైనంత వరకు ఎప్పటి నుండో ఇప్పటికీ
భౌతిక మానస స్థాయిల్లో జీవన భాగంగానే!

నడచే మనిషి లలాట మొక జయ పతాకగా
నిలవాలని సమయ సమయం! సూచనలు

స్ఫటికంలా ఒక క్షణం! తళతళ లాడుతుంది
పూవులా ఒక క్షణం! అందంగా బయట పడుతుంది
చాకులా ఒక క్షణం! ఎదురు పడుతుంది! సూటిగా

జల బిందువు బదులు ఇసుక రేణువు జారవచ్చు
స్వర్ణ కమలం బదులు నరక ఖడ్గం చూపవచ్చు

ఎంతటి ఆకర్షణలోనూ జలధిలో కలవాలనిపించదు
ఎంతటి మోహక మయినా! నింగిలో కలవాలనిపించదు

65.

మానవ పరిణామంలో అనుభవ రమణీయాలు
దశ దశలో సాహిత్యం యుగ యుగాన సంస్కృతి!
ఇవి జీవన నాణానికి ఇరువైపులలో
దీని చేతనే మనిషి స్థాయి! సంఘంలో విలువ

ఈ ప్రపంచ తెలుగు సమావేశ మనోజ్ఞ దృశ్యం
చూపుకు దూరమైనవి తరలి కనుల ముందు నిలిచేను
మనసుకు అందనిదీ, దిగి ఊహలోన మెదలేను
మహనీయుల అస్తిత చాటే కీర్తి తోరణ విభవం
చెదరని దీక్షా యత్నంలో ఫల రూపం
రానున్న భవితకు ప్రేరణయై నిలిచేను

వర్తమాన చలనంలో ఆకర్షణ రూపమై
తెలుగు భాషా సంస్కృతి ప్రవాహ సదృశమైంది
ప్రాంతాల తీరాలను హత్తుకొని సాగేను
మానుష శక్తికి ప్రయోజన దిశను చూపేను

66.

ప్రాంతం భాషా సంస్కృతి ప్రత్యేకతతో
ముఖాన ఉదయ కిరణ శోభా చిత్రంతో
ఆవేశంతో పాటు ఆశా బంధంతో విచ్చేసేను వెలుగులు
చిన్న చిన్న చీకటి ముక్కలు తమ దారిని చూచుకునేను

కాలం స్వాగత కరాలతో ఎదురయి ఈ సమయంలో
మనిషికి తన శక్తుల ప్రకటన పథం చూపుతూంది

ఎప్పటివో గాయాలను తలచుకుంటూ
దిగులుతో మూలన ముడుచుకోవడం! వైక్లబ్యం

నిరసన గళం అడుగును నిలిపేస్తుంది, ఉన్న చోటునే
నిరాకరణం ఉన్న చోటు నుండి అడుగును వెనక్కి వేయిస్తుంది

ఇది బొమ్మల ప్రదర్శనం కాదు, ఆట కాదు
నిరాశకు తావులేని నిష్క్రియతకు చోటు లేని
అభిమానం అభిలాష చరణ యుగంతో
అంకితమై పోయిన తెలుగు వెలుగు ఉత్సవం

67.

మేఘం వదలుతుంది ఉదార జల ధారల్ని
కోపాన్ని క్రోధాన్ని హద్దుల్లో ఉంచుతుంది!
మనిషిలో దయను త్యాగాన్ని పెంచుతుంది
కళ్ళలో బాష్పలవాలను పూలుగ మారుస్తుంది

పచ్చని చెట్ల ఆకుల పయి ధూళిని తొలగించి
పై నుండి జలం శోభామయం చేస్తుంది
ఎడారి కొండలు అడవి జన పదం అన్నీ
సృజన విషయంలో ఏ భేదం చూపదు మేఘం!

కవి ఊహ భిన్నం! శిష్టం! సారమయం
రాతలోనే కాదు మాటలో! కల్పన సాకారంగా
కనిపించే జగతికి సమంగా కనిపించని జగత్తు
కవితలో అక్షర దృశ్యంలో! సృజన వికాసం

68.

మనసులో పడిన కలహ బీజంతో
పొదలా అడవిలా మార్పులు ఆలోచనలో
మనసులో పడిన స్నేహ బీజంతో
తీవెతో తోటతో మార్పులు అనుభవ గతిలో

తాపాన్ని అదుపులో పెడుతుంది మేఘం
చల్లని అనుభవ దృశ్యం! ఎదురవుతుంది
రాగానికి విజయానికి చోటు దొరుకుతుంది
సహనానికి శాంతికి ఆకృతి లభిస్తుంది

దేహంలో ఉత్సాహం! రుధిర ప్రసారంతో
రక్తంలో ఉద్రేకం! వెచ్చని సంస్పృహతో

చరణంలో ఉద్వేగం త్వరమాణ గుణంతో
వ్యక్తి నుండి సంఘానికి మలుపులతో జీవితం

మదిలో భావ స్థానాలు హార్మోనీ మెట్లలా
బ్రతుకులో స్వర నేపథ్యం! ఊహలో క్రియలో

69.

ధనం ఇల్లు వృత్తి ఉద్యోగం మరొకటి
వీటి నంటుకొనే ప్రకాశ రూపాలొకటొకటీ
వితరణం ఆశ్రయం నిపుణత వ్యవహారంతో మరెన్నో
ప్రతి వ్యక్తి అస్తితలో ఏదో ఒక వ్యాపకం

పేదరికం చీకటిలో భాగ్యంలా వెన్నెల
జీవన నిశి ఆకలిలో అవసరం తీర్చేనా?
విషమ మయిన సందర్భంలో హేతువుచే
కిరణంలా పని చేసేది! వివేక స్ఫూర్తి ఒకటే

సత్క్రియను సంపదను మరో తరం అందుకునేను
ఏ బ్రతుకు శూన్యం కాదు, నిరాకరణీయం కాదు
వర్తమానం వదలి ప్రతి క్షణం భవిత నందు కునేను
అలను మరో అలలా మనిషి మరో మనిషిని చేరేను

ఎపుడో పుస్తకంలో ఉంచిన రూపాయి నోటులా
జ్ఞాపక చిత్రాలతో గుర్తులు! గతాన్ని తలపించేను

70.

గురి పెట్టిన ఆయుధానికి, ఫలితమేమయినా
ఆ గురి తగిలే రూపం గురించి చింతనతోనే

మతిలో దార్శనికం ఉట్టిలా వేలాడుతూ
ఉట్టిలో ఏముందీ అందరికీ తెలియనవసరం లేదు
ఉట్టిని అందుకునే యత్నంలో అందరూ
క్షణాలు జారిపోయి! అందేదొకరికే! ఆ అదృష్టం

నిప్పంటిన అదర్శ శిఖరం నిరాశను మిగిల్చేను
నెత్తురు చిత్రంతో నేల, భయ భావం కలిగించేను
అనుమానం కలుగుతుంది, ఆలోచన మారుతుంది
ఘర్షణకు హింసకూ దారి తీయవచ్చు, సంక్షోభం!

భయ పెట్టే చీకటి కెదురు తీర్చి మనిషి!
ఇంటి ముందు దీపం స్వాగత హస్తంలా
తన కోరిక కనుకూలంగా మలచుకునే
యోచనలో తిరుగుతూ మనిషి జీవితం!

71.

ఎదురయిన చీకటిని కవి! పిడికిలిలో బంధించేను
కలం నుండి వెలుతురు పావురాల్ని వదలేను
ఇవి రెక్కల చివరలతో ప్రతి ఎదను స్పృశిస్తూ పోయేను
చూపు కందినంత మేర ప్రజ ఎదలకు నిండుగా

అనుభవంలో ఒకే మనిషి ముఖాలెన్నో
సందర్భాన్ని బట్టి ఒకటొకటి ముందుకు వచ్చేను
పలు రీతులలో స్థాయిల్లో మారే బ్రతుకులతో
ఇవి మనో జగంలో రూపాలకు ప్రతినిధులు!

తను కోరే రూపం కయి అన్వేషణ సాగుతుంది
కనబడే ముఖాలలో వెదకడం జరుగుతుంది
ఒక పనిలో మరో పనితో అల్లికయై జీవితం
వివిధతలను వికాసాలను ప్రకటిస్తూ పోతుంది

72.

విభేదాలతో వైరుధ్యాలతో చరిత్ర కలహమయం
మారణ రేఖలపై సాగిన మార్పులతో
వ్యతిరేకత శత్రుతలోను ఇరువైపుల నుండీ
ఒకరినొకరు కలిసేరు మానవ కళతో మధ్యలో

ఇది వికాస మతిలో మనోజ్ఞ సందర్భం కావచ్చు
కవితకు విషయం గురించి వెతక నక్కర లేదు

బూది పొరలు ఊది నిప్పులో ఉత్సాహం నింపి
ముళ్ళ మధ్య గులాబీని ఒడుపుగా గ్రహించి
తన వర్తనలో సుందర ఘట్టాలకు ప్రేరణగా
తనలో అతీత భావ జలాలపై తేలేను మనిషి!

కష్టాలను సుఖాలుగ మార్చే క్రియలో
జ్వాల నుండి వెలుగులో దారిని గుర్తించేను
శిథిలమయ్యే స్థావరాల నవ నిర్మాణంలో నిరంతరం
సానుకూల దృష్టిలో ఎవరి చరిత్ర వారికి ప్రియం

73.

క్రితం క్షణం కోల్పోయిన స్థితిలో
మరో క్షణం చేరుతుంది కొత్తగా
ఆ కొత్త ఏమిటి? అనే ప్రశ్నకు
సమాధాన పత్ర సంకలనం "ఇది జీవితం"

కొత్త దనం వ్యక్తిలో మార్పుకు గురి చేస్తుంది
అనుభవం పెరుగుతుంది అస్తితను పెంచుతుంది
ఆలోచనలో కొత్త దనంతో క్రియా శీలురు తమ గమ్యంలో
ఏదో కోలుపోయిన దిగులుతో నిరాశా పరులు
కాలాన్ని వశం చేసుకోలేని దుర్బలులు
పరిస్థితులపై అదుపు లేని కాల్పనికులు

విరుద్ధ మతితో శుష్కమైన మానస తరువుతో
అశాంతి బంతులయి ఆయుధ రూపాలయ్యేరు
ఇది మానవ మనోజ్ఞ శక్తికి పరీక్షా సమయం
కలహంతో ఘర్షణ పోరాటంగా మారేను

74.

ఎండకు తపిస్తూ వానకు తడుస్తూ
చలికి వణకుతూ వసంతంపై నమ్మకంతో
మానవ వికాస గమ్యం చేరే సంకల్పంతో
కష్టపడని బ్రతుకు లేదు, బాధ పడని మనసు లేదు

దిశ నుండి దిశకు అన్వేషణలో భాగ్యం కయి
చోటు నుండి చోటుకు కొత్త దనం కయి
ఈ రెండూ ఒక దాని నొకటి అంటుకొనీ
నిరంతర చలనంలో మానవం ఎగుడు దిగుడులతో

ఒకే ఒక కన్నీటి చుక్క సముద్రంతో తూగుతుంది
ఒకే ఒక బాధా శకలం అనలంతో సరి అవుతుంది
బాష్ప కణం ఎరగని మలుపులు తిరగని బ్రతుకులు
ఒక కల్పనలో! కలలో! ప్లాస్టిక్ జగత్తు లోనే సాధ్యం!

75.

అశ్వం రణాన్ని కల కంటుంది
శ్వానం దొంగను కల కంటుంది
పావురం శాంతిని తిప్పుతుంది రెక్కలపై
మనిషికి మనిషి తన నీడగ సాగాలనీ

కలం ప్రశ్న వలె నిలిచి కదలుతుంది
అక్షర పంక్తులలో జవాబులు దొరికేను
ఇవి కిరణాల వలె స్పృశించవచ్చు
ఇవి సూదుల వలె తాకనూ వచ్చు

మంచు దారి మూసినా ఉదయం ఆగదు
వాన అడ్డు కొన్నా! వెలుగులు ఆగవు
సూర్యుడు వెనక్కి మరలిపోడు
ఆలోచన ఎక్కడి కక్కడ నిలిచిపోదు

ఎంతటి అవరోధం వ్యతిరేకం లోనూ
గుండె ఎడారి కాదు, ఆర్ద్రతలో పచ్చదనంతో
ఆశా రూపానికి ఆకృతి! చూపాలనే!
మనిషి బ్రతుకు పచ్చని తోట అవాలనే

76.

గొంతు ఎత్తి పిలిస్తే మేఘం వచ్చేనా? వర్షించేనా?
మనిషి పోతలో ప్రతిమ! స్పందన గుణం పొందేనా?

ఏ ప్రశ్నకు పూర్తిగ సమాధానం దొరికిందని?
ఎప్పటి నుండో ఇప్పటికీ! అవే ప్రశ్నలు!
ప్రశ్నలు రాసులుగా చేరి గతం పర్వతమవుతుంది
పూర్తి జవాబుకై వర్తమానం నదిలా సాగుతూనే! ఉంది

బ్రతుకులో వాడని ప్లాసిట్ పూవుకూ చోటు ఉంది
కలం ఉద్యమిస్తుంది! కవితలో అక్షర సేనతో
ఉదయం కిరణం స్పృశిస్తూ వస్తుంది, ప్రేమగా
సాయం కిరణం జ్వలిస్తూ పోతుంది, దిగులుగా

కవి కాని దెవరు? ఊహలలో కల్పనలో
మాటల అలలపై గట్టుకు చేరితేనే! కవిత!

స్వేచ్ఛా కవిత్వం-83

ఇది జీవితం

(VIII భాగం)

కవిత నా ఆత్మ

మాదిరాజు రంగారావు

2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 83

IDI JEEVITHAM

(VIII Part)

(KAVITHA NAA ATHMA)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2018

Presented to
my wife
Smt. Indira

పీఠిక

"ఇది జీవితం" – బృహత్కృతిలో ఎనిమిదో భాగం "కవిత నా ఆత్మ ". స్వేచ్ఛా కవిత్వం ప్రచురణలో 83వది. వర్తమాన కాలంలో మనిషి జీవన స్థితులు, వాస్తవికత – ఆదర్శాలు, విలువలు దార్శనికతకు చెందిన విషయాలతో కూడింది. ఇందులో వస్తువు – అభివ్యక్తి – లక్ష్యం కలయికతో భావ రూపాలు ప్రతీకలు మనోవిధాలతో సృజన రూపం దృష్టికి వస్తుంది, వస్తువుకు సంబంధించినంతవరకు సామాజిక రాజకీయ మనస్తత్వ నైతిక నేపథ్యంతో సంపన్నమయింది. అయితే ఇందులో కథ ఉండదు, ఉండే వీలులేదు. స్థితుల్ని సంఘటనల్ని తలపుకు తెచ్చే ఆలోచనా ప్రసారంతో పాటు అనుభూతి గుణమూ భావనలో అనుభవానికి వస్తుంది.

ఇపుడున్న పరిస్థితుల్లో కనిపించే అలజడి – నిరసనం – ప్రతి ఘటన – ఘర్షణకు దారి తీసే అసహనం అశాంతికి సంబంధించిన భావ జగత్తు ఇందులో కనిపిస్తుంది. వ్యక్తి స్థాయిలో రోజు రోజుకూ ప్రబలుతూన్న నిరాశ అస్థిరత అనిశ్చయం నిరాకరణం తలపుకు తెస్తాయి. ఈ దుస్థితి వ్యక్తులలో సంకల్ప బలం అంకిత భావం శ్రమతత్వం లక్ష్య శుద్ధి కోల్పోయిన మనో రూపాల్ని సూచిస్తూంది.

ఈనాడు వస్తూన్న ఆధునిక కవిత్వం సమాజమూ – జన జీవితమూ వలెనే, కవిత్వమూ – కవి వ్యక్తిత్వమూతో ఎంతో వైవిధ్యాన్ని పొందింది. స్థానీయం నుండి ప్రపంచీకరణం దాకా విషయం విస్తరించింది. దీన్ని సులభంగా గుర్తించవచ్చు.

ఈ కవిత్వం వ్యక్తి స్వేచ్ఛతో సమాజ వికాసంపై దృష్టితో వర్తమానం నుండి భవితకు వాగ్దానంగాను నిలుస్తుంది. ఈ విధంగా ప్రజాస్వామ్య దార్శనికతతో సమాజ లక్ష్యం తీర్చబడింది. ఇది ఈ కవిత్వం యొక్క ప్రయోజన విస్తృతిని భావింప చేస్తుంది. ఇది ఉత్తమమైన విలువలకు అవకాశంతో సమాజ సంస్కృతిని వికసింప జేసే విధంతో, వ్యక్తి స్థాయిని పెంచే భౌతిక మానసిక స్థాయిల్లో ప్రత్యేకత అనుభవానికి వస్తుంది.

– మాదిరాజు రంగారావు

ఇది జీవితం – కవిత నా ఆత్మ
(ఎనిమిదో భాగం)

1. పోవలసిన గమ్యం

ప్రతి తరం కొత్త దయిన తన అస్తిత్వంతో
పథ పథాన ఒకరొకరు తమ వ్యక్తిత్వంతో
వెనక నుండి శతాబ్దాల వికసన పరిణతులతో
పరిణామంలో బహు విధ ప్రభావ రూపాలతో

ప్రతి తరం విశాలమయిన సమాజ చరిత్రతో
వర్తమాన లిప్తల పంక్తిపై నవ భావనతో
ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికం వెలుగులో
ఇది స్వేచ్ఛా కవిత్వం, అభినవ సృజన భవం

హననం దహనం శోషణ పీడన బాధా చర్యలు
సంఘంలో మనుషుల నావహించి ఎప్పటి నుండో
చేతన ఆర్ద్రత రాగం తేజం బ్రతుకులో
అవసరమయినవి ఎప్పటికీ ప్రగతిలో

విజయం ఆయుధ బల సంపదతోనా?
జన మత విశేష బల పవనంతోనా?
న్యాయంతో ముడి పెడితే పొందిన 'విజయం'
ఏది న్యాయం? ఏ వైపున? ఎంత వరకు? ఎవరిది?

ఎవరి దృష్టిలో వారికి, న్యాయానికి అర్థం
నాలుగు దిశల నుండి! తీగెలుగా అల్లుకొని
రకరకాల పూలతో! విప్పారేను
ఇష్టమయిన మది కొకటి హ్లాదంగా
దేని కది సమాజ చలనంలో భాగమై
కనిపించీ కనిపించని కార్యకారణ వశమై!

ఆదర్శంలో తప్పనివి ఒక వైపు నుండి
ఆచరణంలో తప్పనివి ఒక వైపు నుండి
ఎప్పటివో పాతబడిన గాయాల గుర్తులతో
ఇప్పటికీ సానుభూతి ప్రదర్శనం కోరేరు

గడచిన దూరంపై కన్నా! ఇప్పుడు మాత్రం
పోవలసిన గమ్యంపై చూపు అవసరం!

2. ఒంటరియై మనిషి

సంఘంలో మనిషి పాత్ర బహుముఖీనమయి
ఊరు నుండి నగరం దేశం సరిహద్దులు దాటి
ప్రపంచంలోకి! సమాధాన రూపమై కదలేను
మబ్బులానొ మంచులానొ సమస్య తొలగుతూ!

ప్రతి వికాస దశలో సరికొత్త విషయం
వెలుగు రూపంతో నీడనూ చూపిస్తుంది
వెంటాడే నీడకు భయపడేది కొందరు
నచ్చని నలుపుకు ముఖం చిట్లించేది కొందరు

టెలివిజన్ మొబైల్ మిసైట్ ఇంటర్నెట్‌తో
సంబంధం పెరిగే కొద్దీ! చూపులో గగనంలో
అయినా! నేలతో పద సంబంధం! ఎప్పటికీ
మానుష సుమ వనం! వాడి ఎండిపోకుంటే చాలు!

గొలుసులా సమస్యలొకటి తరువాత ఒకటి
ఆ వచ్చేది తెలియదు, గొడ్డలితో వేటుకు!
సిద్ధమైన ప్రశ్నకు జవాబు బదులు
ఎదురు ప్రశ్న! మనిషిని బంధిస్తుంది!

ఉన్న తరం సుఖంతో మరో తరం భాగ్యం కయి
మనిషిలో ఉపజ్ఞ పై అంతస్తుకు చేరుస్తుంది
ధనం భాగ్యం అధికారం ఆదిపత్యం
నాలుగు చక్రాలతో సమాజ వాహనం!
కులం మతం వర్ణం సీమలు అవసరాలకేర్పడీ
అవి కాలంపై బంధన గుణ శృంఖలలయ్యేను
వైరుధ్యంలో సమాజం! చీలికలుగ
వాడిగ వేడిగ మారడమొక విషాదం

గోతులతో విషమ గతికి భయపడి
స్తంభానికి ఎన్ని మెట్లు చుడుతూ పోతేనేం?
నిలయానికి పునాది లేకుండా! సాగుతూ
ఒంటరియై మనిషి!! సమాజ శక్తిని కోల్పోయేను

3. అనుభవ తలంపై

హృదయం మాట్లాడుతుంది హృదయంతో స్వేచ్ఛగా
మాటలోని భావ లహరి తాకుతుంది స్వచ్ఛంగా
చీకటి తొలగే ఉదయ రశ్మి సోకినట్లుగా
తాప హరంగా మంచు ముక్క జారినట్లుగా

పెదవుల తలుపులు తెరవబడీ!
మాట బయట పడుతుంది! గాలిలో
కవిత మాట్లాడుతుంది గుప్తంగా
అర్థం వెనుక నున్న భావ రూపంతో
నెమలి ఈకతో దువ్వినట్లుగనో
పూవు రేకుతో నిమిరినట్లుగనో
ఉద్రేకంలో అగ్ని కణం చిమ్ముతుంది
ఉద్వేగంలో వాడి చాకు విసరుతుంది

నది మాట్లాడుతుంది! ఆర్ద్రంగా
దప్పికలో దగ్గరికి చేరే ముఖంతో
గాలి మాట్లాడుతుంది ఊపిరియై
మనిషి ముఖం స్పృశిస్తూ ప్రేమతో

చెట్టు మాట్లాడుతుంది చల్లగా
తన నీడన చేరే ప్రతి ఒక్కరితో
మనిషి తనకు కావలసింది పొంది
నిష్క్రమించేను! మౌనంగా! బొమ్మలా

సర్పం ప్రశ్నయై ఎదురు పడవచ్చు
పక్షి జవాబై పైన ఎగరవచ్చు
అనుకోకుండా! దేని దారి దానిదే బ్రతుకులో
నేలపై ఒకటి నింగిలో ఒకటి తమ తమ పనులలో

మాటకు మాటకు మధ్య కవితలో
పొందే కాస్త ఖాళి జగాలో
అర్థానికతీతంగా భావనా ప్రసారం
విమాన యానంలా! అనుభవ తలంపై

4. మనిషి ఊహలో

ఊరు దాటితే అడవి! పొద చాటున పులి
ఆ పులిని బోనులో బంధించాలని మనిషి
ఆ వేళకు ఆహారం కయి అన్వేషణలో పులి
ఒకరి కొకరు తెలియకుండ పొలిమేరలలో

నగరం కొత్త మనిషి కయి వస్తువు కయి ఎదురు చూస్తుంది
కవి మనసు విషయ విశేషం కయి దృష్టి పరుస్తుంది
వర్తమానం అనుకునేంత సులభంగా వదలదు
మెల్లగా ప్రభావాన్ని వదలుతూ వెనక్కి వెళుతుంది

కనిపించే వస్తువు వెనక నున్న
కనిపించని కారణ రూపం
ఒక క్రాంత దర్శికే! సాధ్యం
దార్శనికం కవికి యాన సాధనం

ఎదురుగా ఉన్న గోడలు వెనక్కి జరిగే చర్యలలో
తన నివాస విస్తరణం! పనిలో మనుషులు!

భూమి పయి బ్రతికే మనిషి మనసుకు సంకేతం
నింగిలో పైపైన స్వేచ్ఛగా తిరిగే విహగం

చలినీ ఎండనూ భరించే గాలిలా
వాడి వేడి తీవ్రతల్ని మనసు వహిస్తుంది
ఎండిన తరువు వసంతం కయి ఎదురు చూస్తుంది
వేదనలో మనసు అతీతం పయి వాలుతుంది

యువతలో వర్తమానం ప్రవాహంలా పరుగెత్తుతుంది
వృద్ధులో గతం పర్వతంలా నిశ్చలంగా నిలుస్తుంది
తరలి వచ్చే అలలను శిలలు ఆపాలని చూస్తాయి!
కదల లేని శిలలను అలలు పలకరిస్తూ పోతాయి

బాధలు భరించలేక! అవనిలో పాతిపెడితే
దు:ఖ సుమాలతో కష్ట ఫలాలతో కనబడవచ్చు
ఏ కథకూ ముగింపు వాక్యమంటూ లేదు
ఆగిన స్థలం చివర దనుకోవడం మనిషి ఊహలో

5. మనిషి మనిషికీ వేరు

దాహం ఆకలి ఒకటే అందరికీ
అవి తీరే పొందే తీరులు వేరు వేరు
ఆశలు పెంచేవీ! ఎన్నో పథ పథాన మబ్బుల్లా
వేదన మాత్రం ఒకటే విశ్వమయం, అందరిలో

తాప వేళ మబ్బు నుండి జల బిందువు దిగడం
ఆలస్యం కావచ్చు, అసలు జారక పోవచ్చు
అపుడు కళ్ళ నుండి బాష్ప కణం జారుతుంది
బాధలో అనల కణం గాను మారవచ్చు

శిల్పి మనసులో ఊహ ఆకృతి పొందేందుకు
శిల! వంపులు మలుపులు పోతుంది తరుగుతూ
అవసరమైనది నిలుస్తుంది! ఉలి ఆగి పోతుంది
తొలగిన ముక్కలతో గోయి పూడ్చబడుతుంది

నదిలో మునగడం బహు సులభం
పైకి తేలే క్రియ, శిక్షణతోనే!
నేర్పుతో శరీరాన్ని నీటిలో దాచి
సబ్ మెరిన్‌లా! తరలడ మొక విద్య!

బ్రతుకులో నీడలా మనిషిలో అనుభవ రూపం
ఇది వెలుగులోనే కనబడతుంది నమ్మకంగా

ఆలయం మెట్ల కింద బిక్షువు
చేతిలో నాణెం పడిందో లేదో!
అహంకృతికి కిరీటం తొడిగినట్లు
ఉంటుంది! ఆ దాత మనో రూపం!
మనసు మలిన రహితమైన భ్రాంతిలో
స్వర్గం పొలిమేరలలో విహరించేను

చిటారు కొమ్మకు వేలాడే కోరిక
జారిన నక్షత్ర ముఖాన్ని తలపించేను
అనుకునే పనుల తీరు! మనిషి మనిషికి వేరు!
పూలు ఎన్ని విధాలో! ఫలితాలన్ని విధాలు!

6. స్మృతి చిహ్నంగా

వినిపించే ప్రతి శబ్దం ప్రతి హృదిలో
ఒక భావ ముఖం వదలుతుంది
అది మానవ స్వరమే కానక్కర లేదు
శబ్దానికి ప్రాణ జడత భేదం లేదు

బయటి తలుపులు మూసినా
ఇంట్లో నుండి రెప్పలు తెరచిన కిటికి నుండి
చూపులో! బయటి దృశ్యం!
పరిమితిలోనూ సమాజ బంధం నిలుపుతుంది

పొద్దెక్కే కొద్దీ బయట ప్రజల సందడి
వలలో చేపలా సమయం! గిలగిలలాడుతుంది
నిశ్శబ్దం ఎంత సాంద్రమయినా సమాధి సమం కాదు
ఏ మనసూ శిలలా నిశ్చలతను వహించ లేదు

ప్రతి శబ్దంలో ఏదో ఒక క్రియా రూపం
ఏ శబ్దం లేకుండా! క్షణ కాలం లేదు

దేవులాట కీచులాట పోరాటం
ఉత్సాహం సంతోషం ఉద్రేకం
విన తగినవి విన తగనివి మిశ్రమం
జీవన రూపానికి చలన శక్తి నిచ్చేను

ద్వారానికి వేలాడే పచ్చని ఆకులతో రణం
రోజులు పై బడే కొద్దీ దీన ముఖం వేసేను
మరో ఉత్సవ వేళకు తొలగించే దవుతుంది
అంతవరకు నిలుస్తుంది! పూర్వ స్మృతి చిహ్నంగా

కలలో పచ్చని చెట్టు గాలిలో నడుస్తుంది
మనిషితో పోటీ పడుతుంది! చిత్రంగా
మెలకువలో మనిషితో మనిషి పోటీ పడేను
పచ్చదనంలో స్నేహమె! వెచ్చదనంలో వైరమె!

శబ్దం నుండి నిశ్శబ్దం తప్పుకో చూస్తుంది
కానీ! అను రణనంతో నాదమయమవుతుంది

7. స్వరం వెనక దృశ్యం

శరీర రూపం బయటికి రావడంతో
జీవికి దుస్తులు! తొడుగులు! సుందరతలు
ప్రతి ఉదయం వచ్చే రవి బింబం వలె
నాలో కవిత! కొత్త జీవ భావ రూపంతో
సూక్ష్మతల్ని నింపుకొని విశాలతల్ని పరచుకొని
సమాజ బంధంతో, వ్యక్తిత్వం ఎదుగుతుంది

చలి కాలంలో పైగా అర్ధరాత్రి లేచి
చలిని లెక్క చేయకుండా చేతిలో కలం
కాగితం పయి కదలుతుంది, చలిని మరపిస్తుంది
లో నుండి అక్షరాలు! పద పంక్తులలో
ఉత్సాహం నింపేను! కోష్ణ భావ రశ్మితో
ఉన్న జడిమ కరుగుతుంది సరిస్తుంది! కవితగా

ఎండ వేళ నయితే పగలు ఆర్ద్రంగా
చేతిలో కలం! కాగితం పయి కదలుతుంది
లో నుండి అక్షరాలు! మంచు ముక్కల్లా
వెడలుతాయి, జల కణ స్పర్శను పొందజేస్తాయి!
తాపాన్ని మరపించే ఆర్ద్రతతో స్నిగ్ధతతో
ఆలోచనలో పచ్చదనం పరవశింప జేస్తుంది

కవిలో సృజన వేళ! రవి బింబమొ!
కాకపోతే శశి బింబమొ! నిలుస్తాయి
పొంచి ఉన్న చీకటి ముందుకు దూకే
అవకాశం ఏ మాత్రం లేకుండా! చేస్తాయి

తనలో దార్శనిక బింబం వెలుగులో
వర్తమాన తలంపై మానవ పయనంలో
వెలుగు స్వరం వినిపిస్తుంది
వెన్నెల స్వరం వినిపిస్తుంది
రెండిటినీ వినే బాధ్యత కవిదీ
స్వరం వెనక దృశ్యం! ప్రతిఫలిస్తుంది కవితలో

8. కొత్త ఆశతో

చెట్టు పాతదయినా పూలు కొత్తగా
పరిమళాలు! అప్పటి కప్పటివి!
గతమొక అస్తితతో కనిపించని మూలం!
వర్తమాన జీవితమొక కనిపించే వాస్తవం

మనోబలంతో జీవన వాహనం నడుస్తుంది
ముఖం అదే! చేతులు! కాళ్ళు! అవే, ఎప్పటివే
ఊహ వేరు, చేత వేరు, ఫలితం వేరు
ఆచరణలలోనే గడుస్తుంది! జీవితం

గళం నుండి స్వరం వెడలుతుంది
మనో భావ ప్రకటనకు గుర్తుగా
మనో బంధంతో మనిషిని ఆకర్షిస్తుంది
ఇది అనివార్యమై ముందుకు సాగుతుంది

శ్రమ బిందువులో మెరసే వజ్రం
జీవన గమనంలో ఆశను నిలుపుతుంది
ఊహతో క్రియ సహ బంధంతో
శాంతిని వరించవచ్చు, విజయం లభించవచ్చు

చెట్టుకు పూవుల వలె నిశీధిలో చుక్కలు
పగలు వెలుగు లేని చోటు తీర్చే అవకాశంతో
అయినా సాధారణ జీవన గమనంలో
చీకటిలో దివ్వెతో కాలం గడవాలిసిందే!

తన నిలయం ద్వారానికి ఉదయం కాంతి
ఉత్సవ తోరణంలా వేలాడుతుంది
తన మనో ద్వారం తలుపులు తెరుచుకోవడం
మనిషి తన పనిలో విలువల ప్రాధాన్యంతోనే
గాయ పడని మనసుతో బాధలేని ఆయువుతో
రోజులు గడపాలని! మనిషికి కోరిక సహజం
చెట్టు మూలంపై కన్నా మనిషి చూపు ఎప్పటికీ
పూవుపై ఫలంపై ఉంటుంది కొత్త ఆశతో

9. వాస్తవంలో

మనిషి కనిపిస్తే మాట్లాడితే! సమస్య లెన్నో
అవసర విషయాలెన్నో! వాటిపయి ఆలోచన! అన్వేషణ!
మనసు దారి తప్పడంతో కథ మొదలవుతుంది
దాని కయి వెదకాలిసి రావడం మరో సమస్య

ఇది వెదికితే దొరికే వస్తువు కాదు మనస్సు
అలా అయితే కావలసిందేముంది? మనిషికి
తానే కాదు పది మంది చేతనూ వెతికించవచ్చు
తనలోనే ఉన్న సంగతి తెలిసీ, చూడలేని స్థితిలో

గుర్తులు చెబితే సరిపోయేనా?
అంత సులభంగా జరిగే పని కాదు

చరిత్ర పుటలను తిరగేస్తే! అంతటా
తలలు తెగి కాళ్ళు విరిగి చేతులు పోయి
వికల స్థితిలో వినాశన పర్వం దృశ్యం!
ఇచట మనసు ఉన్న ఛాయలు! బిల్ పతా

వైరం స్నేహం కలహం సహనం రణం శాంతి
వీటిలో ఏది మొదలు ఏది చివర అంటే
ఇటు నుండి మొదలు పెడితే ఇది మొదటిది!
అటు నుండి మొదలు పెడితే అది మొదటిది!

మధ్యలో అనుమానం సందేహం విపరీతం
సంక్షుబ్ధ జీవన దృశ్యంలో కనిపించని మనసులో

శ్రమ జీవన చలనంలో బాష్పలవం
వికృతానికి నష్టానికి కారణ బీజం అవచ్చు
బాధా కంటకానికి నిలయం కూడా కావచ్చు
నిప్పు కణమై! ఎగిరి పడి దహించనూవచ్చు

ఇది వహించేది సహించేది శరీరమే!
మనసుకిది తెలిస్తే! కదలితే మానవ మున్నట్లే
ఆపద అయినా ప్రమాదమయినా వాస్తవంలో
నిజం బయట పడుతుంది మనసును మేల్కొల్పుతుంది

10. వెలిగే కవితకు

పగలుకు రాత్రి శత్రువు అంటారు
కాని ఇది విరామ సుఖ సమయం కూడా
రాత్రికి పగలు సరిపడదు అంటారు
కాని ఇది జీవన సుగమతకు చాలా అవసరం

విశ్వ సుందరి కళ్ళకు కాటుకగా
చీకటి! దాచ బడుతుంది భద్రంగా
మరునాటికి పనికి వచ్చేందుకు
ఇది వెన్నెల గిన్నెలో సమర్పిత మవుతుంది

పగలు మనిషి మెలకువ రూపానికి చిహ్నం
రాత్రి మనిషి మరపుకు మర్మానికి సూచన
గుహలలో సందులలో చొరబడిన చీకటి
జీవితంలో కొన్ని సమయాలను పాలిస్తుంది

చీకటికీ నిదురకూ అనుబంధం గాఢమైంది
రెండూ లోతులు తెలియని వినీల జలధులు
చీకటి నైజాన్ని దీపం చూపిస్తుంది
నిద్రా బలాన్ని స్వప్నం సూచిస్తుంది

ఉత్తరం వ్రాసి సిగ్నేచర్ మరవడమో
అడ్రసు రాయకుండ పోస్ట్ బాక్స్‌లో వేయడమో
అడ్రసు రాసే పోస్టు చేయడం మరవడమో
ఏదో ఒక చీకటి శకలం! మరపులో!

మెలకువ లేని చోట! అంతా చీకటి
మనిషిలో తన ఉనికిని కాపాడుకుంటుంది
రహస్య దృశ్యాలతో, అజ్ఞాతానికి మూలం
జీవన సందర్భాలలో! ఈ ఛాయలు! చూడవచ్చు

కాలానికి అలసట లేదు, విరామం లేదు
ఆగని అలల వలె ముందుకు సాగి పోవడమే
ఎప్పటికీ వెలుగుతూ ఉండే కవితకు
చీకటి దూరంగా ఉంటుంది

11. జలదం కయి

నిన్న నుండి నేడు, పాత నుండి కొత్త స్పృహ
గతాన్ని వదలించి ముందుకు నడిపిస్తుంది
ఉదయం అందిరదీ ఏ భేదం లేకుండా
అందరి బ్రతుకులు సమాన శిఖరాలను పొందలేవు

ఒకరు కోరినంత మాత్రాన మార్పు
హఠాత్తుగా చివురించదు, కుసుమించదు

అర్ధరాత్రి ఎర్రని వెలుగు గీత గీసినట్లు
అక్కడితో ఆగిపోయి! కొత్త ముఖం తల ఎత్తదు
ఉదయం వచ్చినపుడు, కొత్తపై అభిలాష ఉండవచ్చు
చీకటి వెళ్ళినపుడు, పాతపై ఆదరణం తగ్గవచ్చు

నిన్న రేపు మధ్య "నేడు", నేనులో
నాట బడిప విత్తు! మొలకెత్తాలనీ
నేడు పుష్పమయమై విరియాలని
రేపు వజ్రమయమై వెలగాలని

పొలంలో గడ్డి కోసే కొడవలి
మెడపై వేటుకు పనికి రాక పోదు
మనిషిపై గురి పెట్టిన ఆయుధం
ప్రదర్శనలో బహుమతిని పొందవచ్చు

సంక్షుబ్ధ స్థితిలో మనుషులు! వీధిలో తమ ఫాలంపై
"మేం మనుషుల"మని స్టికర్‌తో నడవాలిసి వస్తుంది

పొయిలో మండే కట్టె పుల్లల వలె మనుషులు
మండి బూది అవడం క్షమించరాని! విషాదం

బోధి చెట్టు! ఎండిన కొమ్మలు చాచి
రాలిన ఆకులతో నీడకు సెలవుతో,
వేదనతో దీనంగా దిశల వైపు చూచేను
వేరు నుండి శిఖ దాక జలదం కయి తపించేను
జలద చ్ఛాయలు కరువైన సమాజంలో బ్రతుకులు
బాష్ప జలంతో గడపడ మొకటే! మిగిలింది!

12. జీవన స్పందనలో

రైలు బస్ యాత్రా నిలయంగా మనో దృశ్యం
విమానాశ్రయం గానూ నేటి జీవన యానంలో
లోనుండి సుందరమైన అనుభవంతో ఒకటవుతూ
బయటి నుండి బ్రతుకు పాట్లతో సతమతమవుతూ

ఎదురుగ హోర్డింగులు దేశ వికాస చిత్రాలతో
ఎత్తుగ టవర్లు! సమాజ ప్రగతి సూచికలు
అవసరాలు సుందరతలు కలిసిన వర్ణ రేఖలతో
లోయలతో ఎత్తులతో జీవన వాస్తవ రూపాలు

మానుష రూపం ఉత్తమ మనుకుంటూనే
తడవ తడవ కొక! మారే ముఖోటా మనుషులు
దేవతల నుండి జంతువుల తీరులతో
దేనితో లాభమో! అది ముందుకు తేబడుతూంది

దేశం తన దయినా, దారి తప్పవచ్చు
పయనం వశ మయినా కాలు జారవచ్చు
కవిత దారి చూపుతుంది
మనిషిని నిల బెడుతుంది

కవిత ఆదరంగా మనోభూమిపై
బావిలా చెరువులా చెలమలా నదిలా
దప్పిక తీర్చే భావ జలంతో బ్రతుకులో
మోదమో! ఖేదమో! రాలే బాష్ప లనంలో

ప్రశ్నగా ఎదురయ్యే మనిషి కెదురుగా
జవాబుగ బయటికి వస్తుంది కవిత!
ఆర్తిలో జలద శాంత వచనంతోనో
బాధలో సానుభూతి హృదయంతోనో

శుష్కించిన చెట్టును స్పృశిస్తుంది
నిప్పంటిన గుడిసెకు జలద ఛత్రమవుతుంది
వాస్తవ జీవన దృశ్యానికి స్పందనతో
అవసరం సుందరతలు కలిసిన రూపంతో

13. విజయ కేతనం

కవికి సమాజం పయి అభిలాష నమ్మకం
సంఘానికి కవి పయి ఆశ గౌరవం
చేతిలో వేణువు అలంకారం కావచ్చు
రాగానికి హ్లాదానికి ఆకరమవుతుంది

గులాబీకి, తనను వశం చేసుకొనీ
ముళ్ళు వదలి పోయేరని బాగా తెలుసు!
ఆహ్వానంతో ఎదురు చూస్తుంది చెట్టు
మనిషి రాక కయి సిద్ధంగా ఉంటుంది కొమ్మ

నిజం పలికేది ఒక కవితయే
అది మనసుకు కనిపించే రవి బింబం!
చేతి నుండి జారిన అవకాశం మాత్రం
అలలపై పడవలా అదృశ్యమవుతుంది

త్యాగ గుణంతో జలధి! మబ్బును వదలుతుంది
ఉదారతతో మబ్బు జలాల్ని వదలుతుంది
జలాలతో భూమి పచ్చదనం పొందుతుంది
ఒక దానితో మరొకటి కార్య కారణ సంబంధంతో

వాస్తవ తలం పయి కొత్తదనం పేరుతో
తన పాత్రను, సత్రం చిరునామాకు వదలడం
వాణిజ్య ప్రదర్శనలో వస్తువు అవడం
వీధిలో విలాస దృశ్యం! కాదు కవిత

చివరి దాక తీరని కోరిక లెన్నో మనిషిలో
పైకి కనబడకుండా! పెట్టెలో వస్తువుల్లా
కాకపోతే పంజరం చిలకలా, బోనులో మృగంలా
బయట పడితే! ఎవరి ప్రయోజనం వారిది స్వార్థంలో

తల్లికి శిశువు ఎదుగుదల తెలుస్తుంది కానీ
ఏమయ్యేదీ, ఎట్లా ఉండేదీ తెలియదు
వర్తమాన జీవన గమనంలో మలుపులతో
మానవ విజయంలో కేతన మవుతుంది కవిత!

14. సృజన భవంతో

ఒక సమయంలో మనిషి మృగ బంధువు అయ్యేను
ఒక సమయంలో మనిషి దైవ సమం అయ్యేను
అన్నీ కలిసి వస్తే హిమ శిలలు ప్రవాహ మవుతాయి
ఏదీ కలిసి రాకపోతే! నీరు హిమ శిల అవుతుంది

చీకటిలో దీపం చిరునవ్వుతో తోడుగా
భయం పోవడమే కాదు, ధైర్య కవచమందిస్తుంది
చీకటి గురించి ఆలోచనలో తేలే మనసుకు
వెలుగు పడవ దొరకడ మొక! అదృష్టం

రాత్రి మెలకువతో ఉదయమవతరించేనా?
పగలు కనులు మూస్తే చంద్రుడు కనిపించేనా?
దేని సమయం దానిదే, నియతమయి పోయేను
ఎవరి కథ వారిదే, వేరువేరుగా గడచేను

చీకటి శిఖరం పయి జ్వాలా రూపంలో
లిప్తలు గడపే మనిషి మనసులో
పొగలు! నీటి మబ్బు లవడం కల్పన!
మనసును భద్రతలో ఉంచుతుంది

కత్తి మొన చివర నెత్తురు చుక్కలో
చిక్కిన శాంతి! క్షేమంగా బయట పడేనా?
స్వచ్ఛంగా హంసయై స్వేచ్ఛగ ఎగిరేనా?
మనిషిలో తరువును నిలిపేనా? ఆశలు కుసుమించేనా?

ఆత్మహత్య అనివార్యంగా తలచే వ్యక్తిలో
పరిస్థితుల ప్రాబల్యం! కత్తి అంచును నడిపిస్తుంది
సంఘం కొమ్మకు వేలాడే ఆ ప్రాణితో
సంఘం ఆలోచనలో ఏ దారిని చూచేను?

ఎన్ని ఉదయాలు గడచినా ఎన్ని రాత్రులు తరలినా
అదే! పేదరికం దిమ్మరి తనంతో దుర్గతిలో జీవితాలు
ఉన్నంత వరకు కవిత! ఆశాపూర్ణత నిస్తుంది
సృజన భవంలో మనో గుణంతోనే నిజ జీవితం

15. కవుల పని

మేల్కొన్న క్షణాలతో జీవిత మొక వాహనమై
కాలి బాట రైలు దారి రహదారి పవన పథం
ఏదో ఒకటి! ముగింపు మాత్రం అవని ఎదపై
తిరిగి తిరిగి పెద్దమ్మ భూమి ఒడిని చేరుతుంది

ఈతి బాధ కాటకం మనిషి సృజించేవి కావు
ఇవి ప్రకృతి విలయ చర్యల పర్యవసానాలు
కన్నీళ్ళలో కొట్టుక పోయే కన్నా మనిషి
నిలబడి! శ్రమ చేతన పొందడమే కర్తవ్యం

మస్తిష్కం శూన్య నిలయం కాదు శక్తి మయం
ఒకరి నుండి సందేహం! ఒకరి నుండి సమాధానం
మానసిక స్థితిని బట్టి ఊహలు! చేతలు
మూల గుణాన్ని బట్టి చెట్టుకు ఆకులు పూవులు

శిల్ప సంపద శిథిలమై నిలయం భగ్నమై
చివరకు మిగిలిన ప్రధాన ద్వార తోరణం
సమాజ భవితను జ్ఞాపకం చేస్తుంది
మరచిన విలువల్ని ఆలోచింప చేస్తుంది

కత్తికి రణానికి అనుబంధం వైరంలో
కత్తికి రక్షణకు సంబంధం స్నేహంలో
ఒకరి ఊహ కదలితే కత్తులు తళతళలాడేను
ఒకరి మనసు విప్పితే కపోతాలు! బయట పడేను

కొమ్మ ఊగుతూ పూవు జారుతూ తలపై
వీచే గాలులు! కాలాలన్నిటనూ సాగవు, రాలేవు
కాలం సరిగా లేదని నిందిస్తూ ఎవరినో
కాలం గడపడమూ మనిషికి తగినది కాదు

కవి ఊహ! పైకి వదలబడే మాంజా అయి
ఎగిరే పతంగి యానంలో కవిత!
లోపల నిలిచిన జ్ఞాపక శిలలను కవితగా
చెక్కి చూపే కన్నా కవులకు పని ఏముంది?

16. మృత్యువు చేతిలో

శ్రమ చేతనతో వికాస శీల సమాజం
సంపదతో వర్తనలో విలువల తోనే
పడమర దిశలో అడ్డంగా ఎత్తుగా
ఎంత గోడ నిలిపినా! రవి నిష్క్రమణం ఆగదు

అలసటలో నిశి విరామ సమయం తొలగదు
ద్వాదశ రాసుల భ్రమణంలో పరివర్తనం ఆగదు
తెరచిన గ్రంథంలా పగలు ఆదర్శం బోధిస్తుంది
మెలకువలో కిరణం హృది కర్తవ్యం సూచిస్తుంది

మహా పద్మాన్ని తలపిస్తూ ప్రజాస్వామ్య సమాజం
అందంతో గంధంతో సరసి బయట పడుతూంది
గగనం వలె అందని ఆశయం సాధనలో
సమస్య మరునాటికి పోస్ట్‌పోన్ అవుతూంది

సంకల్ప బలంతో నిశ్చయ గతిలో
పరిష్కార దిశలోనే మానుష యత్నం!
బ్రతుకులో దార్శనికం అర్థవంత మయ్యేందుకు
ప్రగతిలో సుందరతర చరిత్ర ఏర్పడేందుకు

చుక్కలు తళతళలాడేది చిక్కని చీకటిలోనే
మనిషి నిజం! కనబడేది, పగలు వెలుగులోనే
చివరి రాత్రి అంటూ లేదు, రాని ఉదయ మంటూ లేదు
రెండిటి అనుభవ రమణీయంతో, మనిషి జీవితం!

కొత్త దనం పేరుతో మార్పు ముద్ర గుర్తుతో
పాత్రకు చౌరస్తా చిరునామా చూపడం
వ్యాపార ప్రదర్శనలో విలాసాలు చిమ్మడం
వర్తమాన చిత్రంలో ఉక్కిరి బిక్కిరి చేసే దృశ్యం!

ఎక్కడిక్కడ మూత బడే అవకాశంతో
బీభత్సం సృజనకు ఏ దారిని చూపలేదు
అశాంతి ముఖమేదయినా కానీ
అది మృత్యువు చేతిలోని పూవే!

17. లోన ఎచటనో

సమాజ హిత చింతనలో ఏర్పడిన ఆదర్శం
ఒక వెలుగు బింబమయి చేతిలో నిలవాలనీ
శ్రమ ఫల రుచులతో విద్యా సుమ గంధంతో
బ్రతుకులు గడవాలని సుఖవంతంగా, నవంగా

వర్తమాన మొక అనుభవ వాస్తవం
ఏది మరో ప్రపంచం? ఎక్కడ! అంటే?
ఇది కల్పన సాకారమయిన సుందర భ్రమలో
ఉన్న క్షణం దాటి కోరే స్థితి! మనోమయం

మనిషి మనిషిలో రేపు! ప్రియ రూపంగా
రహస్యాన్ని ఛేదిస్తూ మనసులో కవితగా
వజ్రంలా మెరుస్తూ! దూర తలంలో
పుష్పంలా చేతిలో నిలవాలని కోరిక!

ఒక సందర్భం! అలరించే హరివిల్లు కావచ్చు
ఉద్యమ చలనంలో జ్వాలా శిఖ కావచ్చు
క్షామంలో బొగ్గు కణమై ఎదుట నిలవొచ్చు
తత్కాలంలో పొందే స్థితి! ఊహల కందనిదీ

మనుషులు గడచి పోయినా మానవ బంధం
తరం నుండి తరానికి చేరుతుంది! నిర్వ్యాజంగా

ఊరు అయినా అడవి అయినా
పక్షుల ఆవాసం ఒకటే! భూమికి పైనే
లోయ అయినా మైదానమయినా గిరి అయినా
నది చూపే ఆర్ద్రమైన హృదయ స్పర్శ ఒకటే

తెలిసి తెలియని స్థితిలో సాక్షిగా
తలుపులు అవసరం లేని అద్దాల నిలయంలో
మౌనంగా ప్రకాశ రూపంతో అంతరంగం!
మనిషిలో మెలకువలో ఎప్పటికీ ఉంటుంది
దీని అవసరం మనిషికి లేనట్లుగానే
మరపున బడి ఉంటుంది! లోన ఎచటనో!

18. వార్తా పత్రిక

ఉదయం చేతిలో వార్తా పత్రికలో పదాలు
తెరచిన కళ్ళ ముందు దృశ్యంలో వస్తువుల్లా
అక్షరాలు అవే! పరిచయమున్న భాషలోవి
అమరికలో కొత్త భావ జగం అవతరిస్తుంది

పేజిలో పద పంక్తులు! క్షితిజంలో పక్షుల బారుల్లా
సమాచారం తెలుపుతూ ప్రకటనలు అందిస్తూ
మనుషుల పలు కోరికలకు వాహనమై
పన్నిన వ్యూహాలను మోసుక వస్తుంది
పద గతిలో కిరణ పంక్తి సూటిగా
తెలియని అనుభవ జగతిని చూపిస్తుంది

జరుగుతూన్న వర్తమాన స్థితులకు ఆల్బమ్
ప్రశ్నలు! జవాబులు! ఆలోచనలో రెపరెపలాడేను
తెలియని ప్రపంచాన్ని ముందుకు తెచ్చే పనిలో
తెలిసిన ప్రపంచం లోని మర్మాలను విప్పుతూ

ఒక్కొక దృశ్యం! జన చలనం! స్పందన! స్వరంతో
సమాజ సందర్భంలో మనిషి బ్రతుకు! విశాలమయ్యేను

ఉండనే ఉంది! దరిద్రం భౌతికంతో మానసికంగానూ
ఒక స్థితిలో ఆరోహణలో మరోస్థితిలో అవరోహణలో
దోపిడీ నుండి హత్యల వరకు చీకటి పనులు
అక్షర దీపం వెలుగు లోకి తేవడం! విశేషం

పెట్టెలతో రైలులా నడచే సమాజ వాహనం
అడ్డంకులు దాటేందుకు సాధనమవుతూంది వార్తా పత్రిక!
నది ఈవలిగట్టు నుండి ఆవలి గట్టుకు చేర్చే
పడవగానొ వంతెన గనొ! ఉపకరించనూ వచ్చు

ఉద్యమ దశలో నిరసన ప్రతి ఘటనల నెత్తుకొనీ
వికాస స్థితిలో అవసరాల ప్రాధాన్యం చూపుతూ
మానుష యత్నంలో ప్రజాస్వామ్య చింతనలో
ఈనాడు బ్రతుకులో సమాజ వేదిక అవుతూంది

19. శిథిలాలలో గుర్తులు

అగ్ని రథం పయి మంచు కవచంతో పయనం
మనిషిలో ప్రజ్ఞకు ఇది నిదర్శనం
రవి ఆరోహణతో మంచు కరగి ప్రవాహమై
ఎగసే అలలపై తేలుతూ పోవడం! జీవితం

పండుగ వస్తుంది! సంక్రాంతి ఉగాది మరొకటి
గతాను బంధంతో కాలం కొత్త ముఖం పొందుతుంది
ఉత్సవ కళతో ఆ రోజు జీవన దృశ్యం! వేరుగా
సమత మమత రెక్కలపై! మనసును తిప్పుతుంది

అప్పటి వరకు శూన్యంగా ఉన్న మనసు
విశాల గగనంతో నిండుతుంది
అప్పటి వరకు అచలంగా ఉన్న కాలం
ప్రవాహ వేగంతో సరిస్తుంది

రోజూ కావలసింది, రావలసింది మనిషిలో
అణగి ఉన్న మానవ బింబం ఆదర్శంలో
కొత్త స్వరంతో అభ్యుదయానికి ఆహ్వానం
దివ్వె నుండి దివ్వె వెలగడం ఆలోచనలో

గమ్యం స్థానంతో పోయే దిశ మారుతుంది
దారి మూత బడక పోవడమే! వ్యక్తి స్వేచ్ఛ
నడక నుండి బండి విమానం ఏదయినా సాధనం
ఎన్నుకునే వీలు ఉన్నదే! ప్రజాస్వామ్య సమాజం

జీవితమంటే వైతరణీ తీరం కాదు
నాశనకర దృశ్య కథా శకల రచన కాదు
సంక్షోభం కల్లోలం జలధిని తలపించినా
జలద మవతరించి ఎగసి వచ్చేననీ! ఆశ

అన్నీ సహజాలే! వీటితో విపరీతాలు కూడా
నిరాశకు గురి చేస్తూ! ఆ వెనకనే సృజనకు వీలుగా
శిథిలాల్లో దొరకే అణగిన గుర్తులు
నవ నిర్మాణానికి పైకి లేచి చూస్తాయి

20. సూత్ర బంధం

మనిషితో మనిషి పరిచయ సూత్రం తెగిపోదు
ఎప్పటికి ఉంటుంది! మనసులో స్మృతి బంధంతో
బుజాలపై మబ్బుల శాలువాతో
పక్కన సూర్యునిదో చంద్రునిదో రూపం
భూమిపై కలిసి నడవాలని కోరిక!
మనిషిలో ఆశా రూపం తీవెయై
మధ్యలో తెగిపోవచ్చు వాడిపోవచ్చు
మళ్ళీ తల ఎత్తుతుంది! ఎదురు చూస్తుంది

ఇది కలలో సాధ్యమయి అంతలో అదృశ్యమయి
చేతికి అందే దయి అంతలో నష్టమయి శూన్యమయి
మనిషిని దూర దూరం భూమిపై నడిపించేను
కోరిక మాత్రం బీజంలా మిగిలే ఉంటుంది

మనిషికీ మనిషికీ మధ్య నిశ్శబ్దం! అంతలో
అగ్ని పర్వతం కావచ్చు, మందు పాత్ర కావచ్చు
పేలిన శబ్దంతో బీభత్స దృశ్యంలో
తొంగి చూచే సమాజ ముఖం! మృత్యువు ఛాయలో

సమాధిలో నిశ్శబ్దాన్ని కోరే దెవరు?
తలుపులు మూసిన ఇల్లు అయినప్పటికీ
ఎక్కడో తెరచిన కిటికి నుండి గాలికి అవకాశం ఉంటుంది
మూత వేసిన పెట్టెలో బ్రతుకు గడిపే దెవరు?

మొదట నోటి మాటతో కవిత
నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ మౌనాన్ని ప్రక్కకు తోస్తూ
స్వేచ్ఛగా స్వచ్ఛమైన మనో సరసి హంసలా
ఒకపుడు తగలబడే వస్తువు పక్కనే అగ్గి పెట్టెలా!

స్నేహంతోనో శత్రుత తోనో పరిచయాలు
ఎప్పటికీ ఉంటాయి, సమాజ చలనంలో భాగాలయి
మంచులో నీరులా నీరులో విద్యుత్తులా
విద్యుత్తు నుండి వెలుగులా! కవిత వెడలుతుంది

21. కవితలో నిజం

పరచిన లేలేత వెలుతురులా
నా ముందు తెల్లని కాగితం
అక్షరం కయి ఎదురు చూస్తుంది
వెనక నుండి బయటికి కవిత
చూపే చీకటి! అక్షరాలుగ మారేను
అగ్నులు! భావ శిఖలుగ నిలిచేను

లేని దాని కయి అలజడి ప్రబలేనా?
మాటలలో రగిలిన కలహం రేగేనా?
ఉన్న వెలుగుతో ప్రేమను పంచేనా?
మాట నుండి పూచిన స్నేహం తరలేనా?

బయట అంతా నిశ్శబ్దంగా, ఉన్నా!
మాట నుండి ధ్వని! రెక్కలు విప్పేను
అర్థాన్ని నిలుపుకొనీ తన ఈకెలపై
నలు వైపులలో మనిషి మనిషి కందించేను
ఒక జీవన గమ్యంతో ఒక సమాజ లక్ష్యంతో
ఒక కారణ నిర్దేశంతో జన భాగ్యం కోరేను

క్షణం నుండి క్షణానికి కదలే సూర్యుడో! చంద్రుడో!
పదం నుండి పదానికి తరలే తేజం! హృదంతో
నిజం అలంకరింపబడీ! వాస్తవం బయట పడేను
ఏ విధంగానూ కవిత! అబద్ధం చెప్పేది కాదు

కలలో బొమ్మల్ని మెలకువలో మనుషుల్ని
కలుపుకొనీ! నీడలు వెలుగులుగా చూపేను

కవిత! ఎవరి సొత్తు కాదు ప్రతి ఒక్కరిదీ
భాషలు వేరయినా స్పందనలో అంతరంగ స్పర్శతో

మనుషుల్ని కలుపుతుంది బ్రతుకు లొకటి చేస్తుంది
దాహంలో అందరికీ అందే నది నీరులా

వర్తమాన చరిత్రను రికార్డు చేస్తుంది కవిత
మానవ నిజ రూపాలను తనలో బింబిస్తుంది

22. భద్ర నిలయం

తల పైకి ఎత్తి చూస్తే అంతా నిర్మానుష్యం
మనిషి జాడ లేదు అంతా శూన్యం! అనిపిస్తుంది
అయినా! ఆ ఆలోచనలో ఊసులెన్నో!
దివిపై మనిషి మరో నిలయం! భావనతో

గగనం నా తల పయి క్యాప్‌లా అమరుతుంది
కాళ్ళ కింద అవని! అంతా నాదే అనిపిస్తుంది
కదలే నది నాతో జారుతుంది నేలపై
జీవన సహచరిలా కదలుతుంది సమాంతరంగా

పగలు రవిలా రాత్రి శశిలా మనసు
దేని కయినా ఒడి గడుతుంది స్వేచ్ఛలో
సహకారం అనురాగం పీడన హననం
వాస్తవానుభవం తప్ప, కల్పనకు తావు లేదు

ఏ స్థితిలోనూ ఏ బ్రతుకు సమాధి అనిపించదు
అణగి ఉంది, మరో క్షణం చేతనతో కదలుతుంది
జీవ శక్తి స్పందనతో మనిషి మనిషిలో
మతిలో సరికొత్త మనః ప్రపంచ వనం!

చేసిన తప్పుకు పరిహారం మిషతో
మరో జన్మ పయి మతిలో ఆలోచన!
లేని చోట ఉన్నదిగా! ఎప్పటికీ భ్రమలో
దీనిపై దృష్టికి అవసరాన్ని కలిగిస్తుంది

జీవన గమనంలో వైవిధ్యం వైరుధ్యంతో
సమయం! జ్వాలా రూపంగా ఎదురవుతుంది
ఉద్రేకం ఉద్వేగం తీవ్రతల్ని బట్టి
క్రియా శక్తిలో వేగం! ప్రమాద భరమవుతుంది

నడచే ఆశాజీవికి దొరికిన విరామ సమయం
పూల గుత్తిలాగ ఎదురు పడవచ్చు!
సాగే యత్నశీలి తలపై పాల పిట్ట వాలవచ్చు
నిలిచిన ఎదకు సమాజం భద్ర నిలయమవుతుంది

23. అన్నిటికీ అవకాశంతో

నిర్వేదంలో రగిలిన ఉద్రేక స్థితిలో
మస్తిష్కం నుండి ఎగసే అనల కీలకు
గట్టు పైన నిలిచి చెరువును చూపిస్తే సరిపోదు
అలలపై కదలే ప్రతి రూపం సహాయ పడదు
మనిషి నుండి అయినా! అనల చర్య ఆరేందుకు
సహన జలద సేచన ఒకటే శరణ్యం!
ఇది ఎపుడు బడితే అపుడు పొందేది కాదు
మనిషిలో మానస పరివర్తన తోనే సాధ్యం

కొందరికి ఎగసే మంటలు చూస్తే సంతోషం
వాటి కవి మండి సమసి పోయేనని నమ్మకం
ఇంకొకరు నీటి బకెట్‌తో సేచనకు తరలేరు
మరొకరికి వెచ్చని ఎర్రని స్వప్న ఖండ దృశ్యం
ఏ చోటయినా బాధారుణ దృశ్యం చూస్తూనే
ఏదీ పట్టని ఒకరు! తీర్చిన మంచు బొమ్మలా
ఇది కరగి కదలి నీరయి నడచేందుకు
వేడి ఎంత కావాలో! అది ఉంది శరీరంలోనే

ఉదయం సాయం సంధ్యలలో రంగు ఒకటే
ఎరుపు నుండి తెలుపులోకి పగలవుతుంది
ఎరుపు నుండి నలుపులోకి నిశి అవుతుంది
రూపంలో మార్పు! మరో గమ్యానికి మలుపు!

ఎరుపులో ప్రశ్నావళి, నలుపులో సందేహం
తెలుపులో జవాబు కయి రంగులెన్ని మారేనో?

పాయలుగా ఆలోచనలు మనస్తత్వ రీతులలో
అన్నిటికీ సమాజం తనలో చోటును కల్పిస్తుంది

కవిత కూడ అంతే అన్నిటికీ అవకాశంతో
విశాల మతిలో చేరే మానుష రూపాలెన్నో

చర్యకు ప్రతి చర్యతో అనుభవ గ్రంథంతో
మనసులో సృజన లోక సమాజ దృశ్య దర్శనం!

24. తెలియనంత వరకు

సంక్షోభ స్థితులలో కవిత అమూల్యమై
వ్యక్తికి తేరుకునే ఆక్సిజన్ అందిస్తుంది
నలుపు నుండి తెలుపును వేరు చేసి చూపుతుంది
అకవితకు వీడ్కోలుతో సుకవితకు స్వాగతం లభిస్తుంది

ఆదర్శంలో దేశం హద్దులు చెరగి పోవచ్చు
కల్పనలో నిలయం గోడలు తొలగి పోవచ్చు
లౌకిక జీవన గతిలో నిలచే ఉంటాయి
అవతలి దృశ్యంతో సంబంధం తలుపులు నిలుపుతాయి
స్వచ్ఛమైన గాలికి కిటికి మార్గం చూపిస్తుంది
స్వేచ్ఛకు మాత్రం! హద్దులు గోడలు! పక్కకు తొలగేను

పూవు పూచి స్నిగ్ధంగా ఒక అర్థం ఇస్తుంది
అదే పూవు వాడి పోయి అర్థం వేరవుతుంది
సందర్భం వేరు వేరు, చూచే చూపులు ఒకటే
ప్రకృతిని పోలిన స్థితులెన్నో మనిషి జీవితంలో

నీడ పడితే దగ్గరలో వస్తువు ఉన్నట్లే
వెలుగు రేకల వెనకనే చీకటి ఉన్నట్లే
కళ్ళు తెరిస్తే వెలుగులో వస్తువు! అనుభవంలో
కళ్ళు మూస్తే చీకటిలో వస్తువు! జ్ఞాపకంలో

శబ్దం తొడుగుతో మొదలవుతుంది కవిత
అందం ఆకర్షణతో ప్రయోజన రుచి చూపిస్తుంది
కవి నుండి సృజన రూపం దాని కది అపార విశేషం
ఇతరుల దృష్టిలో ఎక్కడి కక్కడ నియతం సీమితం

కనిపించే అక్షర జగత్తులో వస్తువులన్నీ
కవితకు పరిణామ సహజ రూపాలే!
ప్రవాహ జలాల నుండి విద్యుత్తుకు కారణం తెలిస్తే
పరిణామంలో వికాస గతి గురించి తెలుస్తుంది
తెలియనంత వరకు ఆ రహస్యమొక ఆశ్చర్యం
విచిత్రం! అతీతం! దైవికం! ఒక దాని వెంట మరొకటి!

25. ప్రభుత నెరపుతుంది

చెట్టు మాట్లాడదు మాట్లాడింప జేస్తుంది
శిల్పం చెదరదు మనసును స్తిమిత పరుస్తుంది
ఎప్పటివో కోటలు బురుజులు భద్రత రక్షణ కయి
ఇపుడు అనావశ్యకాలు! విజ్ఞాన ప్రపంచంలో
ఎప్పటివో రాజ చిహ్నాలు! జ్ఞాపకాలను తోడుతూ
బీభత్స ముద్రలతో చెదరిపడి ఉన్నవి

ఊరు నగరం దేశం విశ్వంతో అనుబంధంలో
శిల వలె అచలతలో! బ్రతుకు ప్రయోజనం అల్పం
ఊపిరితో స్పందనం, ఆయువు పొడిగిస్తుంది
జీవన గుణ రూపం బ్రతుకును తీరుస్తుంది

గట్టుపై చెట్టు నుండి గాలికి
చెరువులో ఆకు రాలినట్లు
గట్టు నుండి చెరువులో ఎవరో
చిన్న రాయి విసరి వేసినట్లు
మనిషిలో అనవసరంగా అశాంతి
బ్రతుకును వికల పరుస్తూ

కవిత మొదలు పెట్టగనే
మొదటి పదంలో ఉదయం ప్రకాశం
కదలి కదలి మెల్లగా చివరలో
చంద్ర ప్రకాశం విరబూసేను

కవిత మొదటి వాక్యంలో
ఆశా బిందువుతో మొదలయి
కల్లోలంలో అలలు పయి తేలి
చివరి వాక్యంలో మేఘం కదలుతుంది

మనిషి నోట మాట వెడలి నప్పటిది కవిత
ఇప్పటి దాకా! ఇంత నుండి అంతంతై
ఈ రోజే కాదు, రేపు కూడ ఆపై కూడ
అక్షర సింహాసనంపై ప్రభుత నెరపుతుంది

26. వాస్తవాన్ని వదలినవి

ఎన్నికల రోజు ముందు నిశ్శబ్దంలా
విస్ఫోటం క్షణం ముందు రహస్యంలా
భూకంపం ముందు అమాయకంలా
జలధిలో కదలే సబ్‌మెరిన్‌లా మనో రూపం
గుప్తంగా ఉన్నది అక్షరంలో కవితయై
బ్రతుకులో ప్రభావం! అసాధారణమవుతుంది

కష్టాల నెదుర్కొనే ప్రజ్ఞలో ఉపాయంతో
అప్పటి వరకూ చెప్పని మాట చెబుతుంది
అప్పటి వరకూ చూడని దృశ్యం చూపిస్తుంది
మారే సమాజ రూపాన్ని ముందు పెడుతుంది

సంపద వినియోగం జరుగుతూన్నంత వరకు
పలు విధాల శ్రమ జీవన చలనం తప్పదు
నిరోధాల్ని ఎదుర్కొనే విజ్ఞాన పరిజ్ఞానంలోనూ
సందు చేసుకొనీ బాధలు! ఒకటొకటీ

భూమి తలం నుండి గగన తలం వరకు
ఏ దారి దొరికేదీ! ముందుగ తెలియదు
భవిత పయి నమ్మకంతో ఊపిరి ఆడుతుంది
నవత పయి మక్కువతో కవిత వెడలుతుంది
ఎంతటి విజయంలోనూ కారణ రహస్యాలు
తెలిసినవనిపిస్తాయి కాని అవి ఎప్పటికీ అసంపూర్ణమే

వెలుగులు చిమ్ముతూ వచ్చే విజేత సూర్యుడు
చీకట్లకు దారి ఇస్తూ పోవడమొక విచిత్రం
ఆటోప ప్రతాపాలతో ధగధగలాడే వీరం
ఝున ఝున కురిసే కరుణ జలాలకు ఒదిగేను

అట్లా చేసి ఉంటే బాగుండేది
ఇట్లా జరిగి ఉంటే బాగుండేది
మనిషిలో ఆలోచన! వాస్తవాన్ని వదలినవీ
అన్నీ ఉబుసుపోకకు పనికి వచ్చే మాటలే

27. అమృతం దొరికినట్లు కాదు

దేశానికి స్వతంత్రం అమృత కుంభం దొరికినట్లు కాదు
అదే అనుకున్నా! అనుకోడానికేం? కాని
అది ఎవరి చేతులలో నిలుస్తుంది? ఎందరికి లభిస్తుంది
ఇష్టమైన వన్నీ, తమ అర చేతిలో వచ్చి పడవు

కణ కణాన చేతనతో మనిషిలో బలం
మానసిక సుస్థితి సుందరతతో అస్తిత
వ్యక్తి నుండి సమాజానికి చేరడం సులభం కాదు
సుఖాలనెన్నిటినో వదలుకోవలసి ఉంటుంది

శక్తిని మించిన బరువును మోస్తూ నడవలేక
చదికిల బడే వారే కాదు ఉరి వేసుకునే వారూ
ఆశలతో జీవన స్వప్నంలో తిరిగే ద్రిమ్మరులతో
విద్యార్థులు కృషీవలులు కార్మికులు సాధారణ పౌరులు

ఇష్టం ఒకటయితే దొరికేది మరొకటి కావచ్చు
బ్రతికే విధం ఒకటయితే ఆలోచనలో మరొకటి కావచ్చు
ఉన్నతి కయి ఉన్ముఖంతో మనిషి! ఆరోహణలో
నేలను మరిస్తే అపాయం! నింగిని వ్రేలాడితే ప్రమాదం

సిలబస్ ననుసరించి బ్రతుకులు గడచేనా?
అనుభవంలో ఉన్నది పోవచ్చు, లేనివి రావచ్చు
ఒకపుడు శూన్యం మిగలవచ్చు! నిరాశ మిగలవచ్చు
ప్రతి లిప్త సుమమో! ఫలమో! అయి అలరించదు

నీడ నీడే! ఎవరి చేతిలోకి రాదు, రాలేదు
వెలుగు వెలుగే! ఎవరి చేతిలోకి రాదు, రాబోదు
వెలుగులో నీడతో తన రూపం ప్రకటించేను మనిషి
అద్దంలా అందంగా ఉంది, మనసులో గుప్తంగా ఉంటుంది

మనిషి కళ్ళు శాంత సరస్సుల వలె కనిపించేను
శశి కళ గానో పూవు రేకు గానో శుభ్రంగా తోచేను
పెరిగే కొద్దీ స్క్రీన్ పయి చెదరిన చిత్రంలా
గడచే కొద్దీ రాలే బూది పొరల ముఖంతో

28. పిడికిలిలో కాలంతో

ధైర్యమెంత ఉన్నా అఖండంగా నిండుగా
కొన్ని పనులు సాధ్యం కావు
ఆకాశాన్ని నిచ్చెనపై చేరే కోరిక
బాధలేని దు:ఖం లేని ఆయువుపై ఆశ
కావలసిన వయినా కొన్ని పనులు సాగవు
కలసి రాక పోవచ్చు! గురి తగలక పోవచ్చు

ధూళి పొర అంటని ముఖం లేదు
మణి అయినా బొగ్గు అయినా ఒకటే
మలిన రహితమయితేనే మనసుకు ప్రతిఫలన గుణం!
ఎప్పటికప్పుడు నిర్మలమయితేనే! ఇది సాధ్యం

తెలిసినా తెలియకపోయినా! మౌనంగా
కాలం జరిగిపోవడమే! జరుగుతుంది

ఏ అద్దం ముక్కలో చూచినా అదే ముఖం
ముక్కను మారిస్తే మరో ముఖం కనిపించదు

తగిలిన గాయాన్ని బట్టి ఎవరయినా
వేగంగానో తీవ్రంగానో చర్యకు సిద్ధంగా
మనిషికీ మనిషికీ మధ్య నిశ్శబ్దాన్ని
ప్రేమ అధిగమిస్తుంది వంతెనలా!

సృజన రచనలో కవిలో కార్పెట్‌లా
నిశ్శబ్దం! పరచబడీ స్వాగతమిస్తుంది

గొడ్డలి గాటు ఎరగని అడవిలో
చెట్లలో ఒకరై! జన గణాలకు దూరమై
సమాజ హిత బంధువులుగ చరించేరు
పొదలు రాళ్ళు గుట్టలతోనే స్నేహం

సహనాన్ని శాంతాన్ని పొలిమేరలు దాటించి
భయాన్ని మరచిపోయి సాహసాన్ని కప్పుకొనీ
పాపం, పుణ్యం! మాటల గారడికి దూరంగా
పిడికిలిలో కాలంతో అన్నీ సాధ్యంగా బ్రతికేరు!

29. పూర్ణత వైపుకు

ముంగిలిలో విరిసిన పూవును ముని వేళ్ళతో
స్పృశించేను మనిషి! మృదు భావనతో
చెట్టు నీడ వెనక దాగిన శత్రువు
కఠినత చూపేనా? చాకును విసరేనా?

వెన్నెలలో చెట్టు నీడ! అవనిపై
మనసులో వినీల మేఘాన్ని గుర్తు చేస్తుంది
పగటి ఎండకు భయపడి ఇట చేరిందా?
రాత్రివేళ ఆర్ద్రమై రేపటికి సిద్ధమయ్యేనా?

తెలిసిన అడుగుల దారులతో
తెలియని చీకటి అంచులతో
ఒంటరితనం! ఎదారిని తలపిస్తూ ఊహలో
ఎక్కడో ఒక చోట పచ్చని చెట్టు ఉండవచ్చు
కాసేపు నీడ పట్టున నిలిచి పోవచ్చు
పూవొ! ఫలమొ! దొరికితే మంచిదే!

పైన ఎక్కడి నుండో రవి కిరణం
కిందికి దిగి దృష్టికి ధన్యత చేకూర్చేను

ముఖ నిలయానికి తలుపుల్లా తెరచిన
పెదవులపై నవ్వు! కొమ్మకు పూవులా
చూచే మనిషిని మనిషై పలకరిస్తుంది
హృదిలో హ్లాద బిందువు వదలుతుంది

రాత్రి ఎక్కడెక్కడో చెదరిన వెలుగు ముక్కలు
ఉదయం ఒకటయి కలిసి పోయి నవాకృతి పొందేను
ఇంకా అక్కడక్కడా చీకటి జాడలున్నా
లోన వెలుగు! ప్రకాశ సుందరంగా! మనిషిలో

నిశ్శబ్దంలో శబ్దం కవితలో లయ లహరులతో
మౌనానికి మాట నిచ్చేను, ప్రాణానికి రూప మిచ్చేను
మేల్కొన్న సమాజం! శబ్ద ప్రపంచంలో
చేతనతో పూర్ణత వైపుకు నడిపిస్తుంది

30. పంక్తిపైలోనో క్రాస్ చేసో

చీకటిలో గీసిన అగ్గిపుల్ల
పెదవుల మధ్య బిగించిన సిగరెట్‌ను
కాల్చే మనిషిని పరిచయం చేస్తుంది
వెలుగు చేతులతో ముఖాన్ని స్పృశిస్తుంది

పఫ్‌కు పఫ్‌కు మధ్య విరామంగా
రెండు వేళ్ళ మధ్య నిలిచిన సిగరెట్
అవును! కాదు! మధ్య క్షణాల్ని రాలుస్తుంది
సందేహానికి పరిష్కారం! ఏష్‌ట్రే అవుతుంది

కళ్ళ ముందు వెలిగే నిప్పు పుల్ల
అంతలోనే అంటుకొన్న సిగరెట్
మనిషికి ఆ వేళ నిప్పు భయం లేదు
ఆ మనిషి ఎవరో నిప్పుకు తెలియదు!

వెలిగే అగ్గిపుల్ల క్షణాన్ని వెలిగిస్తుంది
కాలే సిగరెట్ క్షణాల్ని మండిస్తుంది
తాను ఎరుపు నుండి బూదిలోకి మారుతుంది
మనిషిలో ఉత్సాహం! ఏ పని కయినా సిద్ధంగా

గోడకు తగిలించిన గడియారం శబ్దం
మనిషి గుండె చప్పుడుతో పోటీ పడుతూంది
ఇరువురిలో గెలుపెవరిది అంటే!
ఫ్రెండ్లీ మ్యాచ్, డ్రా కే ఛాన్స్!

ముళ్ళ పైన గడియారం కాళ్ళ పైన మనిషి
కాలం జడతకు చలనం ఇస్తూ, వేగం తెస్తూ

సుఖానికీ ఇబ్బందికీ మధ్య గీత
ఎవరికి వారుగా నిర్ణయించుకొనేదే!
రెండూ మనుషుల చర్యల్లో, తారు మారు స్థానాల్లో
ఒకరికి సుఖకరమైంది, మరొకరికి ఇబ్బందికరంగా
రెండూ ఒక దానిపై ఒకటి "షెబాస్" అనిపించుకోవాలని
సమాజ మైదానంలో! పంక్తిలోనో, క్రాస్ చేసో!

31. మంచు తెర అడ్డంగా

నాలో! సంక్రాంతి బోగి మంటలు! కవిత
సన సన్నని ఉష్ణ లహరి ప్రసరిస్తూ
పయనంలో ఎదురుపడే ఆటంకాలెన్నో, బయట
ముళ్ళ కంపలో! బురద మడుగులో! దాటక తప్పనివీ

కష్టాలు నష్టాలు పూలయి జలజల రాలతాయి
వేదన దాగదు! దుఃఖం ఆగదు! కన్నీరు నిలవదు
కవి వాగ్దానం! కవిత రేపటి కోసమనీ
తను ఎట్లా ఉన్నా మరొకరి భాగ్యం కోరేను

ప్రకృతిలో కనిపించే వస్తువు లన్నీ కవితలో
భావనలో బింబాలయి నైపథ్యం వహించేను
జలనిధి నది రవి శశి ఆకాశం ఇలా ఎన్నో
పద పదంలో ఒకటొకటి ఒదిగి విశ్వమయంగా

ఏ మహా వాక్యమో వినో చదివో! ఆపై
హేంగర్‌కు తగిలించి వెళ్ళేది కాదు బ్రతుకు
శ్రమ బిందువుతో బాష్ప కణంతో
మోద మయినా ఖేదమయినా బంధం ఒకటే!

ప్రతి వ్యక్తిలో ఒక ఆదర్శ రూపం
సుందర శిల్పం వలె నిలిచి ఉంటుంది
ఒక సమయంలో అగ్ని చుట్టు బడ వచ్చు
కోరిన ఉపయోగంలో నయితేనే సార్థకం

రాత్రి వీధి దీపం కింద కళ్ళు మూసిన
మనిషి! ఉదయం తొలి కిరణంతో
లేవగనే! వెనక్కి జరిగి పోతుంది వెలుగు!
కళ్ళ ముందు చీకటి నిలవడం, అభాగ్యం

బాధను మరపించేందుకు భక్తి గీతం
ఎద మంటను ఆర్పేందుకు ప్రేమ గీతం
ప్రశ్నలు సంధించేందుకు! వీర గీతం
ఏదీ పని చేయడం లేదు! ఈ సందర్భంలో

మనిషికి మనిషి కనిపించడం లేదు!
మంచు తెర వచ్చి నిలుస్తూంది, అడ్డంగా

32. వాస్తవ మొకటే

జీవితాన దరిద్రాన్ని వరమని తలచే దెవరు?
మానసికంగా దరిద్ర నిలయ మొక దౌర్భాగ్యం
ఇవి సంఘం నుండి బహిష్కృతం కావలసిందే
ఆలోచన ఎప్పటిదో? అన్వేషణం ఇప్పటిదా!

వాస్తవాన్ని ఎదుర్కొనే ఉదారత కరువయి
స్వార్థం పన్నిన సంకుచితం ఉచ్చులో ఇప్పటికీ
ఎక్కడో ఒక చోట అవసరాల గోడలతో నిలయం
హద్దులతో తన దనిపిస్తుంది ఆశా వ్యక్తిత్వంలో

పందిరి నల్లుకొనే తీగెలాగ ఆదర్శం
నాలుగు పూలకు మురిసే మనో రూపం!
అపుడపుడూ గోడలు తొలగుతూ స్వేచ్ఛలో
గమ్యం చేరక పోవడమొక వైరుధ్య ప్రభావం

సంఘ సముద్రం అలలను ఏ చేతులు ఆపగలవు?
కత్తిపోటుకు వీలులేదు, గదాఘాతం పనికి రాదు
అలల పయి జలధికి గల ప్రేమ
మనిషి పయి సంఘానికి ఉండేనా?

పతంగి పయి కెగుర వేయబడీ
ఎంత సేపు తిరుగుతుంది నింగిలో?
పడవ వదలబడీ అలల పయి
ఎంత కాలం కదలుతుంది జలధిలో?

గొంతు లేని కొండ ప్రతిధ్వనితో బదులిస్తుంది
గొంతు ఉన్న నది! గలగలలతో జవాబిస్తుంది
చీకటి ముఖంలో అందాన్ని దీపం చూపిస్తుంది
వెలుగుకు తన అందానికి మురవడమే సరిపోతుంది

నిన్నను ఎవరూ అంతగా పట్టించుకోరు
పాత వస్తువుల్లో తిరిగే పరిశోధకులు తప్ప!
రేపు! సందేహం ఊయెల పయి ఊగిస్తుంది
నేడులో! వాస్తవ మొకటే! నమ్మకంగా నిలబెడుతుంది

33. శూన్యాన్ని నింపుతుంది

మనిషితో పరిచయం ఒక అపూర్వమయిన అనుభవం
హృదయానికి గంధపు చుక్క అద్దినట్లు ఉంటుంది
అప్పటి వరకు ఉన్న హద్దును దాటిస్తుంది
ఎవరి దారి వారిది అయినా, సమ భావన నిలుపుతుంది

పరిచయ బిందువు నుండి స్నేహం ప్రణయం బంధుత
అంచెలుగా ఆరోహణలో జీవన శిఖరాల పైకి
బరువు నెవరో తీసుకునేట్లు! మనసు తేలిక పడుతుంది
మబ్బు ముక్కలానొ వెలుగు రేకులానో! అనిపిస్తుంది

మౌన క్షణాలను కరగిస్తుంది, శబ్దమయం చేస్తుంది
బ్రతుకును ప్రవాహ గతిలో ఒకటి చేస్తుంది
ఎదురుగా మనిషి! మాట్లాడక పోయినా ధైర్యమిస్తూ
వెనకనే మనిషి! కనిపించక పోయినా ప్రేరణనిస్తూ

మనిషి! మనిషి! మనిషి! మనుషులతో మనుషులు! అంతటా
ఆడ మగ భేదం లేదు! జీవన చలనంలో సార్థకమయి
సహజంగా అవసర మయిన విభేదాల గుణ కలనంతో
సరస్సులో ఈద జేస్తాయి! నింగిలో ఎగర జేస్తాయి

తెలిసిన మనిషితో స్మృతి పర్వం మొదలవుతుంది
తెలియని మనిషితో కల్పన కథ ఏర్పడుతుంది
చీకటిని కత్తిరించి చక్కని బొమ్మలు చేసి వదలి
ఆడించడమూ జరుగుతుంది మనసులో! నమూనా కాదు

స్నేహంలో పూల గుత్తులయి ఎదురు పడవచ్చు
వైరంలో అనల కణాలయి ఎగిరి పడవచ్చు
తాను ఎదురు చూచే వారు రాక పోవచ్చు
తాను అనుకోని వారు వచ్చి చేర వచ్చు

ఏ ఇంటి నుండో పుట్టిన శిశువు ఏడుపు! ధ్వని
ఆశిశువు కెట్లా ఉందో? తెలియదు, కాని
వినే వారికి మాత్రం! పట్టరాని ఆనందం
కొత్త మనిషి స్వరం మనిషిని పైకెత్తుతుంది

ఆ సుందర పరిచయమొక వసంతాన్ని దింపుతుంది
శూన్యాన్ని నింపుతుంది! నిజ జీవన కవితయై

34. అన్నిటికీ సిద్ధంగా

"నేను" 'నా' మూలాల నుండి
ఎగసిన అక్షర రూపం కవిత
పద పదాన అలలా సృజన నవం
ఆర్ద్రతతో మనిషి మనిషిని కలుపుతుంది

బ్రతుకులో కరుణ జలం బరువు కాదు
మనసులో ప్రేమ సుమం బహు తేలిక
కవిత మట్టి కాదు, పదం నుండి సృజన రూపం
ఎవరు ఏ తరు సుమ ఫలాలు కోరేదీ! వారి ఇష్టం!

తన స్థానం దేశం జీవన విధిలో మనిషికి
వ్యవహారం వర్తకం ఏదయినా స్థానికం అవసరం
ఎక్కడి శిఖరాల నుండో తాళ్ళు విసరి
స్వేచ్ఛ కంతరాయం! సమాజ స్థితికి భంజకం

ఆహారం అవసరాల ప్రాధాన్యం పక్కకు పెట్టి
ముస్తాబులలో ప్రదర్శనలపై ఆరాటంలో పోటీ
కష్టం సుడి గుండంలో సామాన్యుల బ్రతుకులు
ఇవి తమ దేశానికి తగిలిన గాయాలవ రాదు

ఎంతో గర్వంగా చెప్పుకునే ప్రబోధాల నుండి
దారి చేసుకొనీ! జీవన కటు వాస్తవాలు
ఏది పనికి వస్తుంది? ఏది పనికి రాదు
ఆలోచనలో జవాబు, మానవీయ స్పృహ తోనే

ప్రజాస్వామ్య చలనంలో సమస్యల పరిష్కారం
మానవ సంబంధాలతో ఉదారతను కోరుతుంది
కాలంతో పాటు కదలే జీవన రూపానికి
సుగమత సుస్వరతల తోనే హ్లాదం! భాగ్యం

మనుషులు బహు దగ్గర అయ్యే! పరివర్తనలో
ఎందుకయినా మంచి దనుకునే పరిస్థితులలో
పై జేబులో చాకుతోనో! లోజేబులో పిస్టల్‌తోనో
బ్యాగ్‌లో గ్రేనేడ్‌తోనో! అన్నిటికీ సిద్ధంగా కనిపించేరు

35. అభినవం

ఇది స్వేచ్ఛా మనో జగం! కవితామయం
ఏదయినా చేరుతుంది, ఎన్నయినా సహిస్తుంది
ఈ విశాల ధరిత్రిపై సమాజ చేతనతో
స్వయం నియంత్రణం తోనే గమ్యం సులభం

కావలసిన కలను, రావలసిన స్థితిని
రప్పించే దెవరు? ఆ కోరిక తీరేనా?
స్నేహానికి అవకాశం! కలహానికి సందర్భం
మనిషి మనిషికీ భిన్నం! దిశ దిశ మార్గాలెన్నో!

వైరాన్ని మరచి, విజయాన్ని దాటి
పణాన్ని వదలి వరాన్ని పొంది
నిలిచే దొకటే, మానవ గుణ బంధం
ఇది మరణం ఎరగనిది, అమృత మయం

శిథిల పంక్తి నుండి మొక్కలా
స్వేచ్ఛలో సమాజ తలం పయి
నీది నాది అందరికీ చెందింది కవిత!
తరాలు గడచినా! అభినవ రూపంతో

అనురాగం అనుభావం తేజం శమనంతో
జీవిత మొక అనుభవ నిలయం అనుకుంటే,
అపుడపుడు శోకం! తీగెలుగా అల్లుకొనీ
అనుకోకుండా భగ్గున జ్వాలా చలనంగానూ

కష్టాల పర్వతాల్ని దాటి బాధల శిలల్ని గడచి
పూల పందిరి కింద కవితయై విశ్రాంతిలో
చుట్టూ ఉన్న శూన్య ముఖాలను వదలి
తన ముఖాన వాడిన పూవు రాలి పడవచ్చు

ఎవరో పలకమంటే పలికేది కాదు
ఎవరో వ్రాయ మంటే వ్రాసేది కాదు
కాలానికి రంగు లెన్నో! హృదయానికి రాగాలన్ని
రంగుల దారాలతో అల్లిన కాల పటంపై
ఇది స్వేచ్ఛా మనోభవం!
జీవన నవ సంకేతం!

36. మెలకువ స్పృహలో

రాత్రి కలలో కనిపించే మనిషిని
గుర్తించేది తనే, అయినా
ఉదయం మెలకువలో వెదకే దెవరు?
పురాణ పథలలో పాత్రలు తప్ప!

అనుభవ వాస్తవంలో యథార్థం
కలలో ఏ వస్తు రూపమో పొందవచ్చు
నాటికలో దృశ్యంలో చిన్ని ముక్క జారిందనిపించవచ్చు
మరో రూపంలో పూర్వపు స్మృతి కావచ్చు

కలలు కనని మనిషి లేడు ఉండడు
"నిజం" తన ఎదురుగ ఉన్న బొమ్మ కాదు
అందమయిన పూవు అయి అలరించవచ్చు
భయద మయిన ఆయుధ మయి నిలవచ్చు

ఇది నిద్రా సరసిలో పడవ లానో
మెలకువలో బరువును తేలిక పరుస్తుంది
ఇది కోరిక రెక్కల పయి ఎగురుతుంది
శరీరాన్ని మబ్బులా తేలిక పరుస్తుంది

ᔓᔐ

నిజ జీవితంలో పైన మండే సూర్యుడు
కలలో కాలం బహుమతి రూపంగా
చేతిలో గులాబి పుష్ప గుచ్ఛం కావచ్చు
సుందర వదన శోభగ మారవచ్చు

మనసుకు పగలు రాత్రి భేదం లేదు
ఊహకు శక్యం, అశక్యం సమస్య లేదు

కవి మనస్సు ఎప్పటికీ మెలకువ స్పృహ లోనే
శిశిర వసంత పార్శ్వాలతో ఏ పాత్ర కయిన సిద్ధంగా

వేటు పడిన ఆశాలత, కత్తెర పడిన పూలు
క్రూరం ఘోరం వైరం క్రోధం సహనం శాంతం
సృజన జగంలో! మానవ సమాజ కథతో
కలలోను మెలకువలోను నిజ మానస దృశ్యాలే

ᔓᔐ

37. కోరికలో మాట

మతిలో జ్ఞాపక స్పృహ నుండి
ఇప్పటి వరకు తీరని కోరిక నాలో
రెక్కలు విప్పిన రూపం విరిసిన పూవులా
అనితరం అమూల్యం, "మాట" వినాలని

రోజులు గడచినా కోరిక మిగిలే ఉంది
చివరి దాక ఇలాగే ఊగుతూ ఉండొచ్చు

పెదవులపై నుండి మాట బయట పడుతూ
విప్పారే లోగా మాయ మయి పోతుంది
వజ్రంలా మెరసేనని ఆశ లేక పోలేదు
నిరాశ మిగులుతూంది అనుభవ క్రమంలో

అపుడు ప్రాప్తి శూన్యం కిందే లెక్క
దీనికి ప్రామ్‌టింగుతో పని లేదు
ఇది వచ్చే ముందు రిజర్వేషను లేదు
కళ్ళు కప్పి ఎచటి నుండో హరించేది కాదు

పెదవి దాటి బయటికి వస్తూనే అంతలో
దూసుక వచ్చే ఏ వాహన శబ్ద తరంగమో
మాటను అమాంతం ఎత్తుక పోతుంది
ఏ పిలుపో ఏ అరుపో తరలించుక పోతుంది

ఒకటి తరువాత ఒకటి మనిషి మనిషి నుండీ
వికసించే పరిమళించే వీలు లేకుండా
ప్రతి సారీ! అంతరాయ శబ్ద మెదో విధంగా
ఎవరి కోరిక పైనొ వచ్చేది కాదు సృజన

మార్కెటులో దొరికే వస్తువు కాదు
పోటీలో పాల్గొనే తరహా కూడా కాదు
దీనికి చింత లేదు బాధలేదు, అన్వేషణ తప్ప
పోను పోను ఆశ నెరవేరుతుంది, కవితలో

అపు డపుడు! టేబిల్ పయి అమరిన ప్లాస్టిక్ పూవు
అలరిస్తూ, మురిపిస్తూ, నా వైపే చూస్తుంది ప్రియంగా

38. స్వేచ్ఛకు అవకాశంతో

అసమ శిలల పయి అడుగులతో
కదలే మనుషుల చూపులలో
పైన మబ్బు, కింద పూవు
ఆశకు ఇరువైపులలో
జీవ కళను నింపుతాయి
జీవన సందేహంలో

తరువు మాట లాడుతుంది, జలదంతో
పూవు ఆట లాడుతుంది, పవనంతో
మనసు మాట లాడుతుంది, గగనంతో
కవిత పాట పాడుతుంది, హృది లయతో
శిశువు ఊసు లాడుతుంది, అమ్మతో
ఎవరు మాటలాడలేనిది, ఒకటే
అది అనలం!

దీపం వెలుతురు! మనుషుల మతిలో భాగం
జీవన స్పందన రూపం! హృదిలో మూలం
మూలానికి పై ఆకృతి! ఆకు ఫలం పూవుగా
జన హిత సంపదలో అవసర వస్తు చయం
పాత ఆశ రాలుతుంది అనివార్యంగా
కొత్త ఆశ చేరుతుంది విరమణ గతితో

అనుభవ గమనంలో ఊహలు నిజమయ్యేనా?
కృషిలో అంకిత భావ బలంతోనే సత్ఫలితం
చూపుకు ఒక హద్దు ఉంది, నడకకు ఏ హద్దు లేదు
కాలం జరుగుతుంది! స్వేచ్ఛకు అవకాశంతో
నడచే కొద్దీ దిశలో విపులత పెరిగేను
బ్రతికే కొద్దీ రుచిలో భేదం తరిగేను

39. పరిష్కార సూచికగా

హృదయం ముఖ్యమనీ! బ్రతుకు బండతనంతో
సంస్కారం చదువు మరచి జంతువులయ్యేరా?
ఎన్ని కథల సంపుటమో! ఈ జీవితం
ఎన్ని క్రియల సంకలనమొ! ఈ అనుభవం
ఎన్ని వ్యథల మిశ్రమమో! ఈ మానసం
ఎన్ని విలువల కలయికనో! ఈ వికాసం

ఎవరి బుజాలపైనొ! గమ్యం చేరాలని
వాహన మొకటేదొ! దొరకక పోదా? అని
కాలి నడకతో పయనం మొదలవుతుంది
దిశదిశలో మనిషి చూపు విహగంలాగ
జడతలో ఉన్న మనిషి! అడ్రసు మారదు
మొదటి నుండి చివరి దాక! వేలాడుతూ

మనిషిలోని స్వేచ్ఛకు నది సంకేతం
ఎంతటి దయినా ఇరు దరుల మధ్యనే
అలల హోరు ధ్వనులతో నినాదాలు
చలన వేగ సమాజాన్ని తలపిస్తుంది
నది నిలవదు, గిరి కదలదు, పవనం ఆగదు
మనిషి నడక మరలదు, చెట్టు వేళ్ళు కదలవు

వేళ్ళు పైకి తీస్తే, చెట్టు నడక సాగేనా?
ఉన్న ఉనికికే క్షతి కలిగే ప్రమాదం
పూవు ఫలంతో తరువుకు సంపద! ప్రయోజనం
ఊహ క్రియలతో మనిషికి! పురోగమన లక్ష్యం
చినుకులతో మురిసి, నవ్వు చిందుతుంది నేల
బతుకులో బతికే సమస్య పరిష్కార సూచిగా

40. నడకలో నడతతో

గుడిసె నుండి భవనానికి దారి తెలిసి
ఉండేందుకు ఏదయినా ఒకటేననుకొనీ
గుడిసె నెవరు కోరతావు
భవన మెవరు వదలుతారు
మండే ఎండలలో నీడ సుఖంతో
అది చిర వాసంగా ఎన్నుకునే దెవరు?

అందని దానిని అద్దంలో కనిపించే అంగడిలో
చూపుకు సాధ్యం కానిది సాధ్యం అనిపిస్తుంది

జలనిధి బిందువులో ఉప్పదనం
కరుణ జల కణంలో వెచ్చదనం
తెలిసే అనుభవ రూపం జీవితం
వెనక నుండి హేతు ప్రకాశంలో

రాతి పరుపు కింద ఉన్న జల ధనాన్ని
పొందే ఆలోచన గాలికి వదిలేసి
శిలలను నిందిస్తూ కాలం గడిపేరు
శ్రమ జలం జారకుండ పని జరిగేనా?
కలలో సరసి జలంతో దప్పిక తీరేనా?
పట్టిన దోసిలితో శమనం పొందేరా?

చెరువు కట్ట, నీరు నిలవ జేస్తుంది
జలధి గట్టు అలల నదుపు చేస్తుంది
మనిషిలోని నీతి నమ్మక మిస్తుంది
బ్రతుకు లోన మార్పు వికసన మిస్తుంది
మనిషికి తరువొక ఆదర్శం అనుకున్నా
నడకలో నడతతోనే అస్తిత నుండి జీవితం

స్వేచ్ఛా కవిత్వం-84

ఇది జీవితం

(IX భాగం)

కాలం కప్పులో

మాదిరాజు రంగారావు

2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 84

IDI JEEVITHAM

(IX Part)

(KAALAM KAPPULO)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2018

Presented to
my wife
Smt. Indira

పీఠిక

కాలం సిగ్నేచర్

"కాలం కప్పులో" అందించే స్వేచ్ఛా కవిత్వం రసమయమయింది. "ఇది జీవితం" బృహత్కృతిలో తొమ్మిదో భాగం ఈనాడు సమాజంలో నెలకొన్న సంక్షుభ్ధమైన స్థితుల్ని దృష్టి పెట్టుకొని వెలువడింది. ఆశా రూపాన్ని కలిగింది.

ఇందులో సామాజిక రాజకీయ నైతిక తాత్విక దార్శనిక (Ideological) కోణాలలో భావ ప్రపంచం నెలకొన్నది. వైయక్తికమైన స్పృహతో పాటు తప్పని సామాజిక బంధం కలిగిన రూపాన్ని గమనించవచ్చు 1. ప్రకృతి నేపథ్యం 2. సామాజిక వాస్తవం 3. వర్తమనా స్థితిగతులు 4. ప్రజాస్వామ్య లక్ష్యంతో తీర్చబడింది.

సమాజ పరిణామంలో మేలయిన జీవితం కోసం అవసరమైన భాగ్యం – శ్రమ జీవనానికి ముఖ్యమైనవి గుర్తించడం జరిగింది. వ్యక్తిలో మార్పుతో సమాజ పరివర్తనంపై ఆలోచన జరిగింది.

ఇది స్వేచ్ఛా కవిత్వంలో 84వ కృతి. వ్యక్తి వికాసం నుండి సమాజ ప్రగతి వరకు భావ సూత్రం ఒకటే – అది మానవీయం. ఈ సందర్భంలో ఎన్నో విషయాలు ప్రసక్తమైనాయి. అన్నిటికీ మానవ చేతనయే కీలకంగా, ఒక విధంగా కేంద్ర నిలయంగా భావితమయింది.

భావ సాంద్రతచే ఆకర్షించే అభివ్యక్తిలో భావ రూపాలు ప్రతీకలు చోటు చేసుకోవడం జరిగింది. ఆధునిక స్వేచ్ఛా కవిత్వంలో ఈ రెండూ పరిహరింప రానివిగా బలమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి.

ఈ అంశం పూర్తిగా మనం రోజూ చూచే వినే విషయాలతో సామాజిక వస్తు గౌరవంతో ప్రకృతి భూమికతో మానవ మనస్తత్వ చింతనతో ఆవిష్కృతమయింది. కవిత్వంలో సమాజంలో విషమ విషాద స్థితులతో పాటు విభవ విజయ స్థితులేవయినా బాహాటంగా కాకుండా సూక్ష్మంగా పరోక్షంగా వ్యంగ్య విలసితంగా ప్రతీకాత్మంగా చెప్పడం ఉన్నదే. ఇది ఉత్తమమైందిగాను నిశ్చయమైంది. ఈ సందర్భంలోనే కళాత్మకత చోటు చేసుకోవడం జరుగుతుంది. ఈనాడు వచ్చే కవిత్వం ఎన్నో దృష్టి కోణాల్ని విషయ పార్శ్వాల్ని కలిగింది. వివిధాంశాలతో ఏర్పడే ఆధునిక రూపం సంశ్లిష్టత (complexity) ను పొందింది. ప్రత్యేకతను భావింప చేస్తూంది.

ఈ కృతిలో వర్తమాన కాలం సిగ్నేచర్ స్పష్టంగా దృష్టికి వస్తుంది. "కాలం కప్పులో" శక్తి నిచ్చే రస భావన ప్రతీకాత్మకంగానూ అన్వర్థమవుతుంది.

– మాదిరాజు రంగారావు

ఇది జీవితం – కాలం కప్పులో
(తొమ్మిదో భాగం)

1.

ఉదయం చేతులలో ఆత్రంగా తెరచిన వార్తా పత్రిక
దిశ నుండి దిశకు పరచిన జలద పటంలా
మెరపుల్ని చినుకుల్ని పిడుగుల్ని తలపించే మాటలతో
తొలి కిరణంతో పోటీగా ఇంటి ముందు దూకుతుంది

జన బంధువుగా కనిపిస్తుంది, చరిస్తుంది
అంతా సుఖ డోలా సదృశం కాకపోవచ్చు
కలలు వీడి భ్రమలు తొలగి నిజం తెలిసి
మానుష కర్తవ్యానికి సిద్ధం కావలసిందే

వేయి రెక్కలపై సమాచార విహగం
ఎక్కడెక్కడివో వార్తలు మోసుక వస్తుంది
అణగిన కోరికలకు ఊరటగా పద పదం
రణ సూచన చేయవచ్చు, శాంతి పథం చూపవచ్చు

ప్రతి వాక్యంలో ప్రశ్నల కవకాశాలెన్నో!
చోటు లేని కథలకు వీలుగ అక్షర నిలయం
చీకటి లోయను తలపించే సమయం
చకితంగా వెలుగు రేఖ పొందవచ్చు

నిజాలపై పులిమిన రంగులు పూర్తిగ తొలగేనా?
చీకటి బొమ్మల ఆటల తీరులు తెలిసేనా?
నిశిత తీవ్ర గుణ వర్ణన ప్రభావాలు చూపేనా?
పత్రికలో బయట పడే అవకాశ ప్రకాశంతో

దారుల కడ్డంగా నిలిచిన విషమ స్థితులు
కూలిన చెట్టు కొమ్మల్ని తలపించేను
ఇంతలో రాళ్ళ వాన అందుకుంటుంది
రేగిన జన తతితో ఆందోళన దృశ్యం!

అటు నుండి హక్కుల కయి అలజడులలో
ఇటు నుండి నిరసన ప్రతి ఘటనలతో
చెలరేగిన జన సమూహ పంక్తులతో నగరం
వ్యక్తి బలంతో సమాజ శక్తి నిలయమై

చరిత్రను నడిపించే అపూర్వ ధైర్యంతో
ప్రజాస్వామ్య బాధ్యతతో పత్రిక ఒక సాధనం

2.

మబ్బు కమ్మి రవి కనబడలేదని గడియారం ఆగదు
స్థితులేవయినా తిరిగే జీవన చక్రం నిలవదు
బ్రతికిన క్షణాలు! ఎంతటివయినా జ్ఞాపకంలో అందంగా
బ్రతుకు తూన్నవి మాత్రమే! కథను నడుపుతాయి

ఆ గడచిన స్థితి మళ్ళీ వచ్చే వీలు లేదు
ఏ ఒకరికి బదులు మరొకరు చేరే వీలు లేదు
తిమిరం పరిచయమై భయం వీడినపుడే
స్నేహ స్పర్శతో వెలుగుల బంధుత నెలకొంటుంది

ప్రతి అనుభవం ఎప్పటికపుడు
అదే మొదటి దనిపిస్తుంది కవితలో
నిరంతరం చలన శీలమైన సమాజం
నేను నీవు మనం గాథలతో జన రూపం

నవ జీవన లహరులతో జలధిని తలపిస్తుంది
జలాల పయి రవి బింబం నేతలా కనిపించేను
అలలపై శశి బింబం సహచరిలా కదలేను

అణచి వేత నుండి లేచిన అలజడిలో క్రోధం
పట్ట పగలు వేళను చీకటి వశం చేస్తుంది
ఎట్లా బ్రతికేది! ఎవరి వశంలోను లేదు
దార్శనిక మొకటే వెలుగు దారి చూపేను

తన కిష్టమయిందే కాదు, జనహితకరమయిందీ
అనుభవ స్థితి చలనంలో దారులు తెలుస్తాయి
క్రుంగిన మనసుకు ఉత్సాహం నింపుతాయి
అణగిన ఊహను పైకెగరగ జేస్తాయి

మనిషి స్వరం నిశ్శబ్దాన్ని మానవీయం చేస్తుంది
మనో జగంలో కవి రవి చంద్రుల ప్రతినిధియై
నిరంకుశం నుండి స్వేచ్ఛకు మనిషిని నడిపించేను
జీవన చరితకు భద్రత నిచ్చే అక్షర పేటి! కవిత
గాజు బొమ్మకాదు మట్టి ప్రతిమ కాదు మనిషి
జీవ కణ నిర్మితితో మేధకు సుందర నిలయం!

3.

మొగ్గలు మిత్రులతో బాల్యాన్ని గుర్తు చేస్తాయి
ఉదయ ప్రకాశం ఆలోచనల్ని మొలిపిస్తుంది
పక్షులు మతిలో కోరికల్ని ఎగుర జేస్తాయి
కొండ శిలలు! గుహలతో పురా బ్రతుకుల్ని తలపిస్తాయి

చుట్టు ఉన్న ప్రకృతిలో ప్రతి వస్తువు
మనిషిలో నిజాన్ని బ్రతుకులో స్థితుల్ని ముందుకు తెస్తుంది
బాధలు హత్యలు విధ్వంసం రణ చర్యల నుండి
ముఖ మెత్తిన పంకజ రూపం! పరిణామ సహజమై
నిరాశ నుండి ఆశను వేరు చేసి చూపుతుంది
సృజనకు ఆలోచనలో పెద్ద పీట లభిస్తుంది

మాటలో మమత సమార్థమయి సరిస్తుంది
ఊహలో సృజన వాస్తవమయి ఫలిస్తుంది
విజయానికి ఎదురుగా! స్వాగత తోరణమయి
సాధించిన విజయం! మనిషికి ఆశాబల రూపం!

రాలిన ఎండు టాకులతో చెట్టు
కొమ్మల పయి గూడు స్థలం మారుతుంది
చూచే మనిషి గుండె బరువెక్కుతుంది
ఇంటి ఆవరణంలోనో బయటనో కనిపించే
పూలతో గుండె తేలిక పడుతుంది
గతంలోకి వెళ్ళిన రూపం పునర్భవం పొందుతుంది

సమయ సమయంలో సూర్యుడు! పలు విధాలుగా
నిప్పు కొలిమిగానో, గులాబి పూల చెండుగానో
వీరుని ఉత్తేజ ముఖంగానో
శపథంచే రక్త తర్పణంలో చెరువుగానో
మనో దర్పణంలో! ప్రతి బింబిస్తుంది
జీవన చర్యకు ఉత్తేజ కళ నిచ్చేను

ఈ రోజు అనుభవం! రేపు ప్రభావ ముద్రతో
పునరాలోచనకో పశ్చాత్తాపానికో గురి చేసేను
చెట్ల మధ్య మనుషులు క్షేమంగా నమ్మకంగా
మనుషుల మధ్య మనుషులు! భయంగా అభద్రంగా

4.

గాలికి ధూళి కణం లేస్తుంది! సమస్యలా
కళ్ళలో పడిన నలుసులు గరగర లాడిస్తాయి
అదే! కాలి కింద అణగి మణగి ఉంటుంది
ధూళి కణాల సమూహాల ఘన రూపం సమస్య!

ఇది ప్రకృతి రూపం, జీవితానికి తప్పనిది
మొక్కకు మూలం! బ్రతుక్కి అసౌకర్యం!
మట్టిలో భాగం, భూమితలం! నిలయబలం
ఇది సర్వంసహా! అమ్మను తలపిస్తుంది
దీని కయి కలహంలో కథలెన్నో! భూమి పేరుతో
రణ దుందుభి మ్రోగుతుంది! విజయ కళ నిస్తుంది
మానవ చరిత్రలో భూమి పాత్ర అమేయం
మనిషిని బ్రతికించేది, తీర్చేది, మార్చేది,
బ్రతుక్కి ఆధారమయి, ఎప్పటికీ అలరేది!
మనిషిని సంపద లోభంతో మురిపిస్తుంది
దీని ముందు మనిషి నిజ రూపం మరచేను
అస్తితలో వ్యక్తిత్వం! భూమి నావహించేను!

లోన అగ్ని తోనే ఏ బ్రతుకయినా నిలిచేది
జీవితాన్ని అంటుకొని జ్వాలా మయం చేస్తుంది
ఉద్యమ ఫల సిద్ధి వరకు, అగ్ని అవసరం ఎంతో!
ఆపై జలద ఛాయ కోరుతుంది వాతావరణం
మనిషిలో అగ్ని పర్వతం నిదురిస్తూ
అది ప్రేలే అవకాశం రాకపోవచ్చు!
నడతలో సునామి దూకేందుకు సిద్ధంగా
అవమానం హింస ఆత్మహత్యల ప్రభావాలతో

రాజ్యాంగం జీవన రణ కవచంగా ఉన్నప్పటికీ
ప్రబోధాల శిక్షణ కవకాశమున్నప్పటికీ
సంక్షోభ కలాపాలు జరుగుతూనే! సమాజంలో
జనం మౌన భంగిమలో! శిల్పశాలను తలపించేను
పనికి రాని బరువుల్ని! వదలి మనిషి
ఆరోహణలో పరివర్తనలకు ప్రయాణ మవసరం

5.

బ్రతుకు పుటలతో సమాజ గాథలలో
పై నివాసం గురించి ఎన్ని కథలు చెప్పినా
అనుభవ రూపం మాత్రం! క్రింద నున్న భూమిపైదే
ఉన్నంత వరకు భూమి తలంపైనే అడుగులు!

ప్రాణం నిలిపే గాలి నాతో
ఎన్ని తీరులు గానో! వర్తిస్తుంది

ఒకసారి ఆట బొమ్మగా ఆడుకుంటుంది
ఒకసారి హృదయ సఖియై హ్లాదపరుస్తుంది
ఒకసారి తుపానుగా పోరాడుతుంది
ఒకసారి తాపకరంగా వ్యవహరిస్తుంది

ఎక్కడున్నా వచ్చి స్పృశిస్తుంది ప్రేమగా
ఆత్మీయత చూపిస్తుంది ప్రాణ బంధువుగా
చేతిలో నిలవదు కాని నిచినట్లనిపిస్తుంది
సుఖావహంగానో బాధకరంగానో చరిస్తుంది
మాటల్ని నలు దిశలకు చేరవేస్తుంది
పలు దిశల నుండి వార్తలు అందిస్తుంది

ఆకులకు కదలిక నిస్తుంది అలలకు నడక నేర్పుతుంది
గడ్డిపోచను ఊయలలో ఊపుతుంది
శిలలను ప్రేమగా స్పృశిస్తుంది
ఒకరి వార్త మరొకరికి చేరుస్తూ
అందరికీ తమ కోసమే ఉన్నట్లుగ అనిపిస్తుంది
దేనినో వెదకుతూ ఉన్నట్లుగ ఉంటుంది

గాలి అండ చూచుకొని ఒకరొకరూ! పోటీలో
చెట్టుతోనా? వేళ్ళు ఎంత బలంగా ఉండేను?
నదితోనా? మనసు ఎంత ఆర్ద్రంగా కదలేను?
అయితే ఎవరితో? అంటే? ఇంకెవరితో! మనిషితో
చెట్టో! నదియొ! అయిపోవాలని! కానీ
ఇది జరిగేది కాదు, కల్పనలోనే! నిలుస్తుంది
"నేను"లో అగ్ని శిఖలా! అద్దంలో కోరే వస్తువు
చేతి కంది చల్లగా! తనదయిపోవాలని మనసులో!

6.

భూమి పైకి వచ్చిన శిశువు పెరిగి
నింగి వైపు మస్తిష్కంతో చివరకు
తెలిసిన లోకం నుండి తెలియని శూన్యంలోకి
కల్పనలు వదలుకొని కఠిన వాస్తవంలోకి

మండే జ్వాల చీకటిని దహించాలనుకుంటుంది
ఆపై బకెట్ నీళ్ళతో ఉపశమనం పొందుతుంది
అన్నిటినీ ఆవహింప చూచే అధికారం
హేతు చర్యతో ఆగుతుంది అణగుతుంది జన మతంతో

స్వేచ్ఛలో దారులెన్ని ఉన్నా కనిపించినా
దుర్గమాల్ని దాటించే సాధన మవసరం!
జీవన ప్రవాహ తటిని వేదనా కీలలు
ఘటనలతో, మనసును బాధకు గురి చేసేను
జీవ కణాలతో రూపొందిన సృజన రూపం! దేహం
ప్రతి రుతువు ప్రభావంతో పరిణతి తేలేను
ఇతరుల కెవరికీ కనిపించని అంతరంగం
మస్తిష్క గగనంలో వెలిగే రవి బింబం!

ప్లస్ మైనస్ అంకెల విలువలతో జీవితం
ఏదో ఒక పందెంలో ఎప్పటికీ గడుస్తుంది
మండే ఎండలలో వసంతాన్ని కోరుతుంది!
కోరికకేం? అది పొందే అవకాశం అవసరం!
పగలు రవి నుండి రాత్రి శశి చుక్కలతో పాటుగ
మనిషి నుండి వెలుగు కయి మనిషి నిరీక్షణం

రాత్రు లయితే మాట్లాడే మనుషులు కరువయి
చుక్కలతో మాట్లాడడమొక మానసికావసరం
ఎవరితో దేనితో ఎపుడు మాట్లాడినా
ఆత్మ క్షోభ నుండి విమోచనం కోసమే

చీకటి భయం నుండి ముక్తమై మనస్సు
వెలుగులతో స్నేహం సుందరతను ఇస్తుంది
అక్షర పంక్తిలో చల్లని వెలుతురు రూపం
స్థాయి భేదాల్ని బట్టి ప్రతి వ్యక్తికి ప్రేరణం

7.

నగరానికి వచ్చేందు కెవరూ వెనుదీయరు
అడవి నుండి పల్లె నుండి వచ్చి ఉండి పోయేరు
ఒకసారి పరిచయమయితే! వీడాలనిపించదు
ఏదో ఒక విధంగా బతుకు బండి లాగవచ్చు

ఎగుడు దిగుడు ఇరుకు బతుకు బాటలలో
భయం! మనిషి నుండి మనిషిలోకి పాకుతుంది
గాలికి వలె ఆలోచనలకు హద్దులు లేవు
ఆచరణం వచ్చేసరికి! ఎక్కడికక్కడ ఆగుతుంది

ప్రవహించే జీవితాల గట్లపై ఎత్తులో
పొగలతో మంటల్ని తలపించే బ్రతుకులు!
చూచే వారి కళ్ళూ మూతలు పడబోతాయి
అగ్నుల నార్పేందుకు కంటి నీరు జారేను!
అప్పటి క్షణాలు తాపంలో దగ్ధమైపోయేను
వచ్చే క్షణాలు ఎట్లా ఉంటాయో తెలియదు

ఈ అగ్నులపై నుండి ఆర్ప గలిగే దొకటే
జల సేచనతో జలదం వలె, ఉదార హృదయం

కిటికి తెరిస్తే దగ్గరలో వెలుతురుతో కాలం
జ్వాలా సుమ గుచ్ఛంలా, కంటికి ఇంపుగా!
తలుపు తెరిస్తే దూర దూరమయ్యే రిబ్బన్‌లా వెలుగు
బయటికి అడుగు వేస్తే! అశ్వంలా సమయం
పొద్దు పొడవక ముందే మొదలవుతుంది జీవితం
పగలు రాత్రి భేదం లేని కొందరు శ్రమ జీవులకు!
దారిలో చెంగు చెంగున గంతులేసే లేళ్ళపై
గుంపులుగా ఎగిరే సీతాకోక చిలకలపై
దృష్టి పడని వారూ ఉన్నారు, పని తొందరలో
తిరిగే శ్రమ చక్రం తప్ప వారికేదీ కనిపించదు

విపణి స్థితి నుండి వ్యవహార స్థితి దాక
మనసుకు తగిలిన గాయాలను తలచుకుంటూ
దిగులుతో ఆత్మహత్యలు! పరిష్కారం కాదు
ఒత్తిడిలో బాధలో విధ్వంసంతో విజయం చేతికి అందదు

8.

ఈ ఘటన ఎపుడో జరిగిందే అనిపిస్తుంది
సమస్య సారాంశం ఎపుడో విన్నదే వినిపిస్తుంది
ఇతిహాసంలో రికార్డు చేసిందే! కనిపిస్తుంది
ప్రస్తుత కథలో పాత్రల తొడుగులలో ఆధునికం

అలంకరణతోనో గాయాలతోనో స్మృతిలో మనుషులు
కొత్త సెట్టింగులో కొత్త దృశ్యంలో కన్పించేరు!
విషయంలో పాతది, ప్రకటనలో కొత్తది
మనిషి రూపం పాతది, కనిపించే భంగిమ కొత్తది
వసుధ పాతది! పంటలు కొత్తవి
బ్రతుకు పాతది! అనుభవాలు కొత్తవి

జీవితమూ నేరాలకు శిక్షా వేదిక కాదు
విచారణ కన్న ముందుగ శిక్ష సబబు కాదు!
అనుభవ స్థితు లేవయినా తట్టుకొనే మనసుతో
కదలే మనిషి! చరిత్ర రూపం దీప స్తంభంలా

ఒక చేతిలో ఆట బొమ్మతో వినోద దృశ్యం
ఇంకొక చేతిలో పిస్టల్‌తో భయ రూపం
బాధలో నిరాశలో వేదనలో అశాంతిలో
ఎండ నుండి చల్లని నీడన శమనం కోరేను

ఆదర్శంలో ఉన్న "మంచి" చెట్టు నుండి నీడకు
చెట్ల మధ్య ఉన్న మనుషులలో చేరేనా?
ఆలోచనలో అనల శిఖల చలనంతో
ఉన్న మనిషి వేరు ప్రకృతి వేరు! బ్రతుకులో
అశాంతి సందర్భంలో నీడపై చూపు!
ఆశకు నిలయమయి! తళతళలాడుతుంది
అభద్ర సమయంలో చెట్టుపై ఆశ!
రక్షణ కవచమయి ప్రాణం కాపాడుతుంది
దట్టమైన అడవిలోను సందు చేసుకొనీ
నేలను దిగే ఉదయ కిరణంలా
కవిత అయిన నటన అయిన ఒకటే!
సంస్కృతిలో భాగమై ఎప్పటివో! అనుభవ ముద్రలలో కొత్తగా

9.

నలువైపులలో యథార్థ జీవన సన్నివేశాలతో
ఎంత అందమైనవి అయినా కల్పన కవకాశమెక్కడుంది?
హృదయం యంత్రం కాదు స్పందమాన చేతన రూపం
జీవ శక్తితో ఆయువు నిలయం! శబ్ద మయం
తేజం పవనం ఆర్ద్రత కలిసిన మనోజ్ఞ రూపం

వెలుతురు ప్రవాహం ఎంత ఇష్టమయినా
ఆ వేళకు దాన్ని దాటే పడవ అవసరం
అది చిన్ని చీకటి ముక్క కావచ్చు
మనిషికి రెక్కలు లేక పోయినా
గగనంలో తిప్పుతుంది విజ్ఞాన సాధనం
మనిషి కన్న ముందుగ! ఇంటి ముందు
విరిసిన పూవు స్వాగత మిస్తుంది మౌనంగా
పరిమళంలో ఆత్మీయం! ప్రకటిస్తుంది
ఆ రోజుకు చాలు! శుభమనిపిస్తుంది!

అంతలో తలుపు పూర్తిగ తీయబడీ
ఎవరో బయటికి వస్తారు! లోనికి వెళతారు
ఎదరుగ గేటు! చెట్లు! పూలు! ఎవరెవరో!
పనులపై పోతూ! ఒంటరిగా కిరణంలా మనిషి!

ప్రతి ఆలోచనలో మనిషి కందని కొత్త జగం
ప్రతి అనుభవ గతిలో మనసు కందని కొత్త నిజం
ఏ వైపు నుండి ఏ వర్ణం ప్రసరించేది తెలియదు
మారే ప్రభావ రూపానికి సిద్ధంగా ఉంటుంది కవిత

ఆకు రాలినంత వడిగా మనిషి మాట వినబడుతుంది
పూవు విరినంత సులభంగా మనిషి మనసు తెలియదు
నిజం దాగి మనసులో ముఖం పలకరిస్తుంది
మాటతో పరిచయం రాగ వంతమయితేనే సార్థకం

తలపు మేల్కొంటుంది, ఆ సమయంలో
చేయాలిసిన పనిలోకి దింపుతుంది
పయనం సుగమంగా సాగేందుకు నదిపై వంతెన
కాలం సుఖదంగా గడచేందుకు మదిలో స్నేహం
సమయ సమయం విషమ సమస్య లెదురయినా
తగిన శ్రమ ఫలంతోనే! ఆ రోజుకు "డైరి"లో విలువ!

10.

ఏదో ఒక పేరు జీవిత కాలంలో గుర్తు కయి
వస్తువు అయినా మనిషి అయినా! ఇది అవసరం
ఇది ఉన్నతమై విశాలమై పోను పోను బ్రతుకులో
చివరకు యశో రూపంతో గగన మావరిస్తుంది

ప్రతి వస్తువు ప్రకృతితో బంధం కలిగింది
ప్రతి మాట సమాజ సంబంధం తెలిపేది
మనిషి నుండి చర్యతో ప్రతి చర్యకు సిద్ధమై
తన గెలుపు పయి కోరిక! మనిషిలో నిరంతరం
ఇది ఏకాంతానికి మనసుకు సన్నిహితం చేస్తుంది
సమాజ శక్తి నుండి మనసు దూరం అవుతుంది

కోలాహల స్థితులలో తన స్వరం వినబడాలని
సంక్షుబ్ధ క్షణాలలో తన పతాక ఎగరాలని!
పైకి ఎగసి జారే అలలవలె క్షణాల సరణం
అనుకూలమైన శాంతమైన పవనంతోనే సాధ్యం

ఇనుప కంచెలున్నా రాతి గోడలున్నా
ఆలోచన ఆగదు కానీ అవి పయనానికి ఆటంకాలే

కాలం గడపదనే చింత లేదు
అది ఏ రూపంలో అన్నదే! కావలసింది
ఆగింది శిల అయితే విషాదం
నిలిచింది నిప్పయితే ప్రమాదం

గాలి అందరిదీ మబ్బులందరివీ
వాన అందరిదీ, ఉదయ మందరిదీ
ఇవి తమ స్వంతంకై వ్యక్తుల యత్నం
గమనంలో అడ్డంకులు ప్రవేశ పెడుతుంది

యథార్థ గాథల సంపుటం జీవితం
మాటలో వ్రాతలో కల్పన కవకాశం
సమాజ బంధాలను తక్కువ చేస్తుంది
వ్యక్తిలోని బాధ్యతల్ని సంకుచితం చేస్తుంది
ఎక్కడో జరగ రానిది జరిగితే! కాలం ఆగదు
స్వేచ్ఛ నుండి ప్రశ్న సూటిగ ఎదురవుతుంది

11.

ఇది కల కాదు మెలకువలో వాస్తవం జీవితం
అసలు రూపం మరుగున బడి పలు దుస్తులతో
రంగులతో ముఖం గుర్తు పట్టరాని విధంగా
మబ్బుల్లా ప్రబోధాలు! తేలిపోయి శూన్యంగా
నదిలో పడవల్లా బ్రతుకు లొక రొకరివి!
తీరం చేరే ఉత్సాహంలో ఎవరికి వారు

గాయపడిన మనిషిలో సుడిగుండం నుండి
ఆలోచన! చుట్టూ తిరిగే నీతులు నియమాలతో

అపుడపుడు అర చేతులలో కన్నీటి స్పర్శతో
తీరం చేరే అనుభవ మొక! సుందర లోకం!
పగలు స్వర్ణ రథంపై పయనించే కోరిక
రాత్రి చుక్కలు ఇచ్చే ధైర్యంతో సాగే ఊహ!

ఉదయం వార్తా పత్రికలో అక్షరాలు
జారే కన్నీటి చుక్కలతో తడిసీ
ఎగసే క్రోధానల కణాలతో కమలీ
రేగిన దుమ్ములో ముఖాలతో కలహ దృశ్యం!

తలపై అధికార కిరీటాల్ని సర్దుకునే నేతలు
పొదిగిన మణులపై కన్నేసిన అనుచరులు!
తమ కోరిక తీరే పనిలో ఎవరికి వారు!
ఈ సమయంలో కవిత! పయనంలో సిగ్నెల్!

పూల గుత్తిలా హత్తుకొని అక్షర రూపం
వెలుగు దారి చూపుతుంది కవి హృదయం
ఇది ఎవరికీ అమ్మే వస్తువు కాదు
దేనికీ తాకట్టు పెట్టే ఆభరణం కాదు

చరిత్రలో భాగమై వీడని బంధంతో
సమాజ సంపదయై నిలుస్తుంది!
ఒక వెదురు ముక్క! నవ యోగంతో
రాగం పలుకుతుంది, ఊదబడీ!
ఊపిరి చలనంతో ధ్వని లహరులతో
మనసును మేల్కొలుపుతుంది ఆయత్తం చేస్తుంది

12.

వర్తమాన ప్రవాహం ఒడ్డున మనిషిలో
జీవన స్థితిగతుల పూల వనం! ఆలోచనలో
స్మృతులకు నిలయాలయి భస్మవేదికలూ సమాధులూ
కలుషితలను శుభ్రం చేసే కరుణ జలంతో

తీరానికి బాట అదే ఏర్పడుతుంది
అవసరాలలో మనుషుల కాలి నడకతో
దాహం ఆకలి తీరే అన్వేషణలో
ఆశ ఫలించడం మనిషి మొదటి విజయం!

ఏ దారి అయినా ఏ తీరమయినా ఏ గమ్యమయినా
వ్యక్తి నుండి సమాజానికి చెందుతుంది భాగ్యం
పాడి పంటతో యంత్రం సాంకేతికావసరం
ఒక దారికొకటి జతగా పూర్ణత లభించేను

మెలకువలో కలలు గనే ప్రసక్తి మాయమై
వాస్తవ దృశ్యమొకటే! మనిషి శ్రమకు పరీక్షగా
బ్రతుకు కన్న మిన్న ఏదీ లేదని అందరికీ తెలుసు
ధనమూ అధికారం మానవ శక్తికి ఇరు రెక్కలు

అడవిలో జింకల గుంపు పయి పులి దూకుతుంది
నింగిలో పక్షుల పంక్తి పయి గన్ పేలుతుంది
ఆహారం ఉల్లాసం ఏదో ఒక ప్రేరణలో లాలసతో
మానవ సంస్కృతి శిఖరం తల వంగుతుంది
నిత్యం వసంత మయిన మనిషి మనో రూపం
క్షణంలో శిథిలమయిన దృశ్యాన్ని వహిస్తుంది
మనుషుల మధ్య కనబడకుండ గుప్తంగా
నేరం – శిక్ష అడుగున న్యాయం! అణగి మణగి

ఆలయ శిఖరం పయి క్షణం విశ్రాంతిలో పావురం
ఆ రోజుకు చాలిన ఉత్సాహం నింపుకునేను
ఒక సందర్భంలో మానవ బంధంతో మనిషి
ఆ రోజుకు సరిపడ టానిక్ బలం పొందేను

ఆయుధ రక్షణ వలయం దాటిన ప్రభుతతో
బ్రతుకు తీరు విలువలతో స్వేచ్ఛా కవిత అమూల్యం

13.

బాల్కనీ లొనో బయట పనిలోనో ఉన్న మనిషిపై
హఠాత్తుగా ఏ మూల నుండో బులెట్ దూసుకపోతుంది
ఏ తప్పు చేయని వ్యక్తికి పూర్తి శిక్ష – మరణం
కాస్త జాగ్రతతో తొలగేదీ, పొరపాటొ విపరీతమొ!

ఓటమికీ గెలుపుకూ తెలియని హేతువులు దాగి
ఎన్నిసార్లు ఓడినా మరో అవకాశం పయి ఆశ!
ఓటమి గెలుపులో రహస్య పేటి తెరవబడేనా?
ఏ ఆశలేని బతుకు, ఏ మ్రోడో! శిలయో!

ఒక రుతువు అనుభవంలో మనసు
ఇంకొక రుతువు స్పర్శకారాటపడుతుంది!
శిశు దశ నుండి మొదలయింది
ఊహా గగనంలో పయనం, ఆగదు
చివరి దాక విరామాలతో సాగుతుంది
అన్వేషణలో కొత్త దేదొ కనుగొనబడవచ్చు

ఆకలికి సీమలు లేవు, గగనంలా పరచుకొనీ
దప్పికకు భేదం లేదు, అంతా విశ్వమయంగా
వికాస భూమికలో ఎన్ని దిశలు విస్తరించినా
బలహీనమయిన సందర్భం ఆటవికానికి జార్చేను

చాచిన సంకెల చేతులలో కన్నీరులో
వెలుగు ముక్క అయినా మునుగుతుంది
ఎండిన చెట్టులో అణగిన చేతన
మరో రోజు చినుకుతో చివురిస్తుంది
పక్షికి గూడు దొరకుతుంది
మనిషికి నీడ లభిస్తుంది

ప్రతి వేదన వెనుక తెలియని కథ
ప్రకటనలో సాహసం చూపుతుంది కవిత
విపరీతమయిన చర్యలలో సార మెరిగి
లేని స్నేహ బంధం! నిలుపు తుంది ప్రేమగా!

ఎవరు ఏది కోరినా, కోరకపోయినా
ఎవరి కెంత ఇష్టమయినా, కాకపోయినా

14.

తీరం నుండి విశాల జలధిని చూస్తే
అలలతో సమాజం మనసు నావహిస్తుంది,
కదలే స్వభావంతో వివిధ స్థితులలో
సందడి అలజడి ఘర్షణ సంక్షోభంతో
వేగంగా తీరాన్ని తాకే అలల హొయలులో
నవ్వులు కేరింతలతో పిల్లల సమూహ దృశ్యం!
ముద్దుగా మురిపెంతో అపుడపుడు జరిగిన
బాల్యంలో స్మృతులు ముందు నిలుపుతుంది

దూరాన చిన్ని చిన్ని అలలతో
పల్లెలో గుడిసెల్ని తలపిస్తుంది
దగ్గరలో పెద్ద పెద్ద అలలతో
నగర భవనాల్ని బింబిస్తుంది

తెలియని లోతులతో రాజకీయం
తెలిసిన అంచులలో సామాన్యం
భూమిలో సంపద అందరి దనిపించినట్లు
జలధిలో సంపద ప్రజలది అనిపించేను

కనిపించే చేపలు మొసళ్ళు పాములు జలచరాలతో
లోపల ఇంకేదో! తెరవని బోషాణంలా పడి ఉంది!
గాలికి తెరవ బడే పుటలతో నిఘంటువులా బయటికి
అలల శబ్ద రాశితో రెపరెపలాడుతుంది సముద్రం!
దీపం కయి రాత్రిలా
దినమణి కయి జలధిలా
మేఘం కయి అవనిలా
మనిషిలో, కావలసిన దాని కయి! ఆరాటం

ఎంతటి మహనీయమయినా సముద్రం
తీరాన గట్టు వద్ద ఒదిగి ఉండవలసిందే
ఎంతటి ఉద్రేకంతో ఉద్వేగంలోనూ
ఎగసి ఒలక గలదు కాని దాట లేదు
చెలియలి కట్ట దాటితే, ఊహకందని విపరీతం ఆందోళన
జవాబు చెప్పే అవకాశం లేకుండా! కల్లోలం విప్లవం

15.

ఎవరి జీవితం వారిది ఇది ఒక సమాజ ప్రయోగశాల
ఎవరి ఆశల పునాది కాదు ఇది ఎవరి నమూనా కాదు
స్థితి నుండి స్థితి, ఘటన నుండి ఘటన ఒకటొకటీ
తొలి దశ నుండీ కష్ట సుఖాలకు కేంద్రం! మనో నిలయం

చేష్టలతో మాటలతో మొదలయిన జీవితం
వాక్యాలుగ సాగుతుంది సర్గలతో మహా గ్రంథమవుతుంది
రోజు రోజు కొక పుటగా ఆవిష్కృత మవుతుంది
మనిషి మనిషి కొక విధం! మర్యాదలతో బహుమతులతో

అమ్మ అర చేతులతో మొదలయి, నాన్న వేలు పట్టుకొనీ
ఎందరి కలయికతోనో ప్రియ సహచరితో అపూర్వం
తనతో సాగే నీడ లాగే ననిపించవచ్చు
భయవ వదలి ధైర్యంతో సాగడమే కరణీయం
నిశ్శబ్దాన్ని దూసుకొని మాట అర్థవంతమవుతుంది
బ్రతుకును కావలసిన ప్రయోజన దిశలో నడిపిస్తుంది

చెట్టు ఒక విధంగా ఆశ్రయమిస్తుంది, అందరికీ
ఇల్లు ఒక విధంగా అభయమిస్తుంది, ఆప్తంగా
ఎండిన చెట్టు మౌనంగా ఉంటుంది సహనశీలంతో
ఆకులు బదులుగ నిప్పులు వదలదు, విపరీత గుణంతో

సంకల్పానికి సరితూగే మానుష యత్నం!
బయటి నుండి అగ్నులపై జలసేచన చేస్తుంది
బాధలలో మనసు సతమతమయినా
నిరాదరణలో శూన్య చిత్రం ప్రకటించదు

బిందువుతో మొదలై ఊహ నది అవుతుంది
నవ్వుల వెలుగులతో మొదలయి శైశవం
ఎదుగుతూ అరచేతులలో పూలను రాలుస్తుంది
పరిణతిలో చెట్టు నుండి ఒడిలో పండ్లను అందిస్తుంది

ఆయువులో కోష్ణ లిప్త చేత ఉద్రేకంలో
బొగ్గు బూది మట్టి అవచ్చు,
వెను వెంటనే నిర్మాణ క్రమం మొదలయి తనలో
వర్తమాన లిప్తలతో నవత! కవిత అవుతుంది

16.

చుట్టూ ఏ గోడ లేని పేదరికంలో
కఠిన వాస్తవాలు తప్ప కల్పనలకు తావు లేదు
శిశిరం తిష్ఠ వేసి ప్రభుత నెరపుతుంది
పేదకు ఓటమికే అవకాశాలెక్కువగా

లోన అయితే బాధ కొరకంచులా తాకుతుంది
బయట సమస్య సుడి గుండంలా చుడుతుంది
ఉన్న సన్నని వెలుగు దారులు మూతబడీ సామాన్యులు
అంతా చీకటి! ఉన్న చోటునే భద్రంగా బ్రతికేరు

ఎవరయినా తమతో చిరు దీపంతో రావలసిందే
ఒక వెలుగు ముక్క కనిపిస్తే! సంతోషం అది క్షణికం
నేలపై గాజు ముక్కలు! వెద జల్లినట్లు
అవి! వెలుతురు చుక్కల భ్రమ కలిగించేను
తెలియని దారిలో చాకు మొనల వలె నయి
నడకలో గాయాలతో అడుగుల్ని అలంకరించేను

ఏది ముఖ్యం! ఏది అవసరం? ఏది మంచి? ఏది చెడు?
అవును! కాదు! మధ్యలో నలుగుతూంది విషయం
చర్చలకు కొదవలేదు, వివాదాలకు తక్కువ లేదు
ప్రగతి వేదిపై పరివర్తన పదం! మారు మ్రోగుతుంది

చెట్టు అయినా మనిషి అయినా ఎదుగుతూ పోరు
ఎక్కడో ఒక చోట ఎదిగి! ఎత్తు ఆగవలసిందే!
మరో తరం అందుకునేను కర్తవ్యంగా
ముగియని పనిలో భాగం అయ్యేను

ఖడ్గమే కాదు! పూవు కూడ ప్రమాదకరం
పరీక్షిత్తు కథ! రహస్యం వినిపిస్తుంది
వేణువు ఊదితే, ఎక్కడెక్కడి నుండో
మనుషులతో పాటు ప్రాణులు కూడా చేరేను
పాము లేచి పడగ విప్పి ఆడుతుంది
మనిషి మనసు విప్పి ఆనందించేను

ఏది జరిగినా మెలకువలో! వెలుతురులో! సంఘంలో
స్వేచ్ఛకు అవకాశం! మనిషి బాధ్యతను పెంచుతుంది

17.

ఖడ్గం తల వాల్చదు విశ్రమించవచ్చు
రణంలో రక్షణలో ఒకే ప్రభుత
గెలుపుకు పొంగిపోదు, ఓటమికి క్రుంగిపోదు
వీరుని చేతికి ప్రియం, బీరువు కంటికి భయం
జరిగే దొకటి జనం తలపులలో వేరొకటి
కళ్ళ ముందు ఒకటి, చూడంది వెనుక ఒకటి
చెట్టు కొమ్మల్లా! విభేదాలు, ఇది సమాజ రూపం
విత్తు ఒకటే, వేరు వేరు శాఖలుగా చెట్టు!

ఆయుధం చేతిలో ఉందని తెలిస్తే చాలు
అది ప్రయోగించనవసరం లేదు భయం! భయం!
సగం శాంతి భద్రంగా
సగం రణం దూరంగా
చింతనలో సందేహంలో ఆయుధ ప్రయోగం!
అందుకే! రణానికీ రణానికీ మధ్య దీర్ఘ విరామం
చిన్న చిన్న అలజడులలోను జీవన సంగీతం మరవనీదు
మనుషుల అనుబంధం పెంచుతుంది, పరోక్షంగా

క్షణాలు గడుస్తాయి! ఏ రోజు ఆగదు
మరో రోజు వస్తుంది, ఆశావహ ముఖంతో
తన చుట్టు ఉన్నవి దారులు మరచీ కొత్త వాటికయి
దూర దూరం పరుగులు తీసేరు దిగులుతో! ఒకరొకరూ

ఎడారి నది గిరి తరువు ప్రాణి మృగం మనిషి
మనిషి చుట్టూ, దేని ప్రత్యేకత దానిదే, ప్రపంచంలో
నిరాశపడినా, కఠినత చూపినా
ఆర్ద్రత తరిగినా, మమత దూరమయినా
అన్నిటికీ! వాస్తవ కారణమొకటే!
మనిషికి తన శక్తి తెలియక పోవడం!

రాగం పేరు తెలియదు, స్వర స్వచ్ఛత ఉండవచ్చు
మనిషి ఊరు తెలియదు, హృదయం గొప్పది కావచ్చు
అలలపై నావలా కదలుతుంది మనసు
కోరే తీరం చేరడమే పయనం సార్థకం!

18.

కొండపై కోట చూపులో చరిత్ర చుట్టుకొనీ
నదిని చూస్తే సాగే సంస్కృతిని తలపిస్తుంది
కొండ రాళ్ళకూ నది అలలకూ విడదీయరాని బంధం
బ్రతుకులకూ సమాజానికీ ఉన్నదే! సరికొత్త నిర్వచనంతో

ఇది కవితలో కనిపిస్తుంది, పొరలు పొరలుగా ఒదిగి
అక్షర బద్ధమై ఘటనలు పోటోల ఆల్బంను తలపించేను
మనసుకు హ్లాదంగా కొత్త ప్రపంచం చూపిస్తుంది
వ్యక్తితో సమాజం సమాజంలో వ్యక్తి ఒక సుందర యోజనం

చెప్పులు ఎరగని కాళ్ళ నుండి చింపిరి జుట్టు తలదాక
కార్నర్‌లో పేవ్‌మెంట్ పయి పరచిన పాత పుస్తకాల వరసలా
రిబ్బర్ ముడి విప్పుతూ రిలీజ్ అయ్యే కొత్త పుస్తకంలా
ఐదు నక్షత్రాల్ని పిడికిలిలో బంధించిన భవనంలా
నగ్న తరువు నుండి వసంత శాఖి వరకు
సమాజ భూమికతో కవిత ఒక సృజన దృశ్య శాల

ఇది ఇంద్ర జాలం కాదు, మంత్ర దండం కాదు
ఫోటో ప్రదర్శనం కాదు చేతనతో వికసించిన సమాజం

కనిపించే అక్షరంలో వినిపించే పదంతో వాస్తవ జగం
చేతిలో రేఖలు చూచి జీవితాన్ని చదవ గలిగే రేమొ!
ఎదురుగ ఉన్న ముఖం చూచి మనసు పసి గట్టేరేమొ!
మూసిన మది గది తలుపులు తెరవ బడేనేమొ!

కథ అందరికీ తెలిసిందే రోజూ జరిగిందే జరుగుతూ
ఎవరి పద్ధతిలో వారు బహు ఇష్టంగా నడిపేరు
వెనుక నున్న రహస్యంలో మనిషి! దాగేను
వ్యథను రేఖలుగా, బాధను చుక్కలుగా వహించేను
ఎడారి పయి వెలుగుల నది పొరలి నట్లు
ఎవరు ఎవరితోనో కలిసి నడిచేది కొంత వరకే
ఏ పనిపై? ఎక్కడికి? ఎందుకయినా! కానీ
క్షణాలు నవ్వు ముఖంతో ఎదురయ్యేనా?
క్షణాలు మాడు ముఖంతో చాటయ్యేనా?
కవితకు ఈ తెలియని రహస్యమొక అస్థిపంజరం

19.

చివరి ఊపిరి దాక సాగే పయనంలో
దారి మధ్యలో మైలురాయి! మజిలీ కాదు
ఊహించని చీకటి బొమ్మ లెదురయితే
వాటిని నీడల్లో వదలి పోవలసిందే!

సూచన గానో హెచ్చరికగానో ప్రబోధంగానో
గుర్తులతో మనిషి యానం ఆగవచ్చు, కాసేపు

పగలు అలరించిన పాప నవ్వు
రాత్రి చుక్కల్లో కనిపిస్తుంది
ఎపుడో విన్న ఆర్త రవం
గాలి హోరులో వినిపిస్తుంది

నీళ్ళలో మంచు ముక్కలా సమయం కరగుతుంది
పెదవులకు తాకిన ఐస్‌క్రీంలా క్షణాలు మాయమవుతాయి
పోరాటం అలజడి కాదు, అల్లరి కాదు
ఒక లక్ష్యంతో సహేతుక చర్యా రూపం
ఏ సందర్భంలోను మనిషి మనసు
చిలక కొయ్యకు వేలాడే గొడుగు కాదు

ఆయుధమై మనిషి వీధులలో చరించలేదు
ఇంకా అనల కణిక స్పర్శ మిగిలి ఉన్నా
ఏదో ఒక సమయంలో పూల గుత్తి ఎదురు కావచ్చు
అది తనకు స్వాగతం పలికేది కావచ్చు

ఎగిరే శక్తికి గగనం హృదయం విప్పుతుంది
నడచే మనిషిని మేదిని చేతులపై నడిపిస్తుంది
ప్రశ్నలు ఖడ్గాలయి దూసినపుడు
జవాబులు సుమాలయి సఖ్యత కూర్చేను

తాను చేతిలో పూల గుత్తి వహించ వలసి రావచ్చు
సుమ పరిమళ స్పర్శతో మాట వెడల వచ్చు

వర్తక మతిలో నిపుణత గెలుపుకు దారి తీసినా
జీవితమంతా వ్యాపార శాలా రూపం కాదు
ఏ మార్పు లాటరీలో అదృష్ట విషయం కాదు
శ్రమ లహరులతో ప్రవాహ శక్తితోనే సాధ్యం!

20.

అవసరానికి ఆలోచన కార్యబీజ మవుతుంది
కోరికపై పూవుకో ఫలానికో కారణమవుతుంది
కోరికతో ఆలోచన ఒక మినీ ప్రపంచం
వ్యక్తి నుండి సమాజం మధ్య ఎన్ని ఆరోహణలో

ప్రశ్నకు అవకాశం ప్రజాస్వామ్య దార్శనికంలో భాగం
ఆచరణంలో సమాధానం వికాస గతిని తీరుస్తుంది
కాలం నీడలో కోరిక అంచు చేరితే విజయం
ఈ లోపల దిగులు పడ జేసే అపాయ స్థితులెన్నో!

లోన అగ్ని పర్వతం! సన్నని పొగలు సెగలుతో
పక్కనే మమత కరుణ స్నిగ్ధ ప్రసారాలతో

కళ్ళకు రంగుల అద్దాలు లేకపోతే
పూలే కాదు, మనుషుల ముఖాలు, వస్తువులు
నిజ రూపంలో మానుష గుణ బంధంతో
మనస్తత్రిని మీటు తాయి హ్లాదకరంగా

ఓటమి ఎరగని క్షేత్ర మొకటే అది కవిత్వం
ఎవరి అస్మిత వారిది, అందుకే కవులందరు విజయులే!

స్వేచ్ఛకు ఆకాశమంత అవకాశముంది
సృజనకు అవని అంత విశాలత ఉంది
చేతనలో చూపు మేర దారులెన్నో
గమ్యంలో సమాజ సమగ్రత ముఖ్యమై

జలద హృదయ రూపంతో కవిత
మెరపులతో మనిషికి సూచనలిస్తుంది
పిడుగులతో మనసును హెచ్చరిస్తుంది
చినుకులతో రస గీతం వినిపిస్తుంది

సమాజ చింతనలో సామాన్యుల మేలుతో
భూమికి దిగిన జల బిందువులో మానవం
రణ భేరిని ధ్వనిస్తుంది ఉద్యమం
రుద్ర వీణ మీటు తుంది నినాదం
రేపటి సమాజ రూపం కోసం
రెపరెపలాడుతుంది శ్రమ పతాక ముఖంలో

21.

కాలం మాట్లాడదు మనసును కదలిస్తుంది
పవన లహరిలా అందంగా పూవు రేకులా లలితంగా
చీకటిలో మెరపులా కావలసిన వస్తువుతో
ఇతర వస్తువులనూ దృశ్యం! చూపిస్తుంది

ప్రతి వస్తువు ఇతరుల ప్రయోజనం కోసమే! ఎప్పటికీ
మనిషి మాత్రం! స్వయం ప్రయోజనంలోనే! ఎక్కువగా
ఏదో కోరికతో లాభంతో ముడివడి ఉంటుంది
ఎంత దూరమయినా మనిషిని తీసుకొని వెళుతుంది
చేయ తగినదీ చేయ రానిదీ అంటూ లేదు
ఆ తరువాత విచారణ ఆపై వివేచన ఎపుడో!

ఇరువైపుల ముందు వెనుక! ఎటు చూచినా
ఏముంది? అందరికీ తెలిసిందే "ఇది జీవితం!"
తన నీడ ప్రశ్నయై వెంటాడ వచ్చు
అద్దంలో తన ముఖం! కోపం తెప్పించవచ్చు

కాలం మాట్లాడిస్తుంది, సమాజాన్ని నడిపిస్తుంది
తాను మాత్రం అడుగు వెనక్కి వేయదు
మనిషిని ముందుకు నడిపించడమే కాలం పని!
చూపులో దేనికై ప్రతీక్ష లేదు, దేనిపై వివక్ష లేదు

రవుతు చేతిలో కళ్ళెంతో అశ్వంలా
గాలి అదుపులో చలనంతో మేఘంలా
మనిషికి చేతుల్లో జీవిత మున్నట్లుగ అనిపిస్తుంది!
అహంకారం పూర్తిగా చార్జి తీసుకుంటుంది

పగలు తెలుపు రాత్రి నలుపు హత్తిన మనసుకు
మిశ్రితమయి రంగుల రూపం! కొత్తగ కనిపిస్తుంది
నిజ జీవితంలో కరుణను ఒలికే దృశ్యంతో
కవితలో! భావ జగం కళామయమవుతుంది
వాస్తవ మెప్పటికీ కనుమరుగు కాని నిజం!
కళాభిరుచితో వాస్తవం క్షతం కాదు, గతం కాదు
ఇంటి చుట్టు వెలసిన పరిమళ వాతావరణం
ఇంటిలోని మనుషుల సంస్కారానికి తార్కాణం

22.

ఒంటరి తనం ఎక్కుడుంది? పుట్టుకతో పరిసర బంధంలో
ఎదిగే కొద్దీ మానస తలంపై మనుషుల నేపథ్యంలో
పరిచయ మున్న వారితో కొత్త వారు చేరుతూ
మానవ సంస్కృతి తెలియని జీవిత మెక్కడుంది?

ధూళి కణం లేని వాయు మండలం లేదు
మలిన స్పర్శ లేని మనో రూపం లేదు
నెత్తురులో నిరంతరం సన్నని జీవ ప్రసారం
ప్రాణి కొక స్వచ్ఛమయిన ప్రవాహ రూప మిస్తుంది

ఉదయ కిరణ మెప్పటికీ ఖడ్గం కాలేదు
ఎంతటి వైరుధ్యంలోను మైత్రికి తలుపులు తెరచేను
అంతరం! తనకు మాత్రమే తెలిసిన నిలయం
బాహిరం! అందరికీ తెలిసిన మైదానం

ఒక మనిషి జీవితమే కాదు, చేతనా చేతనలను
శిల్పంలో చిత్రంలో కవితలో చూడడమొక దార్శనికం
రసమయ జగత్తుతో చిత్త వృత్తి విశేషం
ఒక పరితృప్తికి అవకాశం! విశ్వమయతకు తార్కాణం

వ్యక్తిత్వ వికాసాలు, మహనీయుల విగ్రహాలు
మనిషికి ఉన్నయన రూపాన్ని ప్రసాదిస్తాయి!
భౌతికం నుండి ఎగసిన సుందర గుణ రూపం
కంటికి దూరమయినా మూర్తిలో బింబిస్తుంది

ఇన్నిటి మధ్య మనిషి ఆయువు గడుస్తుంది
ఒంటరితన మెక్కడుంది? జీవన లక్ష్యంలో
ఖర్చులో నయితే మృత్యువు జ్ఞప్తికి వస్తుంది
రాబడిలో దయితే ఆయువు వికసిస్తుంది

కంటి చూపు నధిగమించిన 'నిజం'
తెలిసే దొక మేల్కొన్న మనసుకే
ఎదారిలో నడచేప్పుడు తోటపైన ఆలోచన
తోటలో ఉన్నప్పుడు ఇంటి పైన ఆరాటం
ఇంటిలో గడచేప్పుడు సంఘంపై అభిలాష
తప్పని వైషమ స్థితులలో, నీది నాది విభేదాలు తగాదాలు

23.

అస్తమయంతో "సూర్యుని పని అయిపోయింది" అనుకుంటే
మరునాడు ఉదయానికి అంతా తలక్రిందయిపోతుంది!
ఆరిందనుకున్న కాలం! జ్వాలా సుందరతను పొందుతుంది
లిప్తల మెట్లపై వెలుగు దారిలో మనిషి ఆరోహణ సాగేను

స్వర్గానికి నిచ్చెన కన్న భూమిపై ఉనికి మేలుగా
పంటలు తోటలు శ్రమ జీవన చలనం! నిర్మాణాలు
సాధారణ జీవన సంగమంలో వ్యక్తుల సంరంభం!
అస్థి పంజరాలు కపాలాలు! పరిశోధనలో మ్యూజియంలో

తప్పయినా ఒప్పయినా ఏదీ ఆగదు
క్షణాల ఖాళీలను పూరిస్తూ పోవడమే
ఊహ రగలవచ్చు, అనల శిఖలు కావచ్చు
దారి మారవచ్చు, గమ్యం వేరు అవచ్చు
పదాలు అవే అయినా కలయిక మారుతుంది
అర్థాలు వేరవుతాయి! సందర్భానికి తగినట్లుగా
కరుణమయిన వీరమయిన ప్రేమ అయినా, వీటికి
కాలం చెల్లే ప్రసక్తి లేదు, బ్రతుకులో కవితలో

మానవ జాతిలో సహజమైన స్వేచ్ఛా మూలం
వెనక నుండి సమాజ రూపానికి దారి తీస్తుంది
శ్రమ చక్రం ఆగదు, అది తిరుగు తూనే
కాల వేగంతో జీవితాన్ని కలుపుతుంది

ఎవరి సాధనాలు వారివి ఉత్పత్తి వికాసాలతో
భూమి మనిషి సంబంధం సమాజ చరిత్రకు మూలమయితే
తరం నుండి తరం అడుగు తాకగనే విశ్వంభర
ఉదయ కిరణంతో పద్మం వలె విప్పారుతుంది

ఎవరెవరి చేతుల పైనో ఎగురుతూ బంతి
క్రింద పడకుండా ఆడబడుతుంది సమాజంలో

గడ్డి పోచ ఎరగని నేల ముఖం దీనంగా
మబ్బు నీడ తెలియని భూమి గుండె తాపంతో
లిప్తలు ఆగవు, భరించక తప్పదు, ఒక సమయంలో
ప్రాణం నిలిపే! చెలమ నీరే శరణ్యమవుతుంది

24.

ఒకటొకటీ ఏదో ఒక విషమ ఘడియల్లో
నీతి న్యాయం ప్రేమ కరుణ మానవత
అన్ని ఎక్కడి కక్కడ అలంకారాల్లా జారిపోతున్నాయి
మబ్బుతోనో మంచుతోనో వివేక బింబం కప్పబడుతూంది

ఇపుడు మనిషి కేవలం భౌతిక యంత్ర రూపం
ఇంకా హృదయం మిగిలి ఉంది ఒక మూలన
మధ్య మధ్య గాయాలకు శామన గుణ చర్యలతో
ప్రాణాన్ని రక్షించడంలోనే దానికి సరిపోతూంది

తలుపులు మూయబడిన చరిత్ర
పెద్ద రహస్య పేటిలా కనిపిస్తూంది
విప్పారిన విశాల హృదయ కమలాలను
క్షణాలు కంటకాల వలె బాధించేను

నిశితంగా విసరే గాలులకు
చినిగిన తెరచిన పుస్తకంలో పుటలా
రోజు! రెపరెపలాడుతూంది బాధలో
సాయం రాగ విషాద స్వరం వినిపిస్తూంది

ఆరోహకుణ్ణి రక్షించే యత్నంలో
పర్వత పంక్తుల్ని నదుల్ని దాటుతూ
రణంలో గాయపడిన అశ్వంలా
కాలం కుంటుతూ పరుగెత్తాలిసి వస్తూంది

భయం నుండి తప్పుకొనే ఆవేగంలో
దప్పికనూ ఆకలినీ మరపించే తొందరలో
భౌతికం నుండి మానసికానికి చిత్రం మారుతూంది

పయనంలో చెట్టు క్రింద విప్పిన నెమలి పురి
ముందుకు సాగేందుకు ఆహ్వాన పత్రం వలె ఉంది
నిరాశ నుండి ఆశ వేరై ఉత్సాహం నింపుతూంది

ఇంటి ముందు చేరగనే అశ్వంతో
అలికిడి విని వింతగ మూగే పిల్లల
ముఖాలలో ఉదయ రాగ భావ చిత్రం
కరుణలోని స్పందనకు చేరుస్తూంది

25.

ముందుకు చాచిన అడుక్కునే అర చేతులలో
శూన్యమైన ఆకాశం తన ముఖం చూపేనా?
కన్నీటి బిందువు జారేనా? ఆర్ద్ర పరచేనా?
అర చేతుల రేఖలలో ఎండిన కొమ్మలు కనిపించేనా?

సహృదయుల చేతుల్లో పూలు ఉండవచ్చు
రెబెల్స్ చేతుల్లో రాళ్ళు ఉండవచ్చు
రాళ్ళు రప్పల మధ్య బ్రతికే చేతుల్లో
ఏముంటుంది? బిక్షువు ముఖం బింబిస్తుంది

లేచింది మొదలు నిదుర పోయే వరకు
స్పందన కరువై బిగిసిన పిడికిలితో మనిషి!
సానుభూతిలో లాభం గురించి ఆలోచన చేసేను
నిజ మానుష ధర్మానికి "నో వేకెన్సి బోర్డు"!

చూపు నుండి పూవు మనసులో పరిమళమయమయి
ఇది హృదయ వశమయితేనే! ప్రజాస్వామ్య విజయం

మట్టి అంటకుండ కొమ్మకు పూచిన పూవు
శుభ్రంగా గాలిలో పరవశాన ఊగుతూ
నేలపై రాలి మట్టిలో కలిసేను
ఏ చేతిలోనో పడి సార్థకం కావచ్చు

మట్టి అంటకుండ నింగికి ఎగసిన మేఘం
గాలిలో స్వేచ్ఛగా దూతయై కదలుతుంది
మట్టిలో సృజన శక్తిని మేల్కొల్పుతుంది
కవితకు మానస సుందర రూప మిచ్చేను

ఆదర్శం! మనసులో అద్దంలో బింబంలా
జీవితం! వాస్తవ రుచితో అనుభవాత్మకం

స్నేహం ఆర్ద్రతతో మేఘంలా
బ్రతుకుపై ఇచ్చను పెంచేను
ప్రేమ ప్రకాశంతో దినమణిలా
మనిషిలో మరో మనిషిని చూపేను
ఎవరి ముందు చేతులు చాచే అవసరం లేని అస్మితతో
కవిత వేరు బ్రతుకు వేరు, రెండిటినీ కలుపుతుంది చేతన!

26.

నేను రావలసిన సమయానికే వచ్చాను
అనుమానం అక్కర లేదు, ఆలస్యం లేనేలేదు
అప్పటికి నాకు పరిచయం ఎవరితోనూ లేదు
అది మొదలుగ పరిచయాల పరంపరతో నేను!

అమ్మ పూల రేకుల అర చేతుల స్పర్శతో మొదలయింది
ఆ తర్వాత రకరకాల మనుషుల సిల్కు చేతులలో!
ఎందరి మాటలలోనో మునకలాడి మనస్సు
ఇరు సంధ్యల భావ జలాలలో స్నానంతో
మలినం వదలి స్వచ్ఛంగా భౌతిక రూపం
ఇపుడు జ్ఞాపకాల నది ఒడ్డున శుభ్రంగా తేలుతూంది

తళ తళ లాడే ఆలోచనతో
నవ నవ లాడే అనుభవ రుచితో
తెలిసిన లోకం నుడి తెలియని లోకానికి
స్థానం మారినా, ఉన్నంత వరకు సరికొత్తగా

అపుడు అలార్మ్ మ్రోగుతుంది, కదలుతాను
వినీ వినబడనట్లు పోయే వారెందరో నిశ్శబ్దంగా

నేను కావలసిన సమయానికే కదలుతాను
అంతరంగ స్నిగ్ధతతో ప్రతి హృదయ పరిచయంతో

ఉన్న దారులన్నీ బాణంతోనో ఖడ్గంతోనో చీలినవే
చరిత్రలో రాజ్యాలు సమాజాలు నివాసాలు! ఏర్పడీ!
ఒంటరి తనం పొరలు తీయబడీ
సమూహ చేతనలో వ్యక్తి పాత్ర! పెరిగేను

కాలం ఆగదు, నను దాటింది, క్షితిజంలో చేరుతుంది
నా ముందు ఆదర్శం! గాలికి కదలే పతాకగా
అలసిన ముఖానికి ఉపశమనం కలిగిస్తుంది
భవితను సులభంగా అర చేతికి అందిస్తుంది

దూరం జరిగిన అడవి, దగ్గరగా వెలసిన ఊరు
చెరొక వైపు నుండి చేతుల్ని అందుకొనేను ఆత్మీయంగా
కాలం మెట్లపై ప్రియ సహచరితో హ్లాదంగా
నడవడమొక సుందరమయిన అనుభవ సార్థకం!

27.

జీవితాన్ని నడిపిస్తుంది లోనుండి మనో రూపం
ఉన్న పరిమితులలో వ్యక్తి శక్తి ఒక్కొక విధం
నీలి తెరపై వెలుగు బొమ్మలతో
తెలుపు తెరపై నీలి బొమ్మలతో
వివిధ స్థాయిలలో కనిపించీ కనిపించని హేతువుతో
జీవిత మొక శ్రమ జీవన శాలామయం

ఊహకు మాటకు సంబంధం ఎప్పటికీ
మాటకు చేతకు సంబంధం తప్పనిదీ

అనుభవ పాఠం నేర్చేమని ఓటమి నెవరూ కోరరు
తప్పని స్థితిలో సమాధాన పడేందుకే! ఈ మాట పలకడం

మాట పయి చేత పయి చర్య పయి
ఫలితంలో ప్రభుత నెరపుతుంది మనో రూపం
తీరు తెన్ను లెన్నో! ఎపుడేవి మారేది! తెలియదు
మనస్వి నుండి మనీషి దాక లోన దుర్గమ స్థితులెన్నో

నిరాశలో అంతలో లోనుండి ప్రేయో రూపం
వెచ్చని చేతులు చుట్టి ఉత్సాహ పరుస్తుంది
చల్లని చేతులు చుట్టి పరవశతను కలిగిస్తుంది
సుగంధ రూపం కవితలో! ఆకర్షణ గుణంతో
మాట పూవులా తాకుతుంది
మాట మెరపులా మెదలుతుంది
ఉల్లోల సమాజ సముద్రం! నిరంతరం
హోరు స్వరంతో ఏదో చెప్పాలని దూకుతుంది
మనిషి మౌన శిల్పం కాదు సజీవ గుణ రూపం
మనిషి మనిషి కొక విధం అర్థం వినబడుతుంది

ద్వేషం కోపం పీడన హింసల కవకాశంతో
మనిషి చిత్తవృత్తిలో చీకటి శకలాలు!
కాలాన్ని ప్రశ్నలతో అలంకరిస్తాయి
జవాబు చెప్పే బాధ్యత మనిషిదే!
తెరచిన కిటికీ నుండి వెలుగు! ఏదో చెప్పాలనీ
ఇంతలో గాలి వచ్చి మాటను తీసుక వెళుతుంది

28.

భూమి ఆకాశం దేనికదే సర్వ స్వతంత్రం
రెండిటినీ కలపాలని చూస్తుంది క్షితిజం
మనిషి మనసు కూడా! అదే పని చేసింది, చేస్తుంది
భువి దివి పేర్లతో రెండు లక్ష్యాలు! రెండు తరగతులు

మెలకువలో శ్రమ చేతనతో సమాజంలో
పేరు లేని వ్యక్తి లేడు, ఊరు లేని ఉనికి లేదు
బాధ గడ్డ కట్టి మనసులో రోజులుగా
కరగి కన్నీరుగ మారుతుంది తాపంలో
పరిచయంతో మొదలయి స్నేహంతో ఎదిగే మనిషిని
తనలో ఒకరుగ చేర్చుకునేను విశాల ప్రపంచం

పీడించే వారితో పోరాడే వారితో వివిధ స్థాయిలలో
విచిత్ర సంగమ రూపం ఈ సంశ్లిష్ట సమాజం పరివర్తనలో

కవిత ప్రభావం బీజ భూతంగా మొదలయి
లోన పెరిగి చెట్టయి నిలవడ మొక విశేషం
పూవో! ఫలమో! నీడో! ఎవరి కేది కావాలో
దాని కయి ప్రయత్నం జరుగుతుంది మనిషి నుండి

క్షితిజంలో ఎగిరే పక్షుల వరసలా
కాగితం పయి పద పంక్తులు! ఆత్మ ప్రకాశంతో
కవి హృదిలో సందేశాన్ని తీసుక వెళతాయి
దిశ దిశలో మానవీయ కథలను చేరుస్తాయి

భూమి కింద పొరలలో నీరు ఖనిజ సంపదలూ
పైకి కనిపించని అమూల్యాలెన్నో! మనిషి మనసులో
కలలో అపుడపుడు నిజ జీవితంలో బయటకు వచ్చేను
ప్రతి వస్తువు జీవన భాగ్యానికి సుందరతకు తోడ్పడేవే

ఇజం కలిగి ఉంటే మంచిదే! ఇది దర్శన పథ చిహ్నం
మబ్బుతోనొ మంచుతోనొ కప్పబడితేనే అనర్థం
కాలాన్ని పూర్తిగ జయించే శక్తి లేక పోయినా
కనీసం గాయాల నుండి దూరమవడంలో ఉంది! మనిషి ప్రజ్ఞ

ఇది స్వేచ్ఛా సమాజ స్థితి వార్తా ప్రకాశనం
భావ తంత్రులపై మీట బడే శబ్ద సాధనం
కవితను వినడం చదవడం అంటే
మనిషి మనసు నిండుగ ప్రేమ రసం పొందడం

స్వేచ్ఛా కవిత్వం-85

ఇది జీవితం

(x భాగం)

నిప్పు రెక్కలపై

మాదిరాజు రంగారావు

2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 85

IDI JEEVITHAM

(X Part)

(NIPPU REKKALPAI)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2018

Presented to
my wife
Smt. Indira

పీఠిక

స్వేచ్ఛా కవిత్వంలో "ఇది జీవితం" బృహత్కృతిలో "నిప్పు రెక్కలపై" పదో భాగం. ఇందులో వస్తువు సమాజం. జీవితాల్లో స్థితిగతులు విషయం. ప్రజాస్వామ్యం దార్శనికం (Ideology) సమాజంలో ప్రతి వ్యక్తి తన జీవితం సుఖకరంగా భాగ్యవంతంగా ఉండాలనే ఉంటుంది. సమాజం వికాసవంతంగా పరిణమించాలనే ఉంటుంది. అనుకున్నట్లు జరగదు. ఏదో తక్కువ అయినట్లు అనిపిస్తుంది. ఆలోచనలెన్ని విధాలో దార్శనికాలన్ని విధాలు. ఒక్కొక్కరి దృష్టిలో ఒక్కొక విధంగా రూపొందుతుంది.

ప్రస్తుతం సమాజంలో ఆర్థిక రాజకీయ విషమతలు, నైతికమైన విలువల పతనం, స్వేచ్ఛ యొక్క దురుపయోగం, ఇలా ఎన్నో అనుకూలంగా లేని అంశాలు కనిపిస్తాయి. ఇవి ప్రతి యుగంలోనూ ఉన్నవే. ఇవి లేని కాలం లేదు. అయితే ఇపుడు విశాలతను, వైవిధ్యాన్ని కలిగి ఉన్నాయి. నిర్భయతనూ పొందాయి. ఈ దిశలో జీవితాల్లో జరిగే అనేక ఘటనల వెనక నున్న కార్యకారణ సంబంధాల్లోని కనిపించేవీ కనిపించనివీ అంశాల్ని గమనించవచ్చు. ఈ రచన ఈ స్థితిలో సుందరమయిన వికాసశీలమయిన సమాజ దర్శనంతో స్వేచ్ఛా భావనతో ప్రకాశిస్తూంది. విశ్వ భావనా నిలయానికి ఆరోహణలో ఎక్కడికక్కడ సోపాన క్రమంలో ప్రాంతం దేశం జాతి వృత్తి వ్యవహారం సంస్కరణంలో స్వచ్ఛమయిన జీవనంతోనే పురోగమనం సాధ్యం. మొదటి మెట్టు నుండి చివరి మెట్టు దాక పరీక్షలో నెగ్గితేనే పరిపూర్ణత విశ్వమయమవుతుంది. ఇది ఈ కృతికి ప్రాతిపదిక.

మొత్తం మీద భావ సాంద్రతతో కవిత్వమూ ప్రజాస్వామ్య పథంలో ప్రయోజన తత్పరత కలిగింది. వ్యక్తి స్వేచ్ఛతోపాటు బాధ్యతల్ని దృష్టికి తేవడమూ జరిగింది. ఈ విషయంలో పాలకులూ సమాజమూ కుటుంబమూ వ్యక్తి పాత్రల ప్రాముఖ్యాన్ని ఎత్తి చూపడం జరిగింది.

ఈ పరంపరా రూపం స్వేచ్ఛా కవిత్వానికి మంచి బలాన్ని ప్రసాదిస్తూంది. ఆధునిక తెలుగు కవిత్వానికి విస్తృతినీ వైవిధ్యాన్నీ చేకూరుస్తూంది.

– మాదిరాజు రంగారావు

ఇది జీవితం – నిప్పు రెక్కలపై
(10వ భాగం)

1.

భూమికి అందరు సమానమే ఆదరణంలో
గగనం ఎవరికినీ అందదు, ఆలోచనలోనే
మాట దూసి చాకులా బాధలోకి దింపుతుంది
కవిత వేడి మతికి హ్లాద స్పర్శ నిస్తుంది

నవత స్తబ్ధ గతికి వేగ శక్తి నిస్తుంది
ఇరు సంధ్యలనూ ఇరు బుజాల పయి వహిస్తుంది

సమాజ కథలో విషాదకర ఘట్టంలో
ఒకరి దృష్టిలో దుష్టుడు క్రూరుడు మహా పాపి
వేరు దృష్టిలో సాహసి వీరుడు కృతజ్ఞుడు
ఒక అశ్వత్థామయే కాదు, ఎందరో తను పాత్రలలో

ఎన్ని పొరలతోనో జీవితం హత్తుకొని
కొన్ని పొరలలో గుణం మరో రూప మొందుతుంది
చుక్కలు కనిపిస్తాయి నిశి ఆశా రూపాలుగా
చీకటి అందానికి మురిసే వారూ ఉన్నారు

మాటలతో ఏకాంతం కరగతుంది మెల్లగా
చర్యలతో కదలి వేగ మందుకుంటుంది

ᔓᔐ

పచ్చని లాన్‌లో కూర్చొని ఉన్నా
ఎండిన చెట్టు క్రింద నిలిచి ఉన్నా
కవిత అవహిస్తుంది సృజన మనో రూపాన్ని
జీవన రథానికి సారథ్యం వహిస్తుంది
అది కృష్ణమయం కావచ్చు శల్యగతం కావచ్చు
ఓటమి గెలుపుల సూచనతో కథ సాగుతుంది

చీకటి జలధిని దాటాలనుకుంటే
వెలుగు పడవలో సాహస యాత్ర అవసరం
సామాజిక రాజకీయ మనస్తత్వ కోణాలలో
జటిలమయిన జీవితంలో క్లిష్టమయిన పాత్రలు
దేనికదే సాటిగా అపూర్వంగా
కొత్తదనంతో అభిరుచినిలుపుతాయి మనిషిలో

ᔓᔐ

2.

గాలి పాట ఎవరిదయిన ఎపుడయిన వినబడుతుంది
మనిషి కేకనే కాదు జలధి హోరునూ వినిపిస్తుంది
ఊహలో మొగ్గకు కుసుమ ముఖం ఇస్తుంది
తలపులో వెలుగుకు తలుపు తెరవ బడుతుంది

తాను చేరే బ్రతుకులో గమ్యం ఎక్కడో?
ముందుగ తెలిసే దెవరికి? ఎప్పుడు?
దాహం తీర్చే నదీ తటమా?
కరుణ ఎరగని మరువు స్థలమా?

వెలుగు రెక్కలపైన వచ్చే
మిత్ర రూపం హృదయ మెక్కడు?
తరువయితే నీడకు ఆహ్వానిస్తుంది
గిరి అయితే శిఖర మెక్కమంటుంది

రావడానికయితే దారులెన్నో! దిశదిశలో
పోవడానికయితే దారి ఒకటే, తెరవబడీ
జీవన గమనంలో కావలసింది
గమ్యం చేర్చే ఆ దారి ఒకటే!

ప్రాణుల ఊపిరి తోడుగ నడుస్తుంది కాలం
ఒంటరిగా అయినా మందిలో అయినా ఒకటే
అలసట ఎరగని కాలం మాత్రం
మనిషిని అలసటలో ముంచి పైకి తీస్తుంది

అనుభవాన రోజు రావడం పోవడం
బ్రతుకులో నయితే ఆగని పయనం!

ప్రగతి పథంలో నవత! పయనంలో
వికాస చరితకు కొత్త ముఖం ప్రకటిస్తుంది
ఒక్కొక శిఖరం దాటే కొద్దీ
ఒక్కొక విజయం వెనక ఒక అతృప్తి

3.

దీప శిఖలా వెలుగుతుంది కవితలో శబ్దం
భావనా పథ పంక్తిని మనసుకు చూపిస్తుంది
ఇది కాల గమనంతో కనిపించే
సూర్యుని తోనో చంద్రునితోనో అయ్యేది కాదు

శిశువుకు చంద్ర బింబాన్ని చూస్తే
తన మిత్రం కనిపించినట్లు ఉంటుంది
తన వద్దకు ఆటకు వచ్చేనని నమ్మకం!
కిందికి దిగేదికాదని తెలియదు, అమాయకం

చంద్రుని కిందికి రప్పించే ఆశ చూపి
తల్లి! పాపకు ఆహారం! తినిపిస్తుంది
ఆశాసహాయంతో దాటే సమస్యలెన్నో!
ఇది తెలియకుండనే అవతలి గట్టెక్కిస్తుంది

క్షితిజం ఆవల ఆపైన ఏముందో తెలియదు
ఎవరో ఉన్నారని? ఉద్దేశం ఎప్పటి నుండో
కల్పన వంతెనపై జరుగుతుంది పయనం
సృజనతో, కొత్త జగం కాలం గడుస్తుంది

కొండ నిలబడే ఉంటుంది, కదల లేదు
నది కదలుతూ ఉంటుంది, నిలవలేదు
అలలు లేచి జారుతాయి, మెలిక పొంద లేవు
మబ్బులు దిగలేవు, ఉదారతను చూపుతాయి

ఉదయం విరిసిన కిర్మీర పద్మం
మనిషిలో చేతన శక్తిని సాకారం చేస్తుంది
సమాజ వికసనానికి ప్రేరణ అవుతుంది
మనిషితోనే మనిషిలో వెలుగు బయట పడుతుంది

మనిషికి ప్రియమైందే జరిగే అవకాశం లేదు
ఘటనలు మనసులో అగ్ని చిత్రం గీయవచ్చు

4.

వ్యక్తి నడత సమాచారం అవసరం సమాజానికి
తెలుసుకొనే ఈహతో మౌనంగా ఉండ లేదు
పేరు ఊరు జీవితం! గతం నుండి భవిత బాట
వర్తమాన స్థితిలో ఉన్న పాత్ర! విశేషాలు

మాటలతో పెరుగుతుంది సమాజ సంబంధం
మాటలతో విరుగుతుంది వేరయి పోయేను
మనిషి గురించి మనిషికి తహతహ! సహజం
మనిషికి కాకపోతే! ఎవరికి ఉంటుంది!

ప్రాంతం గురించి ప్రశ్న! అవకాశాలలో
కులం గురించి ప్రశ్న! అవరోధాలలో
మతం గురించి ప్రశ్న! విశ్వాసాలలో
జెండర్ విషయంలో ప్రకృతి శక్తి కలసం

రాకపోకల కేంద్రం! ప్లాట్ ఫార్మ్ అందరికీ
ఒకటే! ఏ భేదం లేకుండా అందరూ కలిసేరు
ఇంట్లో నయితే బయటి ప్రశ్నలకు తావు లేదు
అంతా నిశ్శబ్దంలో! స్వర వాద్య కచేరీయే!

ముందుగ ఫిక్స్ అయినా మారే స్థితి రేఖలతో
అనుకొనీ అనుకోని మిశ్రమ రూపం! జీవితం
వ్యక్తుల ప్రయోజనాలు సమాజావసరాలతో
అంతరంగ స్పర్శతో లోపలి లోకం వేరు

స్వేచ్ఛలో మనోమయం వ్యక్తిత్వం అందరిలో
సందేహం అక్కర లేదు సందేశంతో పని లేదు
నిరంతరం పరివర్తన ప్రక్రియలో సమాజం
మార్పులేని శిల్పశాల కాదు! మనిషి జీవితం

జ్ఞాపకాలు మాయం కావు మనసులో భద్రంగా
పునర్జవానికి వీలును కల్పించే చేతనలు

5.

మనుషుల అవసరాలలో సమూహ శక్తి సమాజం
వర్తనతో కదలే జీవితమొక తెలియని వాస్తవం
బ్రతుకులో ఈహతోనే ఇంత వరకు వికాసం
లేంది! ఏ గుహావాసంలోనో అడవులలోనో ఉండేది

మనిషి అంటేనే గెలుపుకై పరితాపంతో
ముందుకు అడుగులు వేసే చరిత్ర బింబం

కళ్ళు బాగానే ఉన్నాయి, కనిపిస్తూనే ఉన్నాయి
శరీరం బాగానే ఉంది, స్పృహలోనే ఉంది
బయటి కన్నీ బాగానే ఉన్నా లోని మనసు మాత్రం
అపరాధ భావనలో దోషారోపణలో చిక్కుకొనీ

వ్యక్తులతో సమాజం! సంక్షుబ్ధ దృశ్యమయమై
బ్రతుకును అశాంతి సుడులలో తిప్పుకుంది
పెళ్ళలుగా జారిపడే మానస శిఖరాలతో
కింద నున్న లోయ నిండే తృప్తితో మనుషులు!

ఉద్రేకంలో భూమి పయి బీభత్స ముద్రల చిత్రంలో
నెత్తురు చారలపై అడుగు జారుతుంది
పులిచే తరుమబడే జింకల్లా క్షణాలతో
అపాయ భయం మనిషిని శిల్పంగా మార్చేను

నమ్మకం లేని ఖాళీలను నింపే ముద్రలతో
దిశకు బదులు నింగి వైపు చూపే వేలుతో
యత్నం బదులుగ పిడికిలి! ఘర్షణ మతితో
మరో పాత్ర! ప్రవేశం జరుగుతూంది సులభంగా

స్వేచ్ఛకు అవకాశంలో రాళ్ళ వర్షం పడుతూంది
తలపై అక్షతలకు బదులు తూటా దూసుక పోయేను
విభిన్న సంక్షుబ్ధ దృశ్యాలతో సమాజం!
విపణి వస్తువయి, రాజకీయ క్రీడను పొందుతూంది

6.

ఉదయం లేచి బయటికి వస్తే
రవి బింబంతో పోటీగా మనిషి ముఖం
ఎరుపు, తెలుపు, పసుపు కలిసిన రశ్మితో
ఉద్వేగం ఉల్లాసం ఉత్సాహంతో మానవం

బయట ఇంటి ద్వారంతో పాటు
లోన మనసు ద్వారంతో మనిషి!
భయం లోనో జాగ్రతకో! మూతపడింది
ఎపుడు తెరవ బడేది తెలియదెవరికీ
విశేష స్థితిలోనో వివేచన సందర్భంలోనో తప్ప
నిర్ణయ సందేహంలోనో ఆపదలోనో తప్ప

సుఖమూ భాగ్యం కోరని మనిషి లేడు
వాటికి ఎడంలో మనిషి ముందు ఆటంకం
అనల రేఖనో శిలా పంక్తినో తలపిస్తూ
దాటే ఉపాయాలలో తెలివి పదును తేలుతుంది

పక్షియై ఎగిరే కోరిక ఎప్పటిదో
అది ఆపద సమయంలో ఆలోచనలో
ఏ హెలికాప్టర్ రూపంలోనో తీరవచ్చు
బాధలో కష్టంలో దాటే మేధ మనిషి స్వంతం

సులభత సుగమత వేగాలకు ప్రాధాన్యంతో
పేపర్ బదులు కంప్యూటర్! విషయం ఒకటే

బ్రతుకు విధాలెన్నో! అవి పొందే మార్పులన్నీ
మనిషి ఊహలెన్నో! అవి చేరే తీరులన్ని
ప్రతిమతిలో కలలు ఫలించే చర్యలు దాగీ
ఆపదల భయాల వెనకనే! అవి తొలగే ఉపాయాలు!

చీకటి దారిలో దీప స్తంభం కనుమూయదు
అయినా జరిగేవి జరుగుతూనే నగరంలో

7.

రాత్రి అవబోతూంటేనే దీపం మెదలుతుంది మనసులో
ప్రియమైన వెలుగు మంచి పనులకు సంకేతం
చీకటి భయం పోయి, మనిషి ఉనికి నిలుపుతుంది
ఇంటి ముందు ద్వారం పయి దిష్టి బొమ్మలా చీకటి

కాలంతో నడచే మనుషుల దృష్టి అంతా
ఆ సమయంలో కలిసే మనుషుల పైనే!
కొత్త ప్రశ్నలకే మాత్రం అవకాశం లేదు
పగలు తెలిసిన ప్రశ్నల గురించి మాత్రమే!

జవాబుల సమీక్షలో చింతనలో క్షణాలు గడచేను
ప్రస్తుతానికి విరామంలో పనులన్నీ! ఆలోచనలోనే
తీరని కోర్కెలు నియమాలను మరపించేను
తప్పని అవసరాలు! నిబంధనల్ని దాటించేను

నడచే మనిషి బుజాలపై నిల్చొని
పైన ఉన్న చంద్రుని అందుకోవాలనీ
తన మనో నయన దృష్టి కిరణం సాగి
ఎదుటి ముఖంలో రహస్యం చూపాలనీ

వాస్తవాన్ని వెలికి తీసే న్యాయవేత్త
వస్తువు విలువను తెలిసిన వర్తకుడు
జన హిత చింతనలో మహానేత
కలిసిన త్రీ ఇన్‌వన్ కవి మనో రూపం

మానవతా మధు బిందువు అన్వేషణలో
ఇది బహు కష్టమనీ అనన్యమనీ తెలుసు!
హత్యలు హింసలు నిరంకుశం వెనక నున్న
అంశాలను బయటికి చూపుతుంది అక్షర కిరణం

జీవన వనిలో మొలిచే అగ్నుల మూలం గుర్తిస్తుంది
మేఘం గర్జా ధ్వని కటువయినా ఉదారతను మన్నిస్తుంది
పనికి వచ్చే అనల కణాలను వేరు చేసి మెరపిస్తుంది
హృదిలో సృజన కళతో కొత్త జగం చూపుతుంది

8.

కాలం మనిషిలో మనస్వినీ మనీషినీ మరచి
కళ్ళలో తళతళలాడే నాణేలను మెరపించేను
స్వేచ్ఛా వర్తనలో పులిగానో సింహంగానో అయి
సమాజాన్ని అరణ్య స్థలాలుగ మార్చేను

అపుడపుడూ పూల తీగె చుట్టుకున్న దేహంతో
ఆకుల చాటున దాగిన కంటకాల చేతులతో
బోనులో బంధనలో ఉండవలసింది
వీధులలో నిర్భయంగా తిరగడమొక విచిత్రం!

మాటకు మాటలో చివరి దంటూ లేదు
కవితలోను చివరి వాక్యమంటూ లేదు
అస్తమయ కిరణం చివరి వెలుగు కాదు
ఇదొక బ్రేక్ మాత్రమే! ఇంకా వచ్చే ఉదయాలెన్నో

పులుపు చేదు వగరు ఉప్పు తీపి కటు రుచులతో
స్థితులెన్నో! మాటలలో గుణ విశేషాలన్ని
కలహం శత్రుత కోపం ద్వేషం ఇష్టం కాకపోయినా
తప్పనివయి బ్రతుకులో, మనసు నావహించేను

కిరణం అంచులలో గాలికి వేలాడుతూ
ధూళి ధూమం కళ్ళు మూతబడజేసేను
కవితలోను దోష మనుకునే దేదో రూపంలో
సృజన జగంలో భాగమయి ఆలోచన పెంచుతుంది

వెలుగు రాని గదిలో వెలుగు లేని మదిలో
చీకటి కవకాశం ఎక్కువగా
అది ఒక చెరువో బావియో అవుతుంది
బయటి నుండి వెలుగు చేయి అవసరం!
అందుకునేదో! చేదుకునేదో! ఏదయినా
ఇది భౌతిక జీవన సీమలోని వాస్తవం

9.

సన్నని దూది పటంలా తేలికగా వెలుతురు
మందపు ఇనుప ప్లేటులా బరువుగా చీకటి
పగలు రాత్రి! దేని సమయం దానిదే
నడుస్తూంటే బుజాలపై చేరినట్లు ఉంటాయి

ఎక్కడో దూరంగా పైన ఉన్న గగనం
మస్తిష్క శిఖరంపై వాలినట్లు ఉంటుంది
నిదురలో మరపున బడి, పనిలో తెలియకుండ
దీని రహస్యం! మనసులో ఒదిగి దాగి
ఇది అద్భుత సుందర అనుభవ సందర్భం
కమలంలా విచ్చుకొన్న కాలం ఒక కవిత అవుతుంది

గాయాలకు పూలు అద్ది! సుఖమయం చేస్తుంది
చేతనలో మనసుకు క్రియా రూప మిస్తుంది

మనిషిని ఓదార్చే దెవరు? చెట్టు కాదు, మబ్బు కాదు
ఎంత దగ్గరయినా, ఎంత పైన అయినా, సరే!
నదిలా ఆగని కాలం ప్రవహిస్తూనే
కన్నీరు బిందువులనూ నెత్తురు చుక్కలనూ కలుపుకొనీ

ఎవరి మానసిక దౌర్బల్యం మాలిన్యం వారి వరకే
అయినా! సంబంధంతో సమాజానికీ చేరుతుంది

ఇది ఉదయం రశ్మితో తొలగిపోదు
ఇది రాత్రి వెన్నెలతో చెరగిపోదు
మానస స్పందనతో జరుగుతుంది
మనిషి కర స్పర్శతో ఆగుతుంది
ఉపశమనం పొందవచ్చు, మరపున బడి పోవచ్చు
లేంది బ్రతుకు! తిరిగే అగ్ని గోళ మవుతుంది

తెనె తెట్టె లాగ పదాల నిర్మితితో
సారవంతమయిన కవితా రూపానికి
ఒక్క అమృత బిందువు లభిస్తే చాలు
హృదయాన్ని వరిస్తూ, కాలాన్ని జయించినట్లే

10.

అమ్మ తరువాత శిశువును తాకేది గాలి
ప్రాణ కారణం అమృత స్పర్శతో ఆత్మీయం
ఎంతటి ఆతపమయినా
నీడ నెవరు మాపగలరు?
ఎంతటి అధిపతి అయినా
మబ్బు నెవరు ఆపగలరు?

ప్రకృతిలో పరిణామం తిరిగే కాల చక్ర వశం
సంఘంలో పరివర్తన మనుషుల చర్యల రూపం

తెరచిన పుస్తకంలా రోజు! మౌనంగా
స్మృతిలో మానుష కథలను నింపుతుంది
అన్నీ కాల రేఖలతో ఏర్పడే జీవన చిత్రాలు
సృజన ప్రభావంతో కవితలుగా మారతాయి

చీకటి ద్రవంలో ముంచిన బ్రష్‌తో
తీర్చిన రేఖల మధ్య! వెలుగులు నింపే యత్నం
పలు రంగుల కవకాశంతో సమాజమవుతుంది
నిరాశ అవసరం లేదు, నిరీక్షణతో పని లేదు

గాయపడిన ముఖంతో చంద్ర బింబం
కన్నీరు చెరువుతో వెన్నెల రూపం!
మనసును కదిలించేవి! కవితను నినదించేవి
ఏ దీన వనిత రూపమో కనుల ముందు వేలాడేను

ఉదయం పూవు అందంపై దృష్టి ప్రసరిస్తుంది
నిశీథి పరీమళాలపై ఆశ విలసిస్తుంది

పాల మనిషి పేపర్ బాయ్! మార్నింగ్ వాక్‌లో మనుషులు
రాత్రి కల్పనలకు సెలవు పలికి! వాస్తవం కదలుతుంది
చేయని కలిపే చేయి, జేబులో నిలవదు
దిక్కులు చూస్తూ ఉంటే! కాలం ఆగదు!

11.

సమాజ ద్వారానికి ఉదయ మొక ఆశా తోరణం
ఊపిరి బరువెక్కి ప్రాణం వేలాడే దీన ప్రజల పట్ల
బాధ్యత! ఎవరిది? పాలక మహాశయులదే!
ప్రజాస్వామ్య భావన అలంకార విభవం కాదు

పగలు మండే జ్వాలా సమస్యలకు కమలి
రాత్రి వేళ చల్లని చీకట్ల నాశ్రయించేరు!
విశ్రాంతి కనే కాదు! రేపటి మార్పుకు స్కెచ్‌లో
దేని కయిన నిరీక్షణమొక శాశ్వత స్థితి కారాదు

మౌన ముఖం సమాధాన వేది కాదు
నిశ్శబ్దం శాంతికి కవచం కాదు
చీకటిలో కళ్ళు మూసుకుంటే!
సమస్యకు పరిష్కార సూచి కాదు

ఏ ఒకరి మనస్సు దేవతా నిలయం కాదు
అంతరంగ స్పృహతో చిత్తశుద్ధి అవసరం

పోయినంత మేర క్షితిజం! తల ఎత్తే ఉంటుంది
మనిషిలో అభిమానానికి నిటారు రూపమిస్తుంది
రాత్రి వేళ పోయినంత మేర తమతో పాటుగ
దారి ప్రక్క నున్న దీపాలు! దారి చూపుతూ ఉండవు

ఎవరి ముఖం వారికి చిరు దీపమై
చూపులో వెలుగుతో పోవలసిందే!

రాత్రి అయినంత మాత్రాన భయపడనవసరం లేదు
బాధ ఉన్నంత మాత్రాన ప్రాణ హరణంతో పని లేదు

తాడు కనిపిస్తే బంధనకో! ఉరికో! అనుకొని
దిగులు నూయిలోకి దూకే ఊహ రాకూడదు
ముఖాన విరిసే నవ్వు పూవుతో వచ్చే రోజు మరచి
ఏ విషాద ఘటనకూ తావు లేదు, జీవన రుచిలో

12.

ఎక్కడికి వెళ్ళినా చూపు మనిషి వైపే మనిషి పైనే
చెట్టు కొండ గిరి నది జలధి నింగి నేపథ్యంలో
అన్నిటినీ మించి మనిషికి మనిషితో సమాజ బంధం
ఊహలో చింతనలో అనుభవ సుందరమై మనోమయం

ఎంతటి కష్టాల కడలిలోను పయనంలో
బరువును మోస్తూ ఈదుతుంది ఆశారూపం
గాలిలో తల ఊగే గడ్డి పోచ అయినా
వికలమయిన మనసును సకలం చేస్తుంది
చుట్టూ మండే అనల శిఖలు బదులుగ
పూల తీగె సాగుతుంది, పందిరి అవుతుంది

మనసులో చీకటి చుక్క రేఖగా మారుతుంది
క్రూరత నుండి నేరానికి దారి తీస్తుంది
నిజం తెలిసేందుకు జరిగే ప్రయత్నాలు
వేళ్ళ కందని పాద రసం గుళికల్లా జారతాయి

పైకి చూస్తే ఎగిరే పక్షులు! ధైర్యాన్ని నింపుతాయి
ఎక్కడి నుండి ఎక్కడికో తెలియక పోయినా
సంతోషం వలలో చిక్కుకొనీ సమయం
నింగికి అందంతో మనసున హ్లాదం నిండుతుంది

పూర్వం ఇష్టమైన వెన్నో! పరిమళ ముద్రలతో
వాటితోనే బ్రతుకు సార్థక మనిపించినవీ
తృణ మయినా పక్షి అయినా మనిషి అయినా
దేని కదే సృజన విశేషం! జీవన గుణ రుచితో!

కాలానికి అలంకార సుందరమై మనిషికి ప్రియమై
రోజు నుండి రోజు దాక విరిసిన పూవు
మనుషుల మనసును తాజాగా ఉంచుతుంది
గుడిసె ముందయినా మేడముందయినా ప్రభావ మొకటే

13.

స్వేచ్ఛ ప్రాణి ఊపిరిపై స్వారి చేస్తుంది
సూర్య కిరణ వాహనంపై పయనిస్తుంది
జలధిలో అలలపై కదలుతుంది
నేలపై ప్రవాహ గతిలో సాగుతుంది

వ్యక్తి గతం నుండి సమాజ పరమవుతుంది
జడతలో కదలిక కవకాశం ఇస్తుంది
దూరంగా ఉన్న మనుషులతో కలుపుతుంది
ఒకటిగ చేస్తుంది, ఉద్యమింప చేస్తుంది

ఏ పనినయినా పూనే ధైర్యం నింపుతుంది
కత్తిని ధరింప జేస్తుంది, శాంతిని వరింప జేస్తుంది
వేగంగా వచ్చి నిరంకుశాన్ని శిథిల పరచి
సమాజ పరివర్తనలో ముఖ్యపాత్ర వహిస్తుంది

సమ భావం సౌభ్రాత్రం రెక్కలపై మనిషికి
విశ్వ హృదయ సీమలతో స్నేహం పెంచుతుంది

ఆధిపత్య పద ఘట్టన కవకాశం లేకుండా
అడుగు నుండి, భూకంపం సృజిస్తుంది స్వేచ్ఛ
చీకటి గుర్తులు లేకుండా చేయాలనీ
ఇది సూర్యుని తేజో భావనతో! కలుస్తుంది

ఎదిగే పిల్లల ఫాలంపై పతాకలా కదలుతుంది
కల్పనల గుహల నుండి నిజాన్ని పైకి తీస్తుంది
అసత్యం నుండి సత్యాన్ని, పైకి తీసేందుకు
చిక్కు ముడుల నుండి సమస్యను లాగేందుకు
చీకటిలో సాహస రూపం
వెలుతురులో ప్రేరణ భావం

నాలో నీలో అంతటా స్వేచ్ఛ! చరిత్ర గతిలో
విధి వాక్యం మార్చేను, ప్రశ్నకు జవాబు చూపేను

14.

నిశీథి ఎవరి కెంత సహాయ పడినా
అది ఒక చీకటి గుహకు సంకేతం
యుద్ధం ఎవరి కెంత ఉపకరించినా
అది ఒక బీభత్స కథా ప్రపంచం

ఇరువురి ఆశయాల సమిధల ఘర్షణ
ఎవరూ ఊహించని అనల బాధ కలిగించేను
ఎక్కువ మందికి ఇష్టం లేనిదయినా రణం
తక్కువ మంది బలం ముగ్గులోకి దింపుతుంది

రక్షణ కయి ఆయుధం, ఉపయోగంలో అనలం
నియంత్రణం నిబంధనంతోనే సమాజ శ్రేయం!

చీకటి అనుభవంలో కనిపించని వస్తువు గురించి
ఉదయం కోరుతుంది కవితలో కానుకగా
వెలుతురు అనుభవంలో కనిపించే వస్తువు గురించి
రాత్రి కోరుతుంది కవితలో ప్రేమగా

వంతెన కిరువైపుల చివరలు కలియవు
పక్షికి ఇరువైపుల రెక్కలు వాలుతాయి
కనులు రెండు కలిసే చూస్తాయి
కాళ్ళు రెండు కలిసే నడుస్తాయి
చర్యలో దేని సూత్ర విధం దానిదే
దేని ఉపయోగం ప్రయోజనం దానిదే
రోజు రావడం పోవడం ఉన్నదే, ప్రత్యేకతతో
ప్రతి మనసు పాత్ర! పయనంలో వేరు వేరుగా

ప్రవహించే జీవితంలో బిందువు స్థిరం కాదు
చలనంలో మార్పులతో ఎవరి దృష్టి వారిది,
ఆకురాలిన చెట్టు, నవతకై ఆరాటపడుతుంది
ఎండిపోయిన చెరువు, నీటికయి వేదన చెందుతుంది

15.

వస్తువు అందం ఉపయోగంలో ఆకర్షణ
మనిషిలో ఆంతర శక్తిని ప్రేరేపిస్తుంది,
మార్పుకు మనసును సిద్ధం చేస్తుంది
ఎదిగే కొద్దీ స్వార్థం ప్రబలుతుంది
బ్రతుకులో అనుభవం రాసులుగా ఏర్పడీ
ప్రకృతి నుండి ఆలోచన వికృతి వైపు సాగుతుంది

లాకర్‌లో ఆభరణల్లా మనసులో చేరే అమూల్యాలు
సహనం శాంతం ప్రేమ ఉదార గుణ విషయాలయి
అపుడపుడూ స్క్రీన్ పయి బొమ్మల్లా తేలతాయి
విశేష సందర్భంలో అందే ఆదర్శం శకలాల్లా!

పాత పెట్టెలో వస్తువుల్లా మనసులో చేరే అనుభవాలు
శిశు దశలో అమాయక స్థితిలో
కత్తెర పడే కాగితం ముక్కల్లా
రాలే ఎండుటాకుల్లా ఒకటొకటీ
ఘన కార్యం చేసిన వెర్రి సంతోషం!
చూచే వారి మనసు జాలిలో తేలుతుంది!

ᔓᔐ

అలసిన మనిషి చూపు ప్రకృతి వైపు మరలేను
కొత్త మనిషితో పరిచయం కయి ఎదురు చూచేను
కళల నాశ్రయించేను వినోదాల్ని ఎన్నుకునేను
జీవితమొక వ్యాపకంతో కాలక్షేపం జరుగుతుంది

రణ మంటే విపరీత చర్యల సంకలనం
శబ్దం నిశ్శబ్దాన్ని చీల్చి, సమయాన్ని గాయ పరచేను
ఆయుధ మెప్పటికీ మెలకవలోనే ఉంటుంది
చర్యలతో మనిషికి మారణ దృశ్యం చూపిస్తుంది

శాంతి క్రియతో రణం కూడ కవితకు ప్రేరణయై
ఏకాంత శిఖరం నుండి సమాజ వనిలో దింపుతుంది

ᔓᔐ

16.

స్వేచ్ఛ అంటే సంకెళ్ళ నుండి మోచనమే కాదు
ఆశల పందిరికి అవకాశాలను నిలుపుతుంది
గుండె తట్టి నెత్తురు వేగం పెంచుతుంది
విధ్వంసం నుండి నిర్మితికి దారి చూపుతుంది
బ్రతుకులో కొత్త అర్థానికి తిప్పుతుంది
భయం పోయి ధైర్యానికి స్థానం కల్పిస్తుంది

బాధకు దు:ఖానికి వీడ్కోలు అంటూ లేదు
వాటి అంతట అవి వస్తూ పోతూంటాయి
ఎగుడు దిగుడు, భూమిపై సమస్తం
సమం చేసి దారి వేసి నడిచేరా? ఎవరయినా?
పూవులా మెరపులా తరగలా సహచరి రూపం!
ఎగుడు దిగుడులో! అనుభవ సుందరతకు చిహ్నం!

ఎప్పటి కపుడు వాద్య విశేషాన్ని సరి చేసుకుంటూ
ఉన్న స్థితిని బట్టి మీట బడే కాలం తీగెల పయి
చేతి వేళ్ళు కదలేను! నాదం వినిపించేను
తనకై ఎదురు చూచేది అమ్మతో పాటు సహచరి!

స్వాగతం తప్ప వీడ్కోలు ఎరగదు నివాసం
స్పందన తప్ప ఏ శబ్దం ఎరగదు కాలం!
హృదయం ఎవరి చేతిలో యంత్రం కాదు
స్వంతమయిన స్వతంత్రమయిన మధు పద్మం

మనో ద్వారం తలుపులు ఎప్పటికీ తెరవబడీ
ఉంటేనే గాలి వెలుతురుతో స్వేచ్ఛా రూపం
శబ్ద గుణం ఆకాశంలో జలదంలా కవిత
భూమిపైన మెరపు చూపుతో కరుణ జలంతో
బయట ఎందరు కలిసినా మాట లాడినా
లోన కవిత మాటతోనే రోజుకు చరితార్థం

17.

కష్టంలో కలహంలో బాధలో విషాదంలో
కాలం ఆగదు, పయనం సాగుతుంది, నడకనో
అగ్ని వాహనంపైనొ! పవన వాహనం పైనో
ఘటనలతో మానవ కథ బయటికి వస్తుంది
పైకి శాఖలుగా విస్తరించే జీవన సందర్భాలతో
మనిషి మనిషిలో ఒక్కొక విధం మూలం

ఒక పని పూర్తి అవలేదని రోజు పొడిగింప బడదు
ఏ రోజు కా రోజు పరిమాణంలో అనుభవాల క్యాప్సెల్
రోజు నిష్క్రమిస్తుంది వ్యక్తులలో అనుభవ ముద్రల్ని వదలి
సమాజ స్మృతిలో భద్ర పరచబడీ, అమూల్యంగా

చుట్టు వస్తువు లెన్నో! శూన్య మెక్కడుంది
అవసరమైంది అందకపోతే శూన్య మనిపిస్తుంది
కావలసింది లేకపోతే అంతా వ్యర్థ మనిపిస్తుంది
ఇది మానసికం! నీరు లేని బావిలో బొక్కెన వదలే చందం

స్వప్నం నిజం కాదని అందరికీ తెలుసు
పూర్వ విషయ ప్రతిఫలనంగా బింబమో! ప్రతీకయో

చుట్టు రాతి గోడ! ఎక్కడో ద్వారం! ఉంటుంది
అది తెరవబడితే! సమస్యకు కీ దొరకుతుంది
మనిషిలో కరుణ ఉంటుంది
అది ఒక ఒయాసిస్‌గా
ఆయుధ బలంతో రుజువవుతూంది
కోపం ద్వేషం శత్రుత హింసలతో ప్రబలుతుంది

దాహాలెన్ని విధాలో! మనిషిలో ఉండేవి
రణం ధనం అధికారం యశస్సు రూపాలలో
కవిత నడవదు ఒకరు చూపే దిశలో
ఎవరి మాటపైనో! అక్షరం పలకదు

18.

కెరటం ఒంటరిగానే పోయినంత వరకు జలధిలో
మనిషి కూడా ఆలాగే! సమాజ సందర్భంలో
కెరటం జలధిలో భాగం, మనిషి సమాజంలో భాగం
సామూహిక శక్తితో ఎప్పటికీ ముందునకే పయనం!

భూగోళం ఆకర్షణ సమాజానికీ ఉంది
సహజంగానే సహన స్వభావం కలిగింది
ప్రకంపనంతో ఎపుడో భూమి కోపం ప్రకటిస్తుంది

సముద్రం ఆకర్షణ సమాజానికీ ఉంది
కల్లోలంతో ఎపుడో జలధిలో బీభత్సం సృజిస్తుంది
స్థిరత లేని స్వభావంతో కదలుతూ! ఉంటుంది

సమయ సమయం మారే జలధి నుండి రాగాలకు
ఒడ్డున ఉన్న శిలలు! శ్రోత లవడమొక విచిత్రం!

పూవు కయి మనిషి ఎదురు చూచేను
పరవశాన ఉన్న పూవు కేదీ పట్టదు!
శాంతి కయి మనిషి దిశలు వెదకేను
పైన పయనంలో ఉన్న హంస కేదీ పట్టదు

కొమ్మకు అందంగా పూచిన పూవును కోసీ
దాని జీవన రహస్యం తెలుసుకునే! యత్నంలో
రేకు లొకటొకటీ! రాల్చి వేస్తే?
మిగులుతుంది శూన్యం! ప్రశ్నకు మూలం!

మనిషిగా పుట్టినందుకు గర్వం సహజం!
జ్వాలయై సమాజాన్ని అలంకరించే నొక సమయం

సమాజ సమస్యకు పరిష్కారం! మానుష శక్తితోనే
నిర్మాణానికి దార్శనికం ఆధారం, ఆచరణంలో పై రూపం
పూల వలె ఆలోచనలు! మనిషి మనిషికీ భిన్నం
అందరినీ ఒకటిగ ఉంచేది మాత్రం! మానవ బంధం

19.

ప్రతి కవిత కొత్త లోకానికి తలుపు తెరుస్తుంది
మెరపు తీగెలా ఉనికిని ప్రకటిస్తే చాలదు
రస బిందువు జారి జీవన భూమి నలంకరించాలి
జన హృదయం పచ్చదనంతో సృజనను పొందాలి

తల ఎత్తి సూటిగ చూడలేని రవి బింబం! తేజకరం
తల ఎత్తి చూచే కొద్దీ! చూడాలనిపించే
చుక్కల పరివారం మధ్యలో చంద్రబింబం! హ్లాదకరం
కవితకు ఇరువైపుల! జీవిత వాస్తవాలు! పగలు రాత్రి!

ఓటమిలో నేలకు దిగి! రెక్కలు ముడుచుకునే కన్నా
మరో సారి రెక్కలపై ఎగరడమే మానుష కర్తవ్యం
జీవన గతిలో చర్యలతోనే వ్యక్తిత్వం ఏర్పడుతుంది
చిన్న అయిన మిన్న అయిన! మూసపోత కాదు

లౌకిక జగత్తును బింబిస్తూ కవిత
అతీత రూపాన్ని స్పృశిస్తూంది
గోడలు దాటిన మైదానంలో నుండి
దేని కయినా సిద్ధంగా ఉంటుంది
వెనకాడదు, భయపడదు,
మనిషిలో మనిషిని వెతికి పట్టు కుంటుంది

కదలని పర్వతంపై కనిపించని దైవం నిలవబడేను
కదలే జీవితంలో కనిపించే మనిషి మరవబడేను
చెట్ల పయి వస్తువుల పయి మనుషుల ముఖాల పయి
పలచని దుమ్ము పొర అలంకార మవుతూంది

ఉదయం కాగానే దేని కోసం ఉత్సాహం! సంరంభం
ప్రేమ కోసమా? సేవ కోసమా? ఎక్కడ? ఎవరికి?
ఇది కొన గల డబ్బు ముఖం చూడాలనా?
ఇవి పొందే చోటు చూచి రావాలనా?

20.

ఆకాశం భూమి వస్తు చయం మనుషులు!
నిద్రలో! ఏమీ లేదు! అంతా ఏకాకారం! శూన్యం
మెలకువలో దేనికది! వేరుగా! వెలుగులో స్పష్టంగా
బ్రతుకులో ఎన్నిటితోనో ప్రభావ సంబంధాలతో

భయంతో నిలిచిన క్షణాలను
ధైర్యంతో ముందుకు నడిపిస్తుంది చరిత్ర
శాంతికి యుద్ధ భయం ఉండవచ్చు
ఏ భయమూ రణాన్ని సమీంచ లేదు

భయం తాకి నేలపై చదికిలబడ జేస్తుంది
సాహసం ఎత్తులో రెక్కలపయి తిప్పుతుంది
విరుద్ధ ముఖాలకూ విరోధ గుణాలకూ స్థానంలో
బాణం ఒక దిశ నుండీ, పూల దండ ఒక దిశ నుండీ

బాణం సూటిగా గుండెలో దిగుతుంది
పూల దండ! నేరుగా మెడలో పడుతుంది

మంచి చెడు పుణ్యం పాపం! ఏది అయినా
మనిషికి తెలియక పోవచ్చు తెలిసి చేయవచ్చు
రెండిటికీ మధ్య సన్నని వెలుగు రేఖ
అంతలో నీలి రేఖగా మారవచ్చు!

రవి బింబానికి నిన్న నేడు రేపు ఒకటే
మనిషికి మాత్రం వేరు వేరు జీవన దృశ్యాలతో
ఊహలు చర్యలు సందర్భం ఘటనలు భిన్నంగా
ధనం యశం పదవిపై ఆశలు ఒకటే!

మంటల తాపాన్నీ వరదల కోపాన్నీ
ఎంతయినా! భూమి భరిస్తుంది
బ్రతుకు బరువునూ పని బాధ్యతనూ
ఎంతయినా! మనసు వహిస్తుంది

21.

మనసును సృజన గతం చేస్తుంది కవిత
శబ్ద ప్రసారంతో హ్లాదమయం చేస్తుంది
ఎండిన చెట్టు పూలతో విరిసి మురిసినట్లు
స్నిగ్ధతతో అనుభవం కొత్తదనం పొందుతుంది

కాలాన్ని దాటే వంతెనలా వర్తమానం
ఎప్పటికీ ఎదుట పరచబడీ! మనిషిని నడిపిస్తుంది

ఉత్సవ కళతో పండుగ రోజు! విభిన్నంగా
ముఖాన ఉదయ రేఖ సుందర తోరణమవుతుంది
మౌన శిఖర తలం నుండి మాటల పక్షులతో
సమయానికి కవిత! జన హృదయం బింబిస్తుంది
సంపదతో కళకూ, మాటలతో కవితకూ
స్థానం దొరకడమొక మానవ సంస్కృతి విజయం

పండుగ రోజున శ్రమ! ఇనుమడించి ఆవహిస్తుంది
కోరే వారిలో చేసే వారిలో సంతోషం చిందుతుంది
కడుపులో అగ్ని శిఖ ఆరని పేద ముఖంలో
పొద్దు పొడుపు జాడలేదు! పండక్కి వెళ్ళినట్లుంది

ఈ రోజు కొన్ని ఖాళీలతో చిన్న నుండి పెద్ద దాక ఆరాటమే!
పరితృప్తికి అవకాశంతో పోరాటానికి సెలవు దొరికేనా?
దారిలో చెట్టు కొమ్మ నుండి పూలు జారి
బిక్షువు పాత్రను నింపేనా? వెచ్చని ఆకలి తీరేనా?

అన్ని రోజులు! శ్రామికులకు ఒకటే
ఇష్టమైన విధంగా రంగులద్ద బడీ
సమయం! ఏష్‌ట్రేలో సిగరెట్ మసియై
గతాన్ని తలపించినా, వర్తమానమే జీవితం!

సంక్రాంతి అయినా ఉగాది అయినా మరొకటి అయినా
ప్రభావ సౌందర్యం ఒకటే! మానస భూమిక ఒకటే

22.

గుడిని నమ్మినా మడిని పొందినా మనిషి
మనిషికి దగ్గరగా విశాల సమాజ శాలకు రావలసిందే
కఠిన భూమి తలం నుండి అపుడపుడూ
ప్రేమ శాంతి రెక్కలపై ఎగిరే యత్నం జరుగుతుంది

ఉన్నది పాత ప్రపంచమే అయినా అనుభవంలో
సందర్భం మారుతుంది, కొత్త దనం పొందుతుంది
యుద్ధంలో బీభత్స దృశ్యం కన్నా
యుద్ధ భయంతో గడచే కాలమే ఎక్కువ

ఉదయ సంధ్య సృజన రూపాన్ని సూచిస్తుంది
సాయం సంధ్య దహన రూపాన్ని తలపిస్తుంది
పగలు రాత్రి విరుద్ధ ముఖాలతో వేరయినా
స్నేహంగా విడిపోతాయి, దేని జారి దానిదే!

జారే కన్నీరు ముఖం! చూడలేని తన కన్నా
చూడగల ఇతరుల నెక్కువగా కదలిస్తుంది

తల్లికి శిశువు భాష తెలుస్తుంది
రైతుకు పొలం భాష తెలుస్తుంది
కార్మికులకు యంత్ర భాష తెలుస్తుంది
కవికి హృదయ భాష తెలుస్తుంది

వెనక ఉన్న వారికి అడుగు జాడ తెలుస్తుంది
మనిషిలో ఉన్న మనిషి! మనసుకు తెలిసేను
నదిలో దూకేందుకు ముందు ఈత నేర్వాలి
సాహసమొకటే చాలదు, ఉపాయం కూడ అవసరం

బయటి ప్రపంచం అందరిదీ లోని ప్రపంచం తనదే
చెట్టు చెరువు గిరి నది! పయనంలో వరసగా
ఒకటి తరువాత ఒకటి వదలి పోయేవే
ఎవరి కోసమూ ఆగని కాలంతో తలచేదొక జీవితమే!

23.

మట్టిని ప్రేమించడమంటే
పొందడం మట్టి నుండి మొక్కను దానికి పూలు ఫలాల్నీ
హృదయ తర్పితం కావడం
ప్రకృతి వస్తు సమాంతరంగా మనుషులతో సమాజం!

ఈ విశ్వం నీలి అంచుల వెలుగు రూపం
ఈ సంఘం తెలుపు ఎరుపు గీతల సంకలనం
స్వేచ్ఛలో స్వచ్ఛత పయి అభిలాష అందరిలో
ఎక్కడి కక్కడ నియతమైన ఆలోచనా ప్రపంచం

మనిషి అయి పుట్టినందుకు లోన గర్వం ఉంటుంది
ప్రియమైన మనోబంధంతో, రమ్యమైన అనుభూతితో

ఎవరి కోసం ఎక్కడా వెదకనక్కర లేదు
నా చుట్టూ ఉన్నది! ఎన్ని రకాల మనుషులో
ఇంద్ర ధనుసును మెరపించవచ్చు
పలు రకాల పూలవనం తలపించవచ్చు

చేతి వేలికి తొడిగిన ఉంగరానికి
పొదిగిన రత్నంలో రవి కిరణం
సంతోషంగా పీఠంపై తిష్ఠవేస్తుంది

చీకటికి వేర్లు లేవు, ఉనికి లేదు
వెలుగు స్పర్శకు మాయమవుతుంది
పెద్ద గాలితో గొడ్డలితో పనిలేదు
హఠాత్తుగా అదృశ్యమయి పోతుంది

మనిషితో విభేదం! వైరానికి దారి తీసి
గాయంతో కలహ రాగం వినిపిస్తుంది

చేతిలో గీసిన అగ్గిపుల్ల చాలు!
సిగరెట్‌ను వెలిగిస్తూనే దారి చూపుతుంది
కవితలో ఒక శబ్ద ప్రకాశం చాలు!
సందేహం నుండి సందేశానికి చేరుస్తుంది

24.

రాత్రివేళ! నగరం నిశ్శబ్దాన్ని కప్పుకొనీ
బోనులో పులి నిద్రపోతున్నట్లు ఉంటుంది
అపుడపుడు దూసుకపోయే వాహన శబ్దంతో
ఎక్కడో పని జరుగుతూన్న మనుషుల అలికిడి

పగటి వేళ జన తతి సశబ్దంగా అవిరామంగా
గంతులేస్తూ పోయే జింకల గుంపులా క్షణాలు

బ్రతుకు అయినా కవిత అయినా
చెల్లే నాణేలయితేనే! విలువలు పొందేదీ

ఎవరి బ్రతుకు వారిది అయినా ఒక్కొక విధంగా
ఎవరి దృష్టి వారిది అయినా ఒక్కొక దిశలో
చీకటి ఫలకంపై వెలుగు అక్షరాలతో
కవిత! అందరిదీ! పరివర్తన ముఖంతో

సితార్ తీగెలపై కదలినట్లు కల్పనలో
చేతి వేళ్ళు గాలిలో కదలేను
ఇది ఆ ఒకరికే వినిపిస్తుంది!
అందరికీ వినిపించేది వాస్తవ తలంపైనే

సక్రియలో దిగులు వీడిన మనసు
ఉత్సాహం పొందుతుంది ఆరోహణలో
జీవనదితో సమాంతరంగా సాగే జీవితం
ముక్కలుగా చేయబడదు, చూడబడదు

ఎక్కడికి వెళ్ళేదీ! ఎక్కడ ఆగేదీ! ముందుగ తెలియదు
ఏది తెలిసినా తెలియకపోయినా పయనం ఆగదు
అడుగు జాడ భూమికి అంకితమై సాగవలసిందే
అడుగు జాడల పరిశోధన తోనే చరిత్రకు రూపం

25.

కొందరు మహాదైన్య సర్పాలచే చుట్టబడీ
కొందరు మహాభాగ్య విహగాలపై సంచరిస్తూ
సమాజ వికాస పటం! శంకకు గురి అవుతూంది
చీకటిలో నిప్పురవ్వల్లా మిణుగురుల్లా ప్రశ్నలు!

దు:ఖంలో ముఖం కప్పుకునేందుకు రెండు చేతులు
పనిలో వేగంగా నడిచేందుకు రెండు కాళ్ళు
శ్రమ విలువల పయి మాట్లాడేందుకు గళం
కష్ట జీవి వేదన వినే ఓపికలో స్పందన శబ్దం

క్షుధల వ్యధల వాస్తవ చిత్రాలను
గీసి చూపేందుకు చేతులాడడం లేదు
దుమ్మో ధూమమో అద్దిన ముఖాలతో
దరిద్రులు! చెట్ల నీడలలో! దారి మలుపులలో
భూమి నుండి ఎదగలేక నిలిచిన మొక్కలు
చెక్కే శిల్పం నుండి జారిన రాతి ముక్కలు

సమాజ స్పృహ లేని మనిషి ప్రసక్తి లేని
కవిత లేదు వార్తా పత్రిక లేదు ఆలోచన లేదు
బ్రతుకు రూపమెంత కళామయమనుకున్నా
భగ్నమైన బ్రతుకుల్ని చూస్తూ పోవడమొక విషాదం

గ్రీష్మంలో వేడికి రగిలిన కొమ్మలతో
నిలిచిన ఎండిన చెట్ల వలె దీనులు
వీధులలో తిరిగేరా?
కాలాన్ని ప్రశ్నించేరా?

అక్షరం ఆయుధ మవడం విశేషం ఒక సందర్భంలో
అక్షరం ఎప్పటికిని శాంతి కపోతీ నిలయమే
ఆర్ద్రత లేని స్థితిలో కణకణం అగ్నిమయం
శమనం మాత్రం! ఉదార హృదయ సంస్కృతిలోనే

26.

స్వగతంలో మాట ఆకాశానికి చేరుతుంది
సంభాషణ దగ్గరలోని మనుషుల కందుతుంది
అందరిలో ఊపిరి ఒకటే, ఉడుపులు వేరు
అందరిలో మానుష మదే, తీర్పులు వేరు

సృజన చేతనలో ఏది ఏ రూపం పొందేదీ తెలియదు
చెట్టు మనిషి కావచ్చు నది స్త్రీ రూపం పొందవచ్చు
జీవన రహస్యాల్ని తెలుసుకునే అన్వేషణలో
అనుకోకుండా కవిత అవతరిస్తుంది

మంచు తెరల చాటు నుండి బయట పడిన క్షితిజంలా
పలు రంగుల మార్పులతో జీవితాన్ని తలపిస్తుంది

సమయం వాహనమై ఎప్పటికీ మనిషిని తిప్పుతుంది
పయనంలో దిశ గమ్యం ఎన్నుకోవడమే మిగులుతుంది

అక్షర పంక్తులపై నుండి అనుభవ రూపం
మనుషుల బరువులతో పట్టాలపై రైలులా

అందని ఆకాశం దేవతల నిలయం కావచ్చు
ఎదురుగ వచ్చే మనుషులు దీపాలు కావచ్చు
కవిత జలదమయి! లోన తోడుగ కదలవచ్చు
కాలాన్ని వదలి జీవితాలు ఉండే ప్రసక్తి లేదు

అగ్నిలో సమిధల వలె, జలధిలో చేపల వలె
లిప్తలు చలన సహజ సుందరతలతో

గతం విశ్రాంతికి నిలయమవుతుంది
వర్తమానం ఊపిరికి దారి నిస్తూపోతుంది

మనసు నుండి ఓదారుపు గంధంతో, సానుభూతి పూలతో
కష్టంలో ఒకరి నొకరు జలదాలవలె కలిసేరు
బ్రతుకులో విరుద్ధమతులతో గతులున్నా
యశో విశాల వేదికపై అందరూ కలిసేరు

27.

వికార చర్యల వలలో చిక్కుకొనీ మనుషులు
బయట పడేందుకు, ఉన్న స్థితి తెలియాలి
స్వచ్ఛంగా శుభ్రంగా ఉండే అవకాశం తక్కువైన బ్రతుకులో
అన్నీ అల్లిన వ్యూహాలే, మిశ్రమ సంగమ రూపాలే

భవిత పైన విశ్వాసం, నవత గురించి చింతన
చీకటిలో వెలుగు దారి చూపుతుంది ఆలోచన!
లేంది జీవిత మొక భయదమయిన అడవియే
తన గొప్పదనం భ్రమలో మునిగి తేలుతూ మనుషులు

మంచిని పోగు చేసుకొనే వ్యక్తిత్వం కన్నా
చెడును వదలించుకొనే పనిలోనే సరిపోతూంది
ఏది మంచి అనే ప్రశ్నతో చుట్టబడి మనసు
నిలిచిన స్థితిలో! స్వేచ్ఛను కోరుతుంది! పయనంలో

భూమిలో పునాదితో ఇల్లు, వేరులతో చెట్టు
పరస్పరం చైతన్య ప్రసారాలతో సమాజ రూపం

చేతి వేళ్ళ సందులలో నుండి జారిపోయే
కాలం! సమాజ మహా సముద్రంలో కలుస్తుంది
గమ్యానికి బాట లేకపోతే కాలి దారి ఏర్పడుతుంది
జలధి తీరం దాక చింతలేదు
ఈత రాకపోతే నావొ! విమానమో! వంతెనమో!

ఎండిన చెట్టులో మూలంలో ఆశ మిగిలే ఉంటుంది
దగ్ధమవడం కోరరెవరూ! శూన్యాన్ని వరించరు

ఇందులో ఆశ్చర్యమేమీ లేదు! వాస్తవమేమంటే
మనిషి తాను అనుకోకుండా హంతకుడు కావచ్చు
హతుడయ్యేందుకు మాత్రం అవకాశం ఈయడు
నిన్న నెత్తురు చిందిన చోట, రేపు పచ్చగడ్డి రావచ్చు

కనిపించని అతీతాన్ని గానం చేస్తూ పోయే కన్నా
కనిపించే వాస్తవాన్ని మన్నించడ మొక నవ యోగం

28.

వర్తమానం నిప్పు రెక్కలపై పైకి
ఎగిరే ఉత్సాహంతో ప్రస్తుత రాజకీయం
ఒక సమయంలో వాస్తవ మనివార్యమై, లోభం
మెడకు చుట్టుకుంటుంది, అలంకార మనిపిస్తుంది

విమానంలో ప్రయాణికులొకరొకరూ
ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా
మంచు దుస్తులు ధరించేరు
ఆకుల వసనం కప్పుకునేరు

దాటరాని వన్నీ దాటి గిరులు నదులు జలధి
ఆశా విజయానికి సీమలు లేవనిపిస్తుంది
విశాల విహార యాత్రను తలపించేనా?
ఏదో పనిలో తప్పని దయి పోయేనా?

ఏ ప్రయాణికులెక్కడు చేరేదీ తెలియదు
ఏ ప్రయాణికులెక్కడ దిగేదీ తెలియదు
వాహన భాగ్యంతో స్వార్థం ఉప్పొంగుతూంది
సాధారణ జీవన నైజానికి దూరంగా

పగటి వేళ మనిషి చూపు నాకర్షిస్తుంది
రాత్రి వేళ మెరపు లాగ దూసుక పోతుంది
ఈ రెక్కలు భయానికి చిహ్నాలయ్యేనా?
"అపాయ" సూచనతో పయనం సాగించేనా?

సహజతకు కృత్రిమతకు ఉన్న భేదం
తెలియడ మొక వివేచనా రమణీయం

ఎవరు వెళ్ళి తిరిగి వచ్చేదీ, రానిదీ
ఎవరు దహనమయి పోయేది తెలియదు
ఏది గాలిలో కలిసి పోయేదీ తెలియదు
తెలియని జీవన గమ్యంలో ఇప్పటిదీ ప్రజాస్వామ్య యానం

స్వేచ్ఛా కవిత్వం-86

ఇది జీవితం

(XI భాగం)

సమాప్తి కాదు

మాదిరాజు రంగారావు

2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 86

IDI JEEVITHAM

(XI Part)

(SAMAAPTHI KAADU)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2018

Presented to
my wife
Smt. Indira

పీఠిక

ఇది స్వేచ్ఛా కవిత్వం పరంపరలో "ఇది జీవితం" బృహత్కృతిలో పదకొండో భాగం "సమాప్తి కాదు". వర్తమాన జీవితంలోని సామాజిక రాజకీయ నైతిక మనస్తత్వ కోణాలలో భావ ప్రసారాన్ని కలిగింది. 1) సృజన చేతన 2) సమాజ తత్పరత 3) వ్యక్తి స్వేచ్ఛ, 4) సౌందర్య భావన (ప్రకృతి – జీవితమూ) ఈ నాలుగు స్తంభాలపై నిలిచిన నిర్మాణం.

ఇది ప్రధానంగా నేటి సమాజంలోని దుస్థితులను విషమతలను, మానసికమైన విపరీతాలను, ప్రజాస్వామ్య వ్యవస్థకు క్షతి కలిగించే వాతావరణాన్ని చిత్రిస్తూంది. సంక్రాంతి – ఉగాది రెండు తెలుగు పండుగల ప్రసక్తితో ఆరంభమయింది. శ్రమ జయ పతాక రెపరెపలతో ముగిసింది. ఈ మధ్య మేలైన జీవితాల కోసం ఉత్తమమైన విలువలతో స్వేచ్ఛా సమాజాన్ని ఆశించే ఆలోచనా రూపం దృష్టికి వస్తుంది. ప్రజాస్వామ్య భావనతో తీర్చబడింది. 1) మనిషి – జీవితం 2) సమాజం – ఆదర్శం పయి మానవీయ చింతనతో ఆవిష్కారాన్ని పొందింది.

ఈనాడు ఉన్న సమాజ స్థితిగతుల్ని బట్టి, కవిత్వంలోను వైవిధ్యంతో కూడిన విశాలతకు వైవిధ్యానికి అవకాశం లభించింది. దీన్ని సద్వినియోగం చేసుకునే క్రమంలో కవిత్వ విషయంలో కళాత్మకమైన విలువలకూ కనీస స్థాయిలో స్థానం అవసరమన్న మాట జ్ఞాపకానికి రావడం సహజం.

వస్తువు – విషయంతో పాటు భావన – అభివ్యక్తి విశేషాలకు తగిన విధాన్ని ఏర్పరచుకోవడం కవుల సృజన క్రియలో భాగం. వీటిని విడదీసి చూచే ప్రశ్న లేదు, వేరు చేస్తే కవిత్వ పరంగా సంపూర్ణతకు క్షతి ఏర్పడుతుంది. ఆధునిక కవిత్వంలో ఇదొక సంక్లిష్టమయిన సమస్య. ఒక్కొక కవి ఒక్కొక విధంగా పరిష్కరించుకుంటూ రచన సాగడం సంతోషకరమయిన విషయం.

ఒక్కొక మనిషి జీవితం ఒక్కొక గ్రంథం. చిన్నదో పెద్దదో ఎవరి పుస్తకమూ మరొకరు పూర్తిగా చదవడం కుదరదు. కవి విషయంలో 1) పెరిగిన సామాజిక వాతావరణం 2) సంస్కారశీల నేపథ్యం 3) అభిరుచి – అభిలాష 4) మనస్తత్వ విధం – సృజన చేతన ఈ నాలుగు అంశాల కలయికచేత ఏర్పడే మనోజ్ఞమయిన స్వేచ్ఛా రూపం కవిత్వంగా వెలువడుతుంది. ఈ విశ్లేషణ ఆధారంగా వివేచనతో కవిత్వం అనుభవానికి వస్తుంది. ఇది సాహిత్య విమర్శలో భాగం.

– మాదిరాజు రంగారావు

ఇది జీవితం - సమాప్తి కాదు
(11వ భాగం)

1.

సంక్రాంతి ఉగాది రెండు తెలుగు పండుగలు
ఆనందం విజ్ఞానం కలిసిన జీవన చిహ్నాలు
కాలానికి చేతుల వలె
మనిషి క్రియకు సాధనాలు

మనసులో కొత్త దనం చివురుల నాశిస్తుంది
అనుభవ ఫలాల పయి ఆలోచన సాగుతుంది
ఏడాది పొడవున పండుగల ఆవర్తం! గడుస్తుంది
ప్రబోధాలు సూచనలు హెచ్చరికలు వదలుతూ

పాడి పంట ప్రకృతి సంపదలతో ఊరు
చెరువు పొలం తోట పశువులతో స్మృతి రూపం
పనికి తిండికి పలు అవకాశాల పాత్ర నగరం!
అన్ని అవసరాలకూ అందుబాటులో
యంత్ర బలం వ్యాపారం ఉద్యోగంతో
ఏదో ఒక తీరున బ్రతికే దారులతో

ఇచట రాత్రి వేళ చంద్రుడు కనిపిస్తే కనిపించవచ్చు
వెన్నెల! ఎక్కడి కక్కడ తునకలు తునకలుగా
అద్దాల షెల్ఫులో విలువయిన వస్తువులతో
బయటి నుండి చూస్తే నూరూరే పదార్థాలతో

అడవిలో చెట్టు నరకబడి ముక్కలు ముక్కలుగా
మరో విధంగా అవి ప్రజ అవసరాలు తీర్చేను
నివాస నిర్మాణాలకు వస్తువులకు పని కొచ్చేను
వికృతిలో మార్పులతో ప్రయోజన విస్తృతి పొందేను

ఉదయం అలల వలె వెలుతురుతో కాలం
అస్తమయంలో ఎడారి ముఖం వేస్తుంది
జీవన చర్యల వాస్తవ ప్రభావాలతో సమాజం
వీటికి భిన్నం కాదు, కవితలో అల్పం పేజీలను తలపిస్తుంది

2.

ఉదయం వెలుతురుతో బయటికి వచ్చి చూస్తే
రోజు రాకతో ఏదయినా మార్పు చూడాలనీ
అవే ముఖాలు! నిన్నటివి, కాస్త విరామ రేఖలతో
శమించిన నిన్నటి అనల కణాల వాలకాలతో

కోకిల స్వరం లేదు ఏ దిశ నుండీ
చెవి ఒగ్గి దీని కయి నిలబడితే
మొబైల్‌లో ట్విట్టరు అలరిస్తుంది, హఠాత్తుగా
ఇది మార్పే! ఒక దాని బదులు మరొకటి

పంచాంగ శ్రవణ కార్యక్రమం
రాజకీయ పక్షాల భవితకు వేదికయై
ఎవరికి వారు సానుకూల తంత్రులు మీటడం
ఇది మార్పే! సాధారణ విషయం కాదు! విశేషమే

పత్రికలో ఈ వత్సరం ఉన్న స్థితుల రూపాలు
రాసుల పేర్లను కత్తిరించి జంబ్లింగ్‌తో అమర్చి
కొత్తగా ఫలాలు చెప్పే! ఆలోచన కలిగిందో లేదో
ఎక్కడి నుండో ప్రేలుడు శబ్దం! ఊహను మింగేసింది!

పండుగ రోజున ఎవరినీ ఏమీ అనకూడదు
ఏది జరిగినా సహనంతో గడపాలిసిందే
ముంచుకొని వచ్చే విపరీత పరిస్థితిలో ఏమి చేయాలి?
ఏడవాలా? నవ్వాలా? అంటే
ఏడుస్తూనే అది వినబడకుండా నవ్వాలి అంటుంది కాలం
ఇది మార్పే! సామాన్య మయింది కాదు! చతురమైంది!

కవిత! అయితే కొత్త దుస్తులతో బయలుదేరి
మధ్యలో ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంది
పండుగ పోస్ట్ పోన్ కాదు! కవితా పఠనం ఆగదు
దుమ్ములో పొగలలో వాహనాల సందడిలో! హారన్‌ల మ్రోతలో

ఏడుపు గతంలోకి జారుతుంది
కవిత వర్తమానంపై తేలుతుంది

3.

యశో రూపానికి ప్రతీక విగ్రహం
మానవ చరిత్ర పరిమళంతో నిలిచీ
ప్రతి వ్యక్తి తనకు నచ్చిన పనిలో నిమగ్నమయి
విలువల ఉపయోగం! అందరికీ చెందుతుంది
ఏది ఎవరి మతి వికాస సుమమయినా
అది వ్యక్తికి మితమై సంకుచితం కాదు
కాలాంత రాన ఇది సమాజ పరమవుతుంది

నిజం నిప్పు వంటిది నిజం కావచ్చు, నిప్పే అయితే
పొయి రాజేయవచ్చు, సిగరెట్ వెలిగించవచ్చు
దీపం వెలగదు, చీకటి దగ్ధం కాదు
కోపంలో మెరసే అగ్ని కణం అయింది
శోకంలో జారే బాష్ప కణం కావచ్చు

భయం నింపి మనిషిని నిలిపేసిన అడవి
అడుగు పడగనే! దారి చూపుతుంది

గాయపడిన హృదయం! మనిషిలో
ప్రతి చర్యకు అగ్ని చక్రం కావచ్చు
ఆగని ప్రవాహ రూపం ప్రేమ కథ
చలనంలో శిలలు గిరులు దాటాలిసి ఉంటుంది

బాధలో ఆశా రూపం చంద్ర బింబం
చీకటి స్థితిలో మునగకుండ దాటిస్తుంది
ఏ రంగు లేని వస్తువు లేదు ఇష్టమో! అనిష్టమో!
ఏ ఊహ లేని మనసు లేదు మంచిదో! చెడ్డదో!

కావలసిన దానికై అన్వేషణలో బయలు దేరి
ఇతరుల విషయాలపై ఆలోచనలో ప్రతి ఒకరూ!
మనుషులకేమి కొదవ? చుట్టూ! చెట్లను తలపిస్తూ
రాలే పూవో! ఫలమో! కన్నా! పొందే కరెన్సి మనసులతో

4.

ఒంటరి తనం ఆలోచన లోతులోకి దింపుతుంది
వ్యక్తులతో సంబంధం సమాజ గతిలో నడిపిస్తుంది
లోన వ్యక్తి చేతన బయట సమష్టి చేతన
రెండిటి సహభావంతో మానుష జీవితం
లోన భావ జగత్తుతో ఏకాంతం
బయట శబ్ద ప్రపంచంతో సమాజం
రెండూ కలిసిన మనోజ్ఞ రూపం కవిత
ఏకాంత బీజం నుండి శాఖలుగా సమాజ వృక్షం!

ఒంటరిలో విషమ స్థితిలో నిర్ణయం!
ఆత్మహత్య! ఒక సెకండులో భయ భావం
ఆపదలోకి నెడుతుంది! హఠాత్తుగా
వివేచన కవకాశం లేని మనసు క్షోభలో
ఒత్తిడిలో! వ్యక్తి నుండి బాధ్యత
సమాజం బుజాలపైకి తరలుతుంది

వ్యక్తి నుండి సమాజం పైకి దోషం మరలుతుంది
ఈ దుస్థితిలోకి మనిషి చేరినందుకు
ఇది తప్పే ఉపాయాన్ని కాపాడే చర్యల్ని
తీసుకోని నిర్లక్ష్యం! చర్చితమవుతుంది

రోజు పుటలో వాక్యం తెగి ఆత్మహత్యతో
మధ్యలో ఆగిపోవడమొక విషాదం!
ఆయువు ఉన్నంత వరకే మనిషి చేయగలిగేదీ
లోన ఉన్న శక్తిని యుక్తిని ప్రదర్శించగలిగేదీ

అందరి మధ్య నుండి మనుషుల కళ్ళు కప్పి
దారుణానికి పూనుకొనే మనిషి
సమాజానికిచ్చే ఉపద! విషాదమవుతూంది
శూన్యానికి బీభత్స ముద్ర పడుతూంది

5.

పాలలో వెన్నలా స్వేచ్ఛా కవితలో మానవత
అంత సులభంగా అర చేతిలో పడేది కాదు
శ్రమతో సాధ్యమైంది, కాస్త వేడికి కరగుతుంది
జీవితాన సారభూత సత్యానికి ప్రతీక

ఉదయంలో స్వర్ణం వెన్నెలలో రజతం
ఆకులో మరకతం నీడలో నీల మేఘం
చూడగానే మనిషిలో సమాంతరంగా మరొకటీ
ఉత్సాహం ఉల్లాసం భాగ్యం స్నిగ్ధతలకు గుర్తులుగా

ఇష్టమయినా కాక పోయినా, ఎన్నిటిని కలయిక చేతనో
జీవితం! ఎన్నిటినో తలపిస్తూ గడుస్తుంది
వాస్తవమూ కల్పనతో మానసికం అంతరాత్మతో
తెలియని దాని కన్నా తెలిసిన భూమిపైనె ఎక్కువ మక్కువగా
ఏ క్షణాని కాక్షణం కొత్తగా మార్పులతో కాలం
ఏ అనుభవాని కది! కొత్తగా మార్పులతో జీవితం!

నగరంలో కార్నర్ ఒకే విధం అంతటా
మనుషుల తెరువులు వేరు
బ్రతుకుల బరువులు వేరు
మనిషి వ్యాపకంలో విరామంలో
ఉత్సాహం ఇనుమడింపజేస్తుంది
కొంత సేపు ఆకర్షణ నిలుపుతుంది

ఇచట రెక్కలాడే మనుషులే కన్పిస్తారు
పీక్కొని పోయిన డొక్కలతో పని చేస్తారు
వచ్చే రోజు పుటలో ఏదో ఒరిగేనని ఆశ
శ్రమ జీవన రూపాన్ని నిటారుగ నిలుపుతూంది
నిరుపేదల కెందరికో ఆశ్రయం ఈ కార్నర్!
ప్రతి రాత్రిని దాటించే యాన పాత్ర రూపం!

6.

రోజు కెన్ని ఘటనలలోనొ విషాద ఛాయలతో
డైరీ పేజీలో అపాయ సూచితో చేరుతాయి
సమాజ కథలో మనిషిని ప్రశ్నకు గురి చేస్తూ
ఏ రోజూ జవాబు దొరకని స్థితిలో కాలం గడుస్తుంది

నిజాలకూ కల్లలకూ పోటీ ఈ ఘటనలలో
విలువల తూకాలలో మార్పు చోటు చేసుకునేను
జేబులో బరువు సంచితో ఒకరు తూగేరు
నిర్ణయం తలక్రిందులయ్యే అవకాశమూ ఉంది

కనిపించని మనసులో మారే బరువులలో
కష్టం నష్టం వేదన అశాంతి రాసులుగా
బయటి దృష్టికి అంచనా తారుమారవుతుంది
తెలిసీ తెలియని స్థితులలో ఎవరి అంచనా వారిది

అనుమానం సందేహంతో గడచే ఈ బ్రతుకులు
యానంలో అడుగున రంధ్రంతో సాగే నావలు

చిట్ట చివరి కొమ్మ పైని పూలు
గగనంలో చుక్కలతో మాట్లాడతాయి
అవి బయటికి వినిపించనివీ
మానవ హృదయానికి తెలిసేవీ!

వెలుతురు చీకటిలా మంచి చెడ్డలు పక్కపక్కనే
ఒకపుడు అల్లుకొనీ! చేతికి చిక్కవు! మనసుకు అందవు
రుతువు రుతువులో దృశ్యం రూపు రంగు మారినట్లు
దశదశలో జీవన రూపం గమ్యం మారుతుంది

జీవన సార్థక మింతేనా? ఇదేనా? అనిపిస్తుంది
నైతిక వాహనం ముందుకు పోలేక పోవచ్చు
విరామ మవసరమో! ఆటంకమో! వైఫల్యమొ!
అన్నిటినీ అధిగమించి సాగడమే! నైతిక కర్తవ్యం

7.

గన్ కల్చర్ సమాజంలో ఎవరు ఎపుడు
ఆయుధానికి బలి అయిపోయేది తెలియదు
పిల్లలు వృద్ధులు! ఏ నేరమెరగని సామాన్యులు
కారణం లేని ఒక భయావృతం విపరీతం!
క్రూరమైన మానస వికార క్రియా ఫలితం
నిహతులతో గాయపడిన వారి పట్ల
సానుభూతి ప్రకటనలతోనే సరి పోతూంది!
మృగాలను కట్టడి చేసే విధాన మవసరం

స్వేచ్ఛలో ఆయుధ విజృంభణాన్ని
నియతం చేయడమొక చతుర పాలనా కళ
అపాయాల నుండి ప్రమాదాల నుండి రక్షణతో
విపరీత మనస్కులను కట్టడి చేసే చర్యలు ముఖ్యం

కణకణాన విద్యుత్ ప్రసరణ తేజంతో
శరీర మొక యంత్రంలా సమాజ సాక్షిగా
మంచులో వానలో ఎండలో చలిలో సహనంతో
శ్రమ చక్రం తిరుగుతూనే ఉంటుంది! నిర్విరామంగా

ఎవరూ ఏ రోజు నుండి తప్పుకొని తిరగలేదు
రోజుతో పరిచయం కటువయినా తప్పనిదీ
నియతిని కోల్పోయిన వేగం
పయనంలో ప్రాణానికి ప్రమాదం!
ఆ క్షణం విషాద శిల అవకూడదు
ఇది అలయై తరలి పోవలసిందే

క్షణం గతమయ్యే స్థితిలో గుడ్‌బై
వర్తమానమయ్యే క్షణానికి స్వాగతం!
కంటకాల మధ్యనే గులాబి పూవు వికాసం!
చేతి వేళ్ళతో పూవును గ్రహించక తప్పదు

8.

క్షితిజ ఫాల తలంపై సూర్యుడొ చంద్రుడొ
ఏదో ఒక గ్రహం నిరంతరం కదలుతూ
మనిషి ఫాల తలంపై అదే విధంగా
ప్రతిఫలన రూపంతో అన్వయం పొందేనా?

దొరికిన అవకాశంలో చెప్పాలిసిందెంతో!
వినే వారి కోరికతో విశ్వాసం పని చేస్తుంది

ఇష్టం లేకపోయినా కల్పన ఆవహిస్తుంది
కంటికి కనిపించని శృంఖలను కల వదలిస్తుంది
అనుకునే గగన స్వర్గ సౌధంలోకి ప్రవేశం
అనుకున్నంత సులభం కాదని కూడా తెలుసు!

మనిషిలో ఊహలు మంచు శిఖరాలుగా నిలిచీ
అపుడపుడూ హేతువు రశ్మికి కరగి సరించేను

ఆకులు పూలు పండ్లతో చెట్టు
కంటి కెంత ఆకర్షణీయమయినా
చెట్టయి నిలిచి పోవాలని ఎవరూ కోరరు

ఎందరి ఊహలకో ప్రేరణయై శరణ్యమై
ఎంతటి ఊరటనూ శాంతిని కలిగించినా
శిల్పంతో ప్రతిమగ నిలవాలని కోరరు!

ఎంతటి ఉపయోగంలోనూ మేఘంలా
గగనంలో తేలుతూ పోవడం అసాధ్యం!

ప్రియమయినా కాకపోయినా మిత్రమయినా శత్రువయినా
పూలదండయై చుట్టినా అనల కీలయై నిలిచినా
మనిషికి మనిషితోనె, ఈ నేల తోనే సంబంధం!

సుముఖమయినా విముఖమయినా ఏదయినా కానీ
అక్షర పంక్తిలో నిజాన్ని ప్రతిబింబించే
ఉపజ్ఞ! కవితలో, కవికి మాత్రమే సాధ్యం!

9.

ఒక సమయం! ఎగసిన జల తరంగంపై
మనిషికి పయనం ఆగదు! సాగిపోవలసిందే
ఒక సమయం! ఎదురుగ అనల దృశ్యంతో
మనిషికి పయనం ఆగదు! ఎగసిపోవలసిందే

ఒక స్థితిలో తిరిగే ఇనుప చక్రం ఎదురయి
దానిలో పడి నలగకుండా బయట పడాలిసిందే
ఒక స్థితిలో నీరు నుండి బయట పడే
చేపలా! ఎవరికో ఆహారం కావలసిందే!

ఒక సమయం! ఏడుపు! అరుపు! పిలుపు! నినాదం
వీటితో మనసు తడి కావచ్చు! పదును తేల వచ్చు!

రెండు చేతులపై భూగొళం ఎత్తి పైకి
నిలపాలని! మనిషిలో కోరిక! ఉండనే ఉంది!
ఇది సాధ్యం కాలేదని, భూమికి దూరమయ్యేనా?
మనసులో కోరిక పుష్పాన్ని తుంచి వేసేనా?

మనిషిలో కోరిక! ఆకాశం తన బుజాన
శాలువ లా అలంకృతం కావాలనీ!
ఇది సాధ్యం కాలేదని, నింగిని చూడకుండేనా?
మనసున పాకే కోరిక తీగెను తెంచేసేనా?

పగలు సూర్యుని స్వర్ణ కిరీటంలా
రాత్రి చంద్రుని తెల్లని తలపాగలా
ధరించే ఆశ! ప్రతి మనిషిలోనూ
ప్రభుతపై తీరని కోరిక ఎప్పటికీ!

ఏ కోరిక తీరకపోయినా! ఎవరూ ఎక్కడికీపోరు
ఈ భూమిపై ఆకాశం క్రిందనే ఆవాసం!
అనుకోవడానికేం! ఎన్నైనా అనుకోవచ్చు
పొందేది మాత్రం! శక్తికి అందే వస్తువునే

10.

ఉదయం వార్తా పత్రిక పుట విప్పుతూనే
ఏదో వస్తువు కాలిన వాసన! వేస్తుంది
ఇపుడయితే ఏ రోజూ! విచిత్రంగా
నిన్న జరిగిన దహన కాండ స్మృతి కావచ్చు

శీర్షికలో అక్షరాలపై దృష్టి పడగానే
నెత్తురు చారల గాయాల వరస!
ఇపుడయితే ఏ రోజూ! విషాదంలో
నిన్న తగిలిన లాఠీ! ఫైరింగ్! ప్రభావం కావచ్చు!

కను చూపులో వార్తలొకటొకటీ కదలుతూంటే
కళ్ళలో నలక పడినంత! అసౌకర్యం!
నిన్న జరిగిన ప్రదర్శనలో బీభత్సంతో
ఎగసిన ధూళి రేణువుల శేషం కావచ్చు

పుటలు తిప్పుతూ ఉంటే, విలవిలలాడే
కాల విహంగం రెక్కల రెపరెపలను తలపిస్తుంది

నిన్న జరిగిన ఘటనలు! నేటి వార్తా పత్రికలో
బంధించిన వాస్తవం! స్మృతిలో తిరుగుతుంది
అక్షర పంక్తులపై కదలే సమాజ వాహనం
ప్రమాదానికి గురి అయి! చెల్లాచెదరయినట్లుంది

ఇది ప్రమాదమని తోసి పుచ్చే వీలు లేదు
కావాలని జరిపిన అనవాళ్ళు లేకపోలేదు
ఇవి రాజకీయ వ్యూహంలో భాగాలై
సమాజ చరిత్రను నిప్పులపై నడపిస్తున్నాయి

పత్రిక మడచి పక్కకు పెట్టగనే మనసులో
నిప్పంటిన మానవీయ పతాక మండుతూన్న దృశ్యం
అవును! ఇది ప్రజాస్వామ్య వాహనం! అదే!
బ్రేక్ ఫేలయి! చెల్లా చెదరయిన సన్నివేశం!

11.

చదరంగం ఎత్తులతో రాజకీయ జీవితాలు
సాధారణ సూత్రాలకు భిన్నంగా తమ గతులలో
ప్రత్యర్థిని మట్టు బెట్టాలని అభ్యర్థిలో ఉన్మాదం!
రాజకీయ చతురతలో వరదలు తుపాను బీభత్సం!
ప్రకృతి విలయ రూపాలకు సమంగా
సంక్షుబ్ధ స్థితులు! సమాజ చలనంలోనూ
చలనంలో ప్రకృతి శక్తులకు భిన్నం కాదు సమాజం
ఎవరికి వారు తమ తమ భద్రత కయి మారే తీరులు

స్వేచ్ఛలోను నియమ నిబంధనలొ అవసరం
వాహన మేదయినా! సుగమంగా పయనం సాధ్యం
కోరిక జ్వాలా సదృశమయితే ప్రమాదం
ఇది హింసకు హత్యకు ప్రేరేపిస్తే అశాంతి!
కోరిక తీగెలా సాగవచ్చు! అల్లుకొనీ
పూలు పూసి మనసుకు సంతోషం! కలగవచ్చు

ఎండిన చెట్టయినా, కొమ్మపైన పక్షి నిలుస్తుంది
కావలసిన దానికై! చూపులు ప్రసరిస్తుంది
గుడిసె అయినా సౌధమయినా! భయంలేని స్థితిలో
కాలం గడవాలనుకోవడం! మానవ సహజం
కష్టంలోనూ వాస్తవాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది
తనలో జారని ధైర్యంతో బ్రతకాలిసి వస్తుంది

ప్రకృతిలో చీకటి వలె సమాజంలో కశ్మలం
పూర్తిగ అంతం కాదు, ఎప్పటికీ ఉంటుంది మనిషితో

ఒకరి గళ స్వరం కుసుమ స్పర్శతో
ఒకరి కర స్పర్శ స్నేహ గుణంతో
ఉత్సాహానికి అనల మవసరం మనిషిలో
సవనానికి! వంటకు! జీవన చలనంలోను!

12.

ప్రతి రోజు లెక్కలో ఏదో తక్కువ అయినట్లే ఉంటుంది
ధనం పదవి అధికారం కీర్తి! తన చుట్టూ
ఏదీ పూర్తిగ తృప్తి నిచ్చినట్లనిపించదు ఇంకా ఇంకా
వీటికై మాటలు చేతలు! హద్దులు మీరేను
విసరిన శిలలై దూసిన బాణాలై విసరిన గ్రయినైడ్ లయి
ప్రతి చోట! సంగ్రహ రణ దృశ్యం! కనిపిస్తుంది

ఈ దేశ భవిత భాగ్యానికి నేతలు!
ముందు శ్రేణిలో మారే రంగుల దుస్తులలో
స్నేహానికి దూరంగా ఘర్షణలకు దగ్గరగా
కోపం ద్వేషం శత్రుత ఘాతుక చర్యలలో

వీధిలో అలజడి శబ్దానికి భయపడి
లాన్ విడిచి సీతాకోక చిలుక లెగిరిపోయేను
గార్డెన్‌లో కలకల రవాలతో పావురాళ్ళు
చకితంగా వదలి దూరమెగిరిపోయేను

స్వేచ్ఛలో విశాల వేదికలు పత్రికలు
పచ్చని చెట్ల మధ్య మంటల చిత్రం చూపేను
ఆర్పేందుకు బయలుదేరిన వాహనం
దారిలో! ఆపదకు గురి అవుతూంది

ప్రజా ప్రతినిధుల సభలో ప్రబలిన అరాజకంతో
ఏదో ఘనకార్యం జరిపినట్లు కొందరు!
తుపాను గాలి చర్యలతో భిన్నమై సమావేశం
సంక్షోభంతో సమయం శిలామయమవుతూంది

వీధి దాటి ఎటు? శాంతికా? అశాంతికా?
ద్వేషం అగ్నిమయం, త్వరత్వరగా అల్లుకుంటుంది
స్నేహం శీతమయం, మందమందంగా కదలుతుంది
అలజడికి ఉన్న ఆకర్షణ సహనానికి ఉండేనా?

13.

కవిత శబ్ద వివరణ విస్తృతి ఎంత విస్తరించిందీ
వైవిధ్యం ఎంత ఉంది? అందరికీ తెలియని నిజం
ఈ నిలయానికి కిటికీలెన్నో! తలుపులెన్నో!
ఏ వైపు తెరిస్తే! ఆ దిశలో అర్థం కనిపిస్తుంది

శబ్దం నిర్మాణంలో రాయి కాదు ఇటుక కాదు
ఇది కాంతి ప్రసారంతో పలు రంగుల స్ఫటికం

ప్రతిభ చేత బయట పడే సృజన రూపం కవిత
రవి కిరణం స్పర్శతో అందం వెలుగుతుంది
పచ్చని మొక్కయి పలు రంగుల పూలు వదలుతుంది
అందరికీ చెందిన చేతనతో ఇది విశ్వమయం!

కవితో పాటుగ ముందుగ కవితను వినేవి
చెట్టు భూమి ఆకాశం! గాలి ఆ తరువాతనే మనిషి!
నిర్మాణ విధంలో ఎవరి విధానం వారిది
వ్యక్తిత్వ వికాసంతో ఎవరి జీవితం వారిది

రాత్రి వేళ ఎదుట దీప కాంతిలా కవిత
రవి కిరణం లేని లోటును తీరుస్తుంది
అవసర సమయంలో మనిషికి
ధైర్యాన్ని సరఫరా చేస్తుంది

గ్రీష్మ తాపానికి చెరువు ఎండిపోతుంది
నెరియలతో శూన్య ప్రదేశం మిగులుతుంది
అదే జీవనదియైతే, దాహం తీరుస్తుంది
బ్రతికిస్తుంది అమృత కీర్తి నిస్తుంది, కవిత కూడా

నెత్తురు చుక్కలు రాలి మహావీరుడయ్యేను
బాష్ప బిందువులు జారి గొప్ప మనిషి అయ్యేను
ఎండలో నిలువ నీడ ఇచ్చిన చెట్టు నెవరు మరుస్తారు?
ఎచట తిరిగినా చివరకు శాంతానికి రావలసిందే!

14.

అమావాస్య చీకటిలో కనిపించని
పూల చెట్టు లేనే లేదని వాదించలేం

జడం నుండి విగ్రహంలో స్థిరంగా
ఎవరి రూప మయినా దింపవచ్చు
చూచే మనుషుల మనసుతో మాట్లాడుతుంది
మురిపిస్తుంది! ఏదో ఇచ్చే ఆశతో

మనిషి ఊహ లెన్ని విధాలో!
విగ్రహ రూపాలన్ని రీతులు
ఒక రూపం విషయం బదులుగ చేరతాయి
ఏ స్థాయి మనిషి నయినా ఆకర్షిస్తాయి

తృప్తికీ ఊరటకూ శాంతికీ కనిపెట్టిన రూపం
అతీత శక్తులేమో కాని! ఎక్కువగా ఇది మానసికం
భౌతికంపై మానసికంతో శ్రేణులుగా జీవితం
సుఖా పేక్షలో ఇది ఒక సానుకూల వాస్తవం

రాజకీయమయినా లోక తంత్రమయినా విపణిశాల అయినా
దేని కదే! స్థిరపడేను! సమాజావసరాలలో
సమాజావసరాల కయి వచ్చే ఉపయోగపడే వెన్నో
అతిథులుగా వచ్చినవి, బంధువులుగ మారేను

చుట్టు ప్రకృతి రూపాలెన్నో!
తరు గిరి నది జలదం పశు పక్ష్యాదులు
వాటితో అనుబంధం విడదీయరానిదై
వాటి నుండి మనిషి నేర్చుకోవలసిన దెంతో!
జీవన రూపానికి పూర్ణత చేకూరేను
మానస లోకానికి వైవిధ్యం సమకూరేను

వాన కురిసి శుభ్రమయి రవిరశ్మితో ప్రకృతిలా
అక్షర రూపంలో కవిత! ఆంతర తేజంతో

15.

ఇప్పుడున్న స్థితిలో నరక భయం లేదు
చిత్ర గుప్తుడు లేడు ఎటు పోయాడో తెలియదు
ఎవరో కిడ్‌నాప్ చేసి ఉంటారు
పుణ్యం పాపం లెక్కలు పోస్ట్ పోన్ అయినట్లే!

చుట్టూ చీకటి మొక్కలు నాటి
అది వనమయి, దారి కనబడేందుకు
చిన్న దీపం చేతి కందితే సరిపోదు
ఈ అడవిని ఛేదించే సాహస మవసరం
ఎవరయినా దహనం చేసే ఉద్దేశంతో
ఉపక్రమించవచ్చు, తీవ్రమైన చర్యలో

తమ వాదన సరి అయినదనీ
తనలో వ్యక్తిని పణం పెట్టి
తనను తాను పేల్చుకొనే, విధ్వంస గుణం
ఏ విషమ సమస్యకు పరిష్కారం కాదు

తమ వాదం వెనకనే అందరు నడవాలనుకొనీ
జీవితాన్ని ప్యాక్ చేసి అడవికి బట్వాడా చేసి
స్వేచ్ఛను ఉరి ముడులతో బిగించి, బంధించేరు
ఉగ్రవాదమయినా ఉన్మాద చర్య అయినా ఒకేలా ఉంది

మనుషుల నడతను తారు మారు చేసి
చూపే చతురతతో చెప్పరానిది చెబుతూ
ఈ సందర్భంలో ప్రచార మాధ్యమాలు
ప్రమాద కరమైన సాధనాలవుతున్నాయి

నెత్తురు చారలతో చిత్రాకృతి ముఖాలతో
ముక్కలయిన బ్రతుకులతో సమాజాన్ని తీర్చేరా?
స్వేచ్ఛ పేరుతో తీవ్ర మతుల గళ స్వరం
చీకటి వనిలో మృగాల జంతువుల శబ్దం వినిపించేను

16.

ఎన్ని మెగావాట్ల విద్యుత్ ప్రకాశ మయినా
ప్రేరణ చేతన రూపంలో ఉషసుకు సరికాదు
ప్రకృతి నుండి మనిషిలోకి ఆలోచనా ప్రసారం
బింబ ప్రతి బింబ భావ సమంగా, అనుబంధంతో

ప్రకృతిలో స్వచ్ఛమయిన గాలి అవసరంలా
బ్రతుకులో శుభ్రమయిన నైతికం ప్రధానం
జటిలమైన సమస్యలతో ఉక్కిరి బిక్కిరి అయ్యే స్థితిలో
మనసు దారి తప్పే అవకాశంలో, ఇది మరీ అవసరం
ఇది మనిషి సమాజానికి ఇచ్చే ఉపద
అద్దంలో కనిపించని సుందర రూపం

కాలి బాట నడచి నడచి వెడల్పు అవుతుంది
ఇపుడు! మనసులోని దారి సన్నగ అవుతూంది
ఇరుకగనయి పోతూ దాట వశం కాక
పయనంలో పోటీ, తొక్కిసలో ప్రమాదాలు!

గతం తలుపు ఏ క్షణాని కది మూతబడుతుంది
తలుపు లేని వర్తమానం స్వేచ్ఛకు మైదానం
ఎవరికయిన అవకాశం పరచబడీ దారులతో!
నీడ ఒకటి వర్తమాన తలం పయి! వీడని చిర మిత్రం!

చీకటి పడే దాకా సెగలు క్రమ్మిన క్షితిజం
కళ్ళు మూతబడి విరామం కోరుతుంది
భ్రమలో ఎడారిని కొలుస్తూ పగలు నిష్క్రమిస్తుంది
ఏది విరామాన్ని పొందినా, ఏది సెలవు తీసుకున్నా
ఉండేది, ఉనికిని కాపాడుకునేదీ మనిషే!
ఏ రోజూ ఎండిన ముళ్ళ చెట్టులా
మనిషి గడప వలసి రావడమొక పరిహాసం
మొక్కలెన్ని ఎదుగుతున్నా పచ్చగా
మనిషిలోని కలుష రూపం! రోజు రోజు కెక్కువె
సమాజాన్ని అనారోగ్యం పాలు చేయడమొక దౌర్భాగ్యం
ఎప్పటికీ తీరని దారిద్ర్యం, ఇది మానవ దోషం!

17.

ఆకాశాన్ని ఈదడం కల్పనలోనే సాధ్యం
ఇది జలనిధిలో బింబించే ఆకాశం కావచ్చు

అద్దాల పెట్టెలో భద్రంగా కనిపించే రత్నం కన్నా
మెడలో హారంలో పొదిగిన రత్నానికే మన్నన!

కవితకు కల్పన వాస్తవ భేదాలతో పని లేదు
హృదయాకర్షణలో రెండిటి పాత్ర ఒకటే
ప్రయోజనాలు వేరు, దర్శన లక్ష్యాలు వేరు
ఇవి కవి వ్యక్తిత్వంలో విలువలు చూపే భాగాలు

ప్రేమ పూర్ణ బింబమయిన మనిషి నుండి ఒక సందర్భంలో
చేతిలో ఆయుధం! సక్రియతను పొందవచ్చు
దేశ ప్రేమ వ్యక్తి ప్రేమ జీవ ప్రేమ విశ్వ ప్రేమ
అనుభవైక మయం, ప్రేమ అంతరంగ కాంతి గతం
ఇది ఏ ఉపాయనం కోరదు కృతజ్ఞత ఆశించదు
హృదయ భాషలో నవ కవితను పలుకుతుంది

ᔓᔐ

మనుషుల ఊహను దాటింది ప్రతిది అద్భుతమే
అక్షర రూపం లాంచింగ్ ప్యాడ్
కవిత విడుదలవుతుంది! మిసైల్
భావనా జగంలోకి! సూటిగా
ఎవరి విషయం వారి స్వంతం కావచ్చు
అవసరాలతో సమాజ సంబంధం తప్పదు
ఒంటరిగా పని జరిగే క్షేత్రం బహు పరిమితం
జన గణ మయమైంది సమాజ చేతనతో విశాలం

ఇష్టమైంది మదిలో ప్రవాహమై తరలుతుంది
ఇష్టమవని దయితే శిల రూపం వహిస్తుంది
విశ్వహితం ఆనందం రెక్కలు విప్పిన కవిత
అక్షర లోకంలో జీవితాన్ని ప్రదర్శిస్తుంది

ᔓᔐ

18.

నేతల ముఖాన నేడు రెపరెపలాడే రాజకీయ పతాక
రేపు కూడ అదే! కనిపించే నమ్మకం లేదు
స్వార్థం పెరగవచ్చు, ఆలోచన మారవచ్చు
పార్టీ మారవచ్చు, కొత్త మిత్రం వెలగవచ్చు

ప్రజాస్వామ్య ముఖాన్ని నీలి రంగులో ముంచి
పైకి తీసి ప్రదర్శనలో నిలుపుతుంది రాజకీయం
గాయానికి కట్టు బదులు, పూల దండ చుట్టేరా?
సానుభూతితో మెడలో పరిహార మాల పడేనా?

చీకటి పందిరి వెలుగుతుంది దీపాలతో
మనిషి మనసులో చీకటి నెవరు తొలగజేస్తారు
ఇది నిరంకుశ మూర్తికి పీఠంలా ఉన్నది
పీఠంపై కూర్చునేది మనిషే! భద్రంగా!
ప్రజాస్వామ్య యుగంలోను మిగిలి ఉన్న అనవాళ్ళు
పెద్దల నింకా కోట గోడ చుట్టూ పరిభ్రమింప జేసేను

చీకటి అయినా శబ్ద వేదితో హత మార్చే వారూ ఉన్నారు
చీకటిని తపో నిలయంగా ఎంచే వారూ ఉన్నారు
సాధారణ స్థాయిలో చీకటి! జడతకు నిష్క్రియతకు చిహ్నం
ఇక్కడ! గాలికి స్వేచ్ఛ ఉంది! శబ్దానికి భయం లేదు

వెలుతురు ప్రమేయం పెరిగే కొద్దీ
చూపు నుండి చీకటి తప్పుకుంటుంది
మెలకువతో వెలుతురు పరిచయమవుతుంది
కానీ అనుభవమయ్యేది కిరణ ప్రసారంతోనే!

విశ్వంలో మనిషి తన ప్రభుతను చూపాలనీ
సంఘంలో మనిషి తన చేతన నింపాలనీ
నీళ్ళలో చేపలా ఈదడమే కాదు
నింగిలో పక్షిలా ఎగిరే ప్రయత్నమూ

19.

చీకటిలో మరచిన వస్తువు దొరికిన ఆనందం
చంద్రబింబమయి! ప్రియా ముఖాన్ని తలపిస్తుంది
ఉదగ్ర కవి అయినా ప్రియాజగం వీడదు
ఇది నవనవం! జీవన భావనలో ప్రేరణం

అవధి లేని ఆశా రూపం పరచబడిన ఆకాశం
ఎంత దూర మయినా చివర అంటూ లేనిది
ఆశలేంది! మనిషి ఇంతగ ఎదిగేనా?
ఆశాబలంతో ప్రగతి! ఒక వాస్తవ రూపం
తలపై గొడుగులా ఆకాశం
మనసులో విప్పారిన అవకాశం
రెండూ బింబం ప్రతిబింబం భావనతో

రవి కిరణం పయి, అనుమానం సందేహం పెంచుతూ
మంచు తెరలు! మబ్బు ముక్కలు! తప్పవు
ఇవి తత్కాలికం! ఇది అనుభవంపైనే తెలుస్తుంది

ఎగిరే పక్షి రెక్క తగిలి విమానం కూలవచ్చు
ఎదురగ విమానాన్ని డీకొని పక్షి పడిపోవచ్చు
రెండూ ఆకాశ విహార రమణీయ రూపాలే
ఒకటి ప్రాణం లేనిది, ఒకటి ప్రాణం ఉన్నది

కల్పనలో పక్షి మనిషికి సహాయ భూమికలో పని చేస్తుంది
ప్రియులకు సందేశం తీసుక వెళ్ళే సుందర రూపం

ఎదురు పడిన పులి పోరాటం చేస్తుంది
సింహం పైకి దూకి ఆక్రమింప జూస్తుంది

ఎదురు పడిన పక్షి ఒడుపుగ దాటి పోతుంది
పక్క నుండి పక్షి సూటిగ దూసుకపోతుంది
ఎదురు నిల్చి పోరాడే ప్రాణి కాదు
మనిషికి బదులుగ తోడు ఉండవచ్చు
మనసులో ఆశకు ప్రతీకయై
ప్రకృతితో బంధం నిలుపుతుంది

20.

అనంతమైన ఆకాశం!
చూపుకు హద్దుల భ్రమ కల్పిస్తూ
సర్వం సహ దాహం తీర్చే, ప్రాణికి జీవం నిలిపే
జలద విహారానికి అవకాశంతో విశాలమై

గూడు నుండి కొమ్మకు, కొమ్మ నుండి దిశలలోకి
పక్షి పయనం, ఏకాంతం నుండి ఆకాశంలోకి
జీవన సందేశంతో స్వేచ్ఛకు సంకేతం

నేలపైకి రాలేని మనో మేఘానికి
గిరి శిఖరమయినా జలాశయమయినా
రెండూ ఒకటే! జీవిత గమనంలో

కొందరి దృష్టిలో సమాజం పుష్పవన మనుకున్నా
కొందరి ఊహలో సమాజం శ్మశాన మనుకున్నా
రెండిటి మధ్య సుఖ దు:ఖ కళామయం
సహన శాంతి సుందరతల కవకాశంతో

నెత్తురు స్పర్శతో మొలకెత్తిన ఉగ్రవాదం
నిప్పు పూలు పూసేను, ఆయుధ పాత్ర వహించేను
కంటికి ఇంపుగ కనిపించేవి, అయినా
విషాద స్వరంతో బ్రతుకును చుట్టేసేను

మనసును గాయంతో అలంకరించేను
ఆ సమయం గాలిని మృత్యు వాసనతో నింపేను
కదలే పవమానం దేని నయిన వహిస్తుంది
అక్షర పంక్తులతో దిన పత్రిక వలె

దుమ్ము వలె పొగలవలె అనుమానం సందేహం
చూపుకి వాస్తవానికి మధ్య అడ్డు తెరల వలె
విశ్వాసం సంకల్పంతో ఆశా రూప మొకటే
తక్కువ విషమతలతో బ్రతుకును సాగిస్తుంది

21.

ఏ నేలపై ఏ గాలిని పీలుస్తూ ఏ మనుషుల్ని కలుస్తూ
ఎక్కడ ఉంటే అదే! తన వర్తమాన నిలయం
ఆ జీవన రేఖల దృశ్యంలో ఒకటై వ్యక్తి
బిందువై గీతయై చిత్రమై ఉండడ మొక అవసరం

నాలుగు గోడల మధ్య ఎక్కడైన ఒకటే!
కప్పులేని ఇల్లు లేదు, ఎగిరేందుకు రెక్క లవసరం
స్వేచ్ఛలో పరిమితులు! మలుపుకు కారణ మవుతాయి
స్వేచ్ఛలో నిబంధనలు! కొత్త దారి చూపుతాయి

ఇంటి నుండి ఊరు దాటి దారిన అడవిలోకి
పురా స్మృతి సూచిక మనిషిని తీసుక వెళుతుంది
తిరిగి ఇల్లు చేరడమొక! భద్ర భావమయం
ఆలోచన వ్యక్తిని సమాజ పరం చేస్తుంది

కాలి బాట చివరి అడుగు మాత్రం!
నేలపైన సముద్ర తీర జల స్పర్శ దాకా!

శిల ఏ రూపంలో నయినా శిల్పానికెదురు చూస్తుంది
జలమే దారిన అయినా ప్రసరణ కారాటపడుతుంది

సంశ్లిష్ట సమాజంలో అస్పష్టతలెన్నో!
తీర్పు చెప్పగలవారెవరు?
నిజం తెలిసేదెందరి కని?
రవి నుండి వెలుగులా
కవి నుండి కవితలో
బయట పడుతుంది రహస్యం!

కాలం తన రెక్కలపై తీసుక వెళ్ళుతుంది!
స్వేచ్ఛా జీవి కవికి అన్నిటినీ చూపిస్తుంది
స్పందనలో మానవీయ స్పర్శతో
శూన్యాన్ని నింపుతుంది, వాస్తవ కథతో

22.

మనిషి నుండి చీకటి మహా మేఘంలా
కదలుతూ వస్తే ఫరవా లేదు
అది మహా నీల భుజగ మయి
బయట పడి తేనే ప్రమాదం!
కళ్ళు మూసి ఉంటే భయం అణగి ఉంటుంది
కళ్ళు తెరచి ఉంటే ఆపద అనిపిస్తుంది

మనిషి నుండి సంధ్యా సమయం
ఎర్రని మందారమై కనిపిస్తే పరవాలేదు
అది నెత్తురు చారతో ఖడ్గమై
ఎదుట నిలిస్తేనే అపాయం!
భయాన్నీ ఆపదనూ వదలుతూ రణ దృశ్యం!
మనసును చరిత్ర శిఖరం పైవిహరింప జేస్తుంది

కష్టంలో ఆకుల వలె రాలి పోయి మనుషులు
మట్టిలో కలిసిపోయి మొక్కలకు సహాయ సంపద లయ్యేరు

ᔓᔐ

దైవం పేరుతో దేశం పేరుతో
సరిహద్దుల పేరుతో మతం పేరుతో
జరిగిన రణాలు, ఒక్కొక దోషాన్ని ఎత్తి చూపేను
ఇవి సరి కాకముందే, మరో రణం వచ్చి పడుతూంది

పొయిలోను సవన వేదిపైన ఉండాలిసిన అగ్నులు
వీధులలో మనుషుల రూపంలో కనిపించేను
సంపదను బూది చేస్తూ పోయేరు దిబ్బలపై
ఇదొక ఘన కార్యంలా భావించడ మొక విశేషం

ప్రతిమల వలె మనుషులు బయట నిలబడీ చూస్తూ
పిల్లలవలె మనుషులు లోన భయంతో దాగీ
అడ్డంగా పగిలిన చీలిన ఆదర్శం దారులు
దాటడ మొక నీరు లేని లోయను తరించడం

ᔓᔐ

23.

సంచిలో వస్తువుల్ని తీసి శిశువు
విసరేసి నట్లు చుక్కలు! ఎడం ఎడంగా
ఈ భూమిపై నడచే మనుషుల్లో
పై లోకంపై దృష్టి! స్మృతిలో అనుభవ ముద్రలతో

సాటి మనిషి నలిగి పోయే కఠిన వాస్తవం చూస్తూ
మేధావి అయిన మనిషి! ఈ లోకం గురించి
ఆలోచనయే చేసి ఉంటే! ఈ దేశంలో
ప్రజల స్థితి ఇంకా బాగా ఉండేది!

పారాడే శిశువుకు నేలపై అడుగులు వేయాలని
నడచే మనిషికి! నింగికి నిచ్చెన వేయాలని
ఆ నిచ్చెన నిలిచేది ఈ భూమి తలంపైనే
అయినా! మనిషి తన ఆధారం మరచేను
యత్నం మొదలు పెట్టి త్రిశంకు స్వర్గమంత అయ్యేను
వెనక్కి వచ్చే వీలుంది! కాని ఆ పైకోరిక అడ్డు పడుతుంది

ఆకాశ సమాధి పైన మల్లెలు చల్లినట్లు చుక్కలు
ఆకాశ శ్మశానంపై నిప్పులు ఎగిరినట్లు చుక్కలు
ఎవరి కిష్టమైన విధంగా
వారికి అనిపించడం సహజం!

విషాద ఘడియలలో రాత్రి మాత్రమే
మనసుకు ఊరట నిచ్చే కాల్పనికం !
గాలికి ఆగని ధ్వనులు! ఉండి ఉండి విసరీ
అంతా నిశ్శబ్దం! గుండె చప్పుడు మినహా

రాత్రి విలువ! అంతా ఇంతా కాదు,
నిదుర కోసం వేచి ఉన్న మనిషిలో
తృప్తి రేఖ సన్నని ప్రవాహంలా కదలుతూ
మనిషికి విశ్రాంతి పదం, అనుభవ స్థితిలో

24.

విశ్వంలో సకల ప్రాణుల గుణ గణాలకలనం
మనుషులు ఒకరొకరిలో గుప్తంగా వేరుల వలె
సాధువైన జంతువు నుండి క్రూరమైన మృగం దాక
అన్నిటిపై విజేతగా మనిషి ప్రభుత చూపాలనీ

బాల్యంలో బొమ్మల ఆటలో పరిచయమయినవి
పెరిగాక మతి వికాస క్షేత్రంలో సర్కస్‌ను తలపించేను
బయట కొన్ని స్వేచ్ఛగా బోనులో కొన్ని బంధింపబడీ

అంతర్ముఖులయినా దప్పిక ఆకలి తప్పవు
బయటి నుండి వస్తువులెన్నో! కావలసిందే
పిల్లలు పెద్దలు తర తమ భేదాలు లేని విషయం
దీని కోసం ఇరులెన్ని పాట్లు పడేరో! తెలిసిందే
తెలియని దాని పయి ఆలోచనలో
అన్వేషణ సాగుతుంది! అంతర్ముఖంతో

తలుపు వేసినా గాలి కోసమయినా
తెరచిన కిటికీ నుండి కనబడే మనిషితో
పరిచయ సంబంధం సమాజ స్పృహను తెలుపుతుంది

తలుపు తెరవబడీ లోనికి వచ్చే వారితో
మాట్లాడే అవకాశం సమాజ బంధం నిలుపుతుంది
స్వేచ్ఛలో మనిషి! బిందువు దగ్గర ఆగితే అంతర్ముఖం!

అభిరుచిలో సక్రియలో గడచే మనిషికి
రెండూ ఒకటే, ఒక దాని నుండి మరో దానికి సాగుతూ

బహిర్ముఖంలోనే గౌతమ బుద్ధుని చరిత్ర
రూపు దిద్దుకొన్నది! వాస్తవ జగత్తుతో
మనిషి బాధ గురించి మరో మనిషిలో వేదన
దీన హీన విషాదాల్ని తగ్గించేందుకే

25.

జీవితం సమాజం గురించి ఆలోచనలో
సంఘం శరణ మయింది
ధర్మం చింతనకు దారి తీసింది
వివేకం వెలుగు దారి చూపింది

కొత్త మాట కొత్త బాట కొత్త బ్రతుకు
అన్నీ కొత్త దనంతో! బ్రతుకులు
తీర్చిన రూపమే మార్పు, అందరిదీ
వ్యక్తి నుండి సమాజ ప్రేమగా శాంతిగా

మాటలతో ఏర్పడే హద్దులు విభేదాలు అనంతం
మౌనంలో అన్ని ఒకటయి ఏకాకృతి పొందేను
ప్రతిదీ సమయం సందర్భం అవకాశంతో
రూపం మారుతుంది, మార్పు అని వార్యమనిపిస్తుంది
మారనిది ఒక్క మనిషే! దానికై ప్రయత్నాలెన్నో
బోదెపై ఎదిగే కొమ్మలకు పూలతో పండ్లతో జీవితం!

నావ కోసమనో చేప కోసమనో అల ఆగదు
తరగల కత్తులు విసరుతూ తుపాను రావచ్చు

పంజరం తలుపు తెరవగానే చిలుక బయటికి వస్తుంది
ఎదురుగ పరచిన కార్డుల నుండి ఒకటి తీస్తుంది
ముక్కుతో అందింది మనిషికి, వెనక్కి వెళ్ళిపోతుంది
బయటపడే అవకాశం దొరికిందని ఎగిరిపోదు
కార్డులో విషయం, ఆగంతుని జీవిత దశ తెలిపేనా?
ఊరట కలిగించే నమ్మకం, ఆవేళకు శాంతి పీఠం

మనసులో శూన్యాన్ని మాటలతో నింపుతుంది
బ్రతుకులో మానసికంగా మనిషికి ఎదురయ్యే
లోయల్ని ఎడారుల్ని నదుల్ని దాటిస్తుంది
తత్కాలంలో ఉపశమనంతో హత్యను సయితం తప్పిస్తుంది

26.

ప్రేమ భావ మనగానే మనసులో మేఘం కదలుతంది
సందేశానికి సిద్ధంగా ఎదురుగ హంస ఎగురుతుంది
హృదయం పుష్ప వనమవుతుంది
ఆలోచన వెన్నెలను పరుస్తుంది

కోపంలో నిప్పు కణం ఎగసి పడుతుంది
ద్వేషంలో నెత్తురు చార మెరుస్తుంది
కోపం రాని మనిషి లేడు, రణ మెరగని సమాజం లేదు
ద్వేషం వికల్పం, వస్తే, బీభత్సం సృజించిపోతుంది

ఆయుధానికీ లక్ష్యానికీ మధ్య ఎడం ఉంటుంది
బాణమయినా మిసైల్ అయినా ఒకే మోస్తరు
రాగం విశ్వమయం చేస్తుంది, జీవితాన్ని
కలహం సంకుచితం చేస్తుంది మనుషుల్ని
కొందరి బ్రతుకులో లిప్తలు కదలే అగ్నిశిఖలు
కొందరి బ్రతుకులో లిప్తలు తరలే నీటి అలలు

ఒకరి మాట పూవులా అలరిస్తుంది
సంస్కార పరిమళాన్ని హత్తుకొనీ
ఒకరి చర్య అగ్నిలా బయటపడుతుంది
మానుష శక్తిలో తేజాన్ని అందుకొనీ

ఒంటరిగా ఉన్నపుడు మనసు గతం లోకి జారుతుంది
తనలో బంధనలో ఉన్న మనిషికి స్వేచ్ఛ దొరకుతుంది
ఒప్పులు తప్పులు గురించి విశ్లేషణ మొదలవుతుంది
వివేచనతో తనపై తన రిపోర్టు సిద్ధమవుతుంది

సమయం మట్టి గడ్డ అయితే
జల బిందువు కయి ఎదురు చూస్తుంది
సమయం శిలా ఖండమయితే
ఆకృతి కయి శిల్పికెదురు చూస్తుంది

27.

తరాల బరువులు బాధ్యతలు చూచిన ఇల్లు
ఎన్ని అనుభవాలనో స్మృతిలో ఊగిస్తుంది
కాలం గడచే కొద్దీ శిథిలాకృతి పొందుతూ
ఊహలో అభిమాన సుందరతను నింపుతుంది

ఒకరికి దాన్ని బాగు చేసు కొని వసించాలనీ
ఒకరికి దాని స్థానంలో మరొకటి రావాలనీ
ఇంటితో పరిచయమున్న వారు సానుభూతి చూపేరు
లేని వారు కొత్త దృష్టితో మార్పును కోరేరు
భౌతిక మానస స్థాయిల్లో ఆలోచనలో
విధ్వంసం నిర్మాణం! రెండూ పని చేస్తాయి

సముద్రం ఎప్పటిదో! మార్పును కోరే దెవరు?
ఎగసే అలలో ఆక్రోశం ఉండొచ్చు! ఆనందం ఉండొచ్చు
ఉప్పు నీరు సహించని స్థితిలో దాహంతో సముద్రం
జలదం నుండి మంచి నీరు కెదురు చూస్తున్నట్లు ఉంటుంది

అలలతో కదలి తీరంలో వేల వేల నాళ్ళలు చాచి
ఆహారం కయి నోరు విప్పినట్లు ఉంటుంది!

జలధి అలలపై అడుగులు వేస్తూ పోవాలనిపిస్తుంది
గాలి చేతులపై అడుగులు ఆనిస్తూ సాగాలనిపిస్తుంది
రెండూ అసంభవాలు! అసాధ్యాలు అని తెలుసు!
తెలిసినా కల్పనలో కోరిక తన ముఖం చూపేను

జరిగేదా? జరగనిదా? ప్రశ్న లేదు
స్వేచ్ఛలో మనిషి నుండి కోరిక లెన్నో!
ఎప్పటికయినా జరిగేనని నమ్మకంలో
ఆశ! మనిషిని లోతులోకి దింపుతుంది

మబ్బుల్లా ఆలోచనలు కోరికల్ని మోసుకొనీ
ఎంత దూరమయినా అక్షరాలలో కవితలు!
ఎంత కాలమయినా ఎన్ని మబ్బులయినా సరిపోని
కోర్కెలు! మనిషి నుండి ఒకటొకటీ విడుదలయ్యేను

28.

అద్దంలో తన ముఖం చూసుకుంటే
ఆకాశం దిగినంత సంబరం! మనిషికి
పగలు రాత్రి విడివిడిగా కనిపించే రవిచంద్రుల
ప్రతిఫలన రూపాలు చూడాలని తన రెండు కళ్ళలో
కోరికతో కళ్ళలో వెలుగు బిందువులు
అద్దంలో కనిపించే ముఖమొక ప్రేయో రూపం
నీలి మబ్బు కూడ పక్కన ఉన్నట్లే ఉంది
అది జల బిందువులను వదలినట్లే ఉంది

అద్దాని కెదురుగా ముఖ బింబం ఉన్నంత సేపు
కలిగే ఆలోచనల్ని, సుందర జగత్తువీ
ప్రతిబింబంలో ఎన్నిటినో తలచే అవకాశం
సులభంగా లభిస్తుంది! ఆ మనిషిని తిప్పుతుంది

అద్దంలో కనిపించేవి తన ఊహలో తరలేవి
అద్దం పక్కకు జరిపితే కల్పనకు ఆధారం లేదు
వాస్తవ తలంపైన యథా తథంగానే!
తన ముఖం తనకు కనిపించకపోవడం సహజం

శిలల మధ్య ప్రవహిస్తూ పోయే నీరులా మానవత
విషమ స్థితుల మధ్య ఒక ఊరట, ఉపశమనంగా
ఇది అగ్నికి మంచు దుస్తులు తొడిగినట్లు ఉంటుంది
ఈ మాత్రం! మానవీయం, సమాజానికి ముఖ్యం

మనిషి ముఖం వాస్తవం! ఎదుట అద్దం వాస్తవం
ఊహలో కదలే రవి చంద్రులు అట్లా ఉంచి,
మనిషి కళ్ళ నుండి జారే బాష్పకణం వాస్తవం
చూచే మనిషి కళ్ళకు అనుభవ దృశ్యం మానవం
ఆ క్షణం మనసు! అమృతమయ మవుతుంది
జీవితాన్ని ఎదుర్కొనీ విజయం చేరేందుకు సిద్ధంగా

29.

తరం నుండి తరం అపుడు ఉన్న దాని కన్న
కొత్త ఆలోచనతో పయనంలో గమ్యం! మారుతుంది
సమాజ ప్రగతి రూపానికి ద్వారం తెరవబడీ
ఆశల్నీ ఆశయాల్నీ కాలం గుర్తిస్తుంది
ఇది ఆటల పాటల కాలక్షేపం కాదు
శ్రమతో అంకిత హృదయంతో జరిగే ఆరోహణం

మందిరం మసీదు చర్చి మరొకటి జీవన శిఖరాలు
పైన ఆపై చూపులలో! నిలిచినవి బ్రతుకుల్ని అలంకరించేను
నేల పయి జీవిత పథం ఎంత దూరమయినా
ఎన్ని మలుపులు తిరిగినా అడుగు సాగవలసిందే

ఒక మజిలి నుండి మరో మజిలికి
కంచెలతో గోడలతో పని లేని యానం,
బ్రతుకు బరువుతో, సమస్య పరిష్కృతి కయి
ఇంద్ర ధనుసు ఆశ్రయించే ఆశలు వ్యర్థమే

ఒంటరితనం మనిషిలో ఘనీభవించిన స్థితిలో
శిల్పమయం కావచ్చు ఆకర్షించవచ్చు
ప్రతి మనిషికీ తనతో పాటుగ ప్రతిదీ
సమాజానికీ చెందిన దవుతుంది! అనుబంధంతో

ఎవరి బాధవారికి పరిమితమయినట్లు ఉన్నా
ప్రభావ రూపం ఇతరులపైనా పడి తీరుతుంది

పయనంలో కష్టాలకు ధైర్య వాహనం సమాధానం
ఫలితం ఎట్లా ఉన్నా బ్రతుకులు ఆగవు, నడవవలసిందే!

పూవు రాక పోయినా ఫలం లేక పోయినా
మూలంపై కొమ్మలతో నిలిచే ఉంటుంది చెట్టు
వాలిపోదు కూలి పోదు ఉనికిని కోల్పోదు
ఆశతో నలు దిశలలో విస్తరించి నిలిచే ఉంటుంది

30.

ఆలస్యం కావచ్చు, నాటకం! మొదలయితే ఆగదు
చివరి దాక సాగువలసిందే, స్వల్ప విరామాలతో,
మనోజగంపై వెలుగులతో పాత కథకు కొత్త రూపం,
జీవితమూ అంతే, విరామాలు లేవు, ఇష్టాలు పని చేయవు
కష్టాల్ని భరించలేక పాత్రలు విరమించవు
విషయం ఇష్టం లేదని, తెరదించి వేయబడదు

వేదికపై కదిలేవి బొమ్మలు కాదు, సజీవ రూపాలు
జీవన వాస్తవాన్ని ప్రతిఫలించే దృశ్యాలతో
మాటలు చేష్టలు చర్యలతో ఆరోపిత రూపకం
ఎక్కడెక్కడో తిప్పి భద్రంగా ఉన్న చోటికి చేరుస్తుంది

అసలు మనిషి రూపానికి మరో మనిషి బదులయి
ఉన్న ప్రపంచం నుండి మరో ప్రపంచంలోకి దింపుతుంది

అనుభవంలో విషయం ఎవరికి చెందిన దయినా
మంచి చెడు భేదం! నైతిక శక్తులతో కూడీ
ఎవరి చేతిలోనో సూత్రంపై కదలదు జీవితం
దృశ్యం వెనుక నుండి ఏ హస్తం నడిపించదు

గళం నుండి మాట, హృదయంలో స్పందన
మేధ నుండి విజ్ఞానం సంఘం నుండి ఆలోచన
చెట్టు నుండి పూవు ఫలం నీడలా ఒకటొకటీ
ఏది ఎవరి కవసరమో అది వారికి చేరుతుంది

కల నెవరు ఎత్తుక పోలేరు, అది స్వంతం
సంఘంలో భాగమైంది యథార్థమై అందరికీ చెందింది
పాత్ర పడే బాధ పయి సానుభూతి ఆసక్తి
కళపై దృష్టితో ఆకర్షణ పెరుగుతుంది

నిశ్శబ్ద వాతావరణంలో మాటకు విలువ పెరుగుతుంది
వేదికపై పాత్రలు తెలిసిన మనుషుల్ని తలపించేను

31.

అద్దంలో కిటికి నుండి నిప్పంటిన సుమ వన దృశ్యం
నిజానికి ఘోరమయినా అద్దంలో ఆకర్షణతో నిలుస్తుంది
ఎడారిలో ఒంటరిగా చెట్టు నీడన
విశ్రాంతిలో మనిషి రూపం! ఫోటోలో అందంగా

ఎక్కడి కక్కడ కత్తిరించి బ్రతుకు కాగితం
ముక్కలపై సంఖ్యలతో ఆట! బాగానే ఉంటుంది
ఫోటోల ఆల్బంలోనో మొబైల్ లోనో
తుపానులో వరదల బీభత్సం! దృశ్యాలు
మనసును అలరించవచ్చు, అపూర్వంగా
మనిషిని కదలించే వాస్తవ చిత్రణకే విలువ!
ఉదయం విప్పారిన గులాబి పూల వనం
ఒకరికి కొలిమిలో మంటల్ని తలపించవచ్చు

ప్రతి జీవితంలో అనుభవ రూపాలు
కవితలో కళచే అలంకారాలవుతాయి
ఆ వ్యక్తుల జీవితాలు మాత్రం
పరీక్షకు గురి చేసే సమస్యలతో నిండేను

ఆశ ప్రేమ ఆనందం కలిసి మనో రూపం
బ్రతుకులో జయించే ఇచ్ఛను పెంచుతుంది

వివిధ వస్తువులతో అద్దాల నిలయాల నగరం
రాత్రి లైట్ల కాంతిలో! ఆకర్షణ పెరుగవచ్చు
ఏ పేరుతోనో ప్రదర్శన సమయంలో కొందరు
పగలు రాళ్ళు విసిరి విధ్వంసం సృజించేరు

గాయం మానుతుంది మచ్చ మిగులుతుంది
రోజు గతిస్తుంది, అనుభవం చేరుతుంది మనసులో
నిర్మాణం విధ్వంసం రెండింటి దృశ్యాల నుండి
కవిత వెడలుతుంది, చేతనలో సృజనతో

32.

స్వేచ్ఛా కవితకు ఆకర్షణ కేంద్రం మానవం
సమాజ పథంలో నడతతోనే జీవితం
అమృత స్పర్శలో ఎవరి అనుభవం వారిది
ఒకరితో ఒకరికి పోలిక పోటీ మాటలేదు
అందరినీ కలిపే సూత్రమొకటే మానవత
ఆశను నింపుతుంది బ్రతుకులో, వెలుగు సరిస్తుంది

ప్రతి మనసులో చీకటి ముక్కలు! చిన్నవయినా
ఇది లేని బ్రతుకు లేదు, తెలియని మనిషి లేదు
వ్యక్తుల విలువల్లో ఈ ముక్కలు తేడా తెస్తాయి
ఈ తేడా అందరికీ తెలిసినా! తెలినట్లు కనిపించరు
ప్రదర్శనలో వస్తువుగా బ్రతుకులో ప్రవేశించవచ్చు
మాటలు చేతలు రంగుల కలయికతో కొత్తదనం

ధర్మరాజు నోట అశ్వత్థామ (కుంజర:) మరణ వార్త
ధనుర్విద్య శిక్షణలో కర్ణుని గుప్త మనో రూపం
యుద్ధంలో శ్రీకృష్ణుని తటస్థ పాత్ర మాట!
అన్నీ ఒకటొకటీ! చిన్న చిన్న చీకటి ముక్కలే

జారిన నెత్తురు చుక్కలలో
విజయ దృశ్యం! కనిపించేనా?
రాలిన ప్రాణం విలువలలో
జీవన సౌందర్యం! కనిపించేనా?

ఎల్లవేళలా జీవితం రణ రంగం కాదు
జీవించి ఉన్న సమయం! సమాధి రూపం కాదు
ఎగసే అనల కణాల్ని కెంపులుగా ధరించలేరు
జీవన నిజ రూపం! దూకే ఏ నిప్పుకు అందదు

ఇది హేంగర్‌కు వేలాడే కోటు కాదు జీవితం
ప్రజ కళ్ళకు ప్రీతిని కూర్చే ఆహార్యం కాదు

33.

మనిషి శ్వాసకు స్వచ్ఛమయిన గాలిలా
సమాజ నీతికి శుభ్రమయిన నడత అవసరం

హింస రణం ప్రతీకార పథంలో
దార్శనికం, విధ్వంసం నుండి నిర్మాణ గుణంతో
ప్రేమ శాంతి సహకార పథంలో
దార్శనికం, పునర్నవం నుండి సృజన గుణంతో
రెండూ సమాజంలో ప్రధాన పాత్రలు వహించేను
స్వేచ్ఛలో దృష్టి భేదంతో భావనలో ఎదిగినవీ

చుట్టు పాతిన చీకటి కంచెలు దాటుతూ
ఎదురగ నిలిపిన కత్తుల వరసలు దాటుతూ
బాధలతో వేదన తప్పనిదీ బ్రతుకులో
అనుకోనివి కొన్ని మనిషి నియంత్రణంలో లేనివి
అన్ని కలిసి సంశ్లిష్టం సంక్షుబ్ధం రూపంగా మారేను

కార్యం గట్టెక్క దానికి వంచన యాచన వక్రతలతో
విపరీతంలో అడవుల్ని కొండల్ని ఆశ్రయం పొందేరు
ముసుగులతో పోరాడే గుప్త నీతి ఎప్పటిదో
ఇప్పటికీ మార్పులు లేకుండా సాగుతూంది

బ్రతికేందుకు పేదరికంలో అవసరాలు తీరవలసి ఉంది
పరిష్కార యత్నంలో అడుగు వెనక్కి పడుతూంది
ముక్కలు ముక్కలుగా చూస్తే నిజ రూపం తెలియదు
ఏ ముక్క ఎక్కడిదో! దేనిదో తెలుసుకోవలసీ ఉంటుంది

రోజు మారి పొద్దు పై పై కెక్కుతూనే
జీవన స్థితిలో పూలకు బదులుగ
కావాలని జరిపే మనిషి చర్యలలో భాగమై
జ్వాలలెదురు కావడమొక దౌర్భాగ్యం

34.

ఎవరి ఆవరణం వారిదే ఆలోచనలో
బ్రతుకు బొంగరం తిరిగే మొన ఒకే విధం
భ్రమణంలో మారే దృశ్యాలొకటొకటీ
వారి వారి కోరికలకు వేలాడే రూపాలే

మందే సూర్యుడు! ఎగసే సముద్రం! ఉద్యమ చిహ్నాలు కావచ్చు
రవి కిరణం నది కెరటం జీవన స్థితి సంకేతం కావచ్చు
జననం నుండి ముగింపు దాక ముఖాలవే!
మనసులో మారతాయి, చర్యలు వేరవుతాయి

మార్పులెన్ని జరిగినా ప్రకృతిలో
చెట్టు మూలం బ్రతికే ఉంటుంది
కొత్త రూపం కయి వేచి ఉంటుంది
మనిషిలోను సజీవమై మానవీయం

యుద్ధం అనివార్యం కాదు, శాంతి అలభ్యం కాదు
ఉపాయ మెరగని మతితో, సహనం లేని గతితో
ఇవి చోటు చేసుకుంటాయి తప్పనివవుతాయి!
స్వార్థం బంధనమై, విశ్వమయత లోపిస్తుంది

ఏ ఉదయం కిరణం ప్రశ్నగ ఎదురు కాదు
ఇది మనిషిలో ఉన్న సమస్యకు సమాధాన సూచనయే
మనసు నుండి వదలబడిన సెటలైట్ పోటోలు పంపుతుంది
ఎప్పటికీ మనిషి అన్వేషణ పరిశోధన సాగుతూ ఉంటుంది

మాట తనది, చేత తనది! నడక తనది! గమ్యం చేరే
తనకు! తెలియనిది లేదు, మరొకరి తెలిసింది కొంతే!
ఎవరి జీవన సారాంశం వారికి పరిమితమయినా
ఇది అందరికి చేరే అవకాశంతోనే పరిపూర్ణత

ఎంతటి మేఘుమయినా శైలాన్ని చుట్టి పోవలసిందే
పూల దండ ముందు ఎంతటి తల అయినా వంచవలసిందే

35.

సమాజ గాథలో జీవితం కవితలో వినిపిస్తుంది
కనిపించని మనుషుల ఆలోచన శబ్దంలో నినదిస్తుంది
బ్రతుకు బాధ స్వరంలో స్వనిస్తుంది
బ్రతుకు తీరు ముఖంలో బింబిస్తుంది
ఎవరి పైనొ దేని పైనొ కాక! నిశ్చయంగా
తనపై తనకు చెదరని నమ్మక మవసరం

"అడిగే వాడికి చెప్పేవాడు లోకువ" సామెత ఉంది
కవి విషయంలో నయితే, దీనికి భిన్నం!
అడిగే వారు దొరికితే చాలు! ఆ సమయంలో
ఏ లోటు తలపించదు, ఏ వెలితి కనిపించదు

చీకటిలో నయితే మెలకువలో దీపం గురించి
వెలుతురులో నయితే ఎన్నిటి గురించో ఆలోచన!
అన్వేషణలో మనిషికి జీవితం! పగలు రాత్రి
కొత్త ఊహతో కొత్త మాటతో కొత్త బాటలో సాగాలనీ!

ఎప్పటికయినా ఎవరికయినా స్వేచ్ఛా కవిత్వం
జీవన యానంలో వార్నింగ్ సిగ్నల్! విష్! ఫ్లిప్!

మబ్బు కమ్మి రవి తేజం
ఓటమిలో ఉన్నట్లుగ అనిపిస్తుంది
కొంతసేపు ఆగి చూస్తే
మనిషిలో ఉత్సాహం వికసిస్తుంది

ఇచ్చిన మాట నిలుపుకో జూస్తే! పాతాళం గతి కావచ్చు
ఇంద్ర ధనుసు పీఠం పయి ఆశతో, అవని తలం మరచేరా?
రాజ్యాంగంలో పదిలంగా వ్యక్తికి అవసరమైనవెన్నో
ఇవి పొందేందుకు దాటాలిసిన లోయలెన్నో! గిరులెన్నో!

భయం వదలి ఉపాయాల మెట్లపై ఆరోహణం
శ్రమ జయ పతాకతో నిజ ప్రజాస్వామ్య గమ్యం

36.

రైల్వే జంక్షన్ స్టేషన్‌లా కవి మనో రూపం
నలువైపుల వస్తూ పోయే రైళ్ళకు సాక్షిగా
ప్లాట్ ఫార్మ్ పయి దిగే ఎక్కే మనుషుల్ని చూస్తూ
ఇది వర్తమాన జీవన చలన గతికి సంకేతం

మరో జన్మ సంగతి తెలియదు, ఎవరికీ అనుభవం లేదు
నిన్న కురిసిన చినుకులకు భూమి నుండి మొలక
ప్లాట్ ఫార్మపై ఒక మూల చెట్టుకు దగ్గరగా
ఇది పరంపరలో భాగం! నవ తరం చిహ్నం

ఎరుపు పూలు పూచేనా? తెలుపు పూల విరిసేనా?
ఏ రంగులో? రంగులు కలిసా? కాలం చూపిస్తుంది
ఓడినట్లు అనిపించినా మరో యత్నం జరుగుతుంది
ఇది జీవన రూపంలో మానవ చేతన సహజం

లోపలి విత్తు, ప్రశ్నకు జవాబుగా కవిత వెడలుతుంది
ఒకనాడు ఆయుధం అవసరం, మరునాడు తీరాక
దీనితో పని లేదని జలనిధిలో విసరేసేరా?
ఒకనాటి కవిత మరునాటికి కూడా నవనవంగా!

పరాయి పాలన అయినా కిరాయి నిర్వహణం అయినా
నేతల నిరంకుశంలో తగిలే లాఠీ గాయం ఒకటే
విచ్చేసే ఆశా మేఘు జలం బిందువు ఒకటే
భూమిపైన పొందే సృజన రూపమదే! ఒకటే

నలిగి నలిగి కాస్త చినుగు చూపినా
చేతిలోని కరెన్సి నోటు నెవరు వదలుతారు?
జాగ్రత్తగా భద్రపరచి చెల్లింపజేసేరు
విలువ తరగని కవిత కూడ! హృదయానికి కొత్తగా

చేయాలిసిన ముఖ్యమైన పనులు మరచినా
కవి నుండి కవిత రావడం మాత్రం ఆగదు
దాహానికి ఆకలికి ప్రేమకు కవితకు
పాఠంతో పని లేదు, కోచింగ్‌తో పని లేదు

స్వేచ్ఛా కవిత్వం-87

ఇది జీవితం

(XII భాగం)

కాలానికి కృతజ్ఞతలు

మాదిరాజు రంగారావు

2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 87

IDI JEEVITHAM

(XII Part)

(KALAANIKI KRUTHGNATHALU)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2018

Presented to
my wife
Smt. Indira

పీఠిక

స్వేచ్ఛా కవిత్వంలో "ఇది జీవితం" పేరుతో వెలువడే బృహత్కృతిలో పన్నెండో భాగం "కాలానికి కృతజ్ఞతలు". ఈ కవి స్వేచ్ఛా కవిత్వం ప్రచురణ క్రమంలో 87వది. ఇందులో వస్తువు సమాజానికి చెందింది. విషయం వర్తమాన జీవితం. ఉన్న స్థితిగతులు సమస్యలు వివిధ కోణాలలో సామాజిక రాజకీయ నైతిక తాత్విక పార్శ్వాల్లో కళాత్మకతను పొందాయి. వీటిని ఎదుర్కొనే వాతావరణంలో పరిస్థితులు, వాటి ప్రభావ పర్యవసానాలు దృష్టికి వస్తాయి. కష్టాల్ని బాధల్ని అధిగమించే ప్రయత్నం జరుగుతూంది. కానీ, ఇది ప్రస్తుత విపరీత పరిస్థితుల్లో సరిపోవడం లేదు.

ఇక కవిత్వ విషయంలో ఈ వర్తమాన సమాజం వస్తువుగా, స్థితిగతులు విషయంగా ఉన్నాయి. ఈ సందర్భంలో మనిషి పాత్ర కీలకమయింది. ప్రవేశానికీ ప్రమేయానికీ ఆలోచనకూ అనుభవానికి కార్య సాధనకూ ఉత్తమ సమాజ ఫలితానికీ అవకాశం లభిస్తూంది. బాధ్యతను పెంచుతూంది.

అయితే వస్తువు ద్రవ రూపంలో ఉంది. విషయం ప్రవాహ రూపాన్ని పొందుతూంది. ఈ భావ జాలాన్ని శబ్దంలో బంధించి, అక్షరాకృతి నీయడం సులభం కాదు. నేడు సంక్లిష్టమైన సమాజంలో పలు అంశాల కలియిక చేత ఏర్పడే సంశ్లిష్ట గుణం, కవిత్వంలో భావ శబలతను గుర్తుకు తెస్తుంది.

"మనిషిలో దోషం కత్తితో పొడిస్తేనొ ఉరితోనో
ఆత్మహత్యకు గురి అయితేనో పోయేది కాదు."

దోషి అయిన మనిషి పట్ల అవలబించే విధానం శిక్ష ఒకటే కాదు, సంస్కరణ ప్రయత్నం కూడ అవసరం. ఈ పరివర్తన క్రియ నిరంతరం సాగవలసి ఉంది కూడా. ఇది సమాజ సంస్కృతిని బింబిస్తుంది.

"ఏ దార్శనికమయినా ఏ రంగులో విధంలో పథంలో ఉన్నా
సమస్య నుండి బయట పడేది మానవీయ ప్రజాస్వామ్యంతోనే"

ఈ సమస్యకు పరిష్కారం సులభం కాదు. తరం నుండి తరం వరకు సాగుతూనే ఉండవలసి ఉంటుంది. దీనికి రాజ్యం – పాలన – సమాజం – వ్యక్తి స్థాయిలో జాగరూకత అవసరం. యంత్రాంగమూ చక్కగా పని చేయాలి.

1) సామాజిక సంవేదన 2) మానవీయ స్పందన రెండూ 1) ప్రజాస్వామ్య దార్శనికం 2) మనస్తత్వ పరిశీలనం అదనంగానూ కలిసిన అంశాలతో ఈ కృతి కవిత్వ కళను పొందింది. ఆధునిక కవిత్వ పరిణామంలో పేర్కోదగిన వికాస రూపాన్ని కలిగింది.

– మాదిరాజు రంగారావు

ఇది జీవితం – కాలానికి కృతజ్ఞతలు
(12వ భాగం)

1.

మనిషిలో దోషం కత్తిలో పొడిస్తేనో
ఆత్మహత్యకు గురి అయితేనో ఉరితోనో పోయేది కాదు
ఎంత గొప్పవయినా మాటల ముక్కలతో
ఆకలి తీరదు, బాధ్యతల్ని గుర్తు చేస్తాయి

ఆర్ద్రమయిన సానుభూతి ఎంతటి దయినా
పగిలిన అద్దాన్ని యథాతథం చేయలేదు

నింగి చేతిలో కర్ చీఫ్ వలె నీలి మబ్బు
భూమి దాహం తీర్చకుండా
మనిషి వేదన ఆర్చకుండా
కావలసిన సమయంలో చినుకు పడక కదలి పోవచ్చు
నేలపై అక్కడక్కడ జారిన బ్యాగుల వలె చెట్ల నీడలు

కాలంతో పాటు జీవన వ్యావృతిలో మనిషి
తనకిష్టమయిన పనిలో విరామ సుందరతలతో
చుట్టు మనుషులతో శబ్ద ప్రపంచంలో
మిత్రం కావచ్చు కాకపోవచ్చు, శత్రువు మాత్రం కారాదు
మారుతూన్న మనుషులతో విశాల సంబంధ ప్రపంచం

ఒక ఆలోచన తొలగితే మరొకటి దాని స్థానంలో
ఒక తల మారితే మరొకటి దాని స్థానంలో
ఒక వలువ ఒలవ బడుతూ మరొకటి అందుకొనీ
అన్నిటికీ కథలు! మనిషి ఎదుట విచిత్రంగా
వాస్తవ జీవన చలనంలో సహింపరానివి వహిస్తూ
ఆయువు ఉన్నంత వరకు బ్రతుకులు ప్రవహించేను

లాఠీ లయ ముద్రలతో వీధిలో ప్రదర్శకులు
ఆకాశం మౌనంగా, భూమి సహనంతో, మనుషులు శిల్పాల్లా
అడవిలో ప్రేలే మందు పాతర బీభత్స రచన
స్వేచ్ఛలో వ్యక్తి! చీకటిలో దీప స్తంభంలా!

వేయి కాళ్ళ పయి, చాచిన వేయి చేతులతో
ఒకే మాట! వేయి తలలతో ప్రపంచీకరణం
సమాజాన్ని గుప్పిటిలో విశ్వమయం చేసే పనిలో
కొన్ని శిఖరాలకు చేరువగా తీర్చబడే మెట్లతో

2.

హృదయం యంత్ర మయం కాదు సజీవ చేతన రూపం
మీట నొక్కితే కావలసిన పని చేయదు, స్వతంత్రం
నలువైపుల నుండి ఉక్కిరి బిక్కిరి చేసే వాద వివాదాలలో
గిరి శిఖరంపై ఏకాంతం! భద్రమనుకునే వారూ ఉన్నారు

ఏ చోట పుట్టినా ఉన్న పరిసరాల బలంతో
సమాజ సంస్కృతిని బట్టి అస్తిత చేకూరుతుంది
చూపులో పరిమితులతో అనుభవానికి అంచులెన్నో?
పొందే వస్తువులో విషయంతో అభిరుచితో
వ్యక్తి నుండి వ్యక్తికి భేదం ఏర్పడుతుంది

ఎక్కడయిన మనిషి దేహ నిర్మాణం ఒకటే
ఆకృతిలో విభాగాలు అవే! మనసు పాత్ర వేరు
గుణ కర్మలతో పొందే తీరులు వేరు
ఇది ఎవరి చేతిలోనో తిరిగే మర బొమ్మకాదు
తన కాళ్ళూ చేతులతోనే శరీరం పని చేస్తుంది

ఆదర్శంలో జరగని వెన్నో! అసంభవాలు
ప్రతి ఇల్లు తనదే! విశ్వమయం అనిపించవచ్చు
విశాల బుద్ధికి అందంగా ఉంటుంది
ఆ ఇల్లు ఎవరిదో వారికే పరిమితమవుతుంది
ఏ మనిషి కా మనిషి ప్రయోజనాలు వేరయి
సమస్య పరిష్కారంలో జటిలతను పొందుతుంది
నీతులు సూచనలుగ ఉపకరించవచ్చు
అంతరంగ ప్రమాణం విలువలు చేకూర్చేను
తనకు తెలియకుండా కాళ్ళ క్రింద భూమి తిరుగుతుంది
కొన్ని గుర్తులతో కాలం! కళ్ళ ముందు కదలుతుంది
వ్యవహార జగత్తు మనిషిలో క్రియాశీలంతో
మరో లోకం గురించి ఆలోచన రానీయదు
ఆకులపై పూలపై ధూళి పొరలు చేరాయని
చెట్టు కొమ్మలు నరక బడవు!
మతిలో మలినం చేరిందని తల తొలగింపబడదు
దేనికెంత అవసరమో అంత వరకే సమంజసం

3.

మనిషి అనుభవ మొక మానసిక ప్రపంచం
కష్టాల బాధల పరిచయాల బంధుతలతో
నిప్పు రవ్వ ఎగిరితే దూర దూరం జరిగేరు
సవనంలో పాకంలో అగ్ని ముందు కూర్చునేరు
వాన చినుకు పడితే అర చేతులు చాచేరు
చిన్న పిల్లలయితే చినుకులలో చిందులు వేసేరు

వికాస పరిచయంతో మిత్రమయి
మెడలో పూల దండ పడవచ్చు
విభేద పరిచయంతో శత్రువయి
చేతిలో ఆయుధం చూపవచ్చు
ప్రాణం నిలిపే నీరు ఒక సందర్భంలో
వరద రూపమెత్తి ప్రాణం తీయవచ్చు
ప్రాణం పోసే గాలి ఒక సందర్భంలో
తుపానుతో విషాదాన్ని సృజించవచ్చు

కనులలో బాష్ప బిందువు ఆగదు
తనువులో రక్త సరణం ఆగదు
తుపాకి మీట నొక్కితే తూటా ఆగదు
ఆపద అతిథిలా వస్తే, తనంతట వెళ్ళిపోతుంది
శత్రువులా పని కట్టుక వస్తేనే! ప్రమాదం
ఏ క్షణం శూన్యంగా వెళ్ళిపోదు
తనలో ఏదో నింపుకొనే పోతుంది
జీవితమంటేనే అనుభవ పరంపరల రూపం

మనిషిలో ప్రేమ కరుణ వీర త్యాగ రూపాలు
జీవిత ప్రదర్శనలో కళా వస్తువులయ్యేను
ఈ క్రియ సులభంగా అయ్యేది కాదు
నీతి న్యాయం తూనికలో స్వచ్ఛతతోనే సాధ్యం
చీకటి బరువును దించే వెలుగులతోనే సాధ్యం
మనుషుల అస్తితలకు యశో రూపమిస్తుంది
అక్షర కవచంతో కవిత అవతరిస్తుంది
మృత్యువు కవి పదం క్రింద నీడయి పోతుంది

4.

తూరుపు ద్వారం నుండి హ్లాదంగా వచ్చిన సూర్యుడు
పడమర ద్వారం నుండి ఖేదంగా నిష్క్రమించేను
చల్లని చీకటితో విరామ సమయం!
మనసును కొత్త ఆలోచనలలో తిప్పుతుంది

నది కిరువైపులలో తీర భూమి పయి
ఏ భేదం లేదు ప్రకృతి ప్రజల విషయంలో
జీవన వాస్తవికతకు సుందరతను ఇచ్చేను
కల్పన కవకాశం లేకుండా చుట్టూ నిజ జీవితం!

రాత్రివేళ శబ్దం! సూటిగ పయనిస్తుంది
పగటి వేళ శబ్దం! ఆగుతూ వినిపిస్తుంది
మట్టిలో విత్తు, చినుకుతో ముఖమెత్తి
ప్రపంచం చూడాలని ఆరాటపడుతుంది
మనిషిలో ఊహ, వాస్తవమై
కళ్ళ ముందు నిలవాలని ఆవేగ పడుతుంది
సృజనకు ప్రతీకయై వెలుగు శబ్ద ప్రపంచంతో
శాంతికి ప్రతీకయై రాత్రి మౌన ప్రపంచంతో

కనులు మూసి సమాధి స్థితిలో చేరి
ప్రపంచాన్ని నిరాకరిస్తే! సమాజం లేకపోదు
మనసు తలుపు తెరవబడీ
ఇరువైపుల పలుకోణాలలో
అనుభవంలో! వాస్తవ దృశ్యం
మనిషిని బంధిస్తుంది! ఆకర్షణతో
పయనంలో వక్ర దృష్టి! వెళ్ళే దిశను వేరు చేస్తుంది
మతిలో మలిన గుణం! అశాంతిని పరచి చూపుతుంది

ఉదయం అస్తమయం మధ్య ఆశామయమయి
అస్తమయం ఉదయం మధ్య భయావహమయి
బ్రతుకులో మనిషి! ధైర్యంతో సమస్య నెదుర్కొనే
శక్తి ప్రకటనంలోనే ఉంది మానుష విజయ రహస్యం
విశ్వంలో ప్రతి వస్తువు మాట్లాడుతుంది మనిషితో
జీవన చలనంలో ముడివడి బ్రతుకు బాటలో

5.

జీవ ప్రసారంతో పచ్చదనం ఉన్నంత వరకు
ఏ చెట్టు! కట్టెకూ కలపకూ పనికి రాదు,
మనిషి కూడ! చేతన కళతో ఉన్నంత వరకు
పనికి రానితన మంటూ ఏదీ ఉండదు

కవితలో మాట నలు దిశలను స్పృశిస్తుంది
మాటలో అర్థం ప్రవాహ రూపం పొందుతుంది

కంచెల సందులలో నుండి మాట బయటపడుతుంది
రాతి గోడపై నుండి దాటి దూకి కదలుతుంది
అక్షర రూపంలో కవిత! ఆంతర భాషణ రూపం!
ఆలోచనలో ఇది సజీవ చేతన రూపం!

మరో జగత్తును దింపుతుంది! అలవోకగా
ఇనుప తీగెలకు బంగరు పూలను పూయిస్తుంది
అద్దం ముక్కలో వాస్తవాన్ని ప్రతిబింబిస్తుంది
అగ్ని శిఖలపై గులాబి పూలను చూపిస్తుంది

మట్టి కుండను తన్నితే దొర్లి పగలుతుంది
కంచు బిందెను తన్నితే దెబ్బ తగులుతుంది
పైన బారులుగా ఎగిరే పక్షుల్ని చూస్తే
విమాన విన్యాస దృశ్యం! మెదలుతుంది
మనిషి నింగిలో ఎగర లేడని తెలుసు
పక్షి నేలపై నడవలేదని తెలుసు
ఇరువురినీ కలిపే రూపంకై అన్వేషణం!
బ్రతుకులో గగేషణతో సాధించేది అపూర్వం!

ఉదయం బాల సూర్యుని చూస్తే
దగ్గరలో ఉన్నట్లు అనిపిస్తుంది
ముందుకు వెళ్ళి ఆడుకోవాలనిపిస్తుంది
అస్తమయం సూర్యుని చూస్తే
దూరంలో ఉన్నట్లు అనిపిస్తుంది
నెత్తురు రేఖలతో జ్వాలా చిత్రం తలపిస్తుంది

6.

జన పదాలు పట్టణాలు పైనుండి వచ్చే గాలి
ప్రాణి ప్రకృతి మనిషి స్వరాల్ని నింపుకొని వస్తుంది
రాత్రి అవుతూనే వెలుతురుతో దీప స్తంభం
మనిషిలా స్వాగతం పలుక చూస్తుంది
ఆలోచన ఆగదు, ఉత్సాహం తరగదు
ఎదరుగ ఉన్న దారి చేయి చాచి అందుకో చూస్తుంది

నదులు మనిషిని పిలుస్తాయి తమతో నడచేందుకు
పర్వతం పిలుస్తుంది శిఖర పీఠాన్ని ఆశ పెడుతూ
రాత్రి చుక్కలు పిలుస్తాయి తమతో గడపేందుకు
ఎన్ని ఆకర్షణలలోనూ భూమిని వీడే ప్రశ్న లేదు

మనిషి కలిసినా కలవక పోయినా ఒంటరిగానే
తన దారిన పోవడమే మనిషిలో కర్తవ్యంగా,
రాజ్యానికి గుర్తుగా కోట! ఇప్పటికీ నిలిచి
వాలి పోయే ఉత్సాహాన్ని లేపి నిలబెడుతుంది
జారి పోయే ఆచరణల్ని ఆపి నడిపిస్తుంది
అనుభవంలో పనికి రాక పోయినా ఊహకు బలమిస్తుంది

మనిషిలో చీకటి! అపుడపుడూ చెదరిన ముక్కల్లా
నీరు లేని బావిలా ఎండిన చెరువులా ఉన్న స్థితులలో
తరం నుండి తరం వికాసంలోనూ దరిద్రం! చోటు చేసుకొనీ
తన చిరాయువును ప్రకటిస్తుంది! సగర్వంగా

దరిద్రం కనిపిస్తుంది దాపరికం లేదు! దీనంగా హీనంగా
ఆకాశం వింటుంది ఓపికగా మౌనంగా
స్పందించవలసిన మనిషి రాయిలా దొరలి పోయేను
మౌనంలో జవాబులు చుట్టి మరుస్తుంది సమాజం

జవాను చేతిలోనో బుజానొ! జవాబుగా ఆయుధం
అవసరం లేకపోయినా ఉంటుంది, వీడదు
కాల తంత్రుల పయి వినోద స్వరంతో పాటు
విషాద స్వరమూ వినడానికి సిద్ధంగా మనిషి!
విలువల్ని నిలుపుకొనే ఆలోచనతో ఎవరో ఒకరు
గాలి తోడుగానయినా! పయనం మాత్రం ఆగదు

7.

కష్టాలు భరించలేక పవన వీధి చేరాలనీ
జల నిధిలో కలవాలనీ! ఒత్తిడిలో ఒకరొకరూ
ఇది జరిగే పని ఏమో కాని! ఇపుడు
ఆత్మ హత్యకు మాత్రం దారి తీయవచ్చు

జలధి మాట్లాడుతుంది నిరంతరం తీరంతో
దీపం మాట్లాడుతుంది రాత్రి మనిషితో
యంత్రం మాట్లాడుతుంది కార్మికులతో
ఏ భేదం లేకుండా కిరణం స్పృశిస్తుంది

మనిషి ముఖంలో మౌనం ఆకులో పూవులో ప్రతిఫలిస్తూ
మనిషి మాటలో అర్థం ఒంటరి నుండి సమూహానికి చేరుతూ

ఎంత సేపు ఎన్ని సార్లు మాట్లాడినా మనిషితో
ఏదో మాట! ఇంకా! మిగిలే ఉంటుంది!
ఎంత బాగా కుదిరిందనుకున్నా కవితలో
ఏదో ఖాళి! ఇంకా! ఉందనిపిస్తుంది
మాట్లాడేందుకు విషయాలకు కొదవలేదు
కవితలో చేరేందుకు! అవకాశాలకు తక్కువ లేదు

మౌనంలో నిశ్శబ్దం ఆకాశంలా పరచుకొనీ
మెరపులతో మబ్బుకై ఎదురు చూస్తుంది
నిశ్శబ్దాన్ని అలంకరించే గర్జన! ఎపుడో వినిపిస్తుంది
మనసు జలద చలనం పొందితేనే! కవిత
దారిన పోయే కొద్దీ క్షణాలు దాటుతూ
అవి బూది అయి ఆ వెనకననే ఎగిరి పొరలుగా
రాసులయి! గతానికి ప్రతీకలయి నిలిచేను
అడుగు తీసి అడుగు వేసే! స్థితిలో వర్తమానం!
కిరణంలా అడుగు ముందుకు పడుతుంది
తమస్సులా అడుగు వెనక్కి వెళుతుంది
ఏదో ఒక మిషతో క్షణం! అంతలో
మంచు ముక్క కావచ్చు, కుసుమ దళం కావచ్చు
అగ్ని కణం కావచ్చు కంటకమో కావచ్చు
ముందుగ తెలియక పోవడంలోనే! ఉంది జీవన రుచి!

8.

మెలకువ స్పృహతో నిద్ర ఎగిరి పోయే సరికి
అప్పటి దాక రాజ్యమేలిన కల మాయ మవుతుంది
నీటిలో మునిగి పోయే పడవలా నిశ్శబ్దంగా
ఏవో ఒకటి రెండు గుర్తులు మిగిలితే మిగలవచ్చు

లేచి బయటికి వచ్చే సరికి,
తూరుపు దిశలో మంటల్ని తలపిస్తూ
ఉదయం! వాస్తవ ప్రకాశ రూపం,
బ్రతుకుపై అభిలాషను అభిరుచినీ! పెంచుతూ

మనిషికి దారి చూపిస్తుంది, కదలిస్తుంది
శ్రమ జీవన ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది

మంచు శిలల మధ్య ఎగసే జ్వాలా రూపం
మంచు తెరల నుండి సాగే ఆశా చిహ్నం!

ఉదయంతో అన్నిటికీ సిద్ధంగా మనస్సు
మరో రోజుకు! స్వాగతం పలుకుతుంది ఆప్తంగా

తీగెలా అల్లుకొని మనిషిలో ఆశ
పూలతో కాలాన్ని అలంకరించే తొందర పడుతుంది
సంక్షుబ్ధ స్థితులలో నిరాశా దిశల్ని
వెలుగుల అల్లికతో నింపాలని కోరుతుంది

చిత్రమేమంటే! ఉన్న కాలంలో మనిషిలో
తాను చేయదగిన పనులకన్నా
తాను చేయ కూడని వాటితోనే గడుస్తుంది

మనిషి ముందు! మెదలుతుంది జాలి గుండె
వెనక నుండి కదలుతుంది క్రూర మృగం
చకితంగా దూకాలని తొందరపడుతుంది

ముందున్న దానిపై దృష్టి కన్నా
వెనక నున్న దానిపై చూపు మరలుతుంది
మనిషిలో మనస్సు ప్రేక్షక పాత్ర వహించేను
చీకటి పారిపోదు, నీడలో ప్రవేశిస్తుంది
ఎంతటి నిరంకుశ వ్యవహారమయినా
స్వార్థానికి కళ్ళెంతో మానవీయ చేతన అవసరం

9.

అన్వేషణ ఎప్పటికీ సాగుతుంది ఏదో విషయంపై
ఏది దొరికినా ఎంత అయినా, మరో దానిపై మరింతకై
తప్పకంలో ఒకటి బయట పడుతుంది
విశ్లేషణలో మరొకటి ముందు కొస్తుంది

భౌతిక మానస స్థాయిల్లో గుప్తంగా లోతులలో
మనిషి విలువ పెంచేదీ, విషయ నిధిని చూపేదీ
సంతోషం నుండి ఆనందకయి అన్వేషణ సాగుతుంది
పయనంలో సుగమత సంతృప్తి ఒక అవసరం

ఆనందమంత సులభంగా దొరికేది కాదు
మలిన మంటని మనసులో మెరపులా తోస్తుంది
కఠిన శిలల శ్రేణులపై అలలా కదలుతుంది
ఒకసారి అనుభవం ప్రభావ మెప్పటికీ! మనిషిలో
ఆరోహణలో శిఖరమొకటి తరువాత ఒకటి
పొందాలని అభిలాష సహజం ప్రతి వ్యక్తిలో

శ్రమలో తత్పరతకు పరాకాష్ఠ రూపం
ముందుగ ఇట్లా ఉంటుందని తెలియనిదీ

ఏది అవసరమో! అది దొరకడమొక మంచి అవకాశం
దేని శక్తి ఎంతో అంతే! ఫలితం లభిస్తుంది

బంధన నుండి ముక్త మైన మనసు
విప్పారిన చేతనతో విశ్వమయ మవుతుంది
స్వేచ్ఛకు విశాలమైన అవకాశం లభిస్తుంది
సృజనకు మూలమైన మనసు దృఢత పెంచుతుంది
పయనానికి ముందు గమ్యం తెలియడమవసరం
చూపు ఉంటే చాలదు, కోరే వస్తువేదో తెలియాలి
అనుభవంతో ఆలోచన సత్క్రియతో పూర్ణమై
స్వర్గం తలపుకు రాదు, వాస్తవానందంలో

జలతీరం కావచ్చు గిరి శిఖరం కావచ్చు
మనసు తృప్తి పడే, ఏదయినా ఒకటే
అన్వేషణ సాగుతుంది ఇష్టంగా విషయంపై
ప్రయోజనం కింది మెట్టు, ఆనందంపై మెట్టు

10.

అనుకున్నదే తడవుగ మంచి పనికి రక్షణో శిక్షణో
శుక్రతారలా మతిలో మెరసే "నిజం" గుర్తుగా
మనిషిలో తొందర! మనిషి తనంతో! వడివడిగా
విభేదాల వివక్షల పాములన్ని తప్పుకుంటూ! బ్రతుకులు!

ఏ రోజూ ఏ మూల నుండో! భయ వాతావరణ ప్రభావం
సడలిన ధైర్యంతో చెదరిన స్థితులతో సామాన్యులు
ఇది భరించక తప్పని దవుతూంది జీవితంలో
హింసకు ప్రతి హింస సమాధానం అవదు
ఇది సమస్యను జటిల తరం చేసేది మాత్రమే
పెదవి నుండి మంచి మాట
మనసు నుండి మంచి ఊహ
అమృత స్పర్శతో మానవ సంస్కృతిని నిలుపుతాయి

తోటలో పూవు నిలిచేది కొంత కాలమే
ఒకటి తరువాత మరొకటి వస్తూ పోతాయి

కల్పనలో దైవం వాస్తవాన మానవం
ఎవరి పాత్ర వారిది బ్రతుకులో! తృప్తికై
యజనంలో జ్వాల, శ్మశానంలో మంటలు
రూపం ఒకటే అయినా ఉద్దేశాలు వేరు!
చలనంలో మార్పులతో ప్రవాహ రూపం సమాజం
ఒడ్డున కూర్చొని పయనంలో క్లిష్టతలకు
చింతిస్తే నిందిస్తే సరిపోదు,
ఇది కాలక్షేపానికి పనికి వస్తుంది

ప్రవాహాన్ని దాటే యత్నం ముఖ్యం
మనిషిలో మనసు వర్తనం ముందుగ తెలియనిదీ
బాధలో నిప్పై బొగ్గై దుమ్మై పోవడం మాత్రం
ఊహకందని, విపరీతం, మానవ చేతనకు విరుద్ధం

ప్రతి దశలో ఏదో పరీక్ష నెదుర్కోవలసి వస్తుంది
మనిషి జారి పోవచ్చు తేలిపోవచ్చు తనలో దోషంతో
ఎగిరే పతాక ముక్కలుగా మనుషుల్ని చూడలేం
ఒకటిగా రెపరెపలాడుతూ ఉండడమే! కర్తవ్యం

11.

మేఘం చాలా తక్కువగా మాట్లాడుతుంది
మాట వదలుతుంది, పిడుగై జారుతుంది
మాటల చినుకులతో అవని పులకరిస్తుంది
జలధి చెలియలి కట్టతో మాట్లాడుతుంది
అలల గలగల శబ్ద పరంపరతో నిరంతరం
మాటల్ని అందుకొని గాలి! పరుగిడుతుంది చల్లగా

రవి చంద్రులు మౌనంగానే వస్తారు వెళతారు
వెలుతురు సమాజ కోలాహలాన్ని ప్రేమిస్తుంది
చీకటి ఏకాంత నిశ్శబ్దాన్ని వరిస్తుంది
మనిషి మాట! వరమూ శాపం! రెండంచులతో

శిలల మౌనాన్ని ఆకుల గలగలనీ
పవమానం ఓపిగ్గా మోసుకొని వస్తుంది!
కవితలో అర్థంలో అన్నీ బయట పడతాయి
ఊహలో ఉన్న ప్రపంచం మాటలో తేలుతుంది!

మనిషి ఒక సజీవ సుందర నిర్మాణ రూపం
కింద పడితే పగిలే మట్టి కుండ కాదు
పురా చరిత్ర సారంతో, వర్తమాన ప్రభావంతో
భౌతిక మానస శక్తులతో అనుభవ రూపం

జన జీవన విషయం సంఘానికి ప్రశస్తి రూపం
మనో వికాస ప్రకాశం, యుగాల శ్రమ ఫలితం
కళ్ళ నుండి జారే అశ్రువులో
నింగి నుండి చుక్కలా మెరసే బిందువు

విషాదాన్ని చీల్చుకొని రావచ్చు
ప్రమోదాన్ని అందుకొని రావచ్చు
అనల స్పర్శ అయినా కుసుమ స్పర్శ అయినా
మనిషిలో సూక్ష్మ మయిన అనుభూతి నిదర్శనం
ఎప్పటికపుడు ఎవరికి వారిలో అభినవ గుణంతో
అల్మేరాలో నుండి పాత పుస్తకం బయట పడినట్లు కాదు

కవిత్వమంటే కవి నుండి కవి భేదించే నవోన్మేష రూపం
సృజన చేతనతో మనిషిలోని విశేష శక్తికి సంకేతం

12.

కోరిక అంచున అనల పంక్తిలా ఉద్యమం
మండే కట్టెల వలె చెదరిన నిరసన కారులు
జన విశాల ప్రమేయంతో, అభిమతంతో
ఇది సమాజ హితం కోరే త్యాగ శీల రూపం

నేలపై కదలే ప్రవాహాన్ని
నింగిలో తరలే మేఘ తతిని
మరపించే ఆదర్శ ప్రకారం
మానవ సంకల్ప శక్తికి చిహ్నం

కనుల నుండి బాష్ప కణం క్రింద పడకుండా
అర చేతిలో చిందేను రేఖల్ని తడిపేను,
అగ్నులు తల ఎత్తకుండ తడి ఆపేనా?
కోపం ద్వేషం ఘర్షణ హింస ఇవి అగ్ని మయాలే!
ఎవరి కనుల సైగలలో కదలినా
ఎవరి అడుగు జాడలలో నడచినా
ఉద్యమ కారులందరూ స్వతంత్ర గోళాలే
ఇవి చరిత్రను దహించేవి కావు, నిర్మించేవి

ᔓᔐ

క్యాలెండర్‌లో రోజు వారి అంకెలలో కాలం
అశ్వంలా గంతు లేస్తూ పోతుంది
కళ్ళెంతో బిగించి ఆపే యత్నంలో
ఆలస్యం కావచ్చు, ప్రమాదం జరగవచ్చు

బ్రష్‌తో వేసిన చిత్రంలోనో
కెమెరాతో తీసిన ఫోటోలోనో
జీవన ఘర్షణ చూచేమా? త్యాగం కనిపించేనా?
ఉద్యమ మంటే కంటికి కనిపించని దృశ్యాలెన్నో!
చరిత్ర పరిణామంతోనే దీని సంబంధం
ఉద్యమాలు ప్రతివత్సరం వచ్చే పండుగలు కావు
ఆరంభంలో ప్రయోగశాలను తలపించింది
వెడెక్కగానే ప్రదర్శన దృశ్యంగా మారుతుంది
కాలం గడచే కొద్ది సమాజ వ్యూహంలో భాగమై
ఫలితంతో మానవ గాథలలో ఒకటవుతుంది

ᔓᔐ

13.

హృదిలో విద్యుత్ప్రసార తంత్రి నుండి
శబ్దంలో ప్రకాశ రూపం! స్వేచ్ఛా కవిత్వం
మబ్బు లెపుడు కనిపించినా, అవి కొత్తవే!
వాటి నుండి నీరు కొత్తదే! సృజనలో నవ్యత వలె!

రవి బింబం పాతది కావచ్చు! శక్తికి మూలం
కిరణం కొత్తది! కవితలో భావ గణ ప్రసారమయింది
అనుకోని పిడుగు పాటు ప్రమాదాల హెచ్చరికలతో
మేఘంలా స్వేచ్ఛా సుందరతలతో ఆర్ద్రతకు ప్రతినిధి

దుమ్ము కమ్మి ఉన్న ప్రకృతిని సహితం
నిర్మలినం చేసి స్వచ్ఛతను కాపాడినట్లు
కవితలోని ఆలోచన ఎప్పటికీ కొత్తగనే
మనసును శుభ్రం చేసి, కొత్త విలువలు నింపుతుంది

మనసులోని మర్మాన్ని తీసి పైకి చూపుతుంది
మట్టిలోని వజ్రాన్ని తీసి కడగి బయట పెడుతుంది
తుప్పు పట్టిన కాలాన్ని! నవనవంగా తీరుస్తుంది
మనిషిలో కాల్చే గుణం ఆర్పి, సత్వశక్తి నింపుతుంది

తిరిగి తిరిగి పక్షి గూటికి చేరుతుంది
చెట్టు పైనే కాదు రుతువును బట్టి
ఇంట్లో ఒక మూలన గూడు కడుతుంది
తిరిగి తిరిగి మనిషి ఇంటికి చేరేను

గూడులో అందని ఎత్తులో పక్షి! ఇంటిలో నేలపై మనిషి
రెండిటిలో సామ్యం! భౌతికం నుండి మానసం దాకా
"మా నిషాద"లోని రామాయణ కథా ప్రేరణం
మనుషుల సాధారణ జీవిత రూపానికి సంకేతం

నిప్పుపై బూది ఊది ఉష్ణ శక్తి నిలుప వచ్చు
విషాదం నుండి మనిషిని ఆశావంతం చేయవచ్చు
విలయంలో సృజనతో శుష్కతను రసమయమై నిలపవచ్చు
మానవ కర్తవ్యంతో సమాజం పల్లవిస్తుంది
పక్షి ఆత్మకు చిహ్నమైతే, మనిషి విరాట్ చేతనకు సంకేతం

14.

కొంత తెలిసి కొంత తెలియని హేతు గుణంతో
బ్రతుకంతా వాస్తవం, మనిషి మనిషికీ భిన్నం
మనసుకూ మనసుకూ మధ్య ఎడంతో
వ్యక్తిత్వం ఏర్పడుతుంది! స్పష్టంగా

మనిషిలో అనల రేఖ! సన్నని జ్వాలగా
నఖ శిఖ పర్యంతం జీవన ప్రేరణయై

జ్వాలకు మొదలు చివరలు ఒకటే
సృజన బిందువు మనిషి మొదలు అయితే
విలయ రేఖతో సమాప్త మవుతుంది
ఈ మధ్య అనుమానం సందేహంలో ప్రశ్నలు!

దేశ ద్రిమ్మరి వేసిన తలుపులు చూస్తూ పోయేను
గృహ నివాసి వేసిన తలుపులు తెరవాలనుకునేను
తలుపులు తెరచుకునేది, ఎవరి రాకో తెలిస్తేనే
పిలుపుతోనో తట్టితేనో కాలింగ్ బెల్ తోనో

కళ్ళలో విప్పారిన కుసుమ శోభ కనిపిస్తేనో
ముఖంలో మంచు పొర వీడిన ఉదయం చూస్తేనో
మాటలో ఆర్ద్ర స్వరం దూకి కదలితేనో
హరిణంలా ఆత్మీయం! చెంగున ముందుకు వస్తుంది
తెరచిన తలుపులు! మూతబడవు! ఆ సమయంలో
మనిషి అతిథి కాదు, మానుష విధి పాలనలో భాగస్వామి!

కళ్ళు మెరసే నిప్పు కణాలయి తోస్తేనో
ముఖంలో దీప్తి లేని బొగ్గు రాతల ఫలకమైతేనో
మాటలలో ఎండుటాకులు రాలినట్లయితేనో
హృదయాశయ స్పర్శ శిలా శకలాన్ని తలపిస్తేనో
నేలపై మట్టిలో పులి అడుగు జాడలు కనిపిస్తేనో
తెరచిన తలుపులు మూతపడే అవకాశం ఎక్కువగా

తలుపులు తెరచే అవసర మెంత ఉంటుందో
తలుపులు మూసే హేతువు లన్ని ఉంటాయి!
ఈ రెండిటి మధ్య అనుమానం భయంతో సమయం
చిత్రాకృతి పొందుతుంది దీని నుండి ముక్తమవడం తప్పనిదీ

15.

ఎవరి నిలయం వారిది, మనోమయం
బయటికి కిటికీలు తలుపులతో
వెనుక వైపు, కిటికీ నుండి గతాన్ని తలపిస్తుంది
ముందు వైపు, తలుపు వర్తమానాన్ని చూపిస్తుంది

ముంగిలిలో వరండా దీర్ఘ కవితలా,
వీధిలో వస్తూ పోయే వారి అలికిడి వినబడుతూ
ఊహకు అవకాశంతో కల్పనలకు స్థానంతో
వర్తమాన క్షణాలపై మనిషి జీవితం!

బయటి నుండి శబ్దం ఒక్కొక్క అర్థంలో
ఒదుగుతుంది, అన్నీ కలిసి గ్రంథమవుతుంది

వెలుతురు లోనే వస్తువు రంగులు కనిపిస్తాయి
చీకటిలో ఇవి! తమ ఉనికిని కోల్పోతాయి

చీకటిని రంగుల బొమ్మలతో తీర్చవచ్చు
నీడను ఏ రంగుల చిత్రంతో తీర్చేరు?
వెలుతురులో వస్తువు తన రంగులతో బయటపడేను
ప్రతిదీ విడివిడిగా తన ప్రత్యేకత చాటుతుంది

పయనించే దారిని గమ్యాన్ని ఎన్నుకోవడంతో
సమస్యకు పరిష్కార ముఖ ద్వారం తెరచుకుంటుంది
మిగతావి గమ్యం చేరే వరకూ ఎదుర్కొనక తప్పదు
బయటి ప్రపంచం నాలో ఒక్కొక కథను చూపుతుంది

చుట్టు కనిపించే ఆకాశం చుక్కలు గిరి నది దృశ్యాలు
ఎప్పటివో? ఇప్పటివా? మనిషి కెంత పూర్వానివో!
ఏడాదికొక సంఖ్య పెరుగుతూ జీవిత కాలంలో
ఒక వైపున సంతోషం, పరిణత దశకు దగ్గరవుతూ
భవిత తగ్గి పోయేనని ఆలోచన జరగవచ్చు
మోదమో! తాపమో! సమాజ ప్రవాహం
ఇరువైపులలో దొరికే జవాబు ఒకటే!
అన్నీ జీవన రూపానికి పార్శ్వాలే!
వెనక కిటికి నుండి చూస్తే దాటి వచ్చిన దృశ్యం
ముందు తలుపు తెరచి చూస్తే దాట వలసిన దృశ్యం

16.

గదిలో టేబుల్ కుర్చి బెడ్ పుస్తకాల షెల్ఫ్
అన్ని స్మృతి నీడల బొమ్మలు వదలేను
పూర్తిగ వ్యవహార జగత్తులోకి ప్రవేశింప జేసేను
జీవన వాస్తవ స్థితికి సుందరతను చేకూర్చేను

స్వేచ్ఛ బహు విశిష్టమయింది! వెనక నుండి
వ్యక్తి బాధ్యతను గుర్తుకు తెస్తుంది
స్వేచ్ఛలో మనిషి ఏ పని కయినా సిద్ధంగా
మంచి చెడు వివేచనతో నియతి అవసరం

సమాజ లక్ష్యం కన్నా తన గమ్యం ముఖ్యమై
బ్రతుకులో సంకుచితం పాలు ఎక్కువవుతూంది

ముందున్న అద్దంలో వెనక బడే దృశ్యాల్ని చూస్తూ
చేతిలో కళ్ళెంతోనో స్టీరింగ్‌తోనో వాహనం నడుపుతూ

వెనక నుండి తరుముకొచ్చే జాగిలాని కందకుండా
గాలిలో ఎగురుతూ వెంటాడే తుమ్మెదల్ని తప్పుకుంటూ
మధ్య మధ్య జ్వాలా శిఖల మధ్య చోటు చేసుకొనీ
పయనం! అనుభవ వైవిధ్యంతో సాగుతుంది

అనుకున్న స్థలం చేరవచ్చు, చేరక పోవచ్చు
ప్రమాదం జరగవచ్చు, ఆగిపోవచ్చు!
అన్నిటికీ అవకాశాలు తెరవబడీ స్వేచ్ఛలో
చివరకు విధి హాంగర్‌కు వ్రేలాడుతుంది జీవితం!
ఇది మనిషి తప్పిదంలో లోపం మరపిస్తుంది!
వాటిని సరిదిద్దుకొనే అవకాశం కోల్పోతుంది
చీకటిలో అద్దంపై టార్చ్‌లైట్ వేస్తే
తన ముఖం చెప్పే కథ వేరవుతుంది
పూర్తి స్వేచ్ఛ నిచ్చి వదలితే మనిషిని
అందరికీ పూర్తి స్వేచ్ఛ లభించినట్లేనా?
వెలుగులో చీకటిలో హృదయ స్పందన మొకటే
మిత్రమయినా శత్రువయినా ప్రమాణాలు ఒకటే
నిలయానికి కిటికీ తలుపులు గోడలు అమరి ఉన్నా
బ్రతుకులో స్వేచ్ఛకు దారులు మితం కావు హతం కావు

17.

గ్రీష్మ తాప సమంగా మనిషి గుండె తపిస్తూంటే
కవిత జలద చేతనతో ఉపశమింపజేస్తుంది
ఏ రుతువయినా సమస్య లేని స్థితి ఉండదు
ఆయా విపరీత స్థితులన్నీ బ్రతుకులలో తలపిస్తాయి

కోరినంత మాత్రాన రెక్కలపై ఎగిరి వచ్చి
మనిషి ముంగిట నిలబడదు పరిష్కార రూపం
సమాజ భవిత దృష్టితో తరం నుండి తరం
మార్పు కోరుతుంది, అవసరమయితే ఉద్యమిస్తుంది

ఒక రోజున పంటకు అనుకూలంగా లేదని
మరో రోజున మేఘం! రమ్మంటే రాదు
ఆ రోజు వర్షానికి చెరువు నిండలేదని
మరో రోజు కూడ కురవాలంటే కుదరదు

ప్రతిదీ శక్తి కొలది తన పరిమితులలో
మనిషి మాత్రం శక్తి మీరి పరిమితులను దాటేను

రౌద్రమయిన కరుణ మయిన జీవన గతిలో
ముఖంలో నిప్పులు కానీ, కళ్ళలో నీరు కానీ
ఎపుడు బడితే అపుడు! కనిపించవు
ఈ విశేష స్థితికెంతో పరీపాక మవసరం

మలుపు తిరగడంతో గమనంలో గొప్ప మార్పు
ఆ వెనక వచ్చే వారికి వీడ్కోలుగా
ముందున్న వారితో కొత్త పరిచయంతో
పోయే దిశ మారుతుంది మనుషులు వేరవుతారు

చెట్ల వరస నీడ ఒక సమయం ప్రవాహ సమంగా
అదే! మరో సమయంలో చేరిన కృష్ణ సర్పంలా

ఆకాశం తెలియని వెలుగును ఎరగని
చీకటి గుహను తలపిస్తుంది నీడ!
ఎంత ఎండలోను! చల్లదనం కోల్పోని
నీడ మనిషికి పాత బంధువు! తాపహరం!
గాలిచే తరుమ బడదు నిప్పుచే దహింపబడదు
హ్లాద సుందరంగా! ఇది మరీచి కాదు, ఇది వాస్తవం

18.

ఎవరు ఎపుడు ఎచటి నుండి వచ్చినా
వర్తమాన నివసనం ప్రస్తుత వాస్తవం
పురా చరిత్రలో నిజాలు చేపల వలె
అడుగంటిన చెరువులో నీళ్ళను స్పృశిస్తూ బ్రతికేను

ఇదే! లోతు బావి అయితే తొంగి చూచి
కనిపించీ కనిపించని దృశ్యంతో సంతోష పడేరు
దించిన బొక్కెనతో అందిన నీరు! త్రాగి తృప్తి పొందేరు
ఏదైనా అభిమానంతో పొంగి ఉబ్బిపోయేరు

ఉన్న భూమి పయి ప్రజల మధ్య సహ భావంతో
బ్రతికే హక్కును! పొందుతుంది జీవితం

మాసి పోయి చినిగిన పేజీల ముక్కల్ని చేర్చి
కథలకు పొంతన కూర్చే యత్నాలెన్నో!

తెలిసిన దాని కన్న తెలియని దెక్కువగా
అదీ మసక బారిన అద్దంలో తన బింబం! అందంగానే
విలువలతో మెరసే బంగరు నాణెంలా
వ్యక్తిపై నమ్మకం! ఎంత పని నయినా చేయిస్తుంది

పై తరానికి కింది తరంతో సంభాషణ ముఖ్యం
క్రింది తరానికి పైతరంతో విభేదాలు సహజం
ఎన్ని మరచి పోయినా ప్రేమించిన మనిషితో
నడచిన దారిన అనుభవం! మరపున బడదు

పైన పక్షినీ కింద జంతువును తలపించే దాని కన్న
కనిపించని దైవానికి బహు దగ్గర అయ్యేను! మనిషి!
మనిషి గురించి ఆలోచన, అనుభవం మనిషిలో
గాలిలో దీపం నీటిలో మూట అయితేనే సమస్య

మట్టిలో కలిసిన వస్తువు గురించి చింతనతో
మట్టిపై దార్శనికంతో ఎదిగే భవితపై కోరికతో
మరునాటి పూలు వాడి రాలిపోతాయని
చెట్టు పట్ల నిరాదరణను కనబరచలేరు!
ఆయువుకు సమాప్తి రేఖ తప్పదని
ప్రాణి పట్ల ప్రేమకు తెరదించలేరు!

19.

ఆదర్శ భావనలో సమస్య తల ఎత్తవచ్చు
విభేదానికీ ఘర్షణకూ మధ్య ఖాళీలో
స్నిగ్ధమైన హృదయంతోనే మార్పుకు అవకాశం
విశ్వాసం పెంచుతుంది, నవతకు దారి తీస్తుంది
ఆశకు సుమ బంధుత చేకూరుస్తుంది
ఇది రేపటి బ్రతుకునకు బహుమతి రూపం

పలు రకాల పూలతో తోటలా
పలు తీరుల స్వరాలతో పాటలా
ఈనాటి ప్రజాస్వామ్య భావ సమాజం
నడతకు ప్రాధాన్యంతో బ్రతుకు విలువ పెరుగుతుంది
విషాద ఛాయలకు బహు ప్రాధాన్యం ఇచ్చేరు
పూలను మరచి ముళ్ళను గురించి చర్చించేరు

ఓటమి కారణాలు చిలక కొయ్యకు తగిలించి
విజయంలో శోభను తాము స్వీకరించేరు
సృజన విలయ రూపాలతో సమాజంలో
రక్షకులు! హంతకులు! జీవిత గమనంలో

పచ్చని ఆకుల స్థానంలో ఎండిన ఆకులతో
కాలం వలె సమాజ స్థితులలో మార్పులు!
ప్రగతి శక్తికి నిరోధాలు పైబడి ఒకటొకటీ
పద పదాన ఘర్షణలు! ఇరువైపుల నుండీ!

తెలియకుండా జరిగే వాటికన్న
తెలిసి జరిగేవే! అన్నీ! ఎన్నో!

వెలుగులోకి అడుగు పడిందని సంతోషిస్తే
వెనక నుండి వరద లాగ చీకటి రానే వస్తుంది
ధ్వంసం చేయబడిన నిర్మాణాల కళా శకలాలు
ఇళ్ళకు పునాదిగా మెట్లుగా మారడం
మానసిక వైక్లబ్యంలో ఒక దౌర్భాగ్యం
జన చేతన బొగ్గుగ మారడమంటే, చీకటి గెలుపే!
కవితతో ఒనగూరే ప్రయోజనం అంతరం బాహిరం
మనిషిని మేల్కొల్పుతుంది! చేతనతో నడింపజేస్తుంది

20.

బయటికి అడుగు వేస్తే! దారులలో మనుషులు
వ్యాపారమె! వ్యవహారమె! వ్యవసాయమె! విజ్ఞానమె!
తమ చేతులలో కదలే జీవన సూత్రంతో
ఇది కష్టంలో మెదకు ఉరి కూడా కావచ్చు

గగనానికి నిచ్చెనపై పైకి వెళ్ళే ఆలోచన కన్నా
ప్రజలో! ఈ నేలపై తృప్తిగ గడిస్తే చాలనిపిస్తుంది
దోసెడు మట్టి నుండి మొలక అశ్రు జలంతో
మానవ సంకల్పంలో శ్రమ శక్తికి ప్రతీక అవుతూంది

బ్రతుకును వాద్య విశేషంగా మలచుకునే వారున్నారు
బ్రతుకున ఆయుధ రూపంగా తలచుకునే వారున్నారు

నిశ్శబ్దంగా జారే కన్నీటి చుక్కలో శబ్దం
కవి హృదయానికి తెలుస్తుంది, పలు విధాల అర్థం

కవితలో ప్రయోజనం వలె ఆశామయతను ప్రకటిస్తుంది
చెప్పాలనుకున్నది బయటికి వచ్చే లోగా అర్థం మారుతుంది

ఇది నగరం! ఇక్కడ ఒకరినొకరు గుర్తించి
చరించే మానుష వర్తన ఉంటే! చాలనిపిస్తుంది

ప్రతి వ్యక్తి ఏదో ఒక దోషంతో చుట్టబడిన వాడే
దీని నుండి విమోచనం పొందే ఉపాయమవసరం

ఎక్కడ ఏది తగల బడుతుందోనని! ముందుగా
ఫైరింజను సిద్ధంగా ఉంటుంది, అనల శమనానికి
ఊరు నుండి వచ్చిన మనిషి! మరునాటికి
దుస్తుల నుండి మాటతో నడత దాక! కొత్త పాత్రలో

భూమి తలంపై కన్నా గిరి శిఖరం చేరే
ఆశను బింబిస్తూ, శ్రేణులుగా సౌధ పంక్తులు
ఇక్కడ! నినాదాలు! ప్రదర్శనలు! కోలాహల సమూహాలు
మనుషులు! ఎప్పటికీ క్రియాశీల పాత్రలలో కనిపించేరు

అలజడికీ హింసకూ హక్కులకూ బాధ్యతలకూ
ఎప్పటికప్పుడు! స్పందన గుణ వర్తనతో నగరం
మనిషి కలలు సాకారం అయ్యే యత్నంలో
అన్నిటినీ తనలో ఇముడ్చుకొన్న మహో యంత్ర రూపం

21.

దరిద్రాన్ని చుట్టుకున్న తలపాగాతో పేదలు
ముఖాన బూది పొర! ఎప్పటికప్పుడు కొత్తగా
చీకటి మసి వదలని మానుష కిరణాల మధ్య
మనిషిని గుర్తించేందుకు! పెద్ద ఇబ్బందిగనే ఉంది

రోజులన్ని ఒకే విధం! వీధి మూలన రాయిలా
దగ్గరలో చెట్టుకు పూలను చూచే చూపు అవసరం
కొమ్మ నుండి ఎగిరే పక్షి! పేదవలెనే అన్వేషణలో
ఎవరి పనులలో వారు పోవాలిసిన చోటికి పోతూ

ఏ రోజూ ఆ కార్నర్! చెదరిన చిత్ర ముఖాలతో
మారే మనుషులతో, జీవన రుచి భేదాలతో
ఇది కవితకు కావలసిన మనోజ్ఞ వేది!
కవుల దృష్టి కోణానికి పరిమితమై, కనిపించేను

డైరి పేజిలో అనుభవాల నమోదు! ఏ రోజూ
మనసులో ఎన్ని రంగులలోనో ప్రతిఫలించే అక్షరాలలో

తగిలిన గాయం నుండి రక్తం ఎరుపు
మండే శత్రుత నుండి ధూమం నలుపు
రెండూ చెరొక వైపు నుండి మనిషిని పక్కకు తోసి
వెలుతురులో తెలుపు నాక్రమింప జూచేను

మిగిలిన ప్రాణాల నుండి ఆశల పచ్చదనం
వెలుతురులో తెలుపుకు మనిషి విలువ చూపేను
రోజులు గడిచే కొద్దీ జ్ఞాపకాలు మసక బారి
అన్నీ తెలిసిన పగలు వేలుగు - నీడలు చీకటిలో కలిసేను

మరో రోజు మొదలవుతుంది ఉదయంతో
ఇంచు మించు అదే! సమాజ బాహ్య దృశ్యాలతో
వర్తమాన జీవనంలో ఎరుపు పచ్చ రంగులకే ప్రాధాన్యం
తెలుపు కాగితం పయి నీలి అక్షరాలతో పేజి తరువాత పేజి!

ఆయువులో సంవత్సర మొక ఆల్బం! విడుదలవుతుంది
విభేదాలు స్పర్ధలు స్వార్థం దరిద్రం అన్నీ! అవే! సందర్భాలు వేరు
మళ్ళీ రాకూడనేదేమీ లేదు, రాకకై ఎదురు చూచే వారూ ఉన్నారు
అన్నీ యథాతథంగా దోషం మలినంలో-స్వచ్ఛత శుభ్రతకై ఆరాటం

22.

ఒక సందర్భానికీ మరో సందర్భానికీ మధ్య లోయ
చిన్నదో! పెద్దదో! దీన్ని దాటడం జీవితంలో భాగం
ఈ యత్నాలెన్ని విధాలో! వంతెన నుండి విమానం దాక
వాహనాల ప్రవేశంతో మేధ పదును తేలుతుంది

అడవి పచ్చగ ఉన్నా అంటుకున్న చిచ్చుతో,
పొగల సెగల మధ్య నుండి దారి చేసుకొనీ
పక్షి! ఎగిరిపోతుంది, భద్రంగా
కష్టంలో మనిషి, మరో ప్రాంతం చేరేను

మనిషిపై మనిషి నమ్మకం, మనిషిలో మానవం
ఆపద కాలంలో ఆదుకునే మనోమయాలు
విశాలమయిన అవనిపై గిరి నది అడవి జలధి
విభేదాలు దేశాల విభజనలకు కారణాలయినాయి
మనిషిలోని స్వతంత్ర ప్రవృత్తిని మేల్కొలిపేను
సరిహద్దులకు మనుషుల జీవితాల్ని మితం చేసేను

శత్రుతలో తగిలిన గాయం
బాల సూర్య శకలాన్ని తలపిస్తుంది
స్మృతి నిలయంలో మాత్రం
ఇదొక పూవుగనే మిగులుతుంది

ప్రేమ వాడి రాలి పోయే పూవు కాదు
మాగి పండి జారి పోయే ఫలం కాదు
ఇది మనో జగంలోని సుందర భావ మయం
వ్యక్తి నుండి విశాల విశ్వ హృదయ స్పందనతో

ఎదపై హత్తిన శిశువులా ఉదయం
తలపై నిలిచిన బరువులా చీకటి
ప్రకృతి కాల సమాజ రూపాలతో మనిషి
వ్యవహార జగం నుండి! ఆంతర పీఠ దాక
ఒక స్థితికీ మరో స్థితికీ మధ్య లోయ దాటేందుకు
అవకాశం కల్పిస్తుంది! అవసరం, మనిషిలో మేధతో
నిదురలో తప్ప విరామ మెరగని మనస్సు
అంతరంగ స్పృహతో మనిషిని దాటిస్తుంది

23.

భూమి ఎట్లా ఉంది? ఎటు తిరుగుతుంది?
చాలా మందికి తెలియదు! ఇది శాస్త్ర విషయం
భూమిపై తమ నడక మాత్రం తెలుసు!
పగలు రాత్రి చేయాలిసిన పనులేవో తెలుసు!

అద్దంలో తన ముఖ మెట్లా ఉన్నా, ఫికర్ లేదు
తల దువ్వుకొని, పల్చగ పౌడర్ అద్ది బయటపడడమే
కాలం ఎవరి వైపో తెలియదు!
కష్టాలకు హేతువులు ప్రశ్నలుగానే మిగిలేను

ఎవరి జవాబు వారికి మితం, ఎవరి నమ్మక వారికి హితం
తన అనుభవ స్థితిలో గడ్డ కట్టిన ప్రవాహ రూపం!
చివరకు భూమి హృదయం విస్ఫారుతుంది
విధి పాత్రను కాస్త పక్కకు పెడితే
మనిషిలో స్వార్థం ట్రాక్ కనబడుతుంది
అన్వేషణలో వివేచనకు వేదిక! అవుతూంది

ఇతిహాసం! రికార్డు చేయబడిన జీవిత వాస్తవం
మూల విషయం చుట్టూ కల్పనల భ్రమణం
తిరిగే వేగంలో అసలు రూపం కనిపించదు
పలు రంగులద్దిన ఒక్కొక్క చిత్రం విడుదలవుతుంది

మాటలు నడతలో మానుష స్వరం వినిపిస్తుంది
మోద ఖేద మిశ్రమ భావంతో బ్రతుకు బయటపడుతుంది
వివిధ సంఘటనలలో సంక్లిష్టమైన స్థితులలో
మనిషి మనసులోని పొరలను ఒలిచి చూపుతుంది

లోని కారణ మొకటి బయటికి కనిపించే దొకటి
అనుమానం సందేహం కోరిక క్రోధం ఘర్షణ రణం
కలిసిన సంశిష్టమైన జీవితాలు వివిధ పాత్రలలో
ఒక స్థితిలో వెలిగే శక్తి కేంద్రమయ్యేను

దాటరాని చీకటి అల ఎగసి
మనిషి రూపం! ముంచేస్తుంది
మనిషిలో ఉన్నతిలో మేధ దేనికి? అన్న ప్రశ్న
మనిషిని భూమి నుండి దూరం చేస్తుంది!

24.

నది నిద్ర ఎరగదు, నిరంతర చేతన చిహ్నం
మనిషికి మెలకువతో పాటుగ నిదుర కూడ అవసరం
భావ జగంతో మనిషి విరామంలో
పగలయినా చీకటి అయినా! సృజన చేతన ఆగదు

బ్రతుకును తీర్చే సజీవ సాధనం మనస్సు
ఇది దురుపయోగ మయితేనే ప్రమాదం,
ఎవరి జీవిత రచన వారి వారి మనో రూపాలతో
ప్రతి కథకు ఒక వైపున వాస్తవం, మరో వైపున కల్పన

ఇది మిశ్రమ గుణ కారణ కిర్మీరం
తమ జీవన కథ తోనే గడుస్తుంది కాలం
మరొకరి కథ వినే తీరిక ఎక్కడుంది?
వీలు చేసుకున్నా, ఆ కథలను భరించ లేరు

నిద్రా జగంలోకి జారిన
మనిషికి దీపంతో పని లేదు
మరొకరికి అక్కరకు రావచ్చు
దిశలలో వెలుగు దారి చూపవచ్చు

కష్టంలో బాధలో బ్రతుకు ఎత్తు పెరుగుతుంది
నిరాశలో వేదనలో మనసు లోతు పెరుగుతుంది

ప్రతి ఒకరు మరొకరి దృష్టిలో మట్టి బొమ్మ
తానయితే తన దృష్టిలో స్వర్ణ ప్రతిమ
రెండింటికీ అందనిది మానవ రూపం
ఒక కన్నీటి చుక్కతో సమంగా వస్తువు లేవీ తూగలేవు

చల్లని దయితే ఆనంద స్పర్శ నిస్తుంది
వెచ్చని దయితే సానుభూతి కలుగుతుంది

మరో క్షణంలో ఏమయ్యేది తెలియని
జీవిత గమనంలో మనిషి పాత్ర ఎప్పటికీ కొత్తగా
వర్తమాన రూపానికి చలన గుణం ఇస్తుంది
మూల మనో గుణంతో రంగంలోకి దిగుతుంది
"నేను" భావనతో సాగుతుంది జీవిత గమనం
"మనం" రూపంతో మారుతుంది సమాజ రూపం

25.

ఒక చోట ఒకరు ఉంటే మరో చోట లేనట్లే
మరో చోట కల్పనలో ప్రతి రూపం చూడవచ్చు
వాస్తవ మొక మానసికానుభవంలో కాల మనోజ్ఞం
జీవితాని కిరువైపుల ప్రేమ – సౌందర్యం విలువలతో

నిశ్శబ్దంలో అర్థం కాని రహస్యాన్ని నింపుకొనీ
బ్రతుకులో వలేనే కవితలోను క్లిష్టత శ్లిష్టత
రహస్య చిత్రాలే లేకపోతే ప్రత్యేకత ఎక్కడిది?
అర్థాన్ని ఆశ్రయించి శబ్దం మనసును జగమంతా తిప్పుతుంది

ధనం యశసు రెండూ చేతుల్లో బంతుల వలె
మూడోది కవిత చేరుతుంది చిత్రంగా ఆడిస్తుంది

నిశ్శబ్దం నుండి శబ్దం మాటయై ఆకర్షిస్తుంది
శబ్దంలో నిశ్శబ్దం కవితయై వెడలుతుంది

శబ్దంలో కనిపించే అర్థంతో
ఇరు పొరలుగానో ఇరువైపుల లోనో
తారలా పూవులా అలలా నిప్పులా
చూపు నుండి మనసులో కొత్త ముఖంతో

కవితలో ప్రతి మాట ప్రయోగంలో
ఏదో ఒక ప్రయోజనంతో వెలిగేను
అవసరం ఆనందం వ్యవహారం ఉత్తేజం
చెప్పని దేదో ఇంకా మిగిలినట్లనిపిస్తుంది

అర్ధరాత్రి బయట మనిషి అలికిడి వినిపిస్తే
అనుమానాలెన్నో! సందేహాలెన్నో! మ్యూజికల్ చైర్ ఆటలా

నీడను చూస్తే ఏ భూతమో అనిపించదు
మనిషి నుండి మరో మనిషి బయటపడినట్లు ఉంటుంది
ఆకులు రాలిన చెట్టు! పేదదే! అవుతుంది
ఆకలి తీరని రోజు శూన్యమనిపిస్తుంది
పెను గాలికి వాలే కొమ్మ మళ్ళీ సరి అవుతుంది
కష్టం తీరగనే మనిషి! దిగులు వీడి నడచేను
కాలం స్వాగతంతో లోకంలోకి దిగిన కవిత
కాలానికి కృతజ్ఞతతో భూమిపై స్థిర పడుతుంది

26.

కాలం పిలుస్తుంది తన వెంట ముందుకు నడవాలని
కాలం మాట్లాడుతుంది కొత్త కథలు వినిపిస్తుంది
నిరసన వాద విభేదాల ప్రకటన తీవ్రతలలో
ఎదురయ్యే జ్వాలా శిఖలపై తరలిస్తుంది

నిప్పు ఆరేంత వరకు నిలవనీయదు ఒంటరిగా
చల్లని పవనం వెచ్చని బూదిని దాటిస్తుంది
రాత్రి సమయం చుక్కలు తోడుగ మెరుస్తాయి
పగలు సమయం చెట్లు తోడుగ కనిపిస్తాయి

తన ఆయువు కాలంలో మనిషి అవనిపై
తరాలకు సరిపడ సంపద ఒప్ప జెప్పి పోవాలనీ!
భూమి అంచు నుండి సముద్ర తటం దాటి కూడా
చరిత్ర పుటలో ఉత్సాహ ప్రదర్శనం కనిపిస్తుంది

భూమిపై నదీనదాలు దాటి సరిహద్దులు చెరపేస్తూ
మనిషి! తన మనుగడ కయి నిరంతరం పయనంలో

భూమిపై మనిషి ఆకలి దప్పికతో నలిగిపోకుండా
జలధి నుండి నీలి మబ్బులు బ్రతుకులో ధైర్యమిస్తాయి
బ్రతికేందుకు దారు లెన్నో ఒకదాని నొకటి క్రాస్ చేస్తూ
చాచిన ఆకాశ హస్తం క్రింద వికాస మస్తిష్కంతో
మనిషిలో మనీష! కాలాన్ని తన వశం చేసుకోవాలని
పయనానికి వేగం పెంచే గాలుల సహాయ గుణంతో

నమ్ముకొన్న మనిషికి సంపద నిస్తుంది భూమి
తన పట్ల కృతజ్ఞతను గుర్తిస్తుంది ప్రేమతో

ఒక వైపు నుండి కోరిక మరోవైపు నుండి పూనిక
రెండిటినీ కాలం తన అర చేతులపై వహిస్తుంది
మనిషిని తిప్పుతుంది, ఆకాశం హద్దులు చూపుతుంది
భూమిపై మనుషులు ఆయువు కలంకారాలు కారు

నడత నిలుపుతుంది మనిషిని చెదరకుండ
జీవన నిర్వచనం మారుతుంది ప్రయోజనంతో
కవిత వదలుతుంది తనలో అక్షయ సంపదను
కాలం మాట్లాడుతుంది కొత్త కథ వినిపిస్తుంది

27.

ఊరులెన్ని మారినా, ఉండే ఇల్లు అరలు అవే!
గేటు అదే! అంగణ మదే! ద్వారమదే! ప్రవేశానికి
నివాస విభాగాలవే ఇంచు మించుగా అవసరాలకు
మనిషిలో కోరికలకు వీలుగా ఆచరణంలో

వీధిలో మనుషుల ముఖాలు వేరు, కొత్త వాటితో
వార్తా దృశ్యాలతో ఆ రోజు దిన పత్రికలా
కాలం కాన్వాస్ అదే, ఆ రోజు చిత్రం వేరవుతుంది
రేఖలతో మనిషి రూప మదే, మాటలు చేష్టలు వేరుగా
మనుషుల వ్యవహారం మారుతుంది స్థితులకనుగుణంగా
తనపై ఉంచిన నమ్మకం వమ్ము కాకుండా రాజ్యం
సకాలానికి కావలసిన తీరులలో ఆశలు తీర్చేనా?
ఈ బాధ్యత వ్యక్తి నుండి సమష్టికి మారుతుంది

సమయానికి ఉదయం సూర్యుని రాక తప్పదు
ఆ కాలానికి తగిన మేఘు జలం కురిసేనా?
ఇక్కడ ఏ దార్శనికం ఆదర్శం వాదం ప్రసక్తి లేదు
జల బిందువు అందరికీ కావలసిన ఆధారం

నిలయమదే అయినా, ఉండే మనో రూపాలు వేరు
కనీస స్థాయి నుండి పై స్థాయిని వరిస్తాయి
కళా హృదయ మయితే! ప్రత్యేకత ప్రకటిస్తుంది
నిర్మాణంలో మనస్సు చూడని ఆకర్షణ కోరుతుంది

నది ఆవలి ఈవలి తీరాలు కలిసే అవకాశం లేదు
జీవితమూ అంతే! దాటే ఉపాయ మొకటే తప్పనిదీ

రెక్కలపై విహగం సులభంగా దాటుతుంది
మనిషి విహగ రూపం! పొందడమ సంభవం
మనిషి విహగ సమం యంత్రాన్ని ఆశ్రయించేను

ఊరు మారినా ఇల్లు మారినా దేశ మేదయినా
ఉండే మనిషి మనో మూల మదే కీలకం
ఎవరి ఊహ వారిదయి, ఎవరి దారి వారిదయి
స్వతంత్ర మయిన స్వేచ్ఛా యాన జీవితంలో
ఒక పంక్తిలో ముగిసే కథ కాదు పుస్తకమవుతూంది

28.

భాష ఏదయినా మనిషి మనసు మనిషికి తెలుస్తుంది
నేరుగ హృదయాన్ని స్పృశిస్తుంది, స్పందనతో
స్పందన కరువయితే భాష తెలిసినా
మనసు జడిమలో చేతన చూప లేదు

రవి కిరణం ఉపయోగం! దృశ్యం చూపడమే
చూపు ఉన్నా, కోరికతోనే విషయం తెలిసేది
మనుషుల మధ్యన ఎత్తుగ గోడలు ఉంటే
ఆవల ఉన్న దృశ్యం ఈవలకు ఎట్లా కనిపిస్తుంది

ఉదయ ప్రభకు మంచు కరగి కదలి నట్లు
ఆగని స్వచ్ఛమైన ప్రేమ జలంలో
నెత్తురు చుక్కలు కలిసిన నిజాన్ని
సాయం సంధ్యా చిత్రం చూపుతుంది

అడవిలో చిందిన నెత్తురు చుక్క నుండి
పూచిన నిప్పు పూలతో సంతోషం ఎవరికి?
ఇది మనిషిలో ఏ ఖాళిని పూరిస్తుంది?
సరికొత్తగ సమాజానికి పుటలను చేర్చేనా?

సమ భావం సమ న్యాయం మానవతను సాధించే రణంలో
మనిషి కెదురు తీర్చి మనిషి! మారణ వ్యూహాలలో

వాద వివాదాల అగాధాలలోకి జారి మనుషులు
పరస్పరం హననంలో క్షతులు హతులు ఘర్షణలో
విడిచే ఆయువు సూత్రం మరొకరి కందే వీలు లేదు
పొందే వేదనను మరొకరికి మార్చే వీలు లేదు

కనుల ముందే రహస్యం చీకటి ముఖంతో
ముందు ఉంది! గోయో! నూయో? తెలియని స్థితిలో

పూసిన రంగులతో ఎవరి కార్యాచరణం వారిది
ఎవరి ప్రమేయమయినా, మార్పుకోసమనే! చెప్పడం
వికెట్‌ను పడగొట్టినట్లు మనిషిని హత మార్చేరా?
తన ఆశను మరొకరిలో నాటి, దాని ఫలితం పొందేరా?
తన దార్శనికం ఏ రంగులో విధంలో పథంలో ఉన్నా
సమస్య నుండి బయట పడేది మానవీయ ప్రజాస్వామ్యంతోనే!

స్వేచ్ఛా కవిత్వం-88

ఇది జీవితం

(XIII భాగం)

సమయ పథం

మాదిరాజు రంగారావు

2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 88

IDI JEEVITHAM

(XIII Part)

(SAMAYA PADHAM)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2018

Presented to
my wife
Smt. Indira

పీఠిక

"ఇది జీవితం" బృహత్కృతిలో పదమూడో భాగం "సమయ పథం". ఆయా భాగాల్లోని వస్తువు విషయం అభివ్యక్తి ప్రగతి గమ్యం దార్శనికం గురించి ఆయా పీఠికలలో సూచిత మయినాయి. ప్రతి దార్శనికం (Ideology)లో అప్పటి పరిస్థితుల్ని బట్టి ఏదో కొరత లోపం దోషం అప్పటికి ఉపయోగపడని విధం అనుభవానికి వస్తుంది. దీనితో మరొకటి చోటు చేసుకుంటుంది. ఈ దేశంలో జీవన విధానం సంస్కృతి ప్రజల ఆలోచనా విధం – అవసరాలు ఉన్న స్థితులు కోరే మార్పులు లక్ష్యంపై దృష్టితో సామ్యవాద రేఖలతో ప్రజాస్వామ్యం మేలని తలచేవాణ్ణి. ఇది స్వేచ్ఛా కవిత్వానికి దిశా నిర్దేశక మయింది. మానవీయ భావనతో పథ ప్రదర్శకతను పొందింది. ఏ ఆదర్శమయినా ఎన్ని చెప్పినా ఏ మార్పుకయినా ఏ సుస్థితి కయినా మనసు వహించే పాత్ర అనితరమయింది, ప్రధానమయింది. ఇదీ బాహ్యం (external)తో పాటు ఆంతర (internal) మైన స్పందన వివేచన ప్రకాశంతో కూడిన అంశాన్ని భావింప చేస్తుంది. ఈ రెండిటి సహభావం మనిషిలో పూర్ణతకు విజయానికి అవకాశం కలిగిస్తుంది. కవిలో రచనకూ ఆదర్శానికి మధ్య ఐక్యత అవసరం. రచనకు ఆకర్షణతోపాటు సామాజిక ప్రయోజనమూ సిద్ధిస్తుంది.

మొత్తం మీద ఈ కృతి భౌతిక మానసిక స్థాయిల్లో సమన్వయంతో, వ్యక్తిలో నిబద్ధత నుండి సామాజిక తత్పరతకు అవకాశం కలిగింది. ఆధునిక తెలుగు కవిత్వ పరిణామంలో ప్రయోజనయుతమైన వికాస రూపాన్ని పొందిందీ స్వేచ్ఛా కవిత్వం.

కవిత్వం మనోభావ మయమైందీ, యథార్థ సదృశమయిందీ. మొదటిది అనుభూతికి చెందింది. స్పందన కారణమైంది. రెండోది జీవితమూ – సమాజమూ చోటు చేసుకొన్నది. ఇది హేతువుకు అందినట్లు ఉంటుంది. ఒకపుడు అతీతంగానూ అనిపిస్తుంది. అనుభవంలో ఉన్న జీవితమే, భౌతిక మానస తలాలపై వివేచన కందుతుంది. అందువల్ల రెండూ అవసరమే.

ఆధునిక కాలంలో స్వేచ్ఛా కవిత్వం ఇప్పటి సమాజ స్థితులకూ మానవ మనస్తత్వానికీ మానవీయ చింతనకూ చాలా సన్నిహితంగా వెలువడుతూంది. ఇది వైవిధ్యాన్ని విస్తృతిని పొందుతూంది. "ఇది జీవితం" – బృహత్కృతిలో వివిధ దృష్టి కోణాల్లో విషయ విశేషాలతో అనుభవానికి వస్తుంది. కవిత్వం యొక్క నిర్వచన పరిధులు పెరగడాన్ని సులభంగా గుర్తించవచ్చు. పలు అభిప్రాయాలకు అవకాశమున్న స్వేచ్ఛా కవిత్వం, ఈ సందర్భంలో ప్రజాస్వామ్యం – దార్శనిక (Ideological) పాత్రను వహిస్తూంది. ఇదీ దీని విశిష్టత.

ఎప్పటికప్పుడు పరిమితుల్ని గుర్తిస్తూ అడ్డంకుల్ని ఛేదిస్తూ విస్తృతిని పొందడం జరుగుతూంది. ఈ విధంగా స్థానికం నుండి విశ్వమయం కావడం గమనించవచ్చు. కవికి ఇష్టమైన ఏ వస్తువునయినా సరే కవితామయం చేసే ప్రతిభకు తలుపులు తెరుస్తూందీ, స్వేచ్ఛా కవిత్వం, ప్రత్యేకతను ఆలోచనలో నిలుపుతూంది, వివేచనకు సంపూర్ణతను సిద్ధింప చేస్తూంది. "సమయ పథం" పేరు సమాజ దృష్టితో తగినదీ, తప్పనిదీ అయిన కాల ఖండం, విజయ భావనతో ప్రజాస్వామ్య సంకేతం. వస్తు భావ ధ్వని సూచన కలిగిందీ.

– మాదిరాజు రంగారావు

ఇది జీవితం – సమయ పథం
(13వ భాగం)

1.

ప్రాంతం విభజనతో దేశం సరిహద్దులతో
కవి అస్తిత్వం ముడివడినా అదే చివరి మాట కాదు
విభేదాల గోడల మధ్య నిలిచి పోదు
అవకాశంతో ఎగిరి విశ్వమయమవుతుంది

తల్లి హృదయం తండ్రి మేధ ఈ రెండిటి
సమాంతర రేఖలపై జీవన గమనం మొదలు!
పలు విభాగాలతో సమాజ వాహనం పయి
పొరలుగా స్థితులు, శ్రేణులుగా అంతస్తులు

అందరూ భాగస్వాములే! అందరికీ అవకాశం
ఎవరికయిన నిరాకరణం దారుణమే కాదు, అమానుషం

తన నెవరో దూరం విసరిన భావం న్యూనతయే
సమాజంలో చోటు లేదనుకోవడం నిరాశతోనే!

కులం మతం ప్రాంతం భేదాలన్నిటిని ఇముడ్చుకొనీ
ప్రజాస్వామ్య మొక సమాజ ప్రయోగ శాలా రూపం

మనిషితో మనిషి అనుభవం పరిచయంతో మొదలయి
నలువైపుల విస్తరించి, ఆలోచన పెంచుతుంది
మానవీయ గుణ పార్శ్వాలను చూపిస్తుంది,
వ్యక్తి అసలు చిరునామా, చేసే పని రూపమే!

కొమ్మకు అందం మనిషికి సంతోషం కలిగించే పూవు
రాలుతుంది, దృశ్యం మారుతుంది, శూన్య మేర్పడుతుంది
సమయ సమయం మార్పులతో మానవ జీవితం
పైకి ఎదిగితే సంతోషం, కిందికి దిగితే విచారం

మనిషికి తన గడ్డపై ప్రకృతి ఉత్సాహం ఇస్తుంది
ఉన్న స్థితితో సమాధాన పడ జేస్తుంది

చేతులున్నది గోతులు తవ్వడానికే కాదు
విత్తులు నాటడానికీ మొక్కలు పెంచడానికీ
వెలుగులో నీడ! మనిషి నంటి పెట్టుకొనీ
ఉంటుంది భద్రత నిస్తూ, ధైర్యం నిలుపుతుంది

2.

మనిషిలోని సృజన ముఖం చూడాలని కోరిక
బ్రతుకులోన రస హృదయం తాకాలని కోరిక
పగలంతా వెలుతురు తెరపయి
నీలి ఎరుపు రంగుల బొమ్మలు

రాత్రి వేళ చీకటి తెరపయి
తెలుపు ఎరుపు రంగుల బొమ్మలు!
కాలం గడుస్తుంది ఏదో ఒక పనిలో
తీరిక లేనట్లు ఉంటుంది, ఒక నిదురలో తప్ప
అందులోను కలల బొమ్మలతో నయితే
సృజన ముఖం కనులు విప్పేదెప్పుడు?

అనుమానం కంటకమై మొనలు గుచ్చుకునేను
సందేహం అనల కణమై బాధకు గురి చేసేను
పక్షుల వలె కోర్కెలు పై కెగిరితేనే ప్రయోజనం
నేలపైన మొక్కల వలె ఎదిగితేనే ఉపయోగం

పూలను పండ్లను నీడను ఇస్తుంది చెట్టు ఎదిగి
విలువయిన క్షణాలు కొన్ని కలల బుట్టలో చేరేను
సమయం శూన్యమైన పాత్రకాదు, ఏష్ ట్రే అసలు కాదు
ఇది వాస్తవాను భవంతో! వర్తమాన కలశం!

తగల బడుతూన్న అడవి! కలలో
మనసులో కోప రహస్యాన్ని బయట పెడుతుంది
మెలకువతో దృశ్యం! అదృశ్యమయిపోతుంది
జలధిలో పడవల వలె దూరమయి పోతుంది
పడవలలో ప్రయాణం చేయాలనిపించవచ్చు!

గాలిలో మబ్బుల వలె పైన తేలి పోవాలనిపించవచ్చు
మబ్బులపై విహారం సలపాలనిపించవచ్చు
జరిగిన ఘటనల పరిచయం చూపుతుంది ప్రతీకలో
మెలకువలో దీనికై అన్వేషణ సాగేనా? సాగదు
మరపున బడవచ్చు మళ్ళీ కలలో కనబడవచ్చు

3.

ఉషస్సు తొలి కిరణంలో కవితలో మొదటి పంక్తి
ఆశా హృదయంతో ముందుకు నడిపిస్తుంది
ప్రజలకు సందేశంతో మాట వెడలుతుంది
తూణీరం నుండి సంధించిన బాణంలా ముక్తమై
లక్ష్యం చేరేందుకు వేగ మందుకుంటుంది
ఏదో ఆయుధాన్ని మనిషి! వహించని యుగం లేదు

సమూహాల్ని హతం చేసే సమాజాన్ని బాధించే
బాంబులా కాక, ల్యాడ్‌మైన్‌లా కాక!
గుహలో చీకటిలా కాక మనిషి మనసు
తూరుపు దిశలో ఉదయం వెలుగులా అవసరం

పూచిన పూవులా కొత్తదనం పరిమళంతో
మనిషి నుండి మనిషికి సందేశం అందిస్తుంది

చుట్టు ఇనుప కంచె నాటినా ఆగదు
ఎత్తుగ రాతిగోడ నిలిపినా ఆగదు
అవరమయితే కొత్త బ్లేడ్‌లా సరిస్తుంది
సూర్యుని మేల్కొల్పుతుంది రాత్రి నుండి, సంకల్పం!

సమాధి నిర్మాణం ఎరగదు, జీవితం
ఏ వస్తువుతోనో కట్టిన నిలయం కాదు
ఇది సజీవ స్పందనతో మనోమయం
తన కాళ్ళపై ముందుకు నడుస్తుంది
తన చేతులతో అన్ని పనులు! చేస్తుంది
సందేహం లేకుండా! సంకల్పం నడిపిస్తుంది
హృదయంతో మాట్లాడే సుందర సృజన స్వరం
శిలామయం కాదు, స్వప్న సమం కాదు అయోమయం కాదు

చరిత్ర పుటలెన్ని తిరగ వేసినా
మనుషుల మూల గుణాలొకటే
స్థితులు వేరు కావచ్చు పాత్రలు దుస్తులు వేరు కావచ్చు
సృజన బిందువు ఒకటే, రేఖా చిత్రాలు వేరు

4.

గాలి బహు సామాన్యమైంది, స్వేచ్ఛకు సంకేతం
మిక్కిలి అవసరమైంది, ఊపిరి రూపంలో బ్రతికించేది
నెమలి ఈకలా ముఖాన్ని స్పృశిస్తుంది
పారావతం రెక్కలా శరీరాన్ని తాకుతుంది

ఒంటరిలో ఆప్యాయంగా మందిలో ఉత్సాహంగా
ఎక్కడి నుండో సుగంధాన్ని అందించి వెళుతుంది
అపుడపుడు ధూళి ధూమం తోనూ రావచ్చు
ఇది క్వాచిత్కం, సమాజ స్పృహతో వర్తిస్తుంది

నిలిచినా కూర్చున్నా నడచినా వీడని
ప్రాణ బంధంతో స్పర్శా మాత్ర రూపం
కష్టంలో మిత్రంలా ఓదార్చే స్పర్శతో
చీకటిలో వెలుగులో ఒకే తీరుగా
నిద్రలో కలలో మెలకువలో ఒకే విధం
ప్రాణంతో సహభావం, వివిధ స్థాయిల్లో

ఉచ్వాస నిశ్వాస క్రియలో ప్రాణ శక్తి ప్రసారంతో
జీవన చలనానికి సరికొత్తగ ప్రేరణ చేకూర్చేను
నెరవేరని కోరికల్ని గాలి మోసుకపోతుంది
నెరవేరే కోరికల్ని గమ్యం చేరుస్తుంది

స్థితికి సందర్భానికి తగిన విధంగా
లేంది! ప్రాణులన్ని జడమయాలవుతాయి

ఆపదలో అమ్మలా ముఖం నిమురుతుంది
ఆలోచనల మూటను విప్పి పంచుతుంది
ఇది మానవ జీవిత సూత్రానికి వ్యాఖ్యానం
సక్రియలో శరీరాన్ని సజీవంగా నిలుపుతుంది

జననం నుండి సమాప్తి వరకు ఒకే విధం
చలనంలో లయతో సరణంలో నాదంతో
ఎవరో వచ్చి తలుపు తట్టిన శబ్దం!
వెళ్ళి తలుపు తెరిస్తే! ప్రాణ మిత్రం! పవనం!

5.

ఇంటి గోడ అయినా కోట గోడ అయినా
శబ్దంతో నిండిన గది అయినా
నిశ్శబ్దంగా నిలిచిన క్షితిజ మయినా
ఖైది గదిలోను వెలుగు లేని గుహలోను
తీపి కబురుతోనో చేదు నిజంతోనో
వార్తాహర బాధ్యతల్ని నిర్వర్తిస్తుంది - గాలి

ఆకు అయినా అల అయినా
ఒకటే! గాలికి కదలికలో
గాలి ఉన్న చోట స్వేచ్ఛ
బ్రతుకు ఉన్న చోట కవిత

అనుభవంలో వర్తమాన చలనంలో గాలి
ప్రాణం నిలుపుతుంది! కాలాన్ని నడిపిస్తుంది
గతం జోలికి పోదు, గాలి
దీని నంటుకొని భవిత! నిరీక్షణలో

కన్నీరు తుడుస్తుంది దీన బంధువయి
వేదన తీరుస్తుంది మెత్తని స్పర్శతో

ఇది కల్పన కవకాశం లేని వాస్తవానుభవం
అందరికీ అవసరం, అందరితో సమంగా
ఎవరూ పిలిచే అవసరం లేదు, తానే వస్తుంది
ఆతిథ్యం కోరదు, బాధ్యత నిర్వర్తిస్తుంది

ప్రతి పాత్రకు అవకాశం కల్పిస్తుంది స్వేచ్ఛ
ప్రజాస్వామ్య భావనలో మనిషి మనిషికీ ఉపకృతి

స్వేచ్ఛ ఉన్న చోట గాలి నిరంతరం వీచేను
కొమ్మపై పక్షి ఎగిరే! ఆలోచన చేసేను

భౌతిక మానస స్థాయిల్లో స్వేచ్ఛ! సుందరమైన అవకాశం
ఆలోచన నదిలా సరిస్తుంది
హృదయం పుష్పంలా వికసిస్తుంది
గాలి ఆడితేనే! మనిషి బ్రతికి ఉన్నట్లు!

6.

ఈ నేలపై నుండి చంద్ర యానం వరకు
దశలు దశలుగా మనిషి! ఆరోహణ క్రమం
ఎంతటి వికాస విస్తరణ ప్రభావ సంపదలోనూ
ఇంకా క్షుద తీరని దరిద్ర జన సందోహం!

గ్రీష్మం తాపంతో వీరం, వసంత స్పర్శలా ప్రేమ
వాన చినుకులా కరుణ, శీత భావనతో శాంతం
రుతువు లన్నిటి సంపుటియై జీవితం!
ఏక కాలంలో వివిధ ప్రభావాల సంగమం!
తలుపులు వేసి ఉన్నా కిటికీలు మూసి ఉన్నా
ఏలాగో! సందు చేసుకొని ప్రవేశిస్తుంది గాలి!
నిలయంలో మనిషిని పలకరిస్తుంది
స్వేచ్ఛ లేని మనిషిని కాపాడుతుంది
ఉక్కిరి బిక్కిరి అయ్యే మనిషికి ఊరట
జటిల సమస్య నుండి బయట పడినట్లే!

అర్ధరాత్రి వీధిలోకి వచ్చిన మనిషిపై
అనుమానం! తాడులా చుట్టుకుంటుంది
ఏ దొంగో! హంతకుడో! నేరం చుట్ట బడీ
కదల నీయకుండ కాలం స్వేచ్ఛను హరిస్తుంది

చీకటి నేపథ్యం ఏమోమో ఊహింప జేస్తుంది
స్వేచ్ఛ పేరుతో నేరానికి దారులు వెదకేనా?
నిర్బంధంలో మనిషి నిజం పలికేనా?
ఏ మాటకు ధ్రువీకరణం లభిస్తుంది?

చల్లని సుఖ వాయువు తాకి నిజం పలికించేనా?
శాంతమైన మనసులో నిజం ప్రతిఫలించేనా?

ఏ రోజు కా రోజు! పూర్తి కాని ఉత్తరంలా
పోస్టు చేయబడని స్థితిలో ఉండిపోతూంది
రాసులు రాసులుగా సమస్యలు సందేహాలతో
గతంతో కలిసి! పెద్ద ప్రశ్నగా! మిగులుతూంది

7.

ప్రతి జీవిత మొక మినీ ప్రపంచంతో సమానం
ఇది భౌతిక మానస వస్తు భావ సంచయం
పని చేసే చేతుల్లో బంతిలా ఎగురుతుంది
నడచే అడుగుల నంటి నదిలా సాగుతుంది

దీని లోతు ఎవరికి తెలియని రహస్య నిలయం
ఎత్తు పల్లాలతో మలుపులతో సుందరంగా
ఇది ఎక్కడ ఆగితే అచటి నుండి ఎడారి!
బద్దె గీసినట్లు! ఆపై క్షితిజంలో అదృశ్యమవుతుంది

అలల అలజడులతో చుట్టు సమాజ సముద్రం
చిన్నపాటి కలహ దృశ్య స్థితులు లేకపోలేదు
పురా ప్రదర్శన శాల లాంటి మనసులో
ఆ వస్తువుల్లో ఒకటయి మరుగున పడిపోవచ్చు
మేల్కొన్న క్షణాలు అన్నిటిని వేరు వేరు చేసి
వర్తమాన దృశ్యానికి విలువలు చేకూర్చేను

ఎండిన శాఖలతోను అపుడపుడూ దయనీయ జీవితం!

పూచిన చివురులతో కమనీయమైన తరువులా

క్షణాలు హారంలో మణుల్లా ఆకర్షించవచ్చు
పుట్ట నుండి ఎగసిన పాము పడగలా తోచవచ్చు
ఎపుడేది జరిగేది తెలియని దయి జీవితం
తెలసుకునే యత్నంలో అన్వేషణ! విజ్ఞాన పథం!
తెలిసిన దేదీ సమయానికి పనికి రాకపోవచ్చు
అవసరం! అన్నిటిపై ప్రభుత నెరప జేస్తుంది

ముళ్ళు లేని కాలిబాటలో ఆగకుండా
పూల కార్పెట్‌పై నడచే కోరిక!
ఎప్పటికీ నెరవేరని, వాస్తవానుభవం
అనల శిఖలపై నుండి, దారిలో
పూల వంతెనపై దాటాలని కోరిక!
ఎప్పటికీ భద్రంగా మనసులో అమూల్యం!

8.

ఇపుడు ఉన్న చిరునామ రేపు ఉండక పోవచ్చు
ఇపుడు ఉన్న బ్రతుకు తీరు రేపు లేకపోవచ్చు
ఎన్ని సమస్యల్ని ఎదుర్కొని దాటుతూ పోయినా
ఎప్పటికీ! ఏదో మిగిలే ఉంటుంది, అది తనదే

చెట్టు నీడకు రాగానే కను రెప్పలు వాలతాయి
తల్లి ఎదకు చేరగనే కళ్ళు మూత బడినట్లు
విరామ సమయంలో రాత్రి తమకు తెలియకుండా
కష్ట జీవుల కను రెప్పల తలుపులు మూతబడతాయి

కాలం సులభంగా వేగంగా మనిషిని నడిపిస్తుంది
నీటిలో మునిగి పైకి శుభ్రంగా తేలినట్లు ఉంటుంది
దారిలో అక్కడక్కడ నాటబడి ఎదిగిన చెట్ల వలె
ఏ స్థితిలో ఏ సమయమయినా నిద్ర అతిథి పాత్రలోనే

ᔓᔐ

నిశ్శబ్దం ఎదురవుతుంది వాతావరణ దర్పణంలా
మనిషిలో స్వచ్ఛమయిన మనిషిని ప్రతిబింబిస్తుంది

జన్మ నుండి బ్రతకాలిసిన బాధ్యతలోని శక్తిదే
విత్తు ఒంటరి అయినా క్రమంగా వనంలో భాగమవుతుంది
విత్తులో దాగిన కల్పనా ప్రపంచం మారి
చెట్టులో వాస్తవ ప్రపంచాన్ని పొందుతుంది
తాను ఉన్న ప్రపంచం తోనే పని ఎవరికయినా
లేని ప్రపంచంతో బంధం, ఎండ మావియే

చూచే కోణాలు వేరు వేరు కావచ్చు
పొందే అర్థాలు వేరు వేరు కావచ్చు
వస్తువు ఒకటే! అది మానవం
ప్రతి విషయంలో ఆలోచన వడగడుతుంది

కనిపించిన మనిషితో మాట మొదలు కాగానే
మౌన ముఖం దీపంలా వెలుగు చూపుతుంది
మనసు లోని ఊహలు! ఏ రంగు రేఖలతో
సమాజ చలనంలో ఏ పాత్రను వహించేదీ!

ᔓᔐ

9.

ఈ లోకంతో పరిచయం విస్తృతమయ్యే కొద్దీ
మరో లోకం గురించి ఊహ వెనక బడుతుంది
పెద్ద కోట గోడ! కంటికి నిండుగ నిలచీ
పోరాడే వ్యూహం మెదలేను, పటిమను పెంచేను

ఇపుడున్న రణం తీరు, నీతి పదం వేరై
వైరి ఎదుట లేకుండానే, యుద్ధం మొదలవుతుంది
తల పడే ఆటలో ప్రతి బంతి గురించి
చర్యలో వివాదాస్పద మవుతూంది! పోటీ!

అడవిలో పడి ఉన్న శిల! పునాదికి పనికి రావచ్చు
ఏ విగ్రహాన్నో చెక్కేందుకు సరి పడవచ్చు
అవసరంతో మనిషి తగిన సందర్భం కయి
ఎదురు చూడవలసి ఉంటుంది! ప్రతి విషయంలో

ఆకులవే! పూలు అవే! రంగులో అందంగా
పండ్లు అవే! రుచిలో చెట్టు బ్రతికినంత వరకు
మనిషి ఊహ చర్య మారుతుంది ఎన్ని మారులో
చూచే వారికే కాదు! తనకూ తెలియకుండా!

మనసు అనేది ఒకటి ఉన్నందుకు
బ్రతుకులో స్థిరత అనేది మారుతుంది
తనలో ఆశల హద్దులు మారడంతో
బ్రతుకు విధం మారుతుంది, నడత మారుతుంది

మనిషిలో దాగిన మనిషి రూపం తెలిసేందుకు
తనలో అన్వేషణ సాగుతుంది తనకు తెలియకుండా
ఇది ముందుగ తెలిస్తే! బ్రేకు లెన్నో పడతాయి!
తనలో రూపొందే లోకం తెలియక పోవడం విచిత్రం!

మనిషి నీడ పయి, కత్తి వేటు విజయం సాధించేనా?
దహన గుణంతో మనిషి వీర విభవం పొందేనా?
దాహంలో ఎండమావి ఆకర్షణ ఎప్పటిదో?
ఇంద్ర ధనుసు నలంకారంగా, పొందే కోరిక ఎప్పటిదో?

10.

శ్రమ చేతనతో వికాస పథంలో
ఒక సుందర స్వప్నాన్ని పొందే ఆలోచనతో
తాపంలో జారే శ్రమ బిందువులో
వెలుగు కన్న చీకటి రేఖయె కనిపించేనా?
తమ భవితకు ఇంద్ర ధనుసు శకలం చూచేరా?
ఒకరి కెదురుగా ఒకరు! ప్రతి సమాజ దశలోనూ

నిశ్శబ్దంగా ఉన్న కుటీరంలా స్వప్నం
మేల్కొనగానే! ఏదో ఊరట కలిగించేను
ఆశా గ్రంథంలో పుట విప్పారేను!
మోదమొ! ఖేదమొ! పుటలో శూన్యమో!

భూమిపై పడిన శ్రమ బిందువు
చిరు మొక్కకు ఆధారం కావచ్చు
అదే! అనల కణమై అంటుకొనీ
దుర్ఘటనకు దారి తీయవచ్చు
ఇదొక! హెచ్చరిక కావచ్చు నిరసన కావచ్చు
ఘర్షణకు దారి తీయవచ్చు! హక్కును! తలపించవచ్చు

శ్రమ శక్తిపై విశ్వాసం మనిషిలో
చీకటి నుండి వెలుగుకు నడిపించవచ్చు
ఆకలి తీర్చడమే కాదు! మనిషికి
సంపద విభవానికీ దారి తీయవచ్చు
అస్తమయ మెరగని సూర్యునిలా
జీవన కిరణాలతో శ్రమ బింబం
సమాజ చలనానికి యంత్ర బలం ఇస్తుంది
చరిత్ర పుటలో శీర్షిక మారుస్తుంది

తగిలిన గాయం నైతిక బలంతో
వ్యక్తికి గల హక్కును నిలబెడుతూంది
ఇంద్రావతీ పరీవాహక ప్రాంతంలో నెత్తురు చుక్కలు
నేలపై! నీళ్ళలో ఎదురుగ ప్రశ్నల మంటల్ని నిలిపేను

11.

కవి మనో వేదిక పైకి చేరని విషయం లేదు
బొమ్మల వెనకనే చీకటి పొంచి ఉంటుంది
వెలుగు చీకటి ఏది ఎక్కడ ముగిసేదీ తెలియదు
సందేహంలో మనిషి బ్రతుకు క్షితిజంలా!

దేనికీ వేదికపై నిషేధం లేదు,
అన్నిటికీ స్వాగతం! హృదయ పూర్వకంగా
హతులు హంతకులు పీడితులు పీడకులు గురించి
స్పందనతో కవి హృదయం! వార్తా నిలయమవుతుంది

మంచి చెడు హరిణం సింహం ఆకృతులు
విరుద్ధ ముఖాలతో తారు మారవుతూ! కనిపించేను
వీటి మధ్య సన్నని భేద రేఖ! అందరికీ తెలియదు
వెదకే మతికి, కవికి మాత్రం తెలిసే రహస్యం!
అందరినీ అన్నిటినీ అక్షర పంక్తిలో నిలుపుతుంది
కవిత! ఒక సుందర మానస ప్రపంచంతో

ఎంతటి దీర్ఘ ప్రసారంలోనూ వెలుగుకు
ఎక్కడో! చీకటితో సరిపెట్టుకోక తప్పదు
తప్పని చీకటిలో! స్నేహమయంగా దీపం
ఏకాంత రూపాల్ని విశ్వమయం చేస్తుంది

మౌనంలో హృదయ క్షోభ ఎవరికి వినబడుతుంది
మాటలో గుండె లయ ఎవరికి వినబడుతుంది
నచ్చిన దయినా నచ్చని దయినా రెండిటి సమన్వయం
వస్తు గుణాన్ని బట్టి ఒక కవితలోనే! జరుగుతుంది

దేశమయినా ఊరు అయినా మనిషి అయినా ప్రేమ
మానవ కాసారంలో విరిసిన కమలం, విమలం
దేని కెంత విలువో దానికంత స్థానం బ్రతుకులో
దృష్టి పడకపోయినంత మాత్రాన! ఏదీ లేకుండా పోదు!

స్వప్నం వెనక నున్న కోరిక! మెలకువలో ఏదైనా కావచ్చు
ఎగిరే పావురమో? నిలిచిన ఆయుధమో! కవితలో రెండూ!

12.

జంతువు అరుస్తుంది, అవసర సమయంలో
జలధి హోరు వినిపిస్తుంది అవిరామంగా
వీచే గాలికి చెట్టు రివ్వున శబ్దిస్తుంది
స్పందన స్పృహ లేని శిలలు! నిశ్శబ్దంగా

మనిషి పిలిచేను మాట్లాడేను ప్రశ్నించేను
అన్వేషణలో విభేదించేను తిరస్కరించేను నినదించేను
మాటలో వరమూ శాపం రెండిటికీ అవకాశం
స్తంభంలా నిశ్శబ్దంగా ఉండలేని ప్రాణి మనిషి!

కవి మనోజగం నుండి అక్షరాకృతిలో
ఆత్మ గౌరవ మనేది అలంకారం కారాదు
నిజ జీవన రూపంలో భాగమై పోవాలి
ఆవశ్యకత ననుసరించి మనో విధంలో మనిషి
కింది నుండి పైదాక ఎన్నో అంతరువులతో

మనిషిని గాయ పరచే తీవ్రమైన స్థితిలో
ఉద్రేకంలో 'నిజం'! అణగి మణగి ఉంటుంది
బావిలో జారిపడిన వస్తువులా కనిపిస్తుంది
నీళ్ళ నుండి చేదతో పైకి తీసే గరిగ అవసరం

చీకటిలో వస్తువును గుర్తించే టార్చ్‌లైట్‌లా
మనసును ఉపయోగించే వారు! కొద్ది మంది!

తన భవిత పయి చీకటి చేయి పడీ
ముందుకు కదలని స్థితి ఏర్పడవచ్చు
తనలో ఉన్న టార్చ్‌లైట్‌ను మరచి
వెలుగుకై పిలుపులు అరపులు కేకలు! చిందులు

ప్రజ మనసుకు ఓటు విలువ తెలిస్తే
వెలుగు దారి కనిపిస్తుంది పయనం తన వంతుగ
బాధ్యత తెలిసిన పౌరుని కర్తవ్యం!
ప్రజాస్వామ్య సమాజానికి! ఆధారం

13.

చుట్టు అవకాశాలతో నలు దిశల మధ్య మనిషి
"టు బి ఆర్ నాట్ టు బి" అన్న ప్రశ్న ఎదురుగ వేలాడుతూ
ఒకరి సమస్యతో మరొకరి సమస్యకు సంబంధంతో
ఒకరి బ్రతుకుతో మరొకరి బ్రతున కను బంధంతో

"నేను" జీవితంలో సృజన కేంద్రం
తాపంలో మంట లెగసి పడవచ్చు
పరిణామంలో జలదం లేచి కదల వచ్చు
భూమి తెరవబడీ జలధార చిమ్మ వచ్చు
అన్నిటికీ మనో రూపాలు! జీవన గమనంలో
కథలలో పాత్రలలో భద్ర పరచబడేను

అనుభవంలో తల్లులు భార్యలు బిడ్డలు పెద్దలు
సామాన్యులు నేతలు తమ తమ వ్యక్తిత్వాలతో
ప్రాంతం దేశం భాష తమకు తెలియక పోయినా
హృదయ మున్న వారికి విశ్వ భాష తెలుస్తుంది

అలలతో కదలుతూ హద్దులలో సహన సముద్రం
తుపాను చర్యలలో బీభత్స దృశ్యాలను వదలుతుంది
హ్లాదంతో మెరసే కళ్ళ నుండి
కోష్ణ బాష్ప బిందువు లొలకవచ్చు

మాట కాలాన్ని వేగిర పరుస్తుంది
పాట కాలాన్ని పరుగెత్తిస్తుంది
కాలం మనిషికి ఏదో ఒక వాహనమై
దుర్గమాల్ని దాటిస్తుంది, పయనం సాగిస్తుంది
మనస్సు కాలాన్ని కాసేపు నిలుపుతుంది
ఉషస్సు కాలాన్ని మేల్కొలుపుతుంది

సృజన శక్తి చలన గుణం ఉన్న మనుషులు
ఆకులు లెక్క పెడుతూ చెట్టు క్రింద కూర్చోరు
స్వప్నంలో గడిపే ప్రతిమ కాదు మనిషి
మనో జగంతో సమాజ చేతన బింబం

14.

కాలి క్రింద చీమల్ని నలిపేసే దెవరు?
పూల బ్రతుకుల్ని చిదిమేసే వారూ ఉన్నారు!
సమూహాన్ని చూస్తే మనసు చిన్న సముద్ర మవుతుంది
వ్యక్తిని చూస్తే మనసు మేఘుమయి కదలుతుంది

వేడెక్కిన సముద్ర జలం! మేఘుమై తరలుతుంది
ఇది కవిత్వ రహస్యం ముడిని విప్పుతుంది

ఉదార జల స్పర్శతో మేఘుం
భూమిపై ప్రాణిని ప్రకృతిని పలకరిస్తుంది
చిరు జల్లులతో కబుర్లు చెబుతుంది
భూమిపై ప్రేమను ప్రకటిస్తుంది
లోకానికి తనపై విశ్వాసం పెంచుతుంది
స్వాగత హృదయంతో మనిషి ప్రీతి కనబరచేను
"అన్నం పరబ్రహ్మ"మన్న మాటలోని
యథార్థాన్ని సార్థక పరుస్తుంది

మనిషికీ మనిషికీ మధ్య శూన్యం అంతో ఇంతో
జీవన చలనంలో దృశ్యంతో నిండుతుంది
శిలా స్తంభంలా నిలిచే కన్నా వ్యక్తి
బాణంలా దూసేందుకు సిద్ధపడేను

గాయ పరచే చేతులు ఆమోదకరం కావు
గాయ పడని దేహం ఉండేనా? ఉండదు
గాయ పడని మనస్సు ఉన్నదా? ఉండదు
బాధను కలిగించే చేతలు! క్షంతవ్యం కావు

కావలసినది దొరక నప్పుడు మనిషి
మరొకరిని గాయ పరచి తృప్తి పొందేను

కావలసినవి దొరకుతూ నిరాశల్ని దాటుతూ
సుగమంగా సాగే బ్రతుకులో! మనిషికి
పని ఏముంటుంది? కబుర్లతో గడపడమేనా?
స్వేచ్ఛలో కాలాన్ని అలంకరిస్తూ పోవడమే?

15.

కుండ పగిలి మట్టిలో ఎపుడో కలిసేనని
ఇపుడు దాని వినియోగంలో కోరిక విడిచేరా?
చేతి కందే పచ్చ నోటు పొలం వెనక ఉన్న
శ్రమ విలువలు తెలిసే దాక కష్ట జీవికే!

వస్తువుకు రంగులా బ్రతుకులో కళ!
వాస్తవమూ కళతో! కవిత సృజన రూపం
అడుగులలో సమత నిలుపుకొనే వేగంతో
మాటలలో బంధుత జారిపోని విధంతో
కవిత! ఒక సుందర మానస ప్రపంచం
బయటికి! తప్పని దృశ్యమాన వాస్తవం

నగరంలో ఆవాస స్థలాన్ని బట్టి
పైపై నివాసం ఏకాంతాన్ని పెంచుతుంది
అవే గదులు! బాల్కనీ నుండి చూస్తే
విశాల భావనా జగత్తును దింపుతుంది

బయట స్వేచ్ఛ! చేతికందినట్లు ఉంటుంది
మనుషులతో అనుబంధం! అంతంత మాత్రం గానే
ఆకాశం చేరువలో ఉన్నట్లు అనిపిస్తుంది
విశ్వ హృదయ స్పందనం వినిపిస్తుంది గాలి!

భయ భావం వదలి భూమిపై
గగనంలో చరించ బోతున్నట్లనిపిస్తుంది
పొందినట్లు ఉండడం వేరు, పొందడం వేరు జీవితంలో
అంతలో ఖాళీ పొట్ట జేబు కలిసి భూమికి దింపుతాయి
ఆలోచన ఆకాశంలో తిప్పుతుంది
అనుభవం భూమిపై దింపుతుంది

నగరానికి ఆభరణం బ్రతుకులో అవకాశం
ఎవరికి సరిపోయేది వారికి లభిస్తుంది
ఆరోహణలో పోను పోను! సంతోషం పెరిగేను
మానవ సంబంధం తగ్గడమొక! తీరని లోపం

16.

ఎంతటి ఘోర మయిన పరిస్థితులలోను బీభత్సంలోను
ఇది తాత్కాలికమనీ! మార్పుపై ఆశతో మనిషి!
సామాజిక మయితే మనిషిపై మనిషికి నమ్మకం తప్పదు
వ్యక్తి, ఏ గగన విహారం చేసినా భూమికి రావలసిందే

ఆకాశం మేల్కొని వేయి కళ్ళు తెరవగానే
వేల వేల కిరణాల్లో ఆశా రూపాలు!
కాలానికి కొత్తవి విలువలు చేకూరేను
మానవ సంకల్పంతో! ఎవరి దారి వారిది

చల్లని గాలి కలుపుతుంది ఒకరొకరిని
వేడి గాలి దూరం చేస్తుంది ఒకరొకరిని
స్నేహ పరిమళంతో సమన్వయ మవసరం
ఇది జరిగే అవకాశం! సమరస భావంతోనే!

చీకటిలో వెలుగు కోరడం అసహజం కాదు
ఏవో పనులు! పిల్లల చదువులు! అవసరాలు
పైన ప్యాను తిరిగితేనే దేహానికి హాయి!
ఇవి సరిగా ఉంటేనే, బోధ మనసు కెక్కుతుంది

ఇల్లు ఊరుతో వ్యక్తికి సమాజ బంధం పెరుగుతుంది
మాటకు పని గమ్యంతో బ్రతుకులు రూపొందుతాయి
మనిషికి తన బుజాన ఆకాశం బరువు పడేననీ
మనసుకు తనలో ఒక పూల తోట ఉన్నదనీ

ఇంటి ఆవరణలో విరిసిన పూవు చూచి
మనసు స్తిమిత పడేను! ఒక దారికి వస్తుంది
పరిసరాలలో ప్రకాశ సుందరతలతో
ఆకర్షణ అనందం కయి ఆరాటం మనిషిలో
కృషితో క్షణాలు స్వర్ణమయం అయ్యేను
బూడిద ఊద బడీ, అనలం బయట పడేను
అదృష్టాన్ని తలపించవచ్చు, కర్మఫలం అనుకోవచ్చు
ఉన్నది మాత్రం! మానుష గుణ చర్యలతోనే

17.

కవిత అక్షరాకృతి పొందమొక సృజన కళ
ఎవరి రచన ఎట్లా ఉన్నా! కవుల స్పందన మూల మొకటే
బ్రతుకు బరువులో మనోవిధం ఆకర్షణ ఆదర్శం
కలిసిన రూపం మానవ చేతనతో చివురిస్తుంది

ఇది పలు రంగుల దారాల డ్రెస్‌లో కనిపిస్తుంది
మనుషుల అస్తిత లెన్నో! కవితలో పోకడలన్ని

కాల్చే అనల తత్త్వ మొకటే
కాలే వస్తువులు వేరు వేరు
పొందే అనుభవ గుణం ఒకటే
కవితల తీరులు వివిధం భిన్నం

ఎవరు ఉన్న స్థితిని బట్టి వారు రాస్తారు మాట్లాడతారు
ఒకరిలో సహనం పురోగమనం సమన్వయ పథం
ఒకరిలో అశాంతి తిరుగుబాటు కల్లోల జగం
ఇవి కలిసే చోటు ఒకటే! ఆదర్శ సమాజం

బొగ్గు కుప్పల వలె రాసులుగా నిరాశ దిశలలో
కాలే సిగరెట్ ముక్క విసరబడవచ్చు
అగ్ని చిత్రంపై ఒకరికి కోరిక ప్రబలవచ్చు
పరిసరాలలో వెచ్చదనం ఆశించవచ్చు

ఇది బొగ్గులో సుప్త చేతన! మేల్కొని
సమాజ చలనంలో మార్పు కోరి కావచ్చు

విశాలమైన మైదనంలో స్వేచ్ఛ నాప గలిగేదెవ్వరు?
ఇది తలుపులు కిటికీలు లేని విశాల రూపం

నిద్ర శరీరానికి సహజమైన అవసరం
"అక్కర ఉందా? లేదా?" అని కాదు, కలలు వస్తాయి
కలలో కలవరింతలు ప్రేరణ చిహ్నాలు కావు
పలవరింతలతో గడచే కాలం ఉపయోగం కాదు
బొగ్గు రాశిలా పడి ఉన్న నిరాశకు నిప్పంటుకొనీ
నిదురను వదలించేనా? మనిషిలో మార్పును తెచ్చేనా?

18.

స్వగతంలో మాటలు! ఆకాశానికి వినిపిస్తూ
నలు దిశలు స్పృశించాలని! గాలికి ఆవేగం
గాలి ఆగదు, ముందుకు పోతూనే ఉంటుంది
భూమి అయితే ఎంతో ఓపికగా వింటుంది

మనిషితో మనిషి మాట! అవసరాల కొద్దీ
ఆ వస్తూ పోయే మనుషుల చెవులలోనూ పడుతుంది

పెదవులపై నుండి మాట ఎగసి
పక్షి స్వేచ్ఛ కోరుతుంది, తన పయనంలో
మనుషుల పనులెన్నో! అన్ని విధాలుగా
అర్థాలను వదలుతుంది, గుర్తులు వదలుతుంది

ఉదయంతో కొత్త డైరి పేజి తెరవబడీ
వర్తమానం ముందు గతం వెనక్కి వెళుతుంది
పూవులా అలలా నిప్పులా కత్తిలా మాట
విరామంలో ప్రభావం సమీక్షకు గురి అవుతుంది

తిరిగే కాల చక్ర మదే, రుతువుల ఆగమన మదే
జీవన గతిలో అనుభవ దృశ్యాలు వేరు, మాటలు వేరు
యుగాల క్రితమయినా, తరాల తరువాత అయినా
వెలుతురు ఒకటే! పరిణామ దశలలో దీపాలు వేరు
చెట్ల ఆకుల సందు నుండి కిరణం, భూమిపై
నీడకు మాత్రం తన ఉనికి పట్ల భయం వేస్తుంది
నీడ ఎదపయి వెలుగు చుక్క వజ్రమై,
భూషణమయితే! అభ్యంతరం ఎవరికీ? ఉండనవసరం లేదు

కాలం సాగే సర్పం కాదు, ఎగిరే విహగం కాదు
కవితలో ప్రతి క్షణం భవిత కయి కొత్తదనం చివురిస్తుంది
అనుభవాల గుర్తులతో కాలం మనిషి మనిషిలో వేరుగా
ఆశయాలెన్ని విధాలో, అన్ని తీరుల అవకాశాలతో
మనిషి మనిషిని కలిసి మాట లాడడమొక ఆశా సంకేతం
ఎదురయిన ముఖంలో సరి కొత్త అర్థాన్ని నింపుతుంది

19.

అలజడి చేయి దాటి సంక్షోభంలో సమాజం
గాలి ఊయెలపై మంటలు ఊగేను
ఇది ఎవరికి ఇష్టం, ప్రీతికరం అంటే?
విధ్వంసం కోరే విలయ మతికి మాత్రమే

కవిత అంటే వేట కాదు, ఆట కాదు
గెలుపు ఓటముల నిర్ణయ లక్ష్యం కానే కాదు
తాపంలో ఎగసిన మేఘంలా ప్రాణాని కాధారమయి
మథనంలో తేలిన నవనీతంలా ఆయువు పెంచేదయి
కవిలో హృది సంవేదన చిహ్నం, అక్షర రూపం

ఏ స్థితినయినా పొందేందుకు సిద్ధమైన ఆదర్శం
సంక్షోభ నివారణ చర్యలపై దృష్టికన్న
ముందుగ జాగ్రతలో ఆచరణం ముఖ్యం
చలి గాలిలో వెలిగే సిగరెట్‌లా
మంచు పడిన ఆకుపై రవి రశ్మిలా
సమస్యకు సమాధాన మేదో! ఉండనే ఉంటుంది
ఇది నీటి బిందెలో శశి బింబం కాకూడదు

హిమ శిఖరం చంద్రుని వెన్నెలతో కరగదు,
దాహం తీరే జలాల ప్రసారానికి
అంతో ఇంతో తేజో కిరణ మవసరం
ఓజో గుణ పాలనతోనే సంఘానికి ప్రగతి

స్వేచ్ఛలో సమాజ చింతనతో జన వికాసం
వ్యక్తిలో నిరాశ భరించరాని వాస్తవమై
ఆత్మహత్యకు హింసకు పురి కొల్పవచ్చు
గతం వైపు కాక, భవిత వైపు వర్తమాన దృష్టి అవసరం

వెన్నెలతో కరచాలనం సహనాన్ని పెంచుతుంది
ఉదయంతో సహభావం ఉత్సాహం కలిగిస్తుంది
రాత్రితో పరిచయం సంస్కృతిలో తిప్పుతుంది
మనిషితో అనుబంధం! మానవ శక్తిని నడిపిస్తుంది

20.

చీకటి నిలవాలని ఎవరు కోరతాను?
ఇష్టం లేకపోయినా పరిస్థితులు కోరజేస్తాయా?
దీన్ని చీల్చుకొని బయటపడే సాహస కిరణం
సమాజ శ్రేయానికి అవసరమైన ఆయుధం?

అలలు ఎంత బలంగా ఎన్ని సార్లు తాకినా
ఒడ్డున శిలల్ని తొలగించలేవు, ఛేదించలేవు
గగనం తనలో పరచిన ఆశను
విశాల సముద్రంలో ప్రతిబింబిస్తుంది
మనిషికి తన రూపం చూచుకొని
మురిసే దర్పణం! సమాజ రూపం

చీకటి ఒప్పందాలు! గారడి ప్రదర్శనలు
మారే పాత్రలు, దుస్తుల మార్పులు, నటనలు
అమలు కాని నిర్ణయాలు, వంట పట్టని సూక్తులు
గాలి పతంగుల వలె మనుషులు! ఇక్కడే

సాగినంత మేర ప్రవాహం! ప్రయోజకంగానే
సముద్రంలోకి జారి ఉప్పు నీరులో కలవడం! విషాదం
ఎడారిలోకి తరలి సస్యశ్యామల భాగ్యం యథార్థం
అందని అదృష్టమై మనిషిని ప్రశ్నకు గురి చేసేను

నేను నీవు ప్రజ కోణాలతో సుందర నిలయం సమాజం
ఇది బొమ్మల రైలు విమాన యాన నిలయం స్టేషన్ కాదు
ఇది నమ్మకాల కల్పనల ప్రదర్శన లోకం కాదు
స్ఫుట నిశ్చయ నిర్ణయ మెక్కడుంది? ఎవరిలో?
అందరిలో అందీ అందని మిశ్రమ ఫల సంకేతాలే!
అనుమానం సందేహం మధ్య సర్దుక పోవడాలే!

సూర్యుణ్ణి చంద్రుణ్ణి ఆ వాహన చేసుకున్న కవిలో
ఏముంటుంది? వెలుగులు వెన్నెల తప్ప కవితలో
చీకటి ఎరగని వాస్తవమొకటే నిజ దృశ్యాలతో
శిలలపై నడచి భ్రమలు లేని మైదానం చేరినట్లు!

21.

ఏ రోజు కారోజు కొత్తగా
అక్షర పంక్తుల కిరణాలతో
సజీవ మయిన భావ రూపంతో
ఉదయ స్పర్శతో నాలో కవిత
ఒక స్థితిలో సమస్య సంక్లిష్టమవుతుంది
లోపాలు కత్తులై ఎదురుపడతాయి
స్ఫటికంలా అంత రంగ స్వచ్ఛత కోరేను
గుణాలు దీపాలయి దారిని చూపిస్తాయి

ఒక స్థితిలో ఏదో కాల్చే సమస్యలో
మట్టి గడ్డలా మనసు రస సేచన కోరుతుంది
పలు రంగుల ప్రతిఫలనంతో ఆకర్షణ
అందరినీ మెప్పించే నిర్మల హృదయ వశమయి

ఒక స్థితిలో ఏదో ఒక స్పర్ధలో
ఆటలో బంతిలా లిప్త పైకి ఎగిరి
ఒకే ఒక పరుగులో నిర్ణయం వెడలుతుంది
ఓటమి గెలుపుల రుచి భేదం తెలుస్తుంది

విశేష స్థితులలో ఆయుధం! యుద్ధ పాత్రలో
శాంతికి సహకారం మాత్రం రక్షణ పాత్రలో
రణంతో సమానమయిన స్థితులెన్నో!
ఎన్నికలలో ఒక ఓటుతో పీఠం దక్కుతుంది

ఏవేవో మిషలతో కాలాన్ని నిందించే పనిలో
ఓటమి పొందిన పక్షానికి సహజం
హేతువుపై దృష్టి లేని మతి చతురతతో
వాస్తవాన్ని మరచే అయోమయం! మనిషిలో

మనిషిలో సరికొత్త ప్రపంచం నిర్మితమవుతుంది
దీనికి ప్రతిబింబంగా బయటి ప్రపంచం ఉండాలని
నేలపై అడుగులు పరిమితమయి నడకలో
ఊహలు మాత్రం గగనం కొలిచే వ్యాపకంలో

22.

గాలి మౌన ముఖాన్ని స్పృశిస్తూ పోతుంది
నిశ్శబ్దంలో శబ్దాన్ని అందుకొని పోతుంది
గాలికీ శబ్దానికీ మధ్య స్నేహం ఇప్పటిదా?
మాటకూ అర్థానికీ మధ్య బంధం తప్పనిదీ!

పరిపాలనా యంత్రంలో ప్రతి వికారమతికీ
అశాంతికి బాసటగా భద్రత పెరుగుతూంది

చట్టం ఎవరికీ చుట్టం కాదని అందరికీ తెలుసు
రంగుల అద్దాల నుండి చూచే దృష్టి ప్రబలుతూంది

అలవి తప్పిన స్వేచ్ఛలో అశ్లీలం అరాజకం రెక్కలపై
అశాంతి డేగ పలల ఖండం కయి చూపు ప్రసరిస్తూంది
విపరీత కృత్యాలకు సమాజమొక ప్రయోగ నిలయమవుతూంది
వీధిన పోయే మనిషి! ఏ దారుణ ఘటనలో కలిగేదీ తెలియదు

విధ్వంసానికి ఆలోచనలో ఆర్ద్రతతో పని లేదు
నిర్మాణానికి వివేచనతో క్రియాశక్తి మరీ ముఖ్యం

మనిషి మనసు గూడులో పావురం భద్రంగా
వీడదు! ఆహారానికో విహారినికో తప్ప
ఇది కనిపించనంత మాత్రాన అశాంతి ఉందనీ కాదు
సమాజ రచనలో గాయాల పర్వంలో నమ్మకం మనిషి పైనే
మనిషిపై పూర్తి నమ్మకంతోనే శాంతికి అవకాశం
ఇది క్షత మయితే బ్రతుకు భవిత భగ్నమే

వానలో బురదలో చిక్కుకున్న బండి చక్రాలను
చూస్తూ! విగ్రహాల్లా నిలిచే మనుషులెందరో
కొందరు బండి బురదలోకి రావడాన్ని ప్రశ్నించేరు
కొందరు లాగే అసమర్థతనో, ఆ సమయాన్నో ప్రశ్నించేరు

చిక్కులలో పరిసరాలతో కష్టంలో మనుషులతో సమాజం
మనసుకు మాత్రం! సంక్షుబ్ధ స్థితిలో రహస్య మయం
ముడులను వేసే విప్పే పనులలో కొందరు కొందరు
మనుషుల సానుభూతి దృశ్యం! మరునాడు పత్రికలో ఫోటోలో

23.

మానవ కల్పనా శక్తికి సుందర రూపం స్వర్గం
ఎన్ని హేతువుల్ని సంధించినా తొలగని మానసికం
సహనం శాంతి మితి మీరితే అంతా నిస్తబ్దం
ఆయువు ఉన్నంత వరకు భౌమం నిజ వాస్తవం

మోదం ఖేదం సౌఖ్యం కష్టం మిశ్రమ రుచితో
కాలం వేదికపై! అసంఖ్యాక సమాజ పాత్రలు!
మాటలతో బ్రతికేను, బోధించేను, శాసించేను
అయినా మనిషి! తన దారిని మాత్రమే వరించేను
మౌనం నుండి శబ్దం, గిరి నుండి జల సేచనలా
మౌనం భయ పెట్టదు, ఆలోచన కవకాశమిస్తుంది

అడవిలో జింకను పులి క్రాస్ చేసి పోతుంది
అత్యవసరమయినపుడే హింసను ప్రదర్శిస్తుంది
ఇక్కడ మనుషులెవరూ కనిపించని స్థలం
కనిపిస్తే చేతిలో ఆయుధంతో, భయ ముద్రలు వదలుతూ

తాము మోయగలిగినంత బరువు మోస్తూ మనుషులు
ఎక్కడ బ్రతుకు తెరువు దొరికితే అచటే ఆవాసం!
యంత్రం ముందు మనిషి తల వంచినట్లనిపిస్తుంది
అది పని చేసేది మాత్రం! మనిషి అధీనంలోనే

సంచార జీవితంలో శాంతి-స్వేచ్ఛ రెండూ
స్థిర నివాసంలో భయమూ-నియతి రెండూ
మట్టి నుండి బంగరు పంట చూడాలని కోరిక
బురద నుండి సృజన! కమలం, కల నిజమవుతూ
తీరిక లేని మనిషికి! కష్టంలో గుర్తుకు వచ్చే వెన్నో
కష్టాలు తీరేంత వరకు కష్టపెడుతూనే ఉంటాయి

చీకటిలో మార్జాలం కంటి వెలుగు, ధైర్యాన్ని ఇస్తుంది
వెలుగులు ఆశను నింపుతాయి, కృషికి ప్రేరేపిస్తాయి
సూర్యుడు యథావిధిగ రోజూ వస్తాడు బాధ్యతగా
సమయానికి మనిషి లేస్తాడు, పనికై అలవాటుగా

24.

సుమమయినా నది అయినా చంద్ర బింబమయినా
పురుషునిలో నిలిచిన స్త్రీ రూపం తలపిస్తాయి
సుందరమైన అనుభవం మనసులో అమూల్యంగా
మరపున బడిపోదు, పైగా ప్రేరణగా నిలుస్తుంది

సౌందర్య విభవంతో కళా హృదయం
బయట పడే క్షణంకై ఎదురు చూస్తుంది
కవితలో వీలు వెంట అక్షరాకృతి పొందుతుంది
మాటలకు విలువ దాని ప్రయోజన గుణంతోనే

ప్రతి మాట మెరపులా అలలా పూవులా కత్తిలా
కనిపించని అంతరమైన అవసరాన్ని దర్శింపజేస్తుంది
మాటలో స్వర చలనం మంద తీవ్ర గతులతో
వాన చినుకు నుండి తుపాను వరకు సూక్ష్మ సూక్ష్మంగా

హిమ తల ఫలకంపై స్కేటింగ్‌లా
అక్షరం నడిపిస్తుంది కవితకు ఆధారమై

ఏ మాట మంచిది? ఏ శబ్దం మంచిది? అంటే
అన్నీ! మనిషి అయినా కవి అయినా కోరే దాన్ని బట్టి
తల ఎత్తిన భుజగం! మాటలో కనిపించవచ్చు
మొన చూపే ఆయుధం! శబ్దంలో తోచవచ్చు
మనిషి ఊహ పూవులా పరిమళించవచ్చు
మనిషి మాట ముల్లులా గుచ్చు కోవచ్చు

సహజమయిన స్వచ్ఛమయిన జీవితమెక్కడ? అంటే
పల్లెకు వెళ్ళాలి క్షేత్రం చూడాలి
పరిసరాల గాలితో శ్వాస ఆడాలి, సుఖంగా
కొండల మెడలో వ్రేలాడే మబ్బులు చూడాలి

విలాస వస్తువులకు దూరంగా
వినోద స్థితులకు ఎడంగా
మనుషుల కృషి ఫలాలతో ప్రియంగా
పనిలో సంఘానికి శ్రేయో రూపాలుగా,
ఏ దేశ మయినా ఏ పాలన అయినా ప్రతి ఊరు
గింజలో సృజన దర్శనంతో, కృషి జన జీవితంతో

25.

మట్టితో బంధుత ఎప్పటి నుండో
మట్టితో బ్రతుకులు అనుబంధంతో
ఆరు కారులతో ఎప్పటికీ సహయోగం
మట్టి నుండి జీవన రుచి ఫల సంపదతో

దుక్కి దున్న బోయే భూమిని చూడగనే
కర్షకుని కళ్ళ మెరపు లాస్యమాడుతుంది
కన్నీరు బయటికి రాదు
లోన స్తంభితమై నిలుస్తుంది

రుతువు రుతువుకూ కాలం దుస్తులు మార్చేను
తెలుపు పసుపు ఎరుపు పచ్చ రంగులలో
తన బంధువు దుస్తులు మాత్రం! ఎప్పటికీ! ఒకే రంగువి
మాట అదే! బ్రతుకు అదే! ఏ మార్పులేదు

భూమి గురించి కలలు!
లేకపోలేదు, ఎగిరే పిట్టలవలె
వరి గోధుమ జోన్న పెసలు
కందులు మిరప పసుపు మరొకటి
ఆహారం వస్తువులతో ప్రాణం అల్లుకొనీ
తీగెలా బ్రతుకులు! సాగుతాయి ఊళ్ళలో

ఆకలి ఒక సారితో ఎవరిలోను ముగిసేది కాదు
ప్రాణం నిలిచేందుకు మళ్ళీ నియత వేళల అవసరం
ఈ సందర్భంలో రైతు ఒక ఆహార విధాత
సమాజ సుస్థితికి శ్రమించే అదృష్ట చిహ్నం

భూమి మబ్బు మొక్క స్మృతిలో చెరగనివీ
అడవి జ్ఞాపకాలతో విశాల ప్రకృతి నేపథ్యంలో
విరామంలో మనుషుల ఎద చేరతాయి మబ్బులు
ఎండలో వానలో చలిలో చెదరని ఆకారాలు
నేలపై రాళ్ళు ముళ్ళు లెక్క చేయకుండా
హింసకు తావులేని శాంతిని కోరే సమూహాలు!

26.

సమాజ వర్ణనం కాదు, జీవిత వచనం కాదు
సూక్ష్మమయిన అనుభవ రేఖలతో సజీవ దృశ్యం
నగర వాసులకు తెలియనివీ ఉన్నాయి
పల్లీయులు తెలుసుకోవలసినవీ ఉన్నాయి
ఇరువైపుల నుండీ కలిసిన మనో రూపంతో
జీవన వాస్తవ ప్రపంచం! ఇది స్వేచ్ఛా మయం

రణ మెరగని స్నిగ్ధమైన వాతావరణంలో
ఎంతటి వీరుడయిన ఘనుడయిన నమ్రత చూపేను

జన జీవన కళతో రోజు ముఖం చూచే భాగ్యంకై
ఈ సమాజ మంటే పైనున్న సూర్యుని కెంత ఇష్టమో!

చెరువు పొలం తోట ప్రకృతి భాగ్యంతో ఊళ్ళు
యంత్ర భావ విపణి వీధి నగరానికి సమంగా
సహజమైన జీవితాల విలువల తూకంలో
సూచి కాస్త పల్లె ముఖం వైపే చూపిస్తుంది

భూములు పండే కడుపులు నిండే కళ్ళు చెమ్మగిలే
ఆదర సోదర భావం వెలుగుల పందిరిలో
తేడా వస్తే! అంతటా దరిద్ర తాండవమే
ఇది పచ్చగ ఉంటేనే, మనిషి బ్రతుకు వెలిగేదీ

అలల వరస వలె దున్నిన చాళ్ళతో సందర్భం
భవితకు భాగ్యంగా సమాజ చలనంలో ఉత్సాహం
భూమిపై యంత్రం వేగంగా పని చేసినా
నింగిలో సెటలైట్ పరిభ్రమణం జరిపినా
కృషీవలుని ఉపదతోనే బ్రతుకుతుంది సమాజం

కాయ కష్టంతో గాఢ నిద్ర వరించేను
కలల కవకాశం లేదు వీరి జీవితంలో
మెలకువలో ఎదుర్కొనేది పూర్తిగ యథార్థమే

ఉదార చరితతో పల్లె! త్యాగానికి పీఠం
పచ్చని కర్షక పతాకతో, శ్రమ జీవన విజయం

27.

లోకం లోకి మనిషి! రావడం బరిలోకి దిగడం
నిశ్శబ్దంగా భయ రహితంగా ప్రియ బంధంతో
స్వచ్ఛమయిన మనసుతో శుభ్రమయిన వెలుగుతో
కానీ శబ్దమయమై భయవిలోలమై ఎదిగేను

చీకటి బొగ్గు ముక్కల్ని తలపిస్తూ మనుషులు, ఆపై
అనల దాహంతో బ్రతుకులు గడపడమొక విపరీతం
మొదటి వెలుగుతోనే జీవన పయనం మొదలు
ఎవరికయిన ఉపయోగ పడే ఆకర్షణ గుణ మదే

మనిషి నుండి మనిషి, ఒక నవ్వు ఒక మాట!
పూవులా ఫలంలా అందేనని తలచేను కోరేను
దీని కయి అవని అంతా తిరగ నవసరం లేదు
దీని కయి గగనమంతా వెదకనక్కర లేదు
బొగ్గు కూడ పనికి వస్తుంది, నిప్పంటుకొనీ
సిగరెట్ వెలిగేందుకో, పోయి రాజేసేందుకో
శిశిరంలో చలి కాచు కునేందుకో
సమయం సందర్భాన్ని బట్టి ప్రతి వస్తువు పనికొచ్చేదే

నిద్ర పట్టని రాత్రి బయట గగనంలో మెరసే
చుక్కల్ని లెక్క పెట్టడమూ ఒక పనే
దారి నుండి దారి చీలి పలు దారులతో సమాజం
దారులన్ని నడవడానికి జీవితం సరిపోదు
రివ్వున వీచే తుపాను హొరులా ఒకరికి
ఉద్యమ క్రియలో ప్రకటన స్వరం వినిపించవచ్చు
హక్కుల కయి నినాద పంక్తులు తలపించవచ్చు
దిశల నుండి తెగని ఏడుపులా ధ్వనించవచ్చు
తిరిగే చక్రంలో అరల వలె ప్రయోజనాలు
కావలసిన చోట అందడమొక! అదృష్టం.
పగలు రాత్రి ఇరువైపులతో రోజు. రూపాయి నాణెం ధ్వనిస్తుంది
కావలసిన సంభారంతోనే బ్రతుకులు సార్థక మయ్యేను

28.

విత్తనం విత్తబడీ, ఒక సారే మొక్కకు అవకాశం
మనిషి కూడ అంతే, ఒక జన్మలో ఆయువుతో జీవితం
పునర్భవం లేదు, శైశవ దశ తిరిగి రాదు
చేతిలో మండే కాగడా మనిషికి
చీకటిలో ముందు దారి చూపే ఆదర్శం
కొత్త చూపుతో కొత్త జగం కయి మార్పును కోరీ

వ్యక్తుల మధ్య మిత్రత శత్రుత తోనే చరిత్ర
ప్రజల గుండెలలో నిజం! భద్రంగా
పుష్పంలా వజ్రంలా తూటాలా మేల్కొనీ
వర్తమానం మాట్లాడుతుంది భవిత కయి సమస్యపై

జ్ఞాపకాలు చెదలు పట్టవు, మాసిపోవు
కాలం గడచే కొద్దీ మెరుగులు పొందుతాయి
హైదరాబాద్ డిల్లీ ఇంగ్లాండ్ అమెరికానో
పక్షికి ఎక్కడయినా ఒకటే చెట్టు కొమ్మపై

రణ విధ్వంసం గురించి ఉపన్యసిస్తూనే
వెనక నుండి అగ్నికి చిదుకులు అందించేరు

స్థలం నుండి స్థలానికి పయనంలో కాలం
రైలు లాగా, మధ్య మధ్య ఆగే స్టేషన్లతో

చూపుకు పయనంలో దృశ్యం వెనక్కి వెళుతూన్నట్లు
దృష్టి దోషంతో చంద్రుడు వంకరగా తోచవచ్చు

దీపాలు వెలగని రాత్రి బయటికి వస్తే
మల్లె చెండులా పైన చంద్ర బింబం
కవిత్వాన్ని రప్పిస్తుంది ఆలోచన మారుస్తుంది
రవి శకలం లాంటి గాయంతో కవిత వెడలుతుంది

ప్రాణానికి పరిసరాల ప్రభావాలతో సమాజంలో
గాలి! మరీ ముఖ్యం, మార్పుల వాతావరణంలో
హృదయ భాషలా, గాలి మాట మనసుకు తెలుస్తుంది
నిప్పునూ పొగనూ దుమ్మునూ పరిమళాన్ని ధ్వనినీ
అప్పటికప్పుడు దేనినయిన సహిస్తుంది వహిస్తుంది, గాలి
అంతలో శుభ్రంగా పయనం సాగుతుంది కవితలా

29.

పవనం నా చిర సన్మిత్రం
కవనం నా ఆయువు ఊపిరి
మనిషితో మనిషి పరిచయ మొక తొలి ముడి
మాటలతో అవసరాల అల్లికలో సమాజం
మనిషిని మనిషి గుర్తించడమొక మలి ముడి
ముడులపై అంతరంగ స్పృహతో పయనం

మనో భూమికలో విస్తృతమవుతూ జీవన రూపం
ఎవరి వాద్య విశేషంతో వారు అనుభవ జగత్తులో

మార్పుకు లోనయ్యే వాతావరణ రూపాన్ని
వీచే గాలులు ముందుగ సూచన చేస్తాయి
పొడిగా తడిగా తేలికగా బరువుగా
పలు విధాల సుగంధాలతో అపుడపుడు దుర్గంధంతో

సూక్ష్మమయిన అనుభవాల మానసిక స్థితులు
మనుషుల అస్తితలను శ్రేణులుగా మలచేను

తొలి దశలో సంతోషం తెలుపు రంగులో
ఎదిగే కొద్దీ వేరు వేరుగా పలు రంగుల కలయికతో
బాధలు ఏడ్పులు తప్పని వయినా సమస్యలతో
వ్యక్తి నుండి సమాజానికి చేరడమొక పరిణామం

ఎవరి కయిన ప్రవేశానికి వీలయిన స్వేచ్ఛలో
ఆలోచనా జగత్తులో ఎవరి దారి వారిది

నా నిలయం భూమి పయి చిన్న గడ్డపై
ఇది ప్రాణంతో పాటు ఉండేదీ వీడరానిదీ

ఈ ప్రపంచ మెవరికినీ శరణాలయం కాదు
స్వతంత్ర మయిన బ్రతుకుల కవకాశ రూపం
మనసును సమాజ దృశ్యమయం చేస్తుంది
బాధలోను హాయిలోను అనుభవ విశేషాలతో

30.

ఉదయ రశ్మిలా కవిత మొదటి పదం వెడలగనే
మౌన ముఖం నుండి శబ్దం, ధునిలో అలలా కదలేను

భాషలో శబ్దం సుమమయి వికసిస్తుంది
మాటలో అర్థం వెలుగయి ప్రసరిస్తుంది
పయనంలో పవనం ప్రగతిని స్వనిస్తుంది
అస్తితలో జీవన చలనం స్ఫురించేను

అక్షర బీజాల నుండి ఊహలు మొలకెత్తేను
జీవన వన భూమికి భాగ్యం చేకూర్చేను

పక్కనే అభాగ్యులు దౌర్భాగ్య దశలలో
సమాజ నాణానికి మరో వైపు ధూళిలో
కవిత దేనికది, ఒక అక్షర జీవ మయం
ఉపశమనంతో పాటుగ, ఉత్తేజానికి ప్రేరణం

సమాజ చరిత్రలో మూసిన తలుపులతో
కష్టాలతో కూడిన బ్రతుకులు! ఎక్కడికక్కడ!

నియంతల మనసు చీకటినే వరిస్తుంది
కన్నులు మాత్రం! ఎరుపు బల్బుల వలె వెలిగేను
బాధలో ఉన్న వారికి బోధలు తలకెక్కేనా?
విషాద యోగంతో బ్రతుకు మలుపు తిరిగేను

నేలపై చినుకులు మట్టి ముక్కల్ని ఒకటి చేస్తాయి
కరుణ రసం మనుషులలో విభేదాల్ని మాపుతుంది

ఇంటి ముందు పూచిన మల్లె తీగ
మనిషిలో బాధను మరపిస్తుంది
అందరికీ ఈ అవకాశం లభించేనా?
కొందరికే లభిస్తుంది, కొన్ని స్థితులలో

ప్రకృతి నుండి సమాజంలోకి జీవితం
గిరి నుండి జన పదాల్ని స్పృశిస్తూ నదిలా

31.

స్వేచ్ఛలోను దాటాలిసిన బంధన వలయా లెన్నో
భయ వేదన పీడన ఛాయలలో మనుషులు
దీనతలో హీనతలో అల్పమయిన స్థాయిలో
మెట్టు మెట్టుపై ఆరోహణలో వివిధ స్థానాలలో

నిరుపేద స్థితి నుండి భాగ్య దశ దాకా
ఒక దాని నొకటి క్రాస్ చేస్తూ పోయే దారులు

సామాజిక రాజకీయ నైతిక సాంస్కృతిక
వివేచనలో పరివర్తనతో నిర్భంధం సడలుతుంది
సంకుచితం నుండి విశాలతను పొందుతుంది
నిరుపేదకు ఆరోహణలో వరమవుతుంది
వ్యక్తుల పయి పీడన బంధన చర్యలు
సమస్యలకు కారణమయి దూరాలను పెంచేను

స్నేహంతో మోదం, వైరంతో ఖేదం
బ్రతుకులో మనో రూపానికి పార్శ్వాలు
ఆదిమ బీజాలతో ఎదిగిన సమాజాలు
శాఖలుగా శ్రేణులుగా విభాగాలుగా చీలేను

చెట్టు కొమ్మల సందులలో నుండి వెలుగు
భూమిపై పడుతుంది, మనిషికి మిత్ర మవుతుంది
వెలుతురులో నీడలు! సరసిలో పడవలవలె
మనిషికి జల తలం పయి పయనం తలపుకు వస్తుంది

వ్యక్తి స్వరం వెనక నుండి సమాజ స్వరం కలిసి
ఆ సమయం మనసొక వాద్య విశేషమవుతుంది
సన్నని దళసరి తీగెల పయి అనుభవాల్ని వినిపిస్తుంది
ఎవరి కిష్టమయింది వారు వినేరు, ఉత్సాహం పొందేరు

అస్తితలో వ్యక్తి పొందే పేరుతో ప్రతిష్ఠ
బ్యాగ్‌లో బ్లాంక్ చెక్‌లా ఉపకరిస్తుంది

32.

మనిషి జీవితంలో ఒక్కొక సందర్భం
సంతోష స్వాంతంతో కౌగిలించుకుంటుంది
విషాద రేఖలు చుట్టు ముట్టి నాపై కెగర జేస్తుంది
విరాగ పవనం ఎత్తుక పోజూచినా నిలిపేస్తుంది

ఎవరి కయినా గులాబి వలెనొ! మల్లె వలెనొ
క్షణాలు వికసించి పరిమళాల్ని పొందాలనే

ఉదయం కిరణం మనసును అందల మెక్కిస్తుంది
అస్తమయ కిరణం గుహలోకి దారి చూపుతుంది

కనుచూపు ఎక్కడో ఒక చోట ఆగవలిసిందే
ఊహ మేర! ఎక్కడో ఒక చోట నిలవాలిసిందే

పర్వత మంటేనే ఆరోహణ మవసరమయ్యేది
భౌతిక కష్టాలన్నీ దీనికి సంబంధించినవే
మానస వేదనలన్నీ ఆంతర సంబంధం కలవీ
ఇరు స్థితులతో వ్యక్తిత్వం పూర్ణత పొందేను

చీకటిలో రహస్య స్థానం నుండి
చాచిన చేయికి మరో చేయి అందవచ్చు
తల ఎత్తిన పాము పడగ తాకవచ్చు
అన్నిటినీ కవిత! తనలో ఇముడ్చుకుంటుంది

గ్రీష్మంలో ఇంటి ముందు పగలు! దప్పికతో
నిలిచిన మాటరాని మనిషి! సైగలు చేయవచ్చు
లోన ఉన్న మనిషి చూచి చూడనట్లు
తన పనిలో కదలి! మరచి పోవచ్చు!

కాలం మంచి చెడు విభజన ఎరగదు
మనిషి ఊహ చర్యలతోనే! ఎదురవుతాయి
కదలే క్షణాల పయి ఉన్న స్థితులలో
పోవలసిన చోటికి చేరడమొకటే! కర్తవ్యం

33.

తల ఎత్తితే కాని కనిపించని గిరిశిఖరంపై
ఆశా దీపం వెలగాలని! కోరిక ప్రతి మనిషిలో

జీవన వయొలా తీగెలపై కత్తిలా
కమాన్ కదలికలకు, తీగెలు తెగవు, కానీ
విషాద మయమయిన స్వరం వినిపిస్తుంది
మనిషిని యుగాల వెనక్కి తీసుక వెళుతుంది

దిగులు బావి నుండి మనసును
కష్ట జలధి లోకి దింపుతుంది
పర్యవసానం ఇంచు మించు ఒకటే అయినా
అనుభవ దృశ్యం మాత్రం! వేరు వేరు

సంక్షోభంలో క్రుంగి మునిగే కన్నా
ఉత్తేజంతో తీరం చేరడ మవసరం

చుట్టు ఎగసే కొర్కెలతో మనిషి రాజకీయంలో
తన విషయం తన కన్న ఇతరులకే బాగా తెలుస్తుంది
లోతు ఎత్తు విస్తృతి అంచనా వేసేరు
గుణ దోషాలను మనసు త్రాసులో తూచేరు

వ్యక్తి రూపంలో విగ్రహం తయారయి
ముఖాన లేత సూర్యుని ప్రభతో
ఎదలో చంద్ర బింబం స్ఫూర్తితో
చూచే కళ్ళలో విలువలు తళతళలాడేను

భయ సందేహాల మధ్య ఎవరి ప్రపంచం వారిది
విజయంపై ఆరాటం! మనిషిలో నిరంతరం
తన పనిలో మరపున బడిపోయేవెన్నో!
తనలో వెలుగు ఉన్నా మనిషిని మరవడం విషాదం!
మనిషిని మనిషి పూర్తిగ జయించడం జరగదు
గెలుపుకు మరోవైపు ఇంకా ఎంతో మిగిలే ఉంటుంది

34.

ప్రాణులలో మానవ రూపం చేతనలో విశిష్టం
భయం నుండి ముక్త మవుతూ ధైర్యంతో కదలేను
శిఖరాలను దాటుతూ ఆరోహణలో నిరంతరం!
తెలియని ప్రపంచంతో పరిచయం కోరేను

ఇంట్లో ఎప్పటిదో మూల ఉన్న పాత వస్తువు
చూపు పడగానే అనుబంధంతో! కదలించేను
గౌరవ మధికారం ఆత్మీయం అభిమానంతో
పూర్వ స్మృతులు! మాలలుగా సాగేనొకటొకటీ

మనిషి ఇంట్లో లేకపోయినా ఒక సమయంలో
ఇంటి ముందు నేమ్ ప్లేట్ అస్తితను నిలుపుతుంది
ఆ మనిషి రాక కయి ఎదురు చూచే వాలకంతో
కొత్త వారి పట్ల స్వాగతంతో పాత వారి పట్ల ఆదరంతో

బ్రతుకుపై కోరికతో జీవితానికి ఆకర్షణ
అపుడపుడు వికర్షణ! శుష్కమైన స్థితిలో,
నీరు లేని బావిలా వెలుగు లేని గుహలా
ఆపదలో సుడిగుండంలా, విషాద చిహ్నం ఉరిలా

మనిషి చేతులు ముళ్ళ కంపగానో రాళ్ళతోనో
ఉండే దుస్థితి రావడ మొక! దౌర్భాగ్యం
ఎంత కోపం తాపం ప్రతిచర్యలతో చెలరేగినా
గ్రీష్మం వెనుక వర్ష రుతువుపై ఆశ! సహజం

శాంతి సందు చేసుకొని వస్తుంది నిశ్శబ్దంగా
ఎదురుగ వాలుతుంది, కాస్త సవ్వడికి ఎగిరిపోతుంది

విహగం వలెనో శకటం వలెనో! పడవ వలెనో
మారణ వలయాల నుండి శాంతికి అవకాశలెన్నో!
దుర్గమ స్థితుల నుండి దూరం తరలిస్తుంది
పయనానికి హద్దులు లేవు, స్వేచ్ఛా పథంలో

35.

వస్తువుల్ని దాచే నిలయం కాదు, అంతరంగం
ప్రతి వస్తువు విలువలపై వెలుగును ప్రసరిస్తుంది
ఎంత ఇష్టపడినా చంద్ర బింబం కిందికి దిగలేదు
ఎంతటి కష్టంలోను ఆయువు తేలుతూనే గడుస్తుంది

రవిని మాడగ జేసే శశిని పొగ చూరగ జేసే
ఆందోళన ఘర్షణలో పేలే ఆయుధాల ప్రభావంతో
అసాధ్య మనిపించేది సాధ్యం చేసే కృషిలో
ఆధిక్యంతోపాటు బలహీనత బయట పడుతుంది

బాధను వేదనను పంచుకొనే వారు దొరకరు
సానుభూతి పొందవచ్చు ఓదార్పు లభించవచ్చు

వర్తమాన లిప్తలు పరిణామ వికాసాలలో
కంప్యూటర్ మేధతో మిసైల్ వేగంతో
సమాజ చలనంలో ఒక విశేష విజ్ఞానం
మనిషిలోని జిగీషా మనీషను ప్రదర్శించేను

ఓటమి చుట్టూ చీకటి అలలు కదలుతూ
గెలుపు చుట్టూ బంగరు వెలుగులు తిరుగుతూ
మనసులో కోరిక పూల గుత్తిలా వేలాడుతుంది
మోదం ఫల రూపంలో అనుభవానికి వస్తుంది

అహంకారం నుండి సృజన పెరుగుతుంది మొక్కలా
సందేహం వీడిన మనస్సు విశ్వాసం పెంచుతుంది

ఉన్న దాని కన్న మేలు కోరి మార్పులు తల పెట్టేరు
లేని దేదొ కొత్తది చేరేనని ఆశ! తీవెలా ప్రాకేను

భూమి ఎదను విప్పుతుంది, జలధి కేక వేస్తుంది
నింగి బదులు పలుకుతుంది, చెట్టు చేష్ట చూపుతుంది
లోపల విత్తిన అనుమాన భయాలతో
మనిషి హృదయం మాత్రం గుప్తంగా అదృశ్యంగా

36.

చుట్టూ శూన్యాన్ని ఎవరు అభిలషిస్తారు?
ఏదో వస్తువుతో ఉన్నా, మనుషులు కనిపించాలనే
అవసరానికో అలంకారానికో! ఉనికిలోనో!
మానుష స్పందనకై మరో మనిషి వేచి చూచేను

మంటలతో కాక! పట్టు వెలుగులతో
క్షణాలు! ఒకటొకటీ పలకరిస్తూ గడవాలనీ

దూదిలా ఎగిరి పోవడం ఇష్టం ఉండదు
దుమ్ములా ఎగసి కళ్ళలో పడాలనీ ఉండదు
పూవులా విరిసి పండులా మాగి కనిపించాలనే
మనిషిగా పుట్టి మనీషిగా మనస్విగా ఎదగాలనే

నిరంకుశులు నిర్దయులు తక్కువ సంఖ్యలో ఉన్నా
జ్వాలల వలె కదలుతూ దహన కాండ సృజించేరు
దురాగత చర్యలతో భయాలోల లిప్తలతో
సర్వం జడాకృతిగ మారుస్తూ స్వేచ్ఛను హరించేరు

హంసలా ఎగిరే సుందర సమయం
హింసలో చిక్కుకొని పోవడం దారుణం

మనిషి అడుగులు దిశ దిశలో ప్రయోజనంలో
తమ తమ గమ్యాలను చేరే తొందరలో
అందరివీ కలిసి సమాజ పూర్ణత లభించేను
వికాస విజయానికి అవకాశం కలిగించేను

శ్రమ జీవన గతిలో గాలి సందేశం వినిపిస్తుంది
నిశి విరామ సమయంలో ఉపదేశం వదలుతుంది

ఒకరి చేతిలో దీపం! ఖడ్గంలా రక్షణలో
ఒకరి చేతిలో ఖడ్గం! దీపంలా భద్రతలో
ప్రభావ ప్రసారాలతో! సమాజ దృశ్యం
ప్రజాస్వామ్య సూత్రాలకు వాఖ్యానాలయ్యేను!

37.

నాలో! విషాద ప్రవంతి మనోమయమై
ఏ కొండపైనొ కఠిన శిలల మధ్య నుండి
సందు చేసుకొని ఉద్వేగంతో దూకి
ఈ భూమిపై కదలుతుంది సమాజ బంధువై

రవి రశ్మికి మంచులా అనుమానం తొలగి
భళ్ళున నిజ ప్రకాశ రూపంతో దృశ్యం!
తేజానికి కరగి వేగ మందుకున్న ప్రవాహంలో
గగనం రవి శశి తారలు మబ్బులు
మనిషి మనో బంధంతో సన్మిత్ర గణంలా
సాగినంతమేర చెదరని అనుబంధంతో

రవి బింబం ముక్కలవదు తేజానికి మసిబట్టదు
సమయ సమయం స్థలం కాస్త జరగవచ్చు
మనిషిలోని అంతరంగం పైకి అసలు కనిపించదు

ఎవరి స్వరం వారిది ప్రత్యేకం
సమూహ సంగమంలో సమాజ శక్తి ప్రతిఫలించేను
ఎవరి ముఖం వారిది పదుగురిలో
సమాజ భావనతో మానుష శక్తిని ప్రకటించేను

సంకెళ్ళ వలె ఉన్న నీడల మధ్య వెలుగు
బంధనలోను వీడని ఆశకు గుర్తుగా

దాహం వేసినపుడు ఎవరి కోరికపై రాదు మబ్బు
మునుముందు కలిగే అవసరానికి దాచేదీ కాదు

కనిపించే బాధా దృశ్యంతో నాలో విషాద ప్రవంతి
గూడు ఛిన్నమై జారిపోయి శూన్యమై
పక్షి ఎగిరి పోయిన నిరాశ్రయ సంకేతంతో
అపాయం చేత కాదు, ప్రమాదం చేత కాదు, మనిషి చేతనే

38.

మట్టినీ మట్టిపై నిలిచిన ప్రతి వస్తువునూ
స్పృశిస్తూ పోయే పవన రూపం! ఈ కవిత్వం
మనిషిలో మానవ ప్రపంచాన్ని బింబిస్తుంది
అగ్నియై వెచ్చదనం మేఘమై జీవన రుచి ఇస్తుంది

రంగుల రెక్కలు విప్పుతుంది దిశలలో
కుసుమ మయి ఊగుతుంది, పక్షి అయి ఎగురుతుంది

లిపి లేని భాష ఉండవచ్చు
మాట లేని భాష ఉండదు
కవిత కదులుతుంది కెరటంలా
నవత వెడలుతుంది కిరణంలా

అక్షరాలలో గాజు బొమ్మల వలె వెలుగులు
పలు రంగుల మిశ్రమ జీవన దృశ్యాలతో
శబ్దం వెలుగుతుంది బల్బులా కవితలో
భావనలో విద్యుత్ప్రసార గుణ రమణీయంగా

నవతకు సరికొత్త ముఖాన్ని ఇచ్చే
అక్షరాలు! కాలానికి అలంకారాలు కావు
జవ సత్వ కణాలు ముందుకు నడిపిస్తాయి
వస్తువులో కనిపించని శక్తి నిదర్శనంగా

అర్థమయిన దాని కన్న అర్థం కాని దానితోనే
అనుభూతి సాంద్రతతో కవిత! ఆకర్షిస్తుంది
"బాగుంది" ప్రకటనం మాటలో
కవితను వశం చేసుకొనే శక్తికి నిదర్శనం

అక్షరాల కోట! రక్షణ పంక్తిలా
మనిషి విజయ గాథకు చిహ్నంగా
హృదయం కోరుతుంది, ప్రేరణనిస్తుంది
మనిషి మనిషికీ దశదశలో మార్పుకు ప్రతినిధియై కవిత!

39.

తెరచిన మనసు కిటికి నుండి చూచేది
రవినో శశినో చుక్కలనో చెట్టునో ముఖ్యం కాదు
మనిషిని! అవును మనిషే బహు ముఖ్యం
సమాజ నేపథ్యంలో పెరిగే విలువలతో

ప్రతి స్థితిలో సందర్భంలో మనిషి
తన అస్తితతో మనస్వియై కనిపించాలనే
మట్టి పయి మలినం నుండి శుభ్రమయి
వికాస చరిత్ర పాత్ర నిర్వహించాలనే

భూమిపై నిలిచిన పదంతో వర్తమానం
వేయబోయే మరో అడుగులో భవిత
మనిషిని మనీషిగా మార్చేను
మనీషిని మనస్విగా తీర్చేను

చేతిలో విల్లు బదులు పతాకతో వీరం
పెదవులపై శబ్దంలో నినాదాల ఘోషణం
ప్రజల హృదయాలకు దగ్గరగా
దార్శనిక ప్రపంచానికి చేరువగా

నిద్రకు గుడ్‌బై చెబుతూ కాలాన్ని పరుగెత్తిస్తూ
చీకట్లను కట్టేసి గుహలో నిలిపేస్తూ
మెలకువతో పాలనలో తలపై రవి బింబం
ఆదర్శం వాస్తవమయ్యే ఆలోచన వెలిగిస్తూ

పై నుండి కిందికి దిగిన చుక్కల వలె
మనుషులు! ధైర్యంతో వెలుగు చూపులతో
విషాదాన్ని మరచి ఉత్సాహాన్ని అందుకొని
సమాజ మిపుడు! కొత్త పవన వాహనం పయి

నిన్నటి అస్తమయ విషాద దృశ్యం అదృశ్యమయి
ఉదయ బంధువు వర్తమాన దృశ్యం పొందుతూంది

40.

రాత్రి జరిగిన అసాధారణ కృత్యానికి సాక్షి అయిన
వీధి దీపం జరిగింది చెప్పలేని స్థితిలో ఉంటుంది
పరిసరాలు మసక కనులు పూర్తిగ తెరచే లోపల
వీధి దీపం కాంతి దృష్టి మాయ మవుతుంది

విషాదమయినా ప్రమోదమయినా సామాన్యమయినా
భయదం అయినా సుఖదం అయినా
పరిమళమయినా కాకపోయినా స్థితి ఏదయినా
కదలే గాలికి వార్తలన్నీ సమానమే

వాస్తవాలు దారులు చీలి, దిశలు మారేను
ఆదర్శం అనల పరీక్షకు గురి అయ్యేను

ఆయుధంతో బెదిరించి మనసులు గెలవలేరు
అధికారంతో భయపెట్టి పాలన మెప్పించలేరు
తమ పరివారం బొమ్మలతో ఎత్తులతో
నాటకాన్ని నిర్వహించలేరు, వట్టి మాటలతో

చువ్వల దయినా గోడల దయినా కత్తుల దయినా
నిర్బంధాలన్నీ ఒకటే! అణచి వేతలో!
నీడలతో యుద్ధం గెలుపును సాధించలేదు
మనిషితో మనిషి రణం! గెలుపు పాక్షికం

గాయాలు మానినా మిగిలిన మచ్చలు
మరచిన సంగతుల్ని జ్ఞాపకం చేస్తాయి

అస్థి పంజరాలతో నాటకం సాగించవచ్చు
జీవితం సాగేది మాత్రం జీవమున్న మనసులతోనే

చేతికి సంకెళ్ళు తీసేస్తే సరిపోదు
చేతికి రొట్టె ముక్క అందాలిసి ఉంది
నీడ వదలి చెట్టు కొమ్మ పైకి చేరితే
ఏకాంతం బ్రతుక్కి! పరిపూర్ణత నీయదు

41.

విగ్రహాన్ని చూడగనే ఆదర్శం తళుక్కున మెరుస్తుంది
మనిషిని చూడగనే మానవ వికాస రేఖ వెలుగుతుంది
చేసే పని విలువల్ని బట్టి
మనుషుల వ్యక్తిత్వం సుమిస్తుంది

కల్పనలో కోరిక అనుభవంలో ఏమైనా కావచ్చు
అణగవచ్చు పూయవచ్చు, శూన్య ముఖం చూపవచ్చు

కవిలో నిశ్శబ్దం నుండి శబ్దం బయటపడుతుంది
తనతో బొమ్మలా మాట్లాడుతుంది
తనలో మనిషిలా స్పందిస్తుంది
అర్థంలో రణ కామనయో శమ భావనయో ఏదైనా!

పూలు పండ్లతో ఉదార చరిత! చెట్టు ముందు
కదలి వచ్చి చేతులు చాచి మనిషి! నిలిచేను
నడవ లేని చెట్టు, నడవ గలిగిన మనిషిలో
శూన్యాన్ని నింపేను! నీడతో ఆదుకునేను

తన కన్న ఆ చెట్టే నయమనిపించేను
తనలో విశేష శక్తి! మరపున బడేను
తానొక వృక్షమయితే బాగనిపిస్తుంది
సుందర శిల్పమయితే బాగనిపిస్తుంది
మనిషికి హాయిగ గడవడం ముఖ్యమై
ఏ రూపమయిన ఎత్తేందుకు సిద్ధంగా!

బయట మొలిచే గడ్డికి విత్తే అవసరం లేదు
ఎవరి పోషణ పాలన రక్షణతో పని లేదు
నలువైపుల పరిమళం ప్రసరించే పుష్పానికి
ఏ ప్రకటనతో పని లేదు, ప్రచారమవసరం లేదు

కన్నీరును తుడిచేందు కెవరికయినా
అరచేయి చాచడానికెంత సాహసం కావాలి?
మలినమైన మనసుకు నిప్పులా తోచవచ్చు
స్వచ్ఛమైన మనసుకు మంచులా ఉండవచ్చు

42.

తొలి దశ నుండి సమాప్తి దశ దాక
ఎక్కడి కక్కడ పరిమితులతో బ్రతుకులు సాగేను
నిశా సమయంలో వచ్చే చీకటి నెవరు ఆపగలరు?
దివ్వెను వెలిగించి వెలుతురుతో సరిపెట్టుకునేరు

యదార్థ జీవన రుచి తెలియని వారు
కలల పయి కోరికతో కాలం గడిపేరు
కదలిక లేని గాలి, జడంతో సమానం
మెలకువలేని మనసు చిత్ర పటంతో సమం

కదలే గాలితో కాలం నా ప్రియ మిత్రం
కదలిక లేని గాలి మార్పులేని కాలం, ఊహకందనివీ
కాలంతో నేను, నా జీవన చరిత్ర
కాలంపై నమ్మకంతో! కాలం ఆదరణలో

అందరితో కలిసి పయనం సాగుతున్నా
లోన ఆలోచనలో దారులు వేరు వేరుగా
బ్రతుకులోని వ్యక్తితలను నిలబెడుతూ
నిర్మాణ పథంలో కొత్తగా, అనుభవ శిఖరాలతో

ఆలోచన ఆరోహణ అనుభవం ఆదర్శం
జీవన చలన గమన గమ్యంలో ఏకతతో
నిశా విరమణంతో మొదలయ్యే శ్రమ రూపం
పొద్దు పొడుపుతో నవోన్మేషం పొందుతుంది

కళ్ళు తెరవగనే ఉదయం కనిపిస్తుంది
హ్లాదంగా ఎదురగ ప్రియా ముఖ కమలంలా!
పైకి వచ్చే కొద్దీ బ్రతుకులో కాలంపై
ధూళి సోకిన గాలితో నిజరూపం మసక బారేను

తన ఇష్టం లేకుండా పొందిన మానవ రూపం
క్షతమయి పోకుండా చూచే బాధ్యత మనిషిదే
మనిషి ముందు మనిషి వెలుగు! ప్రగతికి చిహ్నం
మనిషి వెనక మనిషి జాడ! సూచన రూపం

43.

నా వెనక గతం నా ముందు భవిత
ఉన్న వర్తమానంతో అనుభవ రూపం
స్వర్ణ కవచ మందిస్తుంది కాలం!
జీవన రణంలో క్షత గాత్రం అవకుండా

రవి సహస్ర కరాలు విస్తరించేను అంతటా
ఆకుల వలె అలల వలె పూల రేకుల వలె
ఈ సమయంలో కిరణం సూటిగ తాకినా,
బాణాన్ని తలపించదు, పూల మాలను తలపిస్తుంది

ఒక వైపు మనిషి చేతిలో పుస్తకం
మరొక వైపు చేతిలో శ్రమ సాధనం!
ఆహారం ఆలోచన వస్తువు వినియోగంతో
సంకల్పం ఉద్యోగం దశలలో ఈ జీవితం!

కర్షకు డయితే ఆ వచ్చే మేఘుం ప్రకటించే
మెరపుకు సంతోషించేను, పిడుగుకు భయపడేను

స్వాగత ముఖంతో మనిషి హృదయం! విప్పారుతుంది
కోరే చినుకుతో పాటు కోరని వరదలూ
రెండినీ సమంగా భరించేను మనిషి!
జీవన గతిలో దేనికయిన సిద్ధమైన మనసుతో

రాపిడిలో ఘర్షణలో నిగ్గు తేలి సారం చుక్కలుగా
కష్టంలో బాధలో మాత్రమే జీవన తత్వం తెలుస్తుంది
కవిత్వ మెప్పటికీ దశ మార్చేదీ, దిశ చూపేదీ
ఉన్మదుల చేతిలోనో ఆయుధం బీభత్స కారణం

కలలూ కల్పనలూ ఎన్నైనా మనస్సు భరిస్తుంది
చెదరిన వాస్తవంలో నిజాన్ని సహించలేదు
ఉన్నది పక్కకు జరిపి మనసు నాక్రమిస్తుంది కవిత
హ్లాదంలో వేదనలో హృదిలో సమ భావన నెరపుతుంది

44.

కలలో కనిపించిన మంటల మనిషిని
ఎక్కడని వెదికేరు? ఏ వైపుకు వెళ్ళేరు?
ఆలోచన అన్వేషణ అంతటా అన్నివైపుల
అనుకోని పరీక్షల్ని ఎదుర్కోవలసి వస్తుంది

సమర సన్నాహంలో ఉన్న వీరుల తేజస్సులోనా?
శత్రుతలో క్రోధం రగిలే మనుషుల మతిలోనా?

నిప్పుల విత్తులను భూమిపై చల్లే వారున్నారా?
నిప్పుల మొక్కలను తెచ్చి నాటే వారున్నారా?
నిప్పు పంట పండేనా? నిప్పు పూలు పూచేనా?
నెత్తురు చినుకులు పడి ఎదిగేనా?
అణగి మణగి శాంతి ముద్రలు చూపేనా?
కలలో కనిపించిన మంటల మనుషులు కనిపించేరా?

ప్రాక్ మానవ కథలో అనుభవాలొకటొకటీ
వీలును బట్టి నర్తనలో భంగిమల్లా తోచేను

దార్శనిక విభేదాల విస్ఫోటాల ప్రభావాలలో
మానసిక వికారాల విజృంభణల చర్యలలో
మంటల మనుషుల గుర్తులు! సమాజంలో అపుడపుడూ
కలలకు అన్వయ శోభను చేకూర్చేను

కోపంలో తాపంలో హింసతో హత్యతో
వెనక నుండి అనల కణం ఉద్రేకం పీడనలో
ఆక్షణం మంటలతో అసలు మనిషిని కప్పేసేను!
గ్రీష్మంలో దహన శీల ప్రభావాల దృశ్యంలా

జలదిలో నదిలో ఎండల మంటల తాండవం
బింబం ప్రతిబింబంలా మధ్య సన్నని రేఖతో
మెలకువలో వాస్తవం, సగం నిద్రలో కల– రెండూ,
మంటల పొగలపై నుండి "శాంతి" మనిషిలో మేఘమై

45.

కాలం జ్వాలలో కవిత ఆహుతి కావచ్చు
ఒక రణ సందర్భాన్ని తలపించవచ్చు
కాలం వరదలో కవిత కొట్టుక పోవచ్చు
ఎక్కడొ ఏ ఒడ్డునొ పడితే పడవచ్చు
ఏ ఆనవాలు కనిపించకుండా తరలి పోవచ్చు

కాలం మంచుచే కవిత కప్పబడవచ్చు
కంటికి కనిపించకుండ పొరలలో
తెర మరుగున బడి పోవచ్చు
పరిశోధన కవకాశం కలిగే తీరులలో
పిన్నలకు ఆదరువుగా పెద్దలకు వ్యాపకంగా

కాలం తోటలో కవిత కుసుమిత మయి
కంటికి ఇంపుగా మనసుకు మెప్పుగా
కవి యశో రేఖలకు ఆకారం దొరకవచ్చు
పరిమళ శోభతో ఆలోచనల్ని నింపవచ్చు

ఎడారిలో మైదానంలో బీడులో తోటలో ఎచటనయినా
కొంత లోతు వెళితేనే ప్రాణా ధార జలం దొరకుతుంది
ఏ నదికో సరస్సుకో నయితే దూరం తరల వలసిందే
లేదా జలదం వచ్చే దాకా వేచి ఉండవలసిందే

జీవన శకలానికీ కవితా ఖండానికీ సామ్యమెంతో
బింబానికి ప్రతిబింబం లానో ప్రశ్నకు సమాధానం లానో
తానెందుకు పుట్టిందీ పసిపాపకు తెలియదు
తనపై ఆశలు పెట్టుకున్న వారికి బాగా తెలుస్తుంది

ఈ ఉగాది కవితా రూపం వేరు
"ఆయుష్మాన్ భవ" ఆశీస్సులతో
పరిమళ సుమ వసంత కవచంతో
జ్ఞాపకంలో బంధువు! మనసుకు టానిక్
ఈ రోజు మనో నిలయం ఖాళీగా ఉండదు
"నో వేకెన్సి" బోర్డుకు అవకాశం మిన్నగా!

46.

వినిపించని మనిషి మాట లోటును
గాలి తీరుస్తుంది, మనసుకు పని కల్పిస్తుంది
ఎక్కడెక్కడి ధ్వనులలో అర్థాలతో
కదలే తరగల వలెనో
రాలే ఆకుల వలెనో
వివిధ శబ్ద చిత్రాలను అందిస్తుంది

మాట జారవచ్చు పూవులా ఫలంలా ఆకులా
ఎగసే నిప్పు కణ మయితే విషాదం
దూసే నిశిత శరమయితే ప్రమాదం!

ప్రవహించే నదితో పాటు మనిషి నడక
జీవితాన ఆశయం ఫలవంత మయ్యే మతితో,
మధ్య మధ్య చెట్ల నీడలలో కదలుతూ
మబ్బులపై నడచే కోరికలకు తృప్తిగా

అనుమానం భయం కావడి కుండల వలె ఇరువైపుల
కాలంతో పాటు తప్పని శ్రమ పతాక రెపరెపలతో

స్వార్థం మనిషిలో ఎంత పని కయినా పురికొల్పుతుంది
దాహంతో సమీపించి సరసిని దోసిలిలో నిలపాలనీ
పైకి చూచి ఆలోచనలో గగనాన్ని చూపుకు చుట్టేయాలనీ
నడకలో అడుగులతో అవని పయి ప్రభుత నెరపాలనీ

గస్తీలో చంద్రుని పయి నమ్మకంతో అంతా నిద్రలో
అయినా జరిగే ఘటనలు! చెవిని బడుతూనే!
వెనక ఉన్న నిజం! ఎవరికీ తెలియదు పూర్తిగా
ఎవరు బయట పెట్టేదయినా అన్నీ పాక్షికాలే

మెలకువలో లోపలి వెలుతురు నిలయానికి
బయటి నుండి చీకటి తాళం వేయబడీ
ఇది తీయ బడేది మాత్రం
ఒక అంతరంగ కిరణంతోనే!

స్వేచ్ఛా కవిత్వం-89

ఇది జీవితం

(XIV భాగం)

ఇది అందరిదీ

మాదిరాజు రంగారావు

2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 89

IDI JEEVITHAM

(XIV Part)

(IDI ANDARIDEE)

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2018

Presented to
my wife
Smt. Indira

పీఠిక

వర్తమాన కాలంలో స్వేచ్ఛా కవిత్వం ఆధునిక భావ జాలానికీ మార్పుల్లో జీవన స్థితి గతులకూ వైయక్తిక మయిన అస్తితలకూ సామాజిక ప్రయోజన లక్ష్యాలకూ తగిన వేదికగా కవిత్వ సహజ పరిణామంతో రూపొందింది.

వీటికి సంబంధించిన సంవేదనల్ని సంస్పందనల్ని వీటి ననుసరించి ఆలోచనల్ని అనుభవాల్ని ప్రతిఫలిస్తూంది. ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికతతో నిశ్చయమైన సమగ్రమైన లక్ష్యం కలిగింది.

ఆకాశంలో చుక్కలెన్నో! ఈ రోజున సమాజంలో కవులందరు కనిపిస్తారు. ఎవరి వెలుగు వారిది. అందరికీ స్వాగతం. కవిత్వం రాయడమంటే గాలి కదలినంత సులభతరం కావడం విశేషం. కవి సమ్మేళనాల్లో పాల్గొనే అవకాశాన్ని డిమాండ్ చేసే వరకూ పోయింది. మంచి పరిణామం. ఈ కృతి "ఇది జీవితం"లో పదమూడో భాగం – "అందరిదీ" వర్తమాన జీవితంలో స్థితులు ఘటనలు ఆధారంగా వాటి వెనుక నుండి పని చేసే కారణాలతో భావ జగత్తు కవితా కృతిని పొందింది.

ప్రతి ఒకరు తమ లక్ష్యంలో గమ్యం నుండి గమ్యానికి చేరుకొనే జీవన రేఖ పయి మలుపుల్ని ఎత్తుల్ని వంపుల్ని క్రమిస్తూ, మంచి చెడు పొరపాట్లు అవసరాలు పశ్చాత్తాపాలతో, వైయక్తికం నుండి సామాజికం వరకు ఎదురయ్యే వివిధ దృశ్య పరంపర దార్శనిక స్పర్శతో ఆవిష్కారాన్ని పొందింది. విషయం వైయక్తిక స్ఫూర్తితో సామాజిక విశ్లేషణంతో తాత్విక స్పృహతో నిర్వహణ శిల్పాన్ని కలిగింది. భావ రూపం ప్రతీక సముచితమైన ప్రవేశాన్ని పొందాయి. స్వేచ్ఛా కవిత్వంలో తనదైన ప్రత్యేకతను కలిగిన "ఇది జీవితం" బృహత్కృతిలో భాగం, "ఇది అందరిదీ".

– మాదిరాజు రంగారావు

ఇది అందరిదీ
(14వ భాగం)

1.

నిశా బంధు నిలయం కాదు చరిత్ర
మానవ గుణ వర్తన బింబ మయం
స్నేహం ఆర్ద్రత నీతి సమత మానవత
రాలిన కుసుమం స్థానంలో కుసుమంలా

మనిషి మనిషికీ మధ్య ఏర్పడే ఖాళీలో
సన్నని విభజన రేఖ పయి శత్రుత
అనలం రెక్కల్ని విప్ప జేయ వచ్చు
ఎదురుగ బూది పొరల తెరలు జారవచ్చు

అంటిన అంగారంతో మండే రాజకీయం
సమాజాన్ని జ్వాలలతో అలంకరించవచ్చు

స్వార్థం చివురించవచ్చు
సర్పం తల ఎత్త వచ్చు
కోపం ప్రభవించ వచ్చు
క్రోధం ఎగ చిమ్మ వచ్చు

వేదనలో సాయం కిరణం సరించవచ్చు
ఏ తంత్రం చీకటి విసరేది తెలియదు

దాహంలో ప్రాణాధార జలం కవిత
మదిలో మలినం మాపే అక్షర స్పృహతో
ముఖాన మెరపును చూపించవచ్చు
హృదిలో మబ్బును తలపించవచ్చు

ఇరు సంధ్యల సుఖద విషమ గతులతో
తెలుపు ఎరుపు రేఖల చిత్రం జీవితం
వెలుతురులో చీకటిలో కదలుతుంది కాలంతో
మలుపులతో జలధిని చేరే వరకూ

వర్తమాన తలంపై ఆశతో
భవిష్యత్తు పదం పయి నమ్మకం
మనిషిని నడిపిస్తుంది కవిత
మనసును వెలిగిస్తుంది నవత

2.

జీవితమే మనో నివాస రూపం
కవిత్వమే కాల వికాస తేజం

చేతనలో అగ్ని కణం సెగ నాలో
ప్రాణం కాపాడుతుంది ఊపిరిలో వెచ్చదనం
ఇది ఇల్లును దగ్ధం చేసేది కాదు
బ్రతుకును విస్ఫారగ చేసేది, అవును

గాలి నీరు వెలుగు భూమి జీవన కృతిలో
అందరికీ చెందినవీ! విశ్వతోమయమై
ఒకటొకటి తమ వశమయ్యేందుకు
ఉపాయాల దారులలో చతురులు మనుషులు

దాహం ఆకలి వేదన అందరిలో తప్పనివీ
రాగం సౌఖ్యం సంపద అందరు కోరేవీ
ఎవరి మటుకు వారు వ్యక్తి స్థాయి నుండి
సమాజ బాధ్యత మాత్రం మరవరానిదీ

మానస రూపంతో కనిపించని మౌలిక చేతన
అనుభవ ముద్రలతో జీవితాన్ని నింపుతుంది
బయట ప్రజల నినాదాల బరువులతో
గాలి! కాలంతోపాటుగ మనిషిని నడిపిస్తుంది

తన బలం గురించి పూర్తిగ తెలియదు,
ఎచటనో ఏదో పొరపాటు జరగవచ్చు
తలపులు చెదర వచ్చు విలువలు మారవచ్చు

కోరికలో దాగినవీ స్వప్నంలో కనిపించి
మెలకువలో పయనంలో పొందాలనీ

ఏమీ లేదనుకున్న శూన్య పటం
సరి కొత్తది ఘటనలతో నిండేను
నిరాశను ఒక వైపుకు జరిపేసి
మను ముందుకు నడుపుతుంది అభిలాష

3.

విశ్వానికి స్వాగత కిరణాలతో ప్రభాతం
మానవ భవితకు భద్రత చూపే కవితలా

జరిగే కథలో మార్పును గుర్తిస్తూ
చోటు నుండి చోటుకు పయనంలో
మనుషులతో పరిచయా లొక పుస్తకమయినా
పొందాలిసిన దెంతో ఇంకా మిగిలే ఉంటుంది

మైలు రాళ్ళు దాటుతూ దూరాన్ని కత్తిరిస్తూ
కొత్త కొత్త దృశ్యాలు! మనసును నింపేను

గగనంలో మబ్బులతో నడవాలనిపిస్తుంది
తన నీడను మబ్బుగ తలచడమొక తృప్తి
మెరపు తీగెలా తనలో కదలే ప్రేయసితో
మెలకువలో వాస్తవానికి గంధ మద్దినట్లుంటుంది

లైటు మలగడంతో హాలులో చిత్రం మొదలవుతుంది
లైటు రావడంతో విరామ సమయం అందుకుంటుంది

గంట గణ గణ శబ్దం విచలితమొనరిస్తుంది
చూడ నున్న చిత్రానికి సావధాన పరుస్తుంది
ఏదో సూచనతో ఆత్మీయ సుందరంగా
కవిత వెడలుతుంది! అడుగు ముందుకు వేస్తుంది
తన దోసిలిలో ఒదిగినట్లు అనిపించే లోకం
అంతలో విశాలతరమవుతుంది అనుభవ తలంపై

అధ్యాయ మొకటొకటి ముగిసి పోతున్నా
జరిగే కథ మాత్రం! ఇంకా సాగుతూనే
అణువు నుండి ప్రాణి దాక పలకరిస్తూ
చినుకులతో తన బాధ్యత మరవని మేఘంలా

ఎడారిలా పరచుకొన్న మానసిక దరిద్రం
బయటి జల్లులతో తీరేది కాదు
దప్పిక తీరే జల నిలయం కయినా
ఆకలి తీరే ఫల సంపద కయినా

4.

తనది కాని వస్తువు లేదు ఏదీ
అన్నీ తన కోసమే! అన్నట్లు ఉంటాయి
కోరిక లెన్నో అన్నీ నెరవేరాలనీ
ప్రతి వ్యక్తిలో అలజడి! ఎంతో

అందనపుడు తీవ్రమయిన ఆశాభంగంలో
ఆలోచనలో ఆ వేగం సంక్షోభం ఎక్కువయి
ఆత్మహత్య ఘోర విషాదం! నింద్యం
మనిషి శక్తి నీరు కావడం అభాగ్యం

జలాల పయి తేలుతూ సాగడం
గగనంలో ఎగురుతూ పోవడం
ఎపుడో ఒక సందర్భంలో జరగవచ్చు,
భూమి తోనే ఆత్మీయం అనుభవ రుచి వాస్తవం

ఆకలి తీరే యత్నం ఒక వైపు నుండి
భాగ్యం పొందే దారులు ఒక వైపు నుండి
సమస్యకు పరిష్కార పథకాలిప్పటివా?
రెండూ క్రాస్ అయ్యేది! మనిషి బ్రతుకు లోనే

తెలియని నిజం కన్న
తెలిసిన అబద్ధంతో
ఎప్పటి కపుడు సమాధాన పడుతూ
బ్రతకడం! ప్రయోగ చర్యలలో భాగం

ఎంత కఠిన మయిన దనుకున్నా
ఎంత క్రూర మయిన దనుకున్నా
కాలం మనసుకు మెరుగు పెడుతుంది
అనుభవ నీతికి పదును పెడుతుంది

ఈత వచ్చిన మనిషి ముందు అలలు
చాచిన చేతుల పయి ఒడ్డుకు చేర్చేను
ఆగని నడకతో మనిషికి ముందు పథం
విప్పిన హృదయంతో స్వాగత మిస్తుంది

5.

మేఘం ఆగమనానికి దిశ తలుపులు తెరచి
గగనం సిద్ధంగా ఉంటుంది ఆహ్వాన పవనంతో

సృజనకు కవి చుట్టూ వస్తువు లెన్నో
ఒకటొకటి తమ వంతుల కయి చూస్తూ

కవితకు గాయానికి సంబంధం అనాది నుండి
సంఘానికి జీవన వ్యవహారానికి కూడా!
భయపడి పోయే కొద్ది బాధలో
సాగే నడక నిలిచి పోతుంది! క్షణంలో

సర్పం చేరిన మూసిన పెట్టె పయి
కూరుచునే మనిషికి భయ మెక్కడిది?
నిజం తెలిసి బయట పడే ఉపాయం శరణ్యం
భయం లేని స్వేచ్ఛలో అవకాశాలెన్నో!

జరిపే విధ్వంసం తోనే కాదు
పొందే నిర్మాణం తోనూ మార్పు!

కొత్త తరం శిశువు కేకలో స్వరం
జీవన నవ రుచిని హ్లాదమయం చేసేను

పీడితుల వంచితుల దు:ఖితుల పేదల
బాధల కథలతో నిండిన కాల పేటి
మధ్యలో జారిన రహస్యాలెన్నో
వీటిని గాలి చెవిని వేయ చూస్తుంది

మేల్కొన్న చేతనతో పరివర్తన కవిలో
కాలం కవితయై హృది స్పందితమవుతుంది
నిరోధాల్ని అధిగమించి పురోగమనంలో
మనిషి మనిషినీ ఒకటిగ కలుపు తుంది

దప్పిక ఆకలి తప్పని అవసరాలలో
ప్రేమ కరుణ మానవతల అనుబంధంతో
జీవన శోభను పొందే అవకాశంతో
తన అస్తిత నిలిచేను, ఎక్కడయిన ఒకటే

6.

శిల్పంలా ఉన్న మౌన ముఖం చూచి
చింతనలో శిశిర తరువుగ మారేరు
ఒక దిశలో అనాసక్తి
ఉన్న దారిని మూసేను

జలధునిలా గల గల మాటలు విని
భావనలో పూల తీగెలా కదలేరు
ఒక దిశలో ఆకర్షణ
లేని దారిని తెరచేను

ఇష్టాన్ని అనుసరించి సందర్భాన్ని బట్టి
ఎంతటి స్థితి అయినా తారు మారు కావచ్చు
కోరిక పైనో కాల క్షేపం లోనో
ఏదయినా పొందే ఫలితం ఒకటే!

ఈ చెట్లు నదులు కొండలు మనుషులు
కోలాహలం! రోజూ చూచే సామాన్యలే!
కవితలో హఠాత్తుగ తమ రూపం మారుతుంది
అవి వేటికో! సంకేత పాత్రలు వహిస్తాయి

జీవన గతిలో లోకం కవితలో బింబిస్తుంది
కళకళ లాడే ఆశలు రంగులలో నిలుస్తాయి
మరో మనసును నిలు వరిస్తాయి ఊహను పెంచుతాయి
అర్థ శక్తి ప్రసారంలో భావమయమవుతాయి

లాగిన కొద్దీ రాగం అతిశయించినట్లు
చిలికిన కొద్దీ వెన్నలా వెన్నెల పరచినట్లు
కవితలో భావమయం శబ్ద సమూహం
నృత్య ప్రదర్శనలో చూపే వివిధ భంగిమల్లా

కేకలలో ఇపుడు ఆకలిని దాటి హక్కులు ధ్వనించేను
మనిషి ఎదుర్కొనే వాస్తవ దృశ్యం చూపేను
సమస్య నుండి మార్పుకు! ప్రేరణ అయి
"నేను" నుండి కవిత! మనం దాటి జనం లోకి

7.

రాత్రి తల ఎత్తి చూస్తే
కవి దృష్టికి చుక్కలు అక్షరాలుగా నయి
వాక్యంగా వెడలి అర్థవంతమవడం
కవి పని! ఆలోచనలో అనుభూతితో

పగలు చూపులో దిశలు
చెట్లు గిరులు నదులు ప్రాణులతో
సమాజ స్థితులకు గుర్తులుగా మలచడం
కవి స్పందనలకు చెందిన విషయం

బయటి నుండి వచ్చే గాలి
ఒంటరిగా ఉన్న కవికి సన్మిత్రం
జలాల పయి పయనించే నావలా
జీవిత మొక వాస్తవం, కలల మధ్య

తనకు మంచి లాభ సాటి అయితే
తన పేరు ఊరు మరచేను మనిషి!
కొత్తవి తగిలించుకోవడం! ఒక మార్పు
చరిత్రలో మునుముందు పరిశోధన కవకాశం

కవితలో కవి అసలు రూపం కనిపించదు
రంగులు వేసిన ప్రతి రూపం కనిపిస్తుంది

జన సంరంభంలో తనలో తాను మాట్లాడుతూనో
మిత్రులతో కబుర్లు చెబుతూనో, కదలే
కవి! అందరిలా సామాన్యంగానే బ్రతుకులో
రాసేప్పటి ఆదర్శం! కల్పనలో భాగం!

విరామ సమయంలో అందరిలా కాక
కొత్త పాత్ర కవకాశం ఏర్పడుతుంది

ఒకరికి నది! సరించేను ప్రమోద సూచకంగా
ఒకరికి అదే! నదిస్తుంది విషాద చిహ్నంగా
సందర్భం వశమయి, రెండూ వాస్తవాలే
ఎవరి స్థితిని బట్టి వారికి అట్లా ప్రతిఫలిస్తుంది

8.

మనిషి మనిషికీ పని పనికీ
ఒక వైపు నుండి అభినందనం
ఒక వైపు నుండి అభిశంసనం
ప్రజాస్వామ్య స్వేచ్ఛా సమాజంలో

అభివాదం అభిశాపం ఒకటొకటీ
మారే రాజకీయ సినేరియోను బట్టి వంతులుగా

పరిహాసం పరిభావం కాస్త రిజర్వులో
మోదం ఖేదం రెండూ పోటీ పడుతూ

సన్నివేశం మారుతుంది అనూహ్యంగా
మనిషి ప్రమేయంలో వింత చర్యతో
అభిమానం తగ్గుతుంది కోరిక వేరవుతుంది
గెలుపు ఓటమిని బట్టి అనుబంధం మారుతుంది

కిరణం చీకటి ముఖాన్ని వెలిగిస్తుంది
గ్రీష్మం లోకాన్ని హద్దులలో మండిస్తుంది
ఉగ్రతకు మామిడి చెట్టు మాడిపోదు
మధురమయిన రస ఫలాల్ని అందిస్తుంది

చేపకు వాన భయం ఉండదు
అందంగా ఉల్లాసంగా నీళ్ళలో విహరిస్తుంది
సరస్సులో పద్మం కంటికి హ్లాదకరంగా
మనిషి చేతిలోకి వస్తే హృదికి ఇష్టమైన విధంగా

పూవు లేని ఫలం లేని ప్రకృతి లేదు
మనిషికి మానవం! తోడుగా అండగా

కష్టంలో అరుపులు వేదనలో కేకలు
స్వర పరచిన కళా రూపం సంగీతంలో

చీకటిలో నక్షత్రం గాయాన్ని తలపిస్తుంది
కవితలో విషాద చిత్రానికి బంధువుగా
పరిచయమున్న దారి అయినా ప్రమాదానికి దూరం కాదు
స్నేహమున్న మనుషులయినా దోషాలకతీతులు కారు

9.

ఒక సందర్భంలో అమృత కలశంలో
బిందువు కయి తహ తహతో కదలేరు
ఆ సమయాని కెక్క డెక్కడి నుండో చేరేరు
కలశం అనృతంతో నిండి ఉండని తెలియదు

వందలుగా వచ్చేరు, బారులుగా నిలిచేరు
దూరం నుండి స్వర్ణ పాత్ర ధగధగలాడుతూ!
ఒక్క క్షణం వ్యర్థంగా గడప రాదనే
మొల కెత్తిన ఆశ! వృక్షాకృతి పొందాలని

ఆ సమయం నాటకంలో సన్నివేశాన్ని తలపిస్తుంది
ఇది చూచే వ్యక్తి కూడ! దీనిలో ఒక పాత్రగా
తన సంగతి మరచిన మనిషిలో స్వప్న చిత్రం!
పూర్తి నిజాన్ని మనసు సహించలేదు, భరించ లేదు

ఇది భ్రమ అనుకోవడం యథార్థాన్ని మరవడమే
తన బాధ్యత నుండి తొలగే ఎత్తే అవుతుంది

ᔓᔐ

రహస్యాన్ని దాచేందుకు చీకటి రాత్రిని కోరే వారూ
ఇది చంద్ర కిరణంచే బయట పడవచ్చు

పట్ట పగలు అంతా బాగా ఉందని తలచే వారూ
దీన్ని అనుకోని మబ్బులు వచ్చి కమ్మేయవచ్చు

స్వేచ్ఛలో వికార చర్యలకు తలపడే వారూ
సమాజాన్ని మరచి స్వార్థంలో పరిభ్రమించే వారూ

గర్జించే మేఘాన్ని అందుకునే ఆశలో
ఘోషించే సముద్రంలో పడి పోయే వారూ
పై అంతస్తు నుండి నేలపైకి దూకే వారూ
ఎంతటి స్వేచ్ఛలోను నేరానికి శిక్షలు తప్పవు

ఎవరికి వారు తమలో పరీక్ష జరిపితే
నూటికి నూరు మార్కులతో బయట పడాలనే
అపుడు ఎవరి బ్రతుకు వారికి అమృత కలశం
ఎటూ వెళ్ళ నక్కరలేదు, ఏ సందర్భంతో పని లేదు

ᔓᔐ

10.

కవితకు కవికీ మధ్య కనిపించని ఎడం
స్త్రీకీ పురుషునికీ మధ్యన ఉన్నంతగా
అమ్మకావచ్చు పత్ని కావచ్చు తనయ కావచ్చు
వేరు వేరు జీవన మనోబంధాలతో ఎందరో

చుట్టూర సమాజం! నీతి నిబంధనల హద్దులతో
మహా పద్మానికి రేకుల వలె
వాహన చక్రానికి అరల వలె

నేతలు వణిజులు విజ్ఞానులు ఉద్యోగులు
కర్షక కార్మిక శ్రేణులు! సామాన్యులు! సమాజంలో
ఇది ప్రజాస్వామ్యం! ఉన్న వాటిలో మేలయిందనీ

బాలికలకు భద్రత లేదు
హాలికులకు ఆదృతి లేదు
దూషణ హేళన ద్వేషం నేరం ప్రబలి
సమాజ చలనం నిరంతర శత్రుమయం!

రాజకీయ వ్యూహంలో విషవల్లీ సుమాలతో
మానవీయ దృశ్యంలో దుర్గంధపు పవనంతో
ఈ దేశం ఇంకా నవ నిర్మాణ క్రమంలో
తరం నుండి తరానికి పెరిగే అవసరాలతో

ప్రకృతిని లొంగదీసే శక్తులున్న మనిషి
మరో మనిషి బ్రతుకును దీనం హీనం చేసేను
దారిన వెలుగులు చూసే బదులుగా
నెత్తురు చుక్కలతో అలంకృతమవుతూంది

డబ్బు ఉన్నా బలం ఉన్నా కళా హృదయం తోనే ముందుకు
కవిత అయినా శిల్పమయినా చిత్రమయినా అస్తితలో
దాగిన నిజం బయట పడుతుంది కళలో
తెలియని సుందరత మనసు నావహిస్తుంది

రస కళతో పచ్చదనం అవనికి అందం
సమత మమత మానవతలు బ్రతుక్కి సార్థం

11.

శిశు దశ నుండీ అంచెలుగా సమాజ బంధం
వ్యక్తిని సజీవ శిల్పంగా తీర్చి దిద్దుతుంది
సమాజ శిక్షణలో సంస్కార వికాసంతో
విత్తు నుండి చెట్టులా పెరిగేను మనీషిగా

శిల్పం పూర్వపు శిల రూపం పొంద లేదు
ముక్కలు చేయబడీ మూర్తి తృప్తి పొందవచ్చు

మంచు కొండ వలె మౌనం తేజంతో
కరగి కరగి ప్రవాహ గమనంలో
గల గల మాటలు వినిపించవచ్చు
ప్రసార శక్తితో దూరం పయనించవచ్చు

ఎదురుగ పార్కులో స్తంభం తలపై
వెలిగే గుండ్రని విద్యుత్ బల్బు
పగలంతా తిరిగి తిరిగి ఇష్టంగా
రాత్రికి చేరిన పావురాన్ని తలపిస్తుంది

అశాంతిలో మరచింది జ్ఞాపకం చేస్తుంది
శామన సందర్భానికి ప్రతీక అవుతూంది

కాలం తనకు తాను కనిపించేది కాదు
కావలసిన దాన్ని బట్టి అనుభవంలో
చేతిలో కలం కావచ్చు, బుజంపై ఆయుధం అవచ్చు
కాలానికి మంచి చెడు భేదం లేదు, తెలియదు

సంగీత ప్రదర్శనలో అపశ్రుతి కూడా
సందర్భాన్ని బట్టి భాగమయి పోతుంది

ప్రతి మనిషి తాను స్వచ్ఛంగా ఉండాలనే
వీధిలో దుమ్ము ఎగసి మలిన పరచవచ్చు
దోషంలో నేరంలో మనో రూపం మునగవచ్చు
మలినం కాని మనిషి లేదు! సమాజంలో

చెట్టు సంపదలో పూవు ఫలం! మాత్రం కోరే ప్రజలవి
మనిషి వ్యక్తితలో మాటలు చేతలు బ్రతికే సమాజానివీ

12.

ఎక్కడ చూచినా 'శాంతి' మాట వినిపిస్తుంది
బయట దీని కొక స్థాయి స్థితి లేదు
లో నుండి ప్రభావ రూపం తప్ప
బయటికి అనుభవ రమణీయంగా

ఎవరి భయానికో ఎచట దాగి ఉందో?
ఎవరి చేత అణచి వేయబడుతూందో?

ఆదర్శం ముందు మనిషి చిన్న మొక్కలా
ఆకులు వేసేదీ పూలు వచ్చేదీ నిర్బంధంతో కాదు
సమస్య ఒకటే అయినా సమాజంలో
స్వేచ్ఛలో విభేద పథాలనేకం, అనివార్యం

పరిష్కారం ఏ పెట్టెలోనో ఏ కొమ్మపైనో ఉండదు
సహనం సమన్వయంతో ప్రజాస్వామ్య చేతనతోనే
దార్శనికంలో అడుగు జారే అవకాశాలెన్నో
నిబద్ధతతో నిలవడమొక అసిధారా వ్రతం

అన్ని రుతువులూ ఏదో సందర్భంలో
అసహనం చూపుతాయి విపరీతం నెరపుతాయి
కష్టంలో సానుభూతి కెవరో రావాలనే
సమాధానపడుతూ సరిపుచ్చుకునేను జీవితం!

శిథిల నిలయ శకలాలు చరిత్రలో తేలుతూ
నవ నిర్మితిలో భవిత! అడుగు ముందుకేస్తుంది
వేయి వేయి కళ్ళు చేతులు కాళ్ళతో
పది తలలూ ఒకే ఒక ఆలోచనతో, అవసరం లేదు

అతిశయం ఆర్భాటం ఓటమి అంచులలో
ఒక మస్తిష్కం చాలు! మేధతో గెలుపు, మనస్విదే

ఎవరికీ తమ ఇష్టం ఎప్పటికీ పని చేయదు
కొంత తెలిసినవీ తెలియనివీ పలు కారణాలతోనే
విధ్వంసం నిర్మాణం రణం నుండి శాంతి సమ న్యాయంతో
చేతిలో భవిష్యత్తు! వచ్చి వాలుతుంది పావురమై

13.

ఎక్కడికి చేరేది ముందుగ తెలియదు
ఇక్కడికి వచ్చాక తన దయి పోతుంది
మనిషి నుండి వెలుగు మనిషి! తోడుగ
ఎవరూ ఆప లేని పయనం! సమాజంలో

సర్పంలా అవని పయి కదలేనా?
విహంగమయి నింగిలో ఎగిరేనా?
గాలికి ఊగే చెట్టయి నిలిచేనా?
దేనికి కదలని గిరి అయి ఉండేనా?

వ్యక్తిలో స్మృతి నిలయం అనుభవ చిత్రమయం
ఇది తన స్వంతం! అపహరింపబడేది కాదు

రోజు రోజుకు సమస్యల బరువులు
పెరుగుతూ ఎక్కడ వదలాలో తెలియదు
భూమి పయినా? నింగిలోనా? జలధిలోనా?
నదిలో అలల పయినా? ఆలోచనలెన్నో?

సమయం కయి వేచి వేచి బాధలలో
చివరకు వదిలేది! ఆ వెనక మనిషి పైనే
ఉండేది మనిషిగా, బ్రతికేది మనుషులతో
కాలం విసరే ప్రశ్నకు, తానొక జవాబుగా

రోజు రోజు దేని కది స్వతంత్ర మయింది
రెండిటికి మధ్య బంధం సమాజ చలనంలో
గొలుసు గనో మాలగనో, కాలం సాగుతుంది
ఏ బ్రతుకులు కాల విభాగంతో ముక్కలు కావు

క్షణం నుండి క్షణానికి మనిషి
కొత్త ప్రపంచంతో పరిచయమేర్పడుతూ
తెలుపు రాత్రి! నలుపు రాత్రి! ఎరుపు పగలు
మూడు రంగులతో బ్రతుకులో పచ్చదనం కయి

14.

క్రింద భూమి ఎంతో! వాత్సల్యంతో
ఎప్పటి నుండో సహన గుణంతో
నా కోసం వేచి ఉన్నట్లుగా ఉంది
అవని పైకి వచ్చేసాను! అవలీలగా
సరిపోయింది, అంతా! బాగానే ఉంది

పైన నింగి, ఎన్నో! ఆశీస్సులతో
ఎంతో ప్రియ భావనతో ఆర్ద్రంగా
పగలు రాత్రులు రవి చుక్కల కళ్ళతో
నేల నుండి చివరకు తన కడకే
దివికి మనిషి చేరేనని పేరాశతో

భూమి నన్ను వీడేనా?
నేను భూమిని వదలేనా?
ఎవరు చెప్పగలరు? తెలిసే దెవరికి?
అణువణువున కణకణం ఇముడ్చుకునేనా?

చుట్టూ జన సమూహాలు మానవ సంబంధాలతో
భూమికి ప్రకృతికి రుణ పడిన బ్రతుకులతో
తుది ఊపిరి గాలిలో కలిసి పోయి ఒకటై
దేహం తన చేతులకందిన పరితృప్తితో భూమి!

గాలి కదలిపోతుంది క్షితిజంలో! అదృశ్యంగా
యశో రూపాన్ని వదలి సమాజశాలలో
ఎప్పటి నుండో వేచి ఉన్న
అనంతమైన గగనం సంగతి?

తనకు దక్కేదేమని ప్రశ్నిస్తే?
మాటకు అందని కనిపించని అనుభవం
దక్కుతుంది! అమూల్యం! అలవోకగా
మనిషి కీర్తి రూపం! ఏదో ఒక రంగులో!

15.

చేసే పని ఉపయోగంలో పొందే విలువలు
కాలాంతరాన పరీక్షలకు గురి అవుతాయి
వ్యక్తుల ఉనికికి భద్రత చేకూర్చవచ్చు
సమాజ ప్రగతికి అనుకూలం కావచ్చు

శ్రమ జీవన సంరంభంలో
పగలు కల్పనల కవకాశం లేదు
కఠిన వాస్తవాలతో ఎదురుగ
ముళ్ళతో గులాబీల వలె ఆకర్షణతో

నిశ్శబ్దాన్ని కోరే మనసు
అది ఎట్లా ఉన్నా రాత్రిని వరిస్తుంది
చుక్కలకు తన కథ వినిపించవచ్చు
వెన్నెల వస్తే! హ్లాద మయం కావచ్చు

నింగిలో ఆశామయం చంద్రబింబం
ప్రియా మనో రూపాన్నో
శిశువు నవ్వు ముఖాన్నో
తలపించడమే కాదు, పరవశింప చేస్తుంది

రాత్రి బంధితుల్ని విడిపించే
చేతులతో ఉదయ రశ్మిలా కవిత
ప్రజాస్వామ్య స్వేచ్ఛకు శాంతి బలంతో
సృజన మతికి అవకాశం దొరకుతుంది

మంచులా పేరుకొన్న కలలు కరగి కరగి
వాస్తవమై సరించేందుకు తేజమవసరం!
ఆలోచనలో వెన్నెలతో చంద్రుని కన్న
ఆచరణంలో ప్రేరణతో సూర్యుడు మిన్న

జగతికి తెలిసిన యథార్థమయినా
ఒకరొకరి నుండి ఒకొక్క విధంగా
ఒక భాష నుండి మరో భాషలోకి
అనువాద కవితలా! భేదాలెన్నో!

16.

ఏ దేశమయిన ఏ మనుషులయిన
గాలికి అన్నీ అందరూ సమానమే
శిఖరాలను ప్రేమతో స్పృశిస్తూపోతుంది
అలలను గోముగా దువ్వుతూ వెళుతుంది

వెలుగుకు వస్తువులన్నీ ఒకటే
ఒకటి చూపి, మరొకటి దాచదు

చెట్టుకు ఆశ్రయ రూపం అందరిదీ
ఎవరికయిన పూవు ఫలం నీడ అందిస్తుంది
తర తమ స్థాయిల్లో ఏ భేదం లేకుండా
మమతకు సమతకు సుందర నిలయంగా

తనువుకు తప్పని దయినా
మనసుకు వృద్ధత లేదు

బాధను చూచిన కవి
అది ఎంతటి దయినా
అక్షర పంక్తులలో తీర్చి
అనుభవ చిత్రం దింపేను

ఏ పాప కళంకాన్ని తుడిచేసే కిరణం లేదు
వెలుతురు పశ్చాత్తాపాని కవకాశం చూపుతుంది
ఏ శాప ప్రభావాన్ని తొలగించే మాట లేదు
పశ్చాత్తాపంలో మనసుకు వెలుగు దారి దొరుకుతుంది

రెండూ స్వేచ్ఛలో విపరీతాలకు
దారులు మూసే మానస కవాటాలు!
రెండిటికీ ఏ మనిషి దూరంగా ఉండలేడు
ఉంటే! ఇలపై రవి కీర్తిని జయించినట్లే

మానస పుష్పానికి పరిమళ ప్రసరణలో
ఏ భేదం లేదు! మనుషులందరూ ఒకటే
కుసుమాలెన్ని విధాలో! మనసులన్ని విధాలు
చెట్ల జాతి వేరయినా, వన సమాజ మొకటే!

17.

ఇంద్ర ధనుసు వంతెన పయి
నడుస్తూ బ్రతుకు బాటలో
బాధలు చుట్టిన శరీరంతో
నేలపైకి దూకేను వేదనలో మనిషి!
అనుమానం లేదు! మబ్బు ముక్క కాదు, మనిషే!

నాలుగు దారుల కూడలిలో
ఎదురు పడే మనుషుల్ని లెక్క పెడుతూ
చాచిన చేయితో నిలిచి నిలిచి
పోయే దారిని క్రాస్ చేసే లోపల
దూసిన వాహన చక్రం క్రింద! నలిగి
చెల్లా చెదరయింది! అవును, మనిషే!

బ్రతికే హక్కును దూరంగా విసరేసి
కష్టాలను దాటే మనో బలం తగ్గిపోయి
సమన్యాయం పయి కోరిక సన్నగిల్లి
ఉరిపై చూపులతో! అవును! ఆ మనిషే!

ఎపుడో అపహరించి దాచిన డబ్బును
పంచి పెట్టే పెద్ద మనిషి! లేకపోలేదు
పైనుండి చుక్కల వలె మెరసే నాణాలు
చాచిన దోసిలిలో పడేనని ఆశతో
రాత్రులు కన్నార్పకుండ ఉన్నది! మనిషే

అలజడి వాహనం పయి అశాంతి ఊరేగుతూంది
బాధ్యతల్ని భద్రంగా అల్మెరాలో దాచి పెట్టి
హక్కుల్ని కత్తులుగ తీర్చి ముందు ప్రదర్శనలో
రేపటి మార్పుకు సన్నాహంలో ఉన్నది మనిషే!

నవ్వుతూ ఏడుస్తూ వీధులలో తిరుగుతూ
తన ఆర్తిలో సంగీతం ఎవరికీ పట్టని దయి
ఉదయం పత్రికలో కార్టూన్‌లా
వీధి మూలన కూర్చుని ఉంది! అవును మనిషే!

18.

నేలపై నుండి చూపు దిశలలోకి
పయనంలో బిందువు నుండి గమ్యానికి
దారిన ప్రేమ కరుణ వీర భయ రూపాలల్లుకొన్న
సంశ్లిష్ట జీవితాలతో సమాజం! వ్యూహ రచనలో

ఇందులో రహస్యమేదీ లేదు, అంతా బయలే
బ్రతుకులో వాస్తవ స్థితులతో ముడివడింది
పోయినంత మేర ఎవరో ఒకరు కలుస్తారు
స్మృతిశాలలో స్నేహ గంధంతో నిలుస్తారు

విరామ మెరగని కాలం, పోయే కొద్దీ నడిపిస్తుంది
ఆగక తప్పనివి! గిరిశిఖరాలో! అగాధాలో
దాటే ఉపాయ మవసరమవుతుంది
ఆరోహణలకు బలం ముఖ్యమవుతుంది

దిశల నుండి ఏదో శబ్దం! తోడవుతుంది
పోయినంత మేర ఒంటరి తనాన్ని మరపించేను

తలపుల్ని పంచుకోడానికి సిద్ధంగా
మనుషుల వలె, చెట్లు! ఒకటి తర్వాత మరొకటి
మనసులో అనాది పరిచయ బంధాలతో
సమాజంతో అనుభవ ప్రపంచాన్ని నిర్మించేను

చీకటిలో వెలిగే దీపానికెంత అతిశయమో
తానొక చిరు సూర్యుని వలె యశస్సుతో
స్నేహానికి సదవకాశాన్ని ఇస్తుంది
అనుమానం తెరను తొలగిస్తుంది

చీకటి సరించలేదు, ఫలకం వలె నిలుస్తుంది
విడుదలయ్యే వెలుతురు బొమ్మలకు నిలయమై!

పంచు కొనే వస్తువు కాదు వెలుగు కవితలా
ఎంత మంది అయినా అందరికీ సమంగా
ప్రజాస్వామ్య సామ్యవాద భావ సమాజానికి
అక్షర దృశ్యంలో ప్రతినిధిగా! నిలుస్తుంది

19.

ఊరు నుండి మెరుగయిన స్థితి కయి
బయటికి దూరం వెళుతూంటే ఉత్సాహంగా
మంచి కయి అమ్మ ఆశీర్వదిస్తుంది
హితం కోరి నాన్న సూచన లిచ్చేను

వెలుగు పూలు పూచిన ముఖంతో
తిరిగి రావాలని, చుట్టూ ఉన్న ప్రజలు!

పద్మానికి రేకుల వలె అయువు రోజులు
రోజుల అమరికతో జీవితం మనోమయం

చెట్టు నుండి రాలిన ఆకు పూవు ఫలం
తిరిగి వెనక్కి వెళ్ళే అవకాశం లేదు

వేదనలో కత్తి మొనయై నిలిచేకన్నా
పయనంలో పడవ అయి తేలడం మేలు

నిరాశలో ఉరిత్రాడు నందుకునే కన్నా
ఆలోచన! వంతెన అయి దాటితే మంచిది

ఆదిమ కాలంలో స్థితిలా ఉండాలను కోకుండా
వికాస చరిత్రలో భాగం పొందే కోరిక సహజం!
అవసరమూ అభిమానం మధ్య మనసు ఊగుతూ
ఇది సులభంగా తీరేది కాదు! విరోధాలెన్నో

చేతులు కాళ్ళు ముఖం పాతవే! ఎప్పటివో
ఆలోచనలో ఆచరణంలో మార్పులు కొత్తగా

ఊరు గుర్తు పడుతుంది తిరిగి వచ్చిన వ్యక్తిని
గాలి తంత్రులపై మనిషి స్వరం స్వనిస్తుంది
ముఖాన చూడని వెలుగు చిత్రం కనిపిస్తుంది
దాహం తీర్చిన ఊరి చెరువు గుర్తు పడుతుంది
నీడ నిచ్చిన చెట్టు స్వాగత రూపం వహిస్తుంది
వికసించిన ముఖాలతో స్మృతి వనం! ఆప్తంగా
బ్రతుకులో ఆధునికం ప్రగతికి రహదారియై
కవితలో భావ చిత్రం! సరికొత్త రేఖలతో

20.

వ్రాసే పెన్ను! రిఫిల్ మొనతో పాటు
దాని నీడ కూడ కదలుతుంది కాగితంపై
వీడని ప్రియ బంధంలో! బింబంలా
కవిత! అయితే కవికి మరీ ఇష్టంగా

రోజు వెంట రోజు గడుస్తూ
ఆయువు పెరగడ మంటే
కాలాన్ని జయిస్తూ పోవడమే
ఆ రోజు తనదయి పోతుంది

శత్రువును కనిపెట్టడం బహు సులభం
ఎదుర్కొని పై చేయి సాధించడమొక సమస్య

బ్రతుకులో బాధ మనసులో వేదన
రెండూ జంట కవులుగ కవితను వినిపిస్తాయి
కవిలో వ్యక్తి నుండి సృజనలో అభిలాష
సామూహిక చేతనతో విశ్వమయ మవుతుంది

సాంధ్య వేళ సందేహం ఎంతసేపో ఉండదు
కాస్త ఓపిక పడితే, అటో ఇటో తేలుతుంది
ఉదయం వైపో! నిశవైపో! తూగుతుంది
ఇది కాలానికే కాదు, మనిషి జీవితంలోనూ

బాధలోనో కరుణలోనో కన్నీరు జారడమో!
చీకటి కరవాలం అంచును తాకడమో!
చల్లబడిన నీడలలో పాములు చరించడమో
సందర్భం లేకుండా జీవన గతిలో ఇరువైపుల!

ఊరు నానుకొనీ సెలయేరు జలజల పారుతుంది
ఇది అలంకారం కాదు, జీవితానికి అవసరం

నింగి నుండి వాన! భూమి నుండి మొక్క
మనిషి నుండి త్యాగం! జన హిత రూప మయి
అక్షరానికి లేదు, ఏ పక్షం, ఏ భేదం
అమృత బిందువు రాలవచ్చు, ఆయుధం ప్రేల వచ్చు

21.

సమయం మనిషితో మనిషిని కలుపుతుంది
సందర్భం! మనిషిలో విలువను తెలుపు తుంది
నిజం కయి మనిషిలో అన్వేషణ సాగుతూనే
కవితలో తెలిసిన నిజం చోటు చేసుకుంటుంది

వర్తమాన చక్రం ఎప్పటికీ తిరుగు తూనే
కాలంతో పాటుగ బ్రతుకును నడిపిస్తుంది
పైన మబ్బులా నడవాలని కోరిక సహజం
కరుణ జలంతో కిందికి జారడ మొక విశేషం

దీనత పోయేనా? హీనత తొలగేనా?
ఆదర్శ బింబంగా కల్పనలో బ్రతుకు సాగదు
అద్దాల అల్మెరాలో మెరసే గాజు వస్తువు కాదు
చేతి నుండి జారి పగిలే మట్టి బొమ్మ కాదు

అవసర సమయంలో ఆదుకునే నీడ
మనిషి కన్న ఎంతో ప్రియమై కనిపిస్తుంది

"నేను" తో శిఖరాయమాణ సందర్భం
చరిత్రను సంస్కృతిని వెనకన నిలిపి
వివేకాన్ని విజ్ఞానాన్ని పక్కకు జరిపి
క్షణంలో కూల్చబడే పేక మేడ కాదు జీవితం!

చేరిన మైలు రాయి వద్దనే ఆగి పోయి
అదృష్టం కలిసి రాలేదని నింద! సూటిగా
మైలు రాయి దాటి ఆశల మెట్లపై
సాగే కాళ్ళకు బడలిక ఎక్కడిది?

గ్రీష్మానికి వర్షకు మధ్య మార్పుకు అవకాశం
సూచనగా ముందుగ తెలిసేది మనసుకే
శిశిర వసంతాలకు మధ్య మార్పుకు
చిహ్నం తెలిసే దొక హృదయానికే!

భావ లహరిపై తరలి తేనే, ఏదైనా తెలుస్తుంది
అనుభవ శిఖరం చేరితేనే, ఎవరెవరో తెలుస్తుంది

22.

సమయం ఆగదు మనిషి ఆగవచ్చు
రావలసిన లిప్త కయి ఎదురు చూడవచ్చు
ఏదీ ఆగదు అన్ని జరిగి పోతూ ఉంటాయి
మొదటి సారి కవిత స్విచ్ ఆన్‌తో ప్రకాశ రూపమై
కొత్త మనిషి కొత్త జగం పరిచయమవుతుంది
ఒంటరి మనసుకు తోడు మిత్ర మవుతుంది

వర్తమానం భవితకు మార్గం సూచిస్తుంది
లిప్తలు గతమవుతూ వర్తమానానికి దారి ఇస్తాయి
ఎవరి పనులలో వారు విస్తరణ చర్యలలో
మరొకరి కథలను వినే అకవాశం తక్కువగా

హాలులో ప్రేక్షకులెవరో నిదుర కొదిగి ఉన్నారని
నాటకం ఆగదు, పాత్రలు తెర వెనక్కి వెళ్ళవు

తెరపై ఫోకస్‌లో బొమ్మలు! మనుషుల భ్రమతో
ఫోకస్ నిలిచిపోయి! నిజ రూపం బయట పడేను

నిద్రకూ మెలకువకూ మధ్య ఊగుతూ
అదే! నిజమైన ప్రపంచమని భ్రమించేరు
కాలం ఆగదు! ఆగినట్లునిపిస్తుంది
కష్టంలో బాధలో ఒరిగిన చెట్టును తలపిస్తుంది

పై అంతస్తు నుండి నేలపై జారిపడి
ప్రమాదంలో నేలపై పడి ఉన్న శరీరం
గాయాల బాధలో విలవిలలాడుతూ
శవ మయ్యేందుకు సంసిద్ధం కాదు

మనిషి వెనక గతం, తోడుగ వర్తమానం
దూరంలో భవితతో నిర్మలంగా
స్ఫటిక సుందరంగా సమయం
ఎపుడే రంగుల ప్రభావం చూపేది తెలియదు

ఓటమి గెలుపులు బ్రతుకును తారుమారు చేసేను
కాలంపై బరువు జార్చి మనిషి! తప్పుకో జూచేను

23.

మెలకువలో మనస్సుతో సమాజానికి చైతన్యం
మనిషితో మనిషి పరిచయ కథ విశ్వమయం
దూరాలను కలుపుతుంది మానవీయ కిరణం
రహస్య మేమీ లేదు, ఇది తెరచిన దిశా వలయం

బాధలు ముళ్ళవలె, దు:ఖం మంచు వలె
భయాలు చీకటిలా, ఎదురవుతాయని తెలుసు!
తెలిసిన విషయంలో చింతలు తక్కువగా
వెలుతురులో టార్చ్‌లైట్ అవసరం లేదు

హృదయ కుసుమం ప్రేమ గంధం,
ఎక్కడ బడితే అక్కడ దొరకవు
అవసరానికి మనిషిలో వెలుగు పాత్రతో
మనో దృష్టి ఎక్స్‌రేకు మాత్రమే కనిపిస్తాయి

పచ్చని సమాజ వనంలో రేగిన అగ్ని శిఖలు
ఆరేది! ఉదారమయిన కరుణ జలంతోనే
గులాబీల అందం, మల్లె పూల పరిమళం
వెన్నెల హ్లాదం! ఉదయ భామ కిరణం,
ఎక్కడయిన ఒకటే జీవన రుచిలో
మనుషులలో అనుభవైక గుణ సుందర కళతో

మంచులో నీరులా ఘటనలో నిజం
బయట పడేది ఉష్ణ రశ్మితోనే
అమృత కణం జారాలని ఆశతో
మనిషి వేచి చూడడమొ విచిత్రం!

సాధారణమయిన గాలి ఒక్కొక సందర్భంలో
కల్లోల పరుస్తుంది నిశితంగా వేగంగా వీచి

"ఏది పోయినా పోనీ!" "ఆనందం ముఖ్యం!"
ఎన్నిటితోనో కూడిన అస్తితతోనే జీవితం

24.

ఇది ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనిక పథం
ప్రతి మనిషికి సమానమయిన అవకాశ గుణంతో
స్వేచ్ఛకు సమతకు ప్రేరణ రూపం
జీవన చలనంలో జన శక్తికి కేంద్రం

సృజన రూపం ధరిస్తుంది కవితలో
పచ్చదనంపై ఆశను బ్రతికిస్తుంది

చేతిలో కత్తి ఉన్నా శాంతి కవచంతో
గుండెపై బరువు ఉన్నా ఉత్సాహ కళతో
ప్రేమ కరుణ రెండు రెక్కలపై ఎగిరి
ఆర్తి హరణమై పవనం గంధమయం చేస్తుంది

రణంలో పద ఘట్టనలో నలగి కలగి
అనలంలా శోకం అల్లుకొని వేదనతో
అవని తలం నెత్తురు చిత్రమయమయ్యేను
చినుకులతో నేల! పచ్చదనం కోరుతుంది

ఆశా నిరాశల మధ్య దిశలు తాకుతూ
సందేహం ఊయెలపై ఊగే మనిషి
అడుగు కింద ఆన గనే నేలపై
చల్లారని వెచ్చదనం! బాధిస్తుంది

ఈ భూమి ఎవరిది? అంటే! అందరిదీ
చల్లని అనుభవంతో శాంతి సుందరమయింది

ఒక కవితకు తప్ప! ఈ జీవితం
ఏ వాయిద్యానికీ అందని స్వర చక్రంతో
పరిక్రమిస్తుంది! క్షోభకు గురియై సమాజం
అపుడపుడు విరామంలో గమ్యం తలుపుకు వస్తుంది

పాయలు పాయలుగా చీలిన ప్రవాహ రూపం
పలు విధాల పయనంలో దిశదిశలో లాభిస్తూంది
అన్నిటినీ తనలో ఇముడ్చుకునే విపులతతో
కవి మనో మూల మిపుడు! నిర్వచనాల కతీతం

25.

వ్యక్తి ఏదో ఒక గుర్తు తనది
వదలి వెళిపోయేను, అదే అమరం
ఎదురుగ లేని మనిషిని జ్ఞాపకం చేస్తుంది
కాలానికి అలంకార వస్తువు అవుతుంది

దీనికి సంఘంలో వర్గాలతో విభేదాలతో పని లేదు
పొందే ప్రయోజనంలో ఎవరి అర్థం వారిది
తాను చేసే పనిలో మర్మం
ఒక అంతరంగానికే తెలుస్తుంది

మిత్ర సమితి కావచ్చు కుటుంబ వలయం కావచ్చు
ఊరు నగరి దేశం ప్రపంచం దాకా
ఎక్కడికక్కడ సమాజ పరమయి పోతుంది

కీర్తి ప్రవాహంలో నీరు ఎక్కడి కక్కడ అందుకొనీ
ముందుకు పోను పోను వర్తమాన స్పృహలోనే
వెనకనే గతం మునుముందు భవితతో

ఎదురుగ ఆలయ శిఖరం నిలువున మినార్
కనిపించని వస్తువు వైపు చేయి ఎత్తి చూపుతాయి
భయం నుండి మనసును ముక్తం చేస్తాయి
మనిషిని తల ఎత్తుకొని చరింప చేస్తాయి

సమాజ మెప్పటికీ ధైర్యం గానే ఉంటుంది
వ్యక్తిలో మాత్రం భయం తీగెలుగా సాగేను

తరాల పయి ప్రభావ శీలంతో వ్యక్తిత్వం
చేతనతో సమాజంపై ప్రభావ శీలంతో
ఏదీ ఆగదు జననం హననం ఆర్తి ఆందోళన
ఉపకృతి అపకృతి చర్యలు ప్రతి చర్యలు జీవితంలో

గమ్యం చేరే పనిలో మనిషి అవసరాలలో
దిశ తలుపులు మూతపడవు తెరచే ఉంటాయి
వర్తమానం కదలుతుంది పదును బ్లేడులా
అనవసరమయింది నిర్దయగా తొలగిస్తుంది

26.

ఇది నాటక శాల! ఎందరితో ఎన్ని దృశ్యాలో
ఎన్నెన్ని వార్తలతోనో రోజు వారి పత్రికలా
అనుభవానికీ అంతరాత్మకూ మధ్య గోడ
అటు నుండి ఇటు 'ఇటు నుండి అటు చూచే వీలు లేదు
గోడపై నుండి పైకి ఎగిరి రావలసింది
అంత అవసరం కోరిక! ఎవరికి ఉంటుంది!

చిత్ర పటంలో ఇంద్ర ధనుసు దృశ్యం
నీలి మబ్బుల రాక కెదురు చూచేనా?
చిత్ర పటంలో అలలతో కదలే దృశ్యం
దాహం తీరే మనుషులకయి చూచేనా?

కదలని వాహన చక్రాల్ని ఊడిన విమానం రెక్కల్ని
సరి చేసే పనిలో కొందరు! సుదీర్ఘ పయనంలో
పంచాంగం ముందు పెట్టుకొని గుణిస్తూ
జరిగిన చరిత్రతో జాతకాన్ని పరిశీలించేరు

ఈ యుద్ధం ఎవరిని రక్షించడానికి? అంటే
ఈ కలహం ఎవరిని బాగు చేయడానికనీ వెంటనే
దేని కోసం గ్రీష్మం వస్తుంది చండగా?
దేని కోసం శిశిరం వస్తుంది దీనంగా?
ప్రకృతి సమాజం జీవితంలో సూక్ష్మంగా
అన్నీ కార్య కారణ సంబంధంతో పర్యవసానాలే!

వాస్తవాన్ని వెదకి పట్టుకొనే పనిలో కొందరు
కల్పనలో కాల క్షేపంతో గడిపే కొందరు
సమాజ స్పృహ నుండి దూరమవడం అసంభవం
మానవ శక్తి నుండి వేరు కావడం అసాధ్యం

ఉదయం ఖాళి సంచిగా మొదలయిన మనసు
రాత్రులు నిదుర వేళకు పూర్తిగ నిండుతుంది
చీకటిలో వినబడే పాటను చెవి ఒగ్గి వింటారు
వెలుతురులో వినబడే పాటను ఏదో పనిలో వింటారు

27.

శుచిగా శుభ్రంగా అవతరించిన ఉదయం
నీలి మబ్బు కమ్మవచ్చు
మంచు తెరలు జారవచ్చు
దారాలుగ వర్షం దిగవచ్చు
రాత్రి అంతా చీకిటిని ఈది ఈది
బంగారు నావలో గట్టెక్కేను సూర్యుడు!

హఠాత్తుగా పిడుగు జారి ధ్వంసమయిన చెట్టు
పూర్వపు పచ్చని రూపం తిరిగి పొందేనా?
మనిషి చేత కాకపోవచ్చు
దైవం చేత అయ్యే పనేనా?

దైవ మింత పని చేసేనా?
పొరపాటును దిద్దు కునేనా?

పెను తుపాను వరదల్లో
కొట్టుకొని పోయిన ఊరు
స్థానంలో మరొకటి రావచ్చు!
పోయిన మనుషులు వచ్చేరా?
మనిషి చేత కాదు నిజమే!
మరి ఏ దైవం చేత నవుతుంది?
ప్రశ్నలు సహజం! మనిషిలో ఎప్పటికీ!

కష్టాల జోరు తగ్గి కాస్త తెరపిలో
ఆకాశంలో విరిసిన ఇంద్ర ధనుసు అందంగా
మనిషిలో ఆశా సౌధాన్ని నిలుపుతుంది
బ్రతుకుపై అభిరుచి యథాతథంగా సాగుతుంది

శిశు దశ నుండి పరిణతి వరకూ బ్రతుకులో
ప్రతి లిప్త ఒక పూవులా! వికసించాలనీ
అందం పరిమళం ఎదకు హత్తుకునే లోపం
దీన గళం నుండి బాధా స్వరం ఫుల్ స్టాప్ పెడుతుంది
ఇంటి ముందు తుమ్మెద ఝంకారంతో నాలుగు చుట్లు తిరిగి పోయేను
వీధిలో హక్కుల నినాదం, కూర్చున్న మనుషుల్ని తట్టి లేపేను

28.

బ్రతుకు దు:ఖభవం కాదు
కవిత కూడ అదే విధం!
మధ్య మధ్య మలుపులలో
కష్టం ఉండవచ్చు నడకలో

బాధ అగ్ని కణం వంటిది
దగ్గరకు వచ్చే కొద్దీ
వెచ్చని సెగ నుండి వేడిలో
దహన క్రియ మొదలవుతుంది

ఆర్తిలో అగ్ని స్పృహ
బాధలో ఉష్ణ స్పృహ
శత్రుతలో మంటల ప్రభుత
క్రోధంలో దహన కాండతో

సెగ అయితే ఫరవాలేదు
దేహం చలి కాచు కోడానికి
మంట ఫరవాలేదు, మోస్తరు నుండి
స్థాయిల్లో పచనానికి పనికొస్తుంది

రాజనీతి చలనంలో సుప్తంగా
పరివర్తన కథలో గుప్తంగా
ఇరు సంధ్యలలో జ్వాలా రూపంలో అందంగా
మనిషిలో అగ్ని కళ! తేజో మయమై
ఇది బాధకు చిహ్నం కాదు
మేలు కోరే భవితకు ప్రేరణం
వెలుగుతో నీడలా పూవుతో తొడిమలా

నదితో మట్టిలా బ్రతుకులో బాధ
ఎవరితోనూ పాలు పంచుకునేదే కాదు
విషాదంలో సానుభూతితో పాటుగా
మానవతకు పరీక్షగా ఆకర్షిస్తుంది
కవితలో ఆర్ద్రతకు ఆకరమయి వెలుగుతుంది

29.

పంజరంలో పక్షిలా భద్రంగా ఉండాలనిపించవచ్చు
బోనులో పులిలా క్షేమంగా నిలవాలనిపించవచ్చు
భద్రత క్షేమం రెండు కరువయి సమాజంలో
పంజరమొ బోనొ! మనిషి ఇష్ట పడేను

దృశ్యం కనిపిస్తుంది, ఎవరయినా చూడవచ్చు
మాటలు వినిపిస్తాయి, ఎవరయినా వినవచ్చు
అఉడపుడూ పాటకు అవకాశం కూడా
పగలు కన్న రాత్రి వేళ మంచి అవకాశంగా

మాటకు పగలు అనువయి వినిపిస్తూనే ఉంటుంది
పాటకు రాత్రి వీలయి బాధను మరపిస్తుంది
పంజరం నుండో బోను నుండో
బయటికి వస్తేనే ఎవరికయినా
స్వేచ్ఛలో నడక విలువలు తెలిసేదీ
బ్రతుకులో భాగ్య విభవం చూచేదీ

కనిపించని హృదయాన్ని ఎచటెచటో
చుక్కలలో పూలలోనొ వెదక నక్కర లేదు
ముందుగ తనలో ఇది ఉందీ లేందీ
ఒక మారు చూచుకోవలసి ఉంటుంది

పైని సూర్యుడయినా చంద్రుడయినా
నేల పైన మనిషి తప్ప! బ్రతుకులో
ఎన్నటికీ తోడు కారు, కాలేరు
ఒకరి కయి రోజు ఆగదు, ప్రవాహ గతిలో

నమ్మకం హేతువు, రెండూ విడలేనివి
రైలు పట్టాల వలె సమాంతర గతిలో
పయనంలో వాహన చలనానికి
సుగమంగా ఎంత దూరమయినా

కవితలో అభిన్నం! భావ కళా సౌందర్యం
స్వేచ్ఛలో అన్నిటినీ కలిపే అనుభవ రూపం

30.

చెమ్మగిలిన కళ్ళలో వెలుగు కిరణం
చీకటిని విదల్చి ప్రభాతాన్ని ఒంపుతుంది
ఇది వాస్తవ జీవితానికి సందేశంగా
కవితలో అక్షర రశ్మిని తలపిస్తుంది

అవును! మనిషి ముఖం అదే! చూచిందే
ఇంత వరకు చూడని కొత్త దృశ్యంతో
కవితకు పట్టాభిషేకం జరుగుతుంది

సందేహం భయం నుండి ముక్తమయిన మనసుతో
ప్రాణి బ్రతుకుతుంది, బ్రతక లేని మనిషి
చీకటి గుహ నాశ్రయించి, తిరోగామి అయ్యేనా?
విషాద భర సమాజంలో స్థితి చిత్రం! ఏమిది?
భూకంపం చిరు తుఫాను బీభత్స రేఖలతో

సమాజం నుండి మనిషి విడి యంత్రం కాదు
తాను సంఘంలో భాగమయిన జీవన పూర్ణం
ఒకరి జీవితం మరొకరికి దృశ్యా దృశ్యమయం
ఎత్తులతో లోతులతో స్నేహ వైర ప్రపంచకం

గగనానికి భూమికి మధ్య సంబంధం నిలుపుతుంది
గాలి వెలుగు! ఒక సందర్భంలో వర్షా మేఘం
మనిషిని దగ్గర చేస్తుంది, స్పర్శ సుఖం ప్రేమ పరిమళం!
రణ మయితే అగ్ని పథంలో నడిపిస్తుంది
నీళ్ళు చల్లుకుంటూ పోవలసిందే! ఎవరయినా
వెనక్కి వచ్చే ప్రశ్నలేదు! వస్తే! అంతా మషీమయం!

తనువులో ఏ కణానికదే ఉష్ణ శక్తి నిలయం!
కవితలో! ఏ పదానికదే కిరణ భావ బంధువు!

రెక్క విప్ప లేని ఊహతో కవిత! ఏమి పలుకుతుంది?
వెలుగు పూయ లేని మనసుతో బ్రతుకు ఏమి వెలుగుతుంది
ఇంజను ఒకటి చాలు! వరసగా బోగీలతో
ప్రతిభ ఒకటి చాలు! సృజన భావ బంధువయి!

31.

ఇది రాజకీయ నేతల ఆధునిక యుగం
సంఘం అనుకోకుండా అడవిగ మారుతూంది
దీనికి కావలసిన సరంజామా యావత్తు
తమకు తాముగానే పూర్తి చేసుకునేరు

మాటకు మాటకు ఎడంలో నిశ్శబ్దం
కలహంలో అనల కిరీటంతో ప్రత్యక్షమవుతుంది
నిరంకుశానికి కొత్త దారు లేర్పడేను
పూర్వపు రాజరికాలను గుర్తుకు తెచ్చేను

వెలుగు దారులు మూత బడి
చీకటి ఎడారిలో తిరగాలిసి వస్తుంది
దోషానికి పడే ఉరి శిక్ష కన్న మనిషిలో
సంస్కరణ పథం మరో జన్మ అన్నట్లే

ప్రతి వ్యక్తిలో జీవన సంరంభంలో
తిరిగే విషాద స్వరం! రింగులుగా
మనసును తనలో దింపాలని చూస్తుంది
అంతలో పవనం! వస్తుంది, ఎత్తుక పోతుంది

పవనానికి బరువయింది క్షుభిత పరుస్తుంది
విజయానికి దూరమయింది క్రుంగ చేస్తుంది
ఏదో! దిశాగతిలోనే! కదలుతుంది మేఘం
ఏదో! దిశ లేకుండా ఉండలేదు ప్రవాహం

మనిషి మాత్రం పలు దిశలలో భ్రమిస్తూ
విశ్వం తన వశమయి చుట్టు తిరగాలనీ
దీని కెన్ని పాట్లు! చరిత్రకు కేంద్రమయి
ధాత్రిని శాసించాలనీ! మనిషిని నడిపించాలనీ

దారులెన్ని అయినా, అవి చాలనివయి మార్పులలో
కాలం గడుస్తుంది, అపూర్వ ధైర్యంతో నడిపిస్తుంది
భేదంలో కలహంలో బలంపై నిశ్చయంతో
రేపుపై ఆశతో గిరి కన్నా ప్రవాహమే! మేలనిపిస్తుంది

32.

కింద సరిగా నిల్వ లేని మనిషి
పైకి పూర్తిగ ఎగర లేని మనీషి
తన చుట్టు వాదాల ఆధారాల తత్వాల నిచ్చెనలతో
ఎపుడేది అవసరమో! అపుడది
చేతి కందేంత దగ్గరలో ఎప్పటికీ
ఆరోహణ అవరోహణలో కాలం గడచేను

పైకి వెళ్ళే నిచ్చెన కాధారం భూమి
పైన చేరే శిఖరాని కవకాశం దివి
రాత్రి చుక్కలలో చేర్చేనా?
చంద్ర బింబ మంద జేసేనా?

ఇది వింత కాదు! బ్రతుకులో యథార్థం
తిరిగే నిజ జీవన చక్ర రూప మిదే!

మౌనంలో మెరపు చకితంగా ఉల్లాసంగా
హఠాత్తుగా పిడుగు పాటు! భయదంగా జారవచ్చు

సమస్య పెరుగుతూ పోవడం తప్ప
అది పూర్తిగ తొలగే సమయ మెపుడో?

ఎవరి పయి దేని పయి ప్రమాణ మవసరం లేదు
తనలో అంతరంగ మొకటే! కవికి సాక్షి! కవితలో

ఇది సమతకు స్వచ్ఛతకు సుందర నిలయం
ఇది ఆరే దీపం కాదు, మారే రూపం కాదు

నిప్పు చినుకులలో తడిసి పోయి, కలలో నయితే
తీవెయై సృజనాంకురం సాగి అల్లుకునేను
చెట్టు నుండి గాలికి రాలే పూవుల్లా అక్షరాలు
ఏవి ఎచట చేరాలో! అచటే చేరతాయి!

చేతిలో మట్టి నుండి పూవు! కవిలో జనత నుండి కవిత
పైకి వెళ్ళే కొద్దీ దివి పైపైకే వెళుతుంది, అందకుండా

భయంతో రాత్రి! వెన్నెల హ్లాద పరుస్తుంది
ప్రజలలో కవిత! ఆశను ఫలింప జేస్తుంది

33.

పయనంలో ఉద్గమనం మానవ సహజం
నవ మానస చేతనలో ఆరోహణలో
ఏ రోజు మార్పులో సంధ్యా దశ తప్పదు
ఎంతటి క్రియలో సందేహ స్థితి తప్పదు

విత్తు అణగి పోతుంది చెట్టు పైకి లేస్తుంది
ఎదుగుతుంది! నిశ్శబ్దంగా మౌన ముఖంతో

ప్రతి మనిషి బ్రతుకు! ఒకే స్థాయిలో ఉండదు
బహు జీవన కారణాల ప్రభావాలతో
ఎప్పటికప్పుడు సరి చేసే అవసరమెంతో!
సమాజ వికాస ప్రగతికి తప్పని దవుతుంది

అడుగు జార వచ్చు, ఆర్తి చిమ్మ వచ్చు
క్షణం రాలుతుంది, గతంలో కలుస్తుంది
స్మృతిలో అనుభవ చిహ్నం మిగులుతుంది
మనో మేఘం నుండి మెరపు బయట పడుతుంది

ఉదయ కిరణంతో నీలి మబ్బులా
పెన్నులో సిరా! అక్షరా కృతి పొందుతుంది
వెలుగు పటం పయి కవిత అవుతుంది
కాలానికి గుర్తుగ మిగులుతుంది

పరుగెత్తే ధునిలా బ్రతకాలని ఒకరు
చలిలో నిప్పుల కుంపటి లాగా ఒకరు
పలు రకాల పూల తోట లాగ ఒకరు
ఎవరికి తగిన విధం ఇష్టంలో వారు!

ప్రతి జీవితం! వెనక నుండి ఏదో
సందేశం పలకాలనే! ఆశ! వినిపిస్తుంది
వినే చెవులకు కనే కళ్ళకు అతీతంగా
లోపల గుప్తంగా! మనో రహస్య పేటి
ఏ మాటతో ఏ చర్యతో బయట పడేది!
తెలియదు! జల నిధిపై రవి కిరణంలా!

34.

ఒక పక్షానికి గెలుపు మరో పక్షానికి ఓటమి
విషయంలో తేడా లేదు, పోటి ఫలితం వేరు
నైతికమనీ ధార్మికమనీ లౌకికమనీ మానసికమనీ
మనుషులలో దృష్టి భేదాలెన్నో! చూచే కోణాలన్ని
ప్రజాస్వామ్య సామ్యవాద నిరంకుశ గుణ చిహ్నాలతో
ఎవరి స్థానంలో వారు! బ్రతుకులో యథాతథం

గెలుపు కన్న ఒకపుడు ఓటమియే
తదుపరి తన మంచికి దారి తీయవచ్చు
గెలుపుతో కొత్త పరిచయాలేర్పడతాయి
ఓటమితో ఉన్న సంబంధం చెదరుతుంది

గెలిచినా ఓడినా మిత్రతలో శత్రుతలో
సమాంతర యశోరూపం జన భావనలో
ఆచరణ ప్రసారంతో ఆదర్శ ప్రకాశంతో
రెండిటికీ చరిత్రలో స్థానం పదిలంగా

మజిలి నుండి మజిలి దాక, మధ్య మధ్య
మెట్టు నుండి మెట్టు వరకు, నడుమ నడుమ
స్వార్థం పెరగ వచ్చు, ఘర్షణ ఏర్పడవచ్చు
పరిస్థితులు విషమ స్థితులలోకి నెట్టవచ్చు

నాటక మంటే ఇష్టం లేని వారు ఉండరు
కనిపించే పాత్రలు! సంఘంలో ఎదురు పడేవే

మంచి చెడు మిశ్రమంలో వివిధ పాత్రలు!
ఎపుడు దేని పాలు హెచ్చేదీ తగ్గేదీ తెలియదు
సందర్భ మేదయినా కానీ మనిషి మనిషే ఎప్పటికీ
ఎవరి తోను సాటి రాని తన మనో రూపంతో

విశేష స్పందనలో విపరీత చర్యలో
ఏది ఏ వైపయినా మొగ్గవచ్చు, మారవచ్చు
ఆయుధమో! సుమ గుచ్ఛమో! తాడో! పామో
ముందుగ తెలియని రూపంలో, ఎదురు కావచ్చు

35.

ఇష్టమయినా కాకపోయినా మనిషి మనిషే
వ్యక్తిలో మానవత పూవులా వికసించాలనే
శాంతి కామనతో సమాజ పరంపరలో భాగమై
బ్రతుకొక సుందర ప్రయోగ కళతో రాణించాలనే

తప్పు జరిగితే సరి చేసుకొనే వీలుంది
నేరం చేస్తే మారేందుకవకాశముంది
పునర్వివేచనకూ సమ స్థితికి చేరేందుకు
దారులెన్నో ప్రబోధాల నుండి అంతరంగం దాకా!

గడవడ మొకటే కాదు మనిషి జీవితమంటే
ప్రయోజన దిశలో ప్రకాశ రూపం వరణీయం
ఆయుధాన్ని పక్కకు పెట్టి సమయ సమయం
సుమ గుచ్ఛాన్ని స్వీకరించే సందర్భం వస్తుంది

కాలం ఆగదు ఎవరూ ఆపలేనిది! అనుభవ రూపం
మనిషి ఇమిడి పోవడమొ! కలిసి పోవడమో!
ఇది శక్యం కానపుడు జన హిత పథం శరణ్యం
విధి పేరిట బాధ్యతల్ని మరచే వీలు లేదు

చేతులు కాళ్ళు కదిలితే సరిపోదు జీవితంలో
శ్రమ చేతనతో పాటు మనో వికాస మవసరం
హేతు దృష్టికి దోష మొక టొకటిగ కనిపిస్తుంది
బయటికి విడుదలయి! నివ్వెర పరుస్తుంది

బావిలో నీరు తోడుతూ బొక్కెనలో
నీరుతో పాటు లోన ఉన్న నిధి బయట పడుతుంది
ఇది రోజూ జరిగేది కాదు
అందరికీ దొరకే అవకాశం కాదు

మనిషి ప్రమేయం లేకుండా గాలి దుమ్ము
పైకి ఎగసి విసరుతుంది! హఠాత్తుగా
కంటిలో నలక పడి కలత పెడుతుంది
అడుగు నిలుస్తుంది! దోషమెవరిది? మనిషిలో ప్రశ్న!
సమాధాన ప్రయత్నం అన్వేషణలో భాగం

స్వేచ్ఛా కవిత్వం-90

ఇది జీవితం

(XV భాగం)

సమాంతరం

మాదిరాజు రంగారావు

2018

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 90

IDI JEEVITHAM

(XIV Part)

SAMAANTHARAM

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2018

Presented to
my wife
Smt. Indira

పీఠిక

"ఇది జీవితం" స్వేచ్ఛా కవిత్వం బృహత్ కావ్యం పరంపరలో ఈ కృతి పదిహేనవ భాగం. ఇది సమాజంలోని భిన్న స్థితులు వాటి పర్యవసానాలతో వర్తమాన ప్రతిఫలన రూపం. ఎందరో వ్యక్తుల ఆలోచనలతో, చర్యలతో సంశ్లిష్టతను పొందే సమాజం గురించి ఎంత చెప్పినా ఇంకా మిగిలే ఉంటుంది. ఇందులో వస్తువు సామాజికం, విషయం మానవ జీవన ప్రపంచం. రూపం స్వేచ్ఛామయం.

అంతర్ద్వంద్వాలతో వైరుధ్యాలతో తమ ప్రయోజనాలతో రోజు రోజుకీ మారే సమీకరణాలతో రూపొందే ప్రవాహశీల సమాజాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇంకా మిగిలే ఉంటుంది. ఈ వస్తువు కవితాత్మకంగా ఆవిష్కారాన్ని రూపొందే ప్రయత్నం జరిగింది. ఇది స్వేచ్ఛా కవిత్వానికి తగిందిగా గోచరించింది. దీన్ని కొన్ని పరిధులలో కోణాలలో చూపడం జరిగింది. ముఖ్యంగా వీటి వెనుక నుండి పని చేసే కారణాల్ని గుర్తిండం వాటిపై ఫోకస్ చేయడం అవసరమైంది. దీని వల్ల కొన్ని పరిమితుల్లోనయినా ఆలోచనకు స్పష్టత ఏర్పడుతుంది. ఇదీ దీని నిర్మాణ విధం. ఆధునిక కవిత్వం ముఖ్యంగా స్వేచ్ఛా కవిత్వంలో మౌలికమయిన సృజన చేతనకు సుందర రూపాన్ని ఇచ్చే పుష్టిని చేకూర్చే భావ బింబాలు ప్రతీకలు చోటు చేసుకోవడం సహజం. ఇది నిర్వహణంలో కళాత్మకతను పూరిస్తుంది. రచనకు శోభనిస్తుంది. ఇది వర్తమాన సమాజంలో వివిధ కోణాల్లో జీవన స్థితుల్ని ఎత్తి చూపుతూంది.

ఇందులో ఎదురుగ కనిపించే స్పందన – సంవేదన వెనుక నుండి మనిషిలోని ఆర్తి నిరాశ చింతనలో మానుష స్వరంతోపాటు, మార్పులతో రావలసిన నిర్మాణంతోపాటు ఆశా స్వరమూ వినిపిస్తుంది. జరిగిపోయే ఆగని కాలంతో మీటింగ్ ప్లేస్ ఈ స్వేచ్ఛా కవిత్వం, "ఇది జీవితం"లో భాగం "సమాంతరం".

– మాదిరాజు రంగారావు

సమాంతరం
(15వ భాగం)

1.

కాలం అడుగులో అడుగు వేస్తూ పోవడం
ప్రగతి శీల కవి పయనంలో సహజం
ఉద్యమ సంకేతం ముందుగ కవిత నుండి వెడలుతుంది
ఉదయ కిరణం కావచ్చు రాత్రి కాగడా కావచ్చు

ఇది జీవిత వాస్తవాన్ని ప్రకటిస్తుంది
సంక్షోభంలో పరిష్కార దిశను చూపుతుంది
కాలం నియంత కాదు, సన్మిత్రం
దీన్ని మలచేదీ తీర్చేది నడిపేది మనిషే

దైనందిన వ్యవహారంలో కాలం
సెకండ్ల నుండి గంటల్ని చూపే యంత్రం
పనిని బట్టి జ్ఞాపకాన్ని మేల్కొల్పుతుంది
విశేష సందర్భంలో అతీతాన్ని తలపిస్తుంది

రెండు చేతులతో ఆపలేని మహా ప్రవాహం
మనోభూమిపై జారుతూ కాలం!
వర్తమాన మొకటే నిజమన్నట్లుగా
మనిషి గుండె చప్పుడుకు పోటీగా

నిశ్శబ్దంగా తన దారిన వెళ్ళే కాలాన్ని
మనుషులు మాటలతో శబ్దమయం చేసేరు
తనలో మార్పులతో ప్రకృతి దృశ్యాకృతి నిచ్చేను
తమ ఉనికితో ప్రాణికోటి వ్యక్తిత నిలిపేను

ఎక్కడికక్కడ మనిషిచే బంధింపబడి కాలం
ఎప్పటికప్పుడు ముక్తమై స్వేచ్ఛను పొందేను
వాహన చక్రం కాలాన్ని గుర్తు చేస్తుంది
వెలిగే దీపం ప్రాణాన్ని బయట పెట్టేను

చీకటి నిది పాల రాతి శిల్పంగా మార్చేను
ఆలోచనలనిది పవిత్ర రూపంగా తీర్చేను
మనిషి వదలినవి అన్నీ కాలం సంచిలో పడతాయి
మును ముందు పరిశోధనలో ఉపకరించవచ్చు!

2.

వెన్నెల పాలరాయి శిల్పంలా రుచిరమయిన ఆకృతితో
కవి హృదయం! కవితలో కళలో ప్రతిఫలిస్తుంది

కొన్ని మాటలు వినడానికెంతో ఇంపుగా
మనసు నలరించి గాలిలో తేలి పోతాయి
నీతి న్యాయం సత్యం ధర్మం సుందరం పవిత్రం
మాటలు వినే కొద్దీ మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తాయి

వెన్నలా కాస్త వేడికి కరగి పోతాయి
రంగు రుచి రూపం మారి పోతుంది

చరిత్రను తలపించే చిన్ని ముక్క దొరికితే
నిజ మనిపించే దాని కెన్ని కల్పనలో వేలాడేను

గర్వం తొణికిసలాడే అంతస్తుకు చేరుస్తుంది
అభిమానం తళతళలాడే అందల మెక్కిస్తుంది

శిథిలాల పయి నిర్మాణం కోరే దృష్టి కొక రూపం
రాజ్యానికో కుటుంబానికో కావలసిన హంగులతో
పాత్రల కల్పన లెన్ని విధాలో, మనిషి కొక తీరుగా
సరికొత్త ప్రపంచంలోకి మనసును దింపుతాయి

తాజ్ మహల్ ముందు నిలబడి చూస్తూ ఉంటే
వెన్నెల శిల్పం ముందు! చేతిలో డబ్బు సంచి ఉన్నా
తానొక ప్రభువనుకున్నా! పరీక్షలో విషయం
ఆర్ద్రమైన హృదయంతో సౌందర్య తత్త్వం జ్ఞప్తికి రావాలి!

ఈ మట్టిపై బ్రతుకుతూ ఈ గాలి పీలుస్తూ
ఇచటి నీరు త్రాగుతూ, వెలుగుల ననుభవిస్తూ
దేని పైనొ ఆశతో మరచే ప్రశ్న లేదు
అనుభవ కళ! మనసును దిగ్బంధం చేస్తుంది

పైన వెలిగే సూర్యుడు! బాధ్యతల్ని గుర్తు చేసేను
కింద తరలే నది! తన బ్రతుకును గుర్తు చేసేను
ఏ నదికో చెరువుకో ఖాళి బిందెతోనే వెళ్ళేది
దప్పిక ఉన్నంత కాలం! మళ్ళీ మళ్ళీ పోవలసిందే

3.

వర్తమాన బిందువు నుండి గతంలోకి సులభం
అదే! భవితలోకి అయితే! అందని చంద్ర బింబం!
జీరోకు ఎడమ వైపు ! ఒక సంఖ్య
కుడివైపున జీరో లెన్ని ఉన్నా
భరిస్తుంది, విలువల్ని పెంచుతుంది
వర్తమాన లిప్తకు భవితను సూచిస్తుంది

సమాజం వ్యక్తిని వెంటాడుతుంది
స్వేచ్ఛను స్వార్థాన్ని ఆసరాగా తీసుకొనీ
సమాజం లేంది, మానవ వికాసం లేదు
ప్రపంచ సంబంధంలో సమాజ మొక బంధువు

మండే ముఖాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకుంటారు
తమ చేతు లెంత హిమ ఫలకాలని అనుకున్నా

రణ వ్యూహంలో వేసే ఎత్తులు ఎన్నో
నిజ జీవన గతిలో పై ఎత్తులు అన్ని

రోజూ చూచే అద్దంలో ముఖం విసుగనిపించదు
అనుభవ సౌందర్యంతో ఇంకా ఇష్టంగా ఉంటుంది

పంచాంగం నిర్ణయాలు తలక్రిందయి
మనిషిని తలక్రిందులుగా నడిపించేను

నమ్మకం ఏ పని నయినా చేయిస్తుంది
పీఠం నుండి శిఖరానికి చేరాలనీ
నిప్పు కణం నుండి జ్వాల కావాలనీ
బిందువుతో నది రూపం పొందాలనీ

వినే కొద్దీ చరిత్ర వినాలనిపిస్తుంది
మనిషి పాత్ర ఏమిటో? దర్శించాలనీ!

కనిపించని దైవ ముఖం ఏవిధమయినా కావచ్చు
ప్రేమ కరుణ భయం వీర గుణాల వాలకంతో
మౌనం అంగీకారం కాదు
తటస్థతకు సూచన మాత్రమే

4.

జిజీవిషలో మనిషి కోరిక శాఖోపశాఖలుగా
పెరుగుతుంది, అస్తితకు విశాల రూప మిస్తుంది
చినుకులతో మేఘం గగనంలో మెరపులతో
భూమి నుండి మొలకను వాగ్దానం చేస్తుంది
ఏ రోజు వ్యర్థంగా గడవదు, ఎవరికినీ
పని అంటే శారీరక మానసిక రూపంతో
బండి కిరువైపుల చక్రాల వలె
మానవ విజయాలకు ఉపకరించేను

కొన్ని సందర్భాలలో మనుషులు
వాహనాలనో విగ్రహాలనో తలపించేరు
ప్రవాహాలనో మేఘాలనో చూపట్టేరు

శ్రమ సంకేతంతో ఒకటి, మతి విభవంతో ఒకటి
హృదయ మున్న మనుషులు కనిపించేరెపుడో
ఏదేని మంచి పనికి పూనుకోవాలనీ
కొత్త కొత్త పాత్రలలోకి మనుషులు ప్రవేశించేరు
ఇది జీవన సమాజ చలనంలో అనివార్యం

చిన్న చీమ నుండి పక్షి వరకు
శిశువు ముఖం నుండి శశి బింబం వరకు
చిన్న బల్బు నుండి శశి బింబం వరకు
ప్రభావాల నుండి మనసు తప్పించుకోలేదు
ఎంతటి స్వేచ్ఛలోను ఏదో బంధన నుండి
విడుదలయ్యే ఆలోచనలో ప్రతి మనిషీ!

ఇల్లు కావచ్చు బయట కావచ్చు
వ్యక్తి గతం విశ్వమయం కావచ్చు
నడతలో నీతి పుటలు తిరుగుతాయి
మాటలో శబ్ద శక్తి కదలుతుంది
రూపంలో తరాల జీవ కణం మెరుస్తుంది
మొలక నుండి మొక్కలా సృజన చేతన ప్రతి పనిలో

5.

కొత్త బ్రతుకు కోసం కొత్త సమాజంకై
సంస్కరణం నిర్మాణం పరివర్తన భావన
నిశిత తీవ్ర స్థాయిలో ఉద్యమమవుతుంది
ప్రతి వ్యక్తి మనసులో ఆలోచన జరుగుతుంది
ఇది తెలుపులోనో బంగరు వర్ణంలోనొ
నలుపులో మాత్రం కాదు వీలు లేదు

కిటికీలు తలుపులు మూసేస్తే
నలుపు తప్ప ఏముంటుంది?
దీపమో కిరణమో వెలుగు అవసరం!
ఇది తెలుపులోనొ! స్వర్ణ వర్ణంలోనొ!

గాయం నుండి నెత్తురు చుక్క ఎరుపు
శత్రుతలో మనిషి చూడాలనుకునేది ఇదే
ఎరుపు రంగు క్రోధానల జ్వాలా రూపం
రణంలో ఇరువైపుల భూమిపై రక్త చిత్రం!

కోరికలో దృఢ నిశ్చయ మచలంగా
శ్రమ పథాన ఉత్సాహం! చరిత్ర నిర్మిస్తుంది
గాలిలో ఎగసే బూది రేణు దృశ్యం
వర్తమాన గాథను జ్ఞాపకం చేస్తుంది

పూవు ఫలం పంటలతోనే బ్రతుకులు!
పచ్చదనం భాగ్యానికి చిహ్నమయింది

కాలమయినా స్థలమయినా ప్రతి మలుపు
మార్పుకు సూచన! సందేహానికి వంతెన!
దాటరాని స్థితిని దాటిస్తుంది
చేరరాని చోటును చేరుస్తుంది
దార్శనికతకూ వాస్తవ జీవితానికీ మధ్య
అంతరాన్ని దాటిస్తుంది, కవిత ఉత్సాహంగా
ఇష్టమయిన మార్పును అపూర్వమైన వస్తువులా
కళతో చూపిస్తుంది సృజనలో ఉపాయంగా

6.

సమాజ శ్రేణులలో పీడితుల సంఖ్య ఎంతో
చీకటిలో చుక్కల్లా మినుకు మినుకుమంటూ

నిరసనలో శబ్దం విస్ఫోటం వినిపిస్తుంది
పీడనలో ఒదిగి ఉన్న ప్రజా బలం
అదను చూచి పైకి లేచి మండుతుంది
అనల కీల ప్రశ్నా రూపం వహిస్తుంది

బాణం కావచ్చు కొడవలి కావచ్చు
రిజర్వులో ఉండే ఆయుధం అవచ్చు
ఎచట నయినా వ్యథలో కథ ఒకటే
తీవ్రతర సందర్భం ఉద్యమాన్ని సృజిస్తుంది
పేదరికంలో అభిమానం అవసరం
ఈనాడు బ్రతుకులో సాధారణమైంది

ఇది చేరే పరివర్తన లక్ష్యంతో
పోరాటం సమ సమాజాన్ని కోరుతుంది
సందర్భం నిప్పు పూలు పూయవచ్చు
సమయం శైశిర దృశ్యం చూపవచ్చు

తెలంగాణ అయినా మరో చోటు అయినా
సమస్యకు పరిష్కారం ఆకాశం చెప్పదు
గ్రహాలు మాట్లాడవు! జన చేతన ఒకటే
మను ముందుకు వచ్చేను, సందేహం తీర్చేను

ఆధునిక సమాజానికి క్రాంతదర్శి మార్క్సు ఉపద
చరిత్రలో దృష్టి పడని నిజాల ఆవిష్కారం
మనిషిలో మరచిన శక్తి మేలుకోవడం
ఈ జీవిత వాస్తవికతకు ప్రాధాన్య గుణంతో

ఉన్న అన్ని ఆస్తుల పంపక విషయం కన్నా
వినియోగంలో సమన్యాయం సునిశ్చయం సునిర్ణయం
ఇది ఎక్కువ తక్కువల మధ్య కలహ కారణం కాదు
ఉన్నది జన పరం విశ్వమయం కావాలనే

7.

నేలపై నీడతో నడచే మనిషి
నీటిపై ఓడలో కనిపించవచ్చు
నింగిలో మబ్బుతో పయనించాలనీ!
కవితలో సంభవం కానిది! ఏముంది?

కల్పనలో కోరిక లెన్నో కవితలో అన్నీ
అనుభవం ఇంజనుకు బొగీల్లా ఒకటొకటి
సాధ్యం కానివి అయినా! తెలిసీ
మనసుకు పరితృప్తిని కలిగించేను

సూర్యుని ఆగమనం అందరికీ మోదకరం
అస్తమయం మాత్రం కొందరికి విషాదమయం
చింతనలో కొందరికి చీకటి! భయ బంధువు
భావనలో కొందరికి విరామ సుఖ సూచిక!

జీవితాన శత్రుత మిత్రతల వలె
మానసిక స్థితిని బట్టి ప్రకృతి అనుభవం

ఎన్ని మెట్లు ఎక్కుతూ పోయినా ఆయువులో
ఇంకా ఎన్నో మెట్లు మిగిలి ఉండడమొక! విశేషం
చర్యలు అనుచర్యలు ప్రతి చర్యలతో ఈహలు
శ్లిష్టమయిన జీవిత మొక ఆశా మధు కోశం

రావలసింది రానీ! పోవలసింది పోనీ
అనుకునేంత సులభ సుందరం కాదు జీవితం
ఒకరి శత్రువులకు మిత్రులూ ఉంటారు
ఒకరి మిత్రులకు శత్రువులూ ఉంటారు
ఎక్కడి కక్కడ చెక్సు ఎండ్ బ్యాలెన్సులతో
మనిషితో సమాజం! అస్తితలకు మూలం!

సూర్యుని రాక కయి వేచి వేచి ఉండవచ్చు
తనకు ప్రియం కావచ్చు, అవసరమయి ఉండవచ్చు
ఉదయం కాగానే మనిషికి! ప్రకాశంతోనే పని
తిరిగి అస్తమయం వేళలో గుర్తు నిలుస్తుంది

8.

ఆ రోజున కొమ్మపై పూలు కోయకపోతే
మరో రోజు రాలి మట్టి పాలు అవుతాయి
ఏలాగో ఉపయోగంలోకి రావడమే సార్థకం
అందం పరిమళంతోనే మనిషి క్రియకు విలువ

ఆదర్శం జీవిత వాస్తవం రెండూ తప్పనివీ
పయనంలో రైలు పట్టాల వలె సమాంతరంగా
ఒకటొకటి విడివిడిగా కలిసి ప్రయోజన దిశలో
పోయినంత మేర తమ తమ పాత్రలు నిర్వర్తిస్తాయి

చంద్రునిలో మచ్చలా ప్రతి మనసులో
సుగుణంతో దోషం విభుతలో క్షుద్రత

మనిషిని జంతువుగ మృగంగా మార్చేసేను
తెలిసీ తెలియకుండ క్షణం జరిగి పోతుంది

ఎన్నిటికో సాక్షీభూతమయిన మనసు
అన్నిటినీ భద్రంగా దాచి ఉంచుతుంది
ఎపుడో అవసరమయినపుడు కత్తిరించి
పైకి తీసి విజ్ఞతకు గురి చేస్తుంది

ᔓᔐ

భయానికి నీడను వెంట బెట్టుకొని వస్తే
వీథిలో నీడ చాటున ఎవరో దాగిన అలికిడి
ఒకరిని చూచి మరొకరికి అనుమానం దారిలో
జరగ రాని దేదో జరిగేనని ఆందోళన

ఎదురయిన ముఖంలో నవ్వు! విరిసీ
ఇరువైపుల్ని కలిపే పూల వంతెన అవుతుంది
మబ్బు నుండి బయట పడిన మెరపు
వాన రాక శుభ వార్తను అందిస్తుంది

కవితలో మనోజ్ఞ మయిన అనుభూతి విశేషం
పాఠంలా చెప్పేది కాదు, బయటికి చూపేది కాదు
ఉదయ కిరణ సంస్పృహకు ఖగోళ శాస్త్రంతో పని లేదు
స్వయం సూక్ష్మ స్పందనలో అనుభవ మొక కళయే!

ᔓᔐ

9.

నివాస మొకటే! చూచే మనిషి ఒకరే
ఒక్కొక వైపు కిటికి నుండి ఒక్కొక దృశ్యం
వేరు వేరు అనుభవాల చిత్ర సంపుటిలో
మనసుకు ప్రకృతిలో జీవిత వాస్తవాన్ని చూపేను

ఏ దిశ నుండి ఏ వరం లభించేది తెలియదు
అనుకోకుండ ఏ ఆపద తాకేది తెలియదు
దగ్గరలో కుసుమం చేతికి అందవచ్చు
అలరించవచ్చు అలంక్రియ పొందవచ్చు

దూరం నుండి బులెట్ దూయవచ్చు
గాయ పరచవచ్చు, బాధించవచ్చు
గాయంతో ఏర్పడే మచ్చ! స్మృతిలో నిలిచీ
కాలానికి సాక్ష్యంగా నిలబడనూ వచ్చు

ఉదయం స్వర్ణ కవచం దయ చేస్తుంది
చాటే విలువలకు బాగా పనికి వస్తుంది
ప్రదర్శనకు బాగా ఉపకరిస్తుంది
అవసరంలో చేయి జారిపోతుంది కూడా

నిశీధి ఇనుప కవచం లభిస్తుంది
చీకటిలో రక్షణకు పనికి వస్తుంది
ఇనుప బోనులో చిక్కి నట్లయి దేహం
స్వేచ్ఛను కోల్పోతూ ఉక్కిరి బిక్కిరి అవుతుంది

అభయాలన్ని వేటి దారిన అవి వెళ్ళిపోతాయి
ఆపదలు మాత్రం ప్రభావాన్ని చూపుతాయి
చరిత్రలో మరవ రాని పాత్రలలో ఒకటయి
మనిషి మాత్రం! మిగిలేను మానుషంతో

అభయంలో స్వర్గ శకలం, ఆపదలో నరక ఖండం
పలు రంగులలో, గది నుండి మరో గదికి
కదలుతూ మెల్లగా ఆగుతుంది! ప్రతి స్థితి
అద్దంలో అదృష్టాన్ని ప్రతిఫలించే బింబంలా

10.

ఆశలు పేరుకొని మంచు కొండ అవుతుంది
మనిషిలో తేజానికి కరగి క్షామం తీరుతుంది
కోరిక మండి మండి బూది దిబ్బ అవుతుంది
గాలికి ఎగిరి పైకి శూన్య ముఖం చూపుతుంది

చీకటికి భయ పడే అవసరం లేదు
వెలిగే దీపంతో మనిషి వశమవుతుంది
వెనక్కి జరుగుతుంది, పనులు జరుగుతాయి

వెలుతురుకే భయపడే అవసరం రావచ్చు
చిన్న తప్పు బయట పడి పోతుంది
తేట తెల్లమయి ప్రజల దృష్టి పడుతుంది

ఎంతటి జీవితమయినా ఎవరయినా
సత్యం సగమే బయట పడుతుంది
భూగోళం పయి సూర్య ప్రకాశం సగమే
ఒక వైపున పగలయితే, మరో వైపు రాత్రి!

నదికి తాను నడచి నడచి మంచి నీటితో
జలధిలో కలిసేది తెలియదు, అదీ ఉప్పు నీరులో
నిటారుగా నడవడం నేర్చిన మనిషికి
నింగి వైపు సూటిగ మస్తిష్కంతో
పెరిగే ఆలోచనలలో భ్రమిస్తూ
తాను నిలిచిన భూమిని మరవచ్చు

గూడు నుండి గగనానికి తరలే పక్షికి
మట్టి సంగతి తెలియదు, సీమలు తెలియవు
ఒక మనిషికి మాత్రమే బాగా తెలుస్తుంది
ఇంటికి గోడ తోటకు కంచె దేశానికి సీమలు
మనిషికి నీతి నిబంధన స్వేచ్ఛలో తప్పనివై
ఆశను అర్థవంతం చేసేను మంటకు బాధ్యత తెలిపేను

నవతలో దారి దొరికితేనే ప్రయోజన గమ్యం చేరేదీ
కవిత విలువ తెలిసినా! విపణిలో వస్తువు లభించేనా?

11.

ఎవరి కవిత వారికి అస్తితలో బహు ప్రియం
రవి నుండి తేజంలా శశి నుండి వెన్నెలలా
నదిలో కెరటంలా కొమ్మకు కుసుమంలా
మరొకరికయితే విమర్శలో అందని బింబం

సుడిగాలి దుమ్ము లేచి క్రమ్మిందా?
తుపాను దూసి ఎత్తుక పోయిందా?
నీలి మబ్బు తెర సాగి అడ్డు పడిందా?
దహన కాండలో ఎగసే పొగ ముసిరిందా?

అకస్మాత్తుగా అదృశ్యమయింది!
సంక్షుబ్ధ సమాజంలో ఏదయినా జరుగుతుంది
విరోధ మెరగనిది స్నేహ మయమయింది
నిప్పు నీరు గాలి తీవ్రతల లోనూ
ప్రకృతితో జనతతో బంధుత కలిగిందీ
కవిత! మాయ మవుతుంది, తెలియకుండా!

ఎవరికి వారు మౌనంగా తెలియనట్లు ఉన్నారు
నైతిక బాధ్యత ఒక కవికే అన్నట్లు ఉంది
వెదకేందుకు కారులో బయలుదేరిన కవికి
ఇరు వైపుల! శ్రోత పఠిత తోడుగా

వేగంతో వెళ్ళే వాహన శబ్దానికి సమంగా
పయనంలో స్వాగత దృశ్యం వెనుక దృశ్యం
కవిత ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకొని పోయిందా?
భవిత క్రాస్ ఫైర్‌లో శిల చాటున దాగిందా?

నిందను భరించ లేక వెదికేందుకు
గాలి బయలు దేరడంలో ఆశ్చర్యం లేదు
మాసిన అద్దంలో బింబంలా, ఎవరది?
మిత్రమా! శత్రువా? బంధువా? సందేహంగా
జర్నలిస్టు పాత్రలో సీటు వెనక నుండి
చేతిలో కవిత! గుప్త చర్యలో! భాగమయి
కవి కానిది ఎవరు? ఇది జన్మ హక్కు
కవిత కానిదేది? అక్షర పంక్తులలో

12.

ఇంట్లో గోడకు అలంకరించిన రంగుల చిత్రం
గిరిపై నుండి దిగి ప్రవహించే జలపాతం
ఆ నదిని దాటుతూ ఎగిరే విహగం
దూరాన కదలే నావ! దగ్గరలో ఈదే చేప

అక్కడక్కడ నగల వలె మబ్బు ముక్కలతో
పయనించే ప్రవాహంలో ఆకాశం!
తీర భూమి పయి మనిషి! నది అంచును తాకుతూ
ఇంత కన్న జీవితానికి! కావలసిందేముందని లోపల

వాస్తవాను భవంలో చిత్రార్పిత వస్తువులు
ప్రతీకలతో సఫలతను తలపిస్తాయి
ఎడారిని మరపిస్తూ దాని స్థానంలో పూల తోట
పచ్చదనంతో ఆశా రూపం, పంటకు సిద్ధంగా

మొత్తంగా నాలో కొత్త ప్రపంచం నవ సమాజం
సృజిస్తుంది! చూచినంత సేపు జరిగే మార్పులతో

వ్యక్తి శక్తి తన వరకు పరిమిత సీమలలో
సమాజ శక్తి విశాలమై ఎందరినో కలుపుకొనీ
పండుగ తర్వాత పండుగ తప్పక వస్తుంది!
ఏడాది అంతా వివిధ విషయ ప్రేరణలతో

ప్రతి కొత్త దారి చూపిస్తుంది మార్పులతో
వ్యక్తి నుండి సమూహానికి నడిపిస్తుంది సుఖదంగా
లోని వెలుగు బయటికి కనిపించదు
దాని ప్రభావాన్ని చర్యలలో చూడవచ్చు

మాట నుండి పాటకు ఊహ నుండి క్రియకు
బ్రతుకులో అందనిది, అందేదవుతుంది

మనిషికి పని! ఉండేది భూమితోనే
ఆలోచన సాగేదీ అనుభవం పండేదీ మట్టిపైనే
శిలలు శిల్పాలయి ఒక్కొక విధం మూర్తులతో
అనుబంధంతో సమాజ బృందాన్ని తలపిస్తుంది

13.

రోజు! పద్మమో! వజ్రమో అయి చేతిలో నిలవాలని
అయితే అది బొగ్గు కణిక కావచ్చు, గాజు ముక్క కావచ్చు
నిప్పు రవ్వ ఎగరవచ్చు ముల్లయి గుచ్చు కోవచ్చు
ఏ దయినా భరించేను మనిషి! మనో బలంతో

ఆడే నిపుణత తోనే ఆటకు స్థాయి
విలువలతోనే గెలుపు వైపు రాణించేది
రెఫరీ ప్రమేయం మాత్రం హద్దులలో
ప్రేక్షకుల ఇష్టాలతో పని లేనే లేదు

పోటీ – పోరాటం తప్పని జీవితాన్ని
ఏ జాలి ఏ దయ శాశ్వతంగా మార్చలేవు
ఏదో ఒక నీతి సూక్తి సూచనతో
ఉన్న స్థితికి తల ఒగ్గడమే జరుగుతూంది

వికృత మనో రూపాల్ని మార్చే ప్రయత్నాలెన్నో
ఒకటొకటి కాలంపై గాలి గోపురాల్లా
నివాసానికి పనికి రాని అంతస్తులతో
మనిషిని ఆకర్షించే ఉన్నత రూపాలయి

ఉన్న స్థితిలో శుభ్రంగా ఉండే యత్నం
ప్రతి వ్యక్తిలో అంతో ఇంతో జరుగుతుంది
ఇదే సమాజాన్ని నడుపుతుంది ఒక స్థాయిలో
లేంది సంక్షోభంలో బ్రతుకులు! ఉక్కిరి బిక్కిరిగా

శూన్యంగా వచ్చి మనిషి ఈ లోకంలోకి
మంచి చెడును సంపదను కీర్తిని వదలి పోయేను
వివేచన పరిశోధన అన్వేషణ కవకాశంతో
వచ్చే తరాలకు పని కల్పించే భావనతో

ఈ సంపద లేనిది? మానవ కథ ఎక్కడుంది?
ఇది భ్రమలకు చోటు లేని పరంపరా రూపం
జాతి పట్ల గతం పట్ల అభిమానం పెంచేను
వాస్తవానికి సరికొత్త విలువలు చేకూర్చేను

14.

కల ఎవరి ఆహ్వానం కయి ఎదురు చూడదు
వాస్తవం వేళకు విధిగా వచ్చే బంధువు
రెండిటి వేరులతో స్మృతి దృశ్యం! అనుభవంలో
కల్పనలో ఒకటి, ప్రత్యక్షంగా ఒకటి

కలలకు రాత్రి పగలు భేదం లేదు
కోరిక బీజం నుండి వెడలే అంకుర రూపం

కవి నుండి ముక్తమైన అక్షర ప్రకాశం కవిత
సమాజ పరమయి జన హృది ప్రసరిస్తుంది

ఎవరే వాదానికి ముడి వడి నిలిచినా
ఈ విశాల వేదికపై స్థానం అందరికీ

కలుగలో దూరే ఎలుక కాదు
బోనులో చిక్కిన పులి కాదు
విశాల శబ్ద మైదానంలో
ఎదిగే వీలు కలది, అందరికీ ప్రవేశం!

తాపంలో శుష్కతతో చెట్టు చెరువు
ఆకాశం వైపు చూస్తూ ఉంటాయి
దాహంతో ఆకలితో మనుషులు
ఉపాయం చూపే మనిషి వైపు చూస్తాయి

ఆగ్రహం తాండవిస్తుంది
హింస ప్రకటితం కావచ్చు
ఈ తాపంలో శుష్కత పోయేది
గగనంలో కనిపించే మేఘుం తోనే

ఇది రావలసిన వేళకు రాకపోవడం
వస్తే! కుంభ వృష్టితో ముంచెత్తడం! దారుణం

పోవలసినవి పోతూ రావలసినవి వస్తూ
తప్పని జీవితంలో మనిషి మనిషిగానే
తన అస్తితపై నిలిచిన విశ్వాసంతో గడిపేను
స్నేహం భేదం మోదం ఖేదం గెలుపూ ఓటమితో

15.

నిరంతర ప్రవాహ తీరంలోనే నాగరకత
ఆర్ద్రమైన భావన తోనే సంస్కృతి విభవం
కవిత అయిన కళలు అయిన విజ్ఞాన మయిన
చిట్ట చివరి గమ్యం మనసుకు హ్లాదం భాగ్యం

మహా కావ్యంలా రూపొందిన ప్రాజెక్టు
తెలంగాణ శిరసుపై జల ధారా కుంభం
నాల్క పైన బ్రతుకు లోన జీవన రుచితో
గంగను తలపించేనా? అమృతం చవి చూపేనా?

ఇది గారడి విద్య కాదు, ఆ మరు క్షణంలో
అదృశ్యమై! కల్పనకు చోటు నీయదు
ఇది మానవ బుద్ధి బలంతో ఎదిగిన
శ్రమ జీవన సుందర జయ కేతనం!

బలమైన కారణం లేకుండా
ఉద్యమ ఘన చరిత్ర రూపొందదు
ఒక దాని వెనుక ఒకటి ఫలితాలు! మంచివై
కాళేశ్వరం శివంకరమై గంగకు నిలయమై
కళ్ళు ఉన్న వారికి నిజమై, మనసుకు వరమై

చెరువులు బావులు గ్రీష్మ తాపంలో
అంత నమ్మదగినవి కావని కాదు గాని
విశాల ప్రయోజనాల పథంలో గమ్యంతో
పేద నదులు సంపన్నం కావడమే! ధ్యేయం
సొరంగంలో నివాస మనోజ్ఞ నిలయం
చిరు అలలతో దృశ్యం చుక్కలతో దిగిన గగనంలా

ఇది నగరంలో ఆశ్చర్య సౌధ నిర్మాణం కాదు
పల్లెలతో ముడిపడిన చిరకాల ప్రకృతి బంధం

మసి బట్టిన చరిత్రకు కాంతి దర్పణం
శివ భావనతో గంగకు పట్టాభిషేకం
నవ యుగానికిది శ్రామిక జన బహుమానం

16.

ప్రకృతిలో పూవు దుర్గంధం చిమ్ముదు
మనిషిలో మనస్సు కంటకాన్ని చూపవచ్చు
ఆయువుకు బలం జీవ కణంలో ధైర్యం
కల్లోల జలధిలోను నావలు పయనిస్తాయి

పోయిన చరిత్ర పరిశీలనలోనే
కాలం గడుస్తుంది! బ్రతుకు తెరువు దారులలో
కను కొలకుల బాష్ప బిందువు
చంద్ర కళలా మెరుస్తుంది! సంతోషంలో

చిక్కని చీకటి స్పర్శతో వెలుగు తరిగి
విషాదంలో ఆగి ఆగి కదలుతుంది
కోరికలు గాలిలో ఊగుతూంటే సరిపోదు
చేతికి అందే ఎత్తులో దొరకడమూ అవసరం
ముంచేసే కోరికలకు నావ అవసరం
నావను నడిపే నైపుణి కూడ ప్రధానం

కాల మొక మహా ప్రవాహం! దర్పణ భావనతో
తరలే కల్మషాలతో పొందే స్వచ్ఛతతో
జీవిత మొక సవనం తేజోమయం
ఇష్టమైన వస్తువు ఆహుతి తప్పదు
మనుగడ కోరేను మనిషి నదికి దగ్గరగా

మైదాన ప్రాంత ప్రదేశంలో దప్పికలో
లోతు బావితో చెరువు తోడ్పడుతూంది
పయనంలో తొలి అడుగు! ఊరు నుండి
దారులెన్నో అన్ని పనుల పయి చూపులతో
నగరంలో బ్రతుకును లాగేందుకు సిద్ధంగా

పగలు నుండి రాత్రి వరకు శబ్దం వినిపిస్తుంది
వీడని సంగీతం ముక్కల్ని తలపించేను
అన్నీ ఒక చోట కలిపి తేనే చరిత్రలో
మరునాటికి నవ రసాల వీడియో! సిద్ధంగా

17.

బతుకుతూన్న పరిసరాల సమాజంలో
కవుల దృష్టి మనిషి వైపే మనిషితోనే
కవితకు ఆకర్షణ కేంద్రం మనిషే
స్పందనలో ప్రేరణ మొక సందర్భంలో

స్టేషన్ జాతర చౌరస్తా శ్రమ నిలయం
ఎందరో కలిసేవి తత్కాలంలో ఉపయోగాలయినా!
ఇంటి ముఖం దారి పట్ట వలసిందే
స్థిరత వైపు ఆలోచన సాగవలసిందే

సంచారం నుండి మనిషి స్థిరతలో
ఎన్నిటినో సాధించే పనిలో ఎప్పటికీ
హక్కుల పయి ఆస్థతో బాధ్యతల్ని మరవని
ప్రజాస్వామ్య క్రియలో సమస్యలకు సెలవు!

ప్రేమ కరుణ వీరం త్యాగం
నాలుగు స్తంభాల పైన జీవన నిలయం
నిశి చీకటిలోను రేపు పయి ఆశ
ఉదయ తీరం చేరే సాధనమవుతుంది

పరస్పరం సహకారంలో మేలు పథంలో
నడవాలిసి ఉన్న ప్రపంచీకరణం
ఎక్కడి కక్కడ స్వార్థంలో! పయనిస్తూ
పేదను మింగేసే ఆశలో అమానుషం!

ఈ రోడ్డును దాటాలంటే ట్రాఫిక్‌లో
సర్పంలా ముందు భయం కదలుతుంది
విరామం లేని ధ్వని ప్రవాహం! దాటే
మనిషిలో శాంతిని పరీక్షకు గురి చేస్తుంది

ఈవల ఆవల హద్దులు! అవసరాలకేర్పడినవి
మనో విధాలెన్నో! ఇష్టమయిన దారులన్ని

మనిషి బ్రతుకు సాగుతుంది! తనలో నయితే
తానెవరి అధీనంలో లేని స్వేచ్ఛా రూపమన్నట్లు!

18.

మట్టి గడ్డ నుండి సృజనలో పచ్చని మొక్క
ఎదురుగా మనోజ్ఞమయిన కొత్త దృశ్యం!
ప్రకృతిని సమాజాన్ని కలిపే చేతన స్పృహ
ప్రతి రోజు జీవన చలనంలో భాగమవుతూంది

మనిషికి ఆత్మీయంగా భూమి ఎప్పటికీ
జీవన వాస్తవ రుచులను చూపుతుంది
మహనీయుల వెలుగు పాత్ర ననుసరించి
మలుపుల్ని తిరిగి గమ్యం మారుతుంది

శ్రమ జీవన భావనతో ప్రజాస్వామ్య హృదయంతో
కదలుతుంది సమాజం! మహోదయ జగతికి
మితం లేని ఆశలలో సంకుచితంగా
ఎంత ఎగర జూచినా హద్దులు తప్పవు

గుండెలో మినీ రవి గుప్తంగా
బ్రతుకులో ఝరీ గతి సుప్తంగా
ఎండిన పరిసరాలు జలదం కయి చూచేను
మేల్కొలిపే కిరణం కయి! దిశలు నిరీక్షించేను

అపుడపుడు దాటరాని గోతుల్లా నిరాశలు
విరామాలతో పయనం ఆగదు, సాగుతుంది

జడతలో స్తబ్ధంగా మనసు ఉండగలదా?
ఆకులేని తరువులా బ్రతుకు నిల్వగలదా?

ఎన్ని మలుపు లయినా పయనం ఆగదు
రుతువు లారు చుట్టి వెళ్ళి పోయే లోపల
పది దిశలను చుట్టి రావాలని కోరిక మనిషిలో

శిఖరారోహణం రోజూ జరిగేది కాదు
ఊరు పక్కనయినా పరిచయ మెప్పటి దయినా
స్మృతిలో అనుభవ సుందరమయిన దృశ్యం
బ్రతుకులో బహుమతిగా! పొందడమొక ఆశ్చర్యం

19.

ఎప్పటికీ చెక్కుతూ పోయే శిల్పశాల కాదు జీవితం
ఆదర్శంలో మౌలిక రూపం పైనే జరుగుతుంది
అలంకార యోగ్యతనో ప్రదర్శన కర్హతనో పొందుతుంది
అందం చందం కీర్తితో జ్ఞాపక రూప మవుతుంది

ఆకలితో అలమటించే సమాజంలో
ప్రతి క్షణం దాహం తీర్చే నదిని తలపిస్తుంది

మంచు ముసుగు వదిలింది అనుకుంటే
ఎండ వస్తుంది నిప్పులా తపింపజేస్తుంది
ఎప్పటికీ కాలం! తన కనుగుణంగా
ఉండాలను కోవడ మొక! కాల్పనికం!

భూమిని వదల లేదు శరీరం
నింగిని తాక లేదు మస్తిష్కం
రెండూ శక్యం కానివి! అయినా
విహగంలా మనసు యత్నం సాగిస్తుంది

భిన్నమైన ఆలోచన అనుభవ పార్శ్వాలతో
మనుషులందరూ ఒకటిగ నమూనాలు కాలేరు

నేలపై అగ్ని నింగిలో సవిత
మనిషిలో చేతన మెలకువలకు సంకేతం

జల తరంగ చలనం జలధి అస్తితకు సూచన
మౌలిక గుణ సంపుటి మనిషి అస్మితకు కారణం
ఆయుధంతో పని ఎపుడు బడితే అపుడు ఉండదు
ఎక్కువగా విశ్రాంతితోనే! కాలం గడుస్తుంది

మంచి చెడు ఉచితానుచితం కన్నా
శత్రు హరణ మొకటే లక్ష్యంగా
ఒకరి పట్ల మారణ విషాద ఛాయ
మరొకరికి! ఉత్సవ కళనిస్తుంది

ఆలోచన ఆచరణ దార్శనికం ప్రధానమై
జీవితం! ఎన్నటికీ శిల్పమయం కాలేదు!

20.

బ్రతుకులో క్షణాలు వెలిగే కర్పూరకళికలు కావు
అపుడపుడు! కట్టె ముక్కల్ని రాళ్ళను తలపిస్తాయి
కాలు జారి గాయమయినా
నడకపై చెదరని నమ్మకం
మానుష శ్రమ పాత్రను వదలనీయదు
గమ్యం చేరే దిశను మరవనీయదు

సానుభూతిలో బాధ, పంచుకోవాలని ఒకరు
ఆదుకొని ఆ బాధ తగ్గజేయాలని ఒకరు
అండగ ఉంటూ బాధ, రూపు మాపాలని ఒకరు
ఎవరు ఏమి చేసినా? ఎవరి బాధ వారిదే! అవుతుంది

ముల్లుకు దూరం జరుగుతుంది చేయి,
గులాబీకి దగ్గర అవుతుంది మనసు
చేయి కనిపిస్తుంది, మనసు కనిపించదు
స్పందనలో మనిషి మనసు! హ్లాదం వైపే

ప్రతి రుతువు ప్రభావంతో కాలం!
కవి ప్రతిభా రూపానికి కొత్త దనం ఇస్తుంది

శిశువు పుట్టగనే పొందేది మానుష స్పర్శయే
శిశువు కళ్ళు తెరచి చూచేది చుట్టూ మనుషులే
వినిపించే ధ్వనులు! మాటలు
నాద సార స్వరాల్ని పొందినట్లు ఉంటాయి

చుట్టూ కనిపించే మనుషులు
సమాజ బంధు తను ప్రసరించేరు
జీవిత కాలంలో దృశ్యం! ఎంతటి దయినా
చూచే మనో దర్పణంలో! బింబించక మానదు

విశాలమైన అవనిపై అడుగు నుండి అడుగు
వశమవుతూ, ఎగుడు దిగుడుల అనుభవంతో
స్వచ్ఛమయిన ప్రకాశ రూపం! కోరేను వ్యక్తి
ధూళి ధూమం రాళ్ళు అవలీలగ దాటుతూ

21.

తొలి కిరణ స్పర్శతో
కాలం సమాజ చేతనతో రవళిస్తుంది
వినడానికి ఇంపుగా ఉత్సాహ కరంగా
కదలికలో అభిలాషకు ఆసక్తి తోడవుతూంది

రాత్రి మిగిలినవీ మనిషి వదలినవీ
ప్రశ్నలకు జవాబులు మొదలవుతాయి
రాత్రి చుక్కలు సన్నని వెలుగు చూపులతో
మరునాడు సమాజాన్ని ఎదుర్కొనే ధైర్యం నింపుతాయి

రాత్రి సమాధి పయి
పూల హారం కావాలనీ కోరేదెవరు?
రాత్రి కత్తి అంచుపై నిశ్శబ్దంగా
నడకతో తనలో ప్రజ్ఞను చూపేదెవరు?

శ్వాసలో విశ్వాసం! కర్తవ్యాన్ని నడిపిస్తుంది
బుద్ధిలో హేతువు! జాగ్రతలో ఉంచుతుంది

తన కృతిపై విమర్శ కవిలో
పూర్ణతకు మంచి సాధన మవుతుంది
కవిలో అంతరంగ సమీక్ష
భావ కమలం రేకులు విప్పుతుంది
వాలిపోయే అలలను తట్టి
ముందుకు నడిపించే గాలిలా కవిత!
స్వేచ్ఛా భావనతో విభేదాల కతీతం
దార్శనికంతో గమ్యానికి చేర్చే సాధనం

కట్టేసిన చీకటి తాడును తెంపి
బంధన నుండి విముక్తం చేసేను

డబ్బుకో కీర్తికో ఊహల దారులు మారే
సంకుచితం నుండి! బయట పడేసేను
ఎక్కడయిన అగ్ని నార్పే జలసేచనకయి
కవిలో జలదం! సిద్ధంగా అది విశ్వమయం!

22.

ఈ రోజు ఆలోచన నిన్నటి అనుభవానికి పొడిగింపు
రేపటి వాస్తవానికి దారి తీసే ప్రవేశ సూచిక
శరీరం కన్న ముందు మనసు బయలు దేరుతుంది
ఎక్కడికయినా ఎంత దూరమయినా నిరాఘాటంగా

ప్రవాహంలో వదలిన కాగితం పడవ కావచ్చు
గగనంలో ఎగిరే గాలి పటం కావచ్చు

కళ్ళ ముందు విరిసిన పూల పంక్తుల్లా పోటోల ఆల్బం
పోటోల వెనక నుండి స్మృతి పథంలో గతం!
ప్రతి క్షణ మొక పదమయి కవితలో కదలేను
కాల గమన దృశ్యాలొకటొకటీ! రైలు ప్రయాణంలో వలె

సంస్కారం వివేకం రెండూ సమాజంలో
మనిషిని ప్రగతికి చేర్చే ఉత్తమ సాధనాలు
ఉషస్సు దీపం కాదు, అది తేజో బింబం
వెలిగిస్తే వెలిగేది కాదు, ఆర్పేస్తే ఆరేది కాదు

అనుకూలం ప్రతికూలం రెండూ త్రాసులో
చెరొక వైపు నుండి తూగుతూ మనసులో
స్నేహం వైరం శాంతి రణం స్థితులతో
బ్రతుకుల తీరులు తెన్నులు మారేను

ఎదురుగ సముద్రం లేచే అలలతో
హద్దులు కనిపించని జలాలతో విశాలమై
సమయానికి తీరాన పడవ కనిపిస్తే సంతోషం!
పైన విహగం ఎగురుతూంటే సమాజానికి ధైర్యం!

వ్యక్తీ సమాజం బంధంతో ఎదురయ్యే అవసరాలు
మనసును ప్రాకారాల వలె చుట్టేస్తాయి

ఒక నెత్తురు చుక్క పడిన నదిలో నీరు
క్షణంలో పూర్తిగ రేఖా చిత్రమై తరలుతుంది
సరళ రేఖ నుండి వక్ర రేఖలెన్నో
మనిషికి కొత్త చిత్ర రూపం చూపిస్తాయి

23.

ఉద్యమ మెపుడు బడితే అపుడు నడవదు
జృంభించిన జన దృశ్యంలో ప్రతిఫలిస్తుంది
కోపంలో మండే మాటలలో స్వనిస్తుంది
సమ న్యాయం నీరు కారి పోతూన్నపుడు
నిరసించే సాధనం, ఎదిరించే ఆయుధం

నిప్పు రవ్వ! అవసరాలెన్నో
పడి ఉన్న బొగ్గులో తేజం నింపుతుంది
జన శక్తికి కార్యాచరణ రూపమయి
నిరంకుశాన్ని బూదిద బొమ్మను చేస్తుంది

బాధలు అందరికీ, ఎవరి కయిన ఒకటే
సుఖాలు! కొందరికి పరిమిత భాగ్యాలు
స్వేచ్ఛకు అవకాశంతో సమస్యకు పరిష్కృతితో
వర్తించడమొక రాజనీతి పాలనా బాధ్యత

మంచి భవిత కయి శ్రమ శక్తిని గుర్తిస్తూ
మనిషి చేయలేనిది! దేవతలు కూడ చేయ లేరు

అవని పయి సమాజం తోటగ మారాలని
మనిషి బ్రతుకులో పరిమళ పవనంతో
బీద బిక్షువు కనిపించని సమాజ దృశ్యం
కల్పనలో నుండి వాస్తవానికి చేరాలనీ

మార్పు ఎచట? బంధనలోనా? పీడనలోనా?
కాల మదే! ఎదురుగ అద్దంలా శుభ్రంగా
ఎప్పటికపుడు స్వచ్ఛమవుతూ సాగే
గాలిలా ఝరిణిలా మనో రూపమవసరం

ఏ రుతువున కది ప్రభావ మయం
తన దయిన ప్రత్యేకత చూపిస్తుంది
ఏ బ్రతుకున కది స్వతంత్ర పదం
తనలో ఆదర్శం దిగితేనే ప్రయోజనం

24.

చుట్టూ సమాజం! అడవిలా విస్తరించి
తోటగ మార్చే సంస్కరణలు! మార్పులు!
ఎవరికి వారు తమ దయిన ఆలోచనలో
స్వంత కథల ప్రదర్శనంతో తృప్తి పడేరు

నాలుగు వైపుల దిశలు! స్వాగత ముఖాలతో
వ్యక్తి పయనం! ఏదో ఒక దిశలోనే సాధ్యం
వెళ్ళే ఎవరి దిశాగమ్యం! వారికి ప్రియం
దారుల ఎన్నికలో భేదాలు! సహజమయినా
సమస్యకు పరిష్కారం కోరుతుంది మనస్సు
అలజడిలో యుద్ధానికి సన్నద్ధం కాదు
చెదరిన సమాజంలో కవిత మనోబంధంతో
శాంతికి చిహ్నం! అందరినీ కలుపుతుంది

శత్రువుతో యుద్ధం వంటిది కాదు సమాజ సమస్య
ఆయుధ ప్రమేయం కన్న, శాంతి పావురానికే ప్రాధాన్యం
నిరంకుశ ప్రవృత్తికిది ఇష్టం కాక పోవచ్చు
పాలనా క్రమం భోగాల సోపానం కాదు!
ఘర్షణ ఎవరికి హర్షణీయ మవుతుంది
కాదు! అయినా తప్పనిదీ కాదు
అగ్ని బాహువులలో చిక్కిన సమయంలో
విషాద దృశ్యం చూస్తూ! ఎవరు మౌనంగా ఉండగలరు?

ముఖంలో మౌన భాష వదలిన వ్యతిరేకం
కళ్ళలో బాష్ప కణంలో నిరసన చిత్రం
కళ్ళ ముందు ఒరిగి పోవు మానవీయ శిఖరం
ఇది ఏ సుందర స్వప్నానికి ఆదర్శ ప్రతినిధులు

దీపం మిత్రం గానే ఉండి తీరుతుంది
చీకటి శత్రువుగానే ఎదుట పడుతుంది
మృత్యువుకు రిజర్వులో అతిథిగా మనిషి!
ఈ అవసరం కలగడం! దౌర్భాగ్యం!

25.

ఎన్ని యుగాల నాటిదో!
ఇపుడున్న మనిషి మూలం?
ఈ కనిపించే జీవితం ఎన్ని మార్పులు పైననో

పగలు ఎదురు పడే మనిషి
చల్లని వెలుగుతో కనిపించాలనీ
రాత్రి ఎదురు పడే మనిషి
వెచ్చని వెలుగు దివ్వియ కావాలనీ

ఉదయం వెలుగు సంతోష స్పర్శతో
మాట్లాడే విధం వేరు
సాయం వెలుగు విషాద ముఖంతో
మాట్లాడే విధం వేరు

ఎవరి కిష్ట మయినా కాక పోయినా
కాలం విశాల పుటలలో కవిత!
మనో వేది పయి అభిప్రాయ భేదాలతో
పలుదారులు తొక్కుతుంది వేరు వేరుగా

లోన దు:ఖం ఇంకదు, పొంగుతుంది
ముఖాలవే! మాటలు వేరు! అర్థాలు వేరు

నదు లెన్ని కలిసినా వర్ష మెంత కురిసినా
జలధి ఉప్ప దనం పోదు, అదే జీవితం
తనకు పరిమితమైన రుచులలో
మరొకరికి! ఆకర్షణ కలిగిందీ

ప్రాణానికి తప్పదు ఆహారం
దేహానికి తప్పదు ఆచ్ఛాదం
బ్రతుక్కి తప్పని పరిమితులతో అస్తిత!
పోను పోను జరిగే హద్దులతో స్వేచ్ఛ
చెట్టు కొమ్మ నుండి ఆకు రాలుతుంది
చూస్తూ ఉండవలసిందే! చేసే దేమీ లేదు
తిరిగి కొమ్మకు ఆకును చేర్చగలిగేరా?
జారిన క్షణం కూడ అంతే, గతమయి పోతుంది

26.

జలాశయం పక్కనే! ఉనికి అయినా
దహన కాండలో అనల దృశ్యం ఆరదు

ఆకలిలో కోపంలో శత్రుతలో అగ్ని
బ్రతుకులో తీగెలా పాకుతుంది, అవకాశంతో
జలదం సయితం దిగి ఆపలేనిదీ
నిశీథి సయితం క్రమ్మి మాపలేనిదీ

నిలయం గాయపడితే
బ్రతుకు చెదరుతుంది, కథ అవుతుంది
దేహం గాయపడితే
మనిషి చెదరి, బాధకు గురి అయ్యేను

గాథలలో బాధలలో జీవితాల సమాజం
తప్పని విధ్వంసంలో నవ నిర్మాణం కోరేను

ఈ గాథలు చరిత్ర కెంత ఉపకారాలో
ఈ బాధలు కవితలకెంత ప్రేరణలో
ఇవి ఎన్ని మాటలకు అవకాశాలో?
ఇవి ఎన్ని పాటలకు సంసూచికలో

హృదయ వశంతో అభిమానిని అభిలాషిని పంక్తులు
తన వెంట తిప్పు కుంటాయి, ఎంత కాలమయినా

సృజన కళలు ఆయువుకు గౌరవ దశ నిస్తాయి
లౌకికాలు బ్రతుక్కి భాగ్య రేఖ నిస్తాయి
స్వర్ణ ద్రవంతో పోత పోసిన రూపాలకు
అలంకార సుందరతలు! కళా విశేషమయితే
రవి రశ్మి స్పర్శతో హిమ ప్రతిమలు
జలధునిగా కూడడమొక! సాధారణ విషయం

మనిషిలో రెండూ ఆకర్షణీయ రూపాలు
కవితలో సృజనకు బంధువులవుతాయి

నిలిచినపుడున్న దగ్గరి తనం తగ్గి
గమనంలో ఎడం కావడం సహజం!

27.

అందమయిన సందర్శన నిలయం నిర్మాణం కావచ్చు
ఉదయ మెంత హ్లాదమయినా, విషాదాన్ని పరచవచ్చు

ఇది నగరం! కోరిక పుడితే
ఆకలి వేస్తే! ఎదురుగ తళతళలాడే వజ్రం!
రాత్రి సరసిలో చంద్ర బింబంలా లాగుతూ
పగలయినా! వేదను అచటే నిలిపేస్తుంది

కండరాల పుష్టి తోనే శరీరానికి మనుగడ
దీని బదులు మరొక టేదీ పనికి రాదు
ఉన్న వాడు స్వర్ణ ప్రతిమ! లేని వాడు ఇనుప మూర్తి
ఇది యంత్రాకృతి పొందవచ్చు, మనిషి అవదు చిత్రం

సమాజం వ్యక్తిని సమీపించదు
వ్యక్తి సమాజంలో సహజమైన భాగం

గంధం చెక్క నీరుతో అరిగితే సుగంధం
గంధం ముక్క అనల స్పర్శతో సుగంధం
కవితలో భావ చలనంలో సుగంధం
నాలుగు దిశలలో సర్వ సమంగా!

గిరి శిఖరంలా మౌన ముఖం
గగనంపై ఆశను పెంచుతుంది

ఎంత సేపు ఎన్ని మాటలు మాట్లాడినా
ఇంకా మాట లాడాలనే ఉంటుంది,
ప్రేమలో స్నేహంలో వాత్సల్యంలో కన్నా
శత్రుతలో ద్వేషంలో ఇంకా ఎక్కువగా

ఒంటరి తనం దాహం తీర్చే చెలమ కావచ్చు
తాళం వేసిన గది! భద్రత కుపరించినట్లుగా

స్వేచ్ఛ లేని మనిషికి అనుభవంలో ఈ ప్రపంచం
కూపమో! పంజరమొ! ప్రకటించని నిర్బంధమో

వేరులన్ని భూమిలో! ఒకలానే కనిపిస్తాయి
ఉద్గమనంలో ఏ చెట్టు గుణ రూపం దానిదే!

28.

సంఘం చూపే పథంలో తన గమ్యానికి
సంస్కృతి పండిన మనసుతో జీవన సాఫల్యం
అడుగులు ముందుకు పడితే ప్రగతి
ఆశా రూపానికి చేతన చిహ్నం

ఉడగ్రతలో ముఖం! భాను బింబాన్ని తలపిస్తుంది
ప్రసన్నతలో ముఖం! చంద్ర బింబాన్ని మెరపిస్తుంది

జీవితంలో మనిషి అనుభవానికీ
ప్రకృతిలో మార్పులకూ అనుబంధం!
భౌతికంతో పాటు మానసికంగానూ
కొత్త దయిన ఆలోచనా జగతిని దింపుతుంది

కొత్త రోజు కొత్త కవిత కొత్త బ్రతుకు కయి
వ్యక్తిలో ఆరాటం ఆదర్శదర్శన మతితో
జలద హృదయంతోనో కిరణ దృష్టి తోనో
ఆగని కవిత! ఎదకెంతో ప్రియమవుతుంది

కవితతో ఏకాంత బాషణం జరుగుతుంది
కవిలో శ్రోతలతో పాఠకులతో ఏదో ఒక స్థాయిలో
పరిచయం కాస్తా మిత్రంగా మారవచ్చు
చిన్న భేదంతో శత్రువుగానూ కావచ్చు

స్వేచ్ఛ ఉన్నా అవనిపై నడకలో అవరోధాలెన్నో
అప్పటి స్థితిని బట్టి అడుగులు పడతాయి
తీరానికేదో చెప్పాలని! సముద్రం
ప్రేమ కావచ్చు, బాధ కావచ్చు

వీచే గాలికి తన కథ వినిపించాలనీ
కదలే అలల మాటల్ని బట్టి!

ఆయువులో వయస్సు ఒక వైపున పెరుగుతూ
కాలం గడచే కొద్దీ కృతి! పరిణత భావనతో,
సృజన చరిత కవిది! అయినా వేదిక పయి మాత్రం
సమాన బాధ్యత సాహితీ హృదయ సమాజానిదీ!

29.

"నిజం" ఎప్పటికీ కాలాని కతీత మయింది
హృదయంలో వజ్రాన్నో పద్మాన్నో తలపిస్తుంది
ఏదో ఒక రంగుతో కప్ప బడే ఉంటుంది
పలు రంగులు కలిసిన రూపం ఒక ఆకర్షణ

బ్రతుకులు ఎప్పటికీ వాస్తవ రుచులకు దగ్గరగా
మనిషిలో గుణ క్రియా ప్రభావ రూపాలతో

కదల లేని కొండ గత స్మృతుల రాశిగా
కదలి పోవు ప్రవంతి వర్తమాన సూచిగా

కొండ బలం ముందు తానెంత అనుకుంటే
శిఖరం నుండి నీరు దిగేనా? దప్పిక తీరేనా?
విశాల గగనం ముందు తానెంత అనుకుంటే
జలదం కదలేనా? భూమిపై క్షామం తొలగేనా?

ఇవి ధైర్యంతో కలిసిన చేతన శీలంతో కదలి
వ్యక్తి నుండి సమాజ పరమై! వరమయ్యేను

సమయ సమయం ముఖంలో కదలే పతాక
రూపం మారుతూంది, రంగులు వేరయ్యేను
మతిలో ఆలోచన హద్దు దాటి విలయంలో
వరదల బీభత్సాని కవకాశం కలుగుతూంది

సంక్షోభంలో మనిషి అశాంతి ముద్రలతో
పైనున్న మబ్బులకు తర తమ భేదాలు లేవు
శాంతి కయి సామూహిక అన్వేషణ సాగుతుంది
అస్మిత నుండి అస్తితలోకి నిరంతర పయనం

నిరంకుశంలో స్వేచ్ఛ తుపాను గతిలా
సమాజ ప్రగతికి ప్రమాద హేతువవుతూంది
జారే బాష్ప కణం అనల బంధువవుతూంది

ప్రతి బ్రతుకు సమాంతరం అస్మిత నుండి అస్తితకు
అల వెనక అల వలె అడుగులతో ముందుకు పోవలసిందే
అస్మిత వ్యక్తికి మితం, అస్తిత ప్రపంచ మయం

30.

ప్రతి కవిత అదే! మొదటిది అనుకొనీ
పదం వెంట పదం కదలుతుంది! స్పందనలో
రచనకు ఆయువు ఇంకా ఎంతో ఉన్నదిగా సంకేతం
మనసున చేతనతా గుణ రూపం నిలిపేను

సూర్యుని తాపం చంద్రుని హ్లోదం మానసికంగా
బ్రతుకుల కిస్తాయి ఉత్తేజం ఉల్లాసం రెండూ
భావనలో అస్తితలకు మూల దిశలవుతాయి
సాగే పలు రేఖలతో చిత్రం దేని కది అపూర్వం

తాపంతో భూమి! దాహంతో జనత
ఏ వైపు నుండో వచ్చే జలదం కయి చూచేరు
ఎపుడో వచ్చే వరద తలచి భయపడే వారూ ఉన్నారు
పిడుగులు జారేనని మబ్బురాక నడ్డేరా?

అక్షరాల వెనక నుండి మానవీయ ముఖంలో
కిరణ దృష్టియె! బాష్ప బిందువౌ! తప్పనివీ
మానవ చేతనతో కవిత విశ్వమయ మవుతుంది
చింతనలో దార్శనికం బ్రతుక్కి ప్రకాశ గమ్యం!

గ్రీష్మాన్ని కవి మబ్బు కళ్ళతో చూచేను
శిశిరాన్ని రవి రశ్మి దృష్టితో చూచేను

తెలుపు రంగులో మొదలయిన రోజు
పలు రంగుల మిశ్రమ రంజనతో గడుస్తుంది

నిరంతరం జరిగే మానస క్రియలో
చీకటిని పూర్తిగ తుడి చేయాలని వెలుగులు
వెలుగుకు తలుపులు మూసేయాలని చీకటి
జరిగే పని కాదు, అయినా యత్నం ఆగదు

అడుగు కింద చీకటి అణగే ఉంటుంది
అవకాశం దొరికితే ఎగిరి పైకి ముఖంలో
తిష్ఠ వేసే కోరిక! మనిషిలోను సహజం
ఎత్తిన అర చేయి నుండి వెలుగులు జారేనా?

ప్రతి కవిత అదే మొదటిది! అనిపిస్తుంది
స్వతంత్ర రూపంతో స్వేచ్ఛా పథంలో భిన్నమై శిష్టమై

91. స్వేచ్ఛా కవిత్వం

ఇది జీవితం

(XVI భాగం)

ప్రాణం కన్న మిన్న

మాదిరాజు రంగారావు

రసధుని
సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 28.

91 IDI JEEVITHAM

Free- Verse

(XVI Part)

Praanam kanna minna

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2019

Presented
to
Smt. Indira
on her Birth day

పీఠిక

"ఇది జీవితం" బృహత్కృతిలో XVI వ భాగం. "ప్రాణం కన్న మిన్న కవిత" వస్తువు వర్తమాన కాలంలో సమాజం వ్యక్తి స్థాయిల్లో జీవితంలో ఎదురయ్యే సామాజిక రాజకీయ నైతిక తాత్త్విక విషయ రూపం కలిగింది. ఇది అనుభవంలో విస్తృతినీ వైవిధ్యాన్ని సూచిస్తూంది. విభేదాలు అనివార్యమయినవి, సమరస దృష్టి కూడా అత్యవసరమయింది. ముఖ్యంగా ఈ రోజుల్లో.

ఇది మనిషిలో సామాజిక చేతన పాత్రను జ్ఞప్తికి తెస్తుంది. కర్తవ్యాన్ని ప్రబోధిస్తుంది. బాధ్యతను గుర్తు చేస్తుంది. ఇది జరిగినపుడు చాలా భాగం ఆశామయమైన స్థితికి దారితీస్తుంది. సమాజంలో సంక్షోభం స్థాయి తగ్గుతుంది. వ్యక్తిలో అశాంతి – నిరాశల సాంద్రత తగ్గుతుంది. నేరాలకూ హింసకూ మనసు దూరమవుతుంది. మానసిక శుభ్రతకు దారితీస్తుంది.

ఈ మహాకృతిలో ప్రజాస్వామ్య భావన సామ్యవాద దృష్టితో సమాజాన్ని ఉత్తమ స్థాయికి చేర్చే దార్శనిక సాధనంగా భావితమయింది. నేడు జీవితంలో ఎదురయ్యే సామాజిక రాజకీయ నైతిక మానసిక స్థితి చిత్రణం కలిగింది.

ఇక అభివ్యక్తి విషయంలో భావరూపాలు ప్రతీకలు నిర్వహించిన పాత్ర కళాత్మకతకు ఉపకరిస్తుంది. ఇవి కవిత్వ కళకు బాగా ఉపయోగ పడతాయి అన్న విషయం విమర్శ పరిధిలోనిది.

ఈ విధంగా వస్తువు–విషయం–ప్రయోజనం–కళాత్మకతతో స్వేచ్ఛా కవిత్వంలో ఈ రచన ప్రత్యేకతను భావింపచేస్తుంది.

వర్తమాన జీవన ప్రతిబింబంగా, అక్షరాకృతిని పొందింది. భవితపై 'దృష్టితో నవతను కలిగింది. మానవీయ ప్రకాశరూపంగా ఆవిష్కారాన్ని పొందింది.

– మాదిరాజు రంగారావు

1. డైరీలో పేజి

వర్తమాన చలనంలో పరిసరాల సమాజం
ఇంకా వికాస దశలలోని పూర్వపు గుర్తులతో

మస్తిష్కంలో వికసించే వెలుతురు కమలం
జీవన భాగ్యానికి సుందరతను సూచించేను
అనుక్షణం మారే స్థితులతో విశ్వమయమై
వచ్చే రోజు పై ఇంత కన్న మంచి ఆశతో

కొందరి ఇష్టంతో కాక అందరిపై దృష్టితో
భౌతిక మానస స్థాయిలో నవ నిర్మితి అవసరం

రేపటి భాగ్యానికి మొదటి చర్య విధ్వంసం
తప్పదనీ! అడవి నాశ్రయించేరు! కొందరు మార్పుకై

భవిత అయిన నవత అయిన శ్రమజీవన ఫలితం
పరిసరాలలో గాలి ప్రయాణ సూచి అవుతూంది

ఎగరలేని మనిషికి గగనంపై చూపు సహజం
మతి విభవంతో నింగిదాక వశం చేసుకోవాలని

శూన్యం నుండి మొదలయిన బ్రతుకు
చివరకు శూన్యానికి వెనుక అంకెలు చేరీ
అణువు నుండి మొదలయిన ఊహ
ఊరు దాటి విశ్వమయమవుతుంది

రోజు కిరువైపుల నుండి మధ్యలో
దీర్ఘమయిన పథంలో జీవన దృశ్యాలు
కూడికలు తీసివేతలు లాభాలు నష్టాలు
పట్టికతో ఏరోజూ మనిషి డైరీలో పేజీ

సమాజాన్ని భూమిని మనిషిని వీడడం అసంభవం
బ్రతికిన కాలంలో 'విలువలు' తెలిసేది తరువాతనే

లోపల నయితే గిరి శిఖరం! ఒంటరిగా
బయట నయితే జలధని! జనపదాలతో

గిరిశిఖరం చేరలేని ప్రవాహాన్ని దాటలేని
మనిషి! దిగులులో ఆత్మహత్యకు ఉంకించేను

బ్రతుకులో క్రియాశక్తి లేని ఆయువు లేదు
ఈ సమాజ మెవరికీ విశ్రాంతి నిలయం కాదు.

2. వీడ్కోలు - స్వాగతం

నిప్పు! అంటుకొనీ బొగ్గై పోయే నిలయం
చూచే కళ్ల నుండి జారే
సానుభూతి బిందువులో కరుణతో
చూస్తూ నిలబడితే సరిపోదు! సమూహంలో.

అంటించిన చేతులతో చూచే కళ్లతో ఆర్పే చేతులతో
ఏ మనిషి కామనిషి! ఒక స్వతంత్ర ఖండం కావచ్చు.

చీకటిలో పైనుండి విరిసిన చంద్రుడు
కష్టకాలంలో ఉన్న మనిషిని చల్లగ చూచేను.

సమాజంలో మనిషి, సమాజంతో కలిసి
పరుగెత్తలేక పోవచ్చు, ఒంటరిగా ఉన్నా
సమాజ బంధం తెగదు, వదలదు ఎప్పటికీ
తోడు కయి ఎదురు చూచేను మనిషి!

మనిషి పైన విశ్వాసం తగ్గిపోయి
ఏ జంతువునో తనతో పెంచేను.

ఒక సందర్భంలో ఉన్న సమాజం
అలల అలజడితో సముద్రమనిపిస్తుంది
మనిషి జీవితమొక పడవ అయితే
పయనానికి ధైర్యం అవసరమవుతుంది

పుట్టింది మొదలు గిట్టేవరకు అనుభవం
జరిగింది మరపునబడి కొత్తది చేరుతూ పోయేను.

నిశ్శబ్దంగా తాను మౌనంగా ఉన్నా!
పరిసరాల నుండి శబ్దం కదలిస్తుంది

క్రియాలోలమైన జన సంరంభం ఆగదు
ఏదో ధ్వని! మనసుపై గీత గీసి పోతుంది
సావధాన పరచేది కావచ్చు
సహనశక్తిని పరీక్ష చేయొచ్చు

వికృత మనో రూపానికి ముళ్ళు ముందు తేలతాయి
చెదరిన ఆలోచనలు గాజు ముక్కలవుతాయి

వీడ్కోలు బాధ్యత నుండి ముక్తం చేస్తుంది
స్వాగతం కర్తవ్యాన్ని మరింత పెంచుతుంది

3. ముగింపు కాదు

జన హిత భావనతో సమాజ బంధుతచే
తన శ్రమతో ప్రజ్ఞతో అమరత సిద్ధించేను

తెలుపు నలుపు ఎరుపు పచ్చ పచ్చ రంగుల
కలయికతో జీవితకథ అక్షర పంక్తుల్లో
అలసట పేరుతో చదికిల బడే వ్యక్తిత్వం
పయనానికి ఆటంకం, ఉద్దేశానికి భంగం.

పలు మతాలు వాదాలు సమాజ దార్శనికాలు
ప్రజల బ్రతుకులో గొప్ప మార్పును కోరీ
ప్రతి దాని ప్రభావం కొంతవరకే! కనబడుతూ
మధ్య మధ్య అఖాతాలతో ఆపై దేని దారి దానిదే

సరించే మానవత, గడ్డకట్టి పోకుండా
తనలో! కోష్ణ రుచిర వర్తనం కర్తవ్యం.

మంచు పలకను శిల్పంగా తీర్చే ఆలోచన
సుందర కళాఖండం కావచ్చు, కాలంపై
ప్రయోజన విశాలత కుంచిత మవుతుంది
ప్రవాహ గతిలోనూ ఉంది! కళా రామణీయకత

ఎవరి తీరు వారిది ఎవరి స్వార్థం వారిది
విశ్వమయం మనోరూపం, సర్వస్వతంత్రం

మార్పు కయి విధ్వంసం ఒకటే శరణ్యం కాదు
వాదంలో రూపం ఖండఖండమై ఆచరణంలో
అగ్ని వలయంలో కాలం గడచేను, భ్రమణంలో
ఉదార మయిన మానవీయ దార్శనికంతోనే సాధ్యం.

రోజులు గడచేకొద్దీ, మారని యథాస్థితిలో
తీరని సమస్య సమాజ క్షోభను పెంచతూంది

జెండాలో రంగులు భావప్రకారాలకు ప్రతినిధులు
అణచివేత పీడనలకు నీలిరేఖ గుర్తు
ఆరని ఉత్తేజానికి ఎరుపురేఖ చిహ్నం
స్వచ్ఛమయిన ఆశకు తెలుపురేఖ సంకేతం

భాగ్యవంత స్థితికి పచ్చరేఖ సూచన
అలసట నిష్క్రియ కాదు, విరామం ముగింపూ కాదు.

4. అనివార్యం

ఇంత వరకు! ఎవరూ చెప్పనిదీ కొత్తగా
విచ్చిన రేకులతో గంధంతో రావాలి కవిత

నీలి మబ్బు ఆగమనం వానకాలంలో సహజం
ఇది గగన నయన మయిన రవి దృష్టికి
చలువ జోడు అవుతుంది! సానుకూలంలో
జనహిత భావనలో ప్రయోజనాలెన్నో!

మనసులో ఆలోచన! ఆకాశం వలెనే కాక
మట్టి భూమిగాను! పరచుకొంటుంది
పచ్చని పరిసర దృశ్యం! సృజన ముఖంతో
భాగ్యవంతమయిన దశకు కారణమవుతుంది

మెలకువలో వాస్తవాన్ని వహిస్తుంది జీవితం
జ్వాల లెగయ చేయడం సులభం, వీటి నార్పి వేయడం కష్టం.

వృత్తాకారంలో పరిసరాలు పోనుపోను విస్తృతమయ్యేను
గుండ్రంగా దిశలు చుట్టి రావాలని కోరిక ఒకరిలో
ముక్కు సూటిగా సాగి, గమ్యం చేరాలని కోరిక ఒకరిలో
ములుపు సరళరేఖలతో జీవితమొక అనుభవ నిలయం

ఏదో చెప్పాలని గాలి ఉత్సాహంతో వస్తుంది
పనిలో ఉన్న మనిషిని స్పృశించి పోతుంది
ఎంతో విప్పాలనుకున్నది; మౌనం మడతలో ఒదిగి ఉంది
పక్కనున్న వెలుగుకో చీకటికో ఒప్పజెప్పిపోతుంది.

పై తరగతి కెళ్ళిన విద్యార్థి అరచేతులు
కొత్త పుస్తకాన్ని స్పృశించినంత పరవశంగా
కొత్త కావ్యం కళ్ళు మూస్తే హృదయ బంధం
కళ్ళు తెరిస్తే ఎదురుగ వాస్తవ జీవితం

వచ్చిన సమయం పూల గుత్తి కాకపోవచ్చు
ఏలాగో వచ్చింది! జ్వాలామయం కాకూడదనే

ఉల్లాసం కోసమయినా ప్రయోజనం కోసమయినా
భావరాగ సౌందర్యంతో ఎంత ఆకర్షించినా
పరిసరాలలో ఎగసిన ధూళి కణం!
సోకని మనిషి ముఖం కనిపించేనా?

5. ఆశామేఘం

జీవనదిపై నమ్మకంతో దరికి చేరితే నివాసమై
ఎపుడో వరదలతో ఎగసి తరిమి వేసే భయం!
చలికి ముడుచుకొన్న క్షణాలు రవి రశ్మిని కోరితే
తాపంతో దీప్తమై గ్రీష్మం గుండెను మండిస్తుంది.

వంటకో వెలుతురుకో అగ్గిపుల్లపై కోరిక
అనలంతో దహనక్రీడ మొదలు కావచ్చు
మనిషికి మనిషి తోడుగ దగ్గరికి చేరితే
నీడతో కప్పబడీ! రూపం మాయం కావచ్చు.

ఈ మెట్టు దాటితే చాలు! ఆరోహణలో అనుకుంటే
పై మెట్టుపై చూపే కాదు! శిఖరంపై ఆశ ప్రబలుతుంది

వ్యక్తిని పరిసరాలు మితం చేయ చూచేను
పరిసరాలను వ్యక్తి తన వశం పొంద తలచేను

నమ్మకం సడలి అనుకూలంగా లేని సందర్భంలో
ఫలితం చెదరి! అంతా తారుమారు కావచ్చు.

రేఖ మారనంతవరకు ఎదురుగా ఆదర్శం
నమ్మకం పెరుగుతుంది మదిలో పూలతోటలా
ఒంటరితనంలో మనసు మల్లెపూలు పూస్తుంది
దీని పరిమళం ఏ ఒకరికి మితం అవదు

ఎవరి అస్మితలో వారు జలధిలో పడవలా
లోన శాంతి మంత్రం! వినబడుతుంది అంతరంగంలో
బయట లోక తంత్రం కనబడుతుంది పయనంలో
ఒడ్డుకు చేరే ఆశ లేక, హద్దు దాటితే అపాయం

ఒంటరిగా వ్యక్తి తాను చేయలేని వేవో తెలుసు!
ఆ తెలిసిన పునాది పైనే సమాజ భవనం
ఇది ఎందరికో తనలో ఆశ్రయ మిస్తుంది
వ్యక్తి శక్తి సమాజ పరమై ఎన్నిటనో జయం!

అద్దంలో చూస్తే తన ముఖంతో పాటు అనుకోకుండా
మనసులోని ఆలోచనా చిత్రం! బయట పడవచ్చు
వ్యక్తి శక్తి కేంద్రంగా జీవన దృశ్యం కనిపించవచ్చు
తనలో చెదరని నమ్మకం! ఆశామేఘమై వేలాడవచ్చు.

6. అపూర్వం

ప్రతి నేత కిపుడు సమస్య పదవి!
ఏది? ఎప్పుడు? ఎట్లా? అనే, తొందర!
ఈ జనత కిపుడు సమస్య! బ్రతుకు!
ఎవరికేది? ఎట్లా అనే! ఎపుడూ!

కింద ఉన్న బిక్షువుకూ పైన ఉన్న ధనికునికీ
బలంలేని హతునికీ బలం ఉన్న హంతకునికీ
కాలం ఒకటే! ఏ భేదం లేదు
ఉండేది! జీవన గతిలో మతిలో.

కాలం అందరిపట్ల సమం
ఉండే స్థితులు వేరు, పార్శ్వాలు వేరు
నడచే మార్గం పోయే దిశలు వేరు
కనిపించే జీవన దృశ్యాలు వేరు.

చూపు ఉండీ కొన్ని కనిపించవు
చెవులు ఉండీ కొన్ని వినిపించవు
ఎవరి పనిలో వారు పట్టనట్లుగా
'నేను' చుట్టు తిరిగే జీవన వేగంలో

ముఖ్యమయినవి, అవసరాలు వెనకబడీ
శిష్టమయినవి, ముందు వరసలో నిలిచీ

ఒకరి బ్రతుకు పేదరికంలో
ఒకరి మనసు శూన్యపదంలో

ఎన్ని తరాలు గడచినా రాజ్యాలు వేరయినా
పరిసరాల ప్రభావాలకు మూలాలొకటే

ఎవరూ తమ తల పైనో భుజానో
మూటను వహించి వెళ్ళలేరని తెలిసిందే
తరాల భవితకు వదలేవీ ఉన్నాయి
సంపద సంస్కారంతో చేసిన పని రూపాలు

అణువుకూ అతీతానికీ మధ్య మనిషి
రెండింటినీ స్పృశించే చివరల అంచులతో
భౌతిక మానస స్థాయిలో అమూల్యం!
మానవ మొక సుందరమైన అపూర్వం!

7. రంగుల చిత్రం

మనిషి ఒక వెలుగు రూపం ప్రాణంతో వెలిగేను
వెలుగులో పయనం! అక్కడక్కడ నలుపు చుక్కలతో
ఇవి రేఖలు కావచ్చు చిత్రాకృతి పొందవచ్చు
ఏమయినా మనిషి వెలుగు యంత్రం కిందే లెక్క.

లోన వెలుగు లేంది, మనసు లేదు
వెలుగు బయట లేందీ, బ్రతుకు లేదు
అపుడపుడు చీకటి ముక్కలు కొన్ని
నగలుగా ధరించ వలసి వస్తుంది

డబ్బు భూమి విద్య వివేకం వృత్తి పదవి
అవసరాల కొద్ది పరిచయమె! అనుబంధమె!
అన్నీ కలిసిన సంపుటియే ఈ సమాజం!
'అందరూ ఒకటే' సమాన సూత్రానికి ముత్యాల్లా.

దేనికేది అవరోధం కాదు, దేని తీరు దానిది
పరస్పర సహకారంతో సుగమంగా బ్రతుకులు

వెలుగునుండి చీకటికి మనసు సిద్ధమవుతుంది
పలు మలుపులు తిరుగుతుంది స్వార్థంలో
వెలుగు! చీకటి! ప్రకృతి భావరూపాలు
మానవ జీవన గతిలో ఎన్నిటికో ప్రతీకలు.

మనసు జడం కాదు చేతన రూపం
అనుక్షణం మార్పు! దాని స్వభావం
ఎవరయినా మంచికీ చెడుకూ దూరమనుకునే
'నిజం', అంతలో మనసుకు దగ్గరయిపోతుంది.

నిన్నది వదలడానికి సగం రోజు పడుతుంది
నేటిది చేరడానికి సగం రోజు పడుతుంది

శిశిరం తలపై పూచిన పూవును చూడాలని!
రాత్రి చంద్రుని చూస్తే కోరిక తీరేనా?

గ్రీష్మం హృదయంలో హిమ సరసిని చూడాలని
అద్దంలో తన వదనంలో కోరిక తీరేనా?

చేతిలో కదలే బ్రష్ వేసే రంగుల చిత్రంలో
దేవతల్ని చూపవచ్చు! రాక్షసుల్ని నిలపవచ్చు! మనిషిని తప్ప!

8. రూపాంతరం

అద్దం ముందు నిలుచుంటే మనసు నుండి
సమయ సమయ మొక గుణం బయట పడుతుంది
అప్పటి వరకు ఉన్న దోషం వెనక్కి వెళుతుంది
తనకు పైకి తెలియకుండా బింబంలో మార్పు!

అద్దం ముందు నుండి తొలగగానే బయట
మనిషి! సూటిగా చూపే వేలుతో ఎదురుగా
అది సూచన కావచ్చు! హెచ్చరిక కావచ్చు
ఏదయినా అందరికీ జాగ్రత కోసమే అనుకోవాలి

వీథిలో నినాదం సమ న్యాయం కయి నిరసనతో
ప్రజ కోసం సమాజ హిత హృదయంతో
కేవలం ఆయుధబలంతో ఉద్యమ ఫలితం సిద్ధించదు
రాజనీతి తంత్రం కూడా ఉన్న స్థితి కవసరం

చీకటిలో దీపంలా వెలగాలనే మనసుకు
గీసిన అగ్గిపుల్ల వెలుగు తృప్తి నీయదు
రాళ్ళపయి నిర్ఝరిలా కదలాలనే బ్రతుకులు
చిన్న చెలమలా ఉండిపోవాలని ఉండదు!

గుండెలో దీపమై వెలగాలని ఉంటుంది
బుద్ధిలో కాష్ఠమై మండాలని ఉండదు

ప్రతి మాట కుసుమ పరిమళలతో వెడలదు
ప్రతి చర్య విజయ పథంలో నడిపించదు

ప్రతి వ్యక్తి వేగంలో కోరేది ప్రమాదం కాదు, ప్రమోదం
ప్రేమ కరుణ వీరంతో బ్రతుకులు పూర్ణత పొందేను

చైతన్యం గల మనసును నిరాశ పాలించలేదు
స్తబ్దత ఏర్పడినపుడే చోటు చేసుకుంటుంది

ఏవో కారణాలతో కలిసి మనుషులు విడిపోతూ
మబ్బుల్లా పూవుల్లా అలల్లా దూరమవడం సహజం.

బ్రతుకులో అనుభవం గాయ పరచవచ్చు అలంకరించవచ్చు
స్మృతిలో మిగిలింది కవితలో రూపాంతరం చెందుతుంది
నీళ్ళలో మందుతూ తేలుతుంది
మంటలో మునుగుతూ కదలుతూంది.

9. వెనకనే ఉంటుంది

బ్రతుకులో రణం ఎవరితో?
మనిషితో నేపథ్యంలోని ప్రకృతితో

ప్రపంచమంతా మౌలిక సూత్రాలొకటే
మానస రీతులు వేరు పరిసర ప్రభావాలతో
అనుభవ విధాలు వేరు సమాజ సంబంధాలతో
మనుషులలో ప్రాథమిక స్పందన ప్రేరణ లొకటే
ఒక స్థితిలో మనిషికన్న గొప్పది లేదనిపిస్తుంది
మతిలో అణు విస్ఫోటం శక్తిని గుర్తుకు తెస్తుంది

ఒక స్థితిలో మనిషి కన్న అల్పిష్ఠం లేదనిపిస్తుంది
భయంలో బాధలో ఓటమిలో చీకటిలో క్రుంగిపోయి.

మంటలా ఎగసి నేలపయి నడవాలని ఒకరు
తన గెలుపు బలంతో దహన దృశ్యం ప్రదర్శిస్తూ
మానవ చరిత్రలో ఎక్కువగా జరిగింది ఇదే
విజయం వెనకనే! బూది పొరలు తెరలుగా!

రాత్రి ఎంత చిక్కని చీకటి అయినా
ఇంటిముందు ఎప్పటికీ తిష్ఠ వేయలేదు
మంచు ఎంత బిగిసిపోయి శిల అయినా
ఉదయ కిరణ స్పర్శతో సరించవలసిందే

వస్తూ పోయే చీకటి అడుగుల శబ్దం
మనిషికన్న చుక్కలకు బాగా వినిపిస్తుంది

మనిషి మనసు! జ్వాలారుణ బింబాల కన్నా
ఉదయం వెలుగు పూల గుత్తులనే కోరుతుంది

పిడికిలిలో పుష్పాన్ని బంధించే నియంత లెవరు?
రెండు వేళ్ళ మధ్య సుతారంగా వహిస్తేనే మానవం

పిడికిలిలో కరవాలం నిలుస్తుంది వీరంలో
ప్రమాదకర స్థితిలోనే అవకాశం లభిస్తుంది

నేత అడుగు ముందుగ పడవలసి ఉంటుంది
అవసరమయితే పరుగిడవలసి ఉంటుంది

సంఘంలో బ్రతుకులన్ని ఒకటయి మానవమై
వెనకనే ఉంటుంది, ధైర్యమిస్తూ నవ ప్రపంచం!

10. ఆర్ద్రమేఘం తప్ప

భూమిపై మట్టిలో అణువణువున సృజన కణం
దీనికి రూపం! అవసరమైన శక్తుల తోనే సాధ్యం
గాలి నీరుతో ఇంకేవో! వెలుగుతో చెప్పనవసరం లేనివి
ఏవేవో! ఎవరికి తోచింది వారు చేర్చవచ్చు

ఇదొక పెద్ద గ్రంథ మవుతుంది
మతి మంతులు వేసే ప్రశ్నలకు సమాధానంగా

సంఘంలో వ్యక్తిలోను కణకణాన నిర్మాణ గుణం
తప్పని విలయం స్థానంలో నిర్మితి పొడసూపుతుంది

తన తృప్తికయి సుఖంకయి కీర్తికయి మనిషి
బాధలు పంచుతూ వెళ్ళేను, ఆశలు వదలుతూ పోయేను
చిత్రమేమంటే అవి అలవోకగా
ప్రజలలో జీరాడతాయి, దిశలకు వేలాడతాయి.

మండే అహంకార జ్వాలకు శమనంగా
తన యశసుకు రంగులతో ఆభరణాలతో
ప్రజలనుఎప్పటికీ మనిషి ఆకర్షణలో ఉంచేను

ఎండి రాలే ఆకులవలె కదలిపోయే తరగల వలె
క్షణాలు మనసును సమాధాన పరచ చూస్తాయి
మనిషి పయనమయితే ఆగదు ఆగే వీలు లేదు

ఊరు నుండి ఊరుకు దారి తప్పనిదయినట్లే
మనిషి నుండి మనిషికి అనుభవ రుచి చేరుతుంది

దారికి పాతలేదు, ఎప్పటికీ ఉపయోగంలో
ఎప్పటికప్పుడు కొత్త మనుషుల కవకాశంతో

తన నీడను చూచి భయపడే స్థితులు లేవు
విజ్ఞానం వివేచనం హేతుదృష్టితో సమాజ నిర్మాణం!

తాను ఒంటరిగా ఉన్నపుడు లేని భయం
మరో మనిషి చేరినపుడు కలగడం దౌర్భాగ్యం

విరిసిన పూల పరిసరాలతో ఎదురు కావలసిన ఉదయం
ఎత్తిన కత్తి మొనపై సాయం సంధ్య మెరవడం అమానుషం

మానుష బంధం కూర్చే రవి బింబాన్ని ఎవరు అడ్డగలరు?
తత్కాలంలో ఆర్ద్ర హృదయంతో వచ్చే ఒక మేఘం తప్ప!

11. వర్తమాన రూపం

నియంతలకు చరిత్ర పుటలలో పెద్ద పీట
పీడితుల్ని గురించి ఆలోచన! శూన్యమైన ఆకాశం

సాధారణ పౌరుల చుట్టూ జీవితాలలో
రేఖ దాటకుండా లైవ్ విద్యుత్ తంత్రీ వలయం

దేని కోసమైనా కానీ సామాన్యుల నిరీక్షణం
తప్పక పొందేనని ఆశతో గట్టి నమ్మకం
రెండింటి మధ్య గుండె శబ్దిస్తుంది
కదలిపోయే ఊహల్ని అనువదిస్తుంది

మబ్బు రాక అయినా రైలు రాక అయినా
మనిషి రాక అయినా పనిని బట్టి ఆలోచన

ఎండలకు నేల బీటలు వారుతుంది
వాన చినుకులతో ఒకటవుతుంది
లోని సంతోషం! బయటికి ప్రకాశరూపంలో
చీకటి గుహలోకి దిగులు దూరుతుంది

ఒక వాహనం మరొక వాహనాన్ని ఢీకొని
అదుపు తప్పి దారినపోయే మనిషిపైన పడుతుంది
దుర్ఘటనలో రోడ్డుపై విషాద దృశ్యం
ఏ దోషం ఎరగని వ్యక్తి విషాద పాత్ర వహించేను

దీనికి సమాధానం ఎక్కడుంది? అంటే
వస్తువును తగిలించే 'చిలకకొయ్య'లా విధి మాటలో

బ్రతికినంత వరకు వర్తమానమే వరణీయం
కనిపించని ఆశారూపం! వేచి ఉన్న భవిష్యత్తు

ఉదారహృదయంతో కౌగిలించుకునే ఉదయ కిరణం
వర్తమాన విషమ స్థితులలోను ధైర్యంతో నడిపిస్తుంది
లేంది! రాత్రివేళ ఖడ్గం వలె చీకటి
ఎదురు పడింది, బ్రతుకును బండగ మార్చేదే!

చీకటిలో ముందు ఉన్న మెట్టు తనకు కనిపించదు
పయనంలో వెనక ఉన్న మెట్టు తనకు పనికిరాదు
వర్తమాన మొకటే అవశ్య రమణీయ రూపం
రేపుపై ఆశనిలుపుతుంది, భవితకు నమ్మకమిస్తుంది.

12. వీథి నుండి

ఇంగిత దశనుండీ లెక్క పెడితే
ఎవరి కయిన మతిలో కోర్కెల రాసులెన్నో?
పైన చుక్కలెన్నో! అన్ని! ఒకటొకటీ
లెక్కకు అందనివి! చుట్టు ఇంకా మెరుస్తూ

సృజన దర్శనంలో విధ్వంసం తలపుకు రాదు
శిథిలాలను పరికిస్తూనే, నవ నిర్మాణం జరుగుతుంది
ప్రజల నుండి ప్రశ్నలకు జవాబులతో
అంతరంగ ప్రేరణతో కవిత అవతరిస్తుంది

పాఠక శ్రోతలు సహృదయులకు స్వాగతం
ఎవరికి ఇష్టమైన విధంగానో కథ మలుపులు తిరగదు
కృత్రిమ పాత్రల హడావిడికి అవకాశం లేదు
వర్తమాన మానవీయ వాస్తవానికే ప్రాధాన్యం

నీరు పారుతూ అలలతో ప్రియమైన ప్రవాహం
అంతలో వరదలతో బీభత్సం వదలుతుంది
చీకటి భయాన్ని మూలకు తోసివేసే దీపం
గుడిసె అంటుకొనీ భగ్గున విపదలో పడేస్తుంది

కవిత తాను మేల్కొని ఉండడమే కాదు
ప్రజల మనసును మేల్కొన జేస్తుంది! ఆ క్షణంలో

ఇది జరగకపోయి ఉంటే? అన్న ప్రశ్న
సానుభూతి వాక్యం సహజం హేతుదృష్టికి భిన్నం

శిల్పం పలకదు చూచే మనిషిని పలకరింప జేస్తుంది
ప్రవంతి నిలవదు నిలిచిన వారిని నడచిపో చేస్తుంది

ప్రతి వస్తువు మనిషిలో చేతన కవకాశంతో
'ఇది జీవిత'మన్న మాటకు విస్తృతి కలిగించేను

స్మృతిలో నిలిచిన అనుభవ సముద్రం కవిలో
వేదనతో తప్తమయి! కవితను వదలుతుంది

వెలుతురులో చీకటిలో సమంగా అందమైన జలరూపం
మార్పులో మేఘమై తరంనుండి తరంలా తరలుతుంది

దేని విశేషం దానిది అన్న మాటలో వాస్తవం
జీవితాన్ని వీథి నుండి విశ్వమయం చేస్తుంది

13. వేచి ఉండవలసిందే

జీవన గీతం చెప్పడం కష్టంగా ఉంది
మరణ గీతం పలకడం సులభంగా ఉంది
చెట్టునుండి పూవును అనుకోకుండానే
కనబడని గాలిలా ఘటన దూరం చేస్తుంది!

ఇట్లా వచ్చి అట్లా బంధం తెంచి
శూన్యం చేసి విషాద ముద్ర వేసి పోతుంది
దీనికన్న మానవ జీవన రూపానికి బాధ్యతలెన్నో!
చేసింది ఎంత అయినా, చేయాలిసంది ఎంతో!
వ్యక్తి నుండి సమాజానికి కార్యకలాపాల ప్రసారంతో
వచ్చే తరాల కందించే అనుభవ గుణ సంపదతో

అడుగు వెనక్కి వేయ వలసి రావచ్చు
కొంతసేపు ఆగవచ్చు, వెళ్ళే దిశ మారవచ్చు
పొందే అనుభవంతో మారే ఆలోచనతో
ఏదయినా ఏమయినా కర్తవ్యంలోనే జీవనం!

మరణానిదేముంది? పిడుగులా పడుతుంది
మెరపులా మాయ మవుతుంది, నీలిరంగులో

నిశిఫాలం పయి సన్నని వెలుగు గీత
రవి నుదురు పయి నల్లని మబ్బు ముక్క
చూపుకు రెండూ వాస్తవ శకలాలు
అనుభవ పార్శ్వాలలో మంచి చెడు సంకేతాలు

ముందు పరిచయం ఆపై స్నేహం బంధుత వలయాలు దాటుతూ
భేదంతో వైరం ఆపై కలహంలో జీవన రూపం సంక్లిష్టత పొందేను

సరిచేసిన తీగెలపై హృదయ రాగం వినిపిస్తుంది
లయ కుదిరిన వేగంలో ఆయువు చక్రం తిరుగుతుంది
కల్పనలకు చోటులేని వర్తమాన వాస్తవంలో
దూరంలో మరణం, వేచి ఉండవలసిందే!

14. పతనానికీ అంతే

ఎగిరే గాలి పటం ఎంత పైకి వెళ్లినా
నేలపై ఎవరో ఒకరి చేతిలో మాంజా ఉంటుంది
అది ఆడితేనే ఉల్లాసంగా దృశ్యం అలరిస్తుంది
వాలుతూ లేస్తూ గుండ్రంగా తిరుగుతూ సూటిగా పోతూ

ఇది జీవన వాస్తవ రేఖలకు దూరం కాదు
ప్రయోజనమొ ఆనందమొ రాజకీయమొ వ్యవహారమొ
చేతిలో దారాన్ని కదిలించే నిపుణత ముఖ్యం
కులం మతం భాష ప్రాంతంతో పని లేదు.

పక్షుల కే భేదం లేదు, వాటి కే సమస్య లేదు
ఎవరి నిలయమయిన, ఏ చెట్టయిన ఒకటే
వాలతాయి గూడు కట్టుకుంటాయి విశ్రమిస్తాయి
మనిషి దగ్గరికి వచ్చేసరికి ఎన్ని విభేదాలో! అంతరాలో.

గగనంలో సూర్యుడు! భూమిపై మహానది
రోజూ వెళ్ళే దారులవే! పరిచయ మున్నవీ
మనిషికి ఉండే స్వేచ్ఛ వాటికి ఉంటే కల్లోలమే!
వ్యక్తి జీవితంలో దారులెన్నో! ఎవరిదారి వారిది

ఎగిరే గాలి పటానికి గగనమంతా తిరగాలని
ఇక భూమివైపు తిరిగి చూచే అవసరం లేకుండా
ఆపై నివాస మేర్పరచుకునే ఆలోచన! సహజం!
అసలు రహస్యం! హేతువు తెలియకనే కల్పనలు

తనను పైకి ఎగయజేసే రెండు చేతు లిపుడు ఆగిపోతే!
సార్థమవుతుందనుకున్న బ్రతుకు సమాప్తియే!
ఏ చెట్టు కొమ్మకో చిక్కుకొనీ ఛిన్నమయ్యేను
ఏ తీగె కో ఎత్తులో తగులుకొనీ శీర్ణమయ్యేను

గాలిపటం! మనిషి జీవితం
దారాన్ని ఒడుపుగ లాగుతూ వదలుతూ
విహరింప చేసే చేతులు! మనిషివే
మెట్టు తరువాత మెట్టు అవసరం దాటి
ఆరోహణలో ఆశారూపం! జీవితంలో
ప్లవనానికెంత వీలో! పతనానికీ అంతే!

15. లిప్స

కుసుమం విప్పారి తాను సుగంధ సుందరమయమై
పరిసరాలలో ఇతరులనూ హ్లాద పరుస్తుంది
అది మరో రోజుకు వాడి పోయి రాలవచ్చు
మట్టిలో కలిసి జీవిత వాస్తవాన్ని తలపిస్తుంది.

ఎవరయినా పూవుపై వీడరాని ప్రేమతో
తన వశం చేసుకొనే ఆలోచన సహజం!
మరొకరి చూపు పడకుండా
పెట్టెలో భద్రంగా ఉంచేరా?

ఎవరి వశమయి పోయేననో
దీని నెంత కాలం దాచగలరు?
మనసులో తత్త్వ ప్రపంచం దిగుతుంది
వాస్తవాన్ని అనుసరించి హేతువుతో జీవితం.

చెడును ఖండించే ఉత్సాహంతో
ఒకవైపున చేతిలో వైరంలో ఎత్తిన కత్తి!
మంచిని స్వాగతించే సద్భావనతో
మరోవైపున చేతిలో స్నేహంలో పూల గుత్తి!

ఉపాయం ప్రయోజనం తెలియని మనిషికి
రెండు చేతులు బొమ్మలు గానే పనికొస్తాయి
వీటితో చరిత్రను పాలించాలని ఆశ! లోపల
తన ప్రశ్నకు తానే జవాబుగ మారగ చూచేను

పొగల మధ్య కంటికి కనిపించని నిప్పులా
మనిషిలో శత్రుత ఈర్ష్యాద్వేష కోపమయంగా
మనిషి నుండి ఏదీ తొలగదు, లోలోన అణగీ
ఏ రుతువు కాలచక్రం నుండి తొలగదు, మార్పుకు వశమై

యశసులో తన ఉనికి బింబించే ఆలోచనతో
ప్రదర్శన శాలలో ప్రవేశానికి యత్నం జరుగుతుంది

కవిలో నేతలో కాలపటంపై వెలుగు అక్షరాలలో
తాము చిరంగా నిలవాలనే అందరికన్నా మహాలిప్స.

16. మనిషి గురించి

చూడాలనుకోక పోయినా ఎవరికయినా
చూడదగినవి తోపాటు! ఎదురుగా
చూడరాని దృశ్యా లెన్నో! స్వేచ్ఛలో
వికార వేషాలకు వేదికపై ప్రవేశం!

అధునిక సాంకేతిక సాధనాలు వైవిధ్యంలో
పత్రికలు టెలివిజన్‌లతో పాటు! బహు సాధనాలు
జీవన గతిలో అనుభవ సుందరతలు మరచి
వికారాలు పరుగుల పోటీలో విజేతల వలె నిలవాలని

'ఏది అశ్లీలం! ఏది జుగుప్స! బీభత్సం ఎంతవరకు
అన్నిటికీ హక్కులలో భాగస్వామ్యం! తల ఎత్తుతుంది
ప్రశ్నకు జవాబు బదులు విషయం మార్చే యత్నం
పరిష్కృతిలో సమస్య బూజు పట్టి పక్క దారి పట్టేను

కలలో బంగారం అక్కరలేదు కానీ
స్పృహలో ఆహారం దొరికితే చాలనిపిస్తుంది
స్పృహ తప్పి పడిపోతే వీధిలో పాలకుల కవమానం
విభేదాలు కొత్త కాదు, చంపడం అలవాటుగ మారే స్థితిలో

పట్టుకునేందుకు రాత్రి వేసే టార్చ్‌లైట్
దొంగ పారి పోయేందుకు దారి చూపుతూంది.

స్వర్ణమయినా! బూది అయినా సింహాసనం ముఖ్యమై
భేదమేమీ ఉండదు, కొందరికి శాసనపర్వంలో
కావలసిన అదికారం, ఏలే అవకాశం చాలు
ఇందులో మర్మమేమీ లేదు! ఇది కఠోర వాస్తవం.

ప్రజాస్వామ్య రూపానికి ఆదర్శరేఖలు తీర్చే బదులు
బూది పొరలతో నిప్పురవ్వల భంగిమలు చూపేరా?

సమస్య నుండి నిష్కృతి అంతర్వీక్షణంతో కాదు నివేదనంతో కాదు
వ్యక్తులలో బలమైన నైతిక వికాస స్ఫూర్తితో! తప్పదు

చూడరాని వికారపు ఆటలన్ని కట్టేసి
చూడ వలసి ఉన్నవి వేదికపై వచ్చేనా?

ఇది సులభం కాదు, కాని అసాధ్యం మాత్రం కాదు
సమాజ చింతనలో మనిషి గురించి మానస చర్య అవసరం.

17. కవిత చిరంజీవి

కవిత చిరం జీవి
చిరం జీవియే కవిత!
సమాజ హృదయ బంధువు

మతి శిఖరం నుండి ఎదరో జారుతుంది
పాయలుగా కవి జీవితంలో సరిస్తుంది
అక్షర రూపంలో ఆర్ద్రాకృతి పొందుతుంది

యుగాలు గడవనీ తరాలు తరలనీ,
మానవ చేతన ప్రతినిధి
సమాజ గమ్యం సూచిక

వివిధ వస్తు చయంతో వసుధను తలపిస్తుంది
శబ్ద సార లహరితో నింగిని తలపిస్తుంది
స్పందన మూలంతో అనుభవ భవనం అందరిదీ

బయటికి వచ్చాక కవిత సమాజానిది
మాటలలో భాష! మంచి డ్రెస్ వంటిది
భావనలో విశ్వం జనహిత మవుతుంది

పల్లె పట్టణం నగర విభేదాలు లేవు
ప్రకృతి జీవితం సమాజం మూడూ కలిసే
మానవ గుణ బంధంతో ప్రేరణం

చీకటిలో అందిస్తుంది వెలుతురు పుష్పం
మంటలలో చూపిస్తుంది సంధ్యా గులాబీ
కవి మనో భూమికలో కవితా రూపం

ఇది నవ్యతను పొందుతుంది
వర్తమాన వివేచనతో కాలంపై
దార్శనికతను నిలుపుతుంది ఆదర్శం!

రాత్రి మధ్యలో ఆగిన కలలో దృశ్యం
పగలు కవితలో చోటు చేసుకుంటుంది
మనసులో పడింది ప్రతిది! రికార్డు అవుతుంది

కవి మనో బింబం! భావ దర్పణంలో ప్రత్యేకం
దీన్ని బట్టి కవిత వేరవుతుంది, ఒకరొకరిలో
అస్మిత వ్యక్తికి మితం, అస్తిత సమాజమయం.

18. చేతన బంధం

కవిత మనసుకు ఆత్మదీపం అరనిదీ
లక్ష్యంలో దార్శనికం చేయిని అందిస్తుంది
ఎవరినయిన వెలుతురు గుండెకు హత్తుకుంటుంది

గతమయితే స్మృతి శిఖరాలపయి అడుగులు వేయిస్తుంది
వర్తమాన స్థితులొకటొకటీ గ్రీన్ కార్పెట్ పరుస్తాయి
భవిష్యత్తు మాత్రం విత్తుకు ఆశా ముఖ వికాసమిస్తుంది

సైన్యంలో జారే బాష్ప కణం అక్షరంలో ఒదుగుతుంది
ఇది దహించదు, వేదనలో అనల గుణం పైకి తీస్తుంది
అనుభవ లహరులపై గుండెను పడవను చేస్తుంది

మోదంలో మల్లెపూవు, వేదనలో మోదుగ పూవు
సమయం సందర్భంలో ఇరువైపుల వహిస్తుంది
కవితకు అలసట లేదు, విరామ వేళలు లేవు.

వాలు వెంట నది జలధి దాక సరిస్తుంది
ఎత్తులోన గిరి నింగివైపు ఎదగాలని
కవితకు మాత్రం నేల నింగి ఇరు దారులు!

మేఘం రాకకు ఆనందపడుతుంది కవిత
నవతను భవితను కోరే ప్రజ ననుసరించి
ప్రకృతిలో ప్రతి కదలికను సంవదిస్తుంది

తుపాను రాకకు విచలితమవుతుంది కవిత
సుస్థితి భాగ్యం శ్రేయం కోరే ప్రజననుసరించి
సమాజగతిలో ప్రభావ విషమతలు విరుతిస్తుంది

కవితకు శశి రాకకు చుక్కలు కనిపించేందుకు
వేళలు ఉన్నాయి ఎవరు చూచినా చూడకపోయినా
సృజన చేతన మేల్కొల్పుతుంది! సమాయత్త పరుస్తుంది

నిదురలో తప్ప! ఏ కాస్త మెలకువలోనూ
మనో నయన మెప్పటికీ తెరచీ, కవితలో
కనిపించని దానిపై ఆలోచన అన్వేషణ వివేచన!

మెలకువకూ కవితకూ చేతన సంబంధం
అక్షర పంక్తిని నిలుపుతుంది సజీవంగా
ప్రాణం కన్న మిన్నగ అనుభవాన్ని దయచేస్తుంది.

19. శాంతిపుష్పం

కవిత ఖడ్గజీవి! భద్రతలో రక్షణలో పాత్రలో
అక్షర రూపంలో! నాటకానికి మంచి ముగింపు నిస్తుంది
నిజాన్ని కాపాడే పనిలో జారకుండ ఆశను నిలుపుతుంది

పగలంతా వెలిగిన రవి అస్తమయం అనివార్యమై
రేపు పైన ఆశతో, మరో ఉదయానికి సిద్ధమయ్యేను
మారక తప్పని స్థితికి సమాధానపడడమే చేయగలిగిందీ

దాటవలసిన భావజలంతో కవిత ఎప్పటికీ
ఇదో ప్రపంచం! జలధి వలె జీవిత వాస్తవం
పిడికిలిలో ఒదిగింది! విప్పగనే క్షితిజమవుతుంది

కదలుతుంది సముద్రం ముందుకు ఊగుతుంది, అంతే
కదలలేదు భూమి! దీని స్థిరతలోనే సమాజ క్షేమం
రెండింటి కతీతమైన కాలం! కవితకు ఖడ్గాన్ని ఇస్తుంది

మనసులోని కవిత శబ్దంలో ప్రకటితమవుతుంది
జలధారనుండి విద్యుత్తుతో వెలిగే బల్బులా
వివిధ దశలలో క్రమించే శక్తి ప్రసారంతో

ఇది చీకటిలో వెలుగు రేఖల చిత్రశాలకాదు
వెలుతురులో పలు రంగుల చిత్ర ప్రదర్శనం
మారే స్థితి గతులతో కవిత మూసపోత ఎరగదు

తెగిన తల ఎగిరి పడుతూ మాట్లాడుతుంది
మాటల్లో ప్రశ్నలు కత్తిమొనలయి తేలవచ్చు
హ్లాదంలో కన్న ఆర్తంలో కవిత స్వనిస్తుంది!

మరణ పదం వినిపించని చిరంజీవ రూపంతో
నిజంలోని నిగ్గును పైకి తేల్చి చూపుతుంది
మనో రహస్య నిలయం తలుపులు తెరుస్తుంది కవిత

పదును కత్తిలా కవితలో మౌనం ఎదురవుతుంది
ప్రేలే బాంబులా గుండెలో విలయం ధ్వనిస్తుంది
ఎంతకయిన తెగిస్తుంది! కవిత శాంతికై ఆయుధమై

కింది నుండి పైకి చేరే నిచ్చెన అవుతుంది
అచటి నుండి నీలి మబ్బు గొడుగు అవుతుంది
గ్రీష్మ కోపాన్ని తగ్గించే శాంతి పుష్పమవుతుంది కవిత!

20. అక్షర విజయం

కవిత! కాలవేది అందిన క్షణం అన్నిటినీ మరపిస్తుంది
ప్రభావ శీలంతో ఉన్న స్థితిని మారుస్తుంది
మరో జగంలోకి మనసును దింపుతుంది

కవి కిరణంలో అణువులు అక్షరాలుగ మారితే
ఇక సహృదయుల మదిలో చీకటి ఎక్కడిది?
కవితకు సుందర వ్యాఖ్యానాలుగ హంసలు ! చుట్టూ

తెలియని నిశి నిలయానికి వెలుగు తలుపు కవిత!
జన హృదయం చేరేందుకు అడవి నుండి రహదారి
నది ఇవతలి ఒడ్డునుండి అవతలి ఒడ్డుకు చేర్చే వంతెన

శిశిరంలో వసంత రేఖ స్పృహతో
గ్రీష్మంలో జలద భావ ఛాయతో
ఇబ్బంది అయిన స్థితుల్ని దాటిస్తుంది

ఆకు రాలి శుష్కమయిన చెట్టు వేరులో
పునరుజ్జీవన చేతన! కవితను తలపిస్తుంది
రోజొకమారయినా పక్షి! కొమ్మపై వాలిపోతుంది

జన బంధంతో సమాజ చలనంలో కవిత
జడతకు సృజన బీజమై కొత్త రూపమిస్తుంది
అది కాలంపై ఆ చోటునుండి విశ్వమయ మవుతుంది

మాట్లాడే మనిషి మనసులో ఏముందీ ముందుగ తెలియదు
రచయితకు తప్ప! లేంది రచన బయటకు రాదు
కవితలో నయితే ఎక్సరే ఫొటోల ఆల్బమవుతుంది

చెట్టును మెచ్చుకుంటే మనిషిని మరచినట్లు కాదు
అగ్నిని తలచుకుంటే మబ్బును త్రోసినట్లు కాదు
కవితలో వీటి సహయోగం ఒక రమణీయానుభవం

తిరిగే కాలచక్రంలో వచ్చిపోయే మార్పులు
ఏ ఒకరి కోరికపైన రావడం జరగదు
కవితలో నయితే అక్షరలోకంలో కవి ఇష్టంపై

ఆయుధాన్ని వహించే మనిషి ఆయుధమవడం
బాధను హ్లాదమయం చేసే విద్యను చూపడం
ఒక కవితలోనే సాధ్యం! అక్షర విజయంలో

21. కవిత ! మ్రోడులో

అక్షర దర్పణంలో కవిత! సమాజ భావరూపంలో
గత కాలం సందర్భాలకు సంగ్రహమైన డాక్యుమెంటరీ
అందమయిన ఆకర్షణతో శబ్ద కళాజగం

ఇది మాసేది కాదు చెదరేది కాదు చెరగేది కాదు
రాగం వైరం మోదం ఖేదంతో మనోరూపం
పొందే మానవ నైజం! బయటికి వస్తుంది

నిష్క్రమించిన స్థితి పునా రూపం పొందుతుంది
మౌన భావ పదంతో అసంభవాన్ని సంభవం చేస్తుంది
వర్తమాన వేదిపై అప్పటి దృశ్యం కనిపిస్తుంది

పోయిన కాలంలో మనుషులు గుర్తులు వెలసేను
ఆశల దారులలో చెదరిన మనుషులు కూడేరు
ఘటనలో మార్పులు! సృజనకు దారులు తీసెను

మనిషిలో దాగిన మరో మనిషి కనిపించని రూపం
మంచి చెడు మిశ్రమంతో పైకి తీయబడుతుంది
రంగుల దుస్తులు ధరింప జేయబడతాయి

ఒంటరి తనం పోయి చుట్టూ సమాజ మావరిస్తుంది
స్పందన గుణంతో విగ్రహ రూపం తొలగుతుంది
చీకటి తొలగి కవితలో మనసుకు అంతా వెలుగే!

క్రితం క్షణం వరకు కనిపించని వాస్తవ రూపాలు
తెరపైకి వస్తాయి పునరవలోకనానికి అవకాశంతో
సఫలత విఫలత మాటలతో సంబంధం లేదు

అసంభవం సంభవమయి చేతికందినట్లు ఉంటుంది
ఎదురుచూచే వాస్తవం ప్రత్యక్షమయినట్లు ఉంటుంది
గతంపై అభిలాషతో అభిమానం పెరుగుతుంది

మానుష సంస్కృతి పచ్చని చెట్టు నిలిచినట్లు ఉంటుంది
ఎపుడో మరచిన గాథను జ్ఞాపకంలో తిప్పుతుంది
రచనలో మానవ శక్తికి పట్టం గట్టినట్లు తోస్తుంది

చేతనలో మార్పుకు మనసునుసిద్ధం చేస్తుంది
దేని నయిన సహించే వహించే మనిషిని తీరుస్తుంది
మ్రోడులో వసంత స్పర్శను తలపిస్తుంది కవిత!

22. చినుకుల నాణేల మధ్య

కవిత! అంతరంగ ప్రకాశరూపం! స్వప్నఫలం కాదు
హృదయాలను ఆర్ద్ర పరుస్తూ పోయే వాస్తవ స్రవంతి
అభిలాషను తీరుస్తూ ముందుకు సాగుతుంది

పద పదానికి మధ్య కాస్త ఎడంలో పూవు
దూరదూరం పరిమళ లహరిని వదలుతుంది
మనిషి మనిషికీ అందిస్తుంది! భేదం లేకుండా

ప్రతి వాక్యానికి వాక్యానికి మధ్య నిశ్శబ్దం
ఆలోచన కవసరమౌ అవకాశంతో
స్పందనలో సూక్ష్మ భావ ప్రసారాలతో

సమయంతో పనిలేదు, స్థలానికి కట్టుపడదు
ఆత్మ భవం! కవిత! భిన్న మనో జగం
పగలు రాత్రి భేదం లేదు, కాలం ఒకటే.

నేరంలో నిజమేదో! శిక్షలో న్యాయమెంతో
కవితలో మెరసినంత మరోచోట లభించదు
రాగాన్ని ద్వేషాన్ని తూచే తరాజు ఒకటే!

కవిత జారి చూపుతుంది పోవలసిన మజిలీకి
ఏ దిశనుండో ఆర్త రవం మొనతో సూటిగా
ముల్లువలె! పయనంలో మలుపును తెస్తుంది

ఏ బ్రతుకు నుండో బాధలో వేదన ఎగసీ
నిజంలో నివురు కప్పిన నిప్పురవ్వ
గాలికి ఊదబడీ కవితలో మెరుస్తుంది

దారిలో తుపాను గాలికి ఊగే
చెట్టు బోదె నానుకొనీ భిక్షువు!
ఎదురుగా కురిసే చినుకుల నాణేల్ని లెక్కపెడుతూ

హఠాత్తుగ పైబడే వాతావరణ బీభత్సంలో
శ్రమ విలువల ప్రసక్తి కవకాశ మెక్కడుంది?
సమ న్యాయం జరిగేందుకు వీలు ఎక్కడుంది?

ఉన్న దానితో సరిపెట్టుకొనే మనోరూపం
వ్యక్తిలో నిజశక్తిని రుజువు చేయలేదు
విషాదం సమాజానికి వెలుగు చూపలేదు

23. విశ్వమయం మనం

ఊహలెన్ని వెలిగినా, పనులెన్ని విధాలయినా
చివరకు మిగిలేది విజయం తెలిసేది
ప్రాణ సమం తన యశోరూపం తోనే

ముఖం చూస్తే మనిషి మనసు తెలిసేనా?
నవ్వులో ఏడుపులో మాటలో పనిలో తెలుస్తుంది
తెలియంది ఉంటే పోయాక తేటతెల్ల మవుతుంది

సూర్యుడయిన అనలమయిన మేఘమయిన అనిలమయిన
అవి ఉండేది, ఎంతకాలమయిన ఒకే విధం!
మనిషి మాత్రం ఏ క్షణం ఏవిధమో తెలియదు

ఒకరికి కష్టాలలో చేదుగా ఒకరికి సుఖాలలో మధురంగా
ఒకరికి విజయాలతో మళ్ళీ మళ్ళీ జన్మ ఎత్తాలనీ
పుష్పంకన్నా బ్రతుకున విగ్రహమై నిలవాలని కొందరికి

ఈ భూమిని ఈ బ్రతుకును ఈ కవితను వదలి
పక్షిలా నింగిలో విహరించాలని కోరేరా?
చేపలా జలధిలో ప్రచరించాలని కోరేరా?

సంఘజీవి మనిషి! సమాజ శక్తికి ప్రతినిధి
స్పందనతో భావమయం ఉపజ్ఞతో క్రియాయుతం
మార్పుకు ఆహ్వానం పలికేను, సృజనకు స్వాగతమిచ్చేను

విద్య! విజ్ఞానం సంపద సంస్కృతి మనిషితో పోయేవి కావు
తరాలకు రేకులు విప్పారుతూ మానవీయ పద్మం
అంతర శక్తికి రక్తికి మూలంతో గుబాళించేను కవితలో

బ్రతికిన కాలంలో క్షణాలు ఒకటొకటీ అనుభవంలో
పూవో ముల్లో మంచుముక్కో నిప్పురవ్వో కావచ్చు
దేనినయిన స్వీకరిస్తూ అధిగమిస్తూ పోవడమే జరుగుతుంది

అలలవలె ఈహలు! వీటిని కాదనే వీలులేదు
పయనంలో పడవలాగ బ్రతుకు సాగవలసిందే!
జలాల మధ్యలో అలలను కాదని ఆగే వీలులేదు

బయట అయినా గుడిలోను ప్రతిమలో మార్పు ఉండదు
అలంకరణం మారవచ్చు మనిషి దృష్టి మారవచ్చు
'నేను'తో వేరయిన రూపం, 'మనం'తో విశ్వమయమవుతుంది.

24. జీవన గ్రంథంలో

తన ఇంటి ఆవరణ వలయం దాటితేనే
కవితకు వస్తువులో విపులత విశ్వమయమవుతుంది
మనుషుల పరిచయాలు విజయ తృప్తినిస్తాయి

జీవన దశలలో నాతో పెరిగే చెట్టు ఆత్మీయం
ఒంటరిగా ఏదయినా చెప్పేందుకు పనికొస్తుంది
బదులు పలకదు, నాకు కావలసిందీ చెప్పేది వినేవాళ్ళే

ఇంటిముందు పూలతో పచ్చని తీగె అల్లుకొనీ
కమాన్‌తో గేటు! బాధలో ఉపశమన ముఖంతో
ఆశయానికి ఆశ్రయమయి, ఆలోచనకు తలుపులు తెరచేను

వినిపించీ వినిపించని శబ్దం ప్రసరించినంత మేర
కవిత పయనిస్తుంది! హృదయాలను పలకరిస్తుంది
మట్టి అంటని ధూళి సోకని స్నేహవల్లరి! నిత్యనవం

గాలి నీరు వెలుతురు ఎప్పటికీ మారనివీ
పరిసరాలలో విశాల సమాజ దిశలను
కలుపుతుంది కవిత సూర్య కిరణ పంక్తులతో

కోపం ద్వేషం శత్రుత కలహం మనిషిలో
జీవితమంతా గగనంలో మబ్బు ముక్కలవలె క్షణాలు
మనసుకు తొడిగే దుస్తుల్లా ఉపకరించేను

ఏ వరం లభించినా అది తక్కువగనే ఉంటుంది
ఏ శిక్ష విధించినా అది ఎక్కువగనే తలపిస్తుంది
అర్హత కన్నా ఉదారత వైపు చూపులతో సమాజం

నెమలి చాతకం మేఘం క్రౌంచం భేకం గజం
శ్రుతి భేదాలతో సప్త స్వర సంకేతాలు
కళలలోను మానవేతరాల ప్రవేశం సహజం!

పరిసరాల ప్రభావాలతో వ్యక్తి అస్తిత్వం
బహిరంతర స్థాయిల్లో ఓటమి గెలుపులతో
గుణ రేఖల కలనంతో దేనికది ప్రత్యేకం

ఇంటి ఆవరణం నుండి మొదలయి అస్మిత
బయటి ప్రపంచానికి విస్తరించి అస్తిత
చీమ నుండి మనిషి దాక! జీవన గ్రంథంలో

25. వార్తా పత్రిక కప్పుకోనీ

శబ్దం నుండి నాదం జాలువారుతుంది స్వరధునిలో
నిశ్శబ్దంలో శబ్దశక్తి వినిపిస్తుంది! హృదయంలో
ఇది కవితలో సాధ్యం! భావనా మయమై
జగత్తులో ప్రతి వస్తువు కవివైపు చూస్తుంది

క్షణాలలో కవికి మిత్రమో బంధువో అవుతుంది
ఇవి అక్షర పరివారంలో భాగమయిపోతాయి

మనుషుల గుణ చేష్టల చేత సమాజ స్థితులూ
కాలం ఫలకంపై చిత్రాకృతి పొందుతాయి
ఆకలి సహజం! అనుభవంలో రుచిపై కోరిక సహజం

పూవు రాలుతుంది మరో పూవు వస్తుంది
ఈ మధ్య కాలం! శూన్యంలో తత్త్వ ప్రకాశం
ఎవరికి తోచిన కారణవాదం వారు వినిపించేరు

గోడలు తొలగితే ఏముంది? అంతా బట్టబయలు
అవసరాల్ని బట్టి గోడల నిలయంవలె జీవనరూపం
ఇంటి కప్పు ఊహకు హద్దులు సూచిస్తుంది

దాహం ఆకలి కోరిక వేదన పునాది స్తంభాలపై
జీవితం! పాత లేదు! ఏ రోజు కారోజు కొత్తగనే
ఉదయ ప్రకాశంతో శుభ్రంగా నవ్యంగా ఎదురవుతుంది

ఏవో రంగులలో వస్తువు ఏదో గుణంతో మనుషులు
ఏదో భావనతో కప్పబడీ! నగ్నత ఎరగదు మనస్సు
సూర్యునితో ఉదయంలా మనిషిపై నమ్మకం తప్పదు

కలలన్ని ఒకటి కావు! మనిషి మనిషికీ వేరు వేరు
మజిలీలు వేరు! అనుభవ సంపదలు వేరు
స్వార్థ గుణానికీ వికాస దశలకూ సంబంధం లేదు

నేరంలో పాపం! ఎటుపోతుంది! ఆ పక్కనే
రాశియై పర్వత శిఖరాన్ని తలపిస్తుంది
ఇదొక ముక్త రూపమనుకునే వారూ ఉన్నారు

నిన్న తగిలిన గాయాలపయి ఉదయం
వార్తాపత్రిక కప్పుకొనీ వస్తుంది, కాలం
ఇది మానసిక వికారాల భంగిమలను తలపించేను

26. ఎలర్జీతో

శబ్ద నిలయం కవిత నిశ్శబ్ద సుందరంగా
తనలో చేతనతో సహృదయ బింబాలను లాగుతుంది
ఎడారిలో గులాబి వలెనో, ఇంటిముందు మల్లె వలెనో

కవి దృష్టికి ఇల్లు అయినా బయట అయినా ఒకటే
ఏ పూవు దేనికి చిహ్నమొ! స్ఫురించడ మొక అనుభవం
అది కవి నుండి కవిత అవాలి వివరణమవకూడదు

మనసు ముందుగా వలయంలో స్థిరపడిన
పరిమితుల నుండి ముక్తం కావలసి ఉంది
స్వేచ్ఛలో అన్వేషణ కొత్తదారి పట్టిస్తుంది

వెలుతురు చీకటి వెన్నెల దేని చేతనో కప్పబడీ
కాలం! నిజరూపం మరుగున బడుతుంది
కంటికి కనబడనిది తెలిసేదొక మనసుకే!

ఎవరు తోడు ఉన్నా లేకపోయినా
నీడ మాత్రం! బాడిగార్డులా ఉంటుంది
నీలి రంగు వెనక తెలియని ఘటనలతో

మనిషి ననుసరిస్తుంది, ఏ అనుమానం లేకుండా
చల్లని నీడ! ఎంతో ఆప్తంగా, నిశ్శబ్దంగా
క్రాస్‌గనో నాగలిగనో సమయ సమయం

ఇది చీకటి సంగ్రహరూపం! వెన్నంటి ఉంటుంది
రాత్రి చీకటికి దూరం కావచ్చు, నీడ మాత్రం పక్కనే
ప్రేక్షక పాత్రలో సాక్షిగా ఉంటుంది వెలుగులో

దొంగ దొర ఇరు రూపాలతో మనస్సు
బొమ్మ బొరుసుతో నాణెం వలె చేతిలో ఆడుతుంది
నాటకంలో పాత్రల వలె వస్తూ పోయే మనుషులతో

మనిషి తన బాధ్యతల్ని ఉత్సవ మూర్తులకు వదలి
తన ఉనికిని పదిల పరచుకొనే ఆరాటంతో
స్వేచ్ఛగా తిరిగేను నీడలతో కలసి జీవితంలో

లొంగే గుణం పొంగే ప్రకృతి మనిషిలో
ఎపుడేదో అపుడు దాన్ని ఉపయోగిస్తూ వ్యక్తి
అందం ప్రయోజనంలేని పరిసరాల మధ్య ఎలర్జీతో

27. తనదే తన కోసమే

మొక్కకు ఆశ్రయ నిలయం భూమి తలం
కవితకు ప్రేరణ రూపం సమాజం

భూ భ్రమణంలో ఎదురుగ వెలుగూ చీకటి
సూర్యుని కిరణ ప్రసారాల వశమయినట్లు
జీవన గమనంలో మంచి చెడు భావనగా
అనుకునే స్థితులన్నీ మనిషి మనో విధాలతో

మనిషిలోని మృగం అపుడపుడు బయటికి వస్తుంది!
మనుషులనే బాధిస్తుంది! తెలిసో తెలియకో!

ప్రకృతినీ మానవేతరాల్ని తలచి మనిషి నేర్చుకునేను
మనిషిని చూచి మనిషి! తనలో నేర్పును పెంచుకునేను

తగిలిన గాయాలపై ఇపుడు ఫోకస్‌తో పనిలేదు
ఒకటొకటి జ్వాలయై కారణ రూపాలను నిలదీసేను

భయం బండ రాయి కాదు, మంచు వ్యథా శకలం
ఉత్సాహ స్పర్శ చేత కరగుతుంది కదలుతుంది
దాహం తీరుస్తుంది నీరు విత్తును మొలిపిస్తుంది
పయనానికి వీలవుతుంది, తీరం దాటిస్తుంది

నేలపై బండి చక్రం గుర్తులు! చూడవచ్చు
నీళ్ళపై పడవ వెళ్ళిన గుర్తులు కనిపించవు

స్వేచ్ఛలో అవకాశాలెన్నో! దశదిశలలో
దారి దొరకడంతో గమ్యం సూచితమవుతుంది

గూడు కట్టుకొని ఉన్నంత వరకు పక్షి
చెట్టు ఉంది తనకోసమే, తనదే అనుకుంటుంది

ఒడ్డున ఉన్నంతవరకు పడవ
జలాలు తనకోసమే తనవే అనుకుంటుంది

గగనం తన కన్న పెద్దది అనీ ఎంత విశాలమో అనీ
పక్షిపైకి ఎగిరేందుకు సంకోచించదు
పయనానికి భయపడదు, ఉత్సాహం తరగదు
వెనక్కి తిరిగి చూడదు! ముందు చూపుతోనే!

వ్యాపకంలో ఉన్నంత వరకు మనిషి బ్రతుకులో
ప్రపంచం తనదే తన కోసమే అన్నట్లు ఉంటుంది

28. అందరికీ చెందింది

ఏ వాదమయినా ఏ పక్షమయినా
హృదయ రాగంతోనే తన ఆయువు కాలం!

ఆలోచనా మేఘం! తలపై ఛత్ర మయితేనే
పరిసరాల కలలు పచ్చదనంతో సార్థకమయ్యేను

వడ పోసిన జీవన సార రూపం కవిత
మనసును ఒడ్డునుండి ఒడ్డుకు చేరుస్తుంది
కవిని బట్టి కవిత! అనుభవ రుచి భేదంతో
మనిషిని సరికొత్త పాత్రను ధరింప జేస్తుంది

తనలో గాథలు మరొకరికి చేరే సుహిత సాధనం కవిత
ఛందో మయమయినా స్వేచ్ఛా రచన అయినా కళాభిరుచితోనే

నిశాభయం లేదు తుఫాను భయంలేదు
మనిషి ఉన్న చోటు మానవతను వెదకుతూ సాగుతుంది
కవిత! మాట లాడుతుంది! నిలిచిన చెట్టుతో
భవితపై నమ్మకంతో నడచే మనిషితో

వెలుతురు ముఖంతో వర్తమాన వర్తనతో
జలద హృదయంతో ఆత్మీయ స్పర్శతో ఎదురవుతుంది
తనలో నుండి తరగని అనుభవాన్ని పంచుతుంది
గడియారం వలె మనిషిని సమాయత్తం చేస్తుంది

మనసును చెక్ చేస్తుంది, కర్తవ్యం జ్ఞప్తికి తెస్తుంది
ప్రాణంతో సమానమై మృత్యువును సయితం నిలిపేస్తుంది

ఒక సందర్భంలో బ్రతుకు శిలా రూపం పొందవచ్చు
దీని నుండి కోరిన శిల్పాన్ని ఆశించడం సహజం
ఒక సందర్భంలో ఎండిన మ్రోడులా మారవచ్చు
వసంత స్పర్శతో పచ్చదనంపై కోరిక! తప్పనిదీ

ఆశ అవకాశానికి సూచిక వంటిది
చేరే గమ్యానికి ప్రవేశద్వారమవుతుంది

కవిత వినిపిస్తుంది మ్రోడులో దీనస్వరం
తుపానులో ఆర్తరవం ప్రవాహంలో స్నేహ రాగం

ఎవరి నడత వారిది, వారి వారి ప్రయోజనాలతో
గమ్యం మాత్రం అందరికీ చెందినదవుతుంది 'మానవం'.

29. కాలానికి యశోరూపం

ఒక పేరుతో ఊరుతో మొదలయిన జీవితం
దశదశలో వేరు వేరు పాత్రలలో కొత్త తీరు తెన్నులతో
ఎదిగి ఎదిగి తలపయి చుక్కలలో చేరాలని
ఆ పయి నభో మణిగా నిలవాలనీ రాణించాలనీ

బీజ భూత మయిన ఆశ మొలిచి సాగి నింగి నల్లుకొనీ
స్వాగత తోరణ మవాలనీ, కిరీట శోభ అమరాలనీ

మట్టి నుండి చూపు క్షితిజంలో గగనంలో
సోపానం పయి సౌధ శిఖరాలను చేరాలనీ

తన పేరు ఊరు ప్రసక్తి మనసును తేలిక పరుస్తాయి
ఆర్ద్రమయిన గత స్మృతులు ముందుకు వస్తాయి

వెలిగి ఆరిపోయే క్షణాలతో కాలం
పరిమళాన్ని వదలుతూ గాలిలో సనసన్నగా
మనసును మరోవైపుకు మరలిస్తుంది
ఆలోచన ఆకాశంలా పరచబడుతుంది

తలపు నుండి పనికి ఉత్సాహం రగులుతుంది
అది ఏ విధ మనేది అంతరంగ నిర్ణయం
ఇది లౌకిక వ్యవహారాలను నియతం చేసేనా?
అన్నిటికీ కేవలం సాక్షీ భూతంగానే ఉండేనా?

శూన్యం నుండి మొదలయిన బ్రతుకులు శూన్యంలోకి
మధ్యలో విషయాలెన్నో! ప్రియమైనవి అప్రియమైనవి.

పూరి పాక నుండి భవనం సౌధం దాక
శిల్పశాల అయినా చిత్ర నిలయ మయినా
కవిత అయిన! జీవన సంస్కృతి బింబాలు
మానవ వికాస పుటలలో వెలసిన గుర్తులు!
చిన్ని చిన్న ముక్కలు కలిసి! స్మృతులలో మిగిలి
మనుషుల ఆయువు కాలానికి కార్యరూపమిచ్చేను

30. సూక్తితో సరిపోతుంది

ప్రజల హృదయ తంత్రులు మీటగల నేతలకే
తెలుస్తుంది! వర్తమాన సమస్యలకు పరిష్కారం
దీనికి ఏ దార్శనిక పథంతో పనిలేదు

ప్రజల జీవ నాడిని తెలుసుకొనే మతితో
అప్పటి స్థితిని బట్టి నడతలో మార్పులతోనే
తెలిసింది ఆచరణలోకి తేవడం సులభం కాదు

మనసు పైకి కనిపించదు, పైపై పొరలచే అణగి మణగీ
మాటలో చేతలో కొంత సూచనగా దొరకవచ్చు

జలధిలానో గగనంలానో సమస్య ఎదురవుతుంది
ఒకరొకరొక్కొక యాన సాధనాన్ని ఎన్నుకునేరు

సంగీతం వినబడుతుంది చెవులు ఉన్నందుకు
అందులోని సూక్ష్మతల్ని తెలిసి మైమరచే దెందరు?
కవిత ప్రతిఫలిస్తుంది నిజ మానస దర్పణంలో
ఇందులోని భావ శక్తి తెలిసి ఆనందించేదెందరు?

కవులు వారి వారి అభిమానుల గణంతో
నిప్పు కణాల కుంపటి వలెనో
బొగ్గు ముక్కల గంప వలెనో
కొర కంచుల ప్రదర్శన వలెనో

నిష్క్రమించే బింబంతో చీకటి దృశ్యం
లెక్కలేనన్ని చుక్కలు! చిరు వెలుగుల పోటీలలో

నినాదాలతో దరిద్రాన్ని నిందిస్తూ పోతే
భాగ్య రాసులు చేతులలో ఊడి పడేనా?
ప్రకటనలతో ఆకలిని నిరసిస్తూ పోతే
లోపలి మంటలు శమనం పొందేనా?

సమస్యకు పరిష్కారం ఆచరణంలో వికాసరూపంతోనే
ఇది సాధించేది శ్రమచే విశాల మతితోనే

ఇది పరిశీలనంలో ఎద్ద గ్రంథమే అవుతుంది
కర్తవ్యానికి అయితే ఒక సూక్తితో సరిపోతుంది.

31. గమ్యం చూపిస్తుంది

రవి చంద్రుల కళ్ళు మూత బడినపుడే
కాలం తన భయద పార్శ్వం చూపిస్తుంది
చీకటి బొమ్మల వలె మనుషులు చరించేరు
మానస చేతన స్తబ్ధంగా, మనీష మందగించేను

బ్రతుకులో ఈ స్థితి నిరంతరం సాగ కూడదనే
ఎపుడయినా వచ్చింది, గడచి పోవడం జరుగుతుంది

రేపు పయి ఆశ ఉండవలసిందే, ఉంటుంది
ఈ రోజు పయి నమ్మకం ఏ మాత్రం సడలరాదు

చీకటి ప్రకృతిలోనే కాదు, మనిషిలోను ఉంటుంది
ఇది పైకి తెలిసి తెలియకుండ పని చేస్తుంది
మనుషుల ఉనికికే ప్రమాదం కలగవచ్చు

గడచిన క్షణం మృత్యు ఛాయను గుర్తుకు తెస్తుంది
గడచే క్షణం జీవన రుచి చూపిస్తుంది
రానున్న క్షణం వచ్చే అతిథిని తలపిస్తుంది

అవని పయి పయనంలో ఏర్పడే బాటలు
ఎవరో కొందరికి మాత్రం పరిమితాలు కావు
దాటిన మైలు రాయి మనసుకు తృప్తినిస్తుంది
దాట నున్నది గమనంలో ఆశను నిలుపుతుంది

దారిలో కనిపించే పూలు కోసి నిలవ చేయలేరు
వాడి పోయి త్వరలో మట్టిలో కలిసి పోవడం స్పష్టం
రాళ్ళు మాత్రం కావలసినవి నిలవ చేసికోవచ్చు,
విలువయినవి దాచబడవచ్చు, ఆభరణాలలో పొదగవచ్చు.

పేద ఇంటి ముందు మొక్క ముఖం చూపుతుంది!
తాను కూడ పెరిగే ఆశను ప్రకటిస్తుంది

మనిషిలోను సృజన ముఖం బయట పడాలనీ
మనసులో అవకాశం కయి! ఎదురు చూచేరు

ఆదర్శం దార్శనికానికి సుగమత చేకూరుస్తుంది
దార్శనికం ఆదర్శానికి ఋజు గమ్యం చూపిస్తుంది

32. ఖడ్గానికి స్థానం

మానవ చర్యల ప్రతిఫలన దృశ్యాలతో సమాజం
ప్రకృతి శక్తుల సమూహాల ప్రసార నేపథ్యంలో
నిరంతరం మారే సన్నివేశాలతో కాల రూపం
వికాస చరిత్రకు నిలయం, ప్రకృతి ప్రకటనకు వేదిక!

బ్రతుకులో మనుషులతో స్నేహం
అడవిలో సన్నని నీటి పాయ దొరికినట్లు
వెలుగులో సరసిని విప్పారిన పద్మం వలె
మనుషులలో ప్రేమ! సుందర సుగంధ మయమై

ఆ వచ్చే మేఘం తన పొలం మేరలలోనే
వర్షం కురవాలని ఆశ పడేదెవరు? ఉండరు
చెట్టు నీడ తన వరకే పరిమితం కావాలని
గొడుగుగా నిలవాలని అనుకొనేదెవరు? ఉండరు.

పంజరం తలుపు తెరవబడి
స్వేచ్ఛగా బయటికి వచ్చేసిన చిలక
సూటిగా తన గూటికి చేరుతుంది
ఆహారం అన్వేషణలో పై కెగురుతుంది
దీని కయి! ఇంతకు ముందు ఉన్న
శ్రమలేని పంజరాన్ని! సమీపించదు.

ఏ ఒక్క క్షణం సముద్రం మౌనంగా ఉండలేదు
ఎప్పటికీ ఏదో క్షోభలో స్వరం వినిపిస్తుంది

పర్వతం ఒక అడుగు తీసి అడుగు వేయలేదు
నిశ్శబ్ద బంధనంలో ఎప్పటికీ మౌనంగా ఉంటుంది!

చేతిలో కరవాలం మనిషికి తోడుగా అండగా
ఇతరుల్ని బెదిరించే పనికి మాత్రం కాదు

ఇది బలానికి చిహ్నం! భద్రతలో అభయ ముద్రతో
రక్షణ వ్యూహంలో చరిత్రకు మలుపులు తెచ్చింది

ప్రతివాదానికీ చోటు ఉన్న స్వేచ్ఛా వ్యవస్థలో
ఖడ్గానికి గల స్థానం, మర్యాదాలంకారంగానే

33. అంతరంగ స్పృహతో

సమస్యపై సంరంభం సద్దు మణిగాక
మనసుతో అంతరంగం మాట్లాడుతుంది
ఎపుడో ఒకపుడు నిజ స్పందన వినిపిస్తుంది
ఉపదేశంగానో సూచనగానో హెచ్చరికగనో తన పాత్రలో

వెలిగే బల్బు వెనక విద్యుత్ ప్రసారంలా
ప్రవాహ గతిలో పైకి కనిపించని విద్యుత్తులా
ఎవరికయిన తనలో అంతరంగం తెలియంది కాదు
దాని పట్ల శ్రద్ధ లేకపోవచ్చు, ఉపకరించక పోవచ్చు.

బయటి తలుపు తెరవడంతో
లోనికి కదలేను 'నేను' వెలుగుగా
లోనికి ప్రవేశంతోనే రహస్యం తెలుస్తుంది
చూడంది చూచేను, తెలియంది తెలిసేను

జీవమున్న ప్రతిది మార్పు కోరుతుంది
అది చెట్టు కావచ్చు మనిషి కావచ్చు ఒకటే
పరిచయమున్న మెట్లపై చీకటిలో
చక చక అడుగులు పడతాయి, నడకలో

ఒకవైపు నుండి ఒక వస్తువు ఉపయోగంలో
ఇంకొక వైపున అయితే ఆదర్శానికి చిహ్నంగా

ఒకవైపున సాగుతూ భవితలోకి
ఒకవైపున బూదియై గతంలోకి
అవలీలగ జారుతుంది వర్తమానం

మంటల్ని ఆర్పుతూ, వరదల్ని సహిస్తూ
జీవితం! ఇరు పార్శ్వాలతో కాలం చూపే
కథలో దృశ్యాలతో, మనిషి చేతిలో లేని సంఘటనలతో

శుభ్రమయిన గాలి కోసం తహ తహ లాడుతూ
స్వచ్ఛ మయిన వెలుగు కోసం విలవిలలాడుతూ
అద్దంలో బింబంలా కాలంతో నేను, నా కవితలో
పరిసరాల ధ్వనుల మధ్య ధూళిలో, అంతరంగ స్పృహతో.

34. ఒకటి కావు

వర్తమాన వ్యవహారాల తతంగంలో చిక్కుకొని
స్వంత భవిత కోసమనీ, విషయం విలువలు మరచేరు

చాచిన అరచేతులలో రేఖల్ని చూసుకుంటూ
కాలం గడపేరు, చక్రంపై నమ్మకం తిరుగుతూ

పయనంలో రైలు ముందుకు పరుగిడుతూంటే
చెట్లు కొండలు వెనక్కి పరుగిడుతూన్నట్లు ఉంటుంది
ఏది నిజం? ఎంతవరకు? అంటే
రైలు ఆగితే గాని పూర్తిగా తెలియదు!

తలుపులు మూసి ఉన్నా
తెరచిన కిటికీ నుండో
వెంటిలేటర్ నుండో లోనికి
పిచుకలు రివ్వున కిచ కిచ మంటూ వస్తాయి
బ్రతుకు బాటలో సూటిదనం వహిస్తాయి
ఎవరి అనుమతితో పనిలేదు.

అనుకున్నది కాకపోతే, కోరిక తీరకపోతే
నిరాశలో కాలాన్ని దూషించేరు
అనుకోనిది జరిగి ఆపదలో బాధలలో
కోపంతో దైవాన్ని నిందించేరు

తాము చూడ గలిగింది, మరొకరు చూప నవసరం లేదు
తాము చెప్ప గలిగింది, మరొకరు చెప్పనవసరం లేదు

అగ్నికి ఆకలి ఎక్కువ అంటారు
ఆహుతి ఎంత జరిగినా తృప్తి ఉండదు
జలధికి దాహం తీరని దంటారు
నదులెన్ని కలిసినా నాల్కలు చాస్తూనే ఉంటుంది

నిశ్శబ్దం మనసుకు పని కల్పిస్తుంది
మౌనం లోతులలోకి దింపుతుంది

కవితను తను చదవడం వినడం అనుభవాలు వేరు
ఆలోచనలో పొందే ప్రభావ సుందరతలు ఒకటి కావు

35. జరిగేది పొందేది

"జరిగేది ఆగదు" అని ఎవరు మౌనం వహిస్తారు
ఉన్న స్థితిలో మార్పుకు యత్నం చేస్తారు
లేని దానిని చేర్చాలని అనుకుంటారు
ఉన్న దానిని పెంచాలని ఆశిస్తారు
ఉన్నది మార్చాలని లేనిది పొందాలని
కొత్తది చేర్చాలని ఆలోచనలో మనస్సు!

చింతనతో మనస్వీగా సాధనతో మనీషిగా
శూన్యానికి విలువలతో జీవిత రూపం! కొత్తగా

తనలో దోషాలు లోపాలు తెలిసినవే అయినా
వాటిని అందంగా మలచి శిల్ప రూప మిచ్చేరు
ఏదో ఒక విధంగా సమయం గడవక పోదు
ఏదో ఒక తీరుగా బ్రతుకులు సాగక పోవు
సుసంస్కృతి సంపద అందరిదీ, మనోజ్ఞం
ఏ కొందరు మనుషుల సొత్తు కాదు; సమాజానిది.

బలం ధనం విద్య ప్రభుత పలు నిష్పత్తులలో
వివిధ స్థాయి భేదాలతో మనో విధాలతో సమూహాలు

ఎవరికి వారు శిఖర భావ జగంపై కోరికతో
విభేదాలు విరోధాలు వైరుధ్య వికాసాలు! సహజం
అయినా భయపెట్టే బాధించే పీడన చలనంతో
సమత చెదరి పోకూడదు, మమత బెదరిపోకూడదు

ప్రతిమలో ఆదర్శ భావ రూపంతో మనిషి
సహనంతో భాగ్యానికి దారులు వెదకేను
మంచి మాటతో మంచి పనుల ప్రదర్శనం
ఆకాశం హృదయంలో దిగినట్లనిపిస్తుంది.

కవితతో సమాజ బంధం దృఢతర మవుతుంది
జరిగేది జరుగుతుందని తెలిసినా
తాను జరిపేది ఆగ రాదనే
తాను పొందేది పొందవలెననే!

36. జనత వైపు

కవిత అడుగు ముందుకే విజయ ముఖం వైపు
ఎంతటి విషమత లోను చెదరని విశ్వాసంతో
అవరోధాల నధిగమిస్తూ నడచే వారొకరు
కష్టాలను నిందిస్తూ సమయం గడపే వారొకరు

అపుడపుడు ఒకరి నొకరు క్రాస్ చేస్తూ పోయేరు
ప్రతి రోజు ఉదయం వలె ఆశయ జీవన రుచితో
ఎప్పటి కపు డెదురు పడే పరిమితుల్ని దాటుతూ
వైవిధ్యంతో విశాలతను పొందుతూ పోయేరు

చీకటి బాధల నుండి బయటపడుతూ
నిశ్శబ్దం నుండి శబ్ద ప్రపంచం లోకి పయనం
వాస్తవానుభవాల మానవ గుణ వర్తనతో
కవిత! కాలపటంపై మానవీయ రూపంతో!

దేవతల్ని వదలి మనిషి ప్రతకవచ్చు
మనుషుల్ని వదలిన మనిషికి మనుగడ లేదు
అనల పథం నుండి మనిషి! ఆర్ద్ర పదానికి
చేరే కోరిక అనాది నుండి ఇప్పటికీ!

అడుగు వేస్తే బురద సోకే సరసిలో
ఆకర్షణతో కమలం! ఒడ్డునుండి లాగుతుంది

గ్రీష్మంలో ఎండలకు పెను బండలు పగిలి
సందులలో నుండి వాన చినుకుతో మొక్కలు!
కఠోర మయిన జీవన స్థితిలోను సృజనను తలపించేను
మనిషిలో తన క్రియాశక్తిని ప్రేరేపించేను.

ఆటంకాలేవయినా ఎదుర్కొని సాగడమే
బాధలలో ఏ చీకటి బావిలోనో పడవలసిందేనా!

శిశిరం వస్తుంది ఆకు రాలుతుంది
గ్రీష్మం వస్తుంది చెట్టు ఎండుతుంది
చినుకుకయినా వసంత స్పర్శకయినా, ఎదురుచూడ వలసిందే
బ్రతుకులు శాపం కాదు, సమాజ గతిలో ఆశాభాగాలు

భయం నుండి ముక్తమై స్వేచ్ఛలో స్వతంత్రంగా
కవితలో పదం! ముందుకే జనతవైపు సృజనతో.

37. తప్పనిదీ

జీవిత మొక కావ్యం అనుభవ రమణీయం
మానుష వర్తనలో సహనం రణంతో
ఏ రోజున కారోజొక లౌకిక తంత్రం
మెలిక నుండి మెలికలకు సాగడం

క్షణక్షణం పద పదాన భావ జగం
నవ నవమయి అద్దంలో అభినవ బింబం
జన దృశ్యం చూపుతుంది
హృదయ స్వరం స్వనిస్తుంది

తలను దించి
సూర్యుని తేజం ముందు
శిరస్సు ఎత్తి
వెన్నెల చంద్రుని ముందు
పగలంతా తగిలిన గాయాలకు ఊరటగా
రాత్రివేళ తారలు! చల్లగ చూస్తాయి.

బండికి చక్రాల్లా పక్షికి రెక్కల్లా
మనిషి లోన మనసుతోనే పయనం
మానవ శ్రమ ఫలం విలువ నిలుస్తుంది
కాలానికి సుందర రూపం ఇస్తుంది

మూలం పదిలంగా లోతులోన నిలిచీ
చెట్టు ఎండినా సృజన కవకాశం లభిస్తుంది.

భూమికి నింగికి మధ్యలోన వంతెన
ఆలోచనయే! కవితాయానంలో తప్పనిదీ

38. గమ్యం స్వేచ్ఛలో

గమ్యం తెలిసినా స్వేచ్ఛలో విశాలమైన అవకాశం
స్వార్థంలో సంకుచితం దేని కయిన సిద్ధపడ చేస్తుంది
నిప్పు రవ్వలలో ఆరాటం! జ్వాలుగా మారాలని
ఎవరికి విరోధమయినా, ప్రమాదకరమయినా సరే

సందేహంలో చిక్కి అనుమానంలో మునిగి
ఎక్కడ తేలేదీ, ఏ గట్టుకు చేరేదీ తెలియదు
ఇది సమస్యకొక కారణమై, కథ మొదలువుతంది
దహన గుణంతో వర్తనం బూడిద రాలుస్తుంది

సంధ్యా వేళలో క్షితిజంలో సూర్యుని తేజం
ఎగసే మంటల్ని తలపిస్తుంది భ్రమలో
వివేకానికి బదులు అమాయకం చిందులేస్తుంది
నిరంకుశ బలానికి ఇది ప్రాకారమవుతుంది

ప్రశ్నించే వ్యక్తి జైలు పాలు అయ్యేనా?
జలధిలో అలల్ని నింగిలో చుక్కల్ని
లెక్కపెట్టే అవకాశం! ఉన్నది కంప్యూటర్‌లో
మనిషి మనోరూపం! కనుగొనబడేనా?

ఎవరికేది ప్రాప్తమో అది పొందేమాట ఎప్పటిదో
మనిషిని ప్రశ్నల బోనులోకి నెడుతుంది
వ్యక్తి మూలంతో సమాజ వికాసం మాత్రం
స్వేచ్ఛలో తెలిసిన గమ్యంతోనే సార్థకం

39. మౌనం శబ్దిస్తుంది

జలధిలో ఆవేశంగా లేచిన కెరటం
వాలిన స్థానంలో మరొకటి చోటు చేసుకునేను

కవితలో పదం వెనకనే పదం! హ్లాదంగా
పద పదం మధ్య ఖాళీని ఆలోచన పూరిస్తుంది
కవిదే కావచ్చు, ఇతరులదీ అవచ్చు
మౌన ముఖాలకు పలికే అవకాశం దొరుకుతుంది

జరిగిపోయిన ఘటన మళ్ళి రాదు కానీ
గుర్తులతో స్మృతిలో సంగ్రహరూపం తేలుతుంది!
ఎవరిది వారికి ఆలోచనలో పరిమిత మవుతుంది
అల్లికతో సమాజ పరమవుతుంది, చరిత్రలో

ఖేదంలో జారిన వెచ్చని అశ్రుకణం నుండి
కాలాంతరాన అగ్ని చిత్రం వెడల వచ్చు
మోదంలో జారిన చల్లని ఆశ్రుకణం నుండి
ఎప్పటికయినా పూలమొక్క కనిపించవచ్చు.

ఇవి జీవన గతిలో భాగాలయి, అవశ్యంగా
ఏ కవి కవితలోనో! ప్రతిఫలించవచ్చు

రాయినుండి రాకెట్! పూవు నుండి వనం దాక
బొమ్మ నుండి కదలే మనిషి! నీడ నుండి
కవితలో వాస్తవం! సమాజ దృశ్యంతో స్వేచ్ఛగా
మౌనం శబ్దిస్తుంది అక్షర సర్గను సమాధానంగా.

40. స్పందనలో కవిత

మనిషిలో వికాస చేతన రూపం కవిత
బ్రతికే సమాజ రూపం విలువల్ని తెలుపుతుంది

ఎప్పటివో ఎన్నెన్నో జీవన ప్రభావ శకలాలతో
సమాజ బంధంలో ఎప్పటికీ ఒక ఆకర్షణ నిలయం
వ్యక్తి రేఖ నుండి సమాజ చిత్రమయి
ఎదిగిన కవి మనో విధం దేనికదే

తీసే ఫోటోకు గీసే చిత్రానికి చెక్కిన శిల్పానికి
పలికే కవితకు జీవ జడత భేదం లేదు
ఏకాంతం విషయంతోనూ, సమూహం వస్తువుతోను
కవిత! వెడలుతుంది! అపూర్వంగా భిన్న రుచితో

దీనికి నియతమయిన సమయం లేదు
నిర్దిష్టమయిన స్థలం లేదు దేశం లేదు
జాతి మతం వాదం భాషాభేదం లేదు
స్పందనతో వచ్చే కవితకు సృజన సూత్రమొకటే

బుజాన శాలువయి అలంకరించవచ్చు
చేతిలో కర్‌చీఫ్ అయి ఉపయోగ పడవచ్చు
వేలుకు ఉంగరమయి విలువ చూపవచ్చు
చిన్నది మెరపులా మెరసేను,
పెద్దది ప్రవాహంలా అపరానిదీ

దినమణి కావచ్చు నిశాదీపం కావచ్చు
సృజనకు మూల మనో రూపమొకటే!

92. స్వేచ్ఛా కవిత్వం

ఇది జీవితం

(XVII భాగం)

వర్తమానం ఆనవాలు

మాదిరాజు రంగారావు

రసధుని
సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 28.

SVECCHA KAVITHVAM 92

IDI JEEVITHAM

Free- Verse

(XVII Part)

Varthamanam Anavaalu

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2019

Presented
to my wife
Smt. Indira

పీఠిక

ఇది స్వేచ్ఛా కవిత్వం (92)లో 'ఇది జీవితం బృహత్కృతి చివరిభాగం, పదిహేడవది, 'వర్తమానం ఆనవాలు.' రచన మొత్తం మీద మానవీయం కేంద్రంగా ఆధునిక కాలంలో ముఖ్యంగా వర్తమాన సమాజంలో సామాజిక రాజకీయ సాంస్కృతి నైతిక ఆర్థిక కోణాల్లో జీవిత పార్శ్వాల్ని చిత్రిస్తూంది. వైయక్తిక – సామాజిక స్థాయిల్లో అనుభవాత్మకమైన స్థితులు వాస్తవ తలంపై దృష్టికి వస్తాయి. వస్తువు విస్తృతమైంది, విషయం బహుముఖీనమైంది.

ప్రజాస్వామ్య హృదయానికి ప్రాధాన్యమిస్తూ దార్శనికంలో ప్రధాన లక్ష్యం తీర్చబడింది. ఈ విధంగా రచన తనదయిన ప్రత్యేకతను భావింప చేస్తుంది. ఇక వివిధ స్థితిగతులు గురించి, ఇందులో వాటి అభివ్యక్తిలో భావరూపాల్ని, ప్రతీకల్ని ఆలంక్రియల్ని కలిగిన కళాత్మక సంవిధానం వివేచన కందుతుంది.

రచనలో పయి పొరలో వర్తమాన సమాజ స్థితి ప్రసారాన్ని గమనించవచ్చు. లో పొరలో వ్యంగ్య శోభ స్ఫూర్తికి వస్తుంది.

ఇక విషయానికి వస్తే వర్తమాన కాలంలో మన దృష్టికి వచ్చే అనేకాంశాలు ఇందులో ప్రసక్తమైనాయి. అలజడులు అశాంతి ఉదాహరణకు ఎన్నికల దగ్గరి నుండి సమాజ స్థితులతో వ్యక్తిగతమైన అంశాల వరకూ పర్తాప్తమై కవితాకృతుల్ని పొందాయి. హింస హత్యలు ఆత్మహత్యలు ఎక్కువయినాయి. నేరాలు ప్రమాదాలు వైరాలు నిరాశలు, విధ్వంసాల గురించి ఇక చెప్పనక్కరలేదు.

ఏ వికాసమయినా ప్రగతి అయినా దార్శనికమయినా సామాన్యంగా తృప్తి సుఖము శాంతి ఆనందంతో కూడిన సంస్కృతి రూపాన్ని ప్రజలు కోరుతారు. దానికై పాలకులు ప్రయత్నిస్తారు. సమాజమూ ఆ కోణంలోనే ఆలోచన చేస్తుంది. వ్యక్తులు ఎవరి ప్రత్యేకత వారిది. ఆ దిశలో దీనినే అభిలషిస్తారు. ఉన్న వ్యవస్థల్లో దార్శనికంగా ఇప్పటికి ఉన్న పరిస్థితుల్ని బట్టి చిత్తశుద్ధితో అంకితభావంతో వర్తించే 'ప్రజాస్వామ్యం' మేలయిందనే నా అభిప్రాయం. ఇది కవిత్వంలో చెబితే 'ప్రజాస్వామ్య హృదయం'గా పేర్కొనబడింది.

స్వేచ్ఛా కవిత్వంలో ఈ రచన వర్తమాన జీవితానికి అక్షరరూపంలో ఆనవాలు.

– మాదిరాజు రంగారావు

1. చేతనతో పరివర్తన గతిలో

మస్తిష్కం మనిషికి పూల వన మనుకున్నా
అది ఆయుధ శాల గాను మారే అవకాశముంది
యంత్ర మయం తంత్ర యుతం కావచ్చు
యోజనలో ఎవరి అనుభవ పథం వారిది

కోరని వస్తువు లేదు చేయని ఊహలు లేవు
వ్యక్తి నుండి సమాజ తీరభూమి చేరేను
వికాస చరిత్రలో కొత్త పుటలు! చేరేను
ఆచరణంలో ఎందరో! అంతరంగం మరచేరు

సుమ సమాన హృదయం స్వార్థంలో
శిలా ప్రతిమ రూపం పొందవచ్చు
ఎగసే అగ్ని శిఖగ మారవచ్చు
చీకటి ఉహను తలపించ వచ్చు

ముఖాన రాజుకొనే వైరంతో కదలి
సందేహ డోల పయి కొంతసేపు ఊగి
చూపులో కత్తిమొన మెరపులతో
ఏ విపరీత చర్యకో అడుగులు వేసేరు

వేదనలో హృదయం చల్లని స్పర్శ కోరుతుంది
వెచ్చని బాష్ప కణం జారుతుంది
నిన్న పూవులా వికసించిన క్షణం
నేడు అగ్ని కణ మయి పై బడుతుంది

కుంభీనస ఫూత్కారంలో నుండి అలజడిలో
బయటికి వినబడుతుంది సనసన్నగా
తాపంలో చింతన మతి జలదంకయి చూచేను
స్వేచ్ఛలో దేనికయిన సిద్ధంగా ఉంటుంది.

స్వేచ్ఛకు చిహ్నమయిన గాలి భయ విలోలమవుతుంది
ధూళి పొరలు వదలి స్వచ్ఛంగా సాగాలని ఉంటుంది
ధైర్యంతో ముందుకు పోవడమే కర్తవ్యం
జడత నుండి చేతనతో పరివర్తన గతిలో.

2. హారమై తేజమై

ఉదయ ఘడియ నిదురలో గడుస్తుంది కొందరికి
మెలకువలో రాత్రి చంద్రుడు! కొంతసేపటికి
ఏ బురుజు చాటు నుండో
ఏ చెట్ల చాటునుండో
జారిపోయేను తెలియకుండ కొందరికి
అమాయకమై! మరపో! నిర్లక్ష్యమై!

వేదనలో బాధలలో శాంతి కయి అన్వేషణం!
ఆ రోజును కోల్పోవాలని ఎవరూ కోరరు

ఆకలి వేస్తే ఎదురుగ నిలిచిన చెట్టయినా
అప్పటికప్పుడు ఎంతటి త్యాగంలోను పండ్లు జార్చదు
దప్పిక వేస్తే నిటారుగ నిలిచిన జలదం!
ఎంతటి ఉదారత లోను దోసిలిలో నీరు వదలదు

ఊహల చర్యలతో పోత పోసిన బొమ్మలు
పలు విధాల శిల్పాలుగ తీర్చ బడీ
జీవ కళ ఎరగని ప్రదర్శనం! జరుగుతూంది
అంతరంగం మానవ స్పందన కోరుతూంది

క్షుద్రత కవకాశం దొరికితే చాలు
నాశన పర్వం మొదలయినట్లే
చుట్టూ మనుషుల సందడి లేకపోలేదు
ఎవరి పనులలో వారు మౌన పాత్రలో

చెట్టుకు నీరు పెట్టేదీ, కాపాడేది ఒకరు
వచ్చిన ఫలాన్ని తెంపుక పోయే దొకరు
అనుభవంలో మరొకరు! ఎక్కడి కక్కడ వేరువేరుగా
వివిధ శ్రేణులతో శ్రమ విరామ భేదాలతో సమాజం!

అవని పయి కణ కణాన్ని ఆర్ద్ర పరుస్తూ
జీవ శక్తి నిస్తుంది జలద సేచనం
కవితలో పద పదాన్ని ప్రాణిత మొనరిస్తూ
అమృత హృదయ మిస్తుంది సృజన చేతనం.

నలుపు నుండి తెలుపులోకి కాలానికి హారమై
తెలుపు నుండి ఎరుపులోకి సంఘానికి తేజమై.

3. మానవతా రాగంతో

అనుభవ వేళలో వర్తమాన వాస్తవం
వెనక గతం ముందు భవిత ప్రస్తుత స్థితి
శరణ్యం వరేణ్యం అవశ్యం ప్రతి మనిషికీ
రమణీయంగా తీర్చాలని కోరిక! మనసులో.

వెలుగు లోన నీడలు ఓడల వలె
చీకటి గోడల వలె కనిపించేను
నీడకు స్వతంత్ర రూపం లేదు
అనుమానం సందేహం చెరొక వైపు నుండీ.

కలల పయిన నమ్మక మెంతో
నీడ పయిన భరోసా అంతే,
తాపంలో మరో ప్రాణికాశ్రయం అవుతుంది
చల్లని అవకాశం ఇచ్చే సన్మిత్రం అవుతుంది

మండే ఎండ చుట్టి నపుడు శరీరం
తాప హరం నీడను కోరుతుంది
అడవి పేరు వినగానే
చెట్లు గిరులు నదులు మృగతతితో
పక్షుల కల రవాలకు బదులుగా ఇపుడు
ఆయుధాల మరణ ధ్వని తరంగాలు వినిపించేను

ఇవి ప్లోదం నుండి భయానికి చేరుస్తాయి
సమాజ చలనంలో విషమత సూచిస్తాయి.

దరిద్రాన్ని పంచుకునే దెవరు?
వివేకాన్ని ఎన్నుకునే దెవరు?
ఎవరయినా? అందరు ఆశించేదొకటే
సుఖమూ సంతోషం భాగ్యం ఒక స్థాయిలో

సందర్భమేదయినా దార్శనికంలో ఆదర్శం
ఎండిన ఎడారి హృదయం కారాదు
పూవు ఫలం ఎరగని ముఖం చూపరాదు.
భూమిపై ప్రభుతతో, ప్రజలలో అధికతతో
విషమతలను పెంచే పీడన గుణం తొలగేది
వికాస గతిలో ఒక మానవతా రాగంతోనే

4. నిన్నను మరపిస్తూ నేడు

మెరపులతో పిడుగులకు బద్దలయి ఆకాశం
పెళ్ల విరిగి మీద పడే అనుమానంతో భయం
కను రెప్పలు చూపును మూసేస్తాయి
అర చేతులు చెవులను కప్పేస్తాయి

తదుపరి కళ్ళు తెరచి చూస్తే
యథాస్థితిలో అమాయక వాతావరణం
అంతలో చినుకులతో మొదలయి వర్షం
నేలను ముంచుతుంది, జల పరవశంలో

మెరపులతో వర్షం, పాత బంధువులా వస్తుంది
వెచ్చని వాతావరణాన్ని ఆర్ద్ర పరుస్తుంది
నలువైపుల పచ్చదనంలో భాగ్యం
ప్రకృతిలో కొత్త దృశ్యం ఆశామయమై.

బాధ ఆర్తి మోదం విభవం
కవితకు భావ ప్రసార స్థానాలు
ఒక క్షణం ముల్లులా బాధించవచ్చు
ఒక క్షణం పూవులా అలంకరించవచ్చు

మౌనం పనికి రాదు సందర్భాలన్నిటిలో
నిరసన ఘర్షణ వాదవివేదం అవసరమవుతాయి

మెరపులా ఆలోచన పిడుగుపాటులా సంక్షోభం
ఆపైన సర్దుకొనీ సాధారణ స్థితిలో సమాజం

నిశ్శబ్దం! కవికి సహజ లక్షణం కాదు
శబ్దంలో అర్థం వెలుగు వైపు సాగుతుంది
కర్తవ్యంలో మలుపులు! పయనంలో
ఇవి సమాజ చలన వేగంలో భాగాలు

జీవితాన్ని తిరగేస్తే కవిత
కవితను మరలేస్తే జీవితం
మనసులో కొత్త పాత్ర పాలపిట్టలా
ఇది సమాజహిత భావానికి చిహ్నం

మరో ఉదయ ప్రకాశం శుభ్రంగా స్వచ్ఛంగా
నిన్నటి ధూళిని మరపిస్తూ కొత్తగ ఆశారూపం.

5. వచ్చే వారి కోసం

స్వేచ్ఛలో సుఖం కయి శాంతి కయి ఆరాటం
ఎంత కాలమయినా అందినట్లయి, అందనివి!
నిర్మాణ భావనతో చేరువ అయినట్లు ఉంటాయి
విధ్వంస వర్తనలో అందకుండ పోతాయి.

పుట్టిన ఇల్లును, గడపిన ఊరును వదలి
చోటు నుండి చోటుకు మనిషి! పయనం
బ్రతుకు వెలుగు నిండే అవకాశాలతో
ఒకరితో ఒకరు పోటీలో! వివిధ స్థాయిలలో

వాదం నిలుపు తుంది మనిషిని స్థిర రేఖపై
దార్శనికం దిద్దుతుంది మనసును లక్ష్యంతో

చెదరిన వర్తమాన రేఖలతో జీవితాలు మారిపోతాయి
ఒకవైపు నుండి ముందుకు వచ్చే మంటలతో
ఒకవైపు నుండి కదలే పయోద పంక్తులతో
విషమతలను సరిచేసే సమ న్యాయం అవసరమవుతుంది.

మంచి భవితపయి చూపుతో పయనం
ముందుకు సాగింది, వెనక్కి రావడం కుదరదు.

గత మనగానే రాసులుగా తరలే కల్పనలు
ఎవరికి తోచిన విధాన వారు ఇష్టంగా చూచేరు.

దూరాన కన్పించే గిరి శిఖరానికి పైన
స్వర్గం గురించి! అలలుగా ఆలోచనలో కల్పనలు!

రెండు మబ్బు ముక్కలు ఆర్ద్రమైనవి కలుస్తాయి
రెండు మతులు! శుష్కమైన వాదంలో కలవలేవు

ప్రేమలో వ్యక్తుల పరిమితులతో సమాజం
కరుణలో సమాజ వికాసంతో ప్రపంచం

పైకి కనిపించనివీ, తెలియనివీ కవితలో
శబ్దం వెనక నుండి భావనలో పరచుకొనీ

ప్రతి బ్రతుకు పుస్తకంలో పేజి! రోజు కొకటి
చివరలో ఖాళి పేజీలు! వచ్చే వారికి వదలబడీ.

6. ఎగరాలని నివాలని

అలలు దారి తప్పవు, తీరం చేరే దాకా!
వాలినా ఎగసినా శిక్షణలో సైనిక పంక్తులు వలె
ఏ రోజూ! ఏ సమయ స్థితులు ఆగవు! రావలసిందే
రుతువులలో మార్పులనూ మనిషి ఎదుర్కొనేను శక్తితో

వెలుతురులోనే వస్తువు ప్రత్యేకత తెలుస్తుంది
వెనుక ఉన్న మనసులో విలువలు బింబిస్తాయి

ముఖంలో కనిపించే మనిషి వాలకం
మనసులో కనిపించని లోక రహస్యం
మాటలో క్రియలో బయట పడేది కొంతే
మిగిలినవి అన్నీ లోన! మానస పేటిలో

రాత్రి నుండి ఉదయం వలె మనో దర్పణం
ఏ రోజు కారోజు శుభ్రం కావలసిందే
అవసరానికి సిద్ధంగా మానవ మస్తిష్కంలో
కపోతీ నిలయంతో పాటు ఆయుధశాల కూడా

ఎపుడో వరదలు వస్తాయని,
ముందుగనే ఆ వచ్చే మబ్బును నిరాకరించేరా?
ఎపుడో తుపాను వస్తుందని
ముందుగనే వీచే గాలిని కట్టడి చేసేరా?

ఎపుడో ఎండలు మండేనని
ముందుగనే వాకిలి తలుపులు మూసేరా

దేనినుండి ఎవరూ దూరం కాలేరు, అవరు
ఎపుడయినా ఒకటొకటి అనుభవరుచి పొందాల్సిందే
సుఖాలతో పాటుగ కష్టాలు! ఎవరికయినా తప్పవవీ
"అందరు ఒకటే" నన్న మాటలు ఆదర్శంలో బింబంవలె అందంగా

వెన్నెలను చూస్తూ కూర్చుంటే దప్పిక తీరేనా?
హ్లోదంగా ఉండవచ్చు, మనసు శాంతి పొందొచ్చు
ఉదయాన్ని చూస్తూ ఉంటే ఆకలి బాసేనా?
ఉత్సాహం పొందవచ్చు, లేచి అడుగులు వేయవచ్చు.

గగనంలో గాలిపటంలా జీవితాలు ఎగరాలనీ కోరిక
సూర్యునితో చంద్రునితో జత కట్టాలనీ అందరిలో.

7. శక్తి ఒకటే

అగ్గి పుల్ల గీసి సిగరెట్ అంటించవచ్చు
దహన కాండ రచించేరు జ్వాలా తతితో
నిప్పు ఒకటే ఉద్దేశాలు వేరు ఉపయోగాలు వేరు
శక్తి ఒకటే. నిర్మాణం విధ్వంసం క్రియలు వేరు

దూరాన ఎండలో ఎరుపు పూలవనం తళతళ లాడుతూ
ఆరబెట్టిన పండు మెరప రాశిలా ధగధగలాడుతూ
కంటికి నిప్పులా వాస్తవానికి వేరుగా
మనిషి చూపులవే భిన్న భావ సమర్పకాలు
ఒకే ఒక యథార్థ బిందువు మరుగున బడి మనసులో
భ్రమలో! మృగతృష్ణలో! కలలో! కల్పనలో.

బ్రతుకులో ఏ అంశం నిష్క్రమణం కాదు
హింసలు బాధలు పీడన శత్రుత ఈరికలు
అమ్ముల పొదిలో అస్త్రాల్లా మనసులో సిద్ధంగా
ఇవి ఉపయోగంలో బయటపడతాయి అవసరాలలోనే.

ఏదీ పాతబడదు, బహిష్కృతం కాదు
మరపున బడదేదీ! రణంలో స్వచ్ఛత ఎక్కడిది?

వాస్తవాన్ని వదలి స్వప్నాన్ని స్వర్గాన్ని ఎవరు నమ్ముకునేరు?
అన్నీ ఎక్కడి వక్కడ జారి పోయేవే! మబ్బుల్లా
మనిషి అనడంతోనే! విభేదాలు! వేరు వేరు దారులు
గమ్యం వేరయి ఆదర్శం భిన్నమయి నడతలు వేరవుతాయి

జ్ఞాపకాలు నిరంతరం! జలధి అలల్లా మనసులో
మనసుకు విరామం లేదు, గాఢమైన నిదుర తప్ప!

వర్తమాన క్రియలో పరివర్తనలో బ్రతుకులు
మంచులా కరగుతూ కదలుతూ ఊపిరితో
పయనిస్తూ పోయేను! ఆటుపోట్లు విషమస్థితులు
మనుషులపై బరువులు వదలుతూ! మనుషులు!

మనిషి తోడుగా మనిషి! స్వేచ్ఛ కయి పోరాటంలో
మనిషి వెంట మనిషి మేలు కయి ఆరాటంలో
కనిపించని రహస్యాలు తెలుసుకొనే ఆలోచనతో
మనిషిపై దృష్టితో! మట్టిని వదలని బ్రతుకులతో

8. దేని అస్తిత దానిదే

వెలుగులో పక్కనే ఉన్న నా నీడను చూస్తే
నన్ను తన బుజాలపయి మోస్తూ ఉన్నట్లు ఉంటుంది
పైకి చూస్తే చోటు నుండి చోటుకు ద్రిమ్మరుల వలె మబ్బులు
కిందికి చూస్తే చెదరని ఆశతో నన్ను అంటుకోనీ నీడలు

రాత్రులు భూమిపై కన్న గగనం వైపునే చూపులు
ఒంటరి తనంలో చుక్కలు సమూహ బంధాన్ని తలపిస్తాయి
ధైర్యాన్ని పదిల పరచే స్థితిని చేకూరుస్తాయి
వెన్నెలలో మబ్బులు అమరనాథ్ యాత్రికుల్ని బింబిస్తాయి

ప్రజలు వెళ్ళే దారి వెలుగులో ఎందరికో నేస్తం
ఎవరికీ శత్రువు కాదు, ఎందరినో కలుపుతుంది
నిశ్శబ్దంలో ఏదో వాద్య విశేషం సన్నగ వినిపిస్తుంది
ఎవరి కిష్టమయింది వారు పొందేరు మనోజగంలో

ఇది జీవన నేపథ్యంలో వినిపించే అంతరంగ నాదం
కాలానిదా? మానవ చేతనదా? బ్రతుకులో ఆశదా?

వేణువును ఊదితే సితారను మీటితే
స్వర ధునిలో మనసు తేలుతుంది నావలా
దీనికి తోడుగ రాత్రులు గగనంలో చంద్రుడు!
నాలో భయ స్థానంలో ప్రేమను నిలిపేను

ఏడు రంగులు కాదని ఒకే రంగు కోరేరా?
ఆరు రుతువులు కాదని ఒకే రుతువు కోరేరా?

చిన్న చిన్న చెరువులు పూడ్చివేసి
ఒకే పెద్ద చెరువు తలచేరా?
దారులన్ని మూసి వేసి ఒకే దారి నిలిపేరా?
నక్షత్రాల్ని కలిపి రాశిచేసి
ఒకటిగ నిలిపేరా? పెద్ద వెలుగును పొందేరా?
ఇవి ఆలోచనలో జరిగేవి! కల్పనలో అందమైనవి.

వాస్తవానుభవంలో ప్రతిదీ దేని అస్తిత దానిదే
సందర్భాన్ని బట్టి ఏర్పడేవి తప్పనివీ బ్రతుకులో
దేని స్థానం దానిది దేని ప్రయోజనం దానిది
దేని కది కలిగి ఉండడంలోనే సమాజరూపం.

9. నిలుస్తాయి దొరకుతాయి

కవితలో అర్థం ఒకరి కొక విధంగా మెరుస్తుంది
అందరిలో స్పందన ఒకటే, అభివ్యక్తి ముఖాలు వేరు
ప్రభావ క్షేత్రాలు వేరు, ప్రయోజన దిశలు వేరు
ఆలోచనలెన్ని రీతులో! ప్రకటనలన్ని తీరులు

విప్పారే రేకుల వలె ఒకటొకటీ అమరి
పద్మానికి ఆకృతి వలె రచనకు పూర్ణత నిస్తాయి

కవితలో కనబడేది కవి ధరించే పాత్రలో
ముందుకు వచ్చేది! మరో రూపం మాత్రమే
కవిలో అసలు మనిషి! సాధారణ వ్యక్తిత్వంతో
ఒదిగి పోయి! నేపథ్యంలో పరిశీలన కందుతుంది!

మనిషి చర్యలు జంతువుల చేష్టల్ని తపించినా
చివరకు మానవ రేఖలతోనే పరిసమాప్త మవుతుంది

పుటక నుండి 'నేను' తో ఎదుగుతుంది జీవితం
శాఖలుగా విస్తరించి తరువయి సమాజమయమవుతుంది

చీకటిలో నలువైపుల కావలసింది వెదకి
వెలుగులోకి తెచ్చే ఆర్భాటం! ఇంతానా? అంతానా?
చిన్న వెలుగు దివ్వెతోనో! టార్చ్ లైట్‌తోనో
తేలికగా బయటికి చూపే అవకాశం ఉంది

మనిషి మనసు తాత్కాలికమైన పాత్రలో
నటనలో కళతో అది! నిజమనిపించేను!

హృదయం నిశ్శబ్దంగా ఉండదు, ఉండలేదు
మోదాన్ని ఖేదాన్ని వహిస్తూ ప్రాణాన్ని నిలుపుతుంది

రాత్రి గగనంలో మెరసే చుక్కలు
ఉదయం కవితలో అక్షరాలయి నిలుస్తాయి
అదే గగనంలో తిరిగే మబ్బులు
శబ్దంలో దిగుతాయి, భావంలో కదలుతాయి

సమాజ గమనంలో ఎదురుపడే జీవన దృశ్యాలు
కాలంపై కవితలో నిలుస్తాయి మనిషికి దొరకుతాయి!

10. అందరికీ స్వాగతం

నిన్న పచ్చని చెట్టు కింద ఉన్న ప్రాణులు మాయమయి
నేడు దాని నీడలో అగ్నులు నిర్భయంగా వెలిగేను

అశాంతి సమాజంలో చెలరేగే అనల దృశ్యాన్ని
కరుణ జలంతో శమింప జేయడమే కర్తవ్యం.

ప్రశ్నలతో సిద్ధంగా ఉంటారు! ఎందరో
కోరే జవాబు వచ్చేది, ఏ కొందరి నుండో!

వర్తమాన మింత భీకర బీభత్సమా? అనిపిస్తుంది
వెనక్కి పడబోయే అడుగు ముందుకే పడుతుంది

దూరంనుండి వినిపించే ఆర్త స్వరం
ప్రాణ హరణం లోనిదా? ప్రాణ రక్షణ కోసమా?
మనిషి హృదయం ఎక్కడున్నా ఆలకిస్తుంది
ఇపుడు కావలసింది అనుభవంలో మానవ గీతయే!

జీవితమంటే కల్పన నుండి వాస్తవానికి దిగడమే
విజయం ఓటమి స్థితుల ప్రసక్తి లేదు
వెలుగు చీకటి గదులను దాటడమే.

కవిత చదివాక ప్రభావ మహిత మయి అస్తిత
వానకు తడిసి శుభ్రమై పల్చని ఎండలో మెరిసే
పచ్చని చెట్టులా మనసు తేట తెల్లమవుతుంది
మనసులో నిద్రించే కాలం మేల్కొనడమొక వరం

కవితా దాహానికి నదులలో నీరు చాలదు
అందుకని కవితయే నదియై ప్రవహిస్తుంది
కవిత్వ పయనానికి ఉన్న క్షేత్రం చాలదు
అందుకని కవితయే సమాజమయి పోతుంది

కవిత! దేని ప్రతిఫలనం కాదు, సర్వ స్వతంత్రం
ఇది దేని ఛాయ కాదు; తన దయిన స్వేచ్ఛారూపం.

అన్నిటినీ కలుపుకొని ప్రజాస్వామ్య హృదయంతో
రూపొందేను, ఉత్తమ జీవన సంస్కృతి సందేశం

కోట గోడ తొలగిన విశాలా వరణంతో మనస్సు
అందరికీ స్వాగతమిచ్చే సమ సమాజ ప్రేరణం

11. కవితలో ఆప్తంగా

ఇది జీవితం ఎన్నికల సమయంలో రణ సమం
కలహ కాండలో దూషణ పర్వంతో రాజకీయ బీభత్సం
సంక్షుబ్ధ స్థితిలో విషమ వికల సమాజ దృశ్యం
కాల దర్పణంలో వర్తమానం కదలుతూంది కవితయై.

లిప్తలు కదలేను వడివడిగా వేడిగా వేడిగా
నేతల నుండి వికారాల చేష్టలతో చర్యలతో

లేవగనే ఆరోజు ఉదయం! అంతా కొత్తగ కనిపించేను
నిన్నటి వ్యవహారం నేడు! గుర్తు పట్టరాని మార్పులతో

రాత్రి కలలో తడిసిన కల్పనలు
ఉదయం మెలకువలో పచ్చదనం పొందాలనీ
అద్దంలో కనిపించే ఎడారి ముఖం తొలగి
పూలతో నవ వికాస వనం చూడాలనీ!

ఆరోజు బుజాన నిచ్చెనతో కదలి
నింగి నందుకోవాలని! దిశలు చుట్టి రావాలని!

నడకలో మైలురాయి వద్ద నిలిచి
ఎంత దూరమైనా ఇంతే కదా! అనుకొని
రాయి తరువాత రాయి చూడడమేగా అని
అచటనే! నిలిచి పోయే వారెందరో?

అహంకార విస్ఫోటంలో ప్రభుత జ్వలించే స్థితిలో
పట్టపగలు ధూమంతో చీకటి దిగినట్లు ఉంది

ఒకరిపై ఒకరు చిమ్మే కఠిన శత్రుభావ స్వరం
బాకులా దిగేను కత్తిలా కోసేను తూటాలా దూసేను

స్వరంలో జంతువుల ధ్వనులు కొత్త కాదు
అపుడపుడూ మనిషి స్వరం ఉనికి కయి విరామం!

నిజమయిన శాంతి ఎక్కడుంది? ఏకాంతంలోనా?
మనిషితో మనిషిలో శుభ్రమయిన మనో జగంలోనా?

చీకటి అయినా శాంతికి! రాత్రే నయమనిపిస్తుంది
సంక్షుబ్ధ స్థితిలో దొరుకుతుంది కవితలో ఆప్తంగా

12. భవితకు సూచన

ఇంద్ర ధనుసు జారిపడి ముక్కలయి చెదరిన దృశ్యం
సమాజ రూప మింత తొందరగా శిథిలమయ్యేనా? అనిపిస్తుంది

క్షత గాత్రులు వికలాంగులు మారణ ముద్రలతో
ఇది శ్మశాన స్థలం కాదు, సమాధి భూమి కాదు
ఎరుపు నుండి నలుపులోకి తరలేను జీవితాలు
అవలీలగ చేరతాయి విషాద వలయంలోకి

తరాలు మారినా యుగాలు గడచినా
వీడని రణ ఛాయా పాత్రలు! అహంకార వేదిపై

అగ్నులు చల్లారినా తాపం మిగిలిపోయి
ఓదార్చే వారెవరు? ఆదుకునే వారెవరు?
ఇది మృత్యువు రాక ఎంత సులభమో తెలుపుతూంది
సుఖ సంతోషా లెంత కష్టమో తెలుపుతూంది

నిజమయిన శాంతి ఎక్కడుంది? వెదకేరా?
మనిషితో మనుషుల మధ్య స్వచ్ఛమయిన సమాజంలో

కళ్ళ ముందు రోడ్డు పయి నెత్తురు చిత్రాల మధ్య
'శాంతి' మారు వేషంలో చాటుమాటుగ తిరుగుతూంది

'నిజం' నిప్పే కాదు ఎప్పటికీ, అందమయిన కుసుమం కావచ్చు
విలువయిన వజ్రం కావచ్చు శ్రమజల కణం కావచ్చు

ఉన్నస్థితి చిలకలానో పావురంలానో ఉండాలనీ
అది బొగ్గు కణమై మసి అంటించవచ్చుననీ
అది నిప్పు రవ్వై గాయపరచనూ వచ్చుననీ
సమాజ మెదురు చూస్తుంది! అన్నిటికీ కవితలో

గగనం వైపు చూస్తే ఎక్కడో కదలే మేఘుం
మనిషిని పలకరిస్తుంది, కవితను పలికిస్తుంది

సంక్షోభంలోను దారిన వెళ్ళే మనిషిని చూస్తే
ముఖాన వేలాడే ఆశారూపం కనిపిస్తుంది
అనల కీలలపై నుండి ప్రవహించే కవిత
బూది పొరల్ని తరలిస్తూ సమాజ భవితను సూచిస్తుంది

13. జ్ఞాపకాలు

ఇంటి ముందు చెట్టు సన్మిత్రంలా ఎన్నో జ్ఞాపకం చేస్తుంది
ప్రకృతి బంధువు కవిత! సమాజ దృశ్యం పలుకుతుంది

మనశ్శిఖర తలం నుండి కవిత జలపాతంలా
జారుతుంది నదియై బ్రతుకులో పచ్చదనం పరుస్తుంది

కళ్ళలో తిష్ఠ వేసిన నిద్రను వదిలిస్తుంది
కొత్త అనుభవ చిత్రం శబ్దంలో ప్రకటిస్తుంది
కవితలో సమాజ దార్శనికంతో ప్రపంచం
మంచు తెరలు తొలగి సూర్యరశ్మి పొందుతుంది

చుట్టు చీకటి ముసరినా చంద్రుడు కన్నీరు కార్చడు
చుక్కల మధ్య ధైర్యంగా సంతోషంగా కాలం గడిపేను
సమయ తంత్రులపై మీటిన సమాజ ధ్వని చిత్రం
వినేవారు ఉన్నా లేకపోయినా వినిపించే వాద్యం కవిత!

ఆకాశం వైపు చూస్తే చూపుకు హద్దులు కనిపించవు
భూమివైపు చూస్తే ఎక్కడికక్కడ హద్దులు కనిపించేను
భూమిపై జీవితమొక సుందర వాస్తవ లోకం
శ్రమ జీవన రూపాలకు వికాస నిలయం!

చార్మినార్ నాల్గు పాదాల రుబాయిని తలపిస్తుంది
మ్యూజియంలో అపూర్వ వస్తువులు చూస్తూ నడుస్తూ ఉంటే
మనిషికి తన విశేష శక్తి వికాసం దృశ్యమానవుతుంది.

పచ్చదనం మధ్య పబ్లిక్ గార్డెన్‌లో పూల మధ్య
జీవన రహస్య మొకటొకటి బయటపడుతుంది
ఇది వివిధ భావ వర్ణ సమాజ చిహ్నమై ఆకర్షిస్తుంది.
జ్ఞాపకాలు మనసు నెటు తీసుకొని వెళ్ళేదీ తెలియదు

అరణ్యంలో వదలవచ్చు మబ్బులలో తిప్పవచ్చు
నగరంలో నడిపించవచ్చు ఊరులోకి చేర్చవచ్చు
గీష్మతాండవాన్ని చూపవచ్చు, వసంత హృదయం విప్పవచ్చు

క్షణాలు నాణేల వలె చెల్లుబడిలో
బ్రతుకు విలువను పెంచేను
మౌన శిలల్ని మాట లాడిస్తాయి
మనిషికి తన చరిత్రను మెరపిస్తాయి!

14. ఆయుధ ముఖం కుసుమిస్తూ

పగలు అయితే సమాజ బంధువయి
రాత్రి అయితే ప్రకృతి మిత్రమయి
నాలో కవిత! కాలానికి బింబమయి
చీకటి మాత్రం! ఒక విరామ సమయం

ఎగసి తరలే అలల ఉద్వేగంతో
పండే పంటల జీవన రుచులతో
ప్రవహించే నదిలా వాస్తవ చరిత్ర
గతం భవిత క్షణాల మధ్య వర్తమానం

మేఘం మాట్లాడుతుంది మేడతో గుడిసెతో
ఆర్ద్రంగా చినుకుల మాటలతో ప్రేమగా
సృష్టికి కారణమేదో అదే సమాజ కవితలో
అక్షర గతిలో జన హృదయ మనోజ్ఞమయి

అరణి నుండి అగ్నిలా
మనో భవం! కవిత అందరిదీ
ఇది జీవిత గాథలతో
గడచే సంస్కృతి సంపుటి

చీకటిలో దారి చూపుతుంది
గీసిన అగ్గిపుల్ల వెలుగులా కవిత
లక్ష్యం నిర్దిష్టమయి గమ్యం చేరేవరకు
జ్వాలయై దీపమై కిరణమై అనుసరిస్తుంది

కనిపించే చెట్టు కొమ్మలు ఎండి పోవచ్చు
లోన భూమిలో కనిపించని మూలం భద్రంగా

వితరణలో చెట్టువలె ఉదారతలో నదివలె
దానంలో మేఘంవలె జీవన స్పందనలో కవిత
వివిధ స్థాయిలలో శ్రమ రూపాలతో
లోపల వెలుపల సమాజ భూమికతో జీవితాలు

క్షేత్రం నుండి యంత్రం వరకు! ఆశాహృదయంతో కవిత
నాగలి మొన చివురిస్తూ, ఆయుధ ముఖం కుసుమిస్తూ!

15. కవితలో భద్రంగా

మళ్లె పాదులో చల్లదనానికో దొరికే ఆహారానికో
రాత్రి చేరి హాయిగ చుట్టుకున్న సర్పాన్ని చూచి
ఉదయం భయంతో మళ్లె చెట్టును తొలగించేరా?
ముంగిలిలో ఆకురాలి కొమ్మలెండిన చెట్టును నరికేరా?

గమ్యం చేరేందుకు దారులెన్నో తన చుట్టు
ఒక దారి చాలునని మిగిలిన దారులు మూసేసేరా?

కిరణ రేఖలతోనే కవిత రూప మేర్పడుతుంది
రేఖల మధ్య వెన్నెల కాయవచ్చు, చీకటి చేరవచ్చు
ఎప్పటికపుడు మంచి చెడు మిశ్రమంతో జీవితం
కవితలోను ఉదయంతో వెన్నెల చీకటికి చోటు

భూమి భాగ్యాన్ని కాపాడుతుంది వర్షామేఘం
మనిషి కలను సాకారం చేస్తుంది! శ్రమరూపం
సంఘంలో ప్రజల నాడి తెలిసి స్పందించేది
గొప్ప కవులో! మహానేతలో! దార్శనికులో!

శరీర కష్టంతో పాటు మేధస్సు ప్రకాశంతో
శ్రమ సుందరతలు మనుగడలకు పూర్ణత కూర్చేను
ప్రకృతిలో పచ్చదనంవలె మనిషిలో మంచితనం
మబ్బులో నీరు లాగ హృదిలో కరుణోదారత

ఆరవేసిన వస్త్రం తడి ఉన్నంతవరకు
ఆరు బయట భద్రంగా తాడుకు హత్తుకొనీ
ఎండకు ఎండి ఆరి తేలికయై జారిపోవచ్చు
గాలికి ఎగిరి దూరంగా వెళ్ళిపోవచ్చు

బయట ఉన్న మనిషితో మాట్లాడే సందర్భం లేకపోవచ్చు
లోన ఉన్న మనిషితో మాట్లాడే సందర్భం ఎప్పటికీ ఉంటుంది

రుతువు తరువాత రుతువు రాకతో మార్పు
జీవన గమనంలో వలె, కవితలోను నిరంతరం

తెలిసో తెలియకో చిన్ని మచ్చలేని బ్రతుకు లేదు
పరిసరాల ప్రభావంలో ధూళికణం లేని వేళ లేదు
గడచే కాలంలో సందర్భం ఆనవాలు
కాలాని కతీతంగా కవితలో భద్రంగా.

16. ఏదయినా కావచ్చు

స్పష్టంగానో అస్పష్టంగానో అక్షర ప్రకటనలో
దార్శనిక స్పృహ లేంది గొప్ప కవిత అవదు
మెరసే స్వర్ణ ప్రతిమ వలె ఎదురుగ ఆదర్శం
పగిలే మట్టి బొమ్మ అవడం, ఇష్టం కాదెవరికీ!

మేఘంలో జలంవలె ధారలో విద్యుత్తు వలె
సుప్తంగానో గుప్తంగానో ఉంది బయట పడేను.

విత్తులో పచ్చని చెట్టు కల వలె
వర్తమాన లిప్తలో భవితతో జీవితం.

అక్షర పంక్తిలో కవితలవలె కాలరేఖపై బ్రతుకులు
కష్టాల్ని సహిస్తూ బాధల్ని భరిస్తూ రూపొందేను
అనుభవంలో దేనికది ప్రత్యేకం సంస్కారంతో
ఎవరి వేదనాలోకం వారిది వాస్తవ గతిలో

తన కోసమే అయినా దీపం వెలుతురు
ప్రసరించినంత వరకెందరికో ఉపయోగం!
ఎవరు కోరినా కోరకపోయినా లభిస్తుంది
సమాజ ప్రయోజనానికి సరిగా సరిపోతుంది

వెలుగును కప్పేసే ఆలోచన సంకుచితం
ఇది కొందరిలో మితమయిన సొంత విషయం.

పొయిలో అగ్ని! అంతవరకు హద్దులో మితం
అది ఎగసి బయట పడితే! చుట్టు భస్మవేదియే.

సృజనలో మానసికానికి ప్రాధాన్యం విశిష్టమైంది
ఇష్టానిష్టాలతో ప్రశంసలు విమర్శలు! స్వేచ్ఛగా
మూతపడిన కళ్లను తెరపించవచ్చు
దాగిన దృష్టిని బయటికి రప్పించవచ్చు

వానలో తడవని తనువులు లేవు, ఊహ చివురు వేస్తుంది
కవితలో మునగని మనుషులు లేరు, మనసు పూలు పూస్తుంది
కవితకు ఆధారం సందర్భం, ఖడ్గం కావచ్చు
ఊహకు ప్రాణం అనుభవగుణం, విషమం కావచ్చు.

లోతు తెలియని జలధిని దాటించే పడవ కవిత
తీరాన స్వాగతం పలికి ఆదరించే ముఖం కయి చూచేను.

17. ఫోటో ఆల్బంలో చోటుకయి

పొలం గట్టుపైనో చెరువు కట్టపైనో
శిలా మౌన ముఖంతో నడచే హాలిక దృశ్యం!
గట్టు నుండి నీటిపై చెట్టు నీడలో
కలిసిన మనిషి ఆకృతి గుర్తు పట్ట లేకుండా

అసలు మనిషి రూపమేదో! తెలియడం లేదు
కంటికి కనిపించేదే 'నిజ' మనుకోవాలా?
నాటకంలో వేషంతో సమయం గడచిపోతుంది
సందర్భానికి తగిన మార్పులతో చతురత రాణిస్తుంది.

బ్రతుకంటే వ్యాపారానికి పర్యాయ పదమవుతూంది
భోగాలకు సుందర వ్యాఖ్యాన విశేష మవుతూంది
వేదికపై మేకప్‌లో గ్లామర్‌తో ముంగురులపై వేళ్ళతో
పాలకుల యశో గానంతో కవులు! తన్మయత పొందేరు

నాలుగు గోడల మధ్య కుండిలో ప్లాస్టిక్ మొక్కలతో
కాలక్షేపంలో నేతలు! తిరిగే గానుగ బ్రతుకులతో

ఎవరి చేతులపై నుండో పూల చెండులా సోఫాలో పడి
బాధ్యతలకు దూరంగా విరామ వ్యాపకాన్ని వరించేరు
రెండు చేతులు రెక్కలుగా మారి భవితలోకి
దూసుకపోయే కోరికతో ఆశావహులు!

తమ సైజుకు మించిన పదవుల డ్రెస్‌లతో
సరికొత్తగ హేతువుకందని శిఖరాలను చేరాలనీ
పయనంలో మైలురాయి చేరిన స్థితిలో
ఉత్సవ కళలో మునిగి లక్ష్యం మరచేరు.

వాహనం ముందు 'ప్రగతి', వెనక 'శాంతి' లేబుల్‌తో
లోన ఆయుధాల పేటి సీలు వేయబడీ
ఇది కొత్త చరిత్రకు ప్రవేశిక అనుకునేవారూ
కలల సమాజానికి దగ్గరగా తలచేవారూ

అలజడి ఆందోళన లేకుండా రోజు గడచేట్లు లేదు
అస్థిరత నిరాశలో యువత హనన క్రియా చరణంలో
ఇది వర్తమాన జీవన రూపానికి ఒక పార్శ్వం!
ఇపుడు కోరేది! ఫొటో ఆల్బంలో చేరడమొకటే!

18. క్షంతవ్యం కాదు

కుల మతాల కతీత మయిన మానవ సంబంధం ప్రేమ
రోజులు గడచే కొద్దీ విలువలు పెరిగేను, కొత్తదనంతో
ప్రతి క్షణమొక కుసుమంలా చిర రోచిష వజ్రంలా
మరొకరికి పూర్తిగ తెలియని మానస నిజ రూపం.

తల ఎత్తుకొనీ ఎద ఆర్ద్రంగా ఆలోచన మబ్బులా
ఎవరికీ అందని ఎత్తులో అస్తిత చేకూరుతుంది

మస్తిష్కం కన్న హృదయం తన విభుతను నెరపుతుంది
తన కొక తలతో పాటు హృదయ విశేషం తెలుస్తుంది
సరికొత్త వ్యాఖ్యతో సందర్భం ఎవరినయిన ఎదిరిస్తుంది
ఇది లౌకిక వేష భూషలకు ఒదగని ప్రేమ మనోజగం

ఇది స్వేచ్ఛా గతిరూపం! భౌమానికి కాస్త ఎత్తులో పయనం
ఇనుప ముళ్ల కంచెతో నియతం చేయబడదు
బరువను కున్న బ్రతుకు! తేలిక పడినట్లుగ ఉంటుంది.

ఇది జీవితం! కలహాల కన్నా స్నేహ సుందరతలకు ప్రాధాన్యం
పిడుగులా ఆపద పైన బడినా వర్షంతో సంతోషం కలిగేననే

సంఘంలో యువత నవ వికాస కళికలు
ప్రేమ ఎవరి దయను కోరదు, దరి చేరదు
సమాజమంటే ఎడారికాదు, రణరంగం కాదు
ప్రేమికుల్ని సమాదరించడమొక పవిత్ర కర్తవ్యం!

ఎదురుగ స్వాగత తోరణమొక మానవ సౌభాగ్యం
విషాద ఛాయావృత మవడం సమాజ దౌర్భాగ్యం

మానవ బంధాలతో కుటుంబ బంధుత నిలయంలో
వెలుతురు చువ్వల బోనులా ఉన్న గది! ఖైదు సమం

వెలుగులోను మసిబట్టిన అద్దంలో ఆకృతి కనిపించేనా?
వ్యక్తి స్వేచ్ఛకు అవరోధం 'పరువు' ఆపదలను విసరేను

తనలో ఉద్రేకానికి ప్రేరణ గుణ మయి
అభిమాన వశంలో ప్రతిష్ఠరూపం
నిప్పులు చిమ్మితే! విషం ఒలికితే
మారక పరిణామం క్షంతవ్యం కాదు.

19. తన వాద్య విశేషంతో

అభిలాషలెన్ని విధాలో అభిరుచులన్ని తీరులు
కెరటం వలె కదలుతుంది భావన
పూవు వలె విప్పారుతుంది అర్థం
కిరణం వలె కవిత! ఉత్తేజ పరుస్తుంది.

విసరిన రాయికి పగిలిన అద్దంలా
ముక్కలుగా చెదరిన బ్రతుకులు
సమయం సంక్షుబ్ధ దృశ్యానికి ఆశ్రయమయి
మనిషినుండి వికార రూపం విడుదలవుతుంది.

అద్దంలో కనిపించే దేహంపై గాయాలకు
మందు రాస్తే! చికిత్స జరిగినట్లేనా?
విపరీత చర్యలొకటొకటి జీవన గతిలో
మౌనాన్ని పలికించేను, మనసును కదలించేను.

హింసచే ఆత్మహత్యచే సమస్య తీరదు
హంతకుని బుద్ధి గ్రీష్మంలో అగ్ని శిఖలా
హతుని మనసు ఆతపంలో ఎడారిలా
పోయిన ప్రాణం తిరిగి రాదని తెలిసిందే.

మూలంలో సృజన కణంతో
ఎండిన కొమ్మలు! చివురిస్తాయి
దీనికి ఆలన పాలన వాతావరణ మవసరం
అనుమానం ఆగ్రహం అవివేకం మానసికాలు!

చీకటి ముఖంలో నవ్వువలె
వెలిగే బల్బు వెలుగు! పరిమితం

మనిషి పరిచయంతో తెరచిన కిటికితో
ముఖంలో వెలుగు మనోరూపం ప్రతిఫలిస్తుంది.

మోదం భేదం ఉల్లాసం ఉత్తేజం ప్రకృతి వికృతి
శబ్దంలో మూటగ అందిస్తుంది కవిత
వెనకనే! సమాజ విభాగాలు! ఇంజన్‌కు బోగీలు!
స్వేచ్ఛా కవితలో విరిసిన జీవన రూపం వేరు కాదు

ఈ సృజనకు ఏ వాద్య సహకారమక్కరలేదు
ప్రతి మార్పులో అదే! తన వాద్య విశేషం పలుకుతుంది.

20. రేఖా చిత్రం

'నేను' అన్న మాట జీవన రూపానికి మూలం
అణువు నుండి విశ్వానికి ప్రత్యక్షంగా
ఊహనుండి అనుభవంలో పరోక్షంగా
విస్తరించిన ప్రయాణ రూపం! కవిత

ఎండను మంచును వానను వహిస్తుంది భూమి
సహించలేని మనిషి! ఏదో సాధనాన్ని ఆశ్రయించేను
అతృప్తి నిరాశ ఓటమి ప్రభావాల ఒత్తిడికి
లొంగిన మనస్సు! ఏ చర్యకయిన సంసిద్ధమవుతుంది.

నదిపై వంతెన! కొన్ని చోట్ల మాత్రమే లభిస్తుంది.
బ్రతుకులోను సమస్యను దాటేందుకు వీలుగా
కొత్త సమాజం గురించి మనసులో ఆలోచన
దుస్తులు మార్చినంత సులభం కాదు! పరివర్తనం.

సందర్భం రమ్మన మన్నపుడు వచ్చేది కాదు
అందుకు సమయమెవరి కోసమూ వేచి ఉండదు
నిష్క్రియలో సమస్యకు పరిష్కృతి లేదు
శిక్షతో నేరం! మళ్ళీ జరగదని ఎవరూ చెప్పలేరు

కదలే లిప్తలో అడుగులు వేస్తూ పోవడమే
వెనక్కి మరలే ప్రశ్నలేదు, ఆగడమూ లేదు

పరిసరాలలో వినిపించే ఆర్కెస్ట్రాలో
ఒకరికిష్టమయిన వాద్యమొకటే ఉండదు.

ప్రేమ ద్వేషం స్నేహం వైరం సహనం కలహం
ఎన్ని మనోభావాలో! ఎన్నుకొనే స్వేచ్ఛ ఉంది
ఏ క్షణంలో మనసు ఎటు మరలేదీ తెలియదు
ఏ గమ్యం కోరేదీ పొందేదీ ముందుగ తెలియదు

భేదం కలహం పీడన హింసలు ఎక్కడయినా ఒకటే
మానసిక వికారాలకు కాలం స్థలంతో పనిలేదు

అనుకోకుండా జ్వాలా కవాటం తెరవబడీ
పైనుండి కావలసిన నీలిమబ్బు వెడలవచ్చు

రావలసిన మార్పుకు దారి చూపుతుంది కవిత
వర్తమాన సమాజ గతికి రేఖా చిత్రమవుతుంది.

21. మహానదిలా మానవం

సమాజ కిరణ స్పర్శతో ఉత్తేజం పొందేను వ్యక్తి
స్వేచ్ఛలో కవిత! హక్కులతో బాధ్యతల్ని వరింప చేస్తుంది
విశాల మయిన శ్రమ జీవన సంకేత సమాజంలో
సుందరతను ప్రకటిస్తూ పరిమళాన్ని వదలుతుంది

మానవతను వెన్నలాగ తీసి హృదికి అందిస్తుంది
మనిషి స్థాయి పెంచుతుంది సంస్కార విశేషంగా
అస్తితలో కళా కమనీయం వెనుక నుండి ప్రయోజనం
అక్షర వాహనంపై మనసు నుండి మనసుకు పయనం

దట్టమయిన అడవిలో భయదమయిన స్థితిలో
చెట్ల కొమ్మల సందు నుండి కిరణం! ప్రసరిస్తుంది
మనసుకు కావలసిన ఆశా రూపాన్ని ఇస్తుంది
పయనం సాగుతుంది ముందుకు నిరంతరాయంగా

దిగులు నుండి బాధ నుండి ముక్తం చేస్తుంది
వివిధ దశలలో పొందిన వికాసాన్ని నిలుపుతుంది
ఆశకు అంతం లేదు, కలలకు ముగింపు లేదు
మోదాన్ని ఖేదాన్ని వహిస్తుంది అలవోకగా

ఊహలతో అనుభవాల సంకలనం జీవితం
ఒకరితో మరొకరికి పోలిక కుదరదు స్వతంత్రమై
ఎవరిదారి వారిది అయినా సమాజ సంబంధం ఒకటే

నిప్పు నీరు గాలి మట్టితో బ్రతుకులు
ఇవి కలిసిన సుందర వాతావరణానికి యత్నాలు
జరుగుతూనే! ఎప్పటినుండో ఇప్పటికీ భవితకయి!
కవితలో గతం! నేపథ్యంలో పాత్ర నిర్వహిస్తుంది
గమ్యానికి వర్తమానం మనసును సిద్ధం చేస్తుంది!
మంచి భవిత పయి ఆశతో! వర్తమాన వేదిపై
సమాజం నుండి తప్పుకోలేని అల్లికలో బ్రతుకులు

మనిషినీ జీవితాన్ని పరిచయం చేస్తుంది కవిత
ప్రగతికి దార్శనికంతో ఆదర్శరూపమిస్తుంది నవత
కవితలో మానవత గడ్డ కడితే ప్రమాదం!
మహానదిలా మానవం సరిస్తూ ఉండవలసిందే

22. ఉత్ప్రేరణం

రాత్రి ఇచ్చే నిశ్శబ్ద సందేశం
మనసుకు విరామాన్ని గుర్తు చేస్తుంది
రాత్రి చూపే చీకటి నివేశనం
మనసులోని వెలుతురు ముఖాన్ని తలపిస్తుంది.

బయటినుండి మాటలు అరపులు
ప్రభావం పొందని రాత్రి! లేదనిపిస్తుంది
దూరం నుండి ఉత్సుకత కలిగించవచ్చు
దగ్గర నుండి చిరాకు పుట్టించవచ్చు

కొండ పయి నిలిపిన దేవతల్ని చూచేందుకు
శ్రమతో మనుషులు! మెట్ల పయి కష్టపడుతూ
విశ్వాస మెంతటి బాధనయినా సహింపజేస్తుంది
సుఖకర సుందరతర భవితకయి! ఏమయినా చేయిస్తుంది.

కోర్కెలు వినతులు కోకొల్లలుగా
పచ్చని ఆకులవలె గడ్డి పరకల వలె
గాలిలో ఎగురుతూ తేలుతూ చేరేనా?
భగ్నమయిన శాంతి సుస్థితిని పొందేనా?

పగలయినా రాత్రి అయినా ఒకటే, భేదం లేదు
కష్టాలకు వెనకాడని అడుగులు ముందునకే!
తమ తమ కోర్కెలు తీరడ మొకటే! ఆలోచనలో
అవి స్మృతిలో రమణీయమైన అనుభవాలుగా

వేగంలో వెలుతురులా చీకటి పయనించలేదు
చివరి కోరిక అంటూ లేదు ఉంటే! ఆయువుకు సమాప్తియే

అభిరుచి ఉత్సాహం స్పందన అభిలాషలతో
ఎప్పటి కపుడు మార్పులలో నడతలలో కొత్త కవిత
పీడనలో ఆర్తిలో విషమతలో బాధలలో
పరవశతకు బదులు ఉత్ప్రేరణ గుణంతో

సమాజ జీవన చింతనలో సమస్య పరిష్కారంలో
సృజన ఇపుడు మానసతలంపై సంస్కరణ పథంలో
వికాస చరిత్రకు విపులత చేకూర్చేను
జీవన భాగ్యానికి వివిధత సమకూర్చేను.

23. సమయానికి తగింది

భూమిపై రాకతో మొదలయిన జీవితం
కల్పనలో తేలుతుంది ఊహ మొదటినుండి

కాలంతో వచ్చే మార్పులతో దశలు తెలిసినవే
బ్రతుకులో ముందుగ తెలియని విషమస్థితులెన్నో

మనిషి మనిషితో పరిచయం ఒక్కొక రంగులో
ఎప్పటికపుడు మారుతుంది రంగుల కలయిక రూపం
మనిషికీ మనిషికీ భిన్నం! రోజు రోజుకీ విచిత్రం
తన రూపం ఇతరులకే బాగా తెలుసనిపిస్తుంది

పయనంలో తరగలతో ముందుకు కదలే సముద్రం
దాహం వేస్తే ప్రేక్షక పాత్రకు మితమవుతుంది

గగనంలో మేఘం కనిపిస్తుంది ఆశాజనకంగా
మెరపులతో తన రాకను తెలుపుతుంది
గర్జలతో తన ఉనికిని ప్రకటిస్తుంది
చినుకులతో దోసిలిలో నీరు దాహం తీరుస్తుంది
మోడు చివర చివురుతోనే జలద సార్థకం
నిలువ నీరుతోనే ప్రాణికి నిలకడ!

ఊపిరి ఆడేందుకు గది కిటికి తెరవబడి
స్వేచ్ఛగ సాగే గాలితో ప్రాణానికి హాయి!

ప్రకృతి సమాజం చెరొక వైపునుండి అవసరంగా
వివిధ శ్రేణులలో బ్రతుకులను నిలబెట్టే ఆసరాలు

మనిషి అంతరంగంపైకి కనిపించని విశేషం
ప్రవాహంలో విద్యుత్తు వలె ప్రకాశరూపం

ఎదురుగ దప్పిక తీర్చ లేని మహా జలధి
లోనుండి తాపంతో జలదాన్ని వదలుతుంది
భూమి దాహం తీరుతుంది
మనిషి పంట పండుతుంది

దీపం వెలిగేందుకు
పొయి రాజేసేందుకు
ఒక్క అగ్గిపుల్ల చాలు!
సమయానికి తగిన అభినవం

24. విషాదం గతమై

వర్తమానం వడకట్టిన సారం బిందువు వలె క్షణం
కలుపు మొక్కలు తీసిన సస్యక్షేత్రం వలె సమయ సమయం
స్వచ్ఛంగా నిర్దోషంగా రోజు గడపాలనే ఉంటుంది
అంతలోనే పరిసరాలలోని సమాజ ప్రభావం
వ్యక్తిని దోషంలో భాగం చేస్తుంది
అంతరంగ చేతన మరపున బడుతుంది.

శూన్య మనిపించే ఆకాశం భూమి మధ్య ఆకాశం
కదలే మేఘాలతో అలంకృత మవుతుంది
సాగే విమాన యానంలో శబ్దం! ఆకర్షిస్తుంది
ఎగిరే పక్షుల శ్రేణులతో దృశ్యం మారుతుంది
కేకల్ని పిడుగుల్ని మోసుక పోయే గాలి సరేసరి!
రాత్రి అయితే చీకటిలో చంద్రుడు చుక్కల ఆశ్వాసం.

చీకటి సంచి గుహలో ఏముందీ? తెలియదు
ఆయుధం బయట పడవచ్చు, దుస్తులు కనిపించవచ్చు
ఆహారం నిలువలుండవచ్చు, మందుల కిట్ చూడవచ్చు
ఎరుపు రంగులో మెరసే పుస్తకం దొరకవచ్చు

అనల శిఖలతో పొగల సుడులతో
పచ్చని చెట్టమధ్య సందులలో నుండి
తరలే ఉగ్ర వాద తీవ్ర తర చర్యలు
ఆగేది కరుణాకర మేఘజలం లోనే!
ఉన్న వనరులతో ఉదార ప్రయోజనం పొందడం
మాననీయ కోణంలో రాజనీతి అవసరం

దారిన వర్షం వస్తే! ఎండ మండితే
దగ్గరలో మనిషికన్న చేరేది చెట్టు కిందికే
దాగిన బోనులో పడే భయం నీడ వెనకనే
పన్నిన తంత్రంలో చిక్కుకునే! అనుమానం! తనలో
నిన్న తగిలిన గాయం కనబడకుండా కట్టులా
రవి బింబం ఎదురుగ! మంచు తెర కప్పబడీ

అది తొలగే వేళతో విషాదం గత మవుతుంది
అంతా యథాస్థితి! ఎదురుగ మౌన భావ దృశ్యం!

25. ఎక్కడయితేనేం?

ఎవరి జీవితం వారికి ప్రమాణ స్థాయిలో అపూర్వం
నాలుగు దారుల అద్దాల గోడలతో నిజ నిలయం
కొందరిలో తాపసమం ఆవరణం, తమ శక్తిని ప్రకటిస్తూ
చుట్టూ మనుషుల సందడి, తమ అస్తితకు బలమిస్తూ

ఆపై సస్యశ్యామల వనాలతో పాటుగ నిర్మాణాలలెన్నో!
చూపు మేరలో విశాల భావనలో అవి తనవే అనిపిస్తాయి.

ఆకాశం శూన్యం కాదు ఎంతో సంపదతో
రవి శశి తారలు! ప్రాణానికి ఆధారం మబ్బులతో
మట్టిపయి జనన మరణ క్షణాలను కలిపే వంతెన జీవితం
వంతెన క్రింది నుండి ప్రవహించే కాలం! నిరంతరంగా

సంఘం నుండి కవిత వేరు కాదు
ఆలోచనల అనుభవాల సాంద్ర మిశ్రమం
జీవన యానంలో దార్శనిక పథ సూచిక
మానవ వర్తనలో చేతనకు నవ ప్రేరణం.

కదలే భావ జలధి ఉల్బణం అక్షరంలో
సమాజమిస్తుంది వ్యక్తికి విశాలావకాశం
వ్యక్తి సమాజానికిచ్చేను విజ్ఞాన ఫల విశేషం
రెండిటి ప్రభావరూపాల సంగమం జీవితం

అక్షరం అక్షరంలో ప్రాణ వాయు చలనంతో
పదపదంలో ఉదయ కిరణ స్పర్శతో
మారే సమాజ రూపం కవిత, హార్దికం
బ్రతుకులో కళతో దార్శనికం ప్రయోజనం

ఇది దహన హనన కార్యక్రమంలో భాగం కాదు
మృత్యువు తలపుకు రాని అమర యశోరూపం
ఉన్నవి ప్రతిఫలిస్తుంది, భౌతిక మానస దృశ్యంలో
స్వచ్ఛత సుందరతతో ప్రగతికి ప్రాధాన్యంతో

మొదటి ఉదయ కిరణంతో బయటికి రాగానే
పూచిన పూవును పొందేందుకు చాచిన చేయి
అంతలో వెనక్కి! మరలుతుంది, స్వేచ్ఛగా
అది తనదయినపుడు ఎక్కడ ఉంటేనేం? దేశమో! ప్రపంచమో!

26. బంగరు నాణెం

ముందుకు చాచిన చేతులలో భిక్షాపాత్ర
శూన్యమయిన ముఖంతో ఎదురు చూస్తుంది
ఎక్కడేది ఎంత లభిస్తే అదే వరంగా తృప్తితో
జీవన సంస్కృతిలో 'భిక్ష' ఒక భాగమయింది

ఇపుడయితే సామాజిక రాజకీయ క్షేత్రాల వారు
'ఓటు' కయి పదవి కయి వేచి ఉండే వారెందరో!
నీరు లేని చిన్ని చెలమల వలె కొందరు
నడచే ఎండిన కొమ్మల వలె ఎందరో!

ఇన్నిటి మధ్య అన్నిటికీ సమాన దూరంలో
నిజంలో మాగిన పరిణత మతి కవి,
అగ్నికి ఆజ్యం వలె కొందరికి తోచేను
మెరపుతో పిడుగు వలె ఎందరికో తోచేను

సన్యాసానికి దారిద్ర్యానికి నమూనా
ఇంటిముందు నిలిచిన భిక్షువు పాత్రలో
ఆకలి బాపే రూపానికే ప్రాధాన్యం
ఉదారతకూ వితరణకూ వీలును కల్పిస్తుంది

భూమి పయి మట్టి అంటి దోషానికి గురిచేస్తుంది.
దప్పిక తీరే నీరు సాగి దాటరాని నది అవుతుంది
ప్రాణం నిలిపే గాలి తుపానుగ మారి బాధిస్తుంది
అవసరాల కాదుకొనే అగ్ని! దహన తాండవం చేస్తుంది

దరిద్రం ప్రబోధం రెండూ భిక్షు ముద్రలో
అనుకూలానికి అననుకూలానికి అవకాశాలతో

భిక్షువు పాత్రలో బాష్ప కణం జారవచ్చు
భిక్షువు పాత్రలో త్యాగఫలం చూపవచ్చు

ఇంటిముందు వీధిలో స్టేషన్‌లో రైలులో
భిక్షువు! బ్రతుకులో ఖేదం మోదం ఘడియలు!

రాజ్యాలు తొలగినా పాలనలు వేరయినా
దార్శనికంలో మారిన ప్రజాస్వామ్యం లోనూ
భిక్షువు స్థానం ఇప్పటికీ చెదరనిదీ భద్రంగా
సంస్కృతి సంచి నుండి బయటపడే బంగరు నాణెం!

27. అందరిదీ విశ్వమయం

వాహనం పరుగెత్తుతుంది లోన మనిషి అచలంగా
అక్షరంలో కవిత కూడ! అనుభవ యానంలో
స్టేషన్ చేరిన ఏదో రైలు లోకి ప్రవేశించడం జరగదు
'ఎక్కడికి' అనేది ముందుగ మనసులో! లక్షితమవుతుంది.

రైలు ఆగిన ఏ చోటనో దిగడం జరగదు
ఇది ఈనాటి కవితకు బాగా వర్తిస్తుంది
కవిలో ఊహ మనీషతో కళాకృతి పొందుతుంది
మదిలో సృజన చేతన ఉత్సాహం నింపుతుంది

మోదమయినా ఖేదమయినా స్పందన మూలం ఒకటే
విషయం ఏదయినా కవిత! హ్లాద రేఖ నింపుతుంది
ఎంతటి అలజడిలోను బీభత్సం లోను 'ఆశ'
క్రియా శీలంతో మనిషిని ముందుకు నడిపిస్తుంది.

కవి మనసు కూడ అన్నిటినీ వహిస్తుంది సహిస్తుంది
అడుగు ముందుకు వేయడమే తక్షణ కర్తవ్యం
సూది మొనపై విశ్వం ఒదిగి నిలుస్తుంది
బ్రతుకులోని అనుభవం దిశలు స్పృశిస్తుంది.

చీకటిలోనే చంద్రబింబం స్ఫుటంగా కనిపిస్తుంది
వెన్నెలలో శుభ్రమయి హృదయం ఉదయానికి సిద్ధమవుతుంది

అడవిలో హరిణం! గంతులు వేస్తూ ఉత్సాహంగా
గుహ నుండి సింహం! అడుగులు వేస్తూ నిశ్శబ్దంగా

చదువు సంస్కారం పరిసరాలు బ్రతుకు తీరుతో
గుడిసె నుండి సౌధం వరకు ఏదో శ్రేణిలో
ప్రతి వ్యక్తి జీవితంలో మనిషి స్థాయిలో
అస్తిత ఏర్పడుతుంది, అది స్వంతం కచ్చితంగా

వర్తమాన జీవితంలో కలల కవకాశం తక్కువ
వజ్రంలో 'నిజం' కవితలో వివిధ పార్శ్వాలలో
పలు రంగుల ఆకర్షణతో బహు కోణాలలో
ఇది సమాజ బంధుత చేత అందరిదీ! విశ్వమయం.

28. అరచేతిలో శ్రమబింబం

సామాజిక మానవీయ విషయాశయ వస్తువుతో
ఈనాటి కవిత! జన హిత చింతన లక్ష్యంతో
భౌతిక మానస భూమికలో
అన్వయ జీవన గుణ క్రియతో

లేమిని ఓర్వగలదు, నిలవగలదు బ్రతుకు, కానీ
సంక్షుబ్ధ సమాజంలో చెదరి కుప్ప కూలుతూంది
ఇంటి నుండి బయటికి అడుగులు వేస్తే
తిరిగొచ్చే నమ్మకం పయి వేటు పడకూడదు

గతంతో సూత్ర బంధంతో వర్తమానం
చేవ ఉన్న వివిధ భావ జాల సమీకరణంతో

హృద్గతం స్థానికం పొలిమేరలు దాటి
చెరువులు పొలాలు జనపదాలు గిరులు నదులు
కలుపుకొనీ పయనంలో విశ్వమయ మవుతుంది
మానవ జీవన కథలో భాగ మయి పోతుంది.

ఎప్పటి కప్పుడు కొత్త అనుభవ వర్ణాలతో
ఆలోచన మారుతుంది కదలే పవన గతిలో
మార్పు నుండి దూరం జరిగిపోలే రెవరూ
ఆరని వెలుగులతో కుసుమించాలని కోరేరు

జలనిధిలో తరగల వలె అందుకొనీ
పద్మంలో రేకుల వలె హత్తుకొనీ
మనుషులతో సమాజం! స్నేహ సుందరంగా
ఖడ్గం విభజిస్తుంది, లోయల్ని సృజిస్తుంది

ఇది మాటల గారడి ప్రదర్శనం కాదు
వాస్తవ పథాన మానవ చేతన చిహ్నం
పురాశిథిల దృశ్యం! అరచేతిలో సంస్కృతి బింబం
మనిషికి నేపథ్యంలో ప్రేరణ నిచ్చే రూపం

అడవి నుండి ఊరు నగర విస్తరణం ఆవాసం
భౌతిక మానస శ్రమవర్తన సమాజ నిలయం

పిపాస జిగీష లవే! కాలం స్థలం మార్పులతో
జీవన కృషిలో వేరు వేరు కథలతో విలువలతో.

93. స్వేచ్ఛా కవిత్వం

ఇది జీవితం

(XVIII భాగం)

నీడ నుండి వెలుగులోకి

మాదిరాజు రంగారావు

2019

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 28.

Sveccha Kavithvamu
Idi Jeevitham
(**XVIII** Part)
Needa nundi velugu loki

by
Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2019

Presented
to my wife
Smt. Indira

భూమిక

ఈ రచన "నీడ నుండి వెలుగులోకి" దీర్ఘ కవిత, "ఇది జీవితం" బృహత్కృతిలో (XVIII) 18వ భాగం. నీడ ఆసరాకు ఆశ్రయానికి చల్లదనానికి గుప్తతకు రహస్యానికి ఇట్లా ఎన్నిటికో ప్రతీకగా దృష్టికి వస్తుంది. 'వెలుగు' స్వచ్ఛతకు జ్ఞానానికీ వివేకానికీ మంచికీ శాంతికీ శుభానికీ ఇట్లా ఎన్నిటికో ప్రాతినిధ్యం వహిస్తుంది. సాహిత్య తాత్త్విక ప్రపంచాలలో బాగా తెలిసిన సంకేతాలు.

ఇందులో విషయాల్ని బట్టి భావ జాలాన్ని కళాత్మకంగా ఆవిష్కరించే ప్రయత్నానికి శీర్షిక చక్కగా నప్పుతూంది. వస్తువు విశాలమయిన ప్రాతిపదికను కలిగింది. దీనికి శాఖోపశాఖలుగా విస్తరించిన సామాజిక రాజకీయ నైతిక తాత్విక కళాత్మకమైన అంశాల ప్రమేయం కనిపిస్తుంది. వర్తమాన జీవన స్థితుల్ని గమనిస్తే ఆశావహమైన ప్రజాస్వామ్యంలోనూ దారితప్పుతూన్న నడతల్ని గురించి చేరాలిసిన లక్ష్యాన్ని గురించి చింతనం కనిపిస్తుంది. దీనికై కావలసిన చిత్తశుద్ధి నైతికత సంకల్పం సూచితమయినాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థ గాడి తప్పి ఎదుర్కోవలసి వచ్చే అలజడి అశాంతి ఘర్షణ హింసలతో ఆగక ఆత్మ హత్యల వరకూ పర్యాప్తమయిన సామాజిక దుస్థితి చిత్ర పరంపర స్పష్టంగా కనిపిస్తుంది. నిరాశ నుండి పైకి తేలే మానవ శక్తి అవసరం గురించి ప్రసక్తమయింది. సుదీర్ఘ జీవన చరిత్రలో మానవ సంస్కృతి ప్రకాశం గురించి, వ్యక్తి అస్మిత–అస్తితల ప్రాధాన్యం గురించి వివేచన కందుతుంది. (1) వ్యక్తి–సమాజం; (2) వర్తమానం – ఆశారూపం పై ఫోకస్ చేయడం జరిగింది.

స్వేచ్ఛా కవిత్వంలో స్పష్టమయిన లక్ష్యంతో వెలువడే ఈ కవిత, సమాజ ప్రయోజనమూ – కవిత్వ కళ రెండిటి సహయోగాన్ని కలిగింది. ఆధునిక యుగంలో తెలుగు కవిత్వం పొందే విశిష్టమైన మార్గాన్ని తలపింప చేస్తూంది. వర్తమాన బిందువుల నుండి భవిష్యత్తు దార్శనికం వివిధ భావ రూపాల్లో పరంపరా రూపాన్ని పొందింది. తన ప్రత్యేకతను భావింప చేస్తూంది. కవిత్వానికి స్వేచ్ఛా మార్గంలో విశాలతనూ స్పందన సూక్ష్మతలతో కళాత్మకతనూ సంతరింప చేస్తూంది.

– మాదిరాజు రంగారావు

1. అభినవం

బయట నడచే నా వెనకనే కాస్త దూరంలో
ఎవరో దేనికో దేనినో ఎవరినో గురిచేసే
తుపాకి నుండి తూటా! చకితంగా వేటలో
నా తల పయి నుండి దూసుక పోతుంది

ఒకమారు నా చెవి పక్కగా దూసుక పోతుంది
ఒక మారు నా బుజం పయి ఎడంగా పరుగెత్తుతుంది
చూచిన వారిలో కొందరు అదృష్టవంతు డన్నారు
ఏ తప్పు లేనిది ఎందుకు జరుగుతుంది? అన్నారు.

ఒక ఘటన సందర్భంగా న్యాయమూర్తు లెందరో
ఎవరి నిర్ణయం వారికి ప్రియం! తమ వరకు నిజం!
నేను మౌనంగా ఉండవలసిందే విగ్రహంలా
పగలు స్విచ్ ఆన్ అవని బల్బులా నిశ్శబ్దంగా.

వాడేవి కొన్నే అయినా గదులెన్నిటితోనో మహల్
వాడనివి శూన్య ముఖాలతో మనుషులకయి ఎదురు చూచేను
అడుగుల సవ్వడి కయి చెవులు ఒగ్గి ఉంటాయి
వ్యక్తుల ఉనికితోనే అసలు కథ! మొదలవుతుంది.

అరచేతిలో ఆకాశం దిగి నట్లు కవిత
అక్షర నక్షత్రాలతో శూన్యాన్ని నింపేను
కోరికలకు పూచిన కల్పనలను తలపించేను
కను చూపులలో వాస్తవ దృశ్యాలను చూపేను

చుట్టు వస్తువులెన్నో! చూపుల్ని ఆకర్షిస్తూ
ఎన్ను కోవడంలో కొంత కాలం గడుస్తుంది
తెలియనిది తెలియడానికీ, పరిచయ స్నేహాలకూ
కొంతకాలం గడుస్తుంది, ఏవో అవసరాలు తీరుతూ

ఎదురుగ గిరి! దూరాన, స్థిరతకు సూచనగా
పక్కన నది! సరిస్తూ వర్తమాన చేతన చిహ్నంగా
అవని పయి పూల వనం! నింగిలో ఆశాజలదం
ఇరు స్థాయిల్లో వాస్తవ జీవన లోకం! అభినవం.

2. చివరిదాక అంటుకొనీ

అన్వేషణలో కవిత! నిగ్గు తేల్చే నిజంతో
వ్యక్తి సమాజం గురించి కుడి ఎడమ దారులలో
సమాచార సేకరణ మొక పరీక్షా సమయం
ఇతరుల బాధ పట్ల సానుభూతి ప్రకటనతో
ఆవేదన చూపవచ్చు, విలాపం స్వనించవచ్చు
మాసిపోయే ఘటనలు రికార్డు కావచ్చు

ఎదురు పడే సమస్యకు పరిష్కారం దొరకవచ్చు
సూచన లభించేను, బాధను మరిపించేను
పీడన తొలగేనా? హృది నీతిని వరించేనా?
కలహం మరచేరా? అలజడి తొలగేనా?
తన కవితకు మురిసే కవిలో మార్పు కనబడేనా?
బ్రతుకు ఆగకుండా ముందుకు నడుస్తుంది, ప్రధానంగా.

పగిలిన మట్టి కుండ పెంకుల్ని కలిపి
పూర్వపు స్థితిలో పాత్రను నిలిపేరా?
ఏ స్థితి అయినా! ఏ వ్యూహమయినా! ప్రవేశిస్తుంది
సరి అయిన జవాబు కయి యత్నం చేస్తుంది కవిత!

సంక్షుబ్ధ వాతావరణంలో అనుభూతి సాంద్రతతో
కవితకు మంచి, అవకాశం లభిస్తుంది

అశాంతిలో ఆక్రందనలో మానుష స్పందన మనివార్యమై
కాలం! కవితను వరిస్తుంది హృదయం మాట్లాడుతుంది

మానుష క్రియతో సమాజ చక్రం
తిరుగుతూ, ఏ విషమ స్థితిలోను ఆగదు.
వివిధ రాసులలో నుండి ప్రభావ శీలంతో
ఊహ వెంట కలంతో సృజనరూపం! వెడలుతుంది

ఇది పిల్లల్ని అదుపులో పెట్టి నట్లు కాదు
ఇది కూనల్ని పెంచి పోషించి నట్లు కాదు
ఎంతటి క్షోభ నయిన సహిస్తుంది వహిస్తుంది
మధ్యలో వదలేసి తన దారిన పోయేది కాదు

3. శ్రేయోయానం

నేలపై దారిలో దొరికిన అద్దం ముక్క
దుమ్ము తుడిచి చూచుకొనే తన ముఖం
ఎంతో అందంగా కనిపిస్తుంది ఆ క్షణం
అది తన బ్యాగ్‌లో వస్తువులో చేరవచ్చు

అందానికి అనుభవానికి నిలయ మయింది
సమాజ వాస్తవికతకు పుస్తక మవుతుంది
రెండూ జీవిత రూపానికి పార్శ్వాలుగా
మానవ సంస్కృతిలో బహు పాత్రల్ని పోషించేను

ప్రకృతి రామణీయకం జీవన నవ సౌందర్యం
కలిసిన రూపం కవిత! కళామయం సమాజగతం
వికార మనస్తత్వ రీతులతో దీనికి సమాంతరంగా
రాళ్ళను పోగు చేసి ఎవరి పైనొ విసరే వారెందరో

ఎవరి మనో నిలయం వారిది సమాశ్లిష్ట ప్రపంచం
ప్రేమ నుండి వైరం వరకు ఎన్ని అంతరవులలోనో
ముఖానికేదో ఒక వేషంలో మేకప్ లో
ఎదురయ్యే మనిషిలో మౌలిక రూపం ఒకటే!

తన దప్పిక ఆకలి తీరే దారిన ఒకటి
తనలో ఆనందం కలిగించే దారిన ఒకటి
ఎప్పటి కపుడు మనిషి అంచులు చేరుతూ
తన శక్తి ప్రకటనంతో సీమలు దాటేను

అంతరంగానికీ ఆదర్శానికీ మధ్య ఎడం తక్కువ
రెండింటి బంధాన్ని ఉద్యమం! దృఢతర మొనరిస్తుంది

మనిషికి తృప్తి శాంతి అంటే
నచ్చిన పని నచ్చినట్లు చేయడం
ఈ జీవన ప్రస్థానంలో! శ్రేయో యానం
జన హితకర వివేకమతి తోనే సాధ్యం.

4. అంతరంగ బింబం

చెట్టు తనతో నడవలేక పోయినా
ఎదురుగా నిండుగా ఉంటే అంతే చాలు!
అడవి అయినా ఎడారి అయినా తోట అయినా
ఏ తరగతి వ్యక్తి అయినా సమాజ మయినా
ప్రతి మనిషి నేర్చుకునేది ఎంతో ఉంటుంది
ఏ రోజున మిగిలి పోయి మరో రోజు అవసరమవుతుంది

మరో ఉషస్సును చూడాలని మనసు తొందర పడుతుంది
కొత్త అనుభవాల పుటలతో రెపరెప లాడుతుంది

ఏ పదానికి ఏ మాటకు నిషేధం లేదు
ఎంత దూరమయినా గాలి తీసుక వెళుతుంది
విలువలతో సమాజ శక్తిని పెంచుతుంది
స్వేచ్ఛలో విశాలతను పరచి చూపుతుంది

ఎవరి ఇష్టం అనిష్టం తో పని లేదు
అర్థంలో విశాల ప్రయోజనం! సమకూడుతుంది
కావడి కిరు వైపుల బిందెల వలె తమ స్థానాలలో
ఉన్నవారు లేనివారు! ఇరువురు ఒకటి కాదు

తెలియని అమృతం రుచి కన్నా
తెలిసిన కవిత్వ రుచి అమేయం
పద పదాన కిరణ గుణంతో
హృదిని కాంతి మయం చేస్తుంది

రాత్రి కన్న కలలు మబ్బుల్లా తేలిపోతాయి
రోజు తొలి కిరణం ముఖాన్ని స్పృశించాలని కోరిక!
బ్రతుక్కి ప్రేరణయై వర్తమాన తంత్రులపై
సుగమ సుందర లిప్తలు మ్రోగాలని అభిలాష!

అద్దంలా గోడకు వేలాడే వస్తువు కాదు కవిత
మనిషి అంతరంగం బింబించే సమాజ కళారూపం.

5. ప్రయోజన మందరిదీ

చేతనకు ఆధార భూమిక భౌతికంతో కవిత
ఏ నేరం ఏ దైన్యం లహరుల నాప లేవు
ఏ వాదం ఏ భేదం అడ్డు కట్ట వేయలేవు
సృజన విశేషం మనసును లాగుతుంది తన వైపు

వ్యక్తిలో సమయ సమయం తాండవ లాస్యాలతో
జీవన దృశ్యం చూపే విశ్వ వేది అవుతుంది
ఎప్పటికి రోజూ పరిచయంతో ప్రియాతిప్రియంగా
ఆకర్షణ తరగని ఉదయం! ఒక రోజున
మానుష విషాద ముద్ర వహించ వలసి వస్తుంది
ఉదయం సాయం సంధ్యను తలపించడమొక విషాదం

అనుభవాల ఒత్తిడిలో నలిగే హృదయం
ప్రేమతో పాలను కురిపించ లేదు
కరుణతో అనల జ్వాల నార్పేయ లేదు
సుమ గుచ్ఛం కాలేదు, ఇనుప కవచం కావచ్చు.

మస్తిష్కంలో వెలిగే దీపం! బ్రతుకులో
ప్రతి వస్తువును ఎరుక పరుస్తుంది! వేళకు
మనిషిని మనిషి గుర్తించేందుకు
ఎంతగానో కష్ట పడనవసరం లేదు

మాటలో నడతలో అనుమానం లేకుండా
నిశ్శబ్దం నుండి రూపం! అవతరిస్తుంది మనసులో
బ్రతుకులో ఎన్నుకొనే దారిని బట్టి జీవితం
అనుకోని అనుభవ పరంపరతో ఆకృతి ఏర్పడుతుంది

ఎవరి కిష్టమయిన ఆలోచనల అంతస్తులో వారు
కోరిక మూలంతో, అనుభవ శాఖల సుమ ఫలాలతో
సమాజ బంధంతో నెరవేరే ఆశయం
ఏ ఒకరిది కాదు! ప్రయోజన మందరిదీ, సంఘంలో.

6.

తన కోసం మరో ఉదయం త్వరగా రావాలని
తన కోసం రాత్రి త్వరగా వెడలి పోవాలని
ఎవరెంత తొందర పడినా అన్నీ జరిగే సమయానికే!
ఇవి తెలిసీ తెలియని కార్యకారణ సంబంధంతోనే

ఒక్కొక రాత్రి ఒక్కొక ప్రశ్నగ ఎదురవుతుంది
కాల పటం పయి ఉదయం సమాధాన పత్రంలా!

ఏ రోజూ క్షణాలు క్రమ పద్ధతిలో
పొరలుగా రాసులుగా పేర్చ బడేను
కళా భంగిమల్లో పంక్తులుగా తీర్చ బడేను
ఎవరి బ్రతుకు విధం వారిది స్వీయ గాధతో
చేసే పని ఎప్పటికీ సాగుతూ ఉండాలని
మనిషిలో కోరిక! వచ్చే తరంపై నమ్మకంతో

గాజు గోడల గదిలో మనస్సు
నాలుగు వైపుల కురిపించే బయటి ప్రపంచంతో

పెద్ద బొగ్గు కుప్పలా చిక్కని చీకటి రాత్రి
ఎవరో అగ్గి పుల్ల గీసి అంటించినట్లు
తూర్పున జ్వాలా వదనంతో ఉదయం
విప్పారిన స్వర్ణ కమల శోభతో గగనం!

గదిలో ఉన్న మనిషికి వెచ్చదనంతో సంతోషం
ఏది నిజం! కఠిన వాస్తవంలోకి మారేను జీవితం.

శ్రమ జీవన గాథలో తేలుతూ జీవితం
మనిషిని చరిత్రలో భాగం చేసే పనిలో

ప్రవాహం నిలవదు, అనుభవ పరంపర ఆగదు
ఆగితే! కదలని గండ శిలగ మారవచ్చు
కాలం కనిపించదు, ప్రభావం నెరపుతుంది
చీకటిలో వెలుగు రేఖలతో మనిషిని చూపిస్తుంది

7. ఎప్పటికీ తలుపులు తెరచి

శిశువు తన కెదురుగ ఉన్న
వస్తువులతో మనుషులతో మాట్లాడుతుంది
అన్నిటినీ తన చూపులో బంధిస్తుంది
పూల గుత్తుల్లా తన చేతులలోకి తీసుకుంటుంది
అక్కర లేని లేదు, అన్నీ చేతులలోకి రావాలి
అన్నిటినీ స్పృశిస్తుంది నిప్పునూ నీటినీ మనిషి ముఖాన్నీ

జ్ఞానంతో పరిశీలన వివేచనతో కొత్తగా
మరో లోకంలోకి! జీవన వాస్తవ కథలో
శిశువు సాహచర్యంతో క్షణాలు కరగుతాయి
శిశువు మాటలతో క్షణాలు వెలుగుతాయి

పద పదాన దాగిన రహస్యం తొంగిచూస్తుంది
అణువణువున స్పందన తంత్రి నిస్వనిస్తుంది
లేలేత ముఖంలో చంద్రబింబం హ్లాదానికి
పగలు రాత్రి మిత్రం శత్రువు భేదం లేదు

దారిలో సర్పం కనిపిస్తే అడుగు ఆగిపోతుంది
మనిషి చేయి ఎత్తితే మనసు కత్తి కావచ్చు
భయమూ అనుమానం మనిషిలో ఎక్కువ అవుతూ
పయనంలో ఆటంకాలెన్నో! అన్నిటికీ సంసిద్ధంగా

తన చుట్టు ఉన్నవి 'చాలు' ననుకుంటే సరిపోదు
లేని వాటి కోసం అన్వేషణ! మానవ సహజం
చూచేవీ చూచినవీ విన్నవీ తెలిసినవీ ఊహలోవి
అన్నిటితో జీవిత మొక వస్తు సంచయ సంకలనం

తెలిసిన దానిలోను ఇంకా తెలియనిదెంతో
ఆ విషయం శాస్త్రవేత్తలకు వదలివేసి
ప్రస్తుత కర్తవ్యం! వర్తమాన పథంలో ప్రస్థానం
ఎప్పటికీ తలుపులు తెరచి ఉండే సమాజంలో!

8. జ్ఞప్తికి తెస్తూ తలపిస్తూ

స్వేచ్ఛ రంగు తెలుపు, స్వతంత్రం రంగు ఎరుపు
రెండిటితో మానవ జీవన గమనం సుగమంగా
నీలి రేఖలతో ముఖం కళ తప్పి ఇపుడు
పచ్చదనం కోల్పోయిన ప్రజాస్వామ్య రూపం!

అలజడితో ఉద్యమం ఎపుడు బడితే అపుడు రాదు
త్యాగశీలురైన యోధులు ఎపుడు బడితే అపుడు రారు
జన తతి బాధల్ని తొలగ జేసేందుకు వచ్చేరు
పీడిత జన గాథల్ని రూపు మాపేందుకు తరలేరు

తుపాను వస్తుంది సమాజ శక్తిని పరీక్షిస్తుంది
గడియారం కదలిక ఆగితే, కాలం ఆగదు
ఊపిరి నిలిచి పోతే, గాలి నడక తగ్గదు!

తనువులో సరించే నెత్తురులో
నిరంకుశాన్ని మాపే ఆవేశంలో
అగ్ని! సూర్య రశ్మి రూపాంతరం!
అనల బీజం నుండి వీరం! తరువై.

కనిపించే మనిషి తెరచిన పుస్తకంలా
ఉంటేనే! మనిషిలో వికాస రూపం!
పుట తెరవగనే సరిపోదు!
కావలసిన విషయంపై దృష్టి పడాలి
చూచింది నచ్చాలి, నచ్చింది చెప్పాలి
అపుడే మనిషి బ్రతుకుతో పరిచయం సార్థకం

ఎవరి దారి వారిది ఎవరి గమ్యం వారిది
అన్ని కలిసిన విశ్వమయం ఈ సమాజం!

మనిషితో కాలానికి చిర చరిత్ర రూపం
మనోవిధంతోనే బ్రతుక్కి అస్తిత! ఏర్పడేను
పై నుండి 'పావురం' శాంతిని జ్ఞప్తికి తెస్తూ పోతుంది
భూమిపై 'ప్రవాహం!' ఆర్ద్రతను తలపిస్తూ పోతుంది

9. లో నుండి

అసలు మనిషి పూర్వ నివాసం ఏకాంత నిలయమే!
తరువాతనే బయటికి వచ్చేను సంఘంలో తిరిగేను
అక్కడ భద్రతతో పని లేదు, రక్షణ అవసరం లేదు
వ్యక్తి తాను ప్రభువు; ఇదొక సుందర వాస్తవ దశ!

బయట నున్న ఆకర్షణ లోన ఎక్కడుంది?
వ్యవహార జగత్తులో రుచి మరో చోట కనిపించదు
స్నేహం వైరం లాభం నష్టం కళాజగం రాజకీయం
ఏమరు పాటు కవకాశం లేదు, జాగరూకత అవసరం.

ఇక్కడ గోడలు అనివార్యం, హద్దులు తప్పనివీ
స్వార్థానికి పెద్ద పీట, పనికి నియంత్రణ కేంద్రం
అనుమానం ఆవేశం ఆవేగం భయం చతురత నుండి
ఏకాంత నిలయానికి మనిషి ప్రవేశం! అపుడపుడూ

ఎక్కడయినా ఒకటే! అనే వీలు లేదు, భేదాలెన్నో
గిరి శిఖరానికీ భూమి తలానికీ మధ్య భేదాలు ఉన్నట్లుగా!
ఒకచోట గాలి శుభ్రం, వెలుగు స్వచ్ఛం, నిర్మానుష్యం
ఒకచోట కోలాహలం జన సమ్మర్థం! లౌకిక మేళనం.

ఒంటరిగా ఉన్నా ఎవరో వెనక ఉన్నట్లు అనిపిస్తుంది
నీడ కాదు మబ్బు కాదు చెట్టు కాదు ఎప్పటిదో స్మృతి రూపం
ఏదో ఏదో అనుకునే వీలుతో, అనుకుంటేనే మంచిది
ఒంటరితనం పోయి, బ్రతుకులో నిటారుగా నిలిపేదీ

బయట దాహం వేస్తుంది, ఆకలి వేస్తుంది
ఈ రెండింటి కయినా లౌకికం! సాగాలిసిందే!

కల్పనలో గంగ అల పెదవుల కందేనా?
ఎత్తులో చెట్టు ఫలం చేతికి అందేనా?
అసలు మనిషి మూలం ఏకాంత నిలయమయినా
లో నుండి బయట! గడపాలిసి రావడం! జీవితం!

10. గతం నుండి

మనిషి నుండి మరో మనిషి నాటకంలో పాత్రలా
ముందుగ తెలియదు, ఆ సమయానికి ప్రవేశించేను
ప్రియ రూపం కావచ్చు, మిత్రమో శత్రువో కావచ్చు
హంతక మతి కావచ్చు, ఉదార శీలి కావచ్చు
ఎవరయినా కానీ మనిషి అవడం! ఆ సందర్భంలో
సౌభాగ్య మనిపించవచ్చు, దౌర్భాగ్యమని పించవచ్చు.

ఏ బ్రతుకు ఏకాంతంలో శూన్యావరణం కాదు
తెలియని ముఖాలతో ఎందరో! మానుష బంధంతో
తెలిసిన ముఖాలతో ఇంద్ర ధనుసు శకలమో! పూవు రేకో!
చీకటి తునకో జలద శకలమో మతి పసికడుతుంది.

తన చుట్టు ఉన్న వస్తువు ఏదో జ్ఞాపకం చేస్తుంది
పూర్వమో ప్రస్తుతమో సందర్భాన్ని బట్టి మనిషిని తిప్పుతుంది
అవసర సమాజ చలనంలో మనసు ప్లవిస్తుంది
ఇపుడు మనిషి చుట్టు ఒకరు కాదు; ఎందరో

తన చుట్టు సంస్కృతి సంపద అనంతంగా
ఎపుడో ఏదో ఉపయోగంలోకి వచ్చేననీ

స్మృతుల చిత్ర శాల లేని మనసు లేదు, ఉండదు
ఇది మానస పరితృప్తికి అవకాశ మిస్తుంది
సృజనకు పట్టాభిషేకం జరగవచ్చు
కల్పనకు తలుపులు తెరచుకోవచ్చు

స్మృతులను నిరాకరించే ప్రసక్తి లేదు
ఎప్పటికీ స్వీకరిస్తూ బ్రతుకు గడపలేరు
ఇవి అందని మబ్బుల్లా సాగుతాయి
నదిలో అందని బింబాల్లా కదలుతాయి
ఆ సమయంలో మనసుకు సుందర వాహనమయి
గతం నుండి వర్తమానంలో తిప్పుతాయి సన్మిత్రంలా!

11. అనుభవ ముద్రలు

కవితలో! ఎన్ని రంగులలోనో, పదాలు వెలువడతాయి
సందర్భాన్ని బట్టి అర్థంలో మార్పును సూచిస్తాయి
భావ పరిమళంతో అక్షరం సుమ దళమై తాకవచ్చు
అర్థ ప్రకాశంతో అక్షరం! అనల కణమై ఎగరవచ్చు
వీటికి హద్దులు లేవు మనుషుల భేదాలు లేవు
మనసును గంధమయం తేజోమయం చేయడమే పని!

ప్రవాహ మెంత ఆర్ద్రత కనబరచినా
దారిలో నిలిచిన శిల! మెత్తబడదు కరగదు

చంద్రబింబం దివిలో పుష్ప గుచ్ఛ మనిపించవచ్చు
రవి కిరణం జనహిత బంధువు అనిపించవచ్చు

ఉత్సాహం నుండి కవిత! అనురాగం నుండి కవిత
శశి రవి ప్రభావ మయం విశ్వం! సర్వం
వేదనలో నుండి కవిత! ఉద్యమాల నుండి కవిత
మనిషి మతి గుహలో చీకటి చుట్టుకొనీ! బ్రతికేను

కలలు తమంత తామే వస్తాయి
పాత స్నేహితుల వలె కలిసి వెళ్ళిపోతాయి
చెరువులో నీరు నిలిస్తేనే! ఎవరయినా
దప్పిక తీరేందుకు ఆశపడి సమీపిస్తారు

ఎడారి నెవరు చేరతారు? దాట వలసి వస్తే తప్ప
ఇసుకలో కాళ్ళు ఈడ్చుకుంటూ పోవలసిందే!

కవితలు! జేబులో గలగలలాగే నాణేలు కావు
కరెన్సి నోట్ల వలె పర్సులో అణగి ఉండలేవు
కవితో కన్నా కవితతో పరిచయం మెల్లగా
బంధుతతో బలపడి చిరతను పొందేను

శిశువు అడుగు భూమిపై వేసే ముందు
సుమ దళమై! అమ్మ ఎద నలంకరిస్తుంది
ఈ సుందర జ్ఞాపకం! బ్రతుకులో బంధమై
అలయై అనుభవ ముద్రలు వదలుతుంది!

12. పునర్జవం

స్మృతిలో శ్రామిక జన జీవన చిత్ర పంక్తి
ప్రత్యక్షం నుండి పరోక్షానికి కదలుతుంది మనసులో
కార్మిక కర్షక వృత్తుల జీవన రేఖలతో
ఇది సమాజ చరిత్రకు అద్దం పడుతుంది

వెనక నున్న గతాని కేదో చెప్పడం కాదు
ఇపుడున్న వర్తమానం! నాకేదో చెప్పాలనీ!

ఎన్ని దిశలు మారినా దారులెన్నో భూమిపై
ఒకరొకరి జీవన గమ్యానికి చెందినవే!
కళలూ విజ్ఞానం ఆర్థికం రాజనీతి స్థితులతో
నాలుగు శాఖలు! ఎన్నో చీలిన ఉప శాఖలతో

ఆయుధం పిల్లల ఆట వస్తువు కాదు
కళా రూపం రోజువారి ఉపయోగ పాత్ర కాదు
ఒక దానికి బదులుగ మరొకటి ఉపయోగించదు
ఏదీ విడిచి పెట్టేది లేదు, అన్నీ ఎపుడో! అవసరమైనవే!
జీవన సంస్కృతిలో ప్రతినిధులుగ నిలిచేను

ఒర నుండి బయటికి తీస్తే గాని
కత్తి అంచు పదును తెలియదు!
మూలన పడి ఉండవచ్చు, కాని భీరువును వరించదు.

ఉండి ఉండి తుఫానులా దుర్ఘటనతో
ప్రకృతి నుండి సమాజానికి చేరే మార్పులతో
మనిషిని పూర్తి శక్తి రహితుని చేసేను
మనిషి స్థలం మారవచ్చు, మనిషి రూపం మారదు.

మనిషి కళ్ళలో మబ్బులు కదలేను చినుకులతో
పక్షులు జంతువులు! భయ ముద్రలతో ముడుచుకొనీ

ప్రాణదాత జలధుని! ఉద్వేగంలో చకితంగా
ప్రాణాల్ని హరించేనని ఎవరను కుంటారు?
మనిషి మాత్రం! విప్పారిన మానుషంతో అడుగులు వేసేను
శక్తిని పుంజుకొని సమాజం! పునర్జవం పొందేను.

13. హృదయం వేచి ఉంటుంది

విహగానికి దేశ సీమలు లేవు
గాలికి చేరరాని చోటు లేదు
నదికి భూమిపై భేదాలు లేవు
మనిషి అడుగు వేస్తే, అది తన స్వంతం

సరళ రేఖలో కన్నా వక్రరేఖలోనే
అందం, నలువైపుల ప్రయోజనం
అలంకారిక విషయంతో పాటుగ
జీవన గమనంలో చూచే దృశ్యంలో.

ఏ ఒకరి కోసమో మనిషి బ్రతక నట్లే
ఏ ఒకరి కోసమో కవిత అవతరించదు
కవిత లేక పోవడం ఉండదు ఏ కాలంలోనూ
మనిషిలో సజీవ స్పందన వేదన ఉన్నంత వరకు

చినుకుతో మట్టిలో విత్తు సృజనకై తహతహ లాడుతుంది
మానస చేతనతో అక్షరం! సుమిస్తుంది! ఫలిస్తుంది
రణ భూమిని వరించవచ్చు, పరివర్తన కోరవచ్చు
జన శక్తిని ధ్వనించవచ్చు, విశ్వమయత పొందవచ్చు

వర్తమాన తలంపై ప్రవాహ శక్తిని చూపుతుంది
అనుభవాల అలలతో జన శక్తిని చూపుతుంది
శబ్దంతో ఆడుకునే క్రీడా క్షేత్రం! కావచ్చు
సమాజ చలనంలో గతి చక్రం చూపవచ్చు

ఆయుధ సహభావంతో శాంతి క్రియ సాగవచ్చు
చీకటి ఆవరణంలో వెలుగు తోరణమై నిలవొచ్చు
చెప్పడానికీ చేయడానికీ మధ్య ఎడం మాపుతుంది
జడతను వదలించి మతిని కార్యోన్ముఖం చేస్తుంది

కవిత వినేందుకు చుక్కలు సిద్ధంగా ఉంటాయి
చెట్లు సరేసరి! ఎప్పటినుండో వేచి ఉండేవి! అంతటా
లోన అక్షర దీపం వెలిగే హృదయం!
కవితకై వేచి ఉంటుంది! కాల మహా పీఠంపై.

14. అభిలాష - ఆత్మీయం

తొలి కిరణ స్పర్శతో అణువణువున స్పందనతో
జీవ ప్రసారంలో వేగం! ఒక సుందర సృజన మయం
వర్ష రుతువులో తడిపే మొదటి చినుకు ప్రభావ రూపం
శరీర ప్రకృతిని శుభ్రం చేసే క్రియలో పరివర్తన కారణం

పొట్టకు రొట్టె దొరకేనని పేదరికంలో ఆలోచన
పచ్చని వసనం లభించేనని ఎండిన పొలానికి ఊరట
పంటలతో కాస్త వెసులుతో ఆవాసంపై చిరు కోరిక
వీథిలో ప్లే కార్డులపై హక్కులకయి ఆశా సూచికలు

నేతల మాటలలో ఆశలు ఆకుల వలె రాలేను
బడుగు బతుకు మాత్రం! ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!
అధికార పీఠం చుట్టూ ఉండేది ఇపుడు! దేవతలు కారు
ఆశీర్వాద భంగిమలో ఓటు హక్కు బలంతో జన పంక్తులు

స్వర్గం గురించి ఎవరో చెబితే వినడమే, చూచింది లేదు
ఏవో కొన్ని సుఖమయ స్థితులు స్వర్గ సమాన మనుకునేరు
మనిషిలో అపుడపుడు విలయం విధ్వంసం నుండి
సృజన వైపు యానంలో విజయం! చరిత్రను నడిపిస్తుంది

బ్రతుకుల కాధారం, నడకకు అవకాశం గల
భూమిని గురించి పూర్తిగ తెలియకుండానే గడుస్తుంది
మనిషికి తోడు మనిషి ఉన్నంత వరకు బ్రతుకులో
ఏదీ పూర్తిగ తెలియకనే ఆయువు తరలుతుంది

మనుషులతో మానవ బంధం ఎన్ని తీరులు గానో
మనిషికి మనిషికి మధ్య ఎడం! ఎన్ని విధాలుగానో
ఆకాశంలో వివిధ వస్తు సమితి తెలియడ మవసరమే!
మట్టిపై మానవ చేతన గురించి వివేచన ముఖ్యం!

ఒక విషయంపై అభిలాష, మరో విషయాన్ని దూరం చేయదు
ఒక మనిషిపై ఆత్మీయం మరో మనిషిని తప్పించదు.

15. వెలుతురులో పయనం

ఏ పర్వం ఏ కాండ సర్గలలో జీవన కథలు
ఎన్ని! రీతులు నిబంధనలతో మాటలు పలికాయి!
అన్ని! అందంగా పేక మేడలవలె! ఆకర్షిస్తూనే
మనిషి జీవితం! ఎప్పటి వలెనే! ఏవీ పట్ట నట్లుగా!

అంతరంగం అదృశ్యమైన స్థితిలో
మానసికం ప్రేక్షక పాత్ర వహిస్తూంది
భౌతిక మెప్పటికపుడు స్వార్థానికి లొంగుతూ
మానవం! ఊగుతూ తూగుతూ సమత కోల్పోతూంది
ఇప్పటికీ విషాద కథా దృశ్యాలు! ప్రజాస్వామ్యంలో
ఉన్నతితో పాటుగ! అవనతినీ ప్రదర్శిస్తూ! సమాజంలో

స్తంభం తీగెలో విద్యుత్తు, సితార్ తీగెపై స్వర చిత్రం
కిరణంలో ఉత్సాహ లహరి, ధ్వనిలో సంగీతం
మనిషిలో విశేష శక్తి మూర్తి! ప్రకటనం
సమాజాన్ని బ్రతికించేవి! అన్న మాట నిజమే

జరిగే మంచి చరిత్రకు బహుమతిగా చేరుతూంది
జరిగే చెడ్డ సంఘానికి హెచ్చరిక అవుతూంది
కాలం మెత్తబడి సమయం కరగుతూన్నట్లు అనిపిస్తుంది
ఇది మానవతా ప్రవాహమై! పచ్చదనం తెచ్చేను

పలు రంగులలో ఎవరి కిష్టమైనది వారి వారి
భావ జాలంతో! సమాజమొక చిత్రశాలా రూపం
ప్రజాస్వామ్య చేతనతో జీవవంత మయ్యేను
మనిషి నడతతో! ఆదర్శానికి అమృతశక్తి లభించేను

జీవన చింతన స్పందన కామన బంధన లేని
సందర్భం లేదు! అది ఇల్లయినా బయట ఎక్కడయినా
ఏడుపు లిప్తతో మొదలయి! ఏడుపు లిప్తతో ముగిసే
జీవితం! వంతెనవలె! సంతోషం సంవేదనతో కోలాహలమయమై
నిద్ర చక్కగ పడుతుందని కొందరు చీకటి రాత్రిని ప్రేమించేరు
కష్టమయిన నష్టమయిన వెలుతురులో తమ పయనం సాగించేరు!

16. ఎవరి విషయం వారిది

కాలం వెనక్కి చూడదు గతాన్ని మరలించదు
ఆగదు, ముందు చూపుతో భవిత లోకే నడుస్తుంది
పగలు ఎద పయి నెత్తురు మరకలు ధూమరేఖలు చూచి
సాయం సంధ్య ముఖం తిప్పు కుంటుంది
రాత్రి చీకటిలో కలిసి పోతుంది
చేతనం అచేతనంలో దేని అస్తిత దానిది!

ప్రమాదాలు అపాయాలు దాడులు విధ్వంసం హింస
ప్రభావ చిహ్నాలతో కాలం! మనిషిని ప్రశ్నిస్తూ పోతుంది
అపుడపుడు అనుకోని దుర్ఘటనలు! పిడుగు పాటులా
ఆక్రందన కల్లోలం అశాంతి వలయాల్లో సమాజం

రుతు చక్రంతో దీనికి సంబంధం లేదు
మానవ చిర సంస్కారంతో పని లేదు
మరుక్షణంలో ఏమీ జరగనట్లు పరిసరాలు
బుద్ధుని ముఖ బింబంలో వెలుగును వరించేను
గ్రీష్మంలో చలివేందిర వలె అపుడపుడు ప్రబోధాలు!
కళా రూపాలు క్రీడా వినోదాలు రాజకీయ తంత్రాలు!

దేనికో కాలం గమనం ఆగే జాడలు కనిపించవు
ఏ సంఘటన అయినా మరల ప్రదర్శనకు రాదు
రాత్రికి మళ్ళీ మెరుస్తూ ప్రత్యక్షమవుతాయి కానీ,
ఉదయం కనుమరుగయి పోతాయి నక్షత్రాలు

చెట్టు నరక బడితే పెనుగాలికి కూలితే
కట్టెల కయి ఆరాటంతో మనుషులు కదలేరు
లోన ఉన్న వెలుగు! దీపమయినా, జ్వాల అయినా
ఎవరి అనుభవంలో వారికి పరిమిత ప్రయోజనంలో

గగన విహరణంలో ఆనందం, ఆ ఎగిరినంత సేపు
భూమిపై నివాసంతో అనుబంధం! బ్రతికినంత కాలం!
ఎవరి వేదన వారిది, ఆప్తులలో కాస్త ప్రతిఫలించవచ్చు
ఎవరి ఉల్లాసం వారిది, మరొకరిలో ప్రకాశించవచ్చు.

17. చరిత్ర అందరిదీ

ప్రతి నేత! తాను సమాజ సేవ కంకితమయినట్లే
ఉత్సాహంతో రాజకీయ రంగంలోకి ప్రవేశించేను
ఇచట నయితే! అదృష్టం కలిసి వస్తే! పోటీలో సులభమనీ
పెట్టు బడిపై గిట్టుబాటు! ఆర్జనపై భరోసా! గెలుపుపై ధీమా

కష్టాలకు చేరువలో! ఎవరి చేయో! అందేనని ఆశ!
గెలుపుకు కులం మతం ప్రాంతం సహకరించేనని ధైర్యం!

బుజాలపై రంగు కండువా మారడం
వీచే గాలి చేతులలో బహు సులభం
కొత్త పతాక నీడను చేరడం
స్వార్థంలో రెండు అడుగులు చాలు!

దాహంలో అధికార సరసికి దగ్గర అవాలనీ
క్షుధలో విప్పారిన జ్వాలా వేదికను చేరాలనీ
కోట గోడలా స్వార్థంతో చుట్టిన రాజకీయం
తన బాధ్యతను ఇతరులపై విసరేసే చతురతతో

తుపాను వస్తుంది, వస్తే అది వాతావరణం దోషం
బాధలు దూకేను! అయితే అది! పూర్వ సమాజ లక్ష్యం!
తను మాత్రం! నేత! చీకటి గది నుండి ముక్తమై
వెలుగు అలల పైన ఆవలి తీరం చేరాలని నావలా!

కోరికల ఈరికలతో నాయకులు! ఆవలి గట్టుకు చేరి
జీవన క్రీడలో కొత్త ఇన్నింగ్! ఆరంభం
ఓడినా! ఆట డబ్బు పోదనీ, కీర్తి కరమనీ! తీరం చేరేరు
రోజు కొక పార్టి! పూట కొక పతాక! జాము కొక కండువా

నిరంతరం! చలన సంచనాలతో రాజకీయం! మొహమాటం లేకుండా
వ్యక్తిలో మంచి చెడును సమయ పటంపై చూపుతుంది
తూచే రాళ్ళలో భేదంతో ఎవరి నిర్ణయం వారిది నిశ్చయంగా
చరిత్ర! ఎవరి ఆలోచనలో క్రియా రూపం కాదు, అందరిదీ

18. ఒక మనిషిలో తప్ప

తలపయి జల కుండిక చిన్న పగులు బెజ్జంతో
సన్నని ధార జారే నీలి మబ్బును తలపిస్తుంది
కరుణాకర జీవిత రూపం చూపిస్తుంది
రహస్య మేమీ లేదు! అంతా బయట సహజమే

ఇతిహాసం నాటకం సినిమా టెలివిజన్‌లో
దృశ్యాలవే! కనిపించే మనుషుల వాలకాలు వేరు
ఎవరి స్థాయిలో వారు, ఉత్కర్షను పొందేరు
విపరీతాలలో హేతు చర్చ కవకాశం లేదు

మనోజగం అనల కళలనో బీభత్స ముద్రలనో
నింపుకొనీ, విషాద ప్రభావాల్ని నెరపుతాయి
ఏది చూచినా మొదటి సారి చూచినట్లుగా
విషయంలో పాతను మరపించే హంగామా!

గమ్యమదే! పోయే దారి మారి నట్లనిపిస్తుంది
విలువల్ని కనుగొనే ప్రతీక్షలో! సమయం గడుస్తుంది
గాలి నీరు మట్టి వెలుగు దేనికది విడిగా కాక
అన్నీ పాళ్ళలో కలిసిన వాతావరణం! అనుభవ సుందరమై

చేతిలో పతంగిని ఎగరేసుక పోవాలని గాలి
పైన కదలే పతంగిని ఎదకు హత్తు కోవాలని చెట్టు
చెట్ల కొమ్మల్ని స్తంభాల తీగెల్ని తప్పించుకొని దిగాలని భూమి
అదృష్టాన్ని కొలవ గలిగేదెవరు? తూచ గలిగేదెవరు?

నిశ్శబ్దంలో శబ్దం! శరవేగంగా పయనిస్తుంది
కవితలో నిజానుభవం హృదిని స్పృశిస్తుంది

రాత్రి వేళ చీకటిలో గోడ లేని బావిలో
జారిన మనిషి నెవరు వెదకుతారు?
వెలుగు సహాయంతోనో! ఉదయ మయితేనో!
అవరోధం దాటే శక్తి ఎవరికుంది? ఒక మనిషికి తప్ప!

19. నీడ తోడుగా

నీడ లేని చోటు లేదు వెలుతురులో
మనిషికి మాత్రం నీడ తనకు తోడుగా
నీడ భయ పెట్టదు, ధైర్యాన్ని ఇస్తుంది

అనుమాన శిఖరాలు తల ఎత్తే వీలుంది
చాటున ఆయుధాలు ఉండవచ్చు
లోపల చల్లదనం పొందవచ్చు
మనిషి కలలు! నీడలో అంటి పెట్టుకొనీ
అనివార్యమయిన ఆకృతి! తన పాత్రను నిర్వర్తిస్తుంది

వెలుగులో వాస్తవం ప్రకటిత మవుతుంది
అసలు మనిషి రూపం! కథకు బీజ మవుతుంది
వెలుగులు నీడలుతో కాలం తన గమనంలో
దీర్ఘంగా చిత్రాలను ప్రదర్శిస్తూ పోతుంది

ఏ రోజూ ఆ రోజున లెక్కలతో ముగియదు
ఇది చివరి దాక వరసగా సాగవలసిందే
వెలుతురులో కనిపించేను వస్తు సహజ రూపం
పెద్ద నీడ అయిన చీకటి మాయ మవుతుంది

ఏండ్లు గడచే కొద్దీ మనిషి అనుభవం పెరుగుతుంది
శాఖోప శాఖలుగా విస్తరించి ఇతరులకు ఉపయోగిస్తుంది

ఇంత చేసి తానున్న నిలయం తాళం చెవి
చివర కెవరి వశమయ్యేది తెలియదు
ఏ వస్తువు ఎవరి చేతిలో పడేదీ తెలియదు
ఏది ఏ గంగలో కొట్టుకొని పోయేనో! ఏ మట్టిలో కలిసేనో?

అలల వలె గాలి పటాల వలె పక్షుల వలె కోర్కెలు
కదలి ఎగసి ఎగిరి పోయేనని తెలుసు!
గమ్యం మారే స్థితులతో జీవితాలు
చివరకు ఏ లక్ష్యం అందుకునేదీ తెలియదు.

20. ఏ రోజూ ఉదయం వలె

మనిషి చుట్టు స్వరాలెన్నో! దృశ్యాలెన్నో!
అన్ని కవితకు మూలాలై, ప్రేరణలయ్యేను
ఒకరిలో ఆలోచన స్తిమితత కవకాశ మీయవచ్చు
ఒకరిలో ఉద్రేకం పయనంలో వేగం పెంచవచ్చు

ఉదయం ఊరు పొలిమేరలు దాటి
సూర్యుడు ఇల్లు ముంగిలిలో చేరేననిపిస్తుంది
ఇంతలో మరో ఊహ! ఒక తేజోరూపం వస్తే ఎలా?
నింగిని దింపితే మిగతా వాటికి స్వాగతం పలకవచ్చు ననీ!

కొండంత ఆశ అంతలో పరచుకొనీ మనసులో
ఆశపై పేరాశ మంచు కొండు శిఖరాల్లా పేరుకొనీ
ఒకరొకరిలో ఒక్కొక విధమయిన కోరికలు
ఒకరు సూది మొన అంత భూమి కూడ పొందలేరు
ఒకరు అడుగు మోపేంత భూమి వెంటనే పొందేరు
అణువు నుండి విశ్వం దాక కోరికలు అల్లుకొనీ!

కవిత చేయి! ఏ దిశ అంచుల నయినా స్పృశిస్తుంది
కవిత నడక! ఎంత దూరమయినా వెళుతుంది
ప్రశ్నలకు సమాధానాలు పోగు చేస్తూ పోవడమే కాదు
కవిత తానొక ప్రశ్నా పత్రమయి ఎదుట బడుతుంది కూడా

ఈ విశాలమైన చీకటి శరీరం తొలగేందుకు
ఒక సూది మొన! అంత రవి కిరణం సోకితే చాలు!

ఎక్కడో కార్నర్‌లో నీడలా కోరిక చుట్టుకొని
ఎపుడు వీథిలోకి వచ్చేసేదీ తెలియదు
చూపు నుండి భౌతిక రూపం అదృశ్యమయిన కాలంలో
వ్యక్తి యశోరూపం! క్షితిజాన్ని ఆవహించి నిలుస్తుంది

అన్నిటినీ మింగేసే చీకటిని బూడిద చేసే
మానవ యత్నం ఎప్పటినుండో జరుగుతూంది
ఇది తన తల ఎత్తుతూ ఉన్నంత వరకు
కవిత! అవసరం! ప్రయోజనం! ఏ రోజూ ఉదయం వలె

21. జిజీ విషతో మానవత

చరిత్రలో మలుపుల్ని ప్రశ్నించే దెవరు? ఎవరిని?
ఎవరి నుండి సమాధానం ఏ పాలకులు! ఏ పాలితులు!
కాలం మౌన ముఖం నుండి మాటలు వినిపించేనా?
గతం గడ్డ కట్టి మంచులా నిలిచిన రూపం నడచేనా?

క్లిష్ట దశలు క్రమించే చరిత్ర యానం సులభం కాదు
ఎప్పటికీ మెడలో పూలహారంతో మనిషి కెదురు కాదు
విషమ కంటక క్షణాలపై మనిషిని నడిపిస్తుంది
ఎవరి కెవరు మిత్రమొ శత్రువొ! కాలాంతరాన గాని తెలియదు.

ప్రశంసా పత్రమయి స్వపక్షం నిలుస్తుంది
ప్రశ్నల సూదులతో ప్రతిపక్షం చరిస్తుంది
నీతి నియమం న్యాయం కోల్పోయి ప్రజాస్వామ్య దృశ్యం
తాపంలో అడుగంటిన జలాలతో ఎడారిని తలపిస్తుంది

ఎవరి భాగం వారికి సమ భావనతో వదలితే లభిస్తే
వైరం ఘర్షణ హింసకు అవకాశం ఎక్కడుంది?
మంత్రాంగం తంత్రాంగం రాజ్యాంగం అవసరాలతో
మాటి మాటికీ వికృత శక్తులు తలలెత్తేను!

ఎవరి అధికారం వారి వద్ద భద్రంగా బాధ్యతతో
రక్షణ న్యాయం అభయం విజ్ఞానం పాలన అన్నీ
మనిషి విలువ! బజారులో వస్తువుగా మారరాదు!
బానిస బంధన పీడన క్రందన నినదించరాదు

గ్రీష్మంలో చెరువు బావి నదిలో నీరులా
ఉపయోగంలో ప్రస్తుతం! బహుదూరంగా ప్రజాస్వామ్యం
కవితలో పద పదంనుండి భావ జగత్తులో
ఎగసే నిప్పు రవ్వల బదులు! రాలే పూలను చూచేమా?

బ్రతుకులో జిజీవిష మనసులో మానవత
ఆత్మహత్యకు హింసకు దూరంగా ఉంచేను.

22. చీకటి భయం ఉండదు

సూర్య రశ్మియై కవిత! మనసును చేరుతుంది అవలీలగ
అడుగున ఉన్న ప్రేమను ఆర్ద్రతను శాంతాన్ని తేజాన్ని
పైకి తీసి చూపుతుంది! అందరికీ బహు సులభంగా
ఇది అపూర్వ సమయం! సాటి లేని అనుభవ రూపం

దశ దశలో పరిమితులు! కొంతవరకు అసౌకర్యాలుగా
ఎదిగే కొద్దీ పెరిగే అవకాశాలు! విశాల తరంగా

రెండు కళ్ళు రెండు చెవులు రెండు చేతులు రెండు కాళ్ళు
ఒకదాని కొకటి సహదృష్టి సహభావన సమగతులతో

ఒక మతి ఒక మస్తిష్కం! ఒక హృదయం! ఒక లక్ష్యం
విభుత పదంతో, హితకర సూచన నిర్దేశాలతో

ఏ సమస్య మనిషికి సంకెల కాదు
నడచే కాళ్ళకు తీగె అడ్డు పడి ఆపవచ్చు
తీగెను పక్కకు జరిపి ముందుకు వెళ్ళవచ్చు
పూవు కనిపిస్తే! తీసుకొని సంతోషించవచ్చు.

గూడు నుండి బయటి కెగిరే పక్షి! దృశ్యం
సమస్యకు పరిష్కార సూచనగా మెరుస్తుంది
బయట వంతెనపై వెళ్ళే రైలు దృశ్యం!
సమస్యకు జవాబు దొరకినట్లు ధ్వనిస్తుంది

పోయే నది దారి మలుపు తిరుగుతుంది
సరికొత్త అధ్యాయం మొదలవుతుంది
అది సమాప్తి రేఖ అయినట్లు అనిపిస్తుంది
దారుల మలుపులు! సమాప్తికి గుర్తులు కావు

దరిద్రాన్ని సంపదను సుందరతను వికారాన్ని
వహిస్తుంది మనస్సు, రెండింటికీ మిత్రం!
నిదుర కొదిగే రాత్రి వేళ! చీకటి భయం ఉండదు
అమ్మ ఒడిలో శిశువు నిదుర పోయినంత సుఖంగా

23.

అగ్గిపుల్ల వెలుగుతో చీకటి ఫరారు కాదు
పీల్చే సిగరెట్ నిప్పుతో మనిషిని సంకేతింపవచ్చు
కవితలో పదాలు భావనలో నిప్పు రవ్వలు రాల్చవచ్చు
మంచు బొమ్మలు చూపవచ్చు, పూల రెక్కలు విదలించవచ్చు

విల్లు నెక్కుపెట్టే విశేష సందర్భంలో
తూణీరంలో ఉండేవి బాణాలే! సిద్ధంగా

ఎవరి కోస మెవరు వాదన జరిపినా
నిర్ణయం ఇరు పక్షాలను, విన్న తరువాతనే
అది కూడా! న్యాయమూర్తి బుద్ధి మసకబారితే
జరిగే పరిణామం! ఊహ కందని శోచనీయం

మంచు కురిస్తే కొండకు మహదానందం
అది కరగి నీరయి నదియై హితకరమయ్యేననీ
గ్రీష్మంలో తాపానికి జలధి ఉత్సాహ మతిశయించేను
భూమి పైకి త్వరలోనే మేఘాలను వదల వచ్చుననీ.

జన్మ నుండి చిట్ట చివరి దశ వరకు
అమరిన పూల దండలతో ఆయువు గడచేనా?
దీప తోరణాలతో నిశి, జీవన నిలయం శోభిల్లేనా?
అధికారంతో కలలు వాస్తవం కావు, బాధలు తొలగవు.

పేదరికం పయి సానుభూతి గ్రంథం చాలదు
అది తొలగే సత్వర వాస్తవ చర్యలవసరం
ఎందరో ఇష్టపడే సృజన రూపంతో కవిత
లేమిని పూడ్చలేదు కరుణలో ఈదులాడ చేయవచ్చు కాసేపు!

అటు కొండ! ఇటు లోయ! మధ్య ఇరుకు దారిలో
అటు కలిమి! ఇటు లేమి! దృశ్యాలతో జీవన యానం
ముళ్ళ పొద! ఒక్క పూవు కోసం ఎదురు చూచేను
పూల చెట్టు! ఒక్క దోసిలి కయి ఎదురు చూచేను.

24. యానం ఆగదు

జీవితం నిలవదు, రహదారి దొరకక పోయినా
కాలి బాట! సరి కొత్తగ ఏర్పడి పోవలసిందే
గమ్యం చేరేందుకు, కోరికలో యానం ఆగదు
ప్రతి పని వెనక నుండి ఏదో ఒక వాద్య విశేషం
ఇష్టమయింది సన సన్నగ వినబడుతుంది, నేపథ్యంలో
నడతలో ఇమిడి! దీనికై వెతక నక్కర లేదు

ఎవరి నయిన చేరుతుంది తెలిసిన వాద్యం,
కదలే చేతులలో చతురతతో ఆకర్షిస్తుంది
వర్షంలో ఝన ఝన చినుకుల శబ్దం
ప్రసార గతిలో పరుగెత్తే నిర్ఝరిణీ ధ్వని!

సూర్య రశ్మి పరచినట్లు మనసులో హ్లాదం
మానుష శక్తిలో అతీతాన్ని స్పృశిస్తుంది

వెనకనే ఉన్న గతం అంధకార నిలయమనీ
ముందుగా ఉన్న భవిత కాంతి పుంజ లోకమనీ
రెండిటి మధ్య మనిషి! వర్తమానంపై అడుగులతో
చుట్టు ప్రకృతి సమాజాలతో బ్రతుకులు గడచేను

కోరిక తీగెలచే చుట్ట బడిన రాత్రి మనిషి
పూచిన పూల పరిమళాలతో ఒడలు మరచేను

చీకటి బహు కఠిన మనుకునేరు, కాని కాదు
వెలుగు స్పర్శతో కరగి తొలగుతుంది, మెత్తనిదీ
వెలుగు నుండి చీకటికీ చీకటి నుండి వెలుగుకూ
గమ్యం చేర్చే దారులు! మనిషిని పయనింపజేసేను

వెలుతురులో కన్నా చీకటిలో గడిపే ఇష్టం కలవారూ
విరామం దొరకేననీ, మనసు పునర్నవమవుతుందనీ, ఆశ!

చీకటిలో మనిషి వినతులతో చేతులు జోడించేను
వెలుతురులో మనిషి! అర్థిస్తూ చేతులు చాచేను

వెలుతురుతో పాటుగ చీకటి ఉపయోగం
మనిషి జీవితానికి పూర్ణత చేకూర్చేను.

25. కాలం నిలవదు

హింస ఎక్కడో ఒక చోట! జరుగుతూనే ఉంటుంది
తెలిసిన స్థలమయినా తెలియని దేశమయినా ఒకటే!
భౌతిక మానస స్థాయిలలో ఆలోచన మనిషిలో
శాంతి పదంతో తమ బ్రతుకులు అర్థవంతం కావాలని

బ్రతుకులో నిరాశ అపుడపుడు తప్పనిదవుతుంది
రావలసిన వానలు ఎండలతో ఆలస్య మయితే,
ఉదయించే రవిని నీలి మబ్బులు కమ్మేస్తే
పొలం నుండి పంట ఇంటికి చేరజాలక పోతే!
తుపాను చెలరేగి నాశన పర్వం మొదలయితే
మధురమైన స్వరం హఠాత్తుగా కటుతను పొందుతుంది

వేడి గాలి అయినా శీత పవన మయినా తమ తమ
శక్తులతో వికల పరచి ఆర్తరవంలో గిరగిర తిప్పేను

భూమి తలం నుండి దివికి ఆలోచన సాగుతుంది
దేహానికి రెక్కలు లేవు, మనిషి ఎగరలేడు!
మనసు ఎగురుతుంది, కావలసినంత ఎత్తులో
స్వర్గం పొలి మేరలు దాక వెళ్ళవచ్చు
మబ్బులలో చేరి దిశల చివరలు తాకవచ్చు
తనది కాని జగత్తులో ఎంతసేపు చరిస్తుంది?

చుక్కలతో పరిచయం కలగవచ్చు
మనిషిని వదలిన వెలితి మనసులో స్పష్టంగా
మనిషి తోడు కోసం! క్రిందికి రావలసిందే
భూమి గుండె హత్తుకొని! బ్రతుకు సాగవలసిందే

ఇంద్ర ధనుసు కన్నా పూల తోట కన్నా
బ్రతికినంత కాలం సమాజ శక్తి యుక్తితో
అందమూ ప్రయోజనమూ! పగలు రాత్రి భేదం లేదు
మంచి చెడు విశ్లేషణ జరిపే పని ఆ తరువాతే జరుగుతుంది

26.

జననం మానసికానందంలో తొలి ఘట్టం
మరణం భౌతిక జీవన పరివర్తన రూపం
ఈ మధ్య దరిద్రం భౌతిక మానస స్థాయిలలో
ఎంతటి వారయినా అనుభవ గతిలో వాస్తవం

దరిద్ర మొక సుడులతో అనల ప్రవాహం
తీరాన నడవడమో! దాటే సౌకర్యం పొందడమో
దీనికి దేశ దేశాల సరిహద్దులు అడ్డు కావు
స్థలం నుండి స్థలానికి సంచారులుగా తిరిగేరు

సమాజ పరిణామంలో ఎప్పటికపుడు కొత్తవి చేరేను
ఇవి పొందని వారూ ఇప్పటికీ అడవులలో మూలలలో

గగనం వినిపిస్తుంది గాలి కబుర్లు ఏదో రూపంలో
అపుడపుడు గర్జా ధ్వనులతో వర్షా రాగం వినబడుతుంది
అనల శిఖలను ఆర్పే యత్నం జరుగుతుంది
ఇది దప్పిక గొన్న భూమికి ప్రియం
ఆకలిగొన్న కడుపులకు ఆశారూపం!
ఇంటికి చేరాలిసిన హృదయాలకు ఆతురత

భూమి పచ్చని బ్రతుకును చూపిస్తుంది
కొండలు ధైర్యమిస్తాయి! నదులు ఆర్ద్రత నిస్తాయి

తూర్పున తేజస్వి కాంతి కళతో ఉదయం
విశ్వంలో మనిషికి విశ్వాసం ప్రసాదించేను
నింగి నీడతో భూమిపై మానవ జీవితం
పచ్చగ ఉంటేనే! కళలకు అవకాశం!
తరాల సంస్కృతులకు పెద్ద పీట వేయబడీ
మనిషి విజయ తోరణాలకు అర్హత లభించేను

దొరలే నిప్పుల అలలతో క్షణాలు
మనిషి పయనంలో దారులు వెలిగిస్తూ
అంతర్నవ చేతన మనిషిని నడిపిస్తుంది
స్వేచ్ఛా వ్యక్తిత్వానికి వర్ణ చిత్ర రూపమిస్తుంది

27.

నెమలి ఈకతో ధైర్యాన్ని దువ్వినట్లు
కుసుమ దళంతో గాయాన్ని అద్దినట్లు
కవిత! ఎక్కడి నుండో వచ్చి పోయే అతిథి కాదు
ఎప్పటికీ హృదిలో ఒకటిగ ఉండే అంతర్నవ రూపం

ఇది అక్షర వ్యాసంగం, జీవన రుచి వ్యవహారం
మాటల అలలపై తేలుతుంది, జీవన శ్రమయానంలో
సహృదయులలోని ఆర్ద్రత చూపిస్తుంది
అభిమానులలో స్నేహవల్లి పూయిస్తుంది

ఆకాశం వినిపించే మాటలు శబ్దిస్తుంది
మహానది నృత్యంలో శోభను చూపిస్తుంది

జలధి గుండెలో ఆర్తిని ధ్వనించినా
భూమి హృదిలో సృజన బయట పడినా
అంతటా మానవీయ శోభయే
జీవితంలో కలిగే అనుభవ సంపదయే

మనిషి నడకలో వేగం కాలం జయించాలని
మనసు నడతలో స్వచ్ఛత నిజ రూపం చూపాలనీ

ఆకుల గల గలలలో సమాజంలో మాటలతో
అలల కదలికలలో మనిషి ఊహల తీరులతో
కీర్తి శిఖరాలపై మనిషి అడుగులు వేస్తూ పోయేను
ఈ విభవం! ఈ విజయం ఎవరిది? మానవ శ్రమ రూపానిది

దాహం తీరే ఒక దోసెడు నీరు కయి
ఆకలి తీరే ఒక పట్టెడు అన్నం కయి
తల వంచే వ్యక్తిత్వాల బాధా లిపి ఒకటే
అడవిలో కొండలలో బాధితులు
పట్టణాల చిట్ట చివరన దుఃఖితులు
కట్టె ముక్కలనిపిస్తూ, అనల కణాలు కావచ్చు

రవికి సెలవు లేదు, అమ్మకు తీరిక లేదు
కవికి సెలవు లేదు, చేతి వేళ్ళకు అలసట లేదు.

94. స్వేచ్ఛా కవిత్వం

ఇది జీవితం

(XIX భాగం)

అక్షర ముకురం

మాదిరాజు రంగారావు

2019

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 28.

Idi Jeevitham

Long Poem

(XIX Part)

Akshara Mukuram

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2019

Presented
to my wife
Smt. Indira
on her Birthday

పీఠిక

ఇది స్వేచ్ఛా కవిత్వంలో వెలువడిన బృహత్కృతి. 'ఇది జీవితం"తో XIX వ భాగం, పందొమ్మిదవది, 'అక్షర ముకురం' కృతి చివరిది. వ్యక్తి నుండి సువిస్తరమయిన రూపం సమాజం యొక్క ప్రతి బింబం రూపం (1) వ్యక్తి స్వేచ్ఛ; (2) స్వతంత్ర భావన; (3) సామాజిక స్పృహ; (4) ప్రజాస్వామ్య దార్శనికత; (5) 'మానవీయం; ఈ అయిదు అంశాల ప్రతిపాదనా రూపం. అక్షరాకృతిలో కవితామయమయింది.

ఈ ఫ్రేమ్‌లో మానవహక్కులు–బాధ్యతలు, పౌరహక్కులు – వ్యక్తి స్వేచ్ఛ స్ఫూర్తికి రావడం సహజం. ఇవి ఆధునిక యుగంలో సమాజశ్రేయానికీ వ్యక్తి సంస్కార శోభకూ ఉపకరించేవి. మంచి భవిష్యత్తును ఆశించే నాగరిక సమాజాన్ని భావింపజేసేవి. ఈ సృజనప్రక్రియలో ఈ నేపథ్యంలో కవిత్వం కళాత్మకమైన రూపాన్ని సంతరించుకుంది. ప్రజాస్వామ్య నిబద్ధత ప్రగతి శీల దార్శనికతలో కవి సాహిత్య వ్యక్తిత్వం రూపొందింది. ఇది కవిత్వానికి వెన్నెముకగా ఉంది.

ఏ వాదమయినా ఆచరణలో చెడును కలిగిస్తూన్నపుడు సరి చేసుకోవడం అవసరం. ద్వేషం – హింస – ప్రకటనం వల్ల సంక్షుబ్ధ స్థితి ఏర్పడుతూంది. ఖండఖండంగా నయినా అశాంతికి గురి అవడం జరుగుతుంది. ఇపుడున్న సమాజ స్థితిగతుల్ని దృష్టిలో పెట్టుకొని స్థానికమైన వర్తమాన స్థితులతో పాటు ప్రాంతం – దేశం – ప్రపంచం అంతరువులపై విశాలమైన భావన కవిత్వ కళారూపాన్ని పొందడం ఇందులో దృష్టికి వస్తుంది.

ఇందులో అనుభవ స్పందనలతో కూడిన ఆలోచనా ప్రకాశం సజీవ వర్తమాన సమాజపరమైంది. మానవీయం ప్రాణితమయింది. ఈ పద్ధతి రచనకు ఉదాత్తతను విశాలతను కలిగిస్తూంది. ముందుగా నియతమైన విధానంలో కాకుండా సృజనలో అప్పటికపుడు స్వేచ్ఛా గుణంతో ఆవిష్కృతమైంది, స్వేచ్ఛా కవిత్వం. Automation కు స్వయం ప్రేరణకుదగ్గరగా సహజమైన అభివ్యక్తిని పొందింది.

– మాదిరాజు రంగారావు

1. జీవనీయం అనుక్షణం

లిప్త కదలి పోతుంది జన పరిచయ స్పర్శతో
ఆరోహణలో ఒక్కొక్క మెట్టును తలపిస్తుంది
ముకురంలో మనిషి ముఖం ఆలోకనంలో అందంగా
వెనక నుండి మరో ముఖం! మచ్చలతో గీతలతో
బింబంలో సహజమయిన దొకటి
గుప్తంగా వికృతిలోని దొకటి.

లోన అహంకారం అనల కళకు బీజం
దగ్గరలో వెచ్చదనం ఉత్సాహం నింపుతుంది
తాకినపుడు దహనగుణం బాధను పలికిస్తుంది
జీవన కటు సందర్భంలో భయపెట్టే దయినా
ఉపయోగం! ఎంతగనో! వివేచనలో
కరుణ రస స్పర్శతో హృదయ వశం అవుతుంది.

బ్రతుకు ఎడారి కాదు, అయ్యే వీలు లేదు
క్రియా ఫల సంపదతో, శ్రమ జీవన క్షేత్రం
త్యజనీయం అసలు కాదు, జీవనీయం అనుక్షణం
సృజన కళాకృతికి కాలం! వెల్‌కమ్ పలుకుతుంది.

కవి హృదయానికి ఏ వస్తువు దూరం కాదు
కవి మాట స్పృశించని విషయమంటు లేదు
కవితకు శత్రువులు లేరు మిత్రగణం తప్ప!
పయనంలో దారులెన్నో! కవితకు కోణాలన్ని.

కవితతో మనిషిలో తరిగేదేమీ లేదు
తెలియని ప్రపంచాన్ని దింపుతుంది అదనంగా
హృదిలో అనుభవ రూపం మట్టి అంటని ఎత్తులో
వర్తమాన పటం పయిన దృశ్యం చూపిస్తుంది.

అనుకోని పరిచయం కలిగిన లిప్తలు
అనుభవ ఫలాలతో బంధువు లయ్యేను!

2. ఉనికి సమాజంలో

ఒంటరితన మెక్కడుంది? సమాజ సంరంభంలో
కలలకు వీలు లేదు, వాస్తవ లహరుల చలనంలో
చుట్టూ పలు రీతుల తీరుల మానవ ప్రపంచం
చేతన దృశ్యంతో వ్యక్తుల నాకర్షించేను
అస్తమయంలో ఏదో కోల్పోయే ముఖ బింబం
వచ్చే వెన్నెల పయి ఆశ! భవితకు ఊపిరి నిలిపేను.

వాన చినుకుతో ప్రకృతి పరవశం పొందుతుంది
చెట్టు చెరువు గిరి నది జలనిధి వనం సర్వం
మనిషికి మాత్రం దేహం తడిసే నని భయం
మూల నున్న గొడుగుకు పని కలిగించేను
జనహిత కళలో ఎపుడో? కొంతసేపు ఎవరిలోనో?
ఆర్జన వ్యవహారంలో జీవన సమయం! అందరిదీ.

అర చేతులు సుమ దళాల్ని తలపించక పోయినా
ఇనుప పలకలయి కర్కశమయితేనే సమస్య
వెన్నెల వలె మల్లియ వలె కాకపోయినా
హృదయం! చండ కిరణ ఖడ్గం కాకూడదు

కుసుమ దళంపై నుండి ఉదయం
జారే హిమబిందువులా
రాగం వీరం తో పాటుగా కరుణ కంత
చోటు! లభిస్తేనే బ్రతుకులు సార్థకం!

కవి నుండి కవిత! అక్షర ప్రవాహమై
బయటికి వస్తుంది! నిర్నిరోధంగా
మనుషులలో ఆర్ద్రగుణం నిలిచేందుకు
సంఘంలో పచ్చదనం వచ్చేందుకు

ఆలోచనలో విమాన యానం విశ్వమయంగా
చూపు అవనిపై మనసు ప్రజలపై ఉనికి సమాజంలో

3. దళాలెన్నో కోణాన్ని

చీకటి మనసుకు అక్షర దీపం కవిత
రాత్రిని దాటిస్తుంది, బాధా రహితంగా
శూన్య హృదిని కొత్త భావ ప్రకాశం నిలుపుతుంది
మనిషి లోని శబ్ద శక్తి ప్రకటన నవ రూపం

జీవితం గురించి చింతనతో
సమాజం గురించి యోజనతో
వ్యక్తి మనో భూమికలో రహస్యంతో
కవి కలం కదలుతుంది మానవమై

ధన రాసుల మధ్య భాగ్య చక్రం తిరిగేనా?
యశో గగన వీధి తారయై నిలిచేనా?
పదవుల పరివేషంలో పీఠం వశమయ్యేనా?
ఏదయినా కాకపోయినా జీవితమొక ఆగని ప్రక్రియ!

వ్యక్తిలోని మానస లోకం బింబిస్తుంది
సమాజ లక్ష్యంలో దిశలను చూపిస్తుంది
మానుష శక్తిలోని విపులత సూచిస్తుంది
కవి పని! అక్షర కళతో వీటిని అందించడమే

పూవులా విరిసి కంటికి మోదం చేకూర్చే
నిజరూపం కయి! అన్వేషణ సాగుతుంది.
న్యాయమయిన హక్కుల సాధనకు ప్రేరణయై
మనసుకు కావలసిన శాంతికి బాటలు వేస్తుంది.

ఒకరు కలిసి దారిలో పలకరించేరు
ఒకరు ఎదురుపడి మౌనంగా తరలేరు
ఒకరు ఉన్న గుణాలతో తృప్తి పడేరు
ఒకరు లేని గుణాలకయి ఘోషించేరు

కవి మనస్వి నివాసం సమాజ మహా పద్మం
దళాలెన్నో! దృష్టి కోణాలన్ని జీవన దర్శనంలో.

4. హింసకు మూలం

హింసకు తలపడే ఊహకు చీకటి మూలం
ఏ చాటు మాటు నుండో క్రియకు పాల్పడుతుంది
వాహనంలో 'నిజం' బయటికి స్పష్టం కాకుండా
ఇది పలు రంగులలో రూపాలలో మారుతూ
చూప కందినట్లయి అందకుండ పోతుంది
'నిజం' తెలిసేందుకు ఆయుధ మవసరమా?

స్వేచ్ఛలో సమానత అందరికీ సమానమయినా
ఉపయోగంలో పరిపరి విధాలుగా, ఎవరిదారి వారిది
వ్యక్తి శక్తి పరిమితిలో సమాజశక్తి విపులతలో
కవి మనో మూలంపై కవిత! అక్షర నిలయం.

ఉదయ రేఖతో కాలం వెలుగుతుంది
శ్రమ చక్రానికి వేగం పెరుగుతుంది
ప్రకృతిలో రుతువులు! క్రమంలో వస్తాయి
బ్రతుకులో మార్పులు! అవసరాల్ని బట్టి!

సమాజ చేతనలో భాగమయిన మనిషికి
ఒంటరి తన మెక్కడుంది? స్తబ్దత ఎక్కడుంది?

వేడి పెనం పయి పడిన నీటి చుక్కల వలె
బాధలో జారే రెండు అశ్రువుల ప్రభావం
కరుణకు దారి తీస్తే! సమస్య తీరేనా?
వ్యక్తి నుండి సమాజానికి సందర్భం మారేనా?

మానవ చరిత్రలో వ్యక్తికి అక్షయ సాధనం
ఊహ వెంట చర్యల సంచయ రూపం జీవితం

హృదిలో అనుభవ రూపం! మట్టి అంటకుండా
కృతిలో బింబిస్తుంది సమాజ! చలన సమాచారం!

5. మనిషి మనిషికీ భిన్నం

ప్రతి తెరువులో ఏదో ఒక బరువుతో ప్రజలు
అనుమానం సందేహంతో నిర్ణయం వెనక్కి
వివేచనతో మనస్సు, ధైర్య కవచంతో ముందుకు
బాధ నుండి పైకి తేలుతూ పోయేను బ్రతుకులు

వాస్తవాన్ని ఎదుర్కొనే నిరంతర యానంలో
కల్పన కవకాశం లేదు సమాజ చింతనలో
ఆపదలు ప్రమాదాల ఘడియ నుండి బయటపడుతూ
ప్రాణాలతో ముందుకు సాగడమే జీవితం

తరం తరువాత తరం కొత్త కొత్త సమస్యలతో
యుగం నుండి యుగానికి కొత్త కొత్త మార్పులతో
ఇది విషాదకర సమాజం కాదు
జన వికాస చరిత్రకు నిలయం
ఉపయోగం పొందలేని మనిషికి
నిరాశా సముద్ర మనిపించవచ్చు.

చూపుకు కనిపించే రూప మొకటి
ఊహకు తోచే ఆకార మొకటి
చూపుకు ఊహకు మధ్య కవిత
ఇరువైపుల చక్కని సంబంధంతో.

ఆక్రోశంతో మౌనం వీడుతుంది సమాజం
తీవ్రమయిన శబ్దం మనసును మేల్కొల్పుతుంది

మౌనంలో ముఖ వైఖరి అందరిదీ ఒకటే
అర్థం మాత్రం మనిషి మనిషికీ భిన్నం
చల్లని ప్రభావం గాయంపై మంచు అద్దినట్లు ఉంటుంది
మండే విధానం దేహానికి నిప్పు సోకినట్లు ఉంటుంది.

6. ఒంటరితన మెక్కడుంది?

చీకటిలో ధైర్యం బాధలో ఉపశమనం
మనసుకు హ్లాదం ఇచ్చే వెన్నెల ప్రతి రోజూ రాదు
కరుణ లేని మనసు ఉండదు కానీ
అది తత్కాలంలో స్వార్థంలో మునిగి ఉంటుంది.

వీధిలో హక్కుల సాధనలో ఉద్యమ ప్రదర్శనం
అందులో చేరేరు కొందరు ఏదో మిషతో
ఆ రోజు తిండి సమస్య తీరుతుందనీ కొందరు
అలజడిలో సమయం తెలియకుండ గడుస్తుంది

అదొక జీవి! గగన సంచారిణి పక్షి
స్వేచ్ఛలో సుందరతకు సంకేతం! పాలపిట్ట
పచ్చని తరుశాఖపై ఆశా స్ఫూర్తికరంగా
కంటికి రమ్యంగా, గుండెకు శాంతంగా
సంక్షుబ్ధ వాతావరణంలో! మోద కళా చిహ్నం
ఉద్విగ్న క్షణాలలో శాంత భావ రమణీయం

ఇది మనసున స్వేచ్ఛకు ఎత్తిన పతాక
అశాంతి సమయంలో! శాంతి ఉపాయనం

ఉదయరాగంలో తెలుపు, పగలు తేజంలో ఎరుపు
గగన రూపంలో నలుపు మనసును పాలించే రంగులతో
భూమిపై అందరికీ పంచిన పచ్చని భాగ్యంతో
నలువైపుల సమాజాన్ని కోరుతుంది! కవిత.

ఎగిరే ఆలోచనా విమానంలో తిప్పుతుంది
వర్తమాన దృశ్యాలను చూపుతుంది ఒకటొకటిగ!
సన్నాహం సంరంభంలో తేలే సమూహ చేతనలో
ఒంటరితన మెక్కడుంది? కవికి సృజన ప్రపంచంలో.

7. నడక సాగుతుంది

మహాజలనిధి ఉప్పు నీటిలో లీనమయి పోకుండా
నదీ జలాల స్వాదుతల ఉపయోగంలో
ప్రవాహాల అనుబంధంతో, స్నేహ సుందరంగా
భూమిని వరించే కర్తవ్యం మనిషిదే!
నిర్మాణ యుగంలో శ్రమ భావన యత్నం
సంఘాని కవసరమయిన భాగ్యం అందించేను.

గడ్డ కట్టిన ఆలోచనతో సమాజం! దేనికి?
స్కేటింగ్‌కు తప్ప! శిల్పానికయినా ఒదిగి ఉండలేదు
శిలా దారు లోహ ఘన రూపాల్లా
అపూర్వమైన కళా ఖండాలను పొందలేదు!

ప్రాణానికి గాలి నిలవడానికి నీరు
బ్రతకడానికి తిండి, తప్పని అవసరాలు!
నీరు ఎవరి ఆస్తి కాదు
మబ్బు ఎవరి సొత్తు కాదు
మేఘం కురిసిన నీరును
మంచు కరగి పారే నీరును
చెలమ చెరువు ప్రవాహం రూపాల్లో భద్రంగా
పూర్వజుల ఆస్తిలా సంపదలవుతాయి.

వర్షంలో ఒక్కొక జల కణం
కవితలో అక్షరమయి రసధ్వని వినిపిస్తుంది

పద్మానికి రేకుల వలె దిశలలో దారులు
దారుల చీలికతో పయనం ఆగదు
కలలు లేవు భ్రమలు లేవు కల్పన లేదు
కనులు మూత పడ జేసే చీకటిలోనూ
ఎంతటి విషమతలోనూ, వాస్తవ తలంపై
నడక సాగుతుంది! తన దయిన అస్మితతో

8. వెలుగు పాత్ర

నేలకు నింగికి నడుమ ఇరు కొసలలో జీవితం
ఈ చివర ఆరంభం, తెలిసిందే
ఆ చివర ముగింపు, తెలియందీ
తెలిసిన దాని నుండి తెలియని దాని వైపు.

కాలం ఏదయినా దేశం ఏదయినా మనుషులెవరయినా
తెలియని స్థానాలను దాటుతూ ఆయువు గడుస్తుంది
అనుభవంలో 'నిజం' పాలలో వెన్నలా
ఇది దేనికీ ప్రతీక కాదు, ప్రతినిధి కాదు
ఇది సర్వస్వతంత్రం! స్వేచ్ఛామయం
మనిషిని మనిషిగ నిలిపేది, దేవతగా చూపేది.

వ్యక్తి మూల మెప్పటిదో పాతుకొని సమాజంలో
దశలు గడచి ఫలాలు పొందేందుకు సమయ మవసరం
ఆగని మార్పులతో వచ్చే సుఖం పొందేందుకు
నిరీక్షణ తప్పదు, చెదరని నమ్మకంతో ఉండాలిసిందే

జన సమూహాల జీవన ధ్వనుల మధ్య
ఎక్కడో మౌన ముద్రతో నిశ్శబ్దరూపం
ఆలయ గోపురాన్ని తలపిస్తుంది
ఉండి ఉండి, సహనం నశించి ఆయుధం కావచ్చు

అభిలాషను బట్టి భవిత చేతి కందుతుంది
ఉన్న స్థితిని బట్టి ఎప్పటికప్పుడు మార్పు చెందుతుంది

పొద్దు పొడిచి చీకటి తొలగి నంతమాత్రాన
'నిజం' బయటికి వచ్చేనా? సమస్య తీరేనా!
నీడ వెనక దాగిన అనుమానం కలగకపోదు
హృదయంలో వెలుగు పాత్ర పరీక్షకు గురి కావచ్చు.

9. సూచన ప్రకటన

ప్రవాహలో నీరుకూ స్పృశించే గట్టుకూ మధ్య
కవి అస్తిత! ఇరు వైపుల చూపులతో
శరీరాన్ని స్క్రీన్ చేసే యంత్రం ఉంది
మనసును విప్పి చూపే యంత్రం లేదు
మనీష కొంత ఉపకరించవచ్చు
వివేకం కొంత బయటపెట్టవచ్చు

అరచేతిలో ఆకాశంలా తెలియని భవితతో
లలాటాన అదృష్ట ప్రసార రేఖలతో
అడవి నుండి సమాజానికి జీవితాలు
పురా కథలలో పాత్రల్ని తలపించేరు మనుషులు

ఎచటి నుండి అయినా పాట వినాలనిపిస్తుంది
మాటకు మాట బదులు పలకాలనిపిస్తుంది
అప్పటికపుడు ఎచటినుండో సమకూరవచ్చు
తానే పాటగా మారడం తప్పక పోవచ్చు
తనలోనే మాటలు సాగడం తప్పక పోవచ్చు
ఆ పాటలు మాటలు! ఒకటయి మనసును బంధించేను

తన మనో రూపం తెలియని వారు లేరు
తెలియనట్లు కనిపించడ మొక పాత్ర విధం!
ఇది అంతర్నిర్దేశంతో మనిషికే చెల్లుతుంది
కాలంతో పాటు జీవితాన్ని నడిపిస్తుంది సాధనం.

ఆకాశం కిందికి దిగి మస్తకంపై ఆనాలనీ
గగనానికి ఎదిగి పైన అన్వేషణ జరపాలనీ
మనసు చుట్టి బ్రతుకులో సమాజం, ఎప్పటికీ
ఏకాంతం ఎక్కడుంది? జనగణ సన్నాహంలో

పూలు విసిరితే తనపై, శ్రేయం సూచన కావచ్చు
బురద చిమ్మితే! తనపై క్షుద్రత ప్రకటన కావచ్చు.

10. విశేష సమన్వయంతో

జలదాని కెవరు దారి చూప నవసరం లేదు
భూమిపై నుండి ఎవరి సూచనతో పని లేదు
కింద రాళ్ళు ఎంత కొసలు దేరి ఉన్నా
గిరి శిఖరం నుండి జలపాతం దూకుతుంది
ప్రవాహమయి సాగుతుంది కీర్తనలా
ఈ సాహసాని కెవరి అనుమతి తో పనిలేదు.

ఉదయ రాగం ఎవరి కోసమొ ప్రకాశించదు
ప్రణయ రూపం ఎవరి ముద్రనొ అనుకరించదు
ఉదయం లేవగనే జలధి నుండి క్షేమంగా
తీరం చేరిన పయనంలో నావలా! శరీరం.

అపుడపుడు ప్రమాద ఘటనలో పయనించే కారు హఠాత్తుగా
తలుపు తెచుకొనీ పచ్చికపై విసరేసినట్లు ఉంటుంది

సినిమా చూచి హాలు నుండి బయటికి వస్తూనే
జేబులో పర్సు కనిపించని స్థితిలో
థియేటర్‌కు రాకముందు ఇది జరిగితే
చిత్రం చూడగలిగే వారమా? అనిపిస్తుంది
పొంతన లేని ఊహలతో సమయం గడుస్తుంది
ప్రతి మనిషి జీవితంలో చాలా భాగం!

బరువు సంచిని కొక్కానికి తగిలించినట్లు
బాధ నెవరూ! ఎచటనో వదలి వెళ్ళలేరు!
నడక దైహికం, నడత మానసికం
రెండింటి విశేష సమన్వయంతో జీవితం

గాలి నీరు వెలుగుతో పాటు కవిత
మనసుకు టానిక్‌లా పని చేస్తుంది

ఊపిరి వాహనంపై ప్రాణం పయనిస్తుంది
చేతిలో మట్టిగడ్డ! బాష్ప లవంతో మొలక చూపవచ్చు.

11. దారులు కొత్తవి

చలినీ చీకటినీ ముక్తం చేస్తుంది ఎండ
జడతలో సృజనకు దారి చూపుతుంది చినుకు
చేతన అయినా జడత అయినా రెండింటికీ ఒకటే
కవితకు వర్తనలో భేదం లేదు, క్రియలో వివక్ష లేదు.

ఎండ, చినుకు తమ తమ గుణ మర్యాదలలో
మనిషికి ధైర్యాన్ని ఇస్తాయి, ముందుకు నడిపిస్తాయి
సరికొత్త దృశ్యాలతో శూన్య పటం నిండుతుంది
ప్రకృతితో బ్రతుకులో మార్పులు! వైవిధ్యం కనబరచేను

ఏ రుతువు ఎవరి నుండి తిరస్కృతం కాదు
ఇష్టం లేనిది ఏదీ బహిష్కృతం కాదు
ఎవరి విజయం వారికి ముఖ్య మయినపుడు
స్వేచ్ఛలో దేనికీ చివరిమాట అంటూ ఉండదు

భ్రమరం! దేనికయి తిరుగుతుందో అందరికీ తెలుసు!
గాలి దేన్ని మోసుకొని వచ్చేదీ తెలియనిదెవరికీ
బ్రతుకులో పొందేవేవో ముందుగ! స్పష్టం కావు
దిశతో పాటు గమ్యం మారుతుంది దారి కూడ వేరుగా
ప్రతి పతాక ఏదో ఆదర్శానికి సంకేతం
అర్థవంతమయింది, ఆచరణకు పురికొల్పుతుంది

అద్దంలో ముఖ బింబం మౌనంగా
నిజ రూపం మనసులో గుప్తంగా
కవిలో ఉండే వ్యక్తి కన్న ఎక్కువగా
కవితయే స్వేచ్ఛను కోరుతుంది!

పొందే స్వేచ్ఛలో మనిషి! బరువునుండి తొలగాలని
దొరకే వీలులో మనసు వ్యక్తి బాధ్యతల్ని మరచేను

అరచేతులలో రేఖలు! పుట్టుకతో ఉన్నవి
అవి చూపే దారులు మాత్రం ఎప్పటివో, కొత్తగా.

12. హృదికి ఆత్మీయంతో

బ్రతుకు పట్ల ఇచ్ఛ మానవ ప్రకృతి సహజం
ఇది ప్రయోజన పరతతో తీర్చబడిన శ్రమరూపం
అనుభవ సారంతో విజ్ఞాన వికాసంతో, వివిధ భూమికలలో
మానవ సంస్కృతికి స్థాయిని చేకూరుస్తుంది

హృదయం ప్రేమను కోరుతుంది స్పందనతో
కవిత ప్రేమను పంచుతుంది ఉదారంగా
పందిరి పయి తీగెలా మానవం అల్లుకొనీ
అనుభవ పరిమళాల్ని నింపుతుంది సమాజంలో

ఎగసే ఉదయాన్ని చూడ జాలక పోయినా
వాలే పొద్దును చూడని వారు ఉండరు
ఆతప శిఖలపై మేఘంలా కవిత
తాపం మరపిస్తుంది, హ్లాదం కలిగిస్తుంది

దార్శనికానికీ వాస్తవానికీ మధ్య అంతరాన్ని
కవిత! తన శబ్ద వాహనం పయి దాటిస్తుంది
కవితో ఎవరికీ పరిచయం అవసరం లేదు
కవిత ప్రయోజనం హృదికి ఆత్మీయంతోనే

మనసుకు మబ్బుల పయి నడవాలనిపిస్తుంది
అంతలో పిడుగుపాటు ధ్వని భయంతో
ఇంతలో మెరపు తీగె! మదిని హత్తుకొనీ
నేలకు దిగిన వర్షంతో ఆనందం మబ్బును మరిపిస్తుంది.

అక్షర జగత్తులో రవి చంద్రులు చెరొకవైపుండి
శబ్దానికి అర్థంతో భావ ప్రకాశంతో
చంద్ర కాంతి వీడరాని దవుతుంది
సూర్య కాంతి కావలసినదవుతుంది

శ్రమతో విజ్ఞాన వికాసాల సమాజం
పోషణ రక్షణ భద్రత యత్నంలో! మానుషం!
ఇతర ప్రాణికోటి కన్న మిన్నగ మనిషిలో
అన్వేషణ చింతన దార్శనికంతో మతి విభవం!

13. నీరు ఒకటే! వెలుగు ఒకటే!

అంతరంగం అపుడపుడు మనిషి శక్తికి నికషోపలమై
బలంతో పాటు క్షుద్రతను కూడ బయట పెడుతుంది

చుట్టూ తప్పని ప్రకృతితో అనుబంధం
మనిషిలో జీవన రుచిని పెంచుతుంది
ఆరోహణలో గిరి శిఖరం స్వాగతమిస్తుంది
గగనం తాకే చర్యకు విహగం ప్రేరేపిస్తుంది

ఇరువైపుల గట్ల మధ్య ప్రవాహం తరలుతుంది
వంపులలో మలపులతో నిరంతరం సాగుతుంది
ఉత్సాహంలో హద్దులు దాటుతుంది మనిషి జీవితం
తెలియని పరిణామంలో కష్టం ముందుగ తెలియదు

ఆసనం కిరీటం రాజ చిహ్నాలు తొలగవచ్చు
లోన రాజ్యకాంక్ష అగ్నివేదిపై జ్వాలారూపం
ఇవి దేనికి చిహ్నమో! ఆలాగే ఉంటాయి భద్రంగా
పీడనం, అధికారం నిరంకుశం, హింస లతో.

చరిత్ర నీడలా వెనకనే ఉంటుంది
సంస్కృతి మనిషిని ముందుకు నడిపిస్తుంది
మారుతూన్న సమాజానికి ప్రతినిధి కవిత
భౌతిక మానస స్థాయిలలో కర్తవ్యం వినిపిస్తుంది
ప్రశ్న! కలగడం మనిషిలో మనీషకు నిదర్శనం
సమాధానం రావడం వివేక స్ఫూర్తికి తార్కాణం

మౌన శిల్పంలా ఉన్న అక్షర రూపం
కవిత! మాట్లాడుతుంది సహృదయులతో
గళం విప్పుతుంది, పదం వెంట పదం
మనో నిలయాన్ని ఉత్సవమయం చేస్తుంది

ఏ నది అయినా త్రాగే నీరు ఒకటే
ఏ కవిత అయినా చూపే ప్రకాశమొకటే.

14. చూపు వెనక నుండి

యంత్రమయినా మంత్ర మయినా
మనిషి మేధ చూపే విన్యాసాలే
ఒక్కొక్క భంగిమలో మనసును చూపిస్తాయి
ఒక్కక స్థాయిలో మనిషిని నిలుపుతాయి.

ఏవో బాణాలు కొన్ని గురి తప్పాయని
వీరుడు విద్యను వదలడు, ప్రయోగాన్ని మానడు
విజయంపై కోరిక సహజం ప్రతి మనిషిలో
అతి తనకే తన వశమై ఉండాలని కూడా ఎప్పటికీ.

ఒక సమయంలో బాష్పలవం కుసుమ కళిక కావచ్చు
ఒక సమయంలో బాష్పలవం అనల కణం కావచ్చు
దానమయిన వీరమయిన కరుణ అయిన
ఏదయినా మనిషిలోని మనో పార్శ్వ భూమికయే.

విలయానికి హారతిలా విస్ఫోటం! జ్వాలామయం
ప్రకృతి కన్న మానవ ప్రేరితమే ఎక్కువ! సమాజంలో.

సమాన భావమున్నా, బాధ సమానంగా ఉండదు
అవకాశం సమానమయినా, శక్తి సమానంగా ఉండదు
మోదంలో ఖేదంలో! ఉన్న కళ్ళు ఒకటే
వాటి వెనక నుండి పనిచేసే కథలు వేరు.

అక్షరం ఎంత బరువును మోస్తుందో
అంత కంత బాధ్యతను జ్ఞాపకం చేస్తుంది
కవిత ప్రభావం మనసుపై ఆ పాత్రకు తగినంత
నీలి మచ్చను అందమయిన చిత్రంగా మార్చేను
తెల్లని గీతను స్నిగ్ధమయిన మనిషిగ తీర్చేను
మనిషి స్వరం వినిపిస్తుంది పద పదం కలిసి ధారగా

పులి ఎదురయి! బోను తలుపు తెరచి తయారుగా కవిత!
చాటు నుండి వేటరి తూటా వదలకుండా చూస్తుంది!

15. ఊహలో చర్యలో

ఒక స్థితిలో మనసు వెనక్కి వెళుతుంది
స్మృతి వనంలో చరిస్తుంది; కొంత సేపు.
పూవునో ముల్లునో తలపించే అనుభవం
వర్తమాన క్షణాలను మీటుతుంది!

ఇది స్పందనలో సృజనకు మూలమయి
కవిత వెడలుతుంది కళను అద్దుకొనీ
గతంతో అనుబంధం నిలుపుతుంది
వర్తమానానికి కొత్త ముఖం చేరుతుంది

మాట మంతి బండికి రెండు చక్రాల్లా
కలిమి లేమి తరాజుకు రెండు పళ్ళేల్లా
సమాజ జీవితానికి విలువలు చేకూర్చేను
పరువు మర్యాద అస్తితకు చిహ్నాలయ్యేను

నేలనుండి చూస్తే శూన్యాకారం గగనం
పై కెగిరే కొద్దీ ఎదురుగా దారి ఏర్పడేను
భూమిపైకి దిగే కొద్దీ ఆకర్షణ పెరుగుతుంది
కవితలో రెండింటికీ! సమానావకాశం!

భద్రతకు చుట్టు గోడ తప్పదు
రాక పోకలకు ద్వారం తప్పనిసరి
రక్షణకు ఆయుధం కావలసిందే
దాని ప్రయోగంలో వివేకం ముఖ్యం

వెలిగే దీపానికి చుట్టూ కవచ మవసరం
లేనిది వీచే గాలికి దీపం ఆరిపోవచ్చు

ఎంత శుభమయిందయినా ఊహలో
ఎంత చెడు దయిందయినా చర్యలో
మెలకువతో స్వప్నం! శూన్యంలో మాయమవుతుంది
మనిషి మనసు అద్దాల కేసులా స్మృతులతో భద్రంగా!

16. వెలుగు మనిషి యానం

సందేహ భయాలలో ముంచుతుంది చీకటి
ప్రశ్నకు కారణమయింది, జవాబుకు ప్రేరేపిస్తుంది
పయనంలో వెలుతురు ధైర్యాన్ని ప్రసాదిస్తుంది
తగిన జవాబు అంచుల్ని స్పృశింప జేస్తుంది

ఆలోచనలో అన్వేషణ ఆరంభమవుతుంది
చీకటి! దాగుడు మూత లాడుతూనే ఉంటుంది
ఎవరి పయనం వారిది, అందరి గమ్యాలొకటి కావు
ఎవరి యత్నం వారిది, వాహన వేగా లొకటి కావు

మెలకువ పద్మంలా విప్పారుతుంది
క్షణాల రేకులతో మనసును ఆకర్షిస్తుంది
నిద్రారూపం ఒక కొండను తలపిస్తుంది
మెలకువ ఒక ప్రవాహాన్ని తలపిస్తుంది

నిదుర అవసరం! విశ్రాంతికి చీకటి ఒకతోడు
పయనానికి తోడు వెలుతురు, మెలకువ ముఖ్యం
సరసిలో మునిగి లేచినట్లు ఉంటుంది
మనసు శుభ్రమయి అభినవ మవుతుంది.

మెలకువలో వెలుతురు రూపం కవిత
ఎదుట నున్న మంచు తెరలను తొలగిస్తుంది
నిజ దృశ్యం చూపిస్తుంది, జవాబుకు దగ్గరగా
చేతనలో ఉత్సాహంతో వేగం పెరుగుతుంది.

ఇష్టమయిందే కాదు ఇష్టమవనిదీ! సమంగా
అన్నిటికీ విశాలావకాశం లభిస్తుంది
మోదం ఖేదం కోపం సహనం స్థితులతో
వెలుతురుతో చీకటికీ చోటు లభిస్తుంది
ప్రశ్నకు పొందే జవాబు క్రమంలో ఎప్పటికీ
చీకటి మెట్లపయి ఆరోహణ యానం జీవితం!

17. వితర్కం అనుభవం

కవి అయినా నాయకులయినా కర్మశీలురెవరయినా
కింది నుండి పై స్థాయి వరకు శ్రమ జీవన రుచిలో
మనిషిలో మరో మనిషి మౌనంగా సాక్షీభూతంగా
మరొకరికి కనిపించని వెలిగే చేతనతో

ప్రశ్నలతో దృష్టి పడని విషయం బయట పడుతుంది
జవాబులో అందాక కనిపించని గుణం తెలుస్తుంది
కేవలం గవేషణతో ఆలోచన సరిపోదు
స్పందన హృదయంతో వివేచన! ముఖ్యం

క్షుధలో ఆహారం ప్లేటు ముందు చేరి
ముందుగా ఎదురుగ ఉన్నవాటి చరిత్ర తిరగేసేరా?
వంటల విషయంపై చర్చలు జరిపేరా?
వండిన వ్యక్తి గురించి ఆరా తీసేరా?
ఆకలి – ఆహారం గురించి శోధన చేసేరా?
భోక్తల అభిలాషలపై సమీక్ష సాగేనా?

హృదయం మెచ్చిన విషయం స్పందనలో తెలుస్తుంది
వ్యక్తులు మరుగునబడి విషయం తేలుతుంది
కాల పటం పయి చెరగని ముద్రలు కనిపిస్తాయి
ఇవి ఎవరిసొత్తు కావు! జీవన సంస్కృతి చిహ్నాలు

శిల్పశాలగా చీకటి మారే అవకాశముంది
కొందరికి సుందర విరామ నిలయం కావచ్చు
కొందరికి ఎత్తిన కత్తిని తలపించవచ్చు
కొందరికి దీప సహాయంతో పని నెరవేరవచ్చు

కనిపించని మనసుకు తగిలిన గాయం
కాలంతో పూర్తిగ మాయం కాదు
లోపల బాధా స్వర చిత్రం మిగులుతుంది
జీవితాన మలుపును తెస్తుంది! అనుకోకుండా.

18. ఉద్గమనం నేర్పుతుంది

ఉదయం గూడు నుండి పయనంలో పక్షి
వెనక్కి చూడదు, మరలదు, మునుముందుకే
సాయం వేళకు గూటికి చేరుతుంది
మనిషి బయలు దేరాక, వెనక్కి రావచ్చు!

నేలపై అడుగుజాడలు గుర్తించవచ్చు
గాలిలో నీటిపై మిగిలవు, కనిపించవు!

ప్రశ్న దూసిన బాణంలా తాకవచ్చు
అదే! సర్పంలా ముందుకు సాగవచ్చు
జవాబు మాత్రం అలలానో పూవుగనో
చలిలో కిరణంలానో ఉండాలని కోరిక!

పాల పిట్ట అందం పావు రాయి చందం
స్వేచ్ఛలో ప్రేమ సమత సుఖశాంతులతో
ఒక్కొక సమయం చంద్రబింబం తలపిస్తుంది, అందులో
శిశువు ముఖాన్నో ప్రియా హృదయాన్నో! అమ్మ రూపాన్నో

పగటి సూర్యుడు లేని లోటును తీర్చే యత్నంలో
రాత్రివేళ చంద్ర బింబం! సంతోష పరుస్తుంది.

అస్థి పంజరం మనిషికి బదులు నిలవలేదు
అవయవ శోభతో మాంసల పూర్ణ శరీరంతో
మస్తిష్కంతో మతి విభవం హృదయ స్పందనం
ఉన్న మనిషికి మనిషే! సరి పడేది మరొకటి లేదు!

జలధిలో నావలా, గాలిలో విమానంలా
భూమిపై వాహనంలా ఒక్కొక్కరిలో కవిత!
గమ్యానికి పయనం సాగింప చేస్తుంది
దిశ దిశలో దృశ్యం! దగ్గరగా చూపుతుంది

ఇది పెట్టెలో దాచేది కాదు
బయట పడే ప్రకాశ రూపం
అణచబడేది కాదు, అణచబడిన వాటికి
ఉద్గమనం నేర్పుతుంది, ఆదర్శం చూపుతుంది

19. కవి పని

గిరి శిఖరం చేరేదీ, జలధిని తరించేదీ
గగనంలో విహరించేదీ, మతి విభవంతోనే
తలుపు మూస్తే లోన, తలుపు తెరిస్తే బయట
దృశ్యం! ఒకటొకటీ! కవితకు సంప్రేరణలు!

వర్తమాన గమనంలో కవిత! చేతనతా గుణంతో
సామాజిక సందర్భంలో మనసుకు ఆకృతి నిస్తుంది.
అశాంతిలో క్షణాలు తీరం చేరిన తృప్తిని ఇస్తుంది
మనసుకు రక్షణ రూపంలో విజయరుచిని చూపిస్తుంది

వెచ్చని శ్మశాన స్థలి పచ్చని మొక్కలా కవిత
విషాద చరిత్రకు నవ్వు ముఖాన్ని ఇస్తుంది!
అస్తమయం లేని రవి రశ్మిలా కవిత
ఎప్పటికీ ప్రకాశ రూపాన్ని కలిగింది

క్షణం కూడ చీకటి స్పర్శకు అవకాశం లేకుండా
సహృదయుల ఆలోచనలో తేజం నింపుతుంది
ఉదయంతో మొదలయిన సంతోష క్షణాలు
అస్తమయంతో విషాద ఛాయను పొందనీయదు

భూమిపై సాగేకాళ్ళ బ్రతుకుకై చేసే ఊహలు
రెండూ! కవితలో చెరొక వైపునుండి, ఆదుకునేను

కొత్తదనం పయి చూపుతో మనసులో
సమాజాని కంకితమవుతుంది! సృజన
కవి జ్యోతిష్కుడు కాదు, దార్శనికుడు కావచ్చు
వర్తమానంలో కవిత, భవితకు దారి చూపుతుంది

చెట్టు కలలు ఫలిస్తాయి పూలతో పండ్లతో
మనిషి కలలు క్షణంలో మరుగునబడి పోతాయి
మరుభూమిని పచ్చగ తీర్చడమే కవి చేసే పని
హృదయాలను ఆర్ద్రపరచడమే! కృతి ఆశయం!

20. అనుభవ శాఖలు వేరు

మనసులో ఊహలు గాలి అలల వలె
కోరినవి కోరనివి బరువులు మోసుకొనీ
పరిమళ స్పర్శ నీయవచ్చు
దహన ధూమం చిమ్మవచ్చు

మాట కావచ్చు పాట కావచ్చు
హ్లాదం వేదన ఏదయినా కావచ్చు

పోయే క్షణానికి వీడ్కోలుతో
వచ్చే క్షణానికి స్వాగతంతో
కాలంతో పాటుగ వేగంగా
జీవన వాహన రూపం కదలేను

రోజు చివర రవి అస్తమయం పశ్చిమాన
రోజు మొదలు రవి అవతరణం తూర్పున
తప్పక జరిగి తీరుతుందని
అందరికీ తెలిసిన వాస్తవం
మనుషుల విషయంలో ఏది ఎపుడు
జరిగేది! ఏది పై బడేదీ, తెలియదు

బ్రతుకు పుస్తకంలో పదం తరువాత
ఏ పదం వచ్చేదీ ఎవరికీ తెలియదు
ఇది తెలిసేందుకు ఆలోచన లెన్నో!
జ్యోతిషం మొదలుకొని మరో మరో మార్గం

ప్రతి సమయం! కాలంతో దృశ్యం మారుతుంది
ప్రతి సందర్భంలో ఉన్న మతి రూపం మారుతుంది
జీవితానికీ సమాజానికీ ఘన సంబంధ రూపం కవిత
ఊపిరిలో ఒకటై మనిషి జీవ రూపంలో ఒదుగుతుంది

ఉన్న పేరు తొలగి మరో పేరు చేరుతుంది
మూల మనో గుణం అదే! అనుభవాలు వేరు!

21. ప్రజాస్వామ్య వాహనం

చేతిలో పతాక రెపరెప లాడినంత మాత్రాన
దార్శనికం హృదిని ఆవహించినట్లు కాదు
ఏ దారి ఎవరి సొంతం కాదు
నడచే జనులదీ, ఎప్పటికీ
పని పడినపుడు గమ్యం చేరుస్తుంది
మనసుకు సుఖకరంగా ఉండడం అవసరం

ఇది స్వేచ్ఛా విషయం మనిషి జీవితంలో
సూర్యుని వలె సంకల్పం ఉపకరిస్తుంది
దిశ దిశలో ఉన్న దారులు చూపుతుంది
నిర్భయంగా ముందుకు నడిపిస్తుంది.

నిన్న "నీ బానిస" నన్న నోరు
ఇపుడు అగ్ని శిఖలు చిమ్ముతూంది
నిన్న నీడను పొందిన స్థలంలో
ఇపుడు అడ్డు గోడలు నిలిచేను

స్వేచ్ఛకు సంకెల వేసే ఆలోచన ఇప్పటికీ నిరంకుశులలో
ప్రజాస్వామ్యంలో అంగీకరించరానిది, ప్రమాదకరం.

నాలుగు గోడల మధ్య లేచిన మంటలను
ఏ యజన గుండంలోనిదో అనుకోవచ్చు!
ప్రాంతమయిన దేశమయిన అవసరాలందరివీ ముఖ్యమే
ఏ కొందరికో పరిమితమై ఇతరులకు శూన్యం, దారుణం

నిజం పలికే గొంతుక తడబడదు!
గమ్యం చేరే కాళ్ళు నిలిచి పోవు!

లోన కావలసిన సత్సంకల్పం ఎన్నిక ముఖ్యం.
లోన ఆలోచనలో మూలం, బయట వర్తనలో అనుభవం
నిరసనలో హింసను అనివార్యం చేయరాదు
ప్రజాస్వామ్య వాహన చక్రం! పయనంలో! తొలగరాదు.

22. నేపథ్య స్వరం

నిన్నటి వరకు ఖాదీ దుస్తులలో సేవామతి
నేడు ఖాకీ దుస్తులలో నిరంకుశం విశేషం
అద్దంలో తన ముఖం చేతుల కందిన సంతోషం
మార్పులకయి ఉత్సాహం గంతులు వేయిస్తుంది

సందేహంలో జలధి లోతుల తెలియవు
పై పైన అలలతో ఎంతో అందంగా కనిపిస్తుంది
అడుగు వేసి నడవాలనిపిస్తుంది రాజకీయంగా
అడుగు పడితే! కనిపించే అమాయక ముఖం మింగేస్తుంది

డబ్బు విలువ తెలియని దొక శిశు దశలోనే
పోను పోను బ్రతుకులు డబ్బుకు కట్టి వేయబడతాయి
తిప్పవచ్చు ఆడించవచ్చు గంతులు వేయించవచ్చు
ఓటు హక్కు తనది అనుకున్నది ఇతరుల వశమవుతూంది
ఆరోజు పేద కడుపు కాస్త చల్లబడవచ్చునేమో!
లేమిలో అంతో ఇంతో ఆదుకునేనని పేరాశ ఉండొచ్చు.

మాయాజాలంలో పడిపోయే ఊహించరాని సందర్భంలో
పూల కన్న ముళ్ళే ఎక్కువగా దారిన కనిపించేను
పగలయినా రాత్రి అయినా సమస్యలో ఎదురయ్యే
బాధకు ఉపశమనంగా చల్లని మాట కరువవుతూంది

కవితకు నియతమయిన సమయం లేదు
స్వేచ్ఛగా గాలిలో తేలుతూ సమీపిస్తుంది
సూర్యుని కిరణంలా మనసులో వెలుగుతుంది
పద పదాన సోకి కవితను నడిపిస్తుంది

సమాజ చింతనలో మెలకువ సార్థకమవుతుంది
జలధిలో పడవలా సమాజంలో పయనించాలనీ

వెనక నుండి సమయానికి తగిన తంత్రీ స్వరం వినిపించాలని
చుట్టు దిశదిశ కోణాలెన్ని ఉన్నా, ఆ కనబడేది సాగేదీ ఒకటే!

23. వాస్తవ చక్రంపై

ఇపుడు కర్తవ్యానికి ముఖాలు రెండు మనిషిలో
బయటినుండి దరిద్రాన్ని తుడిచి వేయడం
లోనుండి చీకటిని తొలగజేయడం
ఖడ్గం బదులుగ అభయముద్ర చూపడం

పేదరికం వారసత్వ సంపద కాకూడదు
భాగ్య రాశి ఏ కొందరి వశమో కాకూడదు
అందరికీ చేరినపుడే సమాజ భవితకు సమగ్రత
లేంది, స్వార్థపు కోట లోని దవుతుంది చరిత్ర!

శిథిలాలను తీసి మూజియంలోకి తరలించి
స్మృతులను మనో నిలయ ద్వారానికి వేలాడదీసి
నిర్మాణం సరికొత్తగా! ముందుగ యోజన ముఖ్యం
జలధికయినా నాల్గు వైపుల హద్దులు! ఎచటెచటో
ప్రవాహానికి ఇరువైపుల గట్లు వరద దాటకుండా
మనిషికి మాత్రం నియతి లేదు హద్దు లేదు స్వేచ్ఛలో!

పనిలో మనిషి ఉన్నపుడు! అతీతం గుర్తుకు రాదు
తాను చేసే పనిలో పూర్ణత వైపునే దృష్టి అంతా
పని పూర్తి అయ్యాక, ఇది కోరే మన్నించే
మనుషులతోనే పని! యశోరూపానికి స్తంభాలుగా

ఆలోచనలో మేధకు సమయం పడుతుంది
స్పందనలో హృదయానికి సమయం పై బడుతుంది

తన దోషం లేక పోయినా తనపయి దుష్ప్రభావం పడుతుంది
అంటుకున్న మంటకు పక్కనున్న పూల చెట్టు కమలినట్లు!

జరిగే ఘనటకు మారిన సమాజ దృశ్యం
కవితలో తిరిగే వాస్తవ చక్రంపై కనిపిస్తుంది
మార్పులో ఆకర్షణ! రూపంతో పాటుగ గుణంపై
ప్రయోజనంలో భౌతికంతో మానసికం తప్పనిదీ!
క్షణాలు సమయానికి పూలు విరియక పోయినా
ఇనుప కంటకాలు చూపకుంటే చాలు!

24. తనువు గురించి

చుట్టూ నాలుగు గోడల మధ్య పైభాగం ఖాళీ
స్వేచ్ఛ పేరుతో గాలి వెలుతురు దయచేయొచ్చు
సాయంవేళ నుండి కమ్ముకునే చీకటి ప్రభుతతో
అపుడపుడు ధైర్యమిచ్చే చుక్కలూ కనిపించవచ్చు
చంద్రుడు ఎపుడయినా చల్లని చూపు ప్రసరించవచ్చు
బయటనుండి తలుపు తాళం వేయబడీ
ఎవరో రావచ్చు తీయవచ్చు, తాళం చెవి మరొకరి వద్ద
వీధిన వేళ్ళే మనుషుల ముఖాలకేం పట్టింది? పట్టదు.

ప్రతి మనిషి జీవితంలో ఒక సందర్భం ఇలాంటిది
రాకూడదనే! వస్తే? తాపసి కావచ్చు వీరుడు కావచ్చు
శూన్య హస్తంలో జపమాలో! తుపాకియో చేరవచ్చు
ఆయుధం ఎక్కడిది? అంటే పై ఖాళీనుండి లోనికి విసరిందీ
మనిషికి మనిషి సహాయం చేసే మతితో
తెలిసిన ఉదార మతి ఎవరో! పై నుండి విసరినట్లనిపిస్తుంది

తుపాకి బదులు ఏ గొడ్డలో విసరితే
బాగుండేది! తల అయినా పగిలిపోయేది
కావలసిన రంధ్రంతో గోడ అయినా కూల్చబడేది
బయట పడే దారి కాస్త కనిపించేది

ఇది ఎవరిపై ప్రయోగించాలి?
తనపైనే గురి పెట్టుకోవాలా?
ఇది ఆత్మరక్షకా? స్వయం శిక్షకా?
తనువు గురించి ఆలోచన! సందేహ పదంలో

కరువులో బొక్కెనకు తాడుతో బావి లోని
నీరు పైకి తోడితేనే, దాహం తీరుతుంది
యోజనతో మానుషయత్నం! సమస్యలో కీలకం.
బ్రతుకులో సంకల్పం! నెరవేరాలని ఆరాటం మనిషిలో

25. కవి హృదయం విశ్వమయం

కోపం ద్వేషం హననంపై కోరికల్ని పరచరెవరూ!
ఆ ఛాయలతో ఉపదేశం నినదించవచ్చు
సామాన్యుల నుండి పెద్దల దాకా అందరూ
ఎవరి స్థాయిలో వారు అనుభవమో! శాస్త్రమో విప్పుతారు

తాపం శాపం విలయంపై ఆస్థ ఎవరు ప్రకటిస్తారు
ఆ జాడలలో ప్రబోధం శబ్దిస్తుంది
మంచి మమత నీతి నిజం తన చుట్టు తిరిగేనని
మ్యూజికల్ చైర్ పరుగులో ఒకరొకరు వేగంలో

ఇది ఏ లాటరిలోను పలించే అదృష్టం కాదు
ఎవరినీ పక్కకు నిలిపే అవకాశం ఉన్నది కాదు

దేహ బలం మనో బలం అధికారంతో
జీవన భాగ్యం పొందే ఆలోచనా శిఖరాలపై
కవితలో జీవితమొక అంతర్విలోకన బింబం
యథా స్థితి నుండి పరివర్తన భావం సహజం

మనుషుల కలయికతో శ్రమజీవన కారణమయిన
అపూర్వ కళా రూపాలు! సమాజ సంపదలవుతాయి
బాధలో సహనంతో పాడే పాటకు పలికే మాటకు
సమయం వెనక నుండి, నేపథ్య స్వరం జత అవుతుంది

కవితయై సృజన రూపం బయట పడుతుంది
కళాకృతియై సమాజాన్ని అలంకరిస్తుంది
కాలాంతరాన నలిగి తునిగి చెదరిన సంస్కృతి
శిథిలాల నుండి గవేషణలో మ్యూజియం చేరవచ్చు

ఎవరు ఎక్కడినుండి? ఎపుడు? ఇక్కడికి వచ్చారు?
ప్రాణం పోసే గాలి అంతటా ఒకటే!
బ్రతుకును నిలిపే నీరు అంతటా ఒకటే
ఉనికిలో మానవీయ మొకటే! కవి హృదయం విశ్వమయం.

26. అంతరంగ చేతనలో

ఏది నిజం? కారణమెక్కడ? జవాబు ఏది?
ఎక్కడనో లేదు! ఉపయోగించే దృష్టిలో ఉంది
భిన్న భిన్నమయిన బహు ముఖాలతో 'నిజం'
ఒకటొకటీ తటస్థ పడుతుంది జీవితంలో

అపాయంలో మనిషి చీమనో దోమనో తలపించేను
లోయ లోకి జారిపోతూ ఉన్నట్లుగ అనిపిస్తుంది
చుట్టబడే చీకటి చాపలా స్థితి మారుతుంది
'నేను' అన్న భావన విత్తులో ఒదిగినట్లు ఉంటుంది

ఉపాయంలో మనిషి సూర్యుణ్ణో చంద్రుణ్ణో తలపించేను
సంఘంలో హిమగిరి శిఖరంలా ఎదిగినట్లు అనిపిస్తుంది
బంగరు మెట్లపయి భాగ్య దశకు చేరుతూన్నట్లు ఉంటుంది
'నేను' అన్న బీజం ఎదిగి నిప్పు పూలు రాలవచ్చు.

ఒకరి బ్రతుకు నొకరు పెట్టెలో బంధించాలనీ
తన ఉనికిని విస్తరిస్తూ ఆయువు గడపాలనీ
కడలి అంచు దాక వెళ్ళి అడుగులు ఆగుతాయి
జలాలు దాటి మరో తీరం చేరాలని కోరిక ప్రబలంగా

చేతిలో చీకటి ముద్దను నిలిపితే
మనిషి ప్రజ్ఞ దాన్ని శిల్ప శాలగ తీర్చవచ్చు
కళాఖండం కావచ్చు దేవతామూర్తి కావచ్చు
ఆదర్శ ప్రాయులయిన మహనీయులు కావచ్చు

ప్రశ్నకు జవాబు విషయం సందర్భంతో ఉపయోగంలో
అసలు నిజం పుస్తకంలో దొరకదు, ఉపదేశంలో దొరకదు

బయటికి కనిపించని అసలు 'నిజం' కిటుకు
మనసు తలుపు తెరచి చూస్తే గాని తెలియదు
ప్రశ్నకు సమాధానం అనుభవ సుందరం
అంతరంగ చేతనలో ఇదొక కారణ గుణ రూపం.

27. చెట్టు నీడలో

తమలో సారభూతమయిన అగ్ని సరిస్తూందని
చాలా మందికి తెలియదు, తెలిసినా మరచేరు
ఇది జీవన హేతువయి వీరానికి ఆలవాలమవుతుంది
ఏ దారినొ మనిషిని నడిపిస్తుంది, ఉద్యమ శీలంతో.

మనిషి ఎంత గొప్ప అయినా తన ముఖం తనకు కనిపించదు
అద్దంలో కనిపించవచ్చు కాని అది ప్రతిబింబం మాత్రమే!
ఎవరికి వారు ఇష్టమయిన దారులలో స్వేచ్ఛగా
అవకాశం సద్వినియోగంతోనే కోరే మార్పులు సార్థకం

ఆరుబయట అయినా నాలుగు గోడల మధ్య అయినా
కవిత! తన పాత్రను నిర్వహించేందుకు వెనుకాడదు
విసరే రాయినుండి దూసే మిసైల్ దాకా
దశలలోని ఆయుధమవుతుంది, అవసరమయితే!

ప్రకృతి నుండి వికృతికి మారే పరిణామంలో
సందేహానికి స్వస్తి! పురోగతికి ఆహ్వానం!
స్వేచ్ఛకు అడ్డుగ ఉన్న రాతి గోడను కూల్చేరు
అగ్నికి ఆహుతి కాకుండా వెనకనే జలదం కదలేను

జలపాతం లా దూకే అక్షర ప్రవాహ వేగాన్ని
వహించే మనోబలం కవికి అవసరం
భూమి దారి ఇస్తుంది! జనత గుండె వాహనమవుతుంది
ప్రతి కవికీ సమాజ రూపంలో కొత్తదనం రావాలనే ఉంటుంది

హృదయం ఎవరి వైపు కాదు, తన పయనంలో నిజం కోసం
ఏదో దార్శనికంతో కలవడమొక అవసర సుందర సహయోగం
దూసిన బాకు నైశిత్యం! తగిలిన గాయంతో తెలుస్తుంది
వెడలిన మాట నైపుణ్యం జరిగే అనుచర్యతో తెలుస్తుంది

ఒకరి సమాధానం నివురు కప్పిన నిప్పులా
ఒకరి సమాధానం మంచు రాలిన గులాబిలా
పగలు రాత్రి శ్రమించినా! వేటలో జయం వరించకపోవచ్చు
చెట్టు నీడ చేరగనే! ఏ పూవో ఫలమో! చేతిలో పడవచ్చు.

28. పగలయినా ఒకటే

పదం వెనకనే పదం లహరిలా సాగాలిసిందే
సహృదయ తీరం చేరే వరకూ కవితలో
ఉత్సేకం దేనికి అంటే, అది స్పందన సహజం
జన జీవన రహస్యం చెప్పేందుకు చూపేందుకు.
అద్దంలో బింబంలా హృదిలో సముద్రం ఒదిగీ
బ్రతుకులో లోతులు! కనుగొన చేస్తుంది
ఇది మానవ గీత! వర్తమాన జీవన ఘర్షణలో
తేలిన నవనీతసారం, ఆశాపూర్ణమైన వాస్తవం

అపాయాన్ని తెలిపే ప్రమాద ఘంటిక వినిపిస్తుంది
బాధా స్వరం వెనుకనుండి ఆశాహస్తం అందిస్తుంది
ఒకదాని వెనుక మరొకటి నిరంతరం సాగే
సమాజ దృశ్యపరంపరా రూపం ఒక ప్రయోగం
సమాజ శ్రేయో విభవం ఈ జీవితం
ఆయుధ బల ప్రదర్శనం కాదు
సంహారం చరిత్ర బింబంలో వెలుగు భాగం కాదు
ఇది స్వేచ్ఛా కవితా సమాజ నవ యానం

లాభం నష్టం దైనందిన బేరీజుల జీవితాలు ఆర్థికాలు
స్వార్థం సంపాదన రెక్కలపై దిశలు తిరిగి రావాలని
తెలుపు నలుపు మధ్యలో పలు రంగుల మేళనంతో
ఒక్కొక్క జీవిత మొక విశేష చిత్రాన్ని ప్రకటిస్తుంది

పగలయినా ఎదపై చీకటి బాకు దిగవచ్చు
మమత లేని స్వేచ్ఛలో విషాదం గంతులేయవచ్చు

కఠోర వాస్తవాన్ని ఎదుర్కొనే ఉద్రేకంలో
మనిషి ఆయుధ మవడం, శోచనీయం!
అక్షర ముకురంలో బింబాలవలె స్వేచ్ఛా కవిత్వం
సామాజిక రాజకీయ నైతిక తాత్త్విక ప్రపంచ రూపం

95. స్వేచ్ఛా కవిత్వం

ఇది జీవితం

(XX భాగం)

జీవితం స్వతంత్రం

మాదిరాజు రంగారావు

2019

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 28.

Sveccha Kavithvamu - 95

Idi Jeevitham

Jeevitam Swatantram

(XX Part)

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santosh Kumar

Y.P : 2019

Presented
to my wife
Smt. Indira

పీఠిక

ఇది "జీవితం స్వతంత్రం" పేరుతో వెలువడే కృతి స్వేచ్ఛా కవిత్వంలో బృహత్కృతి "ఇది జీవితం"లో (20)వ భాగం.

ఇందులో దీర్ఘమయిన విస్తారమయిన ఈనాటి మనిషి జీవితంలో స్వతంత్రమయిన ప్రవృత్తికి చెందిన విషయం కేంద్రంగా ఉంది. ఈ అంశం ప్రజాస్వామ్య భావనకు దగ్గరగా ఉంది. జీవితం వివిధ పార్శ్వాలతో కూడింది. సామాజిక రాజకీయ ఆర్థిక నైతిక తాత్త్విక స్థితులతో కూడింది. ఎన్నో సమస్యలతో ఎదురవుతుంది. దీనికి ఎవరు? ఏది కారణ మన్నది చాల క్లిష్టమైంది. ఒక దానితో మరొకటి కలిసి ముడివడింది సంశ్లిష్టమైన విషయం. ప్రధానంగా ఈ రచనలో సామాజిక వైయక్తిక స్థాయిలలో వర్తమాన జీవిత చిత్రణం కనిపిస్తుంది.

ప్రతి వ్యక్తి జీవితం – ముఖ్యంగా మనోరూపం కేంద్రంగా స్వతంత్ర మయింది. మధ్య మధ్య పలు అంశాల ప్రభావాలకు లోనవుతుంది. ఈ ప్రభావాలు కలిసి జీవితానికి సంశ్లిష్టతను చేకూరుస్తాయి. వీటి పరిశీలనం వివేచనం కార్య కారణ సంబంధాల స్థాపనం చాలా జటిలమైన పని.

ఈ నేపథ్యంలో వర్తమాన జీవితంలో స్థితి గతులు విషయంగా ఈ కృతి రూపొందింది. అందువల్ల ఆధునిక దృష్టితో ఎదురయ్యే అంశాల స్పందనల్ని గమనించవచ్చు. అలజడి అశాంతి హింస హత్యలు కుటిలత దుశ్చర్యలు దుస్థితి తో పాటు ఉదారత త్యాగం సహనం శాంతి సహకారం సహభావం సహవర్తనం సమాజంలో సుస్థితికి కారణమవుతాయి. ఇందులో విషయానికి చెందిన బాహిరంతో పాటు ఆంతరమైన అనుశీలనమూ కనిపిస్తుంది. కవిత్వ కళతో ఇది ఇపుడున్న స్థితిలో ఉత్తమమైన విలువలకు దోహదం చేసేదిగా భావిస్తాను.

వ్యక్తిత్వ విశేషతలు గల మనుషులతో సమాజ మెన్ని విధాలో కవిత్వ మన్ని విధాలు. ఈ స్వేచ్ఛా కవిత్వమొక విధం. ఉన్నతమైన ఆశయాలతో ఉత్తమమైన భావ సాంద్రతతో ప్రజాస్వామ్య దార్శనికంతో ఆవిష్కృత మయింది. ఇది వాక్యం వెనుకనున్న నిశ్శబ్దం నుండి స్వరం ధ్వని భావన అనుభవ స్థాయితో పర్యాప్తమయింది.

భావన – కవిత్వ కళ రెండింటి మేళనంతో విశాలమైన ప్రాతిపదికపై సూక్ష్మ సూక్ష్మమైన అనుభవ ప్రసారాలతో నేటి జీవన చిత్రణలతో ఇపుడు వస్తూన్న కవిత్వం కన్న భిన్నమైంది, ప్రత్యేకమైందిగా పరిశీలన కందుతుంది.

– మాదిరాజు రంగారావు

1. వర్తమాన గమనంలో

అస్మితలో బీజ భావం తో
పురా రూప చిహ్నా లొకటొకటీ
మనిషి మనసులో అడుగున భద్రంగా
గాఢ తీవ్ర చర్యలలో బయట పడేను
కోపంలో దావానల విస్తరణంలో
తాపంలో మేఘం కయి ఎదురు చూచేను

అస్తితలో పరివర్తన శాఖలతో దశదశలో
వర్తమాన జీవన రూపం! ఒక వాస్తవ దృశ్యం

మార్పు లేని సమాజ స్థితులలో స్తబ్దత
తొలగే దొక చేతనతా గుణంతోనే
తన నీడయే తన మెడకు ఉరి కావచ్చు
తన నీడయే ఎదపై అసి కావచ్చు
జరిగేదంతా! వెలుతురు లోనే
మనిషిపై మనిషి నమ్మకం తోనే

సంశయానికి వీలు లేని నీడ
హఠాత్తుగా! రహస్యం వీడుతుంది
తన నీడయె! శత్రువు కావడమొక
దౌర్భాగ్య జీవన తంత్రంలో భాగం

అస్థిరతకు కారణమవుతుంది
తిరిగే చక్రం ఒరుగుతుంది
సమాజ వాహనం ఆగుతుంది
బ్రతుకు వికలమవుతుంది
నగ్న తరువులా దీనత పొందుతుంది
మనిషి పై మనిషి నమ్మకం చెదరుతుంది

ప్రకృతికి సమాంతర రూపం కాదు జీవితం
ప్రభావాలకు గురి కావచ్చు కాని స్వతంత్రం!

2. సమానంగా

అక్కడక్కడ ఉద్రేక శిఖలు విధ్వంస చర్యలు
ఎవరికి వారు తమలో ఇతరులు ఒదగాలనీ
ఏది మంచి ఏది చెడ్డ! దేనివలన ఎందువలన
ప్రశ్నకూ సమాధానం మధ్య! శూన్యం సమస్యతో
సందేహం చుట్టలుగా చుట్టు కునేను
తాడో పామో తెలియని! చీకటి ప్రభావ దృశ్యం

ఏదో ఒక దిశనుండి నిరసనలు నినాదాలు
సమాజంలో రావలసిన మార్పులకు సూచనలు

విసిరే తుపానుకు చిందర వందర అయినా
తరలే వరదలకు దూరం కొట్టుక పోయినా
బయట పడిన మనిషిలో బ్రతుకుపై ఆశ
ప్రకృతిని జయించే సంకల్పం పెంచుతుంది

కొన్ని గాయాలు మానతాయి మచ్చ లేకుండా
కొన్ని గాయాలు మచ్చలను మిగులుస్తాయి
కొన్ని గాయాలు నిప్పు కణాల్ని తలపిస్తాయి
కవితలో! నిశ్శబ్దం ధ్వనిస్తుంది! గాయం చరిత్ర!!

ఆయుధానికి గుడ్ బై చెబితే భద్రతకు ప్రమాదమనేరు
ఆపదలు పెరగవచ్చు ననేరు, హింస పెరగవచ్చు ననేరు

చీకటికి భయపడి తలుపులు కిటికీలు మూసేస్తే
చంద్రబింబం కన్పించేనా? వెన్నెల మల్లెలు చూపుకు అందేనా?

ఎండిన చెట్టు కొమ్మపై గొడ్డలి వేటు పడేలోపల
రాబోయే వసంతముఖం విషాదంతో
ఉన్మాద వర్తనం మధ్య హఠాత్తుగా కనిపిస్తుంది!
ఎత్తిన గొడ్డలికీ కొమ్మకూ మధ్య నిలుస్తుంది
పరిచయమో స్నేహమో! సందేశంతో పవమానం
గొడ్డలినీ చెట్టునూ మనిషినీ సమానంగా స్పృశిస్తుంది

3. గుర్తులతో

వ్యక్తి జీవితంతో సమాజ చరిత్రతో మనిషి ఉనికి
మరు భూమిని సస్య శ్యామలం చేసే యోచన!
దిష్టి బొమ్మ నుండి వికారిని సుందర రూపానికి
మార్చే క్రియలో! జీవన లిప్తలు గడుస్తాయి

రుతువు తరువాత రుతువు రావలసిందే
బ్రతుకులో ఏ దశ ఎపుడు వచ్చేదీ తెలియదు
ఏది వస్తే అది! సుఖమో దుఃఖమో స్నేహమో వైరమో
దానికనుగుణంగా సమాధాన పడవలసిందే

సమస్యల చిక్కు ముడులు విప్పుకుంటూ
సుడి గుండాలను ఒడుపుగ దాటుకుంటూ
మంచు తెరల నుండి దారి చేసుకుంటూ
కిరణాల వలె ముందుకు సాగిపో వలసిందే!

సమాజారణ్యాన్ని నివాస యోగ్యం చేసుకుంటూ
ఇంటి చుట్టూ పూలతో బంధుత నెరపుకుంటూ
మనసులో కల్పనలో వాస్తవ రూపాలు అందరికీ
చెందినవీ! మనిషిని మనిషిగ మనస్విగా తీర్చేవీ!

శత్రుత మిత్రత రణం శాంతి గదులను దాటుతూ
మనిషిలో కోరికల కనుగుణంగా నడవాలని బ్రతుకులో,
పిరమిడులు స్తూపాలు నివాస నిలయాలు కావు
ఆదర్శ రూపాలు, సంప్రేరణలు, యశో చిహ్నాలు

రవి రాకముందే లేచి కూర్చున్నా
తొలి కిరణం వరకు ఆగ వలసిందే!

సంస్కరణలు నిరంతరం సాగే ప్రక్రియ
విప్లవం వస్తుంది, తాడో పేడో తేలాలిసినప్పుడు
ప్రపంచంలో అందరం ఒకటే అయినా!
సంఘంలో ఏవో గుర్తులతోనే వ్యక్తి ప్రత్యేకత.

4. పుటలొకటొకటి

వాస్తవానికీ కల్పనకూ మధ్య! మల్లె తీగె పాకవచ్చు
పారే ఏరు జ్ఞప్తికి రావచ్చు! సర్పం వేలాడే స్థితి ఉండొచ్చు
భ్రమలో జీవన గమనంలో ఇది సహజం!
యథార్థ మన్నట్లుగ! మనసును తిప్పలు పెట్టేను

ఏదో ఒక అన్వేషణలో ప్రతి మనిషి నిరంతరం
వేళకు తిండి కోసమో! ఆపైన సుఖం కోసమో
సౌందర్య కళపై రుచితోనో! లౌకిక యోజన మతితోనో
ఎన్ని అవసరాలో! విశేషాలో! అన్నీ కలిసిన మిక్స్‌డ్ బ్యాగ్

బయట పచ్చదనంతో చల్లదనం ఆవహించినా
లోన వెచ్చదనంతో సంవేదన! అతిశయించేను
ప్రతి ఒకరి జీవితం! స్వయం భావ నిర్మితం
ఇల్లు ఖాళీ చేసినట్లు మధ్యలో మరో జీవితం ఉండదు
మౌలిక నిలయ రూపమదే! పుట్టుకతో శరీరం
పైపై రంగులు హంగులు మారవచ్చు చేరవచ్చు

రావడంలో హడావిడి, పోవడంలో ఆందోళన
బయటికి వచ్చాక దారి ఎట్లా ఉన్నా సాగ వలసిందే
ఎగుడు దిగుడు అయినా వంకర టింకర అయినా
గిరులయినా ఝరులయినా ఎడారి మైదానాలయినా
ఎదురుగా ఎప్పటిదో నిలిచిన చీకటి కోట!
ఇది కరిగితేనే! తొలగితేనే! ఉదయ ముఖం చూచేది

అడవిలో అగ్నులు! చుట్టు పచ్చని ఆకుల దడులతో
లోని మనిషి ముఖం కనబడదు, అలికిడి వినబడవచ్చు
నిశ్శబ్దం భయ రేఖలతో అలంకరింప బడుతుంది
పేలిన ఆయుధ శబ్దం తీరని ప్రశ్నలు వదలుతుంది

తిన్నగా సరించే సమయం శిల అయిపోతుంది
జడీభూతమై అరణ్యం! నిశ్శబ్దం ఏలుతుంది
చరిత్రలో చీకటి పర్వం పుటలొకటొకటీ
అగ్నులు విసరేనా? బూదిని చిమ్మేనా? వెలుగులు చూపేనా?

5. స్వేచ్ఛా కిరణ ప్రసారం

నిద్ర లేక పోవడమంటే
రాత్రి కాపలా డ్యూటి పడిందన్న మాట
ఒంటరి మనసు! పూర్తిగ భర్తీగా
ఎందరో మనుషులతో! ఘటనలతో

తొందరగా ముందుగ మేల్కొనడమంటే ఉదయం!
తొలి కిరణానికి తన చేయి వేలు నందించడం
బయటి సమాజంతో అను సంధితమవుతుంది
అంతర జగం! మనిషి మనిషిని బట్టి శ్రేణులుగా

ఇది ప్రతి ఫలిస్తుంది కవితలో
కవిలో దర్శన గుణ సృజనతో

జ్ఞాపకాల బంధువుల్ని ఎవరినీ పిలవనక్కరలేదు,
ఆహ్వానంతో పని లేదు, స్వాగతాల ప్రసక్తి లేదు
నీటి అలలా గాలి తెరలా వెలుగు జాడలా
మనసు నావహిస్తాయి, నవ జీవన ప్రపంచంతో

అలలు తరలుతూ మాట్లాడుతాయి
గాలి కదలుతూ మాట్లాడుతుంది
వెలుగు నిలబడీ మాట్లాడుతుంది
మనిషిని విశ్వమయం చేస్తాయి
నడవలేని చెట్టు గిరి శిఖర మెక్కగలదా?
నీతి లేని మనిషి! ఏ విలువలు పొందగలడు?

ఉపమానం ఎరగని హృదయానికి
వస్తువు విలువలు తెలిసేనా?
సమయం శిలవలె పడి ఉండకూడ దెవరిలో
ఇది ప్రధానమయి సాగడమే జీవితమంటే
చీకటి కోట నుండి బయట పడే అవకాశం
తనలో స్వేచ్ఛా కిరణ ప్రసారంతోనే.

6. జవాబు బాధ్యత

అన్నిటికీ హృదయం కేంద్ర బిందువు మూలం
స్పందనతో జీవిత మొక అమూల్యమవుతుంది
ప్రేమ శాంతి గమ్యాల మధ్య భావనలతో
మనసుకు తెలిసేదీ నచ్చేదీ వీడనిదీ

హృదయం ఒప్పవచ్చు మేధ తిరస్కరించవచ్చు
మేధ ఒప్పవచ్చు హృదయం తిరస్కరించవచ్చు
వివిధ పార్శ్వాలలో బహు కోణాలతో జీవితమేదయినా
స్వేచ్ఛా జీవికీ నియంతకూ అందరికీ సమానతలం

కేకల్నీ అరపుల్నీ వేడిని చలిని ఇముడ్చుకొనీ
దుమ్మును దూరం చేస్తూ పరిమళ పవనం రావాలనీ
మార్పుతో వర్తమానం శాంతిమయం కావాలనీ
కోరికతో జన హృదయం నవగళం! వినిపిస్తూంది

సామాన్యుని కోరికలు గరిక పోచల వలె
ఎప్పటి సమాజ స్థితిలోవో! ఇప్పటికీ కనిపించేను

బిందువు నుండి పుట్టుకతో జీవితంలో
ఏ విలువలతో ఏ సంఖ్యలు చేరేదీ తెలియదు
కాలం గడుస్తుంది, వయసు పై బడుతుంది, దేనిలో పరిణతి!
అంతంత మాత్రంగా తృప్తితో, జీవన చిత్ర ప్రదర్శనం

ఎన్ని మాటలు చెప్పినా అణచివేత పీడనలో
అన్నిటి కన్న బలమైంది చీకటి బిందువు
దీని నుండి రేఖలతో బ్రతుకు రూపం మారుతుంది
పలు రంగుల ప్రవేశంతో! ఏర్పడే తన రూపం
కొంత ఊరట కలిగించేను
కాస్త స్తిమితం చేకూర్చేను

ఉన్న స్థితులలో హృదయం! ఆర్ద్ర స్వరం వినిపిస్తుంది
ప్రశ్నకు జవాబు చూపే బాధ్యత! ప్రజాస్వామ్యానిదే!

7. కవితకు పట్టం

గౌతముని బంధ ముక్తంతో సరితూగేది ఒకటే
అది యశోధరా త్యాగం, బుద్ధ జీవన చరిత్రలో

చెరువు నుండి నదియై జనహితకరమై
జలాలు జలధిలో కలిసినట్లు
ఆవరణం నుండి ఆశయ సాధనలో
నగరం నుండి గగనం చేరే ఆశలు
బంధు సమూహం దాటి జనతలోకి

పోను పోను బ్రతుకులో మనిషి పొందే ఆదర్శ జగం
ఏ కాలమయినా ఏ దేశమయినా దాని రూపం ఒకటే

మనుషుల ముఖాలలో మాయ ముసుగు
నడకలో నడతకు చెందిన చర్యలతో
ఎప్పటిదో పుట్టుక నాటి పాత శరీరం
కొత్తది దొరకే దాకా! వేచి ఉండేనా?
అది ఎపుడు దొరికేదీ! తెలియని రహస్యం!

రాళ్ళలో తిరుగుతూ నీటికయి వెదకుతూ
తవ్వితే ఎపుడయినా రత్నం! దొరికితే
అది వెనుక నుండి ఐహిక బలం!

ఎడారిలోకి నది సరించక పోవచ్చు
మబ్బు నీడలో చల్లదనం! ఒక భాగ్యం
నీడ కోసం నీరు కోసం ఎదురు చూచేను హృదయం
ఎందకు ఏ చెట్టో! దప్పికి ఏ చెరువో! వేదకేను చూపులు

దాహంలో తెలుస్తుంది నీరు విలువ
ఆకలిలో తెలుస్తుంది అన్నం విలువ
మనసుకు తెలుస్తుంది! పయనంలో ప్రయోజనం
మనిషికి తెలియంది! మరో బ్రతుకు విలువ

మోదమో ఖేదమో రాగమో! కరుణయో! మరొకటో
బాణమో మిసైలో అయి దూస్తేనే! కవితకు పట్టం!

8. రసానందరేఖ

చంద్ర బింబం వేదనను జ్ఞప్తికి తెస్తుంది
ప్రేయసి ముఖం! వేదనను మరిపిస్తుంది
జలధి హృదయం మేఘాన్ని వదలితే
ప్రియా హృదయం అమృతాన్ని ఒలుకుతుంది

పురుషునిలో స్త్రీ రూపం
హిమగిరిపై ఉదయం కిరణంలా!
స్త్రీలో పురుషుని రూపం
బూది పొరలతో అంగార ధానికలా

మూసిన పుస్తకంలా ఒక సమయంలో మౌనం
దాగిన సమాచారానికి సుందర పేటిక వలె
గాలికి రెపరెపలాడే పుటలతో శబ్దిస్తూ
తెరచిన పుస్తకంలా ఒక సమయంలో స్థితి
జల జల విదిల్చే నెమలి పురిని తలపించేను
మనసుకు ఇంతకన్న! మంచి వ్యాపకమేముంది?
కవితలో ఆలోచన అనుభవానికి విమానయానం
ఇది కల్పన కాదు, వాస్తవ రూపానికి అందలం

ప్రేయసి కుసుమం కాదు
ప్రాణ కుసుమ సదృశం!
ప్రాణానికి నిలయమైన మనో రూపంతో
సూక్ష్మమైన అనుభూతి మీటే తంత్రీ వాద్యం

ప్రేయోరూపంనుండి దేవీ భావన దాకా
వంతెనయై కవిత! మనసును దాటిస్తుంది
వెలుగు దీపమయి చీకటిలోనిది చూపిస్తుంది
సగం సగం జీవన తేజో బింబం తలపిస్తుంది

పూవయినా మెరపైనా లహరి అయిన కళ అయినా
అనుభవ వేద్యం రసానంద రేఖ స్త్రీ, పురుషునిలో

9. తెలియని రహస్యరూపం

స్త్రీ పాత్ర లేంది లోకయానంలో ప్రతి దిశలో
జీవితానికి పరిపూర్ణత ఎక్కడిది? లేదు

ఎండకు రక్షగా తలపై గొడుగు వహిస్తే
అది వేడికి తప్తమై జలదాన్ని కోరుతుంది
ఆట పాట మాట మూడిటితో కలిసి బ్రతుకు
శిశుత నుండి పరిణత దశలలో మబ్బులో నీరులా
స్త్రీ పాత్ర! ఏదో ఒక విధంగా సగానికి పైనే
కష్టం నష్టం లాభంపై దృష్టి లేని హృదయ స్పందంతో

మేధ వదలవచ్చు కాని హృదయం వదలదు ఎవరినీ
వారంతట వారు జారి పోతే తప్ప!
భవితను నిర్ణయించే అడుగులకు
ఎవరి కారణం వారిది ఎవరి గమ్యం వారిది

పక్షి పైకి వెళ్ళినంత మేర
ఆకాశం ఎత్తు పెరుగుతూనే ఉంటుంది
పక్షి దూరం పోయినంత మేర
దిశల దారి పెరుగుతూనే ఉంటుంది

నీటిలో పయనానికి ఈత అవసరం
గాలిలో పయనానికి రెక్కలవసరం
లేక పోయినా మనిషి! శక్తి యుక్తులతో
తగిన సాధనాలతో తన గమ్యం చేరేను

పగలు రాత్రి మధ్య వాతావరణంలో
రంగు లెన్నో? ఊహలన్ని! మారుతూ
జీవితాన్ని! సంశ్లిష్ట వ్యూహంలో తిప్పేను
ఈ సుందర వ్యూహంలో 'స్త్రీ' పాత్ర
మోదమయినా ఖేదమయినా కరుణ అయినా
త్రిదశలలో పూర్తిగ తెలియని రహస్య రూపం

10. ధైర్య కవచం

కవిత పలకడం మరొకరు వినడం
కవిత రాయడం మరొకరు చదవడం
సరికొత్త అనుభవాన్ని అవతరింప చేస్తుంది
ఇది ప్రతి కవికీ ఇష్టమైంది, ప్రియమైంది

ఇది ఒకరికి తమ వశమయితే చాలు!
ఆకాశం చేతి కందినంత సంతోషం!
దీనితో ఏదో ఒరిగేనని జరిగేనని
కవిలో పొందే పూలదండ! సంతోషం

పాఠక శ్రోతక శ్రేణుల సన్మతిలో
ఎదిగే చెట్టుకు పూలను పండ్లను కోరేరు

కాలం మెడలో ధవళ యశోహారమయ్యేనని!
ఉదయ సూర్య మకుటం తన తలపై నిలిచేనని
పరివర్తనలో దిశ మారే ననుకునేరు
మార్పుకు వేగం పెరిగే ననుకునేరు

గోడకు తగిలించిన ఒరలో కత్తిలా కవిత
ఇది ఎప్పుడు ఎవరికి ఉపయోగ పడేదీ తెలియదు
ఒరనుండి తీసి గాయ పరచుకొనే వారూ
పదును చూచి నెత్తురు బొట్టును తలచేవారూ

ఉద్యమ చర్యను వరదలా విజృంభింప జేయవచ్చు
పిడుగులవలె భయ గోళాలను విసరవచ్చు
స్మృతులలో పైకి తేలే కథలతో వీరానికి ప్రతినిధియై
విరామంలో విరిసిన సుమదళంలా హ్లాద పరచవచ్చు

రణం వైపు ఆలోచనల్ని పరుగెత్తిస్తుంది
కవితలో శబ్ద శక్తికి పదును రూపమిస్తుంది
కదలని కాల చక్రాలను వేగానికి పురికొల్పుతుంది
ఒరలో ఉన్నంత వరకు గోడకు వేలాడుతూ
మౌనంలో శాంతిని ప్రదర్శిస్తుంది!
మనిషిలో మనసుకు ధైర్య కవచ మందిస్తుంది

11. అధికారం గెలుపుదే

కాలం ఆగదు! ఆపలేరు ఎవరూ
జీవితమూ అంతే ఆగదు! ఆపలేరు! ఎవరూ
హృదయం మాట్లాడుతుంది
స్పందన శీలం గల మనిషితో

మనిషికి పనులలో తీరిక లేనపుడు
ఇది వినేదెవరు? ఆకాశమా?
మనసుకు తెలియాలనుకున్నవి
చెట్లా! గిరులా! భూమియా?

హృదయం మాట్లాడుతుంది! మనిషితో
మనిషికి మాత్రమే వినబడాలని వినిపిస్తుంది
మైనస్ పాయెంట్ల పయి హెచ్చరిస్తుంది
ఈ మధ్య మరీ ఎక్కువగా మాట్లాడుతూంది

మునుముందు తప్పులు దొర్ల కుండా
జాగ్రత్త పడేందుకు! మనిషి మంచి కోరుతూ
తప్పు దారి అలవాటయి పోకూడదనే
ఇది పరంపరా రూపం కాకూడదనే!

హృదయం కాస్త ఆలస్యంగా పని చేస్తుందేమో!
ఈలోగే జరిగేది జరిగి పోతుంది
మెదడు చాల చురుకుగా పనిచేస్తుంది
చెప్పేదీ చేసేదీ ప్రకటితమవుతుంది

హృదయం వెల్ విషర్, మనిషి మంచి కోరేదీ
మేధ కన్సల్‌టెంట్, అడిగిన దానికి అనుగుణం!

జీవితంలో గెలుపు ముఖ్యం,
ఇది తెలుపుకే కాదు
నలుపుకూ అవకాశం ఉంది
కాలానికి రెండూ సమానమే
తెలుపు నలుపు భేదం లేకుండా
అధికారం ఆ గెలిచిన వ్యక్తిదే!

12. పరివర్తన సందర్భం

పొద్దున తొలి కిరణం మనిషి ముఖాన
జాతక చక్రాన్ని మెరపిస్తుంది, అంతవరకే!
అనుభవ గమనంలోనే బయట పడుతుంది ఏదైనా
యథార్థం తెలిసే వరకు జీవిత మొక రహస్య మందిరం

కర్షకులకు పాడి పంట గురించి
కార్మికులకు ఆ రోజు పని గురించి
వర్తకులకు లాభ నష్టం పట్టిక గురించి
నాయకులకు రాజకీయ గ్రాఫ్ గురించి
చింతనలో ఆశలపై పగలు గడుస్తుంది
చివరి కిరణం చూపుతుంది దీన హీన దృశ్యం

వీధి స్తంభం దీపం నీడలో శరీరం
సమాజ వికాస దశల చరిత్రలో
నిరాదరణకు గురియై ఖాళిగా
మిగిలిన దృశ్యాన్ని సూచిస్తూంది

స్వేచ్ఛా మతి వనిలో హరిణ మయూరాలే కాదు
పులులు సింహాలు కూడా తిరుగుతాయి
ఈ దృశ్యం జీవిత వాస్తవ సంకేతం
సుందరతలతో ఆలోచన కవకాశం కలిగిస్తుంది

సమస్యలెన్ని విధాలుగనో మనిషిని బంధించేను
తాత్కాలికాలు కొన్ని, తరతరాలుగ సాగేవి కొన్ని,
నిరసన ప్రతిఘటన ఉద్యమాలు ప్రజాస్వామ్యంలో
లక్ష్యానికి నడిపించేవి, నిశిత తీవ్ర స్థాయిలలో

సమాజ సంక్షోభంలో శాంతి ఎంత అవసరమో
సమాజ పరివర్తనలో పోరాటం పాత్ర కూడా
ఉదయం పగలు రాత్రి సంధ్యలతో పని లేదు
కాలాని కతీతమయింది! జన మత సందర్భం

13. రూపాంతరాలు

కుసుమమో మరొకటో పరిమళ ప్రసారం
కోరితే వచ్చేది కాదు, నిరసనకు ఆగేది కాదు
కంటికి కనిపించని చోటు నుండి రావచ్చు
గాలిలో తేలుతూ మనసుకు హ్లాదంగా సాగేను

ప్రత్యక్షంలో అందంగా రూపం కనిపిస్తుంది
పరోక్షంగా గంధం అనుభవ లోకం నిండుతుంది
సుకృతమెంత సుందరమో స్వాదువో రుచి చూపిస్తుంది
బ్రతుకు పట్ల సుముఖత, ఆశాసౌధం నిలుపుతుంది

మంచు శిలను వసంత హృదయంగా మారుస్తుంది
బిందువు రేఖయై మనసు వర్ణ చిత్రం పొందుతుంది

చీకటికి తావు లేదు, ఎదురుగా
వెన్నెల దాటితే ఉషస్సు దే స్థానం
ఇది జీవన పూర్ణతకు సంకేతం!
తేలే నావలతో సరించే ప్రవాహరూపం

కల్పన గాలిలో తేలి గగనంలో కలుస్తుంది
వాస్తవం ఎదురుగ బంధువులా! నిలుస్తుంది
దారికి సందేహం లేదు, యు టర్న్‌లు లేవు
మలుపులతో దిశలు మారేది లేదు, సూటిగ ఒకటే!

గతం పితరుల మూసిన ఖజానా, భోషాణం
చిన్నవి పెద్దవి వస్తువులతో గౌరవ సంపదగా
ఇపుడు పనికి రానివైనా ఎపుడయిన పనికి వచ్చేవీ
ఒంటరిగా ఉన్నపుడు! భ్రమాకృతులు చూపేవీ

గత మనగానే గుహల మతులతో కొండలు గుర్తు కొస్తాయి
గిరిపై మబ్బుల తలపాగాలతో పెద్దల ఆకృతులు!
మదిలో శ్మశానాలు సమాధులు కావు, విజయాలు విభవాలు
నాలో సజీవ శక్తిని చూపే రూపాంతరాలు! ఒకటొకటీ

14. పీట వేసినట్లే

భూమికి ఇష్టం లేని వస్తువు లేదు
మనిషికి చోటు దొరకని భూమి ఉండదు
వ్యక్తి నుండి సమాజంలో మనిషి జీవితం
వాస్తవ చరిత్ర తోనే నిజ సంస్కృతి రూపం

సమాజ రూపంలో హద్దులు మానవ భావనలో కనిపించవు
ప్రేమ కరుణ రెక్కలపై మనిషి మట్టి నుండి పైకి మనో రూపంతో
ఆదర్శానికి చిహ్నంగా నిలిచేను! బ్రతుకులో
విశాల హృదయంతో వికాస కథలను నడిపించేను

ఇది తత్త్వ ప్రపంచం కాదు స్వేచ్ఛా జీవన జగం
ఏ విత్తు నాటితే ఆ విధం పంట బయట పడుతుంది
ఆ పూల ఫలాలతోనే కను విందొనరిస్తుంది
అవని సృజన రూపాలకు స్వాగతం చెబుతుంది

సంఘం నిర్మాతలకు ఆహ్వానం పలుకుతుంది
ఒకరి నిర్మాణం మరొకరికి ఏదో పేరుతో ఏవగింపు
వైరంలో ఒకరి సౌధం! ఇంకొకరికి శత్రు శిబిరం
విధ్వంసంతో విజయం! చరిత్రలో మొదటి పాఠం

చెట్టు వేరు మనిషి వేరు! పోలిక పనికి రాదు
చెట్టు కన్న అదనంగా మనిషిలో మనో రూపం
ప్రేమ హింస స్నేహం వైరం మానవం రాక్షసం
పొరలలో తెరలతో ఒక రహస్య నివేశనం

శిథిలాల నుండి కట్టడాలకు వ్యక్తి నుండి సమాజానికి
నిరంతరం రాక పోకలతో సంశ్లిష్ట జీవితాలు!
ఇరువైపుల నుండి స్వేచ్ఛలో వికార రూపాలెన్నో
ప్రయోజన పథంలో బ్రతుకు నడక! సులభం కాదు!

అగ్నుల చలనానికి స్వతంత్రం దొరికితే
వరదలో వేగానికి స్వేచ్ఛ లభిస్తే
జరిగే పర్యవసానం తెలియని దెవరికి?
అశాంతి సంక్షోభాలకు పీట వేసినట్లే!

15. భయపడితే విసిగితే

ఏడుపు ఎవరికీ తగదు, వినదగింది కాదు
కారణమేదైతేనేం? తన వైపు లాగుతుంది
జాలి జాలు వారుతుంది సులభంగా
సానుభూతి ఆర్ద్ర పవన వీచి అవుతుంది

సంతోషం సులభంగా దొరకని దినుసు
ఆరోగ్యానికి మంచిదే, అవసరానికి లభించాలి

గగనానికి తోడు సూర్యుడో చంద్రుడో చుక్కలో
మబ్బుకు తోడు మెరపు, బాధకు తోడు ఏడుపు
ప్రతి దానికీ తోడు! మరొకటి ఉంటుంది అంతటా
మనిషికి మాత్రం మనిషే! మనసు ఉన్న పుణ్యానికి

నదిని తరించేందుకు పడవ ఉన్నట్లే
బ్రతుకును సాధించేందుకు మనో రూపం!

సూర్యుని రాకకు పోకకు సమయం ఉంది
రైలు రాకకు పోకకు వేళ ఉంది

కవిత అవతరణలో సందర్భం రాకకు
సమయం లేదు, సూచన లేదు జీవితంలో
ఇది ఏదో తెలిసీ తెలియని కారణవశం
స్టీరింగ్ ఎవరి చేతిలోనో! సరిగా తెలియదు
తెలిసినట్లు ఉంటుంది, అంతలో మారవచ్చు
వెళ్ళే దిశ తెలిసినా, చూచే మనుషులు తెలియదు

మట్టి మనిషి హృదయం తెలిసే కన్నా పొందే కన్నా
ఇంద్ర ధనుసు వంతెనపై నడవాలని ఒకరు
నడచి మబ్బు మనసు తెలుసుకోవాలని ఒకరు
సాధ్యం కాకపోతే ఏడుపు వేదన విలపనం

దూరానికి భయపడితే మలుపులకు విసిగితే
నడక సాగదు, సొగసు తెలియదు, ప్రగతి ఉండదు

16. ఎడారి పేదరికం

ఎడారి చూడాలని ఇసుకలో కాసేపు నడవాలని
ఒక మంత్రి మహాశయుని కోరిక!
దృశ్యానుభవంలో సుందరత పయి మోజుతో
అడుగులు కదలాయి! కోరిక నెరవేరే బాధ్యతలో

బాగ్‌లో వాటర్ బాటిల్‌తో అల్పాహారం బాక్స్!
ఎడారిలో దప్పిక ముందుగ బాటిల్ నీరు తాగి
గొడుగు విప్పి ఇసుక దిబ్బ పయి చేరిన సంతోషం ముందు
పరచిన పేదరికం తివాచిలా ఎడారి ఎదురుగా

అంతలో ఇసుకలో నుండి పైకి చేరి
గొడుగు నీడలో ఒక అల్ప ప్రాణి తిరిగేను
ఇంత దూరం వచ్చి తాను చూచేది ఇదా?
ఉల్లాసానికి బ్రేక్, ఆవేదనకు ఆఫర్

బాటిల్లో నీరు ఒలికిన వలయంలో
అక్కడి తడిలో తిరుగుతూ! తిరుగుతూ
ఆ అల్ప ప్రాణికెంత సంతోషమో!
నేత మనసులో సమాజం తలుపులు తెరచేనా?

ఊహలోనే అణగి పోయే కోరికలెన్నో
అవకాశం ఆకాశంలా పరచుకొనీ
అందరాని ఎత్తులో చేరరాని దూరంలో
ఎక్కడ ఉన్నవారు అక్కడనే! భ్రమించేరు

మంచు పొరలతో గులాబిలా
పెట్టెలో దాగిన వజ్రంలా
మబ్బు కమ్మిన సూర్యునిలా
కావలసిన నిజం! దృష్టికి దూరంగా

ఎడారి పేదరికం పయి కమిటీ వేసే ఆలోచన
మరునాడు పత్రికలో మంత్రి మాటగా వార్త!

17. ఏ అర్థానికయినా

ఇష్టమేది? దేనిపై నమ్మకం! ఏది అవసరం
శైశవం బాల్యం యౌవనం వృద్ధాప్యం వరసగా
ఆయా దశలలో ఒకటొకటీ ప్రభుతను నెరపేవీ
మిగతావి! సహభావం సహకారంతో ఉండేవీ

అయిదు దశలలోనూ తోడుగ మనిషి మాత్రమే
గుర్తుకు వచ్చేది మనిషే, ప్రక్కన నిలిచీ
తప్పుకు ఒప్పుకు బాధ్యత మనిషిదే, ఎవరయినా
ఆ సమయంలో మిత్రత బంధుత పరిచయ అవసరాలలో

సముద్రం వైపు చూస్తే జీవితం కదలుతుంది
ఆకాశం వైపు చూస్తే అతీతం మెదలుతుంది
అసలు జీవితంలో యధార్థానిదే పై చేయి
జీవితం అతీతం రెండూ చెరొక వైపున!

ఎన్నిటితోనో లేని సంబంధం కల్పించుకొనీ మనిషి
ఉన్న వాటితో మరో ప్రపంచం నిర్మించుకునేను,
అది అయినా అనుభవ రూపానికి ప్రతి ఫలనం
తన ప్రతి బింబంతో మనిషికి తృప్తి! సంతోషం!

దారిలో పాము అడ్డంగా కనిపిస్తే
పూలమాలో గాలికి కదలే రిబ్బనో!
అనుకోవడంతో పాటు వాస్తవం మరొకటి! వైస్ వెర్సా
శరీరం శిల కావచ్చు, ఊహ మాత్రం ప్రవాహమే

ఉలితో చెక్కడంలో కాస్త నిపుణతతో
శిల! ఏ రూపమయినా పొందుతుంది
సహభావంతో సహకారంతో పద పదం
ఏ అర్థాని కయినా దారి తీయవచ్చు
జడ చేతన భేదం లేకుండా కవితలో
ఇష్టం నమ్మిక అవసరాలతో బ్రతుకులో

18. వాస్తవ దృశ్యం వైపు

అల ఏదో చెప్పాలని ముందుకు తరలుతుంది
ముఖమేదో చెప్పాలని తొందర పడుతుంది
కవి అయితే కవితలో బయటికి వస్తుంది
అనుకోని మెరపులో కత్తి పోటు దృశ్యం! కావచ్చు

అద్భుతాలు అసహజాలు అకారణాలేవీ లేవు
ఒక రోజు గడపజాలని పేద బ్రతుకులలో
నిదురించే అగ్ని పర్వతం ఉద్రేకం
అణగి గాలి దుమారంలా ఆక్రోశం

గాలి ఏ దిశ తిరిగేదీ తెలియదు
అది క్షోభాకరమయితే! ప్రమాదం
నివారణ చర్యలు చేపట్టడమయితే
ఆ రాజ్యం కర్తవ్యం పరిపాలన బాధ్యత

పాతబడిన కాలెండర్‌లో గడచిన తేదీలు
జ్ఞాపకాల్ని తలచుకోడానికి పనికి వస్తాయి
మంచి చెడులను మనసు సమతూకం వేస్తుంది
కిం కర్తవ్యానికి ఎద సూచనలిస్తుంది

గాలికి ఏదో చెప్పాలని దగ్గరగా తహతహలాడుతుంది
చెవులు రెండు! మూసుకోవాలని అనిపిస్తే
ఆలా చేయడం చేయాలిసిన పని తప్పడమే
వెలుగుకు ఏదో చూపాలని తళతళ లాడుతుంది
కళ్ళు రెండు! వాలిపోవాలనిపిస్తుంది
ఆలా చేయడం! చూచే దృశ్యాన్ని కోల్పోవలసిందే

కుక్కల పోరాటంలా నేతల శబ్ద ప్రచారం
ఉచ్చైఃస్వరంలో పతన రాజనీతి ప్రకటనం
దారి తప్పిన నడకలో వికారమైన నడతతో
గమ్యం చేరే లోపల! ఏ సినిమా చూపించేనో

కలల వైపు కాదు ఇపుడు పయనం
మెలకువలో, వాస్తవ దృశ్యం వైపు

19. జూదంలో పాచికలు

ప్రమాణ వచనానికి కట్టుబడి ఉండే దెవరు
ముడి వదులయి ఊడి పోవచ్చు, తెగవచ్చు
బయటికి తెలియదనుకొనీ, లోలోపల జరిగేదీ
సులభంగా కనిపించనిదీ, కనిపిస్తే క్షమార్హం కానిదీ
చేయ కూడదని, తెలిసీ తెలివిగ చేసేదీ
ప్రమాణ పత్రం చదివేస్తే దాని అర్థం తెలిసేది గాలికే!

గంగానది జలాలలో చేతులు కడుక్కుంటే
మనసుకు పట్టిన మలినం తొలగేనా?
లోని మనసు నెవరు చూచేరని ధీమా?
అగ్ని పరీక్ష నెవరు చేసేరని, సాహసం

పని ఎటు ఉంటే అటు సాగుతుంది నడక
పట్ట పగలు చీకటి పెట్టెలో నిజంతో పయనం

ఏ ఆట ఆడినా దాని నియమాలందరికీ ఒకటే
కానీ రాజకీయ క్రీడలో ఎవరి నియమాలు వారివి
కొన్ని తగ్గవచ్చు పెరగవచ్చు లోపించవచ్చు
కొత్తవి చేరవచ్చు! అర్థాలు వేరు కావచ్చు! అనుకూలంగా

ఇది సమాజం! మనుషులతో వ్యవహారం
చెస్‌లో బొమ్మలు కాదు! తోలు బొమ్మలాట కాదు
రాజకీయ గగనంలో విహరించే నిర్భయులు!
విజయం అధికారం రెక్కలపై ఎగిరే విహంగాలు

అగ్ని గీతం పాడుతూ ఒకరు
జలద రాగం పాడుతూ ఒకరు
స్థానాలు మారవచ్చు, వ్యక్తులు ఒకరే
ఆదర్శం కన్న అవకాశం ముఖ్యమై అందరిలో

ప్రమాణ వచనానికి కొత్త అర్థంలో నేతలు
నటనలో పాత్రలు మారేను జూదంలో పాచిక లయ్యేరు

20. ప్రశ్నించే ముఖం

కాల దర్పణంలో కవిత! బ్రతుకును బింబిస్తుంది
వెలుతురు చీకటులలో పగలు రాత్రులతో
భ్రమణంలో దేనినీ విడవదు, అన్నిటినీ గ్రహిస్తుంది
వెలుతురులో సౌభాగ్యం చీకటిలో సౌహార్దం చూడవచ్చు

తమ మదిలో వెలుగును అప్త మిత్రంగా
తమసును శత్రువుగా కొందరు తలచేరు

చీకటిని దగ్ధం చేయాలని కొందరు
చీకటిని పాతర వేయాలని కొందరు
చీకటి లేనిది కాలానికి సమగ్రత లేదు
ఇది సూర్యుని వెనకనే అడుగులు వేస్తుంది

ప్రాణ భయం ఆకలి శత్రుతలు చీకటి శకలాలు
కష్ట దశలలో మనిషిని సరిహద్దులు దాటించేను
చీకటి గుహలను శిల్పమయం చేసి
హ్లాదకరం చేసే కళా హృదయ గణం ఉంది

చీకటిలోను పూల పరిమళాలు ఆగవు
గాలి నీరు అగ్ని, దేని స్పర్శ గుణం దానిదే
చీకటి ఆపదు దేనినీ, అన్నిటినీ ఆహ్వానిస్తుంది
వెలుతురు ప్రపంచం విశాలతను చూపుతుంది
చీకటిలో పరిసరాలు సంకుచితం చూపుతాయి
ధనుస్సు నుండి శబ్దం ఆగదు పయనిస్తుంది
వయొలిన్ నుండి రాగం ఆగదు ప్రసరిస్తుంది
చీకటి కోసమని కళ్ళు ఎదురు చూడవు

అశాంతి హింస నిరంకుశ స్థితులతో
చీకటి స్ఫురణ లెన్ని తల ఎత్తినా
స్వేచ్ఛలో తెర వెనక కథలతో జీవన సంకేతం
భయ హేతువు లెన్ని ఉన్నా మనిషిని ప్రశ్నిస్తుంది ముఖం

21. వాద్యం కావచ్చు

చీకటిని స్పృశిస్తే సచేతన స్పందనలో
వయోలినొ సితారో చేతి కందినట్లు ఉంటుంది
చేతి వేళ్ళు పడితే స్వరాలు వినిపిస్తాయి
నడుస్తూ ఉంటే మెట్లపై సాగినట్లు ఉంటుంది

లోయలో ఎగసే దీన స్వరం వినిపిస్తుంది
బాధలో విషాద భావ చిత్రం స్ఫురిస్తుంది
ఇది లైట్లు ఆరిన సినిమా హాలును తలపిస్తుంది
ఎదురుగ స్క్రీన్ పయి! వచ్చీ పోయే పాత్రల నీడలు!

తరువుకు తుఫాను భాష తెలుస్తుంది
చిన్ని దివ్వెకు సూర్యుని హృదయం తెలుస్తుంది
గాలికి పరిమళాల ఉనికి విలువ తెలుస్తుంది
హృదయానికి సచేతన స్పందన తెలుస్తుంది

ఏది దొరకలేదో! దానిపై ఇచ్ఛ పెరుగుతుంది
ఆకు పూవు కాలేదు, చేద బావి నది కాలేదు
హ్లోదం విడిచి చంద్రుడు తేజస్సును పొందలేడు
ఎవరయినా తనకు తగినది లభించ లేదని విలపించవచ్చు

మూసిన తలుపు తెరచుకొనీ వెలుగు రేక కయి
అది దాటగనే మరొకటి మరొకటి! పరంపరగా
ఇలా గడచినంత మేర బ్రతుకులో చివరి కయిన
తాను వెలుగయి నడవడమొక విశేష విషయం!

కొన్ని స్మృతులు మనసులో విత్తుల వలె ఉండి పోతాయి
మొలకెత్తే సమయం కయి! ఎదురు చూస్తూ ఉంటాయి
అది సృజన హేతువు కావచ్చు, విలయ చర్యకు దిగవచ్చు
ప్రేమను దగ్ధం చేయలేరు చీకటి, హత్యకు దారి చూపవచ్చు
చీకటిలో చేతనలో స్పందనతో హృదయంగమ
స్వర సుందర సాధనం, వాద్య విచిత్రం కావచ్చు

22. అపుడపుడూ

ఒకరు హత్యకో ఆత్మ హత్యకో దారులు వెదకేరు
ఆవేశంలో అస్తిమితం ముందుకు దూకించేను
ఎవరివో అడుగుల అలికిడి! ఆటంకానికి దూరం
పట్టపగలు హత్యకు ఆలోచన! చీకటిని మరపిస్తుంది
మనసు గోడపై పోస్టర్! అతకిన నిరాశా చిత్రం
మరణ మింత సులభమా? ప్రశ్నిస్తుంది దారుణం

ఇది రణ వీరం కాదు, ఉద్యమ శీలం కాదు
జన హిత త్యాగం కాదు, భవితపై విషాద ముద్ర వేసేను

ఇది చీకటి క్షణానికి పూచిన విప్పుపూవు పూచి
బ్రతుకును బూది చేసి మట్టి పాలు చేసేను

ఇది నగరం! ఎన్ని ఏండ్లు ఉన్నా ఎప్పటికీ కొత్తే
తళతళ లాడే గాజు నిర్మాణాన్ని తలపిస్తుంది
అంతలో మంచు నిలయ రూపాన్ని చూపిస్తుంది
ఇంతలో ఇనుప భవన నిలయాన్ని పొందుతుంది

మనిషి మనో రూపం దేనికయిన సిద్ధంగా
నిర్మాణం విధ్వంసం ఉపకృతి అపకృతి శీలం భోగం
ఎగుడు దిగుడు సమాజ తలంపై వికసించే నాగరకత!
మార్పుకెంత తొందరో! అశాంతి కంత వీలుగా
రాత్రి పొద్దు పోయే వరకు ఉత్సవ కళ
తెల్ల వారే సరికి ప్రమాదాలతో విషాదం!

ఉద్యమాల కెంత ప్రయోజన వేదికయో
ఉన్మదుల కంత వికార చర్యల కవకాశం
వ్యాపారంతో నేర చరిత్ర సమాజాన్ని శాసించేను
విపణి విభవంతో పక్కనే భగ్గుమనే అగ్గిపెట్టె

సనాతన సోపానాల పక్కనే విప్లవ పంక్తుల మార్చింగ్
వెలుగు కన్న చీకటిదే రాజ్యం! అనిపిస్తుంది, అపుడపుడూ!

23.క్లాక్ టవర్

ప్రతి రుతువులో తన దయిన విశేష శోభ
వ్యక్తిలో సూక్ష్మమయిన అనుభూతి వశం
గిరి అయినా నది అయినా మనిషి మనీషి అయినా
దృష్టిలో చింతనలో మార్పును తెస్తుంది ప్రకృతి

కవితలో తోచే భావ దృశ్యం యదార్థం కాదు
అక్షరంలో ప్రతి రూపం, అనుభవంలో మానసికం

తోటలో పూల చెట్ల మధ్య గడిపే దానికీ
సమాజంలో మనుషుల మధ్య ఉండే దానికీ
భేదం! నింగికి నేలకు మధ్య ఉన్నంతగా
శూన్యంలో దిగుతుంది భావ జగం అవలీలగా

తోటలో నుండి బయటికి రాగానే మనసుకు
ఏదో కొత్త అనుభవం రాశి పోసినట్లు ఉంటుంది
సమాజం నుండి కాస్త ఒంటరి కాగానే మనసుకు
అవసరమైనది ఏదో! దూరమయినట్లు ఉంటుంది

ఇన్నిటి మధ్య చౌరస్తాలో క్లాక్ టవర్ నిర్లప్తంగా
ఇరు చేతుల కదలికతో త్వర పెడుతుంది
పనులపై వెళ్ళే వారిని సావధాన పరుస్తుంది
స్కూలుకు పోయే పిల్లలు ఆఫీసుకు వెళ్ళే పెద్దలు
పార్టీలకు వెళ్ళే వారు, సినిమాలకు పోయేవారు
పార్కులో కూర్చునే వారు, ఎందరో ఎన్ని పనులలోనో

సూర్యుడు లేక పోవచ్చు, చంద్రుడు రాక పోవచ్చు
రుతువులు మారినా, సమాజ సందర్భాలు వేరయినా
నినాదాల ప్రసంగాల మధ్య జన తతికి కోలాహలంలో
ట్రాఫిక్ జామ్ అయినా జన దూరంగా
ఏ పజిలుకు వీలు లేదు, ఏ వ్యూహం అక్కరలేదు
అంతా సాదా సీదా వ్యవహారం! అంతరంగ ప్రతిరూపం,
క్లాక్ టవర్!

24. ప్రజాస్వామ్య కళతో

కావ్య పఠనం జరుగుతూంది హాల్‌లో
కొందరిలో గానంగానూ విడుదలవుతూంది
ఇంతకు ముందు మెదను అలంకరించింది
పూలదండ టేబిల్‌పై నిశ్శబ్దంగా వింటూంది

ఆ సమయంలో ఒక్కొక్క పూవు
ఒక్కొక శ్రోత కిందే లెక్క
ఎదురుగ సహృదయులు సావధాన ముఖాలతో

ఇక్కడేదో ప్రోగ్రాం జరుగుతుందనీ
కొద్ది మంది చివరన పక్కగా నిలబడీ
ఎయిర్ కండిషన్‌లో కాలక్షేపానికి సరదా పడీ

కలాల పని ముగిసింది, గళాల పని మొదలయింది
సభికుల్లో ఒకరొకరికి ఒక్కొక ఆశ! మేల్కొనేను
పద పదానికీ గట్టు దాటబోయే కెరటాల్లా ఊహలు!

చివర తలుపు పక్కన నిలుచున్న ఒకరికి
జేబులో నుండి చాటుగ తీసిన సిగరెట్‌ను
నిప్పు రవ్వలా ఎగసి వచ్చి అంటు కోవాలనీ
సీటులో కదలే అభిమానుల్లో అభిలాషల్లో
అలలానో పూవులానో పెదవుల్ని స్పృశించాలనీ
కిరణం లానో నెమలి ఈకలానో ముఖాన్ని నిమురాలనీ

చల్లగ ప్రవేశించి మబ్బు ముక్క, మర్యాదగా
పిడుగుల్ని కాకపోతే మెరపుల్ని విసరాలనీ
క్రాసింగ్‌లో తళతళలాడే కత్తుల
అంచులో రక్తారుణ బిందువు ఒలకాలనీ
ఇన్నింగ్ చివరి ఓవర్‌లో బ్యాటింగ్‌లో
బంతి ఎగసి సిక్సర్ నిర్ణయం ధ్వనించాలనీ

బయటికి వచ్చే కవుల ముఖాలలో చకితంగా
అన్ని ఆశల ఇంద్రధనుసు రూపం! తెరచిన పుస్తకంలా
స్వేచ్ఛలో అస్తిత భేదాలతో, ఆ సమయం ప్రజాస్వామ్య కళతో!

స్వేచ్ఛా కవిత్వం - 96

ఇది జీవితం

(XXI భాగం)

కాలంతో నేను

మాదిరాజు రంగారావు

2019

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 28.

Sveccha Kavithvamu - 96

Idi Jeevitham

Kalam tho nenu -

(**XXI** Part)

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santosh Kumar

Y.P : 2019

Presented
to my wife
Smt. Indira
on her Birthday

పీఠిక

"కాలంతో నడచే నాలో ఇది సృజన భవం" కాలానికీ జీవితానికీ ఉన్న అనుబంధాన్ని స్థాపిస్తూంది. ఈ కృతి, "ఇది జీవితం" బృహత్కృతిలో (21) వ భాగం, 'కాలంతో నేను', ఇది చిట్టచివరిది. సమాప్తి రేఖను పొందింది. ఆధునిక యుగంలో స్వేచ్ఛా కవిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

స్థూలంగా కవిత్వానికి సంబంధించిన అంశాలు రెండు ముఖ్యమైనవి. 1. కళాత్మకం; 2. ప్రయోజనపరత. మొదటిది అభివ్యక్తికి సంబంధించిన విశేషాల సంవిధానానికి చెందింది. రెండోది సమాజానికి సంబంధించిన ప్రత్యేకతల సమీకరణాలకు చెందింది. ఈ రెండిటి సమన్వయ నైపుణి చేతనే కవిత్వం స్థాయి విలువలు ఏర్పడతాయి. ఏ నియమ నియంత్రణలు లేని స్వేచ్ఛను అనుసరించింది, స్వేచ్ఛా కవిత్వం. ఇది ఈ సందర్భంలో ప్రజాస్వామ్య దార్శనికతను పొందింది. ఈ లక్ష్యంతో నిబద్ధతను కలిగింది. ప్రజాస్వామ్య చేతనకు ప్రాధాన్యం ఇస్తూందీ కృతి. సామాజిక దార్శనిక విషయంలో కవిత్వానికి వెన్నెముకగా నిలుస్తూంది.

వర్తమాన కాలంలో నెలకొన్న సమాజ స్థితిగతుల రూపం, ఇందులో దృష్టికి వస్తుంది. ఇంతకు ముందు కూడా ఈ పరంపరలో ఇదే సామాజిక ప్రాతిపదికపై సాగింది. (1) సామాజిక రాజకీయ నైతిక తాత్విక మనస్తత్వ కోణాల్ని ఆయా సందర్భాలలో సంతరించుకుంది. వస్తువులోని విషయం విశాలతను వైవిధ్యాన్ని పొందుతూంది. ఇదొక నిర్వహణ విభాగం. (2) అభివ్యక్తి కళకు సంబంధించిన గుణాలతో సంపన్నమయింది. దీనికి భావరూపాలు ప్రతీకలు. మనస్తత్వ పరమయిన చైతన్య స్రవంతి మొదలయినవి వీలయిన చోట్ల తోడ్పడినాయి. ఇదొక సృజన విభాగం. ఇవి వ్యక్తి-సమాజం కేంద్రాలుగా సృజనరూపంలో దృష్టికి వస్తాయి. అటునుండి నిర్వహణ, ఇటునుండి సృజన చేతన కలిసిన కవిత్వం తన దయిన ప్రత్యేకతను భావింప చేస్తూంది. కవిత్వంలో మనసును శబ్ద ప్రపంచంనుండి భావ ప్రపంచానికి దింపుతూంది.

ఇందులో ఆలోచనా పథంతో పాటు స్పందన శీలమూ విశ్లేషణ కందుతాయి. వివేచనకు దారితీస్తాయి. ఈ ఆలోచన సాహిత్య విమర్శను సంపన్మయం చేసేదిగా భావిస్తాను.

సంక్రాంతి
14-1-2019

– మాదిరాజు రంగారావు

1. చిరునామా - సంకేతం

బయటికి స్వతంత్ర రూపంతో
లోపల సమాజ చేతనతో
గుర్తు లేక పోవచ్చు
గుర్తు రాక పోవచ్చు
రానున్న వాటి పయి ధ్యాసతో

గడచిన రోజు విలువ! లెక్క చెప్ప గలరేమో!
రానున్న రోజు విలువ! లెక్క లెవరు చెప్పగలరు?
ఇది తెలియక పోవడంలో ఉంది రహస్యం
అసలు జీవితం కిటుకు! ఇదొక గమ్మతు

ప్రతిరోజు పండుగ కవకాశం లేనట్లే
ప్రతి మైలు రాయి ఉత్సవ శోభను పొందలేదు

ఈ విశాల పృథ్వి పయి 'ఒక కుటి చాలున'నీ
నడకలో బయట దృష్టి పడినంత మేర
అడుగడుగు తన వశమయి పోవాలని సర్వం
తన అధికత చెల్లాలని, పాలన కొన సాగాలని

తన వికాస జ్ఞాపకాలు ఒకటొకటి వరసగా
ఈదే మనుషులతో, తేలే నావలతో
తీరం చేరే సరసిలో అలల వలె సాగేను
వ్యక్తిగతం నుండి సమాజ పరం అయ్యేను

తన గమ్యం మరచే ప్రశ్న లేదెవరికీ
ఎప్పటికీ లక్ష్యం అంతో ఇంతో మిగిలే ఉంటుంది

తెలియని సమాజ 'నిజం' గవేషణలో కవితా యానం!
మానవ చేతన దశలకు చిరునామా! సంకేతం
వ్యక్తుల చిరునామాలు వేరు సంకేతార్థాలు వేరు
ఎవరి వ్యక్తిత్వం వారిది 'నిజ' పరిమళ భావనతో

2. జీవన రుచితో

ప్రగతి మనో బలం జవంతో కవిత
సమాజ కోలాహల చక్ర గమన రూపం

ఉదయ క్షణం అమృత బిందువు ఒలికితే చాలు
ఆ రోజు అంతా ప్రాణిత మవుతుంది అక్షరం
జీవ వంత మవుతుంది కవి భావ జగం
కొత్తగ అక్షర జగత్తు నిర్మిత మవుతుంది

నిన్నటి గాయం మరపున బడి పోతుంది
లోపలి వేదన శమనం పొందుతుంది
ఏ దారి తన కవసరమొ! అవైపే పయనం
నిన్నటి యోజనతో ఇదొక భాగం కావచ్చు

అనుక్షణం పందెంలో పావు వలె కదలుతూ
సంశయ డోలపై ఫలితం ఊగాడేను

పాత రాతకు కొత్త అర్థం ఇస్తుంది
భావ జగతికి కాంతి రూపం ఇస్తుంది
కొత్త రాతకు స్వాగతాన్ని పలుకుతుంది
జీవన ఫలకం సార్థకతను పొందుతుంది

పట్ట పగలు! రవికీ గ్రహణం పడుతుంది
చీకటి ఎక్కడికి పోదు, పోలేదు, స్థానం మారుతుంది
ఆ వెనకనే అంటి పెట్టుకొని ఉంటుంది
సూర్యుని ప్రియ రూపం! ఛాయ హ్లాదకరంగా

తనను గురించి తన లోపల భావన
తనను గురించి మరొకరిలో భావన
సమాంతరంగా రైలు వెళ్ళే పట్టాల వలె
పయనానికి సుగమత సుఖతల నిచ్చేను

సృజన క్షణం! అమృత స్పర్శతో అక్షరం
ఆ సమయంలో జీవన రుచితో కవిత!

3. ఏది అవసరమో

దారు లెన్నో చుట్టూ మజిలి మజిలి లో
ఏ పథాన్ని నేను వరిస్తానో
ఏ మార్గం నన్ను వరిస్తుందో
ముందుగా తెలియని విచిత్ర వాస్తవం

చెల్లా చెదరుగ పడిన రాత్రి కలల వలె
మెరసే అద్దం ముక్కలలో ఉదయం
సామాన్యుల జీవన స్థితులను చూపించేను
కవితలో చోటుతో తమ గళం వినిపించేను

తనది కానిదేదీ లేదు ప్రపంచంలో
అన్నీ తన కోసమే సిద్ధంగా ఉన్నట్లుగా
ఎవరి కేది అవసరమో వారు దాన్ని గ్రహించేరు
మిగతావి వదలి ముందుకు వెళి పోయేరు

ఓటమిలో కొత్త పాఠం నేర్చినట్లు ఉంటుంది
విజయంలో ప్రగతికి సోపాన పంక్తి ఏర్పడుతుంది
ఓటమి గెలుపులు! సంఘానికి రెక్కల వలె నయి
యానంలో దిశ వేరయి, గమ్యం మారేను

విశాల మయిన ఎడారి! ఒంటరితనాన్ని పరచుకొనీ
గగనం వైపు చూస్తూ కాలాన్ని ప్రశ్నించేను
హఠాత్తుగా ఇసుక తుఫాను చెలరేగుతుంది
గాలిని పరిగెత్తిస్తుంది, జలధి అలలు రేపుతుంది

ఒక్క నీటి చుక్క జారిన జాడ లేదు తనపై
మౌనబంధంలో ప్రకృతి సంపదలో ఎడారి! నిరీక్షణం!

గతం గురించి ఆలోచన అవసరమయినా
అది వర్తమాన వాహనానికి, అడ్డు కారాదు
పగలు నిదుర పుచ్చే పాట అవరాదు, కవిత
నిష్ప్రయోజ లెగసే కొలిమి కారాదు మస్తిష్కం

4. ఆశలు పెంచేవి

గతం గురించి అయినా భవిత గురించి అయినా
ఆలోచన! వర్తమాన బిందువుపై నుండే
ఈ క్షణం ఉన్నది మరో క్షణం ఉండక పోవచ్చు
ఎన్ని ప్రభావాల సమీకరణ రూపమో జీవితం

ఇది ఎవరినుండి బహుమానం కాదు, అతీతమూ కాదు
జీవ శక్తి రూపానికి మానవ నిలయం
వ్యక్తి ఉనికి మానవ చిత్రానికి రేఖల నిస్తుంది
మనిషి చరిత సమాజ రూపానికి చేతన నిస్తుంది

మండుటెండలో చిన్న గొడుగు
వాన జల్లులో చిన్న గొడుగు
పోవలసిన స్థితిని సుగమం చేస్తుంది
కావలసిన పనికి సహకరిస్తుంది

ఎప్పటికీ స్వార్థ వర్తన నిలయం కాదు జీవితం
అంతలో నిర్వ్యాజ మనోజ్ఞతను పొందుతుంది

కర్షక జీవన సంపదతో ఊరు
కార్మిక కారణ విభవంతో నగరం
వివిధ వృత్తులతో వ్యాపకాలతో కొందరు
రాతి పొరల సందు నుండి నీరులా జీవితాలు

ప్రేమ కరుణ ఉల్లాసం ఉద్రేకం వీడని మూలాలతో
పచ్చని చెట్లను తలపించే అనుభవ ఛాయలతో

నడచిన దారిలో పడిన పాద ముద్రలు
మరునాటికి గుర్తు పట్టరానివిగా
ఇవి నెత్తురు గుర్తులుగా చూడాలని కొందరు
ఎర్రని పతాకలను తలపించేవిగా కొందరికి
ఎప్పటికీ రక్త సూచిగా నిలవాలనే కోరిక! కొందరికి
కొన్ని మట్టిలో కలిసేవి! ఆశల్ని పెంచే భ్రమలు, అందరిలో

5. కోరిక

సమాజ బంధంతో నేను, నాలో నను తీర్చే సమాజం
ఏ మనిషికి ఆ మనిషి! స్వతంత్ర మనో జగంతో
ఏ రోజు తొలి క్షణం నుండి చివరి క్షణం దాక
అనుభవంలో కొంత భాగం! చిత్రమో శిల్పమో! అవుతుంది

తను పొందే పరితృప్తికి ప్రాముఖ్యం
తను కోరే ఉపయోగానికి వీలుగా
ఏదో సాధించే సంకల్పంతో బయలు దేరి మనిషి
అడవి బాట పట్టేను, వేటలో సమయం గడపేను

జన పదం విడిచి మనసు యాత్రా పథం పడుతుంది
అరణ్యమో! ఎడారియో! ఎదురు కాక తప్పదు
ఎక్కడ తిరిగినా ఊరులో నివాసం చేరాలిసిందే
ఉన్న సంఘంలో ఒకరుగ గడపాలిసిందే

ఎంత ఎత్తు ఎగిరినా గగనంలో మజిలీ దొరకదు
ఎంత ఎత్తు ఎదిగినా నేలపై చూపులు వదలవు

ప్రవహించే నది తన చుట్టూ తిరిగి పోవాలని గిరికి
ఎట్లా గయినా, అడ్డుకున్న గిరిని దాటాలని నదికి
బ్రతుకు లోను అనుభవ స్థితులలో! దృశ్యాలెన్నో
అన్నీ కలిసి కథకు విషయ మెంతో! లభిస్తుంది

ఎదురుగా ఎదగాలిసిన చెట్టు ఎండిన కొమ్మలతో
పెళుసు బారిన వాలకంతో, ఏ పూలను పూస్తుంది?
దేనికి, పనికి వస్తుంది, పొయిలో కట్టెలకా?
హోమ వేది కోసమా? ఇల్లు కట్టడానికా?

ఉదయం మేల్కొల్పే పక్షుల కలరవం వినాలనే
నిద్ర నుండి లేపే ఆయుధ ఘోషను వినాలని ఉండదు
పట్టు శాలువాలా సూర్యరశ్మి తనను అలంకరించాలనే
మంచు దుప్పటితో, ప్రత్యక్షం కావాలని ఉండదు

6. సిఫారసుతో పని లేదు

సామాన్యం నుండి విశేషానికి విశేషం నుండి అతీతానికి
మనసు ఆరోహణలో సాగాలనే, అంతరంగంలో స్పందన
వాస్తవానుభవంలో పెరగడమెంత సహజ మయినా
మనిషికి చెట్టుకు పైపైకి ఎదిగే పరిమితు లుంటాయి

పక్కనున్న మనిషి పయి చూపులతో
భూమిపై ఆశతో బ్రతుకు తీరులో
మనిషిలో శూన్యమయిన భావ జగం
అనుభవ విషయంతో నిండుతుంది

వానలో మంచులో ఎండలో పరుగెత్తే రైలు వలె
కాలం! తనలో సమాజ ప్రతినిధులను నింపుకొనీ
అందరికీ సమానంగా అవసరాలు తీర్చేను
ఎవరి ఊహలతో సూచనతో పని లేనే లేదు
తప్పు చేసిన వారయినా, స్నేహం నెరపేవారయినా
ఉన్న వారు లేని వారు శాంతి కాములూ రణ పిపాసులూ!

ఇంటి ముందు వాకిలిని అలంకరించే రంగవల్లి
పురా సంస్కృతి పయి విశ్వాస ముద్ర తెలుపుతుంది
ఇంటిలో వసించే వారి మనస్తత్వమూ కొంత చూపుతుంది
నేరాలను వైరాలను దాటుతూ వచ్చిన పరంపరా సారమిది!

కవిత లేకపోతే ఏదీ ఆగదు, మాట నిజమే
బ్రతుకులో అంతా సజావుగానూ సాగదు
అయితే! సృజన రచనలో హ్లాద బింబం అందుతుంది
మనసుకెదో అమూల్యనవం దొరకినట్లు ఉంటుంది

బాధా జ్వాలల మధ్య నుండి శాంతి పద్మంలా
వాతావరణంలో అనుభవ పరిమళాన్ని వదలుతుంది
దీనికయి ఏ అన్వేషణతో పని లేదు
దీనికయి ఎవరి సిఫారసుతో పని లేదు

7. సానుభూతి కోరుతుంది

ఒకరికి రోజు మొదలవుతుంది అర్ధ రాత్రి నుండి
ఒకరికి రోజు తొలి రవి కిరణంతో మొదలు
వర్తమాన పటంపై స్వర్ణ రేఖలతో మనిషి రూపం
రేఖల మధ్య వివిధ వర్ణాలతో వికాస స్థాయి చిత్రం

"గతం గతః" అన్న మాట వెనక నుండి
అపుడపుడూ జ్ఞాపకాల పరి తృప్తి రేఖలు
తేదీల మార్పులతో జీవితాలు మారవు
'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అన్న మాట గతం గురించి
పరిశీలన పరిశోధన కవకాశం కలిగిస్తుంది ప్రాసతో
గతం తిరిగి రాదనీ భవిత నిశ్చయం కాదనీ తెలిసిందే

తుపాను రాకపోదు, ఎపుడయినా వస్తే
భద్రంగా బయట పడే ఉపాయం, అవసరం
వరదలతో ప్రాణం తీసేదయి ఉరిత్రాడై జలం
ఖడ్గమయి ఉక్కిరి బిక్కిరి చేసే అవకాశం రాకూడదనే

రుతువులో మార్పు కొత్త రూపం నింపుతుంది
తలుపు తెరచినంత మాత్రాన, మార్పు రాదు లోనికి
మనిషి వస్తే! స్వాగతం పలకవచ్చు కానీ
అతని గుండె ఒక బాంబు పొట్లమయితే!

అర్ధరాత్రి నుండో మొదటి ఉదయ కిరణం తోనో
వర్తమాన మైంది ఆ క్షణం గతమయి హిమ శిలయై
భవిత అనుకున్న క్షణం వర్తమాన మవుతుంది
గతమూ భవిత మధ్య వర్తమానం ఒక ప్రవాహరూపం!

ప్రకృతి ప్రభావానికి సమాంతరంగా మానవ తేజం
సమాజ రూపాన్ని శక్తివంతం చేస్తుంది
ఇష్టమయిన దారిలో నడచే మనిషి నుండి మాత్రం
బాధాగ్ని తప్తమైన మనసు! సానుభూతి కోరుతుంది.

8. అర్థానికి దార్శనికం

కాలం ఎప్పటికీ సాక్షీ భూతంగానే ఉంటుంది
అనుభవంలో పొందే బోధ; ఎచటి నుండీ లభించదు
సమాజ సంబంధాలను మించిన అనుభవ శాల లేదు
ఎంతటి విజ్ఞాన శిఖర మయినా వివేక జలంతోనే పచ్చదనం

గాలికి రాలి పోయే పుష్పం కాదు మానవ జీవితం
దృఢ సమాజ బంధంతో కాలాన్ని ఆవహిస్తుంది
ఏ వాద్యమో అవుతుంది స్వరధుని వినిపిస్తుంది
సమయానికి తగిన రాగాలను నిస్వనిస్తుంది

కలలతో విసుగెత్తి మనిషి వాస్తవం లోకి
ముళ్ళను రాళ్ళను లెక్క చేయ కుండా పరుగెత్తేను

స్థిరత లేని గిరి కనిపించదు
కదలిక లేని మబ్బు కనిపించదు
దేని గుణం దానిదే ప్రత్యేకత చూపేను
మనుషులూ అంతే! ఎవరి విధం వారిది

గాలికి పగలు రాత్రి భేదం లేదు
నీరుకు రాయి మట్టి తేడా లేదు
సుందరత విషయంలో అది వ్యక్తి నిష్ఠం
ప్రయోజన విషయంలో అది సమాజపరం

కట్టె ఎండి కాలి బూది మట్టిలో కలిసీ
చినుకులతో మొక్కపయిన ఆశ సహజం
మార్పులో శూన్యం ప్రక్కన అంకెలు మారతాయి
ఎవరి కే విలువలు లభించేవి ముందుగ తెలియవు

అక్షర పద మేళనంతో కవిత
ప్రకటనలో పొందే అర్థాలు వేరు
శబ్దానికి భావ స్పర్శ ఆర్ద్రత నిస్తుంది
అర్థానికి దార్శనికం లక్ష్యం చూపిస్తుంది

9. స్వీయ నియంత్రణంతో

స్వేచ్ఛకు సంకెల వేయబడి బందీ అయినా
రంగులు మూసిన మట్టి బొమ్మ కాదు మనిషి
జీవ శక్తితో మతి గతి కలిగిన మానుషం
చరిత్రలో అణచబడిన మానవ హక్కులకయి పోరాటం
ఒక విధియై, దాటాలిసిన మైలు రాళ్ళు ఎన్నో!

మానసికంగా ఇంకా ఎప్పటివో! కోట గోడల్ని
దాటాలిసి రావడమొక విషాదం! ప్రజాస్వామ్యంలో
పని లేని మనిషి జలధి చేరి అలలు లెక్క పెట్టేనా?
ప్రవాహాలు అరణ్యాలు సముద్రాలు ఎడారులు ఆటంకాలు!
దాటి మనిషి! కొన్ని వేల శతాబ్దాల చరిత్రతో
తోటి మనిషి నుండి అవరోధం అణచి వేతలు ఆగలేదు
పరికల్పికత మయిన చీకటి గోడలు! తొలగ లేదు

ప్రతి సమస్యకు పరిష్కారం ఒకరికి అనుకూలం కాక పోవచ్చు
అయితే మనుషుల ఉనికిని ఏ విభేదం ధ్వంసం చేసేది కారాదు

ఏమి తాను పొందిందీ, ఏది తాను పోగొట్టుకొందీ
రాత్రి పడుకునే ముందు, తన మనసులో
లెక్కలు తేలతాయి! వివరాలతో అంతరంగ వీక్షణలో
తనకు తెలియని రహస్యపేటి ఎచట దాగి ఉంది?

తెల్ల వారగనే కొత్త లెక్క మొదలు
లాభాల నష్టాల అంచనాలతో కోలాహలం!
భ్రమలు లేని యథార్థ లోకం ఎదురుగా
అనుక్షణం సుందరతను పొందాలనే

అనుకున్నది జరిగితే కావలసింది ఏముంది?
విసరిన పగ్గాలకు మనిషి పట్టు బడేనా?
మనిషి మృగం కాదు జంతువు కాదు
స్వయం నియంత్రణ మతితోనే ఏదేనీ సాధ్యం!

10. జనహిత కామనతో

భూమిపయి నిలిచేందుకు 'రెండు అడుగులు' చాలుననీ
అవని పయి శయనానికి 'ఆరు అడుగులు' చాలుననీ
నడవ గలిగిన శక్తితో అడుగులెన్నో! లెక్క లేనన్ని!
పద పంక్తులు మారుతూ దారిలో కొత్త వాటికి చోటుతో దారిలో

పయనంలో తగిలే గాయం చిన్నదో పెద్దదో
చంద్రుని పయి మచ్చలా మనసు భరిస్తుంది,
కష్టాలు నష్టాలు దారిలో, అవి స్థిమిత మతిలో
అద్దంలో జ్వాలా ప్రతి బింబాలుగ తోచేను

కాళ్ళ క్రింద పై నుండి రవి ప్రతాప ప్రభావంతో
విప్పారిన గొడుగు మస్తకం పయి మబ్బును తలపిస్తుంది
ఆరోహణలో అడుగు వేసే మెట్టు వెనకనే
ఉన్న ఖాళీ మెట్టు కూడ! నిలిచే ఉంటుంది, పోదు
దీనంగా చూచేనా? నిరాకరణ ముఖం చూపేనా?
మెట్లన్నీ పదిలంగా చరిత్రలో! మనుషుల బొమ్మలతో

రాత్రి వస్తుంది భయం చిమ్ముతూ
రవి ప్రభను గెలిచిన చీకటి సేనతో
పగలు వస్తుంది గుండె దిటవుగా ధైర్యంగా
చీకట్లను గెలిచిన వెలుతురు సేనతో

కాలం ఇరు వైపుల! వాటి వాటి అస్తితలతో
మనిషి మనో రూపానికి భావ తత్పరంగా
భూమి అదే! దారులవే! వస్తూ పోయే మనుషులతో
ఎవరి అనుభవం వారిది, సమాజ ప్రదర్శనలో చోటుతో

స్వేచ్ఛా కవిత్వమొక జీవన మహా ప్రవాహం
దారిలో శిలల్ని చెట్లను ప్రాణుల్ని మనుషుల్ని
చల్లని గాలి చేతులతో స్పృశిస్తూ కదలుతుంది
జన హిత కామనతో సమార్ద్ర భావ స్పందనతో

11. కలంలో పదునుతో

ఆకలి ఎక్కడయినా ఒకటే! రగులుతుంది
కోపానికి కుంపటి అవుతుంది
అనలానికి కట్టెల పొయిని తలపిస్తుంది
వర్షం ఎక్కడయినా అవసర మైంది
నేల తడిసి సృజన యోగ్య మవుతుంది
పచ్చదనం ఆహారం భావనను పరుస్తుంది

మేఘం నిశ్శబ్దంగా కదలుతుంది
పిడుగులతో తన రాకను శబ్దిస్తుంది
గ్రీష్మంలో పొందే చెరువుల దాహబాధ
జల కళతో ఎగిరిపోతుంది, ఎడారిని చేరుతుంది

బ్రతుకు పయి రక్తిని పెంచే వాతావరణంలో
మెతుకును సాధించేందుకు శ్రమ కేతన మెగురుతుంది

దరిద్రమొక సందర్భంలో వదలేది కాదు
ఆకలి ఉన్నంత వరకు ప్రాణాన్ని భయపెడుతుంది
శుష్కమయిన చెట్టు కొమ్మలా
ఇంటి ముందు దిష్టి బొమ్మలా
వెలుతురు ఎరగని నీడలా
పొంచి పొంచి వేచి ఉంటుంది.

విషాదం నుండి బయట పడే! ఆలోచనలో
తన శక్తిని మనిషిని సంకుచితం చేసేను
యుగాలుగా ఆగని దరిద్ర కథారూపం
కొత్త మలుపులు తిరుగుతూ సాగుతూనే ఉంది

అవసరంలో అనుకూలంగా లేనిది వదలేసే బదులు
సరిచేసి ఉపయోగించే ఉపజ్ఞ మరీ మరీ ముఖ్యం

కర్తవ్యంలో తన వంతు మరవడమొక దౌర్భాగ్యం
బాధ్యతలో తన విధి తెలియక పోవడమొక అజ్ఞానం
ఫలితంలో భాగ స్వామ్యం సహజమయిన వ్యక్తి హక్కు
కలంలో పదునుతో చర్యలో ప్రయోజనాన్ని మరచేరా?

12. ఆలాప గళం నుండి

వేదనలో అలవోకగ ఆలాప గళం నుండి
బయట పడిన కొత్త కవిత! సమాజ బంధువు అవుతూంది
ఉదయంలా కనబడుతుంది సహజ సుందర హృదయంతో
మేఘంలా కదలుతుంది ఎదను స్పృశిస్తూ మనిషిని పలకరిస్తూ
భ్రమరంలా తిరుగుతుంది సమాజాన్ని చుట్టేస్తుంది
జన హిత సమ భావనతో సుమ దళ హృదయంతో
చాచిన నాల్కపై మధు కణాన్ని ఒలుకుతుంది
కవితా జగత్తులో! అపూర్వ సన్నివేశం! నిలుపుతుంది.

గాయాలకు భయపడదు, ముఖం తిప్పుకోదు
బీభత్స దృశ్యంతో సాంద్రాకృతి పొందుతుంది
పరికుంచితం కాదు, విపులతను పొందుతుంది
ఎగసి ఎదురుపడే మంటకు అడుగు వెనక్కి వేయదు
జల సంసేచన పాత్రతో ముందుకు వెళుతుంది
ఇది ఎవరి పాత్ర ఏదో! బయట పడే సందర్భం!

ప్రతి కవిలో కొత్త కవిత! సంక్షుబ్ధ స్థితిలో
ఈ సమయంలో కాలం కవి వశమవుతుంది

పెనుగాలికి కూలే చెట్టు! కఠోర ధ్వని తరంగంతో
గుడిసె కప్పు ఎగిరి పోయి తూలే పేద గుండె! చప్పుడు
సమన్యాయం వేదిక పయి వినిపిస్తుంది కొత్త కవిత!
కాగి కాగి వేడిలో ఆవిరయి వేదన జలదమయి కదలేను

అలముకొన్న చీకటిలో జ్వాలా సమ రూపంతో
నేల పయి నెత్తురు చిత్రం! చూచి భయం ఎవరికి?
కాలం కవి వెనకనే! వేగం అందుకొనే గమనంతో
ఆ సమయం కవితది! ఎవరినుండి ఉపాయనం కాదు

నిన్న గోడల్ని కూల్చేసే ఘన కార్యంలో చేతులు
ఇపుడు సృజనలో తల ఎత్తిన మొక్కను దువ్వేను
అనల కణాల పయి నిబూది పొరలు ఎగిరిన స్థితిలో
దార్శనిక పథంలో మానవ ధర్మంతో నవ సమాజ నిర్మాణం!

13. నినాదాలతో

మంచు కొండ తల ఎత్తి తన లలాటాన
సూర్య కిరణ పంక్తి కయి ఎదురు చూచేను
అగ్ని పర్వత శిఖరం తన ముఖాన
నీల మేఘ ఛాయ కయి పరితపించేను

నిరీక్షణం పరితాపం రెండూ
చెరొక వైపు నుండి బ్రతుకులో

ఇంటి యజమాని ఖాళి పోర్షన్ లోకి
రానున్న మనిషి కయి ఎదురు చూచేను
నగరంలోకి అడుగు పెట్టిన ప్రవాసి
తగిన పని కయి వీధులన్ని చుట్ట బెట్టేను

బ్రతుకు తెరువుతో పాటుగ భ్రమణం
ఇరువైపుల నుండి కథలో ఒత్తిడి పెరిగేను
మేనిఫెస్టో కప్పుకొనీ చిన్న పెద్ద నేతలు
తమ వార్త గురించి తమ పోటో కోసం!
పత్రికలో వెదకేరు! ప్రకటనలలో ఒదిగింది చూచి!
విసుగును చూపేరు! అసహనం ప్రకటించేరు

రాజకీయ వేదిక అట్టహాసం పొందుతూంది
ఇంకా రావలసిన లిస్టు బయటికి వస్తూంది

సైనిక దుస్తులలో ఉన్న వారు పౌర సమాజ సేవలో
సంక్షోభ నివారణ యంత్రాలుగ పని చేసేరు

ఏదీ సక్రమంగా లేదని యువతలో విసుగు
పట్టు తప్పి పోతూందని పెద్దలలో ఆగ్రహం

అసహనం ఉద్రేకం అలజడి అశాంతి కలిసి
చెట్ట పట్టాలుగ బృందాలుగ మారేరు, తిరిగేరు

ప్రజాస్వామ్యంలో నేతలు! నిలకడ లేని బంతుల్లా
రాజకీయ క్రీడలో ఎవరికి వారు గురివెందలాగా

నినాద ధ్వనులతో సమాజ పరివర్తన కోరేరు
పార్టీలు మారడం రాజకీయ హక్కుగ నెంచేరు.

14. సమస్యలవే

తనలో విరోధ రేఖ ఉన్నది తెలియదు మనిషికి
అనుభూతి కెదురుగా! హేతువు రూపంలో

విజ్ఞాన ప్రపంచంలో విజయాలకు కారణమయింది
ప్రతి పక్షంగా ఉంటూనే పూర్ణతకు దారి తీసేను

ఎప్పటికపుడు మనిషికి తాను మనిషిగా
గుర్తుకు తేవలసి వస్తుంది! మరో మనిషిచే
పలు దారులలో పయనం! మనుషులతో పరిచయం
అస్తితను పెంచుతుంది, వైవిధ్యం కూరుస్తుంది

రణ పథంలో జారిన నెత్తురు చుక్కలు
మొలకలెత్తి! కాలాంతరాన నిప్పుపూలు పూచేనా?
ఇవి పగలు మనిషి చూపుకు కనిపించక పోయినా
రాత్రి వేళ చుక్కలలో ప్రతిఫలిస్తాయి!

మట్టి నుండి మొలక ఎదిగి చెట్టు అవడం
అవని కెంత సంతోషమో! మనిషి కంత ప్రేరణం

వినాశన రూపమయిన రణం, ఎపుడు బడితే అపుడు రాదు
దగ్గరలో ఉన్నట్లు అనిపిస్తుంది, అంతలో విచ్చిపోతుంది
సంక్షోభంలో అగ్ని శిఖలు ఆవరిస్తూనే ఎదురుగా
అంతలో వివేకం మెరసి, చినుకు పడవచ్చు హఠాత్తుగా

ఎపుడో గౌతముడు రథంపై వెళుతూ
బయట కనిపించిన దృశ్యాలు! ఇప్పటికీ
నగరం వీధులలో, తరం నుండి తరం అందుకొంటూ
పేదరికం రోగం ఆపద కష్టం అనివార్యమైన మరణం!

విధి పేరిట ఆ వెను వెనక నున్నవి! ముందుకు వచ్చేను
సమాజాన్ని శాసించేను! బ్రతుకుల్ని పాలించేను

మధ్య మధ్య శూన్యం నిండేది! కటు చర్యల చేతనే
పాతవి భద్రంగా! సమస్యలవే! మూలాలవే! దరిద్రమదే!

ఏది జరిగినా, ఎవరికి పట్టేను? విశాల ప్రపంచంలో
సరిదిద్దే యోచనలో మనస్వి అయిన మనిషికి తప్ప!

15. అన్నీ తనవే అయితే

ఏ రోజున కారోజు మానవ సుఖ భూమిక కయి
తహ తహ లాడుతుంది మనిషి లోని మనసు

మనిషికీ మనిషికీ మధ్య ఎడం చెరగి ఏకాకృతి అయితే
వ్యక్తిత్వం చెరగిపోయి మూసలో శిల్పమవుతుంది

ప్రభుత పదవి ధనం ఖ్యాతి బలంతో
దేవతల్ని సయితం నేలకు రప్పించాలనీ

సమస్య ముళ్ళ కంపలా ఎదురయితే
బుజాన గొడ్డలితో వేటుకు సిద్ధ పడేవారూ
సమస్యపైకి ఎత్తిన కత్తి అయితే
డాలు వంటి ఎదతో ముందుకు వచ్చేవారూ

ఇతిహాస కథలలో ఊహింప రాని ఘటనలో
యధార్థ విషయ మేమిటో? ఎవరికి తెలుసు
అసలు బిందువు నుండి రేఖలతో కల్పన!
ఉప్పు నీరయినా చివరకు నది కలిసే జలధి వలె

మొక్క నుండి విస్తరణం! వ్యక్తి ప్రతిభతో
శాఖోపశాఖలుగా ఏదో చెట్టును తలపిస్తుంది
చెట్లు ఎన్ని జాతులో! కథలు అన్ని విధాలు! కాలంపయి
ఎవరి అభిరుచి అభిమతం పథం గమ్యం వారిది

దారిన పోతూ! కనిపించే వారెందరో? వారి వారి
ముఖాలలో జాతకాలు వేలాడుతూ కనిపించవు

లౌకికం నుండి తాత్వికానికి, తాత్వికం నుండి లౌకికానికి
ఒడ్డు లొరసి ప్రవహించే రస ప్రవాహ లహరులు! జీవితంలో

చూపు పడిన ముఖంలో వెలుగు బొమ్మ చూడాలని
పెదవి విప్పిన క్షణాన మంచి మాట వినాలనీ
మనసు ఎదురు చూస్తుంది! కొత్త దనం కయి
బ్రతుకంతా దీని కోసమే! అన్నట్లుగ చివరి దాక!

మనో దర్పణంలో కనిపించే దృశ్యాలన్నీ తనవి కాకపోవచ్చు
అన్నీ తనవే అయితే, గుండె మోయగలదా? కథ సాగేనా?

16. ఎవరికి తెలుసు

ఎదురు చూచిన మబ్బు వచ్చి కురవ కుండా
పోతుందని ఎవరికి తెలుసు! ఎవరను కుంటారు
ఆశాజీవి కళ్ళముందు! విపరీతం! ఎవరి చేతిలో లేనిది

సమయం చేతిలో నీళ్ళ గ్లాసుకు బదులు
కొరకంచు నిలుస్తుందని, ఎవరనుకుంటారు!
వాడి వేడి ఊహలకు అవకాశం దొరకుతూంది

అనుకున్నవి ఆ సమయంలో జరగవు
అనుకోనివి ఒక సమయంలో వస్తాయి
చేతికి పాచికలను ప్రియంగా అందిస్తాయి
అనుకోని మలుపు తిరుగుతుంది కథ!

ఊహించని విపరీతా లిప్పిటికీ జరిగేను
జీవన సుమ సుందరతను వికృతం చేసేను

అంతా తెలిసీ వినోద విభవంలో నిమగ్నమయి
నేతి బీర కాయలో "నేయి" కయి ఎంతో ఆరాటం!
పరిశోధన జరుగుతూనే కాలం గడుస్తుంది
నిర్ణయంకై తరాలు! ఎదురు చూడవలసి వస్తుంది

క్షణాలు నిశ్శబ్దంతా రాకపోవచ్చు
నాణాల మోతతో చెంగున దూకుతాయనీ
విషయం అంచెలపై వ్యాపార కళను పొందేననీ
ఎవరికి తెలుసు? ఎవరను కుంటారు?

వెలుగుతో స్వచ్ఛంగా మొదలయిన రోజు
నిదురతో శుభ్రమయి మేల్కొన్న మనసు
స్వార్థం రాజనీతి తంత్రానికి కీలక మయి
కపటం మానస చిత్రానికి రహస్య శాలయై
వెలసిన గీతల చిత్రాలతో కళాకృతులు
అంతలో బ్రతుకులో విలువలు మారేననీ
అధికారం పదవిలో నైతిక సూత్రంకై వెదికేరనీ
ఎవరికి తెలుసు? ఎవరనుకుంటారు! ప్రజాస్వామ్యంలో

17. నడకను సాగించేది

దారులు చూపే గుర్తులు సూచనలు ఉన్నా
వ్యక్తులు నిర్లక్ష్యంలో తప్పుకు పాల్పడేరు
వెలుతురు ప్రసారం! జరుగుతూ ఉన్నా
అడ్డదారి కయి చీకటి చేయి నందుకునేరు!

నీడలతో మాటలాడే వారూ ఉన్నారు
వారి కోసమయినా వెలుతురు తప్పనిసరి అవుతుంది
ఓడలపై తీరాలను చేరాలని! కోరిక సహజం
వంతెనో! విమానమో! ఈత పైనో! అభిలాషను చూపేరు
మనిషి బుద్ధి! ఉపాయానికి దగ్గరగా చరిస్తుంది
అపాయాన్ని తరించే మానవ శక్తిని ప్రదర్శిస్తుంది

ఆకాశంతో మాట లాడే వారూ ఎందరో
వేదనలో ప్రేమలో ఆత్మీయంగా నేరుగ మాట్లాడేరు

చంద్రబింబంతో మాట్లాడినట్లు
సూర్యబింబంతో ఎవరు మాటలాడతారు?
చుక్కలతో మాటలాడవచ్చు
చెట్లు నదులతో మాటలాడవచ్చు

మనిషితో మనిషి మాటలాడడంలో ఇబ్బందులు!
పొరపాటు దొరలవచ్చు అనుమానం కలగవచ్చు
సందేహం రావచ్చు, తీరిక లేక పోవచ్చు
ప్రశ్నకు భయపడవచ్చు, తానే నెగ్గాలనుకోవచ్చు

ప్రశ్నలతో విషయానికి విస్తృతి వైవిధ్యం కలిగేను
దారి తప్పకుండ మధ్యలో గుర్తులు సూచనలెన్నో

తప్పుదారి పట్టకుండ, బహు జాగ్రతగా
ఒప్పు దారి లోనె మనిషి పయనించేందుకు
మనసులో బల్బు వెలుగుతో ఉండాలిసిందే
ఏర్పాటు లేవయినా నడకను సాగించేది మనిషి మనసే!

18. వికృతిలో విభవం

కాలానికి లేదు నియత మయిన రూపం
ఏ క్షణంలో ఎట్లా ఉండేదీ ఎవరికీ తెలియదు
మార్పు కావచ్చు ఎవరికయినా మంచికో చెడ్డకో
మనిషి దృష్టి పథంలో భేదంతో, జరగవచ్చు

మహా విహగ రూపం! తలపించవచ్చు
మహా భుజగ రూపం, అనిపించవచ్చు
మొదటిది భూమిపై మరొకటి గగనంలో సంచారం
రెండూ పరస్పర వైర భావ ప్రతీకలు!

ఇది జీవితం! మిథ్య కాదు, మాయలేదు
హేతువు చక్రాల పయి నడచే యధార్థ సాధనం
దేనికదే బిందువు నుండి సింధువు దాక పూర్ణం
దేనికదే ఊరు నుండి ప్రపంచం దాక సమగ్రం

విత్తు నుండి ఆకు పూవు ఫలం తరువు పంట వరకు
కన్ను ముక్కు చెవి గళం ముఖం తనువు మూర్తి దాక
పైకి కనిపించని మనో రూపంతో మానుషం
కారణాలేవయినా, పరిష్కార దిశలోనే పయనం

గూడు నుండి ఎగిరాక జీవిక కయి పక్షి
ఎవరి దారి వారిది, కలిసేది గూడు చేరాకే
బ్రతుకు దారి పట్టాక జీవికలో మనిషి
అనుభవాల సంపుటం! ఎవరి లోకం వారిది

ఒకరిది ఒకరికి డిటో కాదు, ప్రతిబింబం కాదు
ఉన్న విధంతో నడతలో ఎవరి ప్రత్యేకత వారిది
నిజం చెరగిపోయి వికృతిలో విభవం
ఎవరి నయిన వరించవచ్చు విజయం

మట్టిపై బ్రతుకుతో అందం ప్రయోజనం ఆశించేరు
నింగిలో భవితతో కాలక్షేపంతో సంతృప్తి పడేరు
నిజాన్ని సమాధి చేసి పూల చెట్టు నాటి
దాని నీడలో తమ బ్రతుకులు సాగించేరు.

19. సమాధి - చెట్టు నీడలో

గిరి శిఖరాలను వంచి అవని సమం చేసేరా?
అవని తలాన్ని పెంచి గిరి ఎత్తుకు తేచ్చేరా?
ఏదో ఒకటి చేస్తూ ఉండడమే పనియా?
దేనికది అవసరాలకు తగిన విధం తలచేరా?

పవనం పవిత్రం చేస్తూ పోతుంది
మతిలో గతాన్ని మరపిస్తూ ఉంటుంది

బయట వీచే గాలిలో లోన కదలే ఊహలో
బింబ ప్రతిబింబంగా వ్యక్తిలో చేతన!
వేదనలో హ్లాద మయం చేస్తుంది వెన్నల
గాయానికి శమనం కలిగించేను చంద్రుడు
పులిని చూచి భయపడే హరిణంలో
పరుగెత్తే శక్తిని వేగవంతం చేసేను పవనం

'నిజం' అనిపించేది ఆపైన మారవచ్చు
దాని స్థానంలో మరొకటి వచ్చి నిలవచ్చు
ఇట్లా ఎన్నో! ఏది "నిజ" మన్నది! ఎప్పటికీ
పోస్టు పోన్ అవుతూ పోతుంది! చరిత్రలో

కవితలో నిజం కవి స్వీయ భావ మయమై
చిత్రంలా శిల్పంలా స్థిర రూపం పొందేను
అర్థానికి పక్కన ప్రయోజన క్షేత్రం పెంచేను

కవితలో మాట! మాయదు తరగదు వాడదు
పవనంలో గంధం వలె చోటు నుండి చోటుకు
కదలే వర్తమానంలో! కాలంపై ఆకర్షణ సిద్ధిస్తుంది
సంస్కృతి శిఖరాలను పెంచుతుంది సమాజంలో

ఉచితంగానే పొందిన ఈ తప్పని జీవితాన
బహుమానాలుగ! ఎన్ని వ్యాపకాలో! వ్యవహారాలో!
మనిషిలో ఆలోచనకు అశ్వంలా పవమానం కవిలో
బ్రతుకు బరువు మోస్తూ! ఎంత దూరమయినా!

20. పవనం మాట్లాడుతుంది

పవనం మాట్లాడుతుంది ప్రతి మనిషితో వస్తువుతో
తన గురించి కన్నా ఇతరుల గురించియే వార్తలు
అలసటలో నిదురకు రెప్పలు వాల్చేస్తుంది
మెలకువలో విజయానికి శ్రమను ప్రోత్సహిస్తుంది

అగరు ధూపాన్నీ దహన ధూమాన్నీ వహిస్తుంది
రెండింటినీ భరిస్తుంది పయనంలో గమ్యం చేరుస్తుంది
పవనం వలెనే మనస్సు అనుకూలం ప్రతికూలంతో
ప్రాణం పోస్తుంది, సమతను పాటిస్తుంది
నిరంతరం చలన గమన ప్రసార స్వరంతో
శూన్యాన్ని చేతనతో నింపుతుంది పవనం
ఇది అతిథి కాదు, ఎప్పటికీ తోడుగ ఆత్మ బంధువు
ఎక్కడ బడితే అక్కడ! ఎప్పటికీ శ్వాసకు నిలయమయి

ప్రేమ శాంతి చరణాలపై సదా కదలుతూ
జలధి అలలు కదలిస్తూ చెట్ల బుజాలు ఊపుతూ
భయాన్ని వెనక్కి తోసి ధైర్యాన్ని ప్రసాదిస్తుంది
అపుడపుడు కోప తీవ్రతల తోను కదలుతుంది

కదలే గాలి స్పృహ లేక పోవచ్చు, ఏ పనిలోనో
గాలి లేని స్థితి! ప్రాణానికి అపాయం! తెస్తుంది

అలార్మ్‌ను సైరన్‌ను వేగంగా వినిపింపజేస్తుంది
ప్రమాదంలో మనిషికి చేసే ఉపకృతి అంతా ఇంతా కాదు

వెలుతురు చీకటి సమానమయిన భావ జగత్తులో
ఒక అతీత సందర్భంలో ఆత్మకు సంకేతం
వేగంలో పరుగెత్తే అశ్వాన్ని తలపిస్తుంది
స్పందనలో కదలే జీవ శక్తిని నినదిస్తుంది

ఇది మస్తిష్కంలో ఆలోచనలకు ప్రేరణం
భౌతిక మానస శక్తి ప్రసారాలకు చిహ్నం

21. హాననం ఇరువైపుల నుండి

భూమి నుండి పక్షితో పోటీగా పై కెగరాలని
గగన వలయ పంక్తి చుట్టి రావాలని కోరిక!
మబ్బులతో కలిసి స్నేహ యాత్ర చేయాలని మరీ
ఇవి నిజం కావని తెలుసు! తెలిసినా ఇప్పటికీ!
"ఎపుడయినా నిజం తెలియకపోతుందా?" అని ఆశ
కల్పనలో, గవేషణం నిరీక్షణం మనిషిలో విజ్ఞానమూర్తి

మనిషితో కలిసి పని చేయడం మనిషికి అవసరం
అవసరాన్ని అలవోకగా మలచుకోవడం! మానవం
శ్రమ సంపదలో భాగం! సమ న్యాయంతో పొందే
హక్కుల సమస్య ఇప్పటికీ చీకటి కుటిలోనే!

వీధి వీధి తిరిగేరు, పగలు నుండి రాత్రి దాక
క్షుధ తీరేందుకు, పని దొరకాలి, డబ్బులు కావాలి
ఇవి ఏ చెట్టు కొమ్మకో వేలాడేవి కావు
ఆకుల మధ్య నుండి తొంగి చూచే ఫలాలు కావు

చేతిలో డబ్బు లేదు నిజమే! చేతికి పనిలేదు, వాస్తవం
పనికీ డబ్బుకూ సంబంధం! శ్రమ విలువను బట్టి
పని దొరికితేనే! కావలసిన డబ్బు లభిస్తుంది దానితో
ప్రాణం నిలిచేదీ, బ్రతుకులు సాగేదీ సమాజ శక్తి పొందేదీ

పనికీ డబ్బుకూ సంబంధం ఉన్నట్లు
పనికీ ఆకలికీ సంబంధం ఉంటుంది
రిమోట్ కంట్రోలు తో పని చేసే డబ్బు
దేనికయిన సిద్ధం! ఎంత కయిన తెగింప చేస్తుంది

ఎవరి దయపైనో ఆ రోజు గడిస్తే చాలదు
ప్రతి రోజూ ఉండేదానికి దార్శనిక యోజన తోనే ఫలితం
శ్రమ జీవన చరిత్ర పుటలలో ఖాళీలెన్నో!
ఒకరిది మరొకరు ఎత్తుక పోకుండా ఉంటే చాలు!

దీన హీన స్థితిలో ఒకరు ఆత్మహత్యకు దిగేరు
అడవి నుండి ఒకరు, వ్యవస్థ పయి గురి పెట్టేరు

22. నిచ్చెన మెట్లపై

ఈ భూమి! విశాల హృదయ
రణానికీ రక్త సిక్త చర్యకూ
ఎవరికి స్వాగతం పలికింది?
ఎవరి పనికి సంతోషం పొందింది?

ఎక్కడి కక్కడ వస్తూనే తలుపులు తెరుస్తూ
ఎప్పటి కప్పుడు పోతూనే తలుపులు మూస్తూ
గాలిని సయితం బంధింప చూచే చేతులకు
మనుషులు ఒక లెక్కా! భూభాగం ఆక్రమణంలో

బ్రతుకు పయి ఆశ తప్పనిదీ
రంగుల ఇంద్ర ధనుసుపై కోరిక వలె
పై కెగిరే ఆలోచన! నింగి నందు కునేందుకు
మనుషుల్ని నిచ్చెన మెట్లుగ మలచే యత్నం!

ఎవరి బాధలతో వ్యథలతో వ్యథలతో పని లేదు
శిలల మధ్య! కరుణ బిందువులకు సందు లేదు
అందమయిన శిల్ప పంక్తులతో మురిసేరు
చరిత్రకు అలంకార శోభను చూపేరు

వీరునికి రణంలో మరణ భయం ఉండదు
వైరులపై విజయానికి మారణ జాలం! పన్నేరు

స్నేహానికి కారణాలెన్నో! ఉన్న స్థితులలో
వైరానికి కారణాలన్ని! అవే స్థితులలో
తెలిసిన వయితే మానుషాలు!
తెలియని వయితే దైవికాలు!

ఈ విభాగ భావ పథం అనుసరించి
యుగాలుగా తరతరాలు కాలం గడచేను
'నిజం' తెలుసుకునేందుకు! ఆలోచనలో
మరో మనిషి! ప్రవేశం నిశిత సూక్ష్మ దృష్టితో

సమాజ విశ్లేషణలో కవి! మనస్తత్వ శోధకుడు
మనో వేది పయి పాత్రలో! ఎవరి నటన వేష భూష వారిదే

23. సగటు జీవితం

వర్తమాన స్థితులలో ఇపుడు కొత్త మాట వినిపిస్తుంది
వ్యక్తిలో పతన దశకు పరాకాష్ఠ ఆనర్ కిల్లింగ్
హింసకు పీఠం వేసే శాసన మతుల వశంలో
మానవ ప్రకాశ బింబంపై చెరగని మచ్చగా
ఉగ్రవాద చర్యలు అడవి నుండి ప్రజల బాగుకయి
ఆనర్ కిల్లింగులు సంఘంలో కులం మతం పరువుకయి

విభేదం లేని మనిషి లేడు
వివిధతల తోనే! సమాజం!

చెట్టు నుండి శాఖలు, వాటికి ఉపశాఖలు
దేని దారి అదే ఎదిగే, తమ దిశలలో
అన్నిటికీ సాగే దిశ ఒకటి కాదు
మనుషుల బ్రతుకులు! స్థితు లొకటి కావు

సహనం సమరస భావనతో కలయికయే
సమాజ సంస్కృతి స్పందన హృదయం!

పగంతా తిరిగి తిరిగి బ్యాగ్‌లో కష్టాలతో
ఇల్లు చేరి సుఖ నిద్రకు వశమయి రాత్రి
ఉదయం బయటికి బయలు దేరి చూస్తే
"కష్టాలన్నీ" విసర బడీ చెల్లా చెదరుగ
ముంగిలిలో! యజమాని కయి నిరీక్షణలో!
బ్యాగ్ మాత్రం! ఎవరికో ఉపయోగంలో ఎక్కడనో?

జంక్షన్‌లో తాము ఎక్కే రైలు
ఏ ప్లాట్ ఫార్మ్‌పైకి వచ్చేదీ, తెలియాలి
ఆ బండిని సమయానికి పొందితేనే
పయనం సాగేదీ, గమ్యం చేరేదీ

చిన్న చిన్న సుఖాల అలలపై తేలుతూ
పెద్ద పెద్ద కష్టాలను ఈదుతూ పోవడమే సగటు జీవితం.

24. ప్రేరణ చిహ్నం

ఇంటి ముందు ముఖమెత్తిన పూవుపై ప్రేమ పోదు
ఆ మరునాటికి వాడి వాలి రాలి పోయేనని తెలిసీ
జలధిలో ఎగిరి వాలి సాగు లహరి పయి ప్రీతి పోదు
దాని గమనం గట్టు దాకనే! చెదరి పోయేనని తెలిసీ

గగనంలో హ్లాద చంద్ర బింబం పయి మోజు పోదు
అది రాత్రులలో కొన్ని రోజులు మాత్రమే అని తెలిసీ
తత్కాలానివయి మళ్ళీ చూచే ఆశను నిలుపుతాయి
మురిపిస్తూ బులిపిస్తూ ఆకర్షిస్తూ నవనవంగా

తోడు ఉన్న వ్యక్తిలో ఆర్ద్రత హ్లాదం మనోజ్ఞత
బ్రతుకులో మనిషికి అమృత శక్తి నిచ్చేను

గ్రీష్మ చండ శాసనంలో నిశ్శబ్ద వాతావరణంతో
ఇంటి ముందు చూపే పచ్చదనంతో
ఊరులోని లోతు బావి నీరు ఆర్ద్రతతో
తోడు లోని వసంత రాగ హృదయ స్పర్శతో
రుతువుల కతీతమయిన స్పందన తో నేను
స్వేచ్ఛా సంకల్పంతో, శబ్ద మయం నా కవిత!

ఒత్తుకొని వచ్చే నీలి మబ్బు చీకటిలో
మెరపు మెరిస్తే, సంతోషం చిందులు వేస్తుంది
దెయ్యాల పిశాచాల జంతువుల జాడ లేని
జీవన సందేశం! కూడా అందరికీ! ఇస్తుంది

దీపం ఎరగని రాత్రులు! నీడల కావకాశం లేదు
మరి దేనికి భయమంటే? క్రమ్మిన చీకట్లకా?
పడుకునే ముందు! నిద్రకు చీకటి సహకరిస్తుంది
చీకటి చూపే మౌన ప్రబోధం కూడా తెలుస్తుంది

పిడికిలి తెరిస్తే ఆకాశం! దిగినట్లు ఉంటుంది
ఇది ఆశలు పెట్టేది కాదు, క్రియా శక్తి మయం
పిడికిలి ఎత్తితే శ్రమ పతాక రెప రెపలాడుతుంది
ఇది జీవన సుందర దృశ్యానికి ప్రేరణ నిస్తుంది

25. ఇష్టం లేక పోయినా

ఎక్కడ చూచినా ఏదో ఒక వికలాంగత
మానసికంగా వంగుతూ కుంగుతూ జారుతూ
ఎవరి ముందు అయినా! దేనికయినా బహు వేగంగా
తమ జీవన రోహణలో భాగ్యం పండాలని

అనుభవ రుచిలో పరిపూర్ణత ఎక్కడిది?
ఒక కళకే సరిగా దిక్కులేదు, అన్ని అడ్డ దారులే!
వెనక ఉన్న నీడ దయ్యం అనుకునేరు
ముందు ఉన్న దీపం దేవత అనుకునేరు

ఎవరి సహాయంతోనో గాలిలో చేతులు ఊపి
ప్రవాహాన్ని దాటి ఆవలి తీరం చేరాలని ఆలోచన!

ఎవరికి వారు తాము పొందిన ఇనుప కవచం
స్వర్ణ కవచంగా మారి పోయాలని తొందర!
పంకంలో పద్మం తీరు సొరు ఉదాహరణతో
రక్షణకూ బ్రతుకునకు పనికి రావాలని తంత్రం!

ప్రజాస్వామ్యానికి ఎన్ని వక్రిమలో
మలుపులతో మరకలతో పాము నడతలు!
ఇదొక చతుర మయిన రాజకీయ విభవంగా
అద్దాల అల్మెరలో రాజ్యాంగం ప్రదర్శనలో

దొంగతనం దోపిడీలు ఆర్థిక సామాజిక సహచరులు
పట్టపగలు చీకటిని అమాంతం దింప గల సమర్థులు

చల్లగ ఉన్న సమాజంలో నిప్పు మొలక లెత్తించేరు
అసలు హృదిని మరచి పోయి నగిషీ జలతారుల
రూపం! ఉత్సవ కళతో ప్రదర్శన చిత్రం చూపేరు

ఇది ప్రజాస్వామ్యం కాదనే దెవరు? అంటే చెల్లేనా?
ఇది వికృత రూపంలో కొత్త అవతారం
ఇష్టంతో పని లేదు, వీథిలో చూడక తప్పదు.

26. సమస్య నుండి సమస్య

హేతువును సమాధి చేసినా ప్రభావం ఆగదు
ప్రశ్నలు మొలకెత్తి పైకి ఎదగ వచ్చు
వేరులు పాతుకొని మహా తరువు అవచ్చు
కనిపించిన మనిషి ప్రశ్నకు గురి కావచ్చు.

వెలుతురు స్పృహ లేని! దారి చూపలేని
వస్తువు లెన్నో! తన చుట్టూ అమరి మనిషి
దారి పొడవునా వెలిసే దీపాలు వరస ఏర్పడినా
కంటి చూపు లేనిది! ఎన్ని ఉన్నా లేనట్లే

అంతర్ దృష్టి లేని జీవిత మొక గండ శిల
శిల్ప సంపద కయి ఉలితో సిద్ధం అవడమే

ఉదయం నుండి అస్తమయం వరకు
కనిపించే ముఖా లెన్నో! వర్ణ చిత్రాలతో
ఒక రవి కిరణం! స్పర్శ మాత్రం చాలు
చీకటి బొమ్మలను పక్కకు జరపడానికి

రాత్రి అంతా చౌరస్తా మూలన పేవ్‌మెంట్ పయి
నడచే ద్రిమ్మరి బ్రతుకు సంగతి తెలిసినా
ఎవరయినా బయటి గేటు తెరచేరా?
వీథి వాసి హృదయ గాథ ఎవరికి కావాలి?

నీలి ముసుగు నిజాన్ని దాచడమే కాదు
'నిజం' ఉన్న స్థలాన్ని సూచిస్తుంది కూడా

కవితలో శబ్దం తెర వెనక నుండి
భావమయం కళాత్మకం ముందుకు వస్తుంది.

మ్యూజికల్ చెయిర్ ఆటలో గెలుపు ముఖం
చూపే దెవరు? ఒక హృదయమున్న కవియే!

రణం మధ్య వినిపించే 'శాంతి' పాఠం ఎవరికి?
రణ భూమికి బయట ఉన్న సామాన్య ప్రజలకే!

27. విభుత కయి ఆరాటం

కాల ఫాల తలం పయి రాత బయట పడుతుంది
కాలంతో కలిసి బహు దూరమయిన పయనంలో
సమయ స్పందనానికి అనుగుణమయి జీవితం
గమనంలో ఇరువురి పయనం సమాంతరం

కాలంతో కవితలో మార్పు లెన్ని విధాలో
ఆలోచన అనుభవం అల్లుకొనీ పటం వలె

సూక్ష్మమయిన స్పందనలు కవికి వినిపిస్తాయి
స్థూలమయిన ధ్వనులను తదితరులు వినేరు
గాలికి రహస్య స్థల మంటూ లేదు
మూసిన పెట్టెలా అడుగు క్రింద చీకటిలా

సన్నని గాలిలో పూలు కదలితే లాస్యం
ప్రేమ శాంతి కరుణతో ఉల్లాస మయం
చల్లని గాలితో తుపాను వీస్తే తాండవం
ఉద్రేకం కోపం రణంతో ఉద్వేగమయం

కాలానికి యశోరూపంగా అక్షర సేన నిలుస్తుంది
కాలం తరపున కవిత బాధల్ని బాధ్యతల్ని
బుజాన మోస్తుంది, హృదయ వశం చేస్తుంది
బలం లేని పేద బ్రతుకు పక్షం వహిస్తుంది

గాలి వెలుగు అందరికీ ఒకే విధం సమంగా
ఎవరి అవసరాన్ని బట్టి వారికి లభిస్తుంది ఉచితంగా
భూమి మాట వచ్చేసరికి, సమస్య ఎదురవుతుంది
అవసరాలతో పాటు అధికత కయి విభుతకయి ఆరాటం

అక్షర మనోజ్ఞశాల! కవిత, జగతికి సందేశంతో
వర్తమాన సమాజానికి, ప్రేరణ అవుతూంది
ఎంత గొప్ప శిల్పమయినా ఏదో పూవును పూచేనా?
ఎంత స్వార్థ క్షణంలోనూ ఎదలో పూలవనం మరచేరా?

28. హృదయ పీఠం

ఇది జీవితం! స్వేచ్ఛా కవిత్వానికి హృదయ పీఠం
వర్తమాన సమాజ రాజకీయ నైతిక సాంస్కృతిక స్థితి కలనం
మూలం మరవని ప్రగతి పథంలో జన జీవన సంకేతం
వ్యక్తిత్వంలో మారే విలువలతో కొత్తయుగం! వర్తమాన మానవం

ప్రతి విషయం నిర్వచనం మారుతూంది, వ్యాఖ్యానం వేరవుతూంది
మానవ సుందరతతో ఉన్నదొకటి బయట పడే దొకటి!
వీధిలో రాత్రి వెలిగే దీప స్తంభం కాదు, కవి
సమాజం ఎదురు చూచే ఉదయాశయ బింబం

ఏ దేశమయినా విశాలమయిన అవని పయి
ఎత్తైన సంస్కృతి నిలయంతో జన మానసం
ప్రతి వ్యక్తి తన జీవితంలో సమాజం నుండి
పోగొట్టు కునే దాని కన్న! పొందేదే ఎక్కువ!

కలవడం విడిపోవడం సాధారణ మయినా
అసాధారణమయిన ప్రభావ రూపం మిగిలే ఉంటుంది
మట్టి నుండి ప్రతి కణం దేనికది విడిపోతే
భూమి రూప మెక్కడుంది? మనిషి నిలయమేది?

నిన్న విన్న స్వరం వేరు! నేడు వినే స్వరం వేరు
పలికే గళ మొకటే, అయినా ధ్వని భావన వేరు
మతిలో కణ కణలాడే కొరివి తిరిగే కన్నా
చల్లని నీడతో జలదాగమనం తప్పని ఒక అవసరం.

ఓటమి నెపుడు చవి చూస్తారు, జయం తొలగినపుడే
రోజూ చేతిలో దీపంతో నడచే కన్నా
తానే ఒక దీపమై నడిస్తేనే శ్రేయం
ఇది విశిష్ట వ్యక్తిత్వం తోనే సాధ్యం

అరచేయిలో అదృష్ట రేఖ! బయట జీవితాన
అస్తితలో నది తరు కీర్తిని తలపించేనా?
పరివర్తన తోనే సంఘంలో వికాస భూమిక
కాలంతో నడచే నాలో ఇది! సృజన భవం

స్వేచ్ఛా కవిత్వం - 97

ఇది జీవితం

(XXII వ భాగం)

కర్తవ్యంలో కవిత

మాదిరాజు రంగారావు



2019

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 28.

Sveccha Kavithvamu - 97

Idi Jeevitham

Karthavyamlo Kavita

(XXII Part)

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santosh Kumar

Y.P : 2019

This is Presented
to my wife
Smt. Indira
on her Birthday
28th March 2019

పీఠిక

స్వేచ్ఛా కవిత్వం "ఇదీ జీవితం" బృహత్కృతిలో "కర్తవ్యంలో కవిత" చిట్ట చివరి ఇరవయి రెండో (22) భాగం.

మానవ జీవితంలో ముఖ్యంగా వర్తమాన సమాజం కేంద్రంగా అనుభవ దృశ్యాల పరంపరా రూపం 1. వ్యక్తి 2. సమాజం 3. ప్రకృతి 4. మానవం. ఈ నాలుగు స్తంభాలపై రూపొందిన కవితా నిలయం. ఇది స్వేచ్ఛ – పరివర్తనల – ప్రగతి – దార్శనికం (ప్రజాస్వామ్య సామ్యవాదం) కలిగింది. గతంలోని విలువల్ని నిలుపుకుంటూ, వర్తమానంలో వికాసశక్తిని మరింత పెంచుకుంటూ, వచ్చే కాలంలో ఇంకా మెరుగయిన లక్ష్యంకై యత్నిస్తుంది. సామాజిక పాత్రను నిర్వహిస్తూంది.

ఆధునిక తెలుగు కవిత్వం 1980 నుండి మార్క్సు దార్శనికం గ్రాఫ్ తగ్గు ముఖంలో కనిపిస్తుంది. అనేకమైన చారిత్రక సామాజిక రాజకీయ కారణాలవల్ల దీని స్థానంలో ప్రాంతీయమయిన సమస్యలు అవసరాలు చోటు చేసుకున్నాయి. స్త్రీ దళిత మైనార్టీ వాదాలు బలమైనవిగా అవతరించాయి. అయినప్పటికీ మార్క్సిజంలోని సమాజం ఎప్పటికీ ఎదుర్కొనే కొన్ని మౌలికమయిన సమస్యల్ని గురించి ఆలోచన అనుభవంలో అనివార్యమైంది, దీని ప్రాముఖ్యాన్ని అవసరాన్ని నిలిపేదిగా కనిపిస్తాయి. ఈ కారణంగా పూర్తిగా విస్మృతమయ్యే ప్రసక్తి లేదు. ప్రధాన స్రవంతిలో భాగంగనూ తమ పాత్రను నిర్వర్తించడం కనిపిస్తుంది.

స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికం స్పష్టంగా సూచితమయింది.

వివిధ నేపథ్యాలలో ఆధునిక కవిత్వం పాయలు పాయలుగా ప్రభావ విస్తృతిని పొందింది.

దార్శనికత అభివ్యక్తి విశేషత ఈ రెండిటి మేళనంలో ఉత్తమ కవిత్వం వెలువడుతూంది. ఇది సంతోషించదగిన విషయం. వ్యక్తి వికాసంతో పాటు సమాజ ప్రగతి ఆధారంగా భావరూపాలు (Images) ప్రతీకలు (Symbols) మనస్తత్వ (Psychological) భూమికలు కవిత్వంలో సాంద్రతను స్థాయిని పెంచడం జరుగుతూంది.

సాహిత్య విమర్శలో ఈ వైవిధ్యం విస్తృతి మరింత బాధ్యతను జ్ఞాపకం చేసేవి కావడం హర్షణీయమయిన విశేషం.

మాదిరాజు రంగారావు

1

భూమిపైకి ఆగమనంతో "గుడ్ మార్నింగ్"
బతుకు నుండి నిష్క్రమణంతో గుడ్ బై
రెండిటి మధ్య జీవితం నిర్వచనాల కతీతం
ప్రాణం ఉన్నంత వరకు విస్తరణం పై చూపుతో

పద పదానికి ఎన్ని అర్థాలో సందర్భాన్ని బట్టి
విషయానికి పార్శ్వాలన్ని, దృష్టి భేదాలను బట్టి
అనివార్య దశలతో ఇది భౌతిక వాస్తవం
మనసు నుండి ఆలోచన! అధికారం మనసుదే.

కరుణను బోధించే శాంతిని ఉపదేశించే
సాధారణ వ్యక్తి నుండి మహా మనీషి వరకు
ఎక్కడ మొదలయి మనిషిలో ఆర్తి
ఎక్కడ ముగిసేదీ తెలియదు

జడమయం పర్వతం శిఖరంతో
ఆతప హిమ వర్ష సహన గుణంతో
మనిషికి ఆదర్శంగా నిలుస్తుంది
ఆచరణ పథంలో ఆటంకాలెన్నో

కొన్ని తెలిసినవి కొన్ని తెలియనివి
వాటిని దాటాలని గెలవాలని తపన
గగన తలంపై ఏ విషమత కనిపించదు
పోయినంత మేర భూమిపై ఎగుడు దిగుడులెన్నో!

పల్లెల భాగ్యం! క్షేత్రం పై ఆధారపడీ
నగర వికాసం! వర్తక విభవంపై సాగుతుంది
ఎంతటి సానుకూల స్పందన హృదయంతోనూ
ప్రాణం తీసే చర్య నెవరు సమర్థించేరు?
తుపాను వలెనే అనుకోనివి! తీవ్రతలకు
సమాజ పరిణామంతో తలవంచవలసిందే
రణంలో రథ చక్రం తొలగిన రథి స్థితి
సమస్యలో చెదరిన గాథను వినవలసిందే!
పూజకో అలంకరానికో పూలు వహించే చేతులు
హింసకో హత్యకో ముందుకురావడం అమానుషం.

2.

ఒకరి కవితలో ఉదయం
వికసించిన గులాబియో మందారమో
పరచిన కుంకుమ ప్రభయె
పొందే ఉత్సాహం! ప్రజాస్వామ్య సమాజం!

ఒకరి కవితలో ఎక్కడో ఒక చోట
బిందువుగనో రేఖగనో ఎరుపు రంగు
ముందో మధ్యనో చివరనో కళలో భాగమయి
ఇచ్చే ఉత్తేజం! అమోఘం! మార్మ్యియం

పట్టపగలు క్షితిజంలో దిగిన ఎండ
ఒకరికి అట్ట కట్టిన రక్త చిత్రం!
అస్తమయ వేళలో ఒకరికి
దహనంలో జ్వాలా సమం! ఆతంకం!

ఒకరి కవితలో వీలుపడిన చోట
తోటగనో పైరుగనో తోరణ మాలగనో
జీవన భాగ్యానికి నిలయం పచ్చదనం
మనుషులలో బంధుతను పెంచుతుంది

ఆశకు ఆయువు పోస్తుంది మానవం!
తృప్తికి సీమలు చెరుపుతుంది మానవత!

ఒకరికి అవసర సందర్భంలో కవిత
నీలిరంగుతో చల్లని నీడను ప్రసాదిస్తుంది
ఇది తాపహరం ఆశయ ప్రవాస రూపంగానూ
క్షోభలో శాంతికి ఉదార హృదయ అవుతుంది

పలు రంగుల మిశ్రమ జీవితాన విలువలతో
వెలుగు రెక్కలతో నిజం
వాలి కనిపించాలనే ఉంటుంది
కాలంతో మారే రంగుల తీరులతో ఒకరిలో
ఆలోచన వెనకనే వివేచన మొదలవుతుంది

కవితలో ఒకరికి తోచే వెలుగు ముఖం
అంతర స్పృహతో అతీతాన్ని స్పృశిస్తుంది
నిజ రూపం మరచిన మనుషులు కొందరు
చీకటి రాళ్ళను దేవతలుగ మలచే పనిలో ! గడిపేరు

3.

ఈ భూమిపై ఎక్కడయిన బ్రతికే
హక్కు మొదటిది! ప్రతి ఒక్కరికీ
పుట్టుకతో మనిషికి లభించే వరం
పైనుండి గగనం దీవెన లిస్తుంది

ఎవరి కయిన దిశలు స్వాగత మిస్తాయి
కాలి బాటకు ప్రకృతి ఆహ్వానం పలుకుతుంది

తమ తమ అధికతల విస్తరణలతో
ఎక్కడి కక్కడ హద్దులతో రాజ్యాలు దేశాలు!
తత్కాల నియమ నిబంధనలతో
గోడలు వెలసేను భౌతిక బల ప్రదర్శన రక్షణతో

వచ్చిన మనిషిని అతిథిగ మన్నించే సంస్కృతితో
ఉదార చలితతో విశాలమతి ప్రకటనతో,
నీలిరంగులో ఊహలు దూకితేనే ప్రమాదం

ఈ భూమిపై క్షేత్రం । మొదట
ఎవరిది? కృషి కారునిదీ
ఈ నేలపై స్థలం । మొదట
ఎవరిది? వసించే మనిషిది ।

ఆస్థలో వసుధ ! ఒకరికి అన్నదాత
ఒకరికి నిలయ రూపం! ఒకరికి రత్న గర్భ
మనుషులంతా పైకి ఒకటిగ కనిపించినా
దారానికి పూలవలె ఎవరికి వారు స్వతంత్రంగా
కనిపించని మనో విధాలెన్నో ! విశేషతలతో

అహంకార బీజం లేని మనోవృక్షం లేదు
పచ్చని ఆకులతో ఎదిగే అవకాశం ఉన్నది
పూలతో పండ్లతో నీడలో సంస్కృతి మయమై

కులం మతం దేశం ప్రాంతం పేర్లతో
గడచిన చరిత్రలో శీర్షికలు । ఇప్పటికీ ఉన్నాయి
ప్లస్ మైనస్ లెక్కలతో అడుగు తీసివేస్తూ నడకలో
ఎంత కాదనుకున్నా జీవితమొక వ్యాపార కళామయం

4.

జన సమూహాల కోలాహల సంరంభం నగరం
ఎరికి వారు ఏకాంత శిఖర నివాసం కోరేరు
బయటికి వస్తే ఒంటరి తనం ఎగిరిపోతుంది
ఎంతటి ఏకాంతంలోనూ ఏదో ఒక సమస్య!
ఇచట తిన్నగ బ్రతికే దానికన్నా ముందుగా
మనుషులలో పరుగులు తీయడం అలవాటవుతుంది.

సెల్‌ఫోన్‌లో సుదీర్ఘ సంభాషణం, వాహన ధ్వనుల మధ్య
ప్రమాదాలు హత్యలు అలజడి ఆక్రందనలు
ఆత్మహత్యలు! ఆటవికంగా మారిన స్థితులకు
అద్దం పట్టే! టెలివిజన్‌లో దృశ్య ప్రపంచం

ఎత్తులు పై ఎత్తుల బొమ్మలతో వీధులలో ముఖాలు
ఎవరికోసమో దేని కోసమో ఎదురుచూచేరు
ఆరోహణలో అపై మెట్టు గురించి కావచ్చు
భోగంలో తృప్తి లేక భాగ్య చయంకై కావచ్చు

రోజు నుండి రోజుకు కాలం బహు వేగంగా
స్థితి నుండి స్థితికి లాభ నష్టాల పట్టికతో
గాలి వేగానికి ఆకు రాలుతుంది, చెట్టు కూలదు
గ్రీష్మతాపంలో కొమ్మలెండవచ్చు, వేళ్లతడిగానే

'ఓ' జోన్ నుండి రవి కిరణం వడపోయబడీ
హ్లాదకరంగా సహనీయంగా మార్పు జరుగుతుంది
చీకటి గుహలు మాయమవుతాయి
మంచుతెరలొకటొకటీ తొలగుతాయి

ఉదయం తూరుపు దిశలో ఎర్రని మంటలు
సాయం పడమర దిశలో నెత్తురు పడియలు
దృశ్యాల భ్రమలు। కవితలో ప్రతీకలుగా
ఎన్ని రంగులలోనో ! ఊహలువేరు, నిజాలు వేరు

స్వేచ్ఛలోని రూపానికి గోడలు లేవు, కంచెలు లేవు
కప్పు లేదు సీమలు లేవు, కవితలో అంతరంగ స్ఫూరిమయం!

5.

ఎవరో చెప్పిన మాటను వినిపిస్తుంది చిలుక
చిలుక పలుకులు పలికే వారూ కవులలో
ఎవరి మాట వారికి ఇష్టం కవితలో
ఎవరి పలుకు వారికి ప్రియం బ్రతుకులో

పిడికిలిలోనో బ్యాగ్‌లోనో దాచేది కాదు నిజం
వాదనలో తనదే పై చేయి కయి
నినాద గణంతో ప్రచార పథంలో సిద్ధం కావచ్చు
కానీ నిజం మాత్రం! చేతికి అందని అమూల్యం

చెట్టు గాలికి నృత్య భంగిమల్ని ప్రదర్శిస్తుంది
పక్షి అలవోకగ సంగీత స్వరం వినిపిస్తుంది
రెండూ పురాయుగం వైపు పయనింప చేస్తాయి
మానవ జీవన గతిలో భాగంగా తలపిస్తాయి

కర్షకుడు వాన చినుకల కయి
కార్మికుడు వేతనం పెంపుకయి
వ్యాపారి బోణీతో లాభం కయి
బిక్షువు తిండికి డబ్బుల కయి

సంపద అధికారం కుండల కావడితో నేతలు
పత్రికలో తమ కవితకు చోటుకయి కవులు క్యూలో
అశాంతి సుడిగుండం నుండి బయటపడే అవకాశం
ఎదను దువ్వుతుంది, సానుభూతి చల్లగ స్పృశిస్తుంది

మాట హ్లాద పరచి నట్లే గాయపరుస్తుంది కూడ
గాయపడిన హృదయం కవితకయి ఎదురు చూస్తుంది
వీచే గాలికెన్ని మాటలయినా బరువులు కావు
చోటు నుండి చోటుకు చేర్చడంలోనే దీనికి సంతోషం!

పిల్లి కళ్లు పులి కళ్ళ వలె! చీకటిలో మెరుస్తాయి
కనిపించని దిశను చూపుతాయి, నడవచేస్తాయి
డాలి నిశ్శబ్దంగా వచ్చి పక్కన నిలబడుతుంది
పిల్లి అడ్డంగా పరుగెత్తి గోడ దూకుతుంది
ఏవేవో ఘటనలు కొత్త కొత్త సంబంధాలతో
బ్రతకు వలె కవిత! ఒక మిక్స్‌డ్ బాగ్! కొత్తగా

6.

అలల కదలిక తోనే జలధికి అస్తిత్వం
రాళ్ళతో నిశ్చల స్థితితోనే కొండకు అస్తిత్వం
జలధి నుండి ముక్తమయి స్వేచ్ఛగా జలదం
వేగమందుకొని తుపాను రూపమెత్తుతుంది

నీటిలో విద్యుత్తు సమాజ చేతన చిహ్నం
సృజన విలయ ముద్రలతో అనుభవానికి వస్తుంది

ప్రకృతిలో మార్పులెన్ని జరుగుతూ ఉన్నా
చెట్టూ నది ఆకాశం భూమి మబ్బు ఎప్పటివే ।

విత్తును బట్టి ఆకు పూలు పండ్లతో ప్రకృతి వలె
మనుషులతో సమాజం! యంత్రంకాదు సజీవరూపం
అందరికీ తెలిసిన సుందర వాస్తవమే అయినా
మనుషులు! యంత్రాల్లో బ్రతుకులు నడిపేరు

ఇష్టంగానో అవసరమయ్యో
అబ్బిన కళతో జీవికలో
వర్తమాన క్షణాలపై వాస్తవంగా
ఒకరికి పడవవలె ఉపకరించవచ్చు
ఒకరికి వంతెనవలె తోడ్పడవచ్చు
ఒకరికి శూన్యంగా తోచవచ్చు

ఒడ్డునుండి ఒడ్డుకు దాటాలిసి వస్తుంది
కాలికింద భూమి వలె మనసు స్థిరం కాదు

గోడదాటి కంచె దూకి ఊరు విడిచి
ఎవరి పయనం వారి వారి స్వేచ్ఛా జీవన వ్యవహారం
ఆశకు అలసటలేదు, బాధకు హద్దులు లేవు
మెరపు ననుసరించి పిడుగు పడనూ వచ్చు

స్వేచ్ఛలేని మనిషిలేడు మనః ప్రపంచంలో
అవకాశం ఎన్నుకొనీ ముందుకు సాగడమే
దారిలో ఎవరు ఎదురయి ఆయుధ మయ్యేదీ తెలియదు
ఎవరు ఎవరి ముందు నిశాశ కలంగా నిలిచేదీ తెలియదు

7.

రోజూ బడికి వెళ్ళే దారిలో గుడి! ఆ దైవానికి
ఒక నమస్కార సుమం అర్పించి వెళ్ళడం మామూలె
లోపలికి వెళ్ళి చూడాలనే కోరిక సహజం,
ఉన్న దైవానికి కానుక ! అర్పణం మెదలుతుంది

బడికి వెళ్ళే తొందరలో అడుగులు!
ఏ రోజూ తీరిక కవకాశం ఇవ్వడం లేదు
ఎప్పుడయినా తీరిక అనిపిస్తే
జేబులు శూన్యంలో నిశ్శబ్దంగా।

ఇంట్లో అయిన వారిని అడిగితే
ఒక చిల్లర నాణెం లభించక పోదు
మనసు పడే కోరిక తీరడం ఖాయం
అది నా ఆర్జిత మయితేనే; సంతృప్తి।

ఇంట్లో ఏదో వస్తువు కొనేందుకు వెళ్ళినపుడు
మిగిలిన చిల్లరలో ఎపుడయినా నాణాన్ని వాడుకోవచ్చు

ఇంట్లో ఎవరయినా లెక్క చూచి అడిగితే
ఇదిగో ! ఇందులో నుండి జారిపోయిందనవచ్చు
అనాడే చిల్లిపడి, అపుడే జారిపోవడమా?
ఎన్నో ప్రశ్నలు! జవాబుతో మరో ప్రశ్న । సిద్ధంగా

శ్రమకు తగిన డబ్బు జేబులో చేరినపుడు
తప్పని ఖర్చులు పోగా చిల్లర చేతిలో ఆడినపుడే
కానుక కవకాశం। సులభంగా సూటిగా దొరకుతుంది
అవసరమయితే వడ్డీ కట్టాలేమో! తప్పులేదు

కానుక సమర్పణ కదే మంచి ముహూర్తం
ప్రస్తుతానికీ సమస్య వాయిదాపడడం! తథ్యం
దీనిని గురించి ఆలోచన! ఇపుడయితే పోస్ట్‌పోన్!
బడికి వెళ్ళే దారిలో గుడిలో దైవం నా కోసం
ఎదురు చూచేననే! ఒక చిన్న నమ్మకం
కల్పనలో అదొక తృప్తి, వాస్తవ రూపాని కలంకారం

8.

తెలుపు నలుపు మబ్బుల తలపాగాతో
తల వంచని దొక గిరి శిఖరం మాత్రమే

వ్యక్తిలో ఆత్మ గౌరవ స్థాయిని తలపిస్తుంది
భ్రమలకు లోభాలకు లొంగని ఆంతరంగంతో

నిరంతరం కదలిక ఒక జలదానికే చెల్లుతుంది
శాఖలుగా చీలుతూ, ఒకటయి ఎదగడమొక తరువునకే
పాయలుగా చీలుతూ ఆర్ద్రత నిలవడమొక రసధునికే
ఊహను వాస్తవ పీఠంపై నిలపడమొక కవికి మాత్రమే
అన్నిటినీ కలుపుకునే అక్షర రమణీయం కవిత
ప్రతి హృదయంతో మాట్లాడుతుంది ఆప్తంగా

వర్షరుతువలో నది పరవళ్ళు తొక్కినట్లు
దేహంలో రక్తం నాట్యం చేస్తుంది ఉద్యమంలో
ఘర్షణ దశ ముగిసిన వికాస భావ సమాజంలో
కవిత మలుపు తిరుగుతుంది, గమ్యం వేరవుతుంది

అవసరమయితే నిరసన ఘటనలకు కాలం
సమస్యలో హృది తలుపులు తడుతుంది
త్యాగధనుల కీర్తి రూపాలు ! చూపులో కదలుతాయి
కవితకు లక్ష్యాన్ని, కవులకు బాధ్యతను మెరపిస్తాయి

దారిలో గిరి నది తరు సుమ ఫలమొకటొకటీ
ఆదర్శ సమాజానికి వ్యక్తిలో ప్రతినిధులుగ తోచేను

ఎవరికిష్టమయిన ఊహ వారు చేయవచ్చు
ఎవరికిష్టమయిన పనిని వారు పూనవచ్చు
ఎవరికిష్టమయిన వేషం వారు వేయవచ్చు
పాత్ర వేరు కావచ్చు, ఎవరి నటన వారిదే!

దేహం పై దుస్తులు రంగు, భాష! వేరు కావచ్చు
మనసుకు చెందిన జీవన రుచి మాత్రం ఒకటే!
కెరటం తరువాత కెరటం కదులుతూ సముద్రం
మనుషుల సంఘటిత సమాజ శక్తిని ప్రదర్శిస్తుంది

9.

ఏ సంస్కృతి అయినా మౌలికమైన కోరికలొకటే
పెట్టె నుండి వెలువడే జీవన వస్తువు లొకటే
ఆకలి నేరం అలజడి సహనం భాగ్యం శ్రేయం
ఎపుడయినా ఎచటయినా ఎదరు పడే! వాస్తవాలు

సామాన్యుల అవసరాలు తెలియని పాలకులెవ్వరు?
'నిజం' తెలుసుకునేందుకు చేసే యత్నాలెక్కడ?
ఇవి అందీ అందని గగన కుసుమాలనీ తెలుసు!
ఇవి మనిషి బ్రతుకుల్ని చుట్టుకొని ఉండేవి।
పయనంలో దారి మధ్య మసక చీకటిలో
ఏ తీగెనో తాడునో పామునో తలపిస్తాయి

భ్రమలు తొలగడానికి వివేక మవసరం
మోసం ఛేదించడానికి బ్లేడో చాకో అవసరం లేదు

వీటి ప్రవేశంతో చిక్కులలో ముడుల సుడులు
చేసే పని ఎట్లా ఉన్నా, "నిజం" మూలమేదయినా
తన వరకే పరిమితమై తన జయమే ముఖ్యమై
ఏ స్థలమయినా జీవన చలన కారణాలొకటే

పచ్చని ఆశలు వసంతాన్ని స్వాగతిస్తాయి
ఎర్రని కోర్కెలు మంటల బొకే లందుకుంటాయి
ఎవరికి వారు తామేర్పరచుకున్న ప్రమాణాలలో
పరిమిత విషయంలో, విలువలు భావించేరు

అనుభవ చక్రం భ్రమణంలో మతి నిపుణత ముఖ్యం
సహనంలో మౌనం! నిశ్శబ్ద నిశా శకలంవలె
సందడిలో మాటలు ! పరుగిడే ప్రవాహ ధ్వని వలె
కాలంతో నడవటమే, మనుషుల పని
సందర్భమేదయినా, సమయమేదయినా
వేదనలో వ్యక్తి నుండి సంక్షోభంలో సమాజం వేరు వేరుగా
ఒకదాని బదులు ఒకటి పరిష్కారం కాదు
దేని అశాంతి వలయం దానిదే, దేని అలజడి స్థితి దానిదే

10.

కవితకు ఆరంభం ఉంది, ముగింపు లేదు
మునుముందుకు వెళ్ళే రైలుకు
మధ్యలో దిగే స్టేషన్ చివరది అవదు
నింగిలో విహగంలా విశాలతతో
జలధిలో చేపలా విపులతతో
కవిత ముందు వర్తమానం పరచబడే భవిత ఆపై

ఎడారి ఇసుక పొరల కింద తడి
నిరాశలో ఆశను నిలుపుతుంది
ప్రయత్నం స్ప్రింగ్‌లా పని చేస్తుంది
మనోబలం సాధ్యానికి చేరువ చేస్తుంది
బాధకు భయపడకుండా లక్ష్య సాధనలో
ప్రకృతిపై మానుష శక్తిని ప్రదర్శిస్తుంది

రణంలో ప్రవేశించి మధ్యలో
ప్రాణం పయి తీపితో అక్కడే నిలిచి పోయిన
మనిషి నడిచేందుకు సంకల్పం చివురిస్తుంది
ధైర్య కవచ మందిస్తుంది, చర్యకు దింపుతుంది.

భౌతిక మానస స్థాయిలలో శ్రమ జీవన బలంతో
ఎందుకు బ్రతకాలన్నది ఎట్లా బ్రతకాలన్నది
ప్రశ్నలకు సమాధానంలో వచ్చే
సుందరతతో పాటు ప్రయోజనం చేకూరుస్తుంది
పాత్రకు సామాజిక రూపం సిద్ధిస్తుంది

జీవితమెప్పటికీ ఏదో ఆశకు వ్రేలాడుతూ
సాధించే సంరంభంలో ఎప్పటికీ తేలుతూ

వ్యక్తికి పరిమితమయి మొదలయిన సమస్య
సమాజ నిలయానికి తీగెలా అల్లుకొనేను

అభిమానం పిడికిలిలో గుప్తంగా ఉండేది కాదు
పదును కత్తి మొనలా గాయపరచ వచ్చు
చుట్టిన అగ్ని రేఖ వలె ప్రమాదకరమనిపించినా
చలికి వెచ్చదనంతో ఎదను హ్లాదపరచవచ్చును

11.

జీవ ధాతువులతో మాంసలమయం మయిన
మనిషి శరీరం! నిలుస్తుంది అస్థి పంజరంతో
మస్తిష్కంలో మేధతో స్పందన హృదయంతో
దుస్తులతో అందమయిన ఆకర్షణ రూపం!

గుప్తంగా ఉన్న మనసు చేసే చిత్రాలెన్నో
జీవిత మేర్పడేది! దీని నిర్దేశంతోనే

కల స్వంతం, మరొకరి ప్రమేయం లేనిది
నీడ తనది, తనను అంటుకొనే ఉండేది
వీటితో మనిషి అసలు రూపం మారేను
వెనుక నుండి వాస్తవ ప్రతిబింబాలను చూపేను

నేరాలకు కొత్త దారులు వెదకేరు
దోషాలకు చీకటి సహకారం కోరేరు
పసికట్టిన కుక్క మొరుగు అవిరళంగా
సూచనలను గాలి దిశలు చేరవేసేను
మనది కానిది మన కెందుకులేయని
మౌనంగా ఉండేది ఎందరో? దాదాపు అందరూ

బయట వీధిలో గస్తీ యథా తథంగా
నిశ్శబ్ద నిశా వినీల వాతావరణంలో
లేని ముసుగు తెచ్చి తొడిగినట్లుంది
సంకెల తొలగించవచ్చు, నీడను తొలగించలేరు

చీకటిలో నీడకు అవకాశం లేదు
వెలుతురులో మనిషి నీడ! మరీ సుందరంగా

మనిషికి రంగులువేసి పాత్రలుగా తీర్చవచ్చు
పూలకు రంగులు వేసి, రూపాలను మార్చలేరు

ఆకాశం సముద్రం రెండూ గోడలు ఎరగవు
మనసుకు ఆశకు హద్దులనేవి లేవు
ప్రవృత్తి మారదు ఇది జీవ గతం
వృత్తి మారవచ్చు ఇది లోక పథం

12.

తూరుపు గడప దాటిన సూర్య కిరణం
అక్కడే నిలిచి ఉండదు, ఉండలేదు
విశాల విశ్వం పయి ఉదారత చూపుతుంది
అంతరంగ బింబం అంతే! ప్రేమను ప్రసరిస్తుంది
నీడలలో ఒదిగి నిలవాలని కోరదు
తెరల వెనక నిలచి పోవాలని చూడదు

గత చరిత్రతో సంబంధం తెగనిది
ఇది పాడువడిన భావికాదు
ఇది చీకటి వీడని గుహ కాదు
సంస్కృతి చేతనతో వెనక ఉండి నడిపించేను

ఏ బంధన ఎరగని స్వేచ్ఛా రూపంతో
తలపై కూర్చున్న పావురాన్ని తలపిస్తుంది
శిథిలాల నుండి లేచిన కొత్తపూల ముఖంతో
ప్రకృతిలో పురా రూపానికి చిహ్నంగా నిలుస్తుంది

సమయం సందర్భం అనుభవస్థితి వేరు వేరయి
ప్రతి కవితలో కొత్త సృజన రూపం
సుందరత మనుషుల్ని దగ్గరగా కలుపుతుంది
పరిమళం దూరంలో మనసుల్ని కలుపుతుంది

ప్రశ్నకు సమాధాన పత్రం కాదు కవిత
సమస్య పరిష్కార సాధనలో వేదిక
సమయ సమయం మార్పులలో వాతావరణం
స్థితి నుండి స్థితికి కూర్పులతో మనోరూపం

గెలుపుకూ ఓటమికీ మధ్య జాగాలో
శాంతి చేరుతుంది దారి చేసుకొని
ఎన్నో ఘన కార్యాలకు ఉత్తమ సాధనమైన శరీరం
చివరకు మట్టి నుండి సృజనకు కారణమవుతుంది
శబ్దంతో వాక్యాన్ని దాటి ఎంత దూరమయినా
అర్థం పయనిస్తుంది, పవన వాహనంపై

13.

ఇది కవిత । సృజన మూలం నుండి సమాజ భావన
వర్తమాన స్పృహతో మానుష స్పందనతో వికసన రూపం
శబ్దంలో నాదం ఏకాంతాన్ని కరిగిస్తుంది
సమాజ చలనశక్తికి బంధువు అవుతుంది

ప్రతి వస్తువు ఆ క్షణాన అనుభవాన్ని జ్ఞాపకం చేస్తుంది
మనసును జీవితం కారిడార్‌లో తిప్పుతుంది
సమూహంలో ఉంటూ మనిషికి దూరమయ్యే మనిషి
కవితలో మరో మనిషితో కలిసేను, చరించేను

కవితలో అక్షర పంక్తులలో అనుభవ విశేషం
అందరికీ సమానమే, ఏ భేదం లేదు ఆరోహణలో
పేద ధనిక కులం మతం ప్రాంతం దేశం
పరిధుల్ని దాటిన ! మనోజ్ఞ భావ ప్రపంచం

మతి ప్రభలతో బ్రతుకులు వేరు కావచ్చు
వ్యూహంలో చేతన ఆకర్షణ ఒకటే!
నేర చరిత ఉన్నా ఉదార మతి అయినా
స్వాగత తోరణ మవుతుంది, ఆలోచన
ప్రతి వస్తువులో విలువ మనిషి అవసరంతో
నిరభ్యంతరంగా చోటు చేసుకుంటుంది.

ప్రతి కవిత! ఇంతకు పూర్వం లేనిది అపూర్వమైంది
మూల్యంతో పనిలేనిది కోరనిదీ అమూల్యమైంది

అక్షర దర్పణంలో ! కవి ఎదురగ
సహృదయు లొకరొకరూ ఆర్ద్ర భావుకులు

తమంతట తామొక పూలతోటయై
మతిలో కళాతత్వ సుందర నిలయంతో
జన హిత వివేక వేదిక అయినా కావచ్చు
అంతర ప్రవాహమై సరిస్తుంది! సమాజంలో

శక్తిమయం ప్రాణం పవన వశం
వ్యక్తి నుండి కవిత సహజ పరం

14.

ఇది అమరం! అక్షర నివాసంలో కవిత
ప్రతి పదం వదలిన ఛాయలతో హ్లాద కరం
సమాజ పద్మం నుండి సంస్కార పరిమళంతో
మానవతా మధు బిందువులతో మృత్యుంజయం
పగలు రాత్రి భేదంలేని సమాన భావంతో
రేకులు విప్పారుతాయి రహస్య ప్రకటనంతో

తొలి రవి కిరణ స్పర్శతో మొదలైన రోజు
స్వేచ్ఛా ప్రసార యానంలో కాలాన్ని వహిస్తుంది
స్నేహాలు కలహాలు వాదాలు విశేషాలు
అన్నిటినీ అందుకొనే నిజ లోకం నేరుగా

నది అయినా చెరువు చెలమ బావి అందుబాటులో
దాహం తీర్చే మంచి నీరు ఒకటే, అన్నిటిలో
దప్పిక లేకపోయినా చూచే దృశ్యంతో
ప్రాణం కుదుట పడుతుంది ఆర్ద్ర భావ కళతో

నిలయం గడపదాటి బయటికి వస్తే
ఇండ్లు చెట్లు రాళ్ళు మట్టి మనుషుల సంచారం
అన్నిటితో సంబంధంతో రూపొందేను జీవితం
విపులత వైవిధ్యంతోనే వికాసం, ఏకాంతంతో కాదు

ఒక సమయం మంచు కప్పిన పూవులా
ఒక సమయం నిప్పుతో మండే కొలిమిలా
హ్లాదం తాపం ఇరు అంచులతో జీవితాలు
తరగల పుటలతో ప్రవాహ గమనం సాగేను

జరగరానివి జరుగుతూనే ఉన్నాయి
జరగవలనివి భిక్షువు అరచేతిలోకి
చిల్లర డబ్బువలె ఒకటొకటీ జారేను
ఇది నిందించేది కాదు, నిరసించేది కాదు

చేయరానివి చేస్తూ అంతర్మథనంలో పశ్చాత్తాపం
గతాన్ని సరిదిద్దే అవకాశం ఎక్కడుంది, లేదు

నిన్నటి దోషం నేడు మళ్ళీ తెలిసో తెలియకో
రేపు అలవాటుగ మారితేనే ప్రమాదం!

15.

గడిచే క్షణం కన్న ముందుగ అడుగువేయాలని
లో నుండి కవిత ఉత్సాహం చూపుతుంది

ముళ్ళు లేని రాళ్ళు లేని పథంలో, ఇంతకన్న
బాధకరమయిన మించిన అనుభవాలతో
నేలపై అన్నిటికీ సమతలంగా సాగే జలధునిలా
వీటి మధ్య నుండి వీలు చేసుకొని పోవలసిందే

లక్ష్యం చేరే ముందుగ గమ్యస్థానాలెన్నో
అనుభవానికి మెరుగులు తీర్చేను, తృప్తి రేఖ లద్దేను
తెలియనివి తెలుస్తూ కొత్తవి పరిచయమవుతూ
లోనుండి కవిత రూపొందుతుంది వెలుతురు శిల్పమయై

తెలుపు పయి నలుపు చుక్కలు ఒకరికి అందం
నలుపు పయి తెలుపు చుక్కలు ఒకరికి ఇష్టం

ఏదో ఒక శబ్దం వినబడుతూ ఉండాలసిందే
స్పందన వాతావరణంలో చేతన స్థాయి నిలుస్తుంది
పూల తోటలో ఉన్నా, పడవలో పయనిస్తూ ఉన్నా
విమానంలో చేరినా విరామ కాల సమానం, ఏకాంతం
నిశ్శబ్దంలో కూరుక పోయేకన్నా మనసు
జడత వీడి సృజన భూమికను వహిస్తుంది

ఇది సమాజ చలనంలో ఒకటయి గడచినట్లు కాదు
చీకటి ముఖాలు కొన్ని వెన్నెల ముఖాలు కొన్ని
ఉదయాస్తమయ ముఖాలు కొన్ని నిద్రాముఖాలు కొన్ని
ఎవరూ తప్పించుకోలేనివి; జీవన వ్యవహారాలలో

రుతువుల ప్రసక్తిలేదు, కల్పనకు చోటులేదు
బ్రతుకు తీరు ముఖ్యమై తన నుండే మంచి - చెడు

మంచు శిలల నుండి విడుదలయి నీరు
ప్రవహిస్తూ ముందుకు సాగిపోవడమే జీవితం
ఇది కాలం చూసే గమనానికి పోటీ కాదు
పాయలుగా చీలవచ్చు భూమితలంపై భాగ్య రేఖలుగా

16.

ఎప్పటికీ ఏదో సమస్య తీగెలా అల్లుకొనీ
మూలం ఎప్పటిదో పూర్తిగ తెలియదు వాస్తవం
చేతులకూ కాళ్ళకూ పడే బంధన తొలగవచ్చు
మెడకు దగ్గరయిన ఉరి దూరం జరగవచ్చు

సమస్యలు బ్రతుకులో । సమాజ విషయపరంగా
ఒకదాని నొకటి అందుకోనీ పలు విధాల పూలతో
అపుడపుడూ విడినట్లయి, అంతలో చిక్కుపడే
ప్రకృతి సమంగా బ్రతుకు తెరువులో సంక్లిష్ట సమీకరణం

ఏది అయినా కాకపోయినా, ఏది వచ్చినా రాకపోయినా
తాపంలో మేఘం అవని పయి ప్రజలకై వస్తుందనే ఆశ
అణువణువున కదలికలో కొత్త సృజన రూపం
పలికే మాటలో కవిత! కొత్త అర్థంతో హృదయం

చారలు లేని పులి వలె మనిషి! తన రూప మరచి
ఆకలిలో పావురాన్ని చంపేను
వేటలో హరిణాన్ని హింసించేను
స్వార్థం ఏ పాత్రనయినా వహింపజేస్తుంది
క్రూరత ఏ చర్యకయినా పురి కొల్పుతుంది
సంపదకయి విజయంకయి మనిషిలో పిశాచ తాండవం

ఎక్కడో ఒక మలుపులో అదృష్టం
కలసి వస్తే బంగరు ఉంగరం తొడుగుతుంది
కలసిరాక పోతే విధి వంచన అనిపిస్తుంది
చిల్లిపడిన జేబునుండి జారేవి కొన్ని మాత్రమే!

తలుపు తెరిస్తే దొంగలు పడేరని భయం
కిటికి తెరిస్తే తూటా ప్రేలేనని అనుమానం
జీవితానికి అర్థమేమిటి? ప్రశ్నకు
ఎవరి సమాధానమయినా అసంపూర్ణమే!
అనుభవంలో మార్పులు గుర్తుపట్టరానంతగా
పొత్తునుండి మొక్క దాని నుండి కొమ్మ సుమ ఫలాలతో
చెట్టు పయి పావురంలానో, పచ్చిక పయి హరిణంలానో
మైదానంలో అశ్వంలానో, కవిత ! హృదయానికి వశమై

17.

రాయి ఏడ్వదు! పర్వతం కదలదు! నది ఆగదు
ఏదో ఒక సందర్భంలో మనిషి జడత వహించేను
నిచ్చెన పయి ఆరోహణ కొంత వరకే
రెక్కల పయి ఏ విమాన రూపమో అయితే కావచ్చు

సాగుతుంది యానం కాస్త తృప్తి కరంగా
ఆశకు ఆకాశం తలుపులు తెరచే ఉంటాయి
అయినా భూమిపై ఆకర్షణ తొలగేది కాదు
సహనం ప్రేమ, స్నేహం కరుణ వీరంతో బ్రతుకులు

తీవ్ర వాదంలో దహన కాండ విలయంలో భాగం
ఇది మానవ ధర్మానికి గొడ్డలి పెట్టు
కూలే ఆదర్శ శిఖరాలను చూపిస్తుంది
అనిశ్చయ స్థితిలో రాజనీతి! వంకరలు తిరుగుతూంది

రాత్రివేళ దహన జ్వాలను ఉదయంగా తలచేరు
వెలుతురులో తన నీడ శత్రువుగా తోచేను
నిర్ణయాలు లేని మాటలతో కాలం గడచేను
ఇది కొనసాగడమంటే ఓటమికి సూచనయే

అడవులు కొండలు నదులు లోయలు దాటే కన్నా
ఆలోచనలో ఆటంకాలను దాటడం బహుకష్టం
మంచు తుపానులో టెన్టు ఎగిరిపోయినా
సెంట్రిలో సోల్జర్ నిలవాలిసే ఉంటుంది

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన స్వేచ్ఛానుభవం
ఆరవయి రేకులు విప్పారిన మహా పద్మమయినా
అభిమానం భాగ్యం సంతోషం తృప్తికి బదులు
దైన్యం హైన్యం పీడన వికార రూపంలోనే ఉంది

సమస్యలవే! తక్కెడలో కప్పల్లా రాజకీయనేతలు
సైజుకు మించిన డ్రెస్‌లో పీఠానికి అలంకారాలుగా
అధికారంలో! కర్తవ్యం కన్న సంపాదనపై మోజుతో
నీడ చాటున ఉన్న నిజాన్ని వెదకుతూ, సినిమా చూపించేరు

18.

ఎపుడో బ్రతుకులో జరిగిపోయిన అనుభవ శకలాలు
అపుడపుడూ అనుకోకుండా ఫిల్మ్ ముక్కలవలె
కదలుతాయి మనసులో ఆలోచనకు గురిచేస్తాయి
మంచి చెడు పోస్ట్ మార్టమ్ జరుగుతుంది ఆసక్తిగా

ఒక సమయం మంటల డ్రెస్‌లో
ఒక సమయం మంచు తెరలలో
వెలుతురు చీకటి దుస్తులలో రోజూ
ఏదో రంగులో నిజరూపం తెలియకుండా

ద్వేషం క్రౌర్యం రెక్కలపై స్వార్థ విహంగం
గన్ గురి నుండి తప్పుకుంటూ ఎగురుతుంది
ఏదో జరిగేనని భయంతో కొందరు
ఏదో ఒరిగేనని ఆశతో కొందరు

జనతతిలో దొంగలు! హంతకులు ! నేరస్తులు
ఎవరు గుర్తు పట్టగలరు? అందరి వాలకాలోకే విధం!
తాపంలో ప్రాణి ఎదురు చూస్తుంది మేఘంపై
అది వచ్చినా రాకపోయినా కురిసినా కురవకపోయినా
కాలం ఆగదు! భూ భ్రమణం నిలవదు
జనం తరలిపోయేరు ! అనువయిన చోటికి !

తన కష్టంతో కడుపు నిండడం
తన ఇష్టంగా బ్రతుకు గడవడం
ఈ రెండు రెక్కలపయి శ్రామికగణం
ఎక్కడి కయినా వెళ్ళేందుకు సిద్ధంగా

జీవితంలో కొత్త మనిషితో పరిచయం
బుక్ షెల్ఫ్‌లో కొత్త పుస్తకం చేరే విధంగా

మనిషితో మనిషి మాటలాడడడం
చెట్టుతోనో నింగితోనో మాటలాడినట్లుకాదు
మాటకు బదులు మాట వెడలుతుంది
చేతకు తనకొక అవకాశం దొరకుతుంది

19.

వర్తమాన లిప్త నుండి కవిత బయలుదేరుతుంది
నా తరపున లో నుండి అన్నిటినీ చుట్టబెడుతుంది
కవిత ఆగిన క్షణం నుండి బ్రతుకుతెరువు మొదలవుతుంది

గతంలో స్మృతులు బొమ్మల కొలువులా భద్రంగా
సారభూతమయిన అనుభవ జీవన సంస్కృతి బింబాలు।
ఎపుడు మనసులో తేలేదే సాగేదీ తెలియని పడవలు

గతం మనిషికి భూమికలో భద్రత నిస్తుంది
వర్తమాన తలం స్థిరతను చేకూరుస్తుంది
జరిగే కథకు భవిత గమన సూచి అవుతుంది
మూడు కాలాల ప్రభావ మేళనంతో జీవితం

కనిపించని దానిని గురించి ఆలోచన సహజం
ఇది శిలవలె ఎచటనో పడి ఉందని అనుకోవచ్చు
ఎండకు పగిలిన శిలల సందు నుండి
జల బిందువుచే మొలక నవ్వు కనిపించేను

సాధ్యం కాని దేమి ఉంది? సృజన భవంలో
ఊహకందని దేమి ఉంది? కవిత నవంలో
రూపం పై కోరికతో నమ్మకంలో హృదికే
వసంతం కనిపిస్తుంది। జీవితం కుసుమిస్తుంది

కాల చక్రంలో యథాస్థితి బహుకాలం నిలవదు
మార్పుకు కారణాలు వెనకనుండి పనిచేసేను
జలధిలో అలల క్షోభలా బ్రతుకులో ఘటనల బాధలు
ఏ మార్పుకయిన, సిద్ధంగా ఉంటుంది మనోరూపం

కవితకు గోడలు లేవు కప్పులేదు, అంతాబయలే
ఆకాశం వలె స్వేచ్ఛకు విశాలమయిన అవకాశంతో,
పగలు రాత్రి వెలుగు నీడలతో పాటుగ
కోర్కెలు! అవరోధం గమ్యం మెట్లపై ఆశ తృప్తి !
మనసువెలిగే లిప్త నుండి కవిత బయలుదేరుతుంది
కవిత ఆగిన క్షణం నుండి బ్రతుకు తెరువు సాగుతుంది

20.

ఆత్మాహుతి చర్యతో బాంబు దాడిలో
వాహనాలలో వెళ్ళే సైనిక బృందాలు,
పిడుగుపాటు శబ్దంతో తునాతనకలయి
పెనుగాలికి మేఘంలా చెల్లా చెదరయ్యేను
వెలుగులేని మనిషిలో మనసు
క్రూర ప్రాణి నిలయమయిన గుహయే

పొడవునా పరచిన మంటల దండలవలె సరిహద్దులు
ద్వేషం చిమ్ముతూ అగ్నులు చల్లుతూ పోటీ పడే దేశాలు !

తనదే పై చేయి కావాలని ఒకరిపై ఒకరు
వ్యూహ రచనలో విలువ లేని పావులుగా వీరుల మరణం,
మతాల విభేదాల వైషమ్యం ఎప్పటిదో ఇప్పటికీ
ప్రజాస్వామ్యంలోనూ నమ్మకాన్ని పట్టుకొని వేలాడేరు
కరుణ స్రవించవచ్చ, ప్రేమ పూలు పూయవచ్చు

వైర్ తెగిన టెన్నిస్ బ్యాట్‌తో కోర్టులోకి ప్రవేశించి
ఓటమి తప్పదని తెలిసీ, సానుభూతి పొందాలని ఒకరు
తీగె తెగిన వయోలిన్‌తో వేదిక నలంకరించి
వినిపించే స్వర శకలాలకు ప్రజలు గంతులు వేసేరు

నాలుగు దారులు కలిసిన చోట నిలిచి
ఏ దారిన వెళ్ళాలో నిశ్చయం లేని మనుషులు
ఒంటరిగా జట్టుగా వలయాకారంలో పరుగత్తేరు
విజేతగా నిలిచే ఆశతో ఒకరి కన్నా ఒకరు!

ఇది పరుగు పందెం కాదు,
మ్యూజికల్ చైర్ ఆటకాదు

గతం గురించి కలలు కంటూ కూర్చుంటే
వర్తమానం తన వశమయి ఉపయోగపడేనా?
భవిష్యత్తు తలుపులు తెరుచుకునేనా?
వర్తమానం! ఎవరి చేతిలో ఆటవస్తువు కాదు
స్వేచ్ఛలో ఉన్మత్తుని చేతిలో ఆయుధం
బడిలో పిల్లలపై సభలో ప్రేక్షకులపై గురి పెడుతూంది

21.

మధ్యాహ్నం దాటిన కర్మసాక్షి వెలుగులో
చలి నుండి ముక్తమయ్యే వెచ్చని వాతావరణంలో
అనుమానం లేని సందేహం లేని మనో బలంతో
బస్‌లలో తరలే రిజర్వు ఫోర్స్ సైనిక దళాలపై
ప్రేలిన మానవ బాంబు! భయద శబ్ద తరంగాలతో
సచేతన లిప్తల్ని జడమయం చేస్తూంది

సమాప్తి లేని విద్రోహ చర్యల్ని, పూర్తిగా
తుడిచేసే సంకల్పం వెనక బడిందా?
ఇపుడున్న స్థితిలో అధికారం ప్రధానమయిన
రాజకీయ చతురతలో నిపుణత తరిగిందా?

సైనిక బృందం కదలికతో పొందే చేతన
నిదురించే మంచు శిలల్ని మేల్కొల్పే మాట నిజం।
ప్రజాస్వామ్య వేదిక పయి ప్రతి పౌరునికీ స్వేచ్ఛ
సైనిక గణం మాత్రం! నియతమైన స్వేచ్ఛలో

హింసను చిమ్ముతూ అనూహ్యంగా ఎదురుపడే
సాయుధ విద్రోహాల్ని మట్టు బెట్టవలసిందే
ఎపుడో అలముకొన్న మగత నిద్ర
ఇప్పటికీ వదలని జాడలు లేకపోలేదు
బరువు బాధ్యతలతో కదలే వీరుల పట్ల
ఎవరయినా! ఆదర భావంతో మెలగాలిసిందే

హేయమయిన కిరాత చర్యకు నిరసనగా
ఈ దేశం పౌరుల మదిలో రణ స్వరం మ్రోగుతూంది
చల్లని ప్రాంతంలో శత్రు క్రియాకలాపాలు
మంచు కరిగిన నీరుకు రుధిరాకృతి నిస్తూంది
ఒకరిద్దరు ముగ్గురు సూత్రధారుల విషాదచర్య
పదులుగ అమరుల్ని లెక్కపెట్ట చేస్తూంది
శిథిలాలలో కొన ఊపిరితో మనిషి జాడ
పాలకులకు తమ కర్తవ్యాన్ని హెచ్చరిస్తూంది
ఈ బాధ ఎవరికో ముడిపెట్టేదికాదు,
అందరిలో మానవతను మేల్కొల్పేదీ!

22.

కాలం మాట్లాడుతుంది మనుషుల హృదయాలతో
ఎవరికి వారు తమకు ఆప్తంగా తలచేరు
కాలంలో మార్పును బట్టి! వెలుతురులో నీడ !
మనిషికి తోడుగ నియతంగా వర్తించే రూపం!

గెలుపు ఓటములలో మంచి చెడు హద్దులు
తెలిసేదాక! అంతరంగ ప్రకాశ కిరణంతోనే
కాలగతిని బట్టి మౌన పాత్రలో
కిందికి దిగిన నీలిమబ్బులా! నీడ

తప్పనిదీ, ఎవరినీ వదలనిదీ
కదలినంత మేర! తాను కదలేదీ
చీకటి ప్రతినిధిలా నిలవచ్చు
భయమనిపించని ఆకర్షణతో

లోని నిజరూపం! మరుగున పడవచ్చు
ఇది నిహతం కాదు! గాయపడవచ్చు
మనిషి దృష్టి పడక పోవచ్చు
అవసర మనిపించకపోవచ్చు.

ఆర్తిలో వాడి పోవచ్చు, అగ్ని తప్తం కావచ్చు
పొగలు కమ్మవచ్చు రంగు మారవచ్చు

లోని వెలుగు కంటికి కనిపించదు
కవితలో అనుభవ సుందరమై కనిపించేను

ప్రతి రాయి రత్నం కాలేదు
ప్రతి క్షణం దీపం అవలేదు
ప్రతి ఊహ జలదం కాలేదు
మనిషిలో ఆశలు ! ఎన్ని విధాలో

కవి మాట్లాడని వస్తువు లేదు
నింగి నేల మబ్బు చెట్టు ప్రాణి
కవితలో మనిషి విశ్వసూత్ర బంధంతో
అంతవరకు తెలియని కొత్త ప్రపంచం హఠాత్తుగా!

23.

బయట శిథిల దృశ్యాల నుండి వేదనలో
అడుగు ముందుకు సాగవలసిందే
ఒకొక్క స్థితి వెనక వాస్తవం జటిలమై
బయట పడని రహస్య తంత్రాలెన్నో

స్వేచ్ఛా దిశలో స్వతంత్రమైన మనిషి
సమాజ శక్తులతో బంధనలో మితమయ్యేను
కథలలో మానవ మనస్తత్వ మూలాలొకటే
స్థితులు వేరు గతులు వేరు గమ్యాలు వేరు!

తాపంలో ఎక్కడయిన నీడ దొరికితే చాలుననీ
చీకటి శకలమయినా హ్లాదమయం కావాలనీ
ఇష్టమయిన పనిలో చెడు సమయం అంటూ లేదు
ప్రవహించే సమాజం ఒక సుందర వాస్తవం

గట్టును మీరే ఉత్సాహంలో తరంగాలు
వరదలుగా మారి కష్టాలకు నిలయం కావచ్చు
ఎంతటి అవరోధంలోను క్రియాశక్తి ఆగదు
కొండను చుట్టే నదిలా పైకెగిరే పక్షి లాగ!
ఆగని జీవన శక్తిని ప్రకటిస్తుంది.

ఎగసే ఎండల సెగలను భరిస్తూ
కురిసే బాష్ప ధారలను సహిస్తూ
వీచే చలి గాలిని తట్టుకుంటూ
వర్తమాన ప్రవాహమై కవిత! నిరాఘాటంగా

చిరిత్రకు మరో వైపు సంస్కృతి బింబం
పయనంలో పట్టాలవలె రైలుకుపరించేను
పక్షి విహరణంలో రెండు రెక్కలవలె
అనిశ్చయం అనుమానం అస్థిరతల నెదుర్కొనేను.

క్లిష్టమయిన మలుపులలో జీవితం
వర్తమాన దశలో అనుకోని దృశ్యరూప మిస్తుంది.

24.

ప్లస్ మైనస్ ఒకటి తరువాత మరొకటి
అడుగు వేయడం అడుగు తీయడంతో
ఆరోహణలో మెట్ల వలె సమయ సమయం
చేరక తప్పనివీ ఆపై వీడక తప్పనివీ

దీనికి చివరి మెట్టు అంటూ లేదు
ఆయువు అంతంలో చివరది కావచ్చు!
శిఖరమొకటే, చేరే దారులనేకం
విజయం లక్ష్యంగా, తగింది ఎన్నుకోవడమే!

ఒకదాని తరువాత మరొకటి ఆశలు
దారిలో కొత్త కొత్త పాత్రలలో కనిపించేను
పెట్టెలో వస్తువుల వలె పాత స్మృతులు
ఎపుడేది అవసరమో! అది బయటికి వస్తుంది

వాస్తవంలో శిలలు కలలో శిల్పాలుగ మారి
వివిధ నృత్య భంగిమల్లో మనః ప్రియంగా
నేల నుండి నింగిలోకి ఆలోచన పెరుగుతుంది
అనుభవ రమణీయాలయి శూన్యాన్ని నింపుతాయి

సాధారణ జీవన ప్రవాహ తీరాలలో
ఇవి మానసిక దృశ్యాలను చూపుతాయి
చేతనతోపాటు జడత పట్ల సమభావన
మనిషిలో స్పందనతో సృజన కళను పొందేను

ఉగ్ర వాద రూపం నాశనకర పదం వదలి
జీవన ధుని కిరు వైపుల నవ వనిగా మారేనా?
చెట్ల నుండి రాలే పూలు పండ్లు బదులుగ
బయట నుండి తూటాలు బాంబులు ! పడేను!

తెర అయినా దడి అయినా గోడ అయినా
చాటుతో పాటుగ భద్రత రక్షణ ధ్యేయంగా
మెత్తని దళసరి కఠినత ప్రకృతులెన్నో!
మనిషిలో జాగ్రతలకు సూచనలయి నిలిచేను.

25.

వెన్నెల కొండ తల నిమురుతుంది
నది హృదయం పులకితం చేస్తుంది

చందమామ! క్రిందికి దిగేనా?
దీనిని పోలిన పెరుగన్నం
మాటలలో గొంతులో జారుతుంది
తల్లికి తృప్తి! శిశువు ఆనందం

నిదురించే నింగి కనే కలలెన్నో
రవి చంద్రులు చుక్కలు మబ్బులు
మెలకువలో మనిషి కనే కలలెన్నో
గతం భవిత వర్తమానం సంపుటిలో

చెట్టుకు ఆకులెన్నో! మనిషికి స్పృహలన్ని
తోటలో పూవులెన్ని విధాలో అన్ని అనుభవాలు
అన్నీ తనవే కావాలనుకోవడంలో సమస్య
దీని జవాబు "సర్వేజనాః సుఖినోభవన్తు" ఒకటే

సమాజ చలనంలో జీవన గుణ సంపద
కాలానికి సుందర యశో విజయమిస్తుంది.

దివిలో కాస్త చోటు కోసం పేరాశ
భూమిపై పొందే వాటితో తృప్తి లేక
కొత్త అనుభవంలోకి బ్రతుకు చేరాలని
పంజరం నుండి ముక్తమై చెరసాల చేరేనా?

కవి బుజాలపై చీకటి! స్వేచ్ఛగా ఉండాలని
కవి తలపై జ్వాల! కిరీటమై నిలవాలని

ఊహలు నడచిన అడుగు జాడల్లా చుక్కలు
గాలికి రెపరెపలాడే ఆకుల్లా జ్ఞాపకాలు
ప్రవాహ వాహనంలో కదలే జీవితంలో
అంతరంగం మాత్రం విహగం కాదు ప్రకాశ బింబం,

గాలికి సుతారంగా ఊగే పుష్పం కాదు జీవితం
వరదలు తుపాను అడవులు ఎడారులు దాటక తప్పనిదీ
తోటకు వెళ్ళి దోసిలిలో గులాబి పూలు బదులుగ
ముళ్ళు నింపుకొని ఎవరి కోసం తెచ్చేరు? శత్రువుకా? దైవానికా?

26.

జీవన పథంలో ఉగ్రవాద బీభత్స ప్రవేశంతో
కాలం! చూచేను సానుభూతి కరుణ ప్రేమ శాంతికయి
కాలం చేతులలో ఆడబడే బంతులవలె
గాలిలో ఎగసి పడేను అగ్ని కణికలు!

అగ్నికి భయపడి మంచు కమ్మిన చెట్టులా
మౌనం వహించి మనిషి పడి ఉండలేడు
రవి కిరణంతో మనిషిలో చేతన మేల్కొని
జీవితాన్ని ఉత్తేజ పరచేననే నమ్మకం!

వత్తి తాను వెలుగుతుంది
తన వెలుగును దాచుకోదు
చీకటిలో దారి చూపుతుంది.
మిత్ర శత్రు భేద మసలులేదు.

దూరం నుండి ప్రసన్నంగా కనిపించే చంద్రుడు
ఆకాశం చుక్కలు ! రాత్రులు ప్రేయోరూపాలు
తాము కిందికి దిగలేవు, మనిషి పైకి పోలేడు
దూరం నుండే ! చూపుకు ప్రీతిపాత్రమవుతాయి.

హిను శిఖరంపై చుట్టిన రవి జ్వాలా వలయం
శిరసు నలంకరించే పాగాలా, వెలుగుతూ
"నిజం" దాచబడుతుంది
కల్పన బయటికి వస్తుంది.

వాస్తవం కల్పనల మధ్య మనుష్యుల జీవితాలు
ఎప్పటికీ ప్లస్ మైనస్ అంచనాలలో విలువలతో

అనలాన్ని మింగి జలదాన్ని వదలే
గారడి ప్రదర్శనం కాదు జీవితం
పిడికిలి విప్పి పావురాన్ని గాలిలో
వదలే! మ్యాజిక్ కాదు 'శాంతి'
శరీరానికి ఆశ్రయం! వాస్తవ నివాసం
హృదయానికి ఆకర్షణ! సృజనలో కవిత!

27.

ఒక తేదీ వస్తుంది అనుకోకుండా ఆరోజు దుర్దినం
ఉదగ్ర చక్రంలో విపరీత చర్యతో బీభత్సదృశ్యం
పట్ట పగలు భీకర శబ్దంతో హఠాత్తుగా సంచలనం
ఎక్కడి దక్కడ భగ్నమయిన వాహనాలు ముక్కలయిన దేహాలు

మంటలతో పొగలతో గాలి విలవిలాడుతూంది
సైనిక చరిత్రను నెత్తురు మరకలతో అలంకరిస్తూంది

పుల్‌వామా హైరోడ్‌పై కాశ్మీరు గాథలో
పూలకు బదులుగ నేలపయి శరీరాల శకలాలు
ఆత్మాహుతిలో మానవ బాంబు విస్ఫోటం
ఘోరమయిన విషాద దృశ్యాన్ని దింపుతూంది

నియతమయిన స్వేచ్ఛలో సైనిక వీర గణం
కళ్ళముందు జరిగిన బీభత్స కాండలో
ఉగ్రవాద తంత్రానికి ఆహుతి అవడం!
ఇది సమరం కాదు, దొంగచాటు పోటు

కళ్ళముందు క్షణంలో దహన వేదిక! సిద్ధంగా
పేదరికం అవిద్య అమాయకం ఆటవికం కలిసిన ప్రాంతం
యోజనలో వికాస స్వప్నం। దగ్ధమయి బూది ఎగురుతూంది

వర్తమానం పగిలిన అద్దం ముక్కల వలె కొసలు దేరి
వేయబోయే అడుగుల్ని భయంలో ముంచేస్తూంది
ఘోర విపదకు కారణం ఒక దుర్మతి ప్రకటనలో ఛాలెంజ్

నిఘా లోపం కావచ్చు ఏమరు పాటు కావచ్చు
తీవ్రవాద శిఖరాలపయి అంచనా తప్పవచ్చు
ధీమా కావచ్చు! జరగ రానిది జరిగిపోయింది
ఇంత పెద్ద సంఖ్యకు బలివితర్డి కావడం దారుణం

చెనక రాని పగలు వెలుగు! అదృశ్యమయి
చీకటి జడలు విప్పారేను విషాద స్థలంలో
దారుణ మారణ విస్ఫోట వికార చర్యపై
సహనం క్షమ శాంతం, రాజనీతి కొంతవరకే

ప్రజాస్వామ్య భావన జీవన సంస్కృతికి దార్శనికం
సర్వజనుల సహభావన సమగ్రతకు ప్రేరణం
విద్వేషానికి వైషమ్యానికి చోటులేదు
హేతు రహితమైన హింసకు ఏ హక్కు లేదు

మతంలోని వికాస చేతనకు భిన్నంగా
మనిషిలోని క్రూరతకు పరాకాష్ఠ చిహ్నంగా
ఇది సమరం కాదు కొండచాటు ఉన్మాదం
ఎప్పటికీ పలాయన గుహలలోనే రహస్య నివాసం

ఎవరి దేశం వారికి ప్రియం
ఎవరి పతాక వారికి ఇష్టం
ఎవరి హృదయం వారికి సాక్ష్యం
అందరికీ చెందింది, మానవం

క్రౌర్యంలో హింస! లోయ లోకి విసరుతూంది
నెత్తురు చుక్కలతో దారి అపాయాన్ని సూచిస్తూంది

స్వచ్ఛమయిన హిమధార కలుషితమవుతూంది
శభ్రమయిన గాలి ధూమ మయమవుతూంది

రాజ్యం కర్తవ్యం అగ్ని శిఖలనార్పడమేనా? కాదు
పొంచి పైకి దూక నున్న చీకటి ముఖాన్ని పసిగట్టి
ఆలోచనలో విశ్వమయంగా! నేలపైన చూపులు విప్పారి
బ్రతుకులో వెలుగు దారి తెరవడమొక అవసరం
తీర్చరాని పూడ్చరాని ఓటమి అఖాతాన్ని
ఎవరు దాటగలరు? ఎవరు నింపగలరు?

ఉగ్రవాద ప్రభావం! స్థల కాలాలకు మితం కాదు
దుశ్చర్యకు అవకాశం దొరికితే చాలు, బూడిదే !

ఇది ఒక దేశానికి సమూహానికి శోక పరీతం కాదు
ఈ సమయం విజయానికి ప్రజాస్వామ్య చేతనతో
భవితకు స్వర్ణద్వారం నిజ వీరంతో
క్షిపణి రూపమెత్తుతూంది, కర్తవ్యంలో కవిత

మాదిరాజు రంగారావు కృతులు - 1953-2025

A) స్వేచ్ఛా కవిత్వం

❖ I.స్వేచ్ఛా కవిత్వం - మొదటి సంపుటం రచనా కాలం 1953 - 2002

i. స్వేచ్ఛా నవం : 1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం 3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం 5. యుగ సంకేతం **ii. 6. ఆవాహనం iii. 7. ముక్తకాలు. iv. సమయ దర్పణం :** 8. నాలో ప్రవహిస్తోంది నది 9. నాకు జ్ఞాపకముంది **v. 10. కిర్మీరం** 11.మనోభూమికలు **vi. వర్తమానం స్క్రీన్ పై :** 12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై 15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం 18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై **vii. 20. అగ్ని నుండి ఆనందానికి viii. ఈ శతాబ్ది రెక్కలపై** 21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం 23. డైరి దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం **ix. అగ్నిపిథం** 26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య **x. 29. కిరణ పథం** 30. స్వేచ్ఛకు సిగ్నెల్

❖II. స్వేచ్ఛా కవిత్వం - రెండో సంపుటం రచనా కాలం 2003 - 2012

31. అభిషేకం 32. ఆగమనం 33. ఎప్పటికీ కొత్తే 34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం 37. సమకాలీనం 38. అభినవ యానం 39. ఆత్మ బంధం 40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. సవారంభం 43. గిఫ్ట్ ప్యాకెట్ 44. నవ దర్శనం 45. పునర్దర్శనం 46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి 49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం 52. అద్దంలో ప్రజాస్వామ్యం 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం

❖III.స్వేచ్ఛా కవిత్వం - మూడో సంపుటం రచనా కాలం 2013-2015

54. ఖడ్గం కన్నీరు కార్చదు 55. చార్ ధామ్ 56. ఆల్ ఇన్ వన్ 57. ఉద్యమ పథం 58. అడవిలో ఆయుధం 59. చెదరిన ప్రజాస్వామ్యం 60. గాయ పడిన ప్రజాస్వామ్యం 61.ఈనాటి నిజం 62. ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం 63. సంస్కృతి & హృదయం నుండి 64. తెలంగాణ స్వరం, ఆత్మబంధం

❖IV. స్వేచ్ఛా కవిత్వం - నాలుగో సంపుటం రచనా కాలం 2015 నుండి 2018

65. వర్తమాన స్వనం 66. లైన్ క్లియర్, 67. వర్తమాన వాస్తవం 68. వర్తమాన లహరి 69. వర్తమాన యానం 70. వర్తమాన సంకేతం 71. ఇదే దారి 72. నవ మానవం 73. ప్రపంచీయం 74. హృది కిటికి నుండి 75. కార్నర్ కవితలు

❖V. స్వేచ్ఛా కవిత్వం - ఐదో సంపుటం రచనా కాలం 2017 నుండి 2019

ఇది జీవితం : 76. ప్రశ్నలతో ఇప్పటికీ 77. బ్రతుకులో కవితయై 78. గమ్యంపై గురితో 79. అస్మితలు, అస్తితలు 80. వాస్తవ చక్రంపై 81. ఎవరి దారి వారిది 82. అశాంతి పరిచయం 83. కవిత నా ఆత్మ 84. కాలం కప్పులో 85. నిప్పు రెక్కలపై 86. సమాప్తి కాదు 87. కాలానికి కృతజ్ఞతలు 88. సమయ పథం 89. ఇది అందరిదీ 90. సమాంతరం 91. ప్రాణం కన్న మిన్న 92.

వర్తమానం ఆనవాలు 93. నీడ నుండి వెలుగులోకి 94. అక్షర ముకురం 95. జీవితం స్వతంత్రం 96. కాలంతో నేను 97. కర్తవ్యంలో కవిత

❖VI. స్వేచ్ఛా కవిత్వం – ఆరో సంపుటం రచనా కాలం 2019 నుండి 2020

98. ఏది కవిత 99. వర్తమానం ముందుకే 100. మార్పుకు సిగ్నల్ 101 కవిత ప్రభుతతో 102 హృదయ దర్పణం 103. నేను నేనే 104. స్వేచ్ఛలో స్వతంత్రం 105. భవితకు సంకేతం 106. అక్షరంలో స్వేచ్ఛ – సమాజ యానం 107. స్వేచ్ఛలో బంధనం 108. కాక్‌టెయిల్

❖VII. స్వేచ్ఛా కవిత్వం – ఏడో సంపుటం రచనా కాలం 2020 నుండి 2022

109. రేపటికి రిజర్వులో 110. అక్షతం 111. లాక్‌డౌన్ 112. వర్తమానం మెట్లమీంచి 113 అజేయం 114 ఈ వారం కవిత 115. గుడ్ బై 116. అక్షర హృదయం 117. గాయ పడిన శాంతి 118. వార్తలో కవిత 119. నిప్పులపై మేఘం 120. తెలియని వాస్తవం

❖VIII. స్వేచ్ఛా కవిత్వం – ఎనిమిదో సంపుటం రచనా కాలం 2022 నుండి 2023

121. మార్నింగ్ వాక్ 122. విప్లవ ప్లవనం, స్వేచ్ఛలో మనోజ్ఞం 123. అదృష్టం 124. మేల్కొన్న కవిత 125. ఆగని పయనం 126. కవిత్వమొక థెరపి, తెలంగాణ స్వరం

❖IX. స్వేచ్ఛా కవిత్వం – తొమ్మిదో సంపుటం రచనా కాలం 2023

127. హృది నుండి హృదికి 128. రౌండ్ టేబుల్ 129. మానస తంత్రులపై 130. సరికొత్తగ 131. ఆశానవం 132. మౌనం మాట్లాడుతుంది 133.శిల నుండి రసాకృతి 134. అశాంతి చక్రంపై 135. మేనిఫెస్టో

❖ X. స్వేచ్ఛా కవిత్వం – పదో సంపుటం రచనా కాలం 2024

136. కవిత సర్వ స్వతంత్రం 137. ఇది మలి తెలంగాణ 138. నిజయానం – (బొన్సాయ్ అనంతం) 139. స్వేచ్ఛామేఘం, మెరపులు తలపులు 140 స్వేచ్ఛా పవనం

❖ XI. స్వేచ్ఛా కవిత్వం – పదకొండో సంపుటం రచనా కాలం 2025

141. జీవన దర్శనం 142. అద్దంలో అనల చిత్రం 143. ముక్తకాలు 144. ఆశాబద్ధం

B) పరిశోధన – సమాలోచనం

1. కవిత్రయం సృజనకళ (సిద్ధాంత గ్రంథం) 2. నవల స్వరూపం 3. పరిశోధనా స్వరూపం 4. అధికార భాష 5. అనువాద కళ 6. దాశరథి కవితా సమాలోచనం 7. ఆలోకనం 8. సమదర్శనం 9. సృజన రూపం–మానవీయ భావన 10. సృజన చేతన–భావ రూపాలు 11. Facets of to Free-verse 12. శ్రీశ్రీ మహా ప్రస్థానం–సమాలోచనం 13. రామాయణ కల్పవృక్షం–సృజన చేతన 14. స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య దర్శనం 15. స్వేచ్ఛా కవిత్వం – మానవీయ దర్శనం 16. స్వేచ్ఛా కవిత్వం–సహృదయ స్పందనం 17. గురజాడ ఆధునిక చేతన (2013) 18. కవితా సమాలోచనం–2017 19. కవితల సమాలోచనం 2019 20. సాహిత్య విమర్శ వ్యాసాలు

సంక్షిప్త పరిచయం

మాదిరాజు రంగారావు గారి జననం జూన్ 8, 1935న పండితాపురం గ్రామం, ఖమ్మం, తెలంగాణ రాష్ట్రం. మాదిరాజు రంగారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి నిజాం కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ (O.U), హైదరాబాద్, తెలంగాణలో చేరారు. మాదిరాజు రంగారావు తెలుగు మరియు సంస్కృత సాహిత్యంలో M.A. సంస్కృతం 1960 (O.U), M.A. తెలుగు 1962 (O.U), Ph.D. తెలుగు 1966 (O.U) మరియు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి, UGC) యొక్క పరిశోధనా పండితులు.

డాక్టర్ మాదిరాజు రంగారావు ఆంధ్ర మహాభారతం మరియు ఆంధ్ర మహాభాగవతం యొక్క విమర్శనాత్మక సంచికా సంపాదక మండలిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టర్ రావుకు మొదటి విద్యా సంబంధ నియామకం లభించింది. ఆ తరువాత తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా మరియు డీన్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆచార్య రావు యు.జి.సిచే మంజూరు చేయబడిన రెండు ప్రధాన పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంట్‌లకు మరియు భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ, న్యూఢిల్లీచే స్పాన్సర్ చేయబడిన ఒక పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంటుకు ప్రధాన పరిశోధకులుగా ఉన్నారు. ఆచార్య రావు 'రసధుని సాహితీ పరిషత్తు' అనే సాహిత్య సంస్థకు వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులుగా ఉన్నారు. ప్రముఖ కవి, రచయిత మరియు సాహిత్య విమర్శకులైన ఆచార్య మాదిరాజు రంగారావు, సాంప్రదాయ సాహిత్యం, ఆధునిక కవిత్వం మరియు విమర్శతో సహా తెలుగు సాహిత్యం యొక్క వివిధ ప్రక్రియలకు విస్తృతంగా సేవలనందించారు. మాదిరాజు రంగారావు గారు తమ స్వేచ్ఛా కవిత్వం మరియు సాహిత్య విమర్శ రచనల ద్వారా సమకాలీన ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ప్రముఖ పత్రికలైన భారతి, స్వతంత్ర, ప్రవంతి, జయంతి, ఆకాశిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మరియు ఆంధ్రభూమి వంటివి, మాదిరాజు రంగారావు గారి సృజనాత్మక రచనలను క్రమం తప్పకుండా ప్రచురించాయి.

ఆచార్య మాదిరాజు రంగారావు కవిత్వానికి మూల స్తంభం మానవతా ఆదర్శాలు మరియు శాంతికి ప్రతీకగా నిలిచే ప్రజాస్వామ్య దృక్పథం. ఇదే వారి స్వేచ్ఛా కవిత్వానికి ఆయువు పట్టు. మాదిరాజు రంగారావు గారు స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియలో సాగించిన ప్రస్థానం వారి విశిష్ట వ్యక్తిత్వం, సామాజిక స్పృహ, మానవతా భావాలు, ప్రజాస్వామ్య సామ్యవాద సామరస్య దృక్పథం మరియు శాంతి సందేశం ద్వారా సుసంపన్నమైంది. మాదిరాజు రంగారావు గారి 'పరిశోధన మరియు సాహిత్య విమర్శ' రచనలు సాంప్రదాయ సాహిత్యం, సాహిత్య ఇతివృత్తాలు, భావజాలాలు, మానవ అంశాలు మరియు సార్వత్రిక దృక్పథం యొక్క సృజనాత్మక మరియు కళాత్మక విశ్లేషణపై దృష్టి పెడతాయి.తన సుదీర్ఘమైన మరియు అత్యంత ఫలవంతమైన సాహిత్య జీవితంలో, ఆచార్య మాదిరాజు రంగారావు యొక్క సృజనాత్మక రచనలు జూన్ 21, 2025న వారు కాలధర్మం చెందిన నాటికి 'స్వేచ్ఛా కవిత్వం' పై 150కి పైగా, సాహిత్య విమర్శపై 20కి పైగా, మొత్తం సుమారు 170 పుస్తకాలుగా వెలువడ్డాయి.

BRIEF SKETCH

Madiraju Ranga Rao was born on June 8, 1935, in Pandithaapuram village, Khammam, Telangana. Madiraju Ranga Rao completed High School Education from Govt. High School, Khammam and joined Nizam's College Osmania University (O.U), Hyderabad, Telangana. Madiraju Ranga Rao was a student of Telugu and Sanskrit literature, obtained M.A. Sanskrit 1960 (O.U), M.A. Telugu 1962 (O.U), Ph.D. Telugu 1966 (O.U) degrees and was a research scholar of the University Grants Commission (UGC).

Dr. Madiraju Ranga Rao was a member of the Editorial Board for the critical editions of Andhra MahaBharatham and Andhra MahaBhagavatham. Dr. Rao's first academic appointment in 1964 was with the Department of Telugu, O.U, Hyderabad, then a long tenure at Kakatiya University, Warangal, Telangana as Professor, Chair Board of Studies, and Dean for Faculty of Arts followed. Prof. Rao was the Principal Investigator on two major research project grants awarded by UGCand one research project grant sponsored by the Department of Human Resources, Govt of India, New Delhi. Prof. Rao was the Founder and President of 'Rasadhuni Sahithi Parishath' literary organization.

Prof. Madiraju Ranga Rao, an acclaimed poet, writer and a literary critic, contributed extensively to various literary genres of Telugu literature including classical literature, modern poetry, and criticism. Prof. Rao established his niche in contemporary modern Telugu literature through his literary works in 'Free Verse'(Swecchaa Kavithvamu) and Literary Criticism. Popular journals published his creative writings on a regular basis and this list includes Bharathi, Swathanthra, Sravanthi, Jayanthi, Akashik, AndhraPathrika, AndhraPrabha, AndhraJyothi, AndhraBhoomi and several others.

Central to Prof. Madiraju Ranga Rao's poetic purpose was humanistic ideals and a democratic ideology that symbolized peace. This was the very essence of his 'free verse' poetry. Prof. Madiraju Ranga Rao's journey in the genre of 'free verse' poetry is enriched by his unique personal spirit, social consciousness, humanitarian feelings, a democratic ideology, and a message of harmony. A substantial number of Prof. Rao's contemporary modern 'free verse'poetic works are based on his creative mindset pertinent to historical development, existing situations, social realism, element of reason and reform, humanistic sentiment with a sign of peace and harmony. Prof. Rao's 'literary criticism' works focus on creative and artistic analysis of classical literature, literary ideologies, human elements, and universal outlook. During his long and highly productive literary career, Prof. Madiraju Ranga Rao's creative writings culminated in more than150 books on 'free verse' poetry and over 20 books on 'literary criticism' – a total of about 170 books – published until his departure on June 21, 2025.

9 789356 552968